# వంద వసంతాల

# వై.సి.వి






**2018 వై.సి.వి. రెడ్డి సమగ్ర సాహిత్యం ఆవిష్కరణ సభ...**

**కూర్చున్నవారు:** జి. రామకృష్ణ, యన్.సి. రామసుబ్బారెడ్డి, లింగమూర్తి, వెంకటేశ్వర్లు (రిమ్స్ ప్రిన్స్‌పాల్), అర్జుల రామచంద్రారెడ్డి (వి.సి. వైవియు), సుబ్బరాయ కవి, మూల మల్లికార్జున రెడ్డి

**నిల్చున్నవారు:** కేతు విశ్వనాథ రెడ్డి, సుప్రజ, పద్మావతి, పురుషోత్తమ రెడ్డి, ప్రభాకర రెడ్డి, ఉమామహేశ్వరి, దినకర్ రెడ్డి

# వంద వసంతాల వై.సి.వి.

వై.సి.వి. రెడ్డి శతజయంతి ప్రత్యేక సంచిక

# వంద వసంతాల వై.సి.వి.

**వై.సి.వి. రెడ్డి శతజయంతి ప్రత్యేక సంచిక**

**ప్రథమ ముద్రణ : 2025**

**ప్రతులు : 500**

**వెల : అమూల్యం**

**ప్రతులకు :**

**వై. ప్రభాకర రెడ్డి**

హెచ్.ఐ.జి. 222,

సింగపూర్ టౌన్‌షిప్, కడప.

సెల్ : 89855 45605

ముద్రణ :

టైపింగ్ :

**బళ్లాని శివరామ్,**

శివరామ్ గ్రాఫిక్స్, కడప.

కవర్‌పేజీ డిజైన్:

**గజ్జల విజయభాస్కర్ రెడ్డి,** కడప.

## గౌరవ సంపాదకులు



### ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి

## సంపాదకులు



ఎడమ నుండి కుడి వైపుకు 1. డా॥ పాలెం వేణుగోపాల్ 2. డా॥ చింతకుంట శివారెడ్డి
3. యమ్మనూరు ప్రభాకర రెడ్డి 4. డా॥ భూతపురి గోపాల కృష్ణ శాస్త్రి 5. డా॥ వెల్లాల వేంకటేశ్వరాచారి



నిలుచున్నవారు : లక్ష్మి, సుభద్రమ్మ, దినకర్, ఉమామహేశ్వరి, మనోజ్ఞ, తులసి, విభాకర్, స్వాతి, వీరకుమారి, సుప్రజ, శ్రేష్ఠ
మధ్యవరుస: చోహార, సుబ్బారెడ్డి, ప్రభాకర రెడ్డి, ప్రతాప రెడ్డి, శివప్రసాద రెడ్డి, దీప్తి, ఉర్వి
క్రింద కూర్చున్నవారు : విహసిత, దృవిక, సాత్విక, శ్రద్ధ

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| 1. | సంపాదకీయం | 7 |
| 2. | చంద్రునికో నూలు పోగు<br>– వై. ప్రతాప రెడ్డి, వై. ప్రభాకర రెడ్డి, వై. పురుషోత్తమ రెడ్డి | 9 |
| 3. | వంద వసంతాల వై.సి.వి. – యమ్మనూరు ప్రభాకర రెడ్డి | 11 |
| 4. | రాయలసీమ రైతును తలపించే వైసీవి – ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి | 15 |
| 5. | రాయలసీమ ఆత్మకు అద్దం పట్టిన అభ్యుదయ కవి వైసీవి – ఆచార్య ఎన్ ఈశ్వర రెడ్డి | 16 |
| 6. | తొలితరం అభ్యుదయ కవిత్వానికి బ్రాండ్ అంబాసిడర్ వైసీవి రెడ్డి గారు!!<br>– డా॥ రాధేయ ఉమ్మడిశెట్టి | 17 |
| 7. | నిలువెత్తు కడపదనం, వై.సి.వి.! – మందలపర్తి కిషోర్ | 20 |
| 8. | రాయలసీమ మొదటితరం కథకుడు వై.సి.వి. – డా.ఎం. హరి కిషన్ | 23 |
| 9. | జనాభ్యుదయశీలి వై.సి.వి. కి నివాళి – శ్రీ ఎ. సోమసుందర్ | 25 |
| 10. | వై.సి.వి. రచనలు పద వైశిష్ట్యం – పలుకుబళ్ళు – యస్వీ రామసుబ్బారెడ్డి | 30 |
| 11. | కథా సాహిత్యంలో రాయలసీమ చైతన్యం – వల్లంపాటి వెంకటసుబ్బయ్య | 46 |
| 12. | నా స్మృతిపథంలో వై.సి.వి. – గజ్జల మల్లారెడ్డి | 48 |
| 13. | ఉద్యమ దక్షిణా నిలుదు – ఆచార్య కేతు విశ్వనాథ రెడ్డి | 50 |
| 14. | అభ్యుదయ రచయిత వై.సి.వి. రెడ్డి – ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి | 54 |
| 15. | వైసీవీ రెడ్డి గారూ / రచనల్లో చిరంజీవి వైసివీ – డా॥ ఎన్. గోపి | 67 |
| 16. | ప్రజా సాహితీవేత్త – వై.సి.వి. – పెనుగొండ లక్ష్మీనారాయణ | 72 |
| 17. | మన వైసీవి – డా॥ పి. సంజీవమ్మ | 78 |
| 18. | వై.సి.వి. బహుముఖీన ప్రాభవం – డా॥ పాలెం వేణుగోపాల్ | 80 |
| 19. | వై.సి.వి. సాహిత్యం – ఛందశ్శిల్పం – డా॥ వెల్లాల వేంకటేశ్వరాచారి | 89 |
| 20. | వై.సి.వి. రెడ్డి కవిత్వం సామాజిక దృక్పథం – డా॥ మూల మల్లికార్జున రెడ్డి | 105 |
| 21. | వై.సి.వి. రెడ్డి భారత పతనం భారతం చెంబు – నేను – వెన్నపూస అరవిందనాథ రెడ్డి | 114 |
| 22. | జ్ఞాపకాలు – ఆర్. శకుంతల | 117 |
| 23. | తగువారమే – యమ్మనూరు ప్రభాకర రెడ్డి | 119 |
| 24. | మా నాయన – కొన్ని జ్ఞాపకాలు – డా॥ యమ్మనూరు పురుషోత్తమ రెడ్డి | 121 |

25. తొలకరి చినుకులపై ఒక విశ్లేషణ – డా॥ కైపా కుమారస్వామి 128

26. వరించిన మేనక – డా॥ గంగనపల్లి వెంకటరమణ 137

27. వై.సి.వి.రెడ్డి 'రంభ' ఖండకావ్య వైశిష్ట్యం – డా॥ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి 146

28. వ్యవసాయ నిఘంటువు లాంటి సాహిత్యం అందించిన 'వై.సి.వి రెడ్డి'
– మరకా సూర్య నారాయణ రెడ్డి 158

29. సిందూర రేఖ – డా॥ గూగంశెట్టి శ్రీరామకృష్ణ 172

30. దక్షిణానిలము – డా॥ జి.వి. సాయిప్రసాద్ 184

31. వై.సి.వి. చిత్రించిన గాసగాని దుర్భర జీవితం – డా॥ గూగంశెట్టి రామకృష్ణ 192

32. సెలకన్నె – డా॥ గూగంశెట్టి రామకృష్ణ 201

33. వర్ణనా వైజయంతి – డా॥ పెద్దిరెడ్డి నీలవేణి 207

34. పారిజాతం – డా॥ గూగంశెట్టి రామకృష్ణ 212

35. అచ్చమైన తెలుగు జానపదుని కథలు గట్టిగింజలు – ప్రొ॥ కేతు విశ్వనాథరెడ్డి 218

36. వై.సి.వి. రెడ్డి కథలు – శిల్ప వైవిధ్యం – డా॥ కె.యన్. సుందరేశ్వరరావు 221

37. వై.సి.వి.కథల్లో సీమ అస్తిత్వం – డా॥ పొదిలి నాగరాజు 227

38. వై.సి.వి.రెడ్డి 'గట్టిగింజలు' – మాండలిక విశేషాలు – డా॥ చింతకుంట శివారెడ్డి 233

39. గట్టి గింజలు కథలు – పాత్ర చిత్రణ – డా॥ టి. హజరతయ్య 240

40. వై.సి.వి. రెడ్డి గేయాలు – ఒక అవలోకనం – నిరంతరం పారే పాయలు
– వై.సి.వి. రెడ్డి గేయాలు – డా॥ అనుగూరు చంద్రశేఖరరెడ్డి 245

# సంపాదకీయం

తెలుగు సాహిత్య చరిత్రలో శ్రీశ్రీ (శ్రీరంగం శ్రీనివాసరావు), కొకు (కొడవటిగంటి కుటుంబరావు), రారా (రాచమల్లు రామచంద్రారెడ్డి), సినారె (సింగిరెడ్డి నారాయణరెడ్డి) లాంటి పొట్టి అక్షరాలతో ప్రసిద్ధులయిన కవులు, రచయితలు కొంతమంది ఉన్నారు. ఈ కోవలో కడపజిల్లాకు యమ్మనూరు చిన వెంకటరెడ్డి గారు కూడా వైసీవి రెడ్డిగా సాహిత్య చరిత్రలో సుప్రసిద్ధులు. చాలా సాహిత్య సభల్లో సాహితీవేత్తలు ప్రసంగిస్తూ... 'కడప గడపలో కవుల గడపలు మెండు' అనే ప్రయోగం ఎక్కువగా చేస్తుంటారు. ఈ నానుడి (పద్య పాదం) సృష్టికర్త వైసీవి రెడ్డి గారే. పద్యం, గేయం, కథ, విమర్శ లాంటి పలు సాహిత్య ప్రక్రియల్లో వీరు గొప్ప సాహిత్యాన్ని అందించారు.

తెలుగు భాషా సాహిత్యాలకు ఎనలేని సేవలందించిన కవులు, రచయితలను గౌరవించుకుంటూ శత జయంతులు నిర్వహించుకోవడం అనాదిగా ఒక సంప్రదాయంగ కొనసాగుతోంది. ఈ దిశగా ఈ ఏడాది (మార్చి 2025 – మార్చి 2026) వైసీవి రెడ్డి గారి శతజయంతి నిర్వహించాలని తలచాం. శతజయంతి సందర్భంగా ఎటువంటి  కార్యక్రమాలు చేయాలన్న ప్రణాళికల రూపకల్పన కోసం ఏర్పడ్డదే ఐదుగురితో కలసిన మా సంపాదక వర్గం. మేము సమావేశమవడానికి కడపలోని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో ఉన్న 'మానవత' కార్యాలయం వేదికగా ఎంచుకున్నాం. వైసీవి రెడ్డి పేరుతో ఒక వాట్సప్ గ్రూపు ఏర్పాటు చేసుకున్నాం.

సంపాదక వర్గం ఏర్పాటు, సమావేశాలకు వేదిక నిర్ణయం, వాట్సప్ గ్రూపు నిర్మాణం అన్నీ కూడా వైసీవి రెడ్డి గారి కుమారుడు వై.ప్రభాకరరెడ్డి గారి ఆలోచనా సారం. ఫలానా సంపాదకవర్గం అనుకున్నాక మొదట ఫోన్ ద్వారా మిగిలిన నలుగురికి ప్రభాకర రెడ్డి గారు తెలియజేశారు. వారు ఫోన్‌లో సంభాషిస్తూ... 'మా నాన్నగారు వైసివి రెడ్డిగారి శతజయంతి ఈ ఏడాది జరుగుతుంది. ఇందుకోసం ఒక ప్రత్యేక సంచిక తీసుకురావాలని మా కుటుంబ సభ్యులం సంకల్పించాం. అందుకు మీ సహాయ సహకారాలు కావాలని' అడుగుతూ సంపాదకవర్గంలో ఉండే సభ్యుల పేర్లను తెలిపారు.

తొలి సమావేశానికి సమయం ఆసన్నమయ్యింది. 27.11.2024 తేదీన అందరం మానవత కార్యాలయంలో కలుసుకున్నాం. ఒకవైపు వై. ప్రభాకరరెడ్డి గారు, డా॥ పాలెం వేణుగోపాల్ గారు, డా॥ వెల్లాల వేంకటేశ్వరాచార్యులు గారు, ఇంకోవైపు డా॥ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి గారు, డా॥ చింతకుంట శివారెడ్డి గారు సమావేశమయ్యాం. సంచికకు గౌరవ సంపాదకత్వం వహించమని ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి గారిని కోరగా వారు సహృదయంతో అంగీకరించి విలువైన సలహాలు, సూచనలను అందిస్తూ వచ్చారు. వై. ప్రభాకరరెడ్డి గారు సంచిక ప్రస్తావన మిగిలిన సభ్యులకు వివరించారు. ఆ సంచిక కోసం ఎవరెవరితో విమర్శనాత్మక వ్యాసాలు రాయించుకోవాలో చర్చించుకున్నాం. అదే సమయంలో 'సంచికకు ఏ పేరు పెడితే బాగుంటుంది?' అనే ప్రశ్న తలెత్తింది. అందరం కాసేపు చర్చించుకున్నాక... ప్రభాకరరెడ్డి గారు తన మనసులోని 'వంద వసంతాల వైసివి' అనే పేరును ప్రస్తావించారు. అందరం కూడా ఈ పేరు చాలా బాగుంది... వందలోని 'వ' అక్షరం, వసంతాల లోని 'వ' అక్షరం, వైసివి లోని 'వై' అక్షరం ప్రాస కూడా సరిపోయిందని భావించి, ఇదే నిర్ణయించుకుందాం అని అనుకొని ఈ సంచికకు ఆనాడు నామకరణం చేశాం.

అలా ప్రారంభమైన మా సమావేశాలు నెలకు ఒకటి లేక రెండు సార్లుగా సాగుతుండేవి. కలసిన ప్రతిసారి గతంలో జరిగిన పని ఎంత? ఇంకా చేయవలసినది ఎంత? ఎవరెవరిని ఎప్పుడెప్పుడు సంప్రదించాలి? వారికి చేర్చాల్సిన విషయ సేకరణ (పుస్తకాలు మొ॥) చేర్చడం ఎలా? లాంటి పలు అంశాలను చర్చించుకోవడం, వాటి పరిష్కారాలను అప్పుడే చర్చించడం, వచ్చిన ఆలోచనలకు ఒక నోటుపుస్తకంలో అక్షర రూపాన్నివ్వడం, ఆచరించడం జరుగుతూండేది.

ఇక్కడ రెండు సరదా అంశాలు మీతో (పాఠకునితో) ప్రస్తావించాలి... మా సమావేశాలు నెల నెలా 'గురువారం' మాత్రమే నిర్వహించేవాళ్లం. దీని వెనుక ఒక కారణం ఉంది. అదేంటంటే... సంపాదకవర్గంలోని భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, చింతకుంట శివారెడ్డి ఇద్దరూ కడపలోని సి.పి.బ్రౌన్ గ్రంథాలయంలో పనిచేస్తున్నారు. ఆ గ్రంథాలయానికి గురువారం సెలవు కాబట్టి ఇద్దరూ అందుబాటులోకి రావడం సులభమవుతుందని ఆ రోజును ఏర్పాటుచేసుకున్నాం. ఇక మిగిలిన ముగ్గురం ఎలాగు విశ్రాంత అధ్యాపకులే కాబట్టి సమస్యలేదు. ఇక రెండవ అంశం ఏంటంటే... మా సమావేశాలు ఎక్కువగా సాయంకాలం జరుగుతుండేవి. సమావేశం ముగిసేసరికి 6.30 లేదా 7 గంటలవుతుండేది. అందరం కలసి సరదాగా దగ్గరలో ఉండే వాయుపుత్ర కేఫ్‌కు వెళ్లి అక్కడ వేడి వేడిగా బజ్జీలు తిని, కాఫీ తాగి తిరిగి ఎవరింటికి వాళ్లం వెళ్లేవాళ్లం. ఆ కేఫ్ ఎంతో విశాలంగా ఉంటుంది, అందరం అక్కడ కూర్చోవడం, కాసేపు సాధారణ అంశాలను మాట్లాడుకొని (ఎందుకంటే సమావేశంలో కేవలం సంచిక విషయాలే ప్రస్తావనకు వస్తాయి కాబట్టి) ఎవరింటికి వాళ్లం బై బై చెప్పుకొని పోవడం. ఇది మా సంపాదకవర్గం సమావేశం సమయంలో చేసే పనులు.

అలా మొదలైన మా పని... ఇంతితై వటుడింతై... అన్నట్లుగా ఇంత పెద్ద పుస్తకంగా రూపు చెందగానే అందరం ఎంతో సంతోషించాం. సంచికలో ముందుగా ప్రముఖుల అభిప్రాయాలు, మరో విభాగంగ వైసీవి రెడ్డి గారి సాహిత్యంపై గతంలో వెలువడిన వ్యాసాలను సేకరించి కూర్చినాము. ఇంకో విభాగంగ ప్రస్తుతం ఉన్న ప్రముఖ విమర్శకులతో రాయించిన వ్యాసాలు, మూడో విభాగంగ వై.సి.వి. రచనలపై ప్రత్యేక వ్యాసాలు రాయించి పూర్తి చేశాం. వీటితోపాటు వారి జీవితాంశాలు, అక్కడక్కడ సందర్భానుకూలంగా ఫోటోలు ఇలా తెలుగు సాహితీవేత్తలకు, సాహితీ ప్రియులుకు, మరీముఖ్యంగా తెలుగు పరిశోధక విద్యార్థులకు ఉపయుక్త గ్రంథంగా ఉండేలా సిద్ధం చేశాం.

ఇక్కడ ఇంకో విషయం ప్రస్తావించాలి... వ్యాసాలు ఎవరితో రాయించాలి? అనే ప్రశ్న చర్చకు వచ్చినప్పుడు ప్రభాకరరెడ్డి గారి ఆలోచన ప్రకారం యువ రచయితలకు ప్రాధాన్యత ఇచ్చాం. వారు అందించిన కొత్త కొత్త ఆలోచనలు, పలు కోణాల ప్రతిరూపమే ఇందులోని వ్యాసాల సారం. 'ఇక పుస్తకం అందంగా తయ్యారయ్యింది. ఇక ఆవిష్కరణ సంగతి ఎలా?' అని సమావేశంలో ప్రస్తావన వచ్చింది. 'ఇంత పెద్ద పుస్తకం ఏదో సాధారణంగా కాకుండా ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి గారు లాంటి పెద్దలను పిలిపించి సాహిత్య సభ ఏర్పాటుచేసి ఆవిష్కరిస్తే బాగుంటుందని భావించాం. వేదిక, అతిథులు, వ్యాసకర్తలు ఇలా పలు అంశాలపై చర్చించుకొని అందుకు తగ్గ ప్రణాళికను సిద్ధం చేసుకున్నాం.

13.11.2025న సమావేమయ్యాం. అక్కడ చర్చించుకున్న విధంగానే కడప ఎర్రముక్కపల్లెలోని సి.పి.బ్రౌన్ గ్రంథాలయాన్ని వేదికగా అనుకొని, ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి గారి ఆధ్వర్యంలో ఆవిష్కరణ సభను జనవరి, 2026న నిర్వహించుకోవాలని నిర్ణయించాం.

**– సంపాదక వర్గం**

# చంద్రునికో నూలు పోగు

మా నాయన శతజయంతిని పురస్కరించుకొని ఆయనకు నివాళిగా ఈ ప్రత్యేక సంచికను వెలువరించగలగడం మాకు అత్యంత సంతోషాన్ని కలిగించిన విషయం. ఈ సంచిక ఇంత హృద్యంగా రూపుదిద్దుకోవానికి ఎందరో ప్రముఖులు సహకరించారు. వారందరికీ మా హృదయపూర్వక వందనాలు.

వారిలో ముఖ్యంగా కీ.శే. కేతు విశ్వనాథ రెడ్డి గారి గురించి ప్రస్తావించాలి. ఆయన ఒకప్పుడు కుప్పంలోని ద్రవిడ యూనివర్సిటీ ఆధ్వర్యంలో మా నాయన రచనలపై ఒక సెమినార్‌ను జరిపించాలని ప్రయత్నించిన శ్రేయోభిలాషి. అది విఫలమైనప్పుడు "అయిపోయిన దాన్ని గురించి ఆలోచించకండి. మూడు సంవత్సరాలలో రాబోయే వైసీవీ శతజయంతికి ఒక ప్రత్యేక సంచికను తీసుకొనివద్దాం" అని ఆరోజే మాకు దిశానిర్దేశం చేసారు విశ్వనాథ రెడ్డి గారు. నేడు ఆయన ఉండి ఉంటే ఈ ప్రత్యేక సంచికను చూసి మిక్కిలి సంతృప్తి చెంది ఉండేవాడు. అందుకే ఆయనకు ఈ సందర్భంగా మా ప్రత్యేక నివాళి.

విశ్రాంత ఆచార్యులు రాచపాళెం చంద్రశేఖర రెడ్డి గారు మా నాయన రాసిన 'ప్రకృతి సందేశం' అనే గేయాన్ని పదోతరగతి తెలుగు పాఠ్యపుస్తకంలో పాఠ్యాంశంగా నిర్ణయించడంలో కీలకపాత్ర వహించి, మరొక్కసారి వై.సి.వి. రెడ్డిని, ఆయన కవితా గరిమను ఆంధ్రదేశమంతా స్మరించుకునేలా చేసారు. అంతేకాక ఈ ప్రత్యేక సంచికకు గౌరవ సంపాదకత్వం వహించి సంచిక ప్రామాణికంగా ఎలా ఉండాలో తెలియజేస్తూ దిశానిర్దేశం చేసిన రాచపాళెం వారికి మా నమస్సుమాంజలులు.

ఎందరో మహానుభావుల వ్యాసాలను ఈ ప్రత్యేక సంచికలో వాడుకోవడం జరిగింది. వారందరికి మా హృదయపూర్వక నమస్కారాలు. అలాగే యువకులు అడిగిన వెంటనే శ్రమకోర్చి అడిగిన ప్రకారం వ్యాసాలను వ్రాసి యిచ్చినారు. వారందరికి పేరు పేరున కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాం.

అడిగిన వెంటనే సంపాదకీయ బాధ్యతలను స్వీకరించి, ఈ సంచిక రూపురేఖలను తీర్చిదిద్దడంలో ఆద్యంతమూ సహకరించిన డా॥ పాలెం వేణుగోపాల్ గారికి, డా॥ వెల్లాల వేంకటేశ్వరాచారి గారికి, డా॥ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి గారికి, డా॥ చింతకుంట శివారెడ్డి గారికి మా ప్రత్యేక ధన్యవాదాలు.

నాగార్జున మహిళా కళాశాల ప్రాంగణంలో మమ్ములను ఆదరించిన బయరెడ్డి రామకృష్ణా రెడ్డి గారికి, కళాశాల ఆవరణలోని 'మానవతా' కార్యాలయాన్ని సంపాదకుల సమావేశాలకు అందుబాటులో వుంచిన 'మానవత' వ్యవస్థాపకులు ఎన్. రామచంద్రారెడ్డి గారికి మరియు 'మానవత' బాధ్యులు ప్రతి ఒక్కరికి పేరు పేరునా కృతజ్ఞతాభివందనాలు.

శత జయంతి సంచిక ముఖచిత్రాన్ని చక్కగా రూపొందించిన మామిత్రుడు ప్రముఖ చిత్రకారుడు గజ్జల విజయ భాస్కర్ రెడ్డి గారికి మా ప్రత్యేక కృతజ్ఞతలు.

అక్షరదోషాలను సవరించిన మిత్రులు కడపన మదన మోహన రెడ్డి గారికి, నాగార్జున స్కూల్ ఉపాధ్యాయులు యస్. మహబూబ్ బాష గారికి మా కృతజ్ఞతలు.

డిటిపి అందంగా కూర్చిన బళ్ళాని శివరామ్ (శివరామ్ గ్రాఫిక్స్) గారికి, ఈ సంచిక చూపరుల మనస్సును చూరగొనే ముచ్చటైన ముద్రణకు సహకరించిన ప్రముఖ చిత్రకారుడు విజయవాడవాసి కళాసాగర్ గారికి మా హృదయపూర్వక ధన్యవాదాలు.

ఇంకా ఎందరో మహానుభావాలు అందరికీ వందనాలు...

**– వై. ప్రతాప రెడ్డి, వై. ప్రభాకర రెడ్డి, వై. పురుషోత్తమ రెడ్డి**



# వంద వసంతాల వై.సి.వి.

**జననం : 26 మార్చి 1926 మరణం : 8 అక్టోబర్ 1989**

**"కనుగొంటిని చెలికాడ నీ కవిత గంగా భంగ రంగత్తరంగ**
**విషంగోజ్వల సంగ తాంగి విలసక్కం జాత సంజాత" –నారు నాగనార్య**

**"ఓ వై.సి.వి.రెడ్డి భవజ్జని నా మేలునకయ్యే**
**నిను మరువన్ జాలను దివా రాత్రములు" –పుట్టపర్తి నారాయణాచార్యులు**

**"నాచిననాటి నేస్తము వినమ్రుడు వై.సి.వి.రెడ్డి ప్రౌఢిమన్**
**తోచిన రీతిగాక సరితూగగ శక్యమే సాహితీ లతన్**
**పూచిన పువ్వులట్లు వలపుల్ పచరించి తెలుగు గడ్డ పై**
**వీచిన దక్షిణా నిలపు వీవన లాతని కావ్య సంపదల్" – గజ్జల మల్లారెడ్డి**

**"కవితోద్యమాలు మీ భుజం మీది రుమాలు**
**కవిత్వమంటే మీకు**
**అమృతం కుండకు చిల్లిపడితే జారే ధార**
**ప్రజల కష్టాలంటే**
**గుండెల్లో మొలిచే కులిశధార" – ఎన్. గోపి**

ఇలా ఎంతోమంది ఆత్మీయతను అనుభవించిన వై.సి.వి.రెడ్డి పూర్తి పేరు యమ్మనూరు చిన్న వెంకట రెడ్డి. కడప జిల్లా పులివెందుల నియోజక వర్గంలోని బోనాల స్వగ్రామం. కొండారెడ్డి, లక్ష్మమ్మ దంపతులకు 1926 మార్చి 26న జన్మించారు.

ప్రొద్దుటూరు దగ్గరి రామేశ్వరం వాస్తవ్యులు కొడవలూరి రామచంద్ర రాట్కవి వీరికి ఓనమాలతో పాటు భారత, భాగవత పురాణాలు, ప్రబంధాలు పరిచయం చేసిన తొలి గురువు.

చదువు నిమిత్తం గుత్తిలో వున్నప్పుడు "మయూర ధ్వజోపాఖ్యాన" కర్త చక్రాల నరసింహ శాస్త్రి సాహచర్యంతో ఛందస్సు, అలంకారాలు, వ్యాకరణం నేర్చుకున్నారు.

కడప జిల్లా వీరపునాయునిపల్లె మండలంలోని యరమలపల్లె వాస్తవ్యులు అదినారాయణ రెడ్డి, చెన్నమ్మ గార్ల కుమార్తె బాలచెన్నమ్మతో 1947 జూన్ 15న వివాహం అయింది. 1949 అక్టోబరు 13న కడప జిల్లా బోర్డులో గుమస్తాగా చేరారు.

ఉద్యోగరీత్యా కోడూరుకు బదిలీ అయినప్పుడు అక్కడ నారునాగనార్య, ఉప్పలపాటి వెంకట నరసయ్య, వేదం వేంకట కృష్ణశర్మ గార్ల పరిచయం, ప్రోత్సాహంతో "తొలకరి చినుకులు" ఖండ కావ్యాన్ని ముద్రించడం జరిగింది.

తొలకరి చినుకులతోనే వై.సి.వి సాహితీ క్షేత్రం పదునయింది. వివిధ సాహితీ ప్రక్రియలను అలవోకగా పండించడమే కాక, అనేక మంది సాహితి కృషీవలులకు "పన్నకం" నేర్పినాడు. (చేలోకి వెళ్లిన తరువాత దున్నడానికి అనుగుణంగా నాగలిని ఏర్పాటు చేసుకోవడం.)

వై.సి.వి.రెడ్డి రచనలను ఇలా వర్గీకరించవచ్చు. అవి 1. పద్య కావ్యాలు 2. గేయ కావ్యాలు 3. కథాసంపుటి.

పద్య కావ్యాలు : 1. తొలకరి చినుకులు 2. మేనక 3. రంభ 4. సింధూర రేఖ

గేయకావ్యాలు: 1. దక్షిణానిలం 2. రాయబారం 3. సెలకన్య 4. వైజయంతి 5. పారిజాతం

కథా సంపుటి: 21 కథలతో "గట్టి గింజలు" కథా సంపుటి

వీటితో పాటు 14 స్వతంత్ర గేయాలు వ్రాశారు. వీటిలో ఆంధ్రాభ్యుదయం, కడప గడపలు, పద్మశ్రీ పుట్టపర్తి లాంటి గేయాలున్నాయి. "సందేశము" అనే గేయం 10వ తరగతి తెలుగు పాఠ్య పుస్తకంలో ఒక పాఠ్యాంశంగా చోటు చేసుకుంది.

వై.సి.వి.రెడ్డి గారి మొత్తం రచనలను వారి కుమారులు ప్రతాపరెడ్డి, ప్రభాకర రెడ్డి, పురుషోత్తమ రెడ్డి గార్లు 2004లో ఒకే పుస్తకంగా అచ్చు వేయించారు. మరల 2018లో అత్యంత అరుదయిన ఫోటోగ్రాఫులతో ముద్రించారు. ఈ వై.సి.వి.రెడ్డి సమగ్ర సాహిత్యం ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని గ్రంథాలయాలలో అందుబాటులో ఉంది.

ఈ సంవత్సరం వై.సి.వి.రెడ్డి గారి శతజయంతి. శతజయంతిని పురస్కరించుకొని ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డిగారి గౌరవ సంపాదకత్వంలో, డా॥ పాలెం వేణుగోపాల్, డా॥ వెల్లాల వేంకటేశ్వరాచార్లు, డా॥ భూతపురి గోపాలకృష్ణ, డా॥ చింతకుంట శివా రెడ్డి, యమ్మనూరు ప్రభాకర రెడ్డి గార్ల సంపాదకత్వంలో "వంద వసంతాల వై.సి.వి.రెడ్డి" ప్రత్యేక సంచిక రూపుదాల్చి మీ ముందుకు వచ్చింది.

**– వై. ప్రభాకర రెడ్డి**



శ్రీమతి చెన్నమ్మ శ్రీ వై.సి.వి. రెడ్డి



**సంవేదన సాహిత్య త్రైమాసిక పత్రిక ఆవిష్కరణ - కడప : 30 మార్చి 1968**

ఎడమ నుంచి : 1. రాచమల్లు రామచంద్రారెడ్డి (రా.రా), 2. ప్రొ॥ జి.యన్. రెడ్డి, 3. పుట్టపర్తి నారాయణాచార్యులు, 4. శ్రీశ్రీ ,
కూర్చున్నవారు 5. కొడవటిగంటి కుటుంబరావు, 6. గజ్జల మల్లారెడ్డి, 7. వై. సి. వి. రెడ్డి

నిల్చున్నవారు : 1. ఆర్వియార్, 2. ఐ. సుబ్బారెడ్డి, 3. టి. సాంబశివారెడ్డి, 4. వేలూరి సోమయాజులు, 5. కేతు విశ్వనాథరెడ్డి
6. నల్లపాటి రామప్పనాయుడు, 7. వి. రామకృష్ణ, 8. చవ్వా చంద్రశేఖర్ రెడ్డి (సి.సి. రెడ్డి), 9. టి. చెన్నారెడ్డి, 10. సాదుం జయరాం



**ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి**
అరసం రాష్ట్ర శాఖాధ్యక్షులు
9440222117

# రాయలసీమ రైతును తలపించే వైసివి

వేమన పద్యం అందరు తండ్రులకు వర్తించదు, అందరు తండ్రులూ అంత పెట్టిపుట్టలేదు. కానీ వైసివి రెడ్డిగారు మాత్రం మంచి కుమారులనే కన్నారు. ప్రపంచీకరణ పుణ్యమా అని మానవ సంబంధాలన్నీ పూర్తిగా ఆర్థికసంబంధాలుగా మారిపోయి, కుటుంబ సంబంధాలను కూడా ప్రపంచీకరణ ధ్వంసం చేస్తున్నది. తల్లిదండ్రులను చంపైనా ఆస్తులు ఎత్తుకుపోవాలనుకునే సంతానాలీరోజూ కనిపిస్తూనే ఉన్నాయి. ఈ సందర్భంలో సాహిత్యాన్ని నమ్ముకుని బతికిన తండ్రి వైసీవి రెడ్డి గారి శతజయంతి సందర్భంగా వై.సి.వి. రెడ్డి కుమారులు ఆయన జీవితం, సాహిత్యాల మీద "వందవసంతాల వై.సి.వి." అనే ప్రత్యేక సంచికను ప్రచురించి ఆవిష్కరించడం నాకు చాలా ఆనందంగా ఉంది. వైసీవి రెడ్డి గారి కుటుంబ సభ్యులందరినీ నేను హృదయ పూర్వకంగా అభినందిస్తున్నాను.

వైసివి రెడ్డిగారు అభ్యుదయ రచయిత. ఆయన రైతు, శ్రామిక పక్షపాతి. అభ్యుదయ సాహిత్య సభలు నిర్వహిస్తూనే కన్నుమూశారు. పెద్దాయనతో నాకు చాలాకాలంగా పరిచయం ఉంది. ఒకసారి భాస్కర్ పుల్లయ్యతో కలిసి అనంతపురం వచ్చి నన్ను కలిసినప్పటి నుండి నాకు పరిచయం. రాయలసీమ రైతును తలపించే వైసివి రెడ్డిగారు కవి, కథారచయిత, మంచి భావుకుడు. రాయలసీమ జీవిత మూలాలు బాగా తెలిసినవారు. రాయలసీమ భాషా సౌరభం ఆయన రచనల్లో గుబాళిస్తూ ఉంటుంది. అందుకే ఆయన రచనలన్నీ గట్టి గింజలు వంటివి. ఆయన సాహిత్యం మీద ఒకరిద్దరు పరిశోధనలు చేసినా, ఆయన సాహిత్యం ఇంకా అధ్యయనావశ్యకత కలిగినదే. ఆయన శతజయంతి సందర్భంగా ప్రత్యేక సంచికను ప్రచురించిన వారి కుటుంబ సభ్యులకు మరోసారి అభినందనలు తెలియజేస్తున్నాను.



**ఆచార్య ఎన్. ఈశ్వర రెడ్డి**
అధ్యక్షులు, అరసం కడప జిల్లా శాఖ
సెల్: 8328296952

## రాయలసీమ ఆత్మకు అద్దం పట్టిన అభ్యుదయ కవి వైసీవి

వైసీవి రెడ్డిగా ప్రఖ్యాతి పొందిన యమ్మనూరు చిన వెంకటరెడ్డి గారు ప్రాతః స్మరణీయుడు. అభ్యుదయ సాహిత్య ఉద్యమంలో తనకంటూ ఒక పుటను భద్రపరచుకోగలిగిన రచయిత. ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం కడప జిల్లా శాఖకు అధ్యక్షులుగా చాలా కాలం సేవలందించారు. రాష్ట్రస్థాయిలో కార్యక్రమాలు నిర్వహించి కడప ప్రాంత గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన గొప్ప అభ్యుదయ కార్యకర్త. రాచమల్లు రామచంద్రారెడ్డి, కేతు విశ్వనాథరెడ్డి లాంటి దిగ్గజ సాహిత్యవేత్తలను తన నాయకత్వ ఛత్రి కింద నడిపించిన సహృదయ శీలి. కవిత్వం, కథ ప్రక్రియలో తనకంటూ ఓ ప్రత్యేకతను సాధించుకున్న రచయిత వైసీవి రెడ్డి. ఈయన సాహిత్యంపై డాక్టర్ ఆవంత్స సోమ సుందర్, గజ్జల మల్లారెడ్డి, రాచపాళెం చంద్రశేఖర రెడ్డి, కేతు విశ్వనాథరెడ్డి, పెనుగొండ లక్ష్మీనారాయణ, ఎన్. గోపి, సంజీవమ్మ, ఎస్.సి. రామసుబ్బారెడ్డి మొదలైన మహామహులు విమర్శక వ్యాసాలు రాశారు అంటే ఆయన స్థాయి ఏమిటో మనం అర్థం చేసుకోవచ్చు. అరసం పక్షాన కేంద్ర సాహిత్య అకాడమీ సహకారంతో వైసీవి రెడ్డి సాహిత్యంపై త్వరలోనే సదస్సును నిర్వహించడానికి ప్రణాళిక తయారు చేస్తున్నాం. భావజాలంలోనూ, భాషా ప్రయోగంలోనూ వైసీవి రెడ్డి గారు రాయలసీమ ఆత్మను పలికించిన రచయితగా నిలబడ్డారు.

వైసీవి రెడ్డి గారి శతజయంతి సంవత్సరం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన సాహిత్యంపై వచ్చిన విలువైన వ్యాసాలను వైసీవి కుమారులు వై. ప్రభాకర్ రెడ్డిగారు ఒక సంకలనంగా తీసుకువస్తున్నారు. 'వారసత్వాన్ని పంచుకోవడం అంటే వారి విలువలను కొనసాగించడమే' అనే తత్వాన్ని కలిగిన ప్రభాకర రెడ్డిగారి కృషికి హృదయపూర్వక అభినందనలు, ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.



**డా. రాధేయ ఉమ్మడిశెట్టి**
9985171411

## తొలితరం అభ్యుదయ కవిత్వానికి బ్రాండ్ అంబాసిడర్ వైసీవి రెడ్డి గారు!!

నాకు వైసీరెడ్డి గారంటే ప్రత్యేకమైన అభిమానం, గౌరవం ఆయనతో నాకు 1975 నుంచీ పరిచయం. ఆయన నా పట్ల చూపించే అభిమానం నన్ను మరింత దగ్గరగా చేసింది. ఇంకా చెప్పాలంటే నా కవిత్వానికి మార్గదర్శకుల్లో వీరు ఒకరు.

1978లో కడప జిల్లాలో ఆధునిక కవితా వికాసం లేదనే చెప్పాలి. మొదటి నుంచీ ప్రాచీన సాహిత్యం, అవధాన పాండిత్యం ప్రబంధ కావ్యాలు వెలువడుతూ వచ్చాయి. గురజాడ, శ్రీశ్రీ గార్ల ప్రభావంతో ఇతర ప్రాంతాల్లో వచన కవిత్వం విరివిగా వెలువడుతున్నా కడప జిల్లాలో ఆ ప్రభావం లేదు.

ఆ రోజుల్లో 1978 లో నేను తొలిసారిగా "మరోప్రపంచం కోసం" పేరుతో వచన కవితా సంపుటి వేశాను. అప్పుడు నా వయసు 23 సంవత్సరాలు. రాష్ట్రవ్యాప్తంగా ఈ పుస్తకానికి గుర్తింపు అయితే వచ్చింది గానీ, కడప జిల్లాలో మాత్రం కవిపండితులు పెదవి విరిచారు ఇదేం కవిత్వం? ఇదే కవిత్వ మేనా?

ఛందస్సు లేదు,అలంకారం లేవు. అసలు ఈ కవిత్వానికి కావ్యలక్షణాలే లేవు శుద్ధ వచనమే కవిత్వమెలా అవుతుందని వాదించారు. నీ వాళ్ళే నిను తిట్టకపోతే నువ్వు తెలుగు వాడివే కాదని ఓ సినీ కవి అన్నట్లుగా స్వంత జిల్లాలోని కవిపండితులే నాకు నిరాశ కలిగించారు.

సరిగ్గా ఇలాంటి సంక్షోభంలోనే అభ్యుదయ కవి వైసీవి రెడ్డిగారు నన్ను అక్కున చేర్చుకున్నారు. జానమద్ది గారు నన్ను అభినందించి కడప జిల్లా రచయితల సంఘం మహా సభల్లో కొన్ని వందల మంది సాహితీ వేత్తల సమక్షంలో నా పుస్తకాన్ని ఆవిష్కరింపజేశారు.

వైసీవి గారు అప్పట్లో నన్ను రారా గారికి, సోదుం జయరాం గారికి, కమ్యూనిస్ట్ యోధుడు వై. ఈశ్వర రెడ్డి గారికి స్వయంగా పరిచయం చేశారు. గజ్జల మల్లారెడ్డి గారైతే పరోక్షంగా కమ్యూనిస్ట్ కార్యకర్తల ద్వారా నన్ను గురించి వాకబు చేయించి ప్రొద్దుటూరులో సభలో నన్ను దగ్గరికి పిలిపించుకొని ఆప్యాయంగా మాట్లాడి భుజం తట్టాడు.

ఇక వైసీవి రెడ్డిగారు నేను కడపకు వెళ్ళినప్పుడల్లా ఏకంగా నన్ను ఒక విద్యార్థి లాగా కూర్చో బెట్టుకొని కవిత్వం గురించి అభ్యుదయ, ప్రగతిశీల భావాల గురించి, నూరి పోస్తూ వచ్చారు. అవి నన్ను బాగా ఆకట్టుకునేవి.

అప్పట్లోనే నాకు సమకాలికుడు కవిమిత్రుడు శశిశ్రీ ఆధ్వర్యంలో మిత్ర సాహితీ సమితి ఏర్పాటైంది. ఈ సంస్థ నిర్వాహకుడు శశిశ్రీ గారే అయినా గౌరవాధ్యక్షులు మాత్రం వైసీవి గారే. నా తొలి పుస్తకం రాగానే మిత్ర సాహితీ సభకు నన్ను పిలిపించి వేదిక మీద కూర్చోబెట్టారు, ఎక్కడ మాట్లాడమంటారో ఏమోనని, నేను స్టేజ్ ఫియర్‌తో భయపడుతుంటే భయపడొద్దు నాయనా... నువ్వేం మాట్లాడొద్దులే, నీ బుక్‌లో కవితలు చదువు చాలు, అని ధైర్యం ఇచ్చారు.

వైసీవి గారు అభ్యుదయ కవి మాత్రమే కాదు పద్యాన్ని గటగటా నీళ్ళు తాగినట్లుగా అవలీలగా రాయగలరు. ఆశువుగా చెప్పగలరు కూడా.

అప్పట్లో నేను నిరుద్యోగ యువ కవిని. కవిత్వంలో నేను బలంగా అడుగు వెయ్యడానికి ఎక్కడా ఆగిపోకుండా ముందుకు సాగడానికి వారు కారణం. గత యాభై ఏళ్ళుగా కవిత్వం రాస్తూ, ఇప్పటికి 14 కవితా సంపుటాలు, 10 కవితా విమర్శ గ్రంథాలను వెలువరించ గలిగాను. నాలుగు దశాబ్దాలుగా కవిత్వానికే ఉమ్మడిశెట్టి అవార్డులను ప్రదానం చేస్తూ కవిత్వమే శ్వాసగా బతుకుతున్నానంటే నా కవితా జీవన ప్రస్థానంలో వైసీవి రెడ్డిగారి పాత్ర మరువలేనిది. మరుపు రానిది

కమ్యూనిస్ట్ పార్టీ, అభ్యుదయ సాహిత్యం ఈ రెండూ ఆయన జీవితంలో ఓ భాగం. రెండు కళ్ళు అని కూడా చెప్పవచ్చు. ఆయన అభ్యుదయవాది అయినా జిల్లాలోని సుప్రసిద్ధ కవిపండితులు అంతా ఆయన స్నేహితులే. ముఖ్యంగా పుట్టపర్తి నారాయణా చార్యులు, రాచమల్లు భైరవ కొండారెడ్డి వంటివారు వైసివి గారిని ఎంతగానో ప్రేమించే వారు.

ప్రాచీన కావ్య ప్రబంధాలను, ఖండకావ్యాలను సైతం వైసీవి గారు అభ్యుదయ భావనలతోనే పద్య రూపం లో చక్కగా విశ్లేషించేవారు. అభ్యుదయ తిరోగమన సాహిత్యంపట్ల ఆయన ఏమాత్రం రాజీ పడేవారు కాదు. వారు చిన్నవారైనా, సమకాలికులైనా, పెద్దవారైనా వారిలోని విద్వత్తును గౌరవించేవారు.

మేము ఆరోజుల్లో మాకు మండల కేంద్రమైన ముద్దనూరులో నేనూ, టి. ఈశ్వరరెడ్డి (తెలుగు బిడ్డ శతక కర్త) మరికొందరు, సాహిత్యాభిమానులు కలిసి 1978లో శారదా సాహితీ సమితి పేరుతో ఒక సాహిత్య సంస్థను ఏర్పాటు చేసుకొన్నాము. స్థానిక డా॥ జి. పుల్లారెడ్డి గారు అధ్యక్షులుగా వ్యవహరించే వారు.

సంస్థ పక్షాన ప్రతి నెలా జిల్లాలోని సీనియర్ సాహితీవేత్తను ఆహ్వానించి వారిచేత ఒక గంట పాటు ఉపన్యాసం ఏర్పాటు చేసే వాళ్ళం. ఇందులో భాగంగా మొదట వైసీవి రెడ్డిగారినే ఆహ్వానించాం. అభ్యుదయ సాహిత్యంలో భాగంగా, తనదైన పద్య శైలిని వివరిస్తూ అనర్గళంగా ఉపన్యసించారు.

ఆయన తాను యుక్త వయస్సులో రాసిన గుత్తి దుర్గం గురించిన పద్యాలు, పల్లెల్లో దళితుడు తన డప్పు దరువు ప్రేరణగా తీసుకొని వినిపించిన (దడ బిడ ఓబిగాడు) పద్యం. నాకు సరిగా గుర్తులేదు. లీలగా గుర్తుంది. ఆ రోజు ముద్దనూరు సభలోవారి సాహిత్యం గురించి నేను సభా పరిచయం చేశాను. ఆ సభలో డాక్టర్ గారిచేత వైసీవిగారి వైజయంతి కావ్యాన్ని అందుకున్నాను.

వారి ఆహార్యాన్ని కళ్ళారా చూస్తే చాలు తెల్లటి షర్టు, మోచేతుల వరకు మడిచి ధరించేవారు, తెల్లటి అడ్డపంచ కట్టుకునేవారు. ఒక మోతుబరి రైతులాగా సభకు నడిసొచ్చేవారు. నాకు బాగా గుర్తు. ఎప్పుడు నాకు ఎదురైనా నిండైన చిరునవ్వుతో భుజం మీద చెయ్యివేసి నన్ను మనసారా పలకరించేవారు.

కడపకు మీటింగ్‌కు వెళ్లినపుడు జిల్లా గ్రంథాలయంలో సభ అయిపోగానే నాతోపాటే నడుస్తూ, మాట్లాడుతూ పాత బస్టాండ్‌కు వచ్చి నన్ను స్వయంగా బస్సు ఎక్కించిన సందర్భాలు కూడా ఉన్నాయి. ముఖ్యంగా యువతరంపట్ల వారికున్న ప్రేమాభిమానాలను లెక్కకట్టలేము.

వారి కొడుకులు నాకు అందరూ పరిచయంలేరు గానీ చిన్న కొడుకు డా॥ వై. పురుషోత్తమరెడ్డి గారు మాత్రమే నాకు బాగా సన్నిహితం. వారి నాన్న భావాలు ఆశయాలకు ప్రతిరూపంగా కనిపిస్తారు. నాకు కూడా ఆయనలో వారి తండ్రిగారి సంస్కారమే కనిపిస్తుంది. వృత్తిరీత్యా వీరు కళాశాలలో గణిత అధ్యాపకులుగా, పనిచేసి డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్‌గా రిటైర్ అయ్యారు. నేనూ డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకునిగా రిటైర్ అయ్యాను. ఇద్దరం అనంతపురంలోనే స్థిరపడ్డాము. ఆశ్చర్య మేమంటే కాకతాళీయంగా ఇద్దరం పక్కపక్కనే ఉండడం మరింత ఆశ్చర్యకరం.

ఇదీ వైసీవి రెడ్డి గారితో నాకున్న ప్రత్యేక అనుబంధం. నా కవితా ప్రస్థానంలో వారికి ఒక ప్రత్యేక అధ్యాయం ఉందంటే అతిశయోక్తి లేదనుకుంటాను. నిజం చెప్పాలంటే ఆయన నాకే కాదు... ఆ రోజుల్లో కడప జిల్లాలోనే తొలితరం అభ్యుదయ కవిత్వానికి బ్రాండ్ అంబాసిడర్... అని నేను గర్వంగా ప్రకటించగలను.

వై.సి.వి.రెడ్డి శతజయంతి సందర్భంగా వెలువరిస్తున్న 'వంద వసంతాల వై.సి.వి.' ప్రత్యేక సంచిక యువకవులకు, రచయితలకు, పరిశోధకులకు దారిదీపం కాగలదని ఆశిస్తున్నాను.



**మందలపర్తి కిషోర్**
8179691822

# నిలువెత్తు కడపదనం, వై.సి.వి.!

రచయితల్లో ముఖ్యంగా కవుల్లో పరస్పరసహనం, సహానుభూతి లాంటి సల్లక్షణాలు కాస్త అరుదే! ఇది ఎవరినో మనసులో పెట్టుకుని అంటున్న మాట కాదు. ఎందుకంటే, ఈ లక్షణాలు, గుణగణాలు కావు– గణగుణాలనుకుంటా!! అయితే, ఇలాంటి సామాన్య సూత్రాలకు, సాధారణంగా, అపవాదాలూ వుంటాయి. అలాంటి ఒక 'మినహాయింపు' లాంటి మనిషిని గురించిన నాలుగు ముక్కలివి. ఆయనతో నాకున్న పరిచయం అతి పరిమితం. పైగా ఇక్కడ రాసిన విషయాల్లో చాలాభాగం, నేనే వివిధ సందర్భాల్లో రాసినవి. ఈ ఉపోద్ఘాతం ఇంతటితో ముగించి విషయానికి వస్తున్నా!

కడప జిల్లాకు ఓ కొసన, అనంతపురం జిల్లాకు ఆనుకునివుండే మండలం పులివెందుల. అందులో చిన్నవూరు బోనాల. అక్కడ ఓ రైతు కుటుంబంలో పుట్టిన యమ్మనూరు చిన్న వెంకటరెడ్డిని నేరుగా తెలిసివున్నవాళ్ళు వందలాదిగా వుంటారు. మొదట్లో కవి గానూ, చివరి రోజుల్లో కథానిక రచయితగానూ రాష్ట్రమంతా సుప్రసిద్ధులైన వై.సి.వి. రెడ్డిని తెలిసిన నాలాంటి వాళ్ళు వేలసంఖ్యలో వుంటారు. 'తొలకరి చినుకులు', 'మేనక', 'రంభ, 'దక్షిణానిలము', 'రాయబారం' కవితా సంపుటులూ, 'గట్టిగింజలు' కథానికా సంకలనం వెలువరించారు వై.సి.వి. మెట్రిక్ పాసయి, జిల్లా బోర్డులో కొన్నాళ్ళు ఉద్యోగం కూడా చేశారు. అయితే, ఆది నుంచీ వామపక్ష ఉద్యమ అభిమానిగా వున్న వై.సి.వి.ని కడప పెత్తందార్లు ప్రశాంతంగా ఉద్యోగం చేసుకోనివ్వలేదు. దాంతో, కొలువుకు స్వస్తిచెప్పి సాహిత్యమే జీవనంగా మనుగడ సాగించారు వై.సి.వి. అయితే, 1989లో పి. రామకృష్ణారెడ్డి – వై.సి.వి.ని తలచుకుంటూ రాసిన వ్యాసంలో– అన్నట్లు 'తన రచనలకన్నా తనే అపురూపమైన మనిషి' వై.సి.వి. అందుకే, ఆయన్ని నేరుగా తెలిసినవాళ్ళకు వై.సి.వి. పేరెత్తగానే ఆయన నిష్కారణ ఆదరణ, నిర్మలత్వం నిండిన ఆత్మీయత, నిర్మలమైన ప్రేమాభిమానాలే గుర్తుకొస్తాయి. అందుకే ఆయన వ్యక్తిత్వం, సాహిత్య మూర్తిమత్వంకన్నా ఎన్నోరెట్లు గొప్పదనిపిస్తుంది. ఒక్కోసారి! అయినప్పటికీ, సాహిత్యచరిత్ర వై.సి.వి.ని కవిగానే గుర్తుం చుకుంటుంది – అది సహజం, అదే న్యాయం కూడా! అభ్యుదయ సాహిత్యవిమర్శను మేలి మలుపు తిప్పిన 'సంవేదన' త్రైమాసికకు – యుగసాహితి తరఫున– ప్రచురణకర్తగా వ్యవహరించిన అభ్యుదయ రచయితగా వై.సి.వి.ని తెలిసినవాళ్ళే వేలాదిగా వుంటారు!

నేనింతకుముందు ఓ పుస్తకంలో రాసినట్లుగా, ఇరవై దశకంలో పుట్టిన తరానికి వుండిన లక్షణాలన్నీ వై.సి.వి.పుణికి పుచ్చు కున్నారు. తెలుగుజిల్లాల్లో విద్యావ్యాప్తికి చొరవ మొదలైన కొత్తలో ఈ తరం ఓనమాలు దిద్దింది. పందొమ్మిదో శతాబ్ది మధ్యలో పునరుజ్జీవన ఉద్యమాలుగా మొదలైన సంఘసంస్కరణ యత్నాలు

1920 నాటికి ఊపందుకున్న స్వాతంత్ర్య సమరంలో లీనమయ్యాయి. అప్పటివరకూ అనేక ప్రాంతాల్లో విద్యావ్యాప్తికోసం విడివిడిగా జరుగుతూ వచ్చిన ప్రయత్నాలకు అలా ఓ జాతీయస్వభావం ఏర్పడింది. అవే రోజుల్లో జాతి పునర్నిర్మాణంపై అంతర్జాతీయ స్థాయిలో జరిగిన చర్చలో విద్యదే పెద్దపీట! అలాంటి నేపథ్యం ప్రభావంతోనే ఈతరంలో చదువంటే పుస్తక పఠనం మాత్రమే కాదనే చైతన్యం రూపుదిద్దుకుంది. కళలన్నీ విద్యలేననే సంవేదన కూడా అప్పట్లోనే బలపడింది. అదంతా, ఆ తరం రూపుదిద్దుకునే క్రమాన్ని ప్రభావితం చేసింది. వృత్తి ఉద్యమకారులనూ, అధికార యంత్రంలో మరమేకులుగా ఉపయోగపడే ఉద్యోగులనూ తొలిసారి 'ఉత్పత్తి' చేసింది కూడా బహుశా ఈ తరమేనేమో! ఇది భారతదేశానికే పరిమితమైన పరిణామం కాదు. మన దేశంతో సహా, ప్రపంచం ఇవాళ ఇలా వుండడానికి ప్రధానమయిన కారకులు ఈ రెండు రకాల మనుషులే! ఆఫ్రోఆసియన్ దేశాల్లో 'ఆధునిక' చరిత్రకు కచ్చితమయిన రూపమిచ్చింది కూడా ఈ తరమేనేమో! ఆ తరంలో భాగంగా వున్నవాళ్ళు అందరిపైనా పడిన ఈ ప్రభావాలు వై.సి.వి. ఒక్కర్నే వదిలేస్తాయా?

కవిత్వం విషయానికొస్తే, తన తరంలోని కవులు చాలామంది మాదిరే తానూ పద్య కవితతోనే గొంతు సవరించారు వై.సి.వి. అలా జరగడానికి కొన్ని "స్థానిక, కాలిక" విశిష్టతలున్నాయి. వాటన్నింటినీ కలగలిపే, నేను "నిలువెత్తు కడపదనం" అంటున్నా. సుసంపన్నమయిన సాహిత్య–చారిత్రక నేపథ్యాల సంగతి అటుంచండి; స్వాతంత్ర్యం వచ్చేనాటికి, దుర్భాక రాజశేఖర శతావధాని, గడియారం వేంకట శేషశాస్త్రి, పుట్టపర్తి నారాయణాచార్య, కడప జిల్లా కవిత్రయంగా ఓ వెలుగు వెలుగుతున్నారు. (వాళ్ళ ముగ్గురిలో చివరివారైన పుట్టపర్తి ఆధునికత – సాంప్రదాయికతల మేలు కలయిక!) ఈ కవిత్రయం ప్రభావం అప్పుడే కలంపట్టిన కడప కవికుమారులపై పడడం సహజం! ఈ పరిస్థితి యాభై దశకం వరకూ కొనసాగింది. పద్యం స్థానంలో, మాత్రాబద్ధ గేయం వచ్చి చతికిలబడింది – అంతే తేడా! ఇదే మనకు వై.సి.వి. సాహిత్య పరిణామక్రమంలోనూ కనిపిస్తుంది! గమనించాల్సిన విషయం ఏమిటంటే, 1953లోనే వై.సి.వి.రెడ్డి వెలువరించిన "తొలకరి చినుకులు" పద్యకావ్యంలో ఆయన వ్యక్తం చేసిన అభిప్రాయాలు సాంప్రదాయిక "రూపాన్ని" ప్రతిబింబించినా, సాంప్రదాయిక "సారాన్ని" మాత్రం ప్రతిధ్వనించడం లేదు! అంతకు ముందటేడాది, తెలుగు జనం 'ఎగరేసిన ఎర్రని జెండా' చాయ ఈ పద్యాలమీదకీ పాకినట్టుంది! 'బీదసాదల నెత్తురు పిండి, పిండివంటలం జేసి, తిని త్రేంచు భాగ్యవంతులేడ? ఆకలి డొక్కలు మాడి చచ్చు అనదలేడ? మరెట్టులీ శని నశించు?' అడిగిన కవి భాష పాతకాలానిదే కానీ భావనలో కొత్తదనం తొంగి చూస్తోందని అర్థమవడం లేదూ?

వై.సి.వి. చురుగ్గా రాస్తూండినంత కాలం గ్రామీణ ఆర్థికరంగంపై ప్రయోగాలు సాగుతూనేవున్నాయి. మన ప్రణాళికల్లో వ్యవసాయంపై కురిపించిన తేనెజల్లులు రైతుజీవనం చేదువిషంగా మారకుండా ఆపలేకపోయాయి. పేదరికం ఘనీభవించివుండే పల్లెల్లో – ముఖ్యంగా దళితవాడల్లో – దాని వికృత స్వరూపం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. స్పందించే గుణమున్న ఏ రచయితనైనా అది ఎంతో కొంత కదిలించకుండా

వుండదు. వై.సి.వి. పద్యాలన్నింటా, కష్టాలు అనుభవించేవాళ్ళ పట్ల కనికరం స్ఫుటంగా కనిపిస్తూ వుంటుంది. అయితే, కష్టజీవుల తరపున బేషరతుగా వకాలతు తీసుకోవడం మాత్రం ఆయన కథల్లోనే కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది! ఆయన కథల్లో ఎక్కువ భాగం 'కొత్తబాట' పత్రికలోనే వచ్చినట్లు గుర్తు. కడపలో గడపగడపకూ ఓ కథకుడు కనిపిస్తారు. ఆ ప్రాంతంలో కథానిక అంతటి ఆదరణకు పాత్రం కావడానికి ప్రత్యేకమైన కారణాలేవో వుండేవుంటాయి. వాళ్ళలో చాలామంది గొప్ప శిల్పులుగా రాష్ట్రం మొత్తంమీద గౌరవాదరాలు పొందినవాళ్ళు. రాచమల్లు రామచంద్రా రెడ్డి, సొదుం జయరాం, కేతు విశ్వనాథ రెడ్డి, పి. రామకృష్ణ, సత్యాగ్ని, దాదా హయాత్, తదితరుల పేర్లు ప్రత్యేకం గుర్తుకు తెచ్చుకోనవసరం లేదు! వాళ్ళందరికీ భిన్నమయిన ఓ లక్షణం వై.సి.వి. కథల్లో కనిపిస్తుంది. ఆయన రచనల్లో, ముఖ్యంగా కథానికల్లో, మట్టిపరిమళం ప్రతిమాటలోంచీ వెలువడుతూంటుంది! పల్లెల్లోని బీదాబిక్కీ జీవితాలతో వై.సి.వి.కి వున్నంత ప్రగాఢమైన పరిచయం, లోతయిన అవగాహన మధ్యతరగతి రైతుల్లో చాలా మందిలో కనిపించదు. (అలాంటి కుటుంబాల్లోంచే కథానికా రచయితలు ఎక్కువగా రావడం ఆ యుగధర్మంగా కనిపిస్తుంది మరి.) ఆ పరిచయం ప్రాతిపదికగా రాసిన కథలే, "గట్టిగింజలు" సంపుటిలో కనిపిస్తాయి. వై.సి.వి. కథల్లో స్త్రీలపట్ల, మగమహారాజుల చేతుల్లో వాళ్ళు పడే బాధల పట్ల వ్యక్తమయ్యే సహానుభూతి తీవ్రత కూడా అరుదు. 'నగుమోము గనలేని', 'ఆస్తి విలువ' లాంటి కథలు రాయాలంటే సహానుభూతి తీవ్రత ఒక్కటే చాలదు. బాధితుల తరపున వాదించాలనే పట్టుదల లేకుండా 'కుట్రల్లో కూలోడు', 'ఇంటి మాదిగోడు' కథలు ఎవరూ రాయలేరు. వై.సి.వి. రెడ్డిగారు మొదట్నుంచీ కథానికల పైనే దృష్టి పెట్టి వుంటే మరిన్ని మంచి కథలు వచ్చి వుండేవి కదా అనిపిస్తుంది ఒక్కోసారి!



**డా॥ ఎం. హరి కిషన్**
9441032212

## రాయలసీమ మొదటితరం కథకుడు వై.సి.వి.

అప్పుడప్పుడే వేళ్ళూనుకుంటున్న ప్రాంతీయ కథా సాహిత్యానికి ఒక చూపును, దృక్పథాన్ని అందిస్తూ రాయలసీమ జనజీవితానికి, మాండలికానికి పట్టం గడుతూ పునాదులు పటిష్టం చేసినవాడు. ప్రాచీన సాంప్రదాయ రచనా పద్ధతిలో స్వర్ణ కంకణాన్ని అందుకున్నా అతిత్వరలోనే ఆ వ్యామోహం నుంచి బయటపడి మార్క్సిస్ట్ సాహిత్యాన్ని అధ్యయనం చేసి తన పంథా మార్చుకున్నారు. కడప జిల్లా అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షునిగా ఉంటూ కొత్త, పాత తరాలను కలుపుకుంటూ ఒక చైతన్యవంతమైన ప్రగతిశీల సాహితీ వాతావరణం కల్పించారు. వీరు రచించిన 21 కథల సంపుటి గట్టిగింజలు ఆనాటి సమకాలీన సమాజ సంఘర్షణను, రాయలసీమ రైతుల కూలీల బాధలను నిజాయితీగా ఆవిష్కరించిన రచన. ఈ కథలు పాఠకుల్ని ఏమాత్రం గందరగోళ పరచకుండా, సరళంగా సూటిగా ఉంటూ అభ్యుదయ సమాజం వైపు అడుగులు వేసే చైతన్యాన్ని అందిస్తాయి. వంద వసంతాల వైసీవి పేరుతో మరల వారి సాహిత్య విశేషాలు ఈనాటి తరానికి అందుబాటులోకి తీసుకురావడం చాలా సంతోషం. అవసరం. ఈ పనికి కంకణం కట్టుకున్న మిత్రులందరికీ అభినందనలు.



పాలా వెంకటసుబ్బయ్య, నల్లపాటి రామప్ప నాయుడు, వై.సి.వి. రెడ్డి, పుట్టపర్తి నారాయణాచార్యులు,
డా॥ మల్లెమాల వేణుగోపాల్ రెడ్డి, మలసాని చంద్రశేఖర్ రెడ్డి



శ్రీ ఎ. సోమసుందర్

# జనాభ్యుదయశీలి వై.సి.వి. కి నివాళి

సహృదయుడూ, స్నేహశీలీ, నిరంతర జనాభ్యుదయకాంక్షి సంప్రదాయ మెరిగిన అభ్యుదయ కవి శ్రీ వై.సి.వి. రెడ్డి వెళ్ళిపోయాడు. అక్టోబరు ఏడూ ఎనిమిది తేదీలలో కడప జిల్లా అభ్యుదయ రచయితల మహాసభ జరపాలన్న దీక్షతో సెప్టెంబరు మొదటివారం నుంచీ తీవ్రంగా కృషి సల్పాడు. బహుశా జిల్లా అంతటా పర్యటించి సాహిత్యాభిమానులను కలుసుకొని విరాళాలు సేకరించి వుంటాడు. ఐదారేళ్ళుగా హృద్రోగంతో బాధపడుతున్నా అటు పార్టీ పని గాని, యిటు అరసం కార్యక్రమాలు గాని ఎదురైతే బాధ్యతతో కార్యభారం మీద వేసుకుని ముందంజ వేసేవాడు. పార్టీ కార్యాలయ భవన నిర్మాణంలో గాని, మహావ్యక్తి ఈశ్వరరెడ్డి గారి స్మారక నిధి సేకరణలో గాని వై.సి.వి. రెడ్డి ముందుండి పనిచేశాడు.

ఆయన రచయితలందరినీ అభిప్రాయ విభేదాలతో నిమిత్తం లేకుండా ప్రేమించగలిగే విశాల హృదయుడు. ఏ మాత్రం ప్రతిభ వ్యక్తమైనా యువ రచయితలను ఎంతో ప్రేమతో ప్రోత్సహించేవాడు. నాకు ఇరవై ఏళ్ళుగా మిత్రుడు. తన కుమారునికి కాకినాడ ఇంజనీరింగు కాలేజీలో సీటు లభించినపుడు చేర్పించడానికి వచ్చి నా మకాం వెదుక్కుంటూ మా యింటికి వచ్చి తన్ను పరిచయం చేసుకున్నాడు. అప్పటికి నేనా మిత్రుని పేరు ఒకటి రెండు మార్లు విన్నానే తప్ప పెద్ద అభిప్రాయం ఏర్పరచుకోలేదు. అయినా ఆయన కాకినాడలో వున్న రెండు మూడు రోజుల్లో ఎక్కువ కాలమే గడిపాం! అది మొదలుగా దఫదఫాలుగా మా నడుమ ఉత్తర ప్రత్యుత్తరాలు సాగుతున్నాయి. నా రచనల గురించి ఎప్పటికప్పుడు తన ఆమోదాంగీకారాలు తెలుపుతూనే వున్నాడు. 1984 డిసెంబరులో కడప జిల్లా రచయితల మహాసభకు మిత్రులు శ్రీ జానమద్ది హనుమచ్ఛాస్త్రి ఆహ్వానించగా వెళ్ళినపుడు మేమిద్దరం సన్నిహితంగా గడిపాం. ఆయనే స్వయంగా నన్ను తీసుకెళ్ళి పార్టీ కార్యాలయ భవనం చూపించి మిత్రులందరినీ పరిచయం చేశారు. సమావేశమూ ఏర్పాటు చేశాడు.

1987 జనవరిలో శ్రీ నంద్యాల నాగిరెడ్డి రచించిన గీతాలను నాకు పంపుతూ ముందుమాట రాయమనీ, శీర్షిక పెట్టమని కోరుతూ శ్రీ న.నా.రె.ని పరిచయం చేశారు. ఆయన మొక్కవోని దీక్షతో పార్టీ కార్యకర్తగా పనిచేస్తూ అనేక క్రూర నిర్బంధాలెదుర్కొన్నాడు. రౌడీ మూకల హత్యా ప్రయత్నంలో చావు తప్పినా ఒళ్ళంతా చిద్రమై శాశ్వతంగా అవధ్యులయ్యారు. ఆ కవితా సంపుటికి జ్వాలాశిఖరాగ్రం అని

నామకరణం చేసి, "ఊపిరిగా పోరాటం: ఓదార్పుగా కవిత్వం" అనే శీర్షికతో నాలుగు పుటల పీఠిక రాశాను. ఆ కవితా సంపుటితో పాటు రామనపల్లె హరిజన విముక్తి పోరాట చరిత్రను సైతం ప్రచురించారు. ఆ పోరాటంలో శ్రీ న.నా.రె. శరీరం గూండాల దాడికి తూట్లు పడిపోయింది.

1987లోనే శ్రీ వై.సి.వి. తాను రచించి ప్రచురించిన కావ్యాలు రంభ, రాయబారము, పారిజాతము, దక్షిణానిలము అనే నాలుగున్ను పంపిస్తూ చదివి అభిప్రాయం తెలపమన్నాడు. చదివాను. వ్యాసం రాస్తున్నానని చెప్పి తర్వాత ఆంధ్రభూమిలో అక్షర భూమి శీర్షిక క్రింద ఒక వ్యాసం ప్రచురించాను. ఆ వ్యాసం చదివి ఎంతో ఆనందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

సెప్టెంబరులో సుంకర వర్ధంతికి విజయవాడలో కలిసినపుడు మిత్రులు శ్రీ బొల్లిముంత శివరామకృష్ణ కడప జిల్లా అరసం మహాసభ జరుగబోతున్నట్లు నన్ను రమ్మని ఆహ్వానిస్తూ మీకు కూడా ఆహ్వానం పంపానని వై.సి.వి. తన పక్షాన మిమ్ము తప్పక రమ్మని కోరమన్నాడని చెప్పారు. నేను తిరిగి యింటికి వచ్చేసరికి ఆ మిత్రుని లేఖ నిరీక్షిస్తోంది. కాని అప్పటికే నల్లా నరసింహులుగారి పుస్తకావిష్కరణ సభ నిర్ణయమైంది. జనగామ రెండో తేదీ వెడుతున్నాననీ, ఐదో తేదీ వరకు వరంగల్‌లో పనులున్నాయని కనుక రాలేనని రాస్తే ఆ మిత్రుడు నిరాశ చెందారు. "మీకు ఎన్ని పనులున్నా నాపై అభిమానంతో కడప జిల్లా అరసం మహాసభకు తప్పక వస్తారనే ఆశించాను. ఇక్కడి యువతీ యువకులకు ఉత్తేజ మందిస్తారనీ ఆశించాను" అంటూ వ్రాశాడు. కాని యింతలో యింత విపత్తు ముంచుకు వస్తుందనీ, ఆ అరసం సభల వేదికపైనే రెండవ రోజున మృత్యువా మిత్రుని తన్నుకు పోతుందనీ ముందే అనుకోగలిగితే ఎంత బాగుండును? మాయ మృత్యువా మిత్రుడ్నే ఎత్తుకు పోకుండా మన మధ్యనే మిగిలిస్తే ఎంత బాగుండును? శుష్క ప్రశ్నలు శూన్య హృదయంలో ప్రతిధ్వనిస్తున్నాయి.

శ్రీ వై.సి.వి. కవిత్వంపై సమాలోచనా వ్యాసాన్ని అక్షరభూమిలో 14.1.89న ప్రచురించినపుడు ఆయన రచించిన ఉత్తమకావ్యం 'దక్షిణానిలం' గురించిన భాగాన్ని వ్యాస విస్తృతిని పరిహరించడానికి మినహాయించాను. ఆ భాగాన్ని ఆ సన్మిత్రుడు లేని యీ సమయంలో ప్రచురించవలసి రావడం దురదృష్టమే. అయినా కవితాక్షర బద్ధుడైన కవి చిరంజీవే!

వై.సి.వి. తెలుగు కవితా సంప్రదాయాన్ని క్షుణ్ణంగా ఎరిగినవాడు. సిద్ధాంతపరంగా అభ్యుదయ శీలి. అయితే సంప్రదాయ భారం మరీ తలకు మించిన దవడం వల్ల అభ్యుదయ కవిగా తన్ను తాను సమగ్రంగా ఆవిష్కరించుకోలేక పోయాడు. తన ప్రయోగ దక్షతను పరిమితు లేర్పరచుకున్నాడు. నేను చాలా కాలంగా ఒక మాట చెబుతున్నాను. ఆధునిక అభ్యుదయ కవికి సంప్రదాయం సారభూత కేదారమే కావాలి. తలను అణచే పెనుబండ కారాదు. ఇంతవరకూ ప్రచురించిన కవితా సంపుటాలలో గాని, సమగ్ర కావ్యాలలో గాని ఆ ప్రమాదమే.

ప్రస్తుతం పుస్తకమవుతున్న దక్షిణానిలం రగడ ఛందంలో సాగిన సంపూర్ణ రచన. రగడ ఛందం జానపదుల గేయసాహిత్యంలో కొల్లలుగా ప్రవర్ధిల్లింది. పద కవితా పితామహుడు తాళ్ళపాక అన్నమాచార్యుని – జో అచ్యుతానంద జోజో ముకుందా వంటి పాటలు సైతం రగడలే. మంజరీ ద్విపదకు మరో మాత్ర అధికమైతే రగడ రూప మేర్పడుతుంది. ఇందులో అనేక రూపభేదాలున్నాయి. వృషభ గతీత్యాది నామ వైవిధ్యమూ ఏర్పరచబడింది.

దారిద్ర్య రేఖ అనే గోవర్దనగిరి క్రింద భీతిభీతిగా బ్రతికే నిర్భాగ్యులు అసంఖ్యాకంగా పెరుగుతున్నారు. దాని ఛాయా ఆవరణం అనంతం కాకపోవడం వల్ల ఎందరో దౌర్భాగ్యులు చెట్ల నీడలనే ఆశ్రయించారు. ఎవరైనా పుణ్యాత్ములు చల్లిన నూకలపై చీమలవలె ఆధారపడుతున్నారు. ఆ చిత్రాన్ని యీ కవి హృద్యంగా వర్ణిస్తూ కావ్యారంభం కావించాడు. కవికి భావుక హృదయం వుండాలే కాని, ఎక్కరాని మెట్టులే ఎదురుకావు. క్రుంకులిడని ఆ ఖాతాలూ మిగిలిపోవు.

ఆ దక్షిణానిలం ఉబుసుపోకకు పచార్లు చేస్తున్నది కాదు. దీనికొక తాత్త్వికావగాహన వుంది. "ఈ జీవనమే నిత్య మిదె సుఖమ్మని" పలుకగల ధీమా వుంది. "కష్టములు నష్టములు కావడులు క్షమరోడ మోయవలె మానవుడు. తోయవలె కాలమ్ము! అనెడి వేదాంతు లల్లన తేలిపోవ"గా అది ప్రసరిస్తోంది. కేరళ రాష్ట్రంలో అతివాద, ప్రజాతంత్ర సంఘటన పాలనాధికారం స్వీకరించిన ప్రథమ పర్యాయం ఆ విజయాన్ని కీర్తిస్తూ వై.సి.వి. రచించిన కావ్యం దక్షిణానిలం.

ముద్రితమైన కావ్యాలలో పారిజాతం చివరిది. కాని అదే వై.సి.వి. చరమ రచన కాదు. ఈ కవి నితాంత పురోగామి కనుక మరెన్నో కావ్యాలు వెలయిస్తాడని విశ్వసించాను. సమర్థులైన వాళ్ళు ఆలసాలసంగా కాలం వెళ్ళ మారిస్తే అసమర్థులు అర్భకులూ అంగలారుస్తూ గద్దెలెక్కుతారు. ఆ ప్రమాదం యిప్పటికే తెలుగు కవితా వీధిలో కిక్కిరిసి పోతోంది. అనివార్యమేమోనన్న భ్రమ కలిగిస్తోంది.

కడప మండలానికి ఆధునిక కవి కులపతిగా ప్రతిష్ఠ పొందినవారు శ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులవారు ఈ పారిజాతానికి ముందు మాట లందించారు. పారిజాత – ప్రబంధంతో తన పేరును అవిభాజ్యంగా నిలుపుకున్నవాడు ముక్కు తిమ్మన కవి. అతనితోనే నేరుగా సంభాషిస్తున్నాడీ కావ్యంలో.

"పశ్చిమాంధ్రలో అన్నమయ్యరచనలు గడ్డకు రావడం వాటికి కావ్యత్వ సిద్ధి మంజూరు కావడం భాషలో గొప్ప విప్లవాన్ని తెచ్చింది అన్నారు పుట్టపర్తి. అందరూ ఆమోదించిన ఒక గొప్ప సంగతిని అందరికీ జ్ఞాపకం చేసినందుకు సరస్వతీ పుత్రులు అభివంద్యులే! అన్నమయ్య మళ్ళీ తెలుగు ప్రజల హృదయ సంపదగా పునరుద్ధరింప బడినాక తీయని తేట తెనుగంటే ఏమిటో తెలుగు రసన గేయగుణానికి ఎంత వివశం కాలగదో, సంస్కృత సమాస దాస్యాన్ని ఎంత మౌలికంగా ప్రతిఘటించగలదో అవగతమైంది. సామాన్య జానపదుల అనూన గేయ సంపదను అన్నమాచార్య కవి ప్రభువు ఎంత ఎత్తున నిలిపి ఆకాశదీపంగా అజరామరం చేశాడో అవగాహన చేసుకోగలిగారు తెలుగుపండితులు. అన్నమయ్య ప్రజలకవి. అతని పునరుజ్జ్వలనం ప్రజల విజయం.

కవిగా ఆ సత్యాన్ని గ్రహించిన వాడై ఆ సత్సంప్రదాయ గేయఫణితినే సమాదరించాడు. వై.సి.వి. నంది తిమ్మన్న గారితో నేరుగా సంభాషించడం వల్ల యీ కావ్యానికొక ఆత్మీయత ఏర్పడింది. కాని కావ్యపరిధి కొంత కుంచితమై పోయింది. భావుక అవరణం పరిమితమైపోయింది. ఈ కారణం వల్ల కావ్యం సార్వజనీనతను భజించలేక పోతుంది. ఎంత మనోజ్ఞ పదజాలంతో కావ్యం పోహళించబడినా, రక్తిలుప్త మవుతుంది. ఆర్తనాదాల వర్తమానాన్ని బలంగా ప్రతిధ్వనించలేకపోవడమూ లోక యథార్థాలను ప్రతిబింబించలేక పోవడమూ ఏ కారణం వల్ల జరిగినా, అది అతి ఆధునిక కావ్య విజయానికి భంజకమే! సమకాలీన స్థితిని ప్రాచీన కావ్య మర్యాదలతో తులనాత్మక మొనర్చి, వర్ణించడం వల్ల పాఠకుల మానసిక సంతుష్టి కొరవడుతుంది.

ఆ కాలంలో అడుగడుగునా ఋషి వాటికలున్నాయనీ, అవి అనాయాసంగా అనసూయాత్మలకు ఆటపట్టులై భయం కుంచిత హృదయులకు అభయహస్త మందించాయనీ పూర్వ సాహిత్యమంతా ఘోషించింది. అవన్నీ ఆనాటి కవులు కల్పించుకున్న తీయని ఆశలు. సంపూర్ణ వాస్తవాలుగా మనమీనాడు భ్రమ చెందనక్కరలేదు. ఇప్పుడిలాంటివి మచ్చుకైనా కనిపించడం లేదని వాపోనక్కరనూ లేదు.

ఆకలి గొన్న ఆర్తులకు పట్టెడన్నం పెట్టే మహంధాత లెవరని తిమ్మన్నను కాదుకదా బమ్మన్ననడిగినా ఫలితం శూన్యమే! శాస్త్రీయ, భౌతికవాదం సర్వత్రా ప్రచలిత మవుతున్న మనకాలంలో యిలాంటి వ్యంగ్య వైభవం అసంగత మనిపించకపోదు. కావ్య రచనలో భావనా పాటవమూ, భాషా సౌందర్యమూ, తీయని నుడికార శిల్ప విన్నాణమూ ఎంత సమృద్ధిగా సమకూరినా ఫలితార్థ మాత్రం దూర భూరేఖగా మిగిలిపోక తప్పదు. కావ్యానికి వస్తువే ప్రాణం. కనుక చక్కని కవితా దుకూలాన్ని ముళ్ళకంచెపై ఆరవేసిన చందమే అవుతుంది.

సమకాలీన రాయలసీమ జీవితం పేదరైతుల కష్టనిష్ఠుర గాధను యితివృత్తంగా స్వీకరించి ఒక గొప్ప కావ్యం రాస్తాడని వై.సి.వి. నుంచి నేనెంతగానో ఆశించాను. వర్తమాన రాజకీయార్థిక సాంఘికాది దారుణ పరిస్థితులను హృద్యంగా వర్ణించగలడని నేనెంతో పెద్ద ఆశ పెట్టుకున్నాను. వై.సి.వి. సాహిత్య సంస్కారం అపారంగా కల కవి. పాఠక హృదయ సమశ్రుతుల మేళవించగల సత్తా వున్నవాడు. నా ఆశలు సఫలత కాంచకుండానే నన్ను దగా చేసి వెళ్లిపోయారు. నా రసజ్ఞతను సంతృప్తి పరచగల కావ్యాలెన్నో రచిస్తానని నాకిచ్చిన వాగ్దానం నెరవేర్చకుండానే వెళ్ళిపోయాడు! తాను పుట్టి పెరిగిన కడప జిల్లా రైతుల నికృష్ట జీవన రహస్యాలను రసమయంగా వెల్లడిస్తానన్న అతని ఋణం ఎవరు తీరుస్తారో నిరీక్షించవలసే వున్నది.

షట్పదీ రగడలు డెబ్బై రెండు గల యీ పారిజాత కావ్యం పారిజాతాపహరణ మందలి హృద్య వర్ణనలను జ్ఞాపకం చేస్తుంది. వర్తమాన కాలంలో అవన్నీ ఎలా అసంగతాలో కవి కంఠోక్తిగా వెల్లడిస్తూనే వుంటాడు. ఎన్నో హృద్యమైన రచనలు రసపరిపాక మందున్నాయి. వాచవిగా ఒకటైనా ఆశించాలంటే

**పరిగచేలకు నీటి పడియకును పారించు**
**పనిలో నిమగ్నమైపరిపాలకుల కెదిరి**
**నీటి హక్కుల కొరకు సాటి హక్కుల కొరకు**
**కూలి హక్కుల కొరకు కూటిహక్కుల కొరకు**
**కోర్కె దీరగ ప్రజలకూడ దీయగ చాల**
**పని వున్నదీ నేలలో ఇక్కడే**
**సరిపోయే నీ గాలిలో!**

– అన్న బాధ్యత గుర్తించి ఎందుకింత తొందరపడిపోయాడో తలుచుకుంటే గుండె ముక్కలవుతోంది. ఎంత సరళ మోహన శయ్యా సౌందర్యాన్ని సంతరించుకుందో! వై.సి.వి. కావ్య రచనా రీతిని స్థాలీపులాకంగా అందించడానికి పై రగడ చాలు! ఈ కవి అచ్చపు అపరంజి జిలుగుల రంగవల్లికలు కావ్యవీధిలో తీర్చగలిగాడు. కనుకనే నా నివాళుల కర్హుడయ్యాడు. నాలో కొండంత ఆశ కలిగించాడు.

పోరుమామిళ్ళ గ్రంథాలయంలో జరిగిన సంస్మరణ సభలో వై.సి.వి. అభ్యుదయ సాహిత్యోద్యమంలో నిర్వహించిన పాత్ర గురించి సముచితమైన మదింపు చేశారు. నాలుగు దశాబ్దాలుగా, ఆ మిత్రుడు కడప జిల్లాలో అరసం వ్యాప్తికి నిరంతర సేవ లందించాడు. శాంతి కోసం, ప్రజాభ్యుదయం కోసం కవిగా, కథకునిగా, ఉద్యమశీలిగా వై.సి.వి. ఎనలేని కృషి సల్పాడు. "గట్టి గింజలు" కథల సంపుటిలో ఉత్తమ సామాజిక దృక్పథం ప్రదర్శించాడు. భూస్వాములకు వ్యవసాయ కూలీలకు నడుమ సాగే నిత్య సంఘర్షణ సంబంధాలను కళాత్మకంగా చిత్రించాడు. పెత్తందారుల మడత పేచీలనూ, దాష్టీకాలనూ సహజంగా అభివ్యక్తం చేశాడు. సాహితీపరునిగా, వ్యక్తిగా శ్లాఘనీయ పాత్ర నిర్వహించి అందరికీ ప్రియబాంధవుడైన వై.సి.వి. లేని లోటు కడప జిల్లాకే కాదు, అభ్యుదయ సాహిత్యానికి పూడ్చరానిది! అందుకే వై.సి.వి.కి నివాళులర్పిస్తూ అతని సదాశయాలను ముందుకు తీసుకుపోదాం!

❖ ❖ ❖

**తే.గీ. సంప్రదాయపు సాహిత్య సారమెరిగి**
**"అభ్యుదయ కవి" యనుపేర ఆధునికపు**
**కథలు, కావ్యాలు వ్రాయగా గౌరవంబు**
**చిర యశస్సును బొందె వై.సి.వి. రెడ్డి**

**– ఎన్.సి. రామసుబ్బారెడ్డి**



## యన్నీ రామసుబ్బారెడ్డి

# వై.సి.వి. రచనలు

### పద వైశిష్ట్యం - పలుకుబళ్ళు

వై.సి.వి. అచ్చమైన కడప కవి. "కడప గడపలోన కవుల గడపలు మెండు" అని విశ్వాసాన్ని ప్రకటించిన గొప్ప కవి. ఉత్తమ సాహితీవేత్త. సంస్కారగుణం కలవాడు. పేరుకు ప్రాకులాడని పెద్దకవి. పల్లెప్రజల పలుకుబళ్ళను పట్టుకొన్న పరువంగల కవి. సాంస్కృతిక కళలపట్ల అభిమానం, సమభావం కలవాడు. స్నేహానికి పెద్ద పీట వేసినవాడు. కార్మిక కర్షక పక్షపాతి. సోషలిస్టు భావప్రచారకుడు. భేషజాలకు పోని నిజమైన కమ్యూనిష్టు, రెండు గీతల కవిత్వం వ్రాసిన వాణ్ణయినా భుజంతట్టి ప్రోత్సహించే ఉన్నత తత్త్వం గలవాడు. జనం గుండె చప్పుళ్ళు తెలిసిన వాడు. ఏతావాతా వై.సి.వి. కడప జిల్లా చారిత్రక నేపథ్యానికి ప్రతిరూపం.

## వ్యక్తిగతం

వై.సి.వి. అనే యమ్మనూరు చిన్న వెంకటరెడ్డి గారిది లింగాల మండలం బోనాల గ్రామం. లక్షుమ్మ, కొండారెడ్డి గారలు తల్లిదండ్రులు. ఆ రోజుల్లో వారి గ్రామంలో వీధిబడి కూడా లేదు. అందుచేత వారి తండ్రిగారు రామేశ్వరంలోని కవి కొడవలూరి రామచంద్రరాజు గారిని పిలిపించి ఇంటిలో వుంచుకొని వారికి చదువు చెప్పించారు. వారి దగ్గర వై.సి.వి. రామాయణ, భారత, భాగవత గ్రంథాలే కాక కంకంటి పాపరాజు గారి ఉత్తర రామాయణ కావ్యాన్ని చదువుకున్నారు. తెలుగు భాషలో ప్రావీణ్యం సంపాదించడం కోసం ఆ రోజుల్లో విధిగా ఉత్తర రామాయణం చెప్పించుకొనేవారు. ఉత్తర రామాయణ కావ్య పఠనం ద్వారా వై.సి.వి. తెలుగుభాషలో గట్టి పట్టు సాధించారు. అందులోని పద్యాలనేకం వారు కంఠస్థం చేసారు. ఆ తర్వాత వారు ఇంగ్లీషు చదువులు చదవడానికి గుత్తి చేరుకున్నారు. అక్కడ వారికి చక్రాల నరసింహారావు గారితో స్నేహం యేర్పడింది. వారి సహచర్యంలో పద్యాలు వ్రాయడం ప్రారంభించి గుత్తి చరిత్రను వ్రాసారు. రెండు మూడు అష్టావధానాలు చేసారు. తదుపరి మెట్రిక్యులేషను పరీక్ష వ్రాయడానికి మద్రాసు చేరి ప్రైవేటుగా ఆ పరీక్ష వ్రాసి పాసయ్యారు. 1947లో నూతనంగా ప్రారంభించిన కడప ప్రభుత్వ కళాశాలలో ఇంటర్మీడియెట్‌లో చేరారు. ఆ సమయంలో వారికి గల కావ్య పఠనాసక్తి సాహిత్యంపై ఉన్న అభిమానంతో దుర్భాక రాజశేఖర శతావధాని, గడియారం వేంకటశేషశాస్త్రి, పుట్టపర్తి నారాయణాచార్యులు వంటి ఉద్ధండ కవి పండితుల పరిచయం కల్గించుకున్నారు అది వారి కవిత్వానికి మార్గదర్శకమైంది.

తండ్రి గారి మరణం, వివాహం, కుటుంబ వాతావరణం, వై.సి.వి. చదువుకు ఆటంకం కల్గించాయి. అందువల్ల 1948లో కడప జిల్లా బోర్డు (నేటి జిల్లా పరిషత్)లో గుమాస్తా ఉద్యోగంలో ప్రవేశించారు. కొంత కాలానికి కోడూరు బదిలీ అయ్యారు. అది వారి కవితాలతకు మారాకు తొడిగినట్లయింది. అక్కడ వారికి వేదం వెంకటకృష్ణ శర్మ, నారు నాగనార్య, ఉప్పలపాటి వెంకట నరసయ్య, మైనంపాటి వెంకటసుబ్రహ్మణ్యం మొదలైన సాహితీవేత్తల పరిచయంతో తెలుగు ప్రబంధాలను లోతుగా అధ్యయనం చేశారు. అది వారికి కావలసినంత పద సంపదను చేకూర్చి పెట్టింది. కవిత్వంలో వన్నె చిన్నెలు పోవడానికి దారి తీసింది. అప్పుడే వారు 1950లో 'తొలకరి చినుకులు' అనే ఖండకావ్యాన్ని ప్రచురించారు. ఆ తర్వాత సంప్రదాయ సాహిత్యంలో కించిత్ నవ్యత్వాన్ని జోడించి 'మేనక', 'రంభ' వంటి చిరుకావ్యాలను ప్రచురించారు. వినూత్న భావాలతో విలసిల్లే ఈ కావ్యాలను డా॥ సి. నారాయణ రెడ్డి తన పరిశోధన గ్రంథం' ఆధునికాంధ్ర సాహిత్యం'లో ఉదహరించారు.

తదుపరి వై.సి.వి. గారి దృష్టి అభ్యుదయ సాహిత్యం వైపు మళ్ళింది. దానిక్కారణం బాల్యంలో వారి మనసులో ముద్రపడిన కమ్యూనిష్టు పార్టీ ప్రభావం, అధికార భాషా సంఘం మాజీ అధ్యక్షులు గజ్జల మల్లారెడ్డి సావాసం, మాజీ పార్లమెంట్ సభ్యులు వై. ఈశ్వరరెడ్డి, మాజీ శాసనసభ్యులు శ్రీ యన్. శివరామిరెడ్డి గార్ల వ్యక్తిత్వాలు. నిషేధం ఉన్న రోజుల్లో పార్టీ సాహిత్యాన్ని జొన్నచేలల్లో చాటుగా చదువుకునేవారు. అంతే కాక 'రహస్యం' అనే పత్రికకు సహసంపాదకత్వం చేసారు. పార్టీపై ఆయనకున్న అభిమానమది. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే వై.సి.వి. జిల్లా శాఖలో ఒక కీలక సభ్యులయ్యారు. అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారు. అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షులుగా అనేక మహాసభలు నిర్వహించారు. సదస్సులు యేర్పాటు చేశారు. అనుబంధ సంస్థలైన ఇస్కస్, ప్రపంచ శాంతి సంఘం, ప్రజా నాట్యమండలి వంటి సంస్థల మనుగడకు ఊపిరి పోశారు. కడప జిల్లాలో అభ్యుదయ సాహిత్యం వేళ్ళూనుకొనడానికి వై.సి.వి. చేయూతనిచ్చారు. సాహిత్య సభలకు సామాన్య ప్రేక్షకుడుగా వచ్చేవారాయన. వై.సి.వి. మనసుగలయట్టి మంచివారు. వేదికలెక్కి ఉపన్యాసాలివ్వాలని తపన ఉండేదికాదు. వారికి గల సాహిత్య పిపాస మాటల్లో చెప్పలేం. వారి కావ్యాలపై పిహెచ్.డి., యం.ఫిల్, చేసిన వారున్నారు.

డిస్ట్రిక్టు బోర్డు స్థానాల్లో జిల్లా పరిషత్తులు ఏర్పడ్డాయి. నేనూ, మలిశెట్టి జానకిరాం, వై.సివి. గారి సహ ఉద్యోగులుగా అందులో పనిచేశాం. వారి సాన్నిహిత్యంతో మేమూ రచయితలమయినాం. తరచు జరిగిన బదిలీల వేట్లకు వారు 1968లో ఉద్యోగానికి రాజీనామా చేసారు. యుగసాహితి నేతృత్వంలో రా.రా. గారి సంపాదకత్వంలో వెలువడిన 'సంవేదన' త్రైమాసిక సాహిత్య పత్రికకు ప్రచురుణకర్తగా వ్యవహరించారు.

## సాహిత్యం

ఇటీవల ఉన్నత విద్యావంతులైన వై.సి.వి. పుత్రులు ప్రతాపరెడ్డి, ప్రభాకరరెడ్డి, పురుషోత్తమరెడ్డి గారలు వారి రచనలన్నింటిని ఒక సంపుటిగా ప్రచురించి సాహిత్యలోకానికి పరిచయం చేశారు. పంచిపెట్టారు.

వై.సి.వి. గారి రచనలలోని విశేషాలు కొంత లోతుగా తడిమితే తప్ప వాటిలోని భావపుష్టి, భాషాసౌష్టవం, పదప్రయోగాల విన్యాసం పలుకుబళ్ళు. సామాజిక దృష్టి కవగతం కావు. వరుసగా ప్రచురించిన వారి పుస్తకాలను స్థాలీపులాకన్యాయంగా పరిచయం చేయడమే ఈ వ్యాసం ముఖ్యఉద్దేశ్యం.

వై.సి.వి. గారి తొలి రచన 'తొలకరి చినుకులు' ఖండకావ్యం. సమాజంలో వారి హృదయపుటంచులను తాకిన కొందరి వ్యక్తుల గురించి వ్యవస్థ తీరు గురించి చెప్పిన వాస్తవ విషయాలు ఇందులో చోటు చేసుకున్నాయి. ఆనాటి ఉపాధ్యాయుని గురించి చెప్పిన ఈ పద్యం గమనించండి.

**తే.గీ. మట్టిగోడల కొట్టము నట్టనడుమ**
**కఱకు కంకరనేలపై - కలముపట్టి**
**ప్రాత బల్లలపై నీదు - బ్రతుకు కొఱకు**
**సేయుదే రక్తదానము - రేయిబవలు.**

ప్రభుత్వ పాఠశాలలు లేని అనేక గ్రామాల్లో గ్రామ పెద్దలు ఏర్పాటు చేసిన పాఠశాలల పరిస్థితి, ఉపాధ్యాయుల స్థితి అది. గతము క్రింద వారు చెప్పిన పద్యం వారి వ్యక్తిత్వానికి ప్రతీక...

**తే.గీ. సర్వసాహిత్యమిదురస - పర్వములను**
**మలయ మారుతవీచికల్ - దెలియ జెప్ప**
**గుప్త సురభిళ గంథమ్ము - గ్రుమ్మరింప**
**కమ్మగా గ్రోలుచుంటిని - గడపునిండ.**

ఇక గ్రామాల్లో రైతులు పంట విత్తనానికి ముందు పొలాన్ని సిద్ధం చేసే తీరును హృద్యంగా వర్ణించారు.

**సీ. పదునైన పలుగుతో బాపటంబొనరించి -**
**కొయ్యకాడలనెల్ల కొల్లనూడ్చి**
**ఇరుసాలు గొఱ్ఱుతో జొరదోలి పైపెచ్చు**
**బారగుంటకతోడబాయజేసి**
**దిబ్బలో నెరువును దిరుగ బైలుకుదోలి**
**వందుమట్టిని బెక్కు బండ్లు దోలి**
**యొకటి మూడింతలొప్పుగా మదిరెలో**
**నెరువుపై మన్నునెంతేని గలిపి**

**తే.గీ. తొలికరించెడు ముంగారు పలుకు చినుకు**
**లందు తోలిరి యెరువు పసందు చిందు**
**లాడ భూమిని సామెన యట్లు జేసి**
**కలకొలంది పొలమ్ము పక్వమ్ము జేసి**

ఇందు సేద్యం చేసే విధానం అలంకారయుక్తంగా వర్ణించారు. అంతేగాక పలుగు, గొఱ్ఱు, బార గుంటక, దిబ్బ, ఎరువు, వందుమట్టి, బండి, మదిరె, మన్ను, తొలకరి, సామెన, కలకొలంది మొదలైన గ్రామీణ రైతులు వాడే పదాలు పరికరాలు పద్యాలలో ఒదిగించారు.

కమ్యూనిష్టు ఆశయాలు జీర్ణించుకున్న వై.సి.వి. దైవం, కర్మ అనే మాటలు తలచనప్పటికి, భారతీయ సంస్కృతికి చిహ్నంగా చింతనాపరమైన ఆధ్యాత్మిక భావాన్ని పోద్రోయలేక పోయాడు. అందుకే

**తే.గీ. రాత్రిబవళులు పని చేయు – రైతువెంట**
**కొండ కోనల తిరుగాడు – కూలివెంట**
**గడుపుమంటకు కష్టించు – బడుగువెంట**
**దేవుడొక్కడు వెన్నంటి – దిరుగునంట**

ఇంకా ఈ 'తొలకరి చినుకుల' ఖండ కావ్యంలో జాలిగొలిపే ఆవేదనము మొదలైన శీర్షికలున్నాయి.

రెండవ కావ్యం మేనక, భరతుని జన్మమునకు మూలమైన శకుంతల తల్లియైన మేనక విశ్వామిత్రులతో సమాగమించే కథ యిందలి ఇతివృత్తం. పురాణ కథకు కొంత భిన్నంగా మేనకయే విశ్వామిత్రుని ప్రేమించిందని చెప్పడం విశేషం. ఒకసారి దేవేంద్రుని సభలో వసిష్ఠ విశ్వామిత్రులు పంతాలకు పోయి మాట్లాడుకుంటున్నపుడు మేనక విశ్వామిత్రుని వాగ్ధాటికి మురిసి వలపుగొన్నదట. అప్పటి నుండి ఆమె నవసి నవసి నాట్యముచే ఇంద్రుని మెప్పులంది 'సెలవొసంగవలె మౌని సేవ జేయ' అని వేడుకొన్నదట. ఒక దెబ్బకు రెండు పిట్టలుగా దేవేంద్రుడు విశ్వామిత్రుని తపోభంగము తన ఆస్థాన నర్తికి కోర్కె తీర్చడము జరుగుతుందని భావించి అనుమతి యిచ్చాడు. తడవుగా మేనక విశ్వామిత్రుని చేరినది. ఆయన తపోదీక్ష చూచి జంకింది. అయినా 'కాము జయింప జాలనని' సాహసించి ఆయన ముందు నిలబడి యిట్లా అనుకొన్నదట.

**తే.గీ. ఏ మహాశక్తి ననుముట్టి – ఇట్లచేసె**
**నామహాశక్తి రక్షించి – యాదరించు**
**నెమ్మదోద్పుడి నా కోర్కె పండించుగాక**
**కలుగు గాకొక్క మేలు నా – వలన భువికి**

భవిష్యత్ సూచకంగా భరతఖండ ఆవిర్భావం ఆమె కారణంగా జరుగుతుందని ధ్వనింపచేశారు.

ఆపైన విశ్వామిత్రునితో మాటలు కలిపిన మేనక 'పంతంబు పట్టి సృష్టికొక సృష్టి యొనరించు ద్రష్ట' వనుచు మిమ్ము వలచినానని పల్కినదట. ఇక దాపరికం లేక పల్కిన పల్కులు అచ్చంగా కడప ప్రజల నిక్కచ్చితనానికి నిదర్శనం.

**తే.గీ. బట్టబయలుగ నిలిచి నా గుట్టు తమకు**
**నప్పనము చేసికొందు – గొండంత పెరిగి**
**యెదదనిండిన యజ్ఞాన – మిదిగొ, దీని**
**మీకరస్పర్శ బుడికి – పుల్మిననుచాలు**

మేనక అంతరంగం ఎట్లా ఉన్నా 'నాలో వున్న అజ్ఞానం తొలగించి నన్ను నీలో చేర్చుకో అని జీవాత్మ పరమాత్మను వేడుకొన్నట్లుగా భావన కలుగుతుంది.' పుడికి బుల్మినను అన్న పద ప్రయోగం యిక్కడ అన్ని విధాలుగా సరిపోయింది.

మేనక కావ్యరచన మొత్తం తేటగీతల్లోనే సాగింది. సమర్థుడైన కవి గనుక వై.సి.వి. చేతిలో తేటగీతలు ధీర గంభీరంగా నడిచాయి.

ఇక విశ్వామిత్రుని సమాధానములో వై.సి.వి. గారు వాడిన గ్రామీణ పలుకుబడులు, సామెతలు రచనకు వన్నె తెచ్చాయి.

**తే.గీ. ఓయమాయకురాల నీవూరకున్న**
**నుండ నీయరు సురలు నిన్నుబ్బజేసి**
**పంపగా వచ్చితివి నా తపంబు జెఱుప**
**బడతి ఆ నీటికీ బేడలుడుక వింక**

ఉబ్బిస్తే ఏ పనయినా చేస్తాదురా అనుకోవడం ఆ నీళ్ళ కీబేళ్ళ వుడకవు అనుకోవడం పల్లెల్లో నేటికీ కద్దు – ఎన్ని అన్నా చివరకు మేనకను అక్కున జేర్చుకుంటాడు విశ్వామిత్రుడు. 'అందులోని రక్తి మధ్యమలోక సిద్ధి' అని ముగిస్తాడు కావ్యాన్ని. ఉక్తివైచిత్రికీ వాక్యం ఒక ఉదాహరణ.

## తర్వాత కావ్యం 'రంభ'...

ఇది కూడ ఒక దేవలోకపు కాంత అంతరంగ కథనమే. రంభ దేవేంద్రుని సభలో నాట్యకత్తె. ఆమె కుబేరుని కుమారుడైన నలకూబరున్ని వలచింది. రావణుని చేత బలాత్కరింపబడింది. కంకంటి పాపరాజు గారి ఉత్తర రామాయణ కావ్యంలోని రంభారావణ సంవాద ఘట్టాన్ని కావ్యంగా మలిచారు వై.సి.వి. ఇందులో తేటగీతులకు తోడు వాడిన వృత్తాలు వీరి పద్యరచనా పాటవానికి భావపుష్టికి తార్కాణాలు.

**మ॥ ఒకనీలోత్పల మంతరంగ రసరాగోద్విగ్నయై వచ్చి, న**
**ర్తకియై యౌదలయూచి, లోపలిమరందస్నిగ్ధ సౌరభ్య, భా**
**వకషాయత్వము వెల్వరింప, రస భావం బెంత యుప్పొంగెనో**
**సకలోర్వీతలమెల్ల వెల్లిగొనె! జ్యోత్స్నా మంద హాసంబులన్**

ఇది ప్రాచీన ప్రసిద్ధ కవుల పద్యపోకడలను స్ఫురింపజేస్తోందిగదా!

మోహితుడై రంభను గూడు యత్నములో రావణుడు పల్కిన పల్కులు విజ్ఞతతో గూడుకొన్నట్లున్నాయి. 'నేనొక లక్ష్యసిద్ధికి పనిన్గొని చుట్టుచుంటి, నాపై నిలువెల్ల నిందలు, నెపంబులు, శాపములన్నవైన' అని అంటాడు అది పూర్వ జన్మసంస్కార లక్షణాన్ని తెలియజేస్తుంది. అంతే కాదు.

ఉ॥ **కారణ కార్యమిశ్రితమెకా జగమంతయు, నందు జన్మ సం**
**స్కారము పారజూచిన విచారము లెందుకుబుట్టు, సంతతా**
**చారపరాయణత్వము యశస్కరమేయగుగాక, భోగముల్**
**కోరగరానివౌనె సమకూడవె నాకును భోగభాగ్యముల్**

ఇది రావణుని తెలిసిన మూర్ఖత్వానికి ప్రతీకగా చెప్పవచ్చు. కథాంశం ప్రాచీనమైనా భావుకతలో ఆధునికతను ప్రవేశపెట్టి రచించిన కావ్యం 'రంభ'.

## నాల్గవది - సిందూర రేఖ

ఒక పల్లెలోని పెద్దరైతు కుటుంబ గాథా చిత్రానికి కావ్య గౌరవం కల్గించారు వై.సి.వి. పరిణామ క్రమంలో ఒక సంవత్సర కాలం అనుభవించిన ఐశ్వర్యాలను, ఈదిన కష్టాలను రైతు సేద్యగాని చేత చెప్పించాడు. వారి కావ్యాలలో 'సిందూరరేఖ' కలికితురాయి. కావ్యరచనకు నేపథ్యంగా వారు చెప్పుకొన్న మాటలివి.

"1953లో విద్వాన్ విశ్వంగారి 'పెన్నేటి పాట' నేనూ, రా.రా. ఇంకా కొంతమంది సాహితీమిత్రులు కలిసి చదువుకొన్నాం. పెన్నేటి పాటలోని తీయని ఊట నీటిలో సేద దీరినాం. సంతోషం పట్టలేక విశ్వంగారికి ఒక ఉత్తరం వ్రాయడం జరిగింది. నా అభినందన లేఖకు వత్తాసునిస్తూ రా.రా. కూడా సంతకం పెట్టినాడు. – పల్లెపట్టుల జన జీవితాలకు సంబంధించిన గాథను పద్య కావ్యంగా వ్రాయాలని అనుకొన్నాను. 1953లో సిదూరరేఖకు కృత్యాద్యవస్థ ప్రారంభమైంది. అంతేకాక నిర్మల కర్మ దీక్షా పరతంత్రులు, ఈ వ్యవస్థలో ధ్వంసమవుతున్నారని విశ్లేషిస్తూ వ్యవస్థ మారాలన్న కాంక్షను దృఢంగా చెప్పడం జరిగింది."

ఇది వై.సి.వి. మనసుకు నచ్చినపని. అయితే కృత్యాద్యవస్థ నుండి కావ్యం బయటపడడానికి 30 సంవత్సరాలు పట్టింది. మూలపడేసిన అసంపూర్తి కావ్యాన్ని 1981లో మిత్రులకు వినిపించి 1982లో కొంత సాగించి ముగించారు. ఇంకా పొడిగిస్తే అతుకులబొంత అవుతుందని కుదిమట్టంగా పూర్తి చేసినానని చెప్పినారు.

పూర్తి గ్రామీణ వాతావరణాన్ని ప్రతిబింబింప చేస్తూ వ్రాసిన కావ్యమైనప్పటికీ యిందులో ప్రబంధాలకు తీసిపోని వర్ణనలున్నాయి. అవి కావ్యంలో యిమిడి పోయాయి. కొత్త అందాల్ని చేకూర్చాయి.

వసంతం వచ్చింది కోకిల కుహు కుహు ధ్వనులతో పల్లె పరవశిస్తోంది. భూమిపై వర్షాగమన సూచనలు కన్పించాయి.

ఉ॥ **క్వణదణు కంకిణీకలిత కాంచన కాంచికలాపలాటపాటలై**
**గౌనెనన తెక్కలార్చి యెదకోపులవంచి, యనంగ సూక్తముల్**
**వినుమనె, పంచమస్వరమును విన్పె, వినోదపు కోకిలమ్మ, ము**
**క్కున రసరాగ విభ్రమపు కోర్కుల యూర్మికలల్లి హాయిగా**

అది ఒక విధంగా ఉంటే వసంత బాలిక.

**తే॥ రావియాకులమొలనూళ్ళు - మావిచిగురు**
**ముక్కునత్తులు నొక్కుల - సొక్కుమల్లె**
**మొగ్గ కమ్మలు యనటాకు నిగ్గుపైట**
**జిలుగు హరితాంబరములు వాసించె బయల**

ప్రకృతిలో లభించే ఆభరణాలు ధరింపజేసి వసంతబాలికను అలంకరించిన తీరు హృద్యంగా ఉంది కదూ.

వై.సి.వి. గారికెందుకో తేటగీతలపై మక్కువ ఎక్కువ. అవి మైనపుముద్దలా ఒంపుసొంపులు పోతాయి వారి చేతిలో. సమర్థతకు దీటుగా నిలుస్తాయి.

ఆ సమయంలో ఆ ఊరిలో

**తే.గీ. యాలపాటల కూనిరాగాల తోజు**
**లంత కంతకు చిక్కనలై యనూహ్య**
**భావమై పదచందమై ప్రాచిరోచి**
**కలక బారెను సానురాగమ్ములగుచు.**

యాలపాటలు అనగా వ్యంగ్య పదాలతో స్వయంగా కూర్చుకొని రాగయుక్తంగా పల్లె ప్రజలు పాడే పాటలు. పదాలు దొరకని చోట్ల కూనిరాగాలు తీస్తారు. తోజు అంటే ఆర్భాటం. ఇప్పటికీ ఆర్భాటంగా పెళ్ళిళ్ళు, ఉత్సవాలను తోజుగా ఉన్నాయి అని వర్ణిస్తుంటారు పల్లె ప్రజలు. చిక్కనలై అనగా బంధములై.

అప్పుడు ఏరువాక వచ్చింది. రైతులు సేద్యపు పనులు ప్రారంభిస్తారు. ఎద్దులను కాడికి కట్టి పూజించి పొలాలకు బయలుదేరుతారు. అందరిలాగే రెడ్డి దగ్గర సేద్యగాడు కూడ కాడిగట్టి బయలుదేరాడు.

**తే.గీ. చేని మునుకున పన్నకం - బూని కాడి**
**మేడి సవరించి పగ్గాల - తోడ, ముల్లు**
**గట్టె వలచేతగైసేసి - మట్టె కోడె**
**ములుగపై సైగచేసితి - మేడిబట్టి**

**చేనిమునుకు :** పొలం మొదలు; పన్నకంబూని; ఇంటి దగ్గర బయలుదేరేటప్పుడు కాడిపై మడకబెట్టి దానిపై మేడిగట్టి బిగిస్తారు. అప్పుడు నగ భూమి ఆనుకుంటుంది. పొలం చేరగానే నగను కాడిపై బిగించి మడక కఱ్ఱు భూమిపై ఆనుకొనేటట్లు సరిచేసి బిగిస్తారు. అప్పుడు భూమిలోనికి మడక కఱ్ఱుపోతుంది. ఈ పనిని పన్నకంబూనటమంటారు. తర్వాత మడకపై బిగించిన మేడి కఱ్రపట్టుకొంటారు. అప్పుడే ఎద్దుల పగ్గాలు ఎడమ చేతపట్టుకొని కుడిచేత ఎద్దుల అదలించడానికి ముల్లుగట్టె పట్టుకుంటారు. (సన్నని వెదురు కఱ్రకు ముందువైపు మొనదేలిన సన్న చీల బిగిస్తారు అది ముల్లగట్టె.)

**మట్టికోడె :** మట్టిరంగు మచ్చలు గలకోడె (వయసులో ఉన్న ఎద్దు).

**ములుగు :** ఎద్దు తోక పైభాగపు దరిదాపు ప్రాంతం. అక్కడ సైగ చేస్తే ముందుకు నడవాలని గుర్తు. అది ఎద్దు భాష.

అంతలో తొలకరి వచ్చింది. ఆ వెంటనే మొలకల పున్నమి వచ్చింది. సమయానికి వర్షాలు వచ్చినందుకు సంతోషించిన పల్లె ప్రజలు పండుగ బాగా చేసుకున్నారు. పిండి వంటలు కాల్చుకున్నారు. సేద్యగానికి కూడ అవి పెట్టారు. అప్పుడు సేద్యగాడు అంటాడు.

'అంబలికి బదులు నిప్పట్టులారగించి
సేద్యమునకేగుచుంటిమి.'

**అంబలి :** గంజి, నిప్పట్లు; అత్తరాస; అరిసె; అప్పచ్చు. ఆయేడు వర్షం దండిగా పడింది. ఆ వర్షం పడిన తీరు కవిగారు వర్ణించిన తీరు అత్యద్భుతం.

**మ॥ ఒక విల్లందిన మేటి ధీరుని శరంబొక్కక్కటే నేల చొ**
**చ్చుక పోదూసినయట్లు వానబడె నిస్తుల్యప్రభాధారగా**

భావం, భాష, ధార ముప్పేట గొలుసులా అతికిపోయాయి. కురుక్షేత్రములో అంపశయ్యపై ఉన్న భీష్ముడు త్రాగడానికి నీరుకోరగా అర్జునుడు బాణం నేలలో దింపి నీటిని పైకి తెప్పించాడు. సరిగ్గా అదే వేగంతో పై నుండి పడిన వర్షపు ధార నేలలో దూసుకుపోయింది అంటాడు వై.సి.వి. అప్పుడు రైతులు...

**చ॥ అదనున పెద్దగా పదనులయ్యె నికేమని గొఱ్ఱుకఱ్ఱుకున్**
**పదపద మంచు కమ్మరిని బట్టి సపాటుగకఱ్ఱుకఱ్ఱుకున్**
**పదనుగ కల్లువాదెరల పట్టిరి ముట్టిరి వడ్లదాలికై**
**పదుగురు పర్వులెత్తిరి శుభంకరమౌ జడిగాల పూజకై.**

**అదను :** తగిన సమయము; పదును; మడకలోతు తడిపిన వర్షము. తక్కువైతే గొఱ్ఱుపదను అంటారు. సమయానికి తగినంత వర్షం పడింది. గనుక తొలకరిలో సేద్యం చేసిన పొలాల్లో విత్తనం వేయడానికి. **గొఱ్ఱు :** విత్తనం వేయడానికి ఉపయోగించే సాధనం. **కఱ్ఱుకున్ :** ఇనుపకడ్డీలకు **కమ్మరి :** ఇనుప పరికరాలు చేసేవాడు దగ్గరకు చేరి **కఱ్ఱు కఱ్ఱుకున్ :** ప్రతి కడ్డీకి **పదనుగా :** పదను వచ్చేటట్లుగా, **కల్లు వాదెర** అనగా మంచి నికార్సయిన సారాయి, కల్లు దగ్గర అగ్గిపుల్ల గీస్తే భగ్గున మండుతుందట. అట్లాగే కఱ్ఱుమొన భూమికి తగలగానే లోతుకు పోయే విధంగా పదును పెట్టించారట. వాటిని ముట్టి చూచారట. ఆ విధంగా గొఱ్ఱు సిద్ధం చేసుకొనడానికి రైతులు వడ్లదాలికి పరుగులు తీసారట. **వడ్లదాలి :** వడ్రంగి, ఇనుప పరికరాలు తయారు చేసే స్థలం. దాలి అంటే కాల్చిన ఇనుప కడ్డీలను కొట్టేందుకు ఉపయోగించే ఇనుప ముద్ద. ఈ విధంగా సిద్ధమైన రైతులు జడిగాల పూజలకు ప్రయత్నం చేసారు. **జడిగం** అంటే విత్తనాలు వేసేందుకు

గొఱ్ఱుపై బెట్టి ఉపయోగించే కొయ్యదొన్నె లాంటిది. క్రింద వరకు నాలుగు లేదా ఆరు రంధ్రాలు గల వెదురుబొంగులు ఉంటాయి. ఆరు లేదా నాలుగు కాళ్ళ గొఱ్ఱుకు జడిగానికి మధ్య వెదురు బొంగులు ఉంచి జడిగం బిగించి పూజ చేసి అందులో విత్తనాలు వేస్తూ పోతే గొఱ్ఱు భూమిలో దిగుతూ ముందుకు సాగుతూ ఉంటే వాటి సాళ్లలో విత్తనాలు పడతాయి. ఇది విత్తనం చేసే విధానం. చూచిన వారికి బాగా అర్థం అవుతుంది. ఇప్పుడు ఇది చేసి చూపిస్తే లేదా బొమ్మల రూపకంగా చూపిస్తేగాని చాలమందికి అర్థం కాదు.

ఆ దినాల్లో గ్రామాల్లో సేద్యగాళ్ళకు అన్నం పెట్టిన తీరు వారు తిన్న విధానం, తిండి పదార్థాలు వివరించిన విధానం వై.సి.వి. గారు మాత్రమే చెప్పగలిగినవి.

**తే.గీ. అన్నపూర్ణలు మాయూరి - ఆడవారు**
**ముద్దుకూళుళ్లు సంగటి ముద్దలెత్తి**
**కడుపునిండుగ బెట్టిరి - గట్టిపెరుగు**
**గడ్డలను విరిచి చేతుల కందినంత**

పెరుగు గడ్డలను విరిచిపెట్టుడమంటే ఈనాటి వారు నమ్మరు. అంతేగాదు

**తే.గీ. కంచెలను దొండ దోసలు మించి కాసె**
**బీదబిక్కికి కూరల బెడదలేదు**
**జొన్నపిసుకుళ్ల దోసెలు - నున్నపప్పు**
**చాలా తింటిమి మొలత్రాళ్లు సళ్లు చేసి**

చేల చుట్టూగల గట్లపై అల్లుకొని కాసే దొండ, దోసకాయలు పేదలకు కూరగాయల కరువు తీర్చిందట. ఇక జొన్న పిసుకుళ్ళ దోసెలు అంటె జొన్న కంకులు కోతకొచ్చే సమయంలో కొన్ని కంకులను తెచ్చి చేతులతో నలిపి జొన్నలను(పచ్చిపచ్చివిగా ఉంటాయి) తీసి కొంత నీరు, బెల్లము, ఉప్పు కలిపి సొద్ద సాపట్లు చేస్తారు. అందులోకి ఆదరువుగా కాటుకమాదిరి నున్నగా యెనిపిన కందిపప్పు వేస్తారు. పైన నేయి వేస్తారు. ఇది చాలా రుచికరం. పుష్టికరం. అచ్చం కడప వంట - వాటిని దండిగా తినడం వల్ల మొలత్రాళ్ళు బిర్రు అవుతాయి. కాబట్టి ముందుగానే వాటిని వదులు చేసుకొని తిన్నారట. ఇలాంటి గ్రామీణ ఆహార ప్రియత్వం పల్లెల్లో కూడా నేడు కరువే.

సిందూరరేఖ కావ్యం నిండా కావలసినన్ని ప్రజల వాడుక పదాలు, సేద్యపు పనిముట్ల వివరాలుమనకు దర్శనమిస్తాయి. ఇది ఒక ప్రత్యేక పదకోశం లాంటిది. ఒకనాటి వేంకటేశ్వర విశ్వవిద్యాలయ వైస్-ఛాన్సలర్ ప్రొ॥ జి.ఎన్. రెడ్డి నిఘంటు నిర్మాణంలో వై.సి.వి. గారి సహకారం తీసుకొన్నారు.

సాహిత్య పిపాసువుల తలలూపింప జేసేవి వై.సి.వి. దక్షిణా నిలము 'రాయబారము', 'సెలకన్నె' కావ్యాలు. మాత్రా ఛందస్సులో సాగిన దక్షిణా నిలము సాహిత్య సంగీత మధుర సాగరమే. కమ్మచ్చులో సాగే తీగలా గేయాలన్ని ఒక మూసలో పోసి తీసిన చిక్కని ధారలా సాగిన రచన. ఎత్తుబడికి ముగింపుకు

తేడా లేని పదగుంఫనం కలిగి మరందడోలికలూగించి మనసుల లోగోనే రచన. శాస్త్రరీత్యా దక్షిణపు గాలి ఆరోగ్య దాయకమని చెబుతారు. అందుకే గృహాలకు దక్షిణం వైపు కిటికీలను అమర్చడం. ఇది లయబద్ధమైన సంగీతానికి సుళువుగా ఒదిగే రచన.

పుట్టపర్తి వారి శివతాండవ ఛాయలున్నప్పటికీ, ఆ రచనలోని ఉద్ధృతం ఇందులో లేదు. అది ఇక్కడ అవసరం కూడా కాదు. అందుకే ఇది ధీర గంభీర ముద్రలతో సాగింది. పిల్లతెమ్మెరలను మెల్లగా అలలు అలలుగా సాగుతూ చిరుసవ్వడులు చేసే నదీ ప్రవాహం దక్షిణా నిలము. ఉదాహరణకు:

**పలుకు పలుకున చిత్రకలికించితంబుగా**
**జగతియంతయు నొక్క సంసారమని పల్కు**
**కరుణా రసాత్ములౌ కవి పుంగవులు మెచ్చ**

**అలసముగ దక్షిణా నిలము మా గడ్డపై**
**వీచెనమ్మా! యిపుడె**

ఇందులో కవులపై గౌరవభావాన్ని వెల్లడించారు. ఇక కడప జిల్లా ప్రజల సాహిత్య దివ్యచక్షువులైన గడియారం, పుట్టపర్తి వారి పరువాల తలపుల వాకిళ్ళు తెరుస్తూ

**కవిలోక భావ సంక్రాంతి తెరలెత్తికొన**
**శివరమ్య భారత ఎలాస్యముల నింప**
**చలితాభ్యుదయ నాట్యసంకేతముల బెంప**

**అలసముగ దక్షిణా నిలము మా గడ్డపై**
**వీచెనమ్మా! యిపుడె**

వై.సి.వి. కార్మిక కర్షక పక్షపాతి. వారి పక్షాన వకాల్తాకు నిలిచే వాడు. తగువైన చోట్ల వారి వూసులెత్తక రచన ముగింపు చేయడు.

**పొద్దస్తమానమ్ము పొలములో పొరలాడి**
**యెండ వానల కోర్చి బండ కష్టము చేసి**
**పులినొప్పులకు నీరసిలు కూలి ప్రజలకై**

**అలసముగ దక్షిణా నిలయము మా గడ్డపై**
**వీచెనమ్మా! యిపుడె**

అసటలో నిద్రపోతే కొంత నిద్ర తర్వాత శరీరంలో నొప్పులు సలుపుతాయి. అవి పులినొప్పులు. ఇటువంటి పదాలకు సరియైన అర్థాలు దొరకవు. అవి అనుభవ ఊహలు. తాను నమ్మిన సిద్ధాంతాలకు, ఆశయాలకు అనుగుణంగా 'కార్మికుల కర్షకుల కనుగొంచు – రాబోవు కాలమ్ము మీదె నిక్కమ్ముగా ననిపల్కి – అలసముగ దక్షిణా నిలము – మా గడ్డపై వీచెనమ్మా యిపుడె' అంటాడు వై.సి.వి.

బాల్యం నుండి రైతు జీవన విధానాలను, కష్టాలను గుర్తెరిగిన వాడవడం వల్ల వై.సి.వి. గాసగాడు అనే కూలీని దృష్టిలో ఉంచుకొని కష్టాలకడలిలో మునుగుతూ లేస్తూ చిక్కి శల్యమైన వాని మూగవేదనను 'రాయబారము' పేరుతో గేయకావ్యంగా రచించారు. తొలికోడి కూసింది మొదలు రైతురెడ్డి గారింట్లో గాసగాడు అలుపుగా ఉన్నాలేనట్లు చేసిన బరువు పనులన్ని వరుసగా పొందు పరిచారు ఈ గేయాలలో. ఇది సాహిత్యంలో ఒక విచిత్ర వీచిత.

**అర్ధాకలి డొక్కలలో**
**నలము కొనగ కలవరమున**
**నట్టు బలిసినట్టు బలిసి**
**నట్టి బీళ్ల వట్టి సేద్య**
**మునకై యారరుగనట్టి**
**మోట మడక కోటేరున**
**చీకటిలో చేనుజేరి**
**చిరుగంటల మెడవారుల**
**కలనాదము తోడురాగ**
**కొండ్రవేసి సాలుబట్టి**
**ఉన్నదుక్క పెల్లలలో**
**ఉగ్గబట్టి మేడిబట్టి**
**దున్ని దున్ని చేన బలిసి**
**నట్టి నట్టు సంపినాడు**
**ఒక చేలో నట్టు జంప**
**ఒక కావ్యము వ్రాసినట్టు**

ఇట్లా వ్రాయడం ఒక్క వై.సి.వి. గారికే చెల్లింది. నట్టు అనగా పొలాలలో (బీడు) అడ్డ దిడ్డంగా పెరిగి వేళ్ళూనుకొని బలిసిన అడ్డాకు తుంగ లాంటి మొక్కలు. వీటి మధ్య పైరు పెరగదు. పంటరాదు. అందుకే దాన్ని చంపడానికి గాసగాడు చేసిన ప్రయత్నం. ఇందులో వర్ణితము ఆరారు : ఆరు తరిగి పోని, పదునుపోని. ఇక అన్నిటి కంటే వారు అన్న 'ఒక చేలోనట్టుజంప, ఒక కావ్యము వ్రాసినట్టు' అన్న భావం ఊహకందని గొప్ప విషయం. కావ్యం వ్రాసే కష్టం కవికి తెలుసు. నట్టు జంపే కష్టం రైతుకు తెలుసు.

సాహిత్యంలో వై.సి.వి. గారికి గల గాఢ పరిచయానికి, భావ ప్రకటనలోగల నేర్పుకు ఉదాహరణగా నిలిచేది 'సెలకన్నె కావ్యం'. ఇది ఒక ప్రకృతి భావ శకలం. సెలకన్నె రాకడను ప్రశ్నిస్తూ సుదూర సుందర మనోహర దృశ్యాలను మన కళ్లముందుంచారు. ఇదిప్రవాహంలా సాగిన రచన. ఇందులో గంభీరత లేదు. కొత్త అందాలతో తెలియని ఊహల దారుల్లో తలపుల వాకిళ్లు తెరిచిన నవజవ్వని వలపు వయ్యారాల దృశ్యం సాక్షాత్కారిస్తుంది.

**ఒకచోనొక మెలపుతలపు**
**ఒకచోనొక భావరూప**
**మొకచోనొక లయవిభూతి**
**ఉన్నతికై ప్రాకువారి**
**కున్నత లక్ష్యాల జూపె**
**ఆద మరచి నిద్రించే**
**యజ్ఞానికి నీ పలుకుల**
**కర్థము సాధితమౌనా?**
**ఐనా నినదించుట**
**వేమమ్మా సెలకెన్నె**
**ఎక్కడ నుండి రాకడ**

సమాజాన్ని మెల్లగా చల్లగా నిద్రలేపే ప్రయత్నం చేసారు ఈ గేయాల్లో. ఇందులో సెలకన్నె ఉరుకులు, పరుగులు తీయలేదు. పరువాలు సంతరించుకుంటూ, పంచుకుంటూ పద్ధతిగా నడిచింది.

నిండుగా దరులొరుసుకొని గలగలా కొండవాగులా ప్రవహించి వాఃపూరమై నిలచిన సాహిత్య బిందు సమాహారం వై.సి.వి. 'వైజయంతి' కావ్యం. ఇది ఒక తీయని ఊహ. వైజయంతి శ్రీ మహావిష్ణువు కంఠముపై నిత్యం వాడని సువాసన వీడని సుమమాల. ఇది కావ్యానికి ధ్వని.

కథ పెద్దన రచించిన మనుచరిత్ర కావ్యనాయకుడైన ప్రవరాఖ్యునికి సంబంధించినది. ప్రబంధ సాహిత్యంపై వై.సి.వి.కి గల పట్టు రసపట్టుగా సాగిన రచన వైజయంతి. పాదలేపన మహిమవల్ల హిమవత్‌పర్వత సానువుల దర్శించి వరూధిని అందించే స్వర్గసుఖాలు వదలుకొని ఇంటికి చేరిన ప్రవరాఖ్యుని మందలింపుగా ప్రశ్నించడం ఇందులోని ముఖ్యాంశం. ఇది మాత్రా ఛందస్సులో సందులేని సుందర పదాలతో సాగిన రచన.

**పరలోక సౌఖ్యములు పాటించి – సాధింప**
**తపము జెసెడి మునుల తత్త్వమ్ము చలియింప**
**నృత్యమ్ము వెలయించి – విలువగల కాలమ్ము**
**చూచునోపిక లేక – శుద్ధ శోత్రియుడవై**

**జంజాటములనందుకో – ప్రవరాఖ్య – తలుపు తట్టితివెందుకో!**

పై లోకాల సౌఖ్యాలనాసించి తపస్సు చేసే మునుల ప్రయత్నాలకు భిన్నంగా సంసార లంపటం వదల్లేక అవకాశం జారవిడుచుకొనడం అని అంటున్నాడు ప్రవరాఖ్యుడు. ఆ తర్వాత మాయా ప్రవరుడు 'సుఖమన్నయాలోక సుఖము గాదని – వట్టి వేదాంతముల నేర్పి వేదనల పాలయితి' నని చెప్పి వరూధినిని పొందుతాడు. ఇందులో కూడా సామాజిక స్పృహను ప్రస్ఫుటింప చేసే చరణాలు

**రాజ పీఠికల రత్నాలవలె మురిసి**
**రాచమేడకు మొదలి – రాతి కంబమువోలె**
**ఉండి పోయతిమీపో – ఉదర పోషణకు మా**
**ఉనికి జనతకు నచ్చునా**

అని ప్రశ్నార్థకం విసిరాడు.

సాహితీ పరిమళాలు దశ దిశల వ్యాపింప చేసిన వై.సి.వి. చివరి కావ్యం 'పారిజాతం'. ఇది దేవలోకంలో పూలచెట్టు. ఆ చెట్టు పూలు తెచ్చి శ్రీకృష్ణునికిచ్చి అంతఃపురంలో కలకలం రేపాడు నారదుడు. పారిజాత కథని ప్రబంధంగా తీర్చిదిద్దిన వాడు ముక్కు తిమ్మన లేక నంది తిమ్మన. ఆయన కావ్యంలోని కథాంశం గురించి నేరుగా తిమ్మనతో సంభాషిస్తాడు కవి. 'మీ తోడ నడిచి వత్తును స్వామి – చూసి చెప్పిన తీరు చూచి వచ్చిన తీరు – మా వారి కెరిగింతునూ' అని పారిజాత కవితారీతులను వుటంకిస్తాడు.

ఇంకా తిమ్మన కవి ఆనాడు నీవు దేవలోకపు తీరు కామధేనువు పాల గడ్డ పెరుగు సద్దిగట్టిన వైనం – మునులు భుజించిన విధానం సత్యభామకు చెప్పితివి గదా. ఇది శ్రీకృష్ణ నారదుల తోడుగా నిలిచిన సంఘటనగదా అని అంటూనే వై.సి.వి. మాటల తూటాలు పేల్చినాడు. కావ్యములో అక్కడక్కడా పేదల పక్షాన వకాల్తా తీసుకున్నాడు.

**మానసోల్లాసమున – మంచి మాటలుకొన్ని**
**పదబంధముల చేర్చి – పద్యాలుగా గూర్చి**
**తియ్యతియ్యని – తేనె తెట్టెలను భుజియించి**
**తేపినట్టుల జేసి, ఊపిరాడ గనీక**
**ఊదరింప గొట్టితివి – ఉత్తపుణ్యానికే**

**జనతచచ్చిరితిండికి – పేదలను – వంచించుటలు దేనికీ.**

సాహితీ ప్రపంచంలో గడదేరిన కర్షకుడు వై.సి.వి. ప్రయోగాల ఆనుపానులెరిగినవాడు. ఏ పదం, ఏ ప్రయోగం, ఏ విరుపు ఎక్కడ అవసరమో అక్కడ వాడగల నేర్పరుడు. ఉక్తివైచిత్రి గలవాడు. పలుకుబళ్ళకు నిఘంటువులాంటివాడు. వీరి కావ్యాలకు ప్రత్యేక నిఘంటువు కూరిస్తే తప్ప వాటిలోని స్వారస్యం మనం జుర్రుకోలేం.

'పారిజాతం' కావ్యానికి అనుబంధంగా మాత్రా ఛందస్సులో ఆంధ్రాభ్యుదయము – శీర్షిక క్రింద ప్రచురించిన గేయాలు సుప్రసిద్ధాలు. తెలుగు తేజఃశకలాలు. మచ్చుకు ఒక గేయ భాగాన్ని తీసుకొని భావం వివరించుకుంటే వై.సి.వి. పద విన్యాసం మనం అర్థం చేసుకోగలం.

**అందాల చందాల కుందానిలాభమై**
**అమల వాఃపూర సర్వాంగీణమై లేచు**
**జలదాంగనల తోడ శర్వరీరసఝురుల**

**గలగలని శబ్దముల కమనీయ భావముల**
**భారతము హరివంశ పర్వసంకాశమ్ము**

**కుసుమించివాసించెరా – రసలోక – విసరమై భాసించెరా**

ఆకాశమును గప్పుకొన్న గాలి శ్రీగంధముతో కూడి సౌభాగ్యవంతమై అందాలతో ఒప్పినట్టుగా, నిర్మల జలాశయములో సర్వాంగాలు పులికితం కాగా తుళ్ళింతలిడు జలదాంగనలపోలి, కొండచెరియలోని సైరిక ప్రదేశములనుండి పసిడి కాంతులు విరజిమ్ముతూ దూకే సెలయేళ్ళ గలగలా చేయు శబ్దముల సొరు కలిగి కమ్మనైన భావ పరిమళాలు వెదజల్లే భారతము అన్ని విధాలుగా హరివంశమునకు సమానమై పుష్పించి సురభితమై సాహిత్య లోకములో బాగా విస్తరించి ప్రకాశిస్తోంది.

పై శీర్షిక క్రింద ప్రచురించిన ఇతర గేయాలు కూడా మకుటాయమానాలే.

ఆంధ్రాభ్యుదయము తర్వాత గేయాలు కడప గడపలు, ఇందులో కడప జిల్లా వాస్తవ స్వరూపము అనగా వ్యక్తుల స్వభావము ప్రకృతి వనరులు, సాహిత్యం మనకు స్థూలంగా అవగతమౌతాయి. జిల్లా ప్రజల గురించి చెబుతూ...

**సరళ సుందర భావ సారమ్ము పరుషమై**
**చంపి చత్తురు క్రోధసాగరమ్ముల చిలికి**
**అర్థ గౌరవము మాకందు భాగ్యము లేదు**

**కష్ట జీవిత గాథలై – సమకూడె – కడప గడపల బాధలై**

పౌరుషానికి 'మంగళి కత్తులు మింగడం' అనే సామెత ఇక్కడ సరిపోతుంది. అంతే కాక తప్పుడు మాటలు మాట్లాడేవారిని సహించే గుణము లేని వారు కూడా. అట్లాగే

**మొగలిరేకుల వంటి మగవారు మా వారు**
**విషసర్పములచోటులై – ఉన్నారు – వెగటు పుట్టిన బాటలై**

అని చెప్పడం వై.సి.వి. గారి భావనా పటిమకు నిదర్శనం. సూటిదనానికి, చురుకు స్వభావానికి మొగలి రేకులు ఉదాహరణ. మొగలి రేకుల అంచులు పదునుగా ఉంటాయి. మత్తెక్కించే సువాసనలు వెదజల్లే వాటి పొదలలో పాములు నివసిస్తుంటాయి. అటువంటి లక్షణాలు గల వారు మా మగవారు అని ఆడవారు చెప్పే మాట ఇది.

ఇక చల్లని మాటల్లో చెప్పిన క్రింది చరణాలు చదవండి:

**తలిరాకుజొంపముల తాళ్ళపాకలలోన**
**ప్రభవించి ప్రవచించె భక్తులకు, రక్తులకు**
**అవ్యయానందముల నందించు కవి కోకి**
**లాలాపములకు చల్లని సౌఖ్యగీతికల**

అని అన్నమయ్యను గురించి చెప్పిన మధురమైన భావన గుండెలను కదిలిస్తుంది. అవి సర్వ మానవులకు సౌఖ్యములు కూర్చేవట.

**పంచభూతముల సంభావనలనందుకొని**
**పంచనదులీగడ్డ ప్రవహించి, పలవించి**
**పారిపోతూన్నాయి పలుకరించే దిక్కు**
**లేదన్న భావములు లేత తరగలదోప**

అని అనడంలోను

**నల్లరేగడి గడ్డ పర్రెలుగ చీలినది**
**వర్షానికై మొగము వాచి కలకాలమ్ము**
**జనపదుల గుండెలకు సౌఖ్యమే కరువయ్యే**

**కుందనపు నడిగడ్డలూ – పండవిట**
**కుందు పరిసరభూములు**

అని అనడంలో వై.సి.వి. గారి సామాజిక దృష్టి, సాంఘిక వ్యవస్థ, ప్రజలపై వారికున్న మమతానురాగాలు వ్యక్తమౌతాయి. చెప్పుకుంటూ పోతే ఇట్లాంటివి ఎన్నో?

వయసు పైబడుతున్న తరుణంలో వై.సి.వి. కథలు వ్రాశారు. అవి వారి జ్ఞాపకాల పొరలలో కొన్ని దశాబ్దాలు నిక్షిప్తమై పెల్లుబికిన వాస్తవ సంఘటనలు. కథా సాహిత్య ప్రపంచంలో వాటిని 'స్కెచ్'లు అనవచ్చు. నిబద్ధమైన కథా శిల్పం, శైలి. వాటిలో మనకు కనపడవు. కానీ వారు వ్యక్తీకరించిన విభిన్న మానవ చిత్రాలు ప్రస్తుత సమాజంలో కూడా తటస్థమౌతాయి. ఈ కథల్లోని వ్యక్తులు మంచివారు. మనసున్నవారు, అమాయకులు కొంతవరకు అభిజాత్యం, అభిమానం కలవారు. సున్నిత మనస్తత్వం ఉన్నవారు. ఇంకా చెప్పాలంటే వారు కష్టాల కడలిలో కొట్టుమిట్టాడుతున్నప్పటికి నిబ్బరంగా జీవించినవారు. గత శతాబ్దపు ప్రథమార్థంలోని సాంఘిక జీవన విధానంలో కపటంలేని ప్రవర్తన వంచనకు సులభంగా లొంగిపోయే అమాయకత్వ లక్షణాలు ప్రస్ఫుటమౌతాయి. ఈ కథా సంఘటనలు వారి జీవితానికి ముడిపడినవిగా తోస్తాయి. వ్యాసం విస్తారం కాకుండా కొన్ని కథలు విశ్లేషించడం జరుగుతుంది.

ఈ కథలకు వై.సి.వి. 'గట్టి గింజలు' అని పేరు పెట్టారు. అందుకు తగినట్లు వాస్తవానికి దగ్గరగా ఉన్న ఈ కథా వస్తువులు స్థిరమైనవి. ఆషామాషిగా తీసివేసేవి కావు. అందుకే గట్టివి. సానుభూతి అనుకోండి, మార్పునకు అనుకోండి ఇందులో సగం కథలు మహిళలకు సంబంధించినవి. ఈ కథల్లో కాల్పనికత కనిపించదు. ఇవి పల్లె ప్రజల కొత్తగా నాగరికతకు అలవాటుపడి పట్నం ఎగబడ్డవారు పడిన పాట్లు ఇందులో కనిపిస్తాయి. మాయ కప్పని నాగరికతకు అద్దం పడుతూ ప్రకృతి దృశ్యాలను యథాతథంగా చిత్రీకరించినట్లు తోస్తుంది.

మంచివాళ్ళు కథలో మొగడు వదిలి వెళ్ళిన తరువాత గంగమ్మ కూతురు పెద్దదైంది. మనసులో ఏదో కోర్కెతో (మంచిదేనని వై.సి.వి. అంటారు). ఒక పెద్ద మనిషి పిల్ల పెండ్లికి సాయం చేయనా అంటాడు. అందరూ నన్ను మోసం చేసారు. మోసాలతో, దగాల్తో విసుగెత్తి పోయినాను బాబూ! మమ్మల్ని ఇలా పనిపాటలు చేసుకోనివ్వండి అని మొండిగా చెబుతుంది గంగమ్మ. ఇది ఆనాడు గ్రామములో చెల్లుబాటు అయిన కథ. ఇక నగునోములోని మీనాక్షి కూడా అంతే. మీరెప్పుడు వచ్చినా నన్ను చూడకుండా పోవద్దు. ఈ జీవితానికి ఇంత మాత్రం ఊరట విధిగా కావలసి ఉంది. అని అంటుందే కాని నన్ను మీ దగ్గర చేరనివ్వండి అని అనదు. ఇట్లాగే చావకూడని సరస్వతి లోకం ఓడిపోయిందని పార్వతమ్మ, మంచితనంలోని అంకమ్మ, దిక్కులేని బ్రతుకులోని రాజమ్మ మొదలైన స్త్రీ పాత్రలు ఆభిజాత్యానికి, అభిమానానికి ప్రతీకలు. చదువు సంధ్యలు లేకున్నా ప్రక్కదారులు తొక్కని స్త్రీమూర్తులు ఆదర్శ ప్రాయులు.

ముందే చెప్పుకున్నట్లు వై.సి.వి. కార్మిక,కర్షక పక్షపాతి. 'గుడిసె దక్కింది', 'దొంగ బరిగొడ్లు', 'కుట్రల్లో కూలోడు', 'ఇంకానా పనిరానోళ్ళు,' 'గట్టిగింజలు', 'ఐదురూపాయలు' లాంటి కథల్లో వాస్తవ సామాజిక స్థితి, సాంఘిక పరిస్థితి మనకు స్థూలంగా కనిపిస్తాయి. పల్లెలో కొంత నాగరికత చోటుచేసుకొని మాయమాటలు చెప్పి అమాయకులను దోపిడి చేసే పెద్దమనుషులు కనిపిస్తారు. చదవడం కంటే ఈ కథలు ఊపుడు కథలుగా వింటున్నప్పుడు ఆనందం కలుగుతుంది. గుండె ద్రవిస్తుంది. జాలితోపాటు కించిత్ నవ్వు కూడా వస్తుంది. వై.సి.వి.గారు పై పద్ధతిలో కథలు వ్రాసారు. అవి వారి నోట విన్నప్పుడు పరమాద్భుతం అనిపించింది. ఆటుపోటుల జీవితములో నిండుకుండలా చెదరని గుండె నిబ్బరముతో మసలిన వై.సి.వి. ధన్యుడు.

## ముగింపు

పద్మశ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులు 'ఈ కవికి తీవ్రమగు భావనా బలమున్నది. ఆ భావమును వెల్లడింపగల సునిశతమై వణుకాడని వాక్కును కలదు' అన్నాడు.

మహాకవి గడియారం వేంకటశేషశాస్త్రి వై.సి.వి. కవిత్వంలో సన్నివేశముల నడుమ నిండుగా పృష్ఠించిన కవితా విన్యాసమంతయూ చక్కని ధారతో నిండు కూర్పుతో తీయని పలుకబడితో అందమైన అలంకారముతో భావనాసుభగమై ఔచితీ విలసితమై హృద్యముగా పరిమళించినది అని వక్కాణించాడు.

సొదుం గోవిందరెడ్డి గారి దృష్టిలో వై.సి.వి. 'కవితకు వేషం వెయ్యలేదు ఆవేశం హద్దులు దాటలేదు అందుకే రివ్వున దిగుతోంది హృదయములోకి'.

సంప్రదాయ కవిత్వంలో ఆధునికత ప్రవేశపెట్టి కడప జిల్లాలో అభ్యుదయ సాహిత్యోదమానికి ఊతగా నిలచిన వై.సి.వి. రెడ్డి 1989లో అభ్యుదయ రచయితల సంఘ మహాసభల రెండవరోజు అక్టోబరు 8వ తేది 'ఈ ఉద్యమం ఆగదు'? అంటూ చివరి శ్వాస విడిచారు. వారు లేకున్నా వారి రచనలు వారి కీర్తిని చిరస్థాయి చేస్తున్నాయి.

❖ ❖ ❖



**వల్లంపాటి వెంకటసుబ్బయ్య**

# కథా సాహిత్యంలో రాయలసీమ చైతన్యం

స్థానిక జీవితం పట్ల ప్రేమా, స్పష్టమైన అభ్యుదయ సామాజిక దృక్పథం, మాండలికం మీద అధికారం పుష్కలంగా కనిపించే మరో స్కెచ్‌ల సంపుటం 'గట్టిగింజలు'. రచయిత అభ్యుదయ కవిగా ప్రసిద్ధుడైన వై.సి.వి. రెడ్డి. ఇతడు భారతీయ కమ్యూనిస్టు పార్టీతోనూ, అభ్యుదయ రచయితల సంఘంతోనూ జీవితాంతం సంబంధం కలిగిన కార్యకర్త. భావకవిగా ప్రారంభించి అభ్యుదయకవిగా పరిణామం చెందిన గొప్ప భావుకుడు. ఇతడు 1980–82 సంవత్సరాల మధ్య వివిధ పత్రికల్లో ప్రచురించిన కథల్ని 'గట్టిగింజలు' అన్న పేరుతో 1982లో సంపుటంగా ప్రచురించాడు వై.సి.వి. రెడ్డి. అదే సంవత్సరం 'సిందూర రేఖ' అన్న పద్యకావ్యాన్ని కూడా పూర్తి చేశాడు. ఈ కావ్యం మొదటి సారిగా 2004లో 'వై.సి.వి. రచనలు' అన్న అతని సర్వ రచనల సంపుటంలో అచ్చయింది. 'సిందూర రేఖ' రాయలసీమకు 'పెన్నేటి పాట' వంటి దర్పణం. దీనివెనక 'పెన్నేటి పాట' ప్రేరణ కూడా ఉందని కవి చెప్పుకున్నాడు. 'సిందూర రేఖ' అచ్చమైన రాయలసీమ వ్యవసాయ కావ్యం. ఒక గాసగాడు (పాలేరు) ఉగాది నుంచి ఉగాది వరకూ వ్యవసాయ జీవిత కార్యక్రమాలను వర్ణించటం ఈ కావ్యంలోని వస్తువు. వ్యవసాయ వృత్తికి సంబంధించిన పదజాలమూ, రాయలసీమ మాండలిక పదజాలమూ ఈ కావ్యంలో ఎలాంటి కృత్రిమతా లేకుండా చోటుచేసుకున్నాయి. స్థానిక జీవితాన్ని గురించిన ఎరుకా, వ్యవస్థను గురించిన అభ్యుదయ దృక్పథమూ మరింత స్పష్టంగా 'గట్టిగింజలు' లోని స్కెచ్‌లలో కనిపిస్తాయి. 'దొంగబర్రెగొడ్లు' , 'కుట్రల్లో కూలోడు', 'ఇంటి మాదిగోడు', 'ఆస్తి విలువ' మొదలైన స్కెచ్‌లలో ఈ అంశాలు బలంగా వ్యక్తమయ్యాయి.

ఈ సంపుటిలోని స్కెచ్‌లలో 'ఐదురూపాయలు' అన్నది ప్రసిద్ధమైంది. కరువునూ, వర్ణసంబంధాలనూ, వర్గ సంబంధాలనూ ఈ స్కెచ్ చక్కగా చిత్రిస్తుంది. బాలిరెడ్డి అన్న భూస్వామికి లచ్చిగాడు అన్న వ్యవసాయ కూలీ ఐదు రూపాయలు బాకీ (ఇది రెండు రూపాలేనన్న అభిప్రాయం కూడా ఉంది) ఉన్నాడు. వాడు తన పనికి రాకుండా మరొకరి పనికి వెళ్ళినందుకు బాలిరెడ్డి వాణ్ణి చావగొడతాడు. బాలిరెడ్డి శత్రువైన గంగిరెడ్డి లచ్చిగాని చేత బాలిరెడ్డి మీద కేసు పెట్టిస్తాడు. రెండు పార్టీల మధ్య గ్రామం ఉడికి పోవటం ప్రారంభిస్తుంది. రెండు పార్టీలవారూ మొలలో పిడిబాకులతో తిరగటం మొదలు పెట్టారు. యారముట్లు (వ్యవసాయ పనిముట్లు కాదు – ఆయుధాలు), తుపాకులు దిగుమతి అయ్యాయి. ఇంతలో ఈ పార్టీలతో ఎలాంటి సంబంధమూ లేని గురప్ప అన్న పేదవాడు ఖూనీ అయ్యాడు. రాజీ చేసుకొమ్మని పైవాళ్ళు చెబితే 'ఇంతదూరం వచ్చినాం.

వాళ్ళో, మేమో నాశనం కావటం జరగనీ' అని ఇరుపార్టీలవారూ అంటున్నారు. చిన్న రైతులు చితికిపోతారు. కక్షిదార్లు లాయర్లనీ, పోలీసుల్నీ మేపలేకపోతారు. చివరకు రెండు కుటుంబాల స్త్రీల చొరవ వల్ల రాజీకి అంగీకరిస్తారు. ఉత్తరోత్తరా తిరిగి కొట్లాటలు రాకుండా ఉండటం కోసం బాలిరెడ్డి కూతుర్ని గంగిరెడ్డి మేనల్లుడికిచ్చి పెళ్ళి చేయాలనుకుంటారు. తప్పుడు సాక్ష్యాలు చెప్పిస్తారు. పోలీసులు, లాయర్లు సహకరిస్తారు. వాళ్ళిద్దరి మీదా ఉన్న కేసులు పోతాయి. కానీ 'లచ్చిగాని కేసేమయిందో ఎవరికీ తెలియదు'. రామకృష్ణారెడ్డి కథలోలాగే వై.సి.వి. రెడ్డి కథలోనూ వెలిగేవాళ్ళు పెద్దలే, నలిగే వాళ్ళు పేదలే.

వై.సి.వి. రెడ్డి కథలు శిల్ప విషయంలో కాస్త ముతకగా ఉంటాయనటానికి సందేహం లేదు. దాదాపు అన్ని కథల్లోనూ నాటకీకరణ ఉండదు. రచయితే మొత్తం కథ చెబుతాడు. పాత్రలకు మనస్తాత్వికమైన లోతు కూడా ఉండదు. కానీ పుష్కలమైన జీవితం ఉంటుంది. జీవితాన్ని ప్రేమించే వారు వాటిని ప్రేమించక తప్పదు.

❖ ❖ ❖



**ఒక సమావేశంలో ప్రసంగిస్తున్న వై.సి.వి. రెడ్డి, ప్రక్కన జానమద్ది హనుమచ్ఛాస్త్రి**



గజ్జల మల్లారెడ్డి

# నా స్మృతిపథంలో వై.సి.వి.

నాచిననాటి నేస్తము వినమ్రుడు వై.సి.వి. రెడ్డి ప్రౌఢిమన్
తోచిన రీతిగాక సరితూచగ శక్యమె సాహితీలతన్
పూచిన పువ్వులట్లు వలపుల్ పచరించి తెలుంగు గడ్డపై
వీచిన దక్షిణానిలపు వీవన లాతని కావ్యసంపదల్

విజ్ఞత యమ్మనూరు చినవెంకటరెడ్డి మరొక్క రూపమే
ప్రజ్ఞ మనోజ్ఞమై అతని పద్యములందనవద్య శైలిలో
ప్రాజ్ఞులు మేలుమేలనగ భాసిలుచుండును ఎప్పుడేనియున్
అజ్ఞులవజ్ఞసేయ దరహాస విభూషణ భూషితుండగున్

వై.సి.వి. రెడ్డి పూర్తి పేరు యమ్మనూరు చిన్న వెంకటరెడ్డి. వీధిబడిలో స్వగ్రామమైన బోనాలలో చదువుకుంటున్నప్పటి నుంచీ నాకు అతనితో పరిచయం ఉంది. మా ఊరికి ఆ ఊరు దగ్గరయినందున చుట్టపు చూపుగా కలిసేవాడిని. అది మేమిద్దరం ఛందస్సులో తొలి పాఠాలు నేర్చుకుంటున్న రోజులు. ఆ తరువాత నేను రాజకీయాల్లోకి వై.సి.వి. హైస్కూలులో గుమాస్తా ఉద్యోగంలోకి వెళ్ళాము. నేను ఆ తర్వాత అనగా 1943 నుంచి 1959 వరకూ సాహిత్యరంగానికి దూరం అయ్యాను. కానీ, అతను మాత్రం ఆనాటి నుంచి మొన్నటివరకూ కవితా రంగం నుంచి వైదొలగలేదు. 'తొలకరి చినుకులు'గా వై.సి.వి. తొలికవితలు అచ్చయినప్పుడే పువ్వు పుట్టగానే పరిమళించినట్లు అతని కవితా కుసుమాలు సువాసనలు వెదజల్లాయి. ఆ తర్వాత మేనక, రంభ, కావ్యాలు బాగా ప్రసిద్ధికెక్కాయి. 'దక్షిణానిలం' మాత్రాచ్ఛందస్సులో సుకుమార భావాలతో హృద్యమైన శైలిలో నడిచింది. 'రాయబారం' గ్రామీణ పేద ప్రజల జీవితాల మీద స్వానుభవాలు వ్యక్తం చేసింది. అయితే వై.సి.వి. మొగ్గు ఎప్పుడు ప్రబంధ కవిత్వంమీదికే ఉండేది. నాతో, రా.రా.తో వ్యక్తిగతంగా ఎంతసన్నిహితంగా ఉన్నా భావాల్లో మాత్రం అతని దారి అతనిదే. కడపలో 'సవ్యసాచి' పత్రిక నడుస్తున్నప్పుడు ఆ తర్వాత 'సంవేదన' అవతరించినప్పుడు కూడా వై.సి.వి. ధోరణిలో చెప్పుకోదగిన మార్పేమి లేదు. కడప జిల్లాలో ఆయనకు బాగా సన్నిహితులయిన కవులు రా.రా. అన్నగారైన రాచమల్లు భైరవ కొండారెడ్డి, రాజంపేట తాలూకాకు చెందిన నారునాగయ్యలు, పుట్టపర్తి నారాయణాచార్యులు, వై.సి.వి.కీ,

మా అందరికీ అభిమాన మహాకవి. ఇటీవలి సంవత్సరాల్లో వై.సి.వి. కమ్యూనిస్టు పార్టీకి సన్నిహితులై అభ్యుదయ రచయితల సంఘంలో ముఖ్యులయ్యారు. అయినప్పటికీ కవిత్వంలో మాత్రం ఆయన భావకవితా ప్రాబల్యం నుంచి, వాసనల నుంచీ బయటపడలేదు. అంత మాత్రాన వై.సి.వి. కవిత్వాన్ని తక్కువగా చూడనవసరం లేదని నా అభిప్రాయం.

వై.సి.వి. మంచి భావుకుడు. అందరితో సర్దుకునిపోయే మంచి మనిషి, స్నేహశీలి. ఎన్నో సందర్భాల్లో నాతో రా.రా.తో ఆయన విభేదించేవారు. మా విమర్శలకు నొచ్చుకునేవారు. అయినా మా స్నేహానికి ఎప్పుడూ అవరోధం కలుగలేదు. ఇటీవల రా.రా. స్మృతికి నివాళు లర్పించే సభలో వై.సి.వి.ని కలిశాను. రా.రా.తో మా సంబంధాల గురించి మాట్లాడుకున్నాము. ఇంతలోనే స్మృతుల్లో మిగులుతారని అనుకోలేదు. చాలా రోజులుగా ఉన్న గుండెజబ్బు జిల్లా అభ్యుదయ రచయితల మహాసభను జయప్రదం చేయడం కోసం పడిన నిర్విరామ శ్రమ ఫలితంగా తిరగబెట్టి అతని జీవితాన్ని బలి తీసుకుంది. అన్ని వర్గాల మన్ననలనూ, అభిమానాన్ని పొంది, తుది క్షణం వరకూ అభ్యుదయ రచయితల ఉద్యమంలో కృషి చేసిన వై.సి.వి. ధన్యజీవి. ఆయన స్మృతి అందరికీ ఉత్తేజం కలిగిస్తూ ఉంటుంది. కడప జిల్లా అ.ర.సం.లో ఆయనలేని లోటును ఎవరూ పూడ్చలేరు. వై.సి.వి. మృతితో నేను ఒక బాల్యమిత్రుడినీ, ఆత్మీయుడినీ కోల్పోయాను.

❖ ❖ ❖

**తే.గీ.** **అభ్యుదయ భావ మూర్తియై యలరువాడు**
**యువకవులకండయైనిల్చు కవన గురుడు**
**కీర్తి కందూతి యెఱుగని గీష్పతితడు**
**ఘనుడు వైసివి విజ్ఞుడు విమతయశుడు**

**తే.గీ.** **కావ్యముల విమర్శింపగ కావ్యములనె**
**అల్లి చూపెను వైసివి ఉల్లమలర**
**రంభ, మేనకన్ భువికి సంరంభమొప్ప**
**బంచి పాత్రోచితత్వము తెలియ నిలిపె**

**– పి. సుబ్బరాయకవి**



ఆచార్య కేతు విశ్వనాథ రెడ్డి

# ఉద్యమ దక్షిణా నిలుడు

పుట్టపర్తి వాత్సల్య పూర్వకంగా ప్రస్తావించే సమయాల్లో 'వాడు మన వైసీవి' యుగసాహితి, అరసం మిత్రులు ఆత్మీయంగా సంబోధించే వేళల్లో 'వైసీవి'. ఇతరేతర కడప సాహిత్య జీవులు స్నేహ పూర్వకంగా పరామర్శించే సందర్భాల్లో 'వైసీవి రెడ్డి'. వయస్సులో గౌరవార్హులందరి లాగానే వైసీవి 'అన్న' కూడా.

కడప జిల్లా పులివెందుల తాలూకా బోనాల గుట్టల మధ్య బోనాల అనే మెట్ట గ్రామంలో పుట్టిన వైసీవి చదివింది హైస్కూలు చదువు. అది ఇంగ్లీషు చదువుల లెఖ్ఖ. కానీ ప్రాచీన సాహిత్యాన్ని గట్టిగా చదువుకున్నాడు. గ్రామీణ జీవితాన్ని, మాండలిక భాషనూ పుక్కిట పట్టుకున్నాడు. కడప సాహిత్య చరిత్ర, కడప మాండలిక విషయంలో వైసివి పరిశోధకులకు ఒక పట్టుకొమ్మ.

పాత తరం సంప్రదాయ కవులు వైసీవి సాహిత్య వ్యక్తిత్వంలోని సంప్రదాయాన్ని మెచ్చుకునేవారు. పుట్టపర్తి వైసీవి పట్ల చూపిన వాత్సల్యానికి ఒక కారణం ఇది. 50వ దశకంలో అచ్చ తెనుగు కావ్యాలు రాసిన నారునాగనార్యకు వైసీవి గొప్ప మిత్రుడు. రాళ్ళపల్లి వైసీవి ఖండకావ్యం రంభను మెచ్చుకున్నాడు. కడపలోని పండిత కవి షేక్ బుడాన్ సాహెబ్, స్వప్న శీతాచలకర్త రాచమల్లు భైరవ కొండారెడ్డి, రైతు కవి చంద్రశేఖర్ రెడ్డి, అవధానం చంద్రశేఖర శర్మ, జానమద్ది హనుమచ్ఛాస్త్రి వంటి వారికి వైసీవి ఇప్పుడూ మిత్రుడూ.

కొత్తతరం వారి దృష్టిలో వైసీవి భావకుడు. మనస్వి, నలుగుర్నీ పోగేసి సాహిత్య సభలూ, గోష్ఠులూ ఏర్పాటు చేయించే సందడి మనిషి; మంది మనిషి యుగ సాహితికి సంవేదన ప్రచురణ కర్త. అరసంకు ఉద్యమం మనిషి; ఏరకంగా అయినా సరే అరసానికి ప్రచారాన్నీ, ప్రాచుర్యాన్నీ తీసుకురావాలని తపన పడిన ఒక మంచి కార్యకర్త; ఒక పెద్ద దిక్కు.

కడపలోని  చాలామందికి వైసీవి వివిధ రూపాల్లో అంటే రైతుగా, ఉద్యోగిగా, కూపర్ ఇంజన్ల షాపు యజమానిగా, ప్రచురణ కర్తగా, కమ్యూనిస్టుపార్టీ కార్యకర్తగా, సాహిత్య ఉద్యమ కారుడుగా, కవిగా, కథా రచయితగా, మంచి మాటకారిగా, గొప్ప స్నేహశీలిగా ఒక సమన్వయ వాదిగా కన్పించి ఉండవచ్చు. ఏ రూపంలో ఎవరికి కన్పించినా వైసీవి అసలు సిసలు సాహిత్య జీవి. ఆజన్మాంతమూ జానపద సరళి స్వభావాన్ని పోగొట్టుకోలేక పోయిన భావుకుడు. అందువల్లనే నేమో ఆత్మాభిమానం కారణంగా జిల్లా పరిషత్తు హైస్కూలులో

చేస్తున్న క్లర్కు ఉద్యోగానికి పదేళ్ళ తర్వాత రాజీనామా చేశాడు. సేద్యంలో బాగుపడలేదు; వ్యాపారంలో చితికిపోయాడు. ఈ అటుపోట్లకు తట్టుకుని 1970 ప్రాంతాలనుంచీ పూర్తిగా ఉద్యమం మనిషి అయ్యాడు. ఇంట్లో ఎన్నెన్నో ఎంతెంతో డబ్బు ఇబ్బందులు పడినా మందిలో నవ్వుతూ, మందిని పోగేస్తూ, మంది మధ్య జీవిస్తూ, అరసం నిండు సభలోనే గుండెపోటు వచ్చి కన్ను మూశాడు.

అరసంలోకి ప్రత్యక్షంగా రాక ముందు రంభ, దక్షిణానిలం, సెలకన్నె అనే ఖండకావ్యాలను రాశాడు. వాటిలో పద్యఛందస్సునూ, మాత్రాఛందస్సునూ అవలీలగా వాడాడు. సుకుమార భావవ్యక్తీకరణకూ, పదలాలిత్యానికీ పేరు పొందాడు. ఆ తర్వాత గాసగాడి ఇక్కట్లను రాయబారం కావ్యంలో పాడారు. గట్టిగింజలు కథలను రాశాడు. వైసీవి సాహిత్య కృషిని స్థూలంగా అంచనా వెయ్యాలంటే, రాయలసీమ ఆధునిక మవుతున్న సంధి దశలో ప్రాచీనాధునిక భావాల ఘర్షణ వైసీవి సాహిత్యంలో కన్పిస్తుందనీ, మొగ్గ అభ్యుదయ భావాలపట్ల ఉందనీ చెప్పవచ్చు. వైసీవి సాహిత్య వస్తువులోనూ, వాటి రూపాల్లోనూ ఈ ఘర్షణే కన్పిస్తుంది.

ఈ ఘర్షణ ఒక కొలిక్కి రాలేకపోయింది. అభ్యుదయ సాహిత్య సృష్టిని తగినంతగా చేయలేకపోయాడు. కానీ అభ్యుదయోద్యమానికి వైసీవి చేసిన సేవ గణనీయమైంది. మందీ మార్బలం ఎక్కువగా ఉన్న ఇతర సాహిత్య సంఘాల కంటే, కడపలో ఆధునిక సాహిత్య భావాల వ్యాప్తికి అరసంను ఒక పటిష్టమైన వేదికగా రూపొందించటానికి వైసివి చేసిన కృషిని తక్కువ అంచనా వెయ్యలేం. అరసం ప్రచురణలకూ, అరసం సభల నిర్వహణకూ ఎప్పుడూ అగ్రభాగాన ఉండేవాడు. నలుగుర్నీ కలుపుకొని రావాలని ఆరాటపడేవాడు. ఆ దిశగా ప్రయత్నాలు చేసేవాడు. ఈ విషయంలో జాతీయోద్యమ కాలంలోని పాతతరం స్వభావం వైసీవీది.

దక్షిణానిలం కర్తగా వైసీవి కాల్పనికుడు. ఉద్యమకర్తగా తాను ఉద్యమ దక్షిణానిలుడు, దక్షిణానిలం లాగా ఆహ్లాద స్వభావంతో, అందరినీ అలరించే తత్త్వంతో.

❖ ❖ ❖

ఊహ, ఉపజ్ఞ, ఉత్సాహము, ఉద్వేగము గల కవికి కవితావస్తువును ప్రకృతి స్వయముగ ప్రత్యక్షమొనర్చును. దాని నాకళింప కలవాడే ఉత్తమ రచయిత కాగలడు. ఈతని అద్భుత భావాంబర వీధిని కవితాకుమారి స్వచ్ఛందముగ విహంగమవిహార మొనర్చుచు రసికజనానంద బంధురమగుట కడుంగడు ప్రశంస్యము.

**– విద్వాన్ వేదము వేంకట కృష్ణ శర్మ**



వై.సి.వి.రెడ్డి కుమార్తె
శకుంతల
అల్లుడు ఆర్. నాగారెడ్డి



శకుంతల
పెద్ద కుమారుడు
దివాకర్ రెడ్డి, భార్య సౌజన్య
మనుమడు నితీష్ రెడ్డి



శకుంతల
చిన్న కుమారుడు
మధుకర్ రెడ్డి, భార్య శాంతి
మనుమరాలు శర్వాణి



వై.సి.వి. రెడ్డి పెద్ద కుమారుడు ప్రతాప్ రెడ్డి కుటుంబసభ్యులు నళినీకాంత్ రెడ్డి, తన్మయి రెడ్డి, విజయలక్ష్మి, తులసి, ప్రతాప్ రెడ్డి, అనయ్ రెడ్డి, దియా, ధీమంత్ రెడ్డి సింధూర, రజినీకాంత్ రెడ్డి



**ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి**
అరసం రాష్ట్ర శాఖాధ్యక్షులు
9440222117

# అభ్యుదయ రచయిత వై.సి.వి. రెడ్డి

## 1. వై.సి.వి. రెడ్డి గారు - నినాదం

ఒక్కొక్క రచయితను తలచుకోగానే మనకు కొన్ని వాక్యాలు వెంటనే స్ఫురిస్తాయి. కందుకూరి అనగానే 'కన్యాశుల్కము నరమాంస విక్రయము' అనే మాట గుర్తుకు వస్తుంది. గురజాడ అనగానే 'దేశమును ప్రేమించుమన్నా' అనే మాట గుర్తుకు వస్తుంది. గుర్రం జాషువ అనగానే 'కసరిబుసకొట్టు నాల్గు పడగల హైందవ నాగరాజు' అనే మాట గుర్తుకు వస్తుంది. ఈ క్రమంలో వైసివి రెడ్డి అనగానే మనకు 'కడప గడపలలోన కవుల గడపలు మెండు' అనే మాట గుర్తుకు వస్తుంది. ఇది 'పారిజాతం' కావ్యంలోని 'కడప గడపలు' కవితలోనిది. ఆయన ఈ మాట అనడంలో అనౌచిత్యమేదీ లేదు.

నిజమే ప్రాచీన కాలంలోనూ, ఆధునిక కాలంలోనూ కడప జిల్లా నుండి కవులు అధికంగానే వచ్చారు. నాచన సోముడు, తాళ్ళపాక కవులు, మొల్ల, అల్లసాని పెద్దన, రామరాజభూషణుడు, సంకుసాల నృసింహకవి, అయ్యలరాజు రామభద్రుడు, వేమన, పోతులూరి వీరబ్రహ్మం మొదలయినవారు కడప జిల్లా వారే. ఆధునికకాలంలో వావిలికొలను సుబ్బారావు, జనమంచి శేషాద్రి శర్మ, గడియారం వేంకటశేషశాస్త్రి, దుర్భాక రాజశేఖర శతావధాని, గజ్జల మల్లారెడ్డి, సి.వి. సుబ్బన్న, అనంతపురం జిల్లా నుంచి వెళ్ళి అక్కడ స్థిరపడిన పుట్టపర్తి నారాయణాచార్యులు, నారు నాగనార్య మొదలైన వారు ఆ జిల్లావారే. ఆపదుగులో ఒక ముఖ్యమైన పోగు వైసీవి రెడ్డి గారు. సొదుం జయరాం, కేతు విశ్వనాథ రెడ్డి, పి. రామకృష్ణ, కుప్పిరెడ్డి పద్మనాభరెడ్డి వంటి కథా రచయితలకు సమకాలికుడు వైసీవి రెడ్డి.

## 2. వై.సి.వి. రెడ్డి గారి జీవితం

వైసీవి రెడ్డి 1926 మార్చి 26న కడప జిల్లా బోనాల గ్రామంలో ఒక వ్యవసాయ కుటుంబంలో లక్ష్మమ్మ, కొండారెడ్డి దంపతులకు జన్మించారు. 1989 అక్టోబర్ 8న అభ్యుదయ సాహిత్యసభ నిర్వహిస్తూ కడపలో కన్ను మూశారు. అరవై మూడున్నరేళ్ళు జీవించారు. కొడవలూరి రామచంద్ర రాజు ఆయనకు బాల్యంలో గురువు. ఆయన దగ్గర ప్రాచీన తెలుగు సాహిత్యం అధ్యయనం చేశారు. తర్వాత గుత్తిలో ఆర్. వీరయ్య, జయదేవ శర్మ, కృష్ణమూర్తి వంటి టీచర్ల దగ్గర ప్రైవేట్ చెప్పించుకొని, ఆ తర్వాత మద్రాసులో సుబ్రహ్మణ్యం ఎడ్యుకేషనల్ ట్యుటోరియల్ కాలేజీలో చేరి 1947లో మెట్రిక్యులేషన్ చదివారు. ఆ తర్వాత కడప ప్రభుత్వ కళాశాలలో ఇంటర్మీడియెట్ చేశారు. 1947 జూన్ 15 పెళ్ళి జరిగింది. 1949 అక్టోబర్

13న కడప జిల్లా బోర్డులో క్లర్క్ ఉద్యోగంలో చేరారు. కొడవలూరు రామచంద్రరాజు, చక్రాల నరసింహ శాస్త్రిల సాహచర్యంవల్ల కవిత్వ రచన అలవడింది. సంప్రదాయ సాహిత్యబలం ఉంది. గనక మొదట అవధానాలు చేశారు. 1948కి ముందే వైసీవి రెడ్డి గారి కవిత్వ రచన మొదలైంది.

ఈయన మొదట దుర్భాక, గడియారం, పుట్టపర్తి, భైరవ కొండారెడ్డి, నారు నాగనార్య, కొడవలూరు రామచంద్రరాజు వంటి సంప్రదాయ కవులతో సహవాసం చేశారు. తర్వాత ఆధునిక రచయితలైన రా.రా. కేతు విశ్వనాథ రెడ్డి, భారతం నాదముని రాజు, సొదుం రామ్మోహన్, సొదుం జయరాం, గజ్జల మల్లారెడ్డి వంటి ఆధునిక రచయితల పరిచయం కలిగింది. (ఈ వివరాలు శశిశ్రీ ఇచ్చారు.)

## 3. వై.సి.వి. రెడ్డి గారి రచనలు

వైసీవి రెడ్డి గారు 1945–1982 మధ్య చేసిన రచనలు ఇవి.

| | | |
|---|---|---|
| 1. | తొలకరి చినుకులు | 1953 |
| 2. | మేనక | 1954 |
| 3. | రంభ | 1957 |
| 4. | సిందూర రేఖ | 1982 |
| 5. | దక్షిణానిలము | 1960 |
| 6. | రాయబారము | 1960 |
| 7. | సెలకన్నె | 1972 |
| 8. | వైజయంతి | 1977 |
| 9. | పారిజాతం | 1978 |
| 10. | గట్టిగింజలు | 1982 (కథలు) |

1953కు ముందు, 1982 తర్వాత ఆయన ఎంతో కొంత రచన చేసి ఉంటారు. అందువల్ల వైసివి రెడ్డిగారి సాహిత్య జీవితం 1945–1985 మధ్య నాలుగు దశాబ్దాలు ఉంటుందని భావించవచ్చు. ఈ రచనలలో 'గట్టి గింజలు' కథానికా సంపుటి, తక్కిన తొమ్మిదీ కావ్యాలు. వీటిలో మొదటి నాలుగు పద్య కావ్యాలు, తక్కిన అయిదు గేయ కావ్యాలు.

## 4. వై.సి.వి. రెడ్డి గారి సాహిత్య జీవితం - సామాజిక నేపథ్యం

అంతర్జాతీయంగా 1917 నాటి బోల్షివిక్ విప్లవ ప్రభావం ప్రపంచ దేశాల మీద విస్తరిస్తున్న కాలం. జాతీయంగా భారతదేశం సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొంటున్న కాలం. రాష్ట్రీయంగా ఆంధ్రోద్యమం పురుడు పోసుకుంటున్న కాలం. ఈ కాలంలో వైసీవి రెడ్డి గారు పుట్టారు. ఆయన మరణించే నాటికి 1917లో రష్యాలో బోల్షివిక్ విప్లవ ఫలితంగా ఏర్పడిన వామపక్ష ప్రభుత్వం, గోర్బచెవ్ ప్రవేశపెట్టిన

గ్లాస్త్‌నోస్త్ పెరిస్త్రోయికాల ఫలితంగా కుప్పకూలడానికి సిద్ధంగా ఉంది. భారతదేశం స్వాతంత్ర్యం పొంది నాలుగు దశాబ్దాలు పూర్తయింది. ఆంధ్రోద్యమ పర్యవసానంగా ఏర్పడిన ఆంధ్రరాష్ట్రం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఒక విభజనోద్యమం విఫలమై, మరో విభజనోద్యమానికి సిద్ధమౌతున్నది.

ఈ మధ్యకాలంలో అసంఖ్యాకమైన సామాజిక సంచలనాలు, రెండో ప్రపంచ యుద్ధం, ఆకలి ముప్పైలు, భారత స్వాతంత్ర్య సాధన, భారతదేశ విభజన, మత ఘర్షణలు, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం, చైనా విప్లవం, భారత రాజ్యాంగం అమలు, అంతర్జాతీయంగా కమ్యూనిజంలో చీలిక, ఇరుగు పొరుగు దేశాలతో భారతదేశానికి యుద్ధం, బంగ్లాదేశ్ అవతరణ, ప్రత్యేక తెలంగాణ ప్రత్యేకాంధ్ర ఉద్యమాలు, అత్యవసర పరిస్థితి, కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెసేతర పార్టీల పాలన, దేశవ్యాప్తంగా ప్రాంతీయ పార్టీల ఆవిర్భావం, అణచివేయబడిన సామాజిక వర్గాల చైతన్యం, ఉత్తర భారతదేశంలో ఒకవైపు జయప్రకాశ్ నారాయణ సంపూర్ణ విప్లవోద్యమం, మరోవైపు కాన్షీరాం బహుజనోద్యమం వంటి అనేక పరిణామాల నేపథ్యంలో వైసివి రెడ్డిగారు రచనా జీవితం గడిపారు.

భావ కవిత్వం, స్వాతంత్ర్యోద్యమ సాహిత్యం ఉధృతంగా వస్తున్న కాలంలో పుట్టిన వైసీవి రెడ్డి గారు అభ్యుదయ సాహిత్యం ప్రధాన సాహితీ స్రవంతిగా ఉన్న కాలంలో రచన చేయడం ప్రారంభించారు.

ఆ తర్వాత దిగంబర కవులు, చేతనావర్త కవులు, పైగంబర కవులు, తిరగబడు కవులు, విప్లవ సాహిత్యం వచ్చాయి. ఆ తర్వాత అస్తిత్వ సాహిత్యోద్యమాలు పురుడు పోసుకుంటున్న దశ దాకా వైసివి రెడ్డి గారు రచనలు చేశారు.

వైసివి రెడ్డి గారు స్వాతంత్ర్యానంతర తొలితరం తెలుగు రచయిత. రావిశాస్త్రి, బాలగంగాధర తిలక్, పెద్దిబొట్ల సుబ్బరామయ్య, కుందుర్తి ఆంజనేయులు, అనిసెట్టి సుబ్బారావు, రా.రా. వంటి అభ్యుదయ రచయితల కన్నా కొంచెం చిన్నవాడయినా వాళ్ళకు సమకాలికుడు. ఆ రకంగా ఆయన రెండవతరం అభ్యుదయ రచయిత అవుతాడు.

## 5. వై.సి.వి. రెడ్డి గారు అభ్యుదయ రచయిత

సాహిత్యంలో ఒక రచయితను ఎలా అంచనా కట్టాలి? ఎలా నిర్వచించాలి అన్నది ఒక ప్రశ్న. ఒక రచయితను నిర్వచించడానికి కొలమానాలు ఏవి? ఊరు, ప్రాంతం, కులం, మతం, జండర్, వృత్తి వంటి అంశాలు రచయిత చిరునామాను చెప్పడానికి పనికివస్తాయి. రైతు కుటుంబంలో పుట్టి రచనలు చేసినంత మాత్రాన కర్షక రచయిత అని అనలేం. దళితకులంలో పుట్టి రచనలు చేసినంత మాత్రాన దళిత రచయిత అనలేం. రచయిత దృక్పథాన్ని బట్టి, రచయిత భావజాలాన్ని బట్టి, రచయిత రచనకు స్వీకరించిన వస్తువును బట్టి రచయితను నిర్వచించగలం.

వైసీవి రెడ్డి గారు వ్యవసాయ కుటుంబంలో పుట్టారు. పద్యగేయ కావ్యాలు, కథానికలు రాశారు. ఈ అన్నిటిలో ఒక అంతస్సూత్రముంది. అది పీడిత జన పక్షపాతం. అందువల్ల వైసీవి రెడ్డిని అభ్యుదయ రచయిత అని మనం నిర్వచించవచ్చు. ఒక రచయితను అభ్యుదయ రచయితగా నిర్వచించాలంటే దానికి కొన్ని కొలమానాలున్నాయి. వాటిని వైసీవి రెడ్డి గారి సాహిత్యంలో వెతికిపట్టుకుంటే ఆయన అభ్యుదయ రచయిత అవునో కాదో తెలుస్తుంది.

## 6. అభ్యుదయ సాహిత్యం - లక్షణాలు

1. భౌతికవాదం మనిషిని చరిత్ర నిర్మాతగా గుర్తించడం.
2. మానవేతర శక్తులను గుర్తించకపోవడం.
3. మార్క్సిజం తాత్విక సిద్ధాంతం.
4. వర్గ దృక్పథం : వర్గస్పృహ, వర్గసంఘర్షణ, వర్గ చైతన్యం
5. శ్రామికవర్గ పక్షపాతం, శ్రమజీవన చిత్రణ
6. భూస్వామ్య, పెట్టుబడిదారీ వ్యవస్థల వ్యతిరేకత
7. సామ్యవాద వ్యవస్థపై మక్కువ
8. సమసమాజ స్వప్నం.
9. శ్రమదోపిడీ నిరసన, వివక్ష ప్రతిఘటన
10. కులమతాల రుగ్మతలపై తిరుగుబాటు.
11. ప్రాదేశికత నుండి అంతర్జాతీయత వైపు ప్రయాణం.
12. పునాది ఉపరితలాల చిత్రణ
13. సాహిత్యం గొప్ప భావ ప్రచార సాధనమని నమ్మడం.
14. సామాజిక పరివర్తనకు తోడ్పడే ఉద్యమాలకు మద్దతు నివ్వడం.
15. ప్రజాపోరాటాలకు మద్దతు, ప్రపంచ యుద్ధాలకు, అణ్వస్త్ర ప్రయోగాలకు వ్యతిరేకత.
16. ప్రపంచ శాంతి అభిలాష.
17. ప్రజాస్వామ్యంపైన ప్రగాఢమైన విశ్వాసం
18. ప్రాచీన సాహిత్య పునర్విశ్లేషణ

ఇలాంటి లక్షణాలలో ఏ కొన్ని ఉన్నా ఆ రచయిత అభ్యుదయ రచయితగా నిర్వచించవచ్చు. వైసీవి రెడ్డి గారిని అభ్యుదయ రచయితగా దర్శిద్దాం.

## భౌతికవాదం

అభ్యుదయ రచయిత భౌతికవాది కావాలి. అంటే మనిషిని నమ్మాలి. మనిషిని మాత్రమే నమ్మాలి. మానవేతర శక్తుల మీద విశ్వాసం ఉన్నవారు అభ్యుదయ రచయితలు కాలేరు.

శ్రీశ్రీ 'మిథ్యావాది' కవిత భౌతికవాదానికి చక్కని ఉదాహరణ. వైసీవి రెడ్డిగారిలో ఈ భౌతికవాదం కనిపిస్తుంది. 'తొలకరి చినుకులు' కావ్యంలోనే 'సంశయడోల' కవితలో ఆయన అందరూ ఉన్నారనుకొనే దైవాన్ని ప్రశ్నించారు. భగవంతుని సృష్టిగా చెప్పబడే సమాజంలోని తలకిందులు లక్షణాన్ని ప్రశ్నించారు.

**సకల మానవ లక్షణ సంయుతమ్ము**
**జీవితం బిట్లు వికృతము సెందనేల**
**సృష్టి సర్వోదయంబులో దృష్టి నిలుపు**
**మీకు నన్నిట్లు సేయుట మేలెస్వామి**

ఆ కావ్యంలోనే 'సందేశము' కవితలో పేదరికం, ఆకలి తాండవం చేస్తున్న సమాజంలో దేవుని గురించి ప్రచారం చేయడాన్ని కవి ప్రశ్నించాడు.

**"ఆవురావురమను మంటలావరించి**
**కడుపు గాల్పంగ దేవుడొక్కడు గలడ**
**టంచు బల్కిన లాభమే కొంచెమైన**
**కడుపునింపనివాడు దేవుడే తలంప?"**

తిండి లేనట్టి వానికి దేవుడేలరా? పేదలను దేవుని పేరుమీద ఎల్లకాలం వంచించలేరని, పేదలు, శ్రామికులు ఎప్పుడో ఒకప్పుడు చైతన్యవంతులై తిరగబడతారని కవి హెచ్చరించాడు.

**ఎన్నడో ఒకనాడు మాకున్న శక్తి**
**పుటము పాకముగా మారి పూర్వజన్మ**
**కర్మలన్నింటి ఒకసారి కడిగి కొందు**
**మదియు దైవికమన్న అభ్యంతరమ్ము**
**లేదు లేదని భౌతికవాదవిధము**
**మంచిదైమించు రానున్న మంచిగోరి**
**విప్లవాత్మక చర్యల వేగు కొరకు**
**కాచిమోటేసుకొనుట నిక్కము నిజము.**

## సామ్యవాద స్వప్నం

అభ్యుదయ రచయితది సామ్యవాదం. సమసమాజం స్వప్నం. ప్రపంచంలో వస్తున్న మార్పులను గమనించి రచయిత వైసివి రెడ్డి వామపక్షవాదిగా సామ్యవాదాన్ని అక్షరీకరించారు.

**"ఖండముల సామ్యవాదమ్ము గట్టి పనిని**
**చేసి చూపెట్టె మానవ క్షేమమిట్లు**
**కన్ను కన్నున కగపడగాదె"**

## శ్రమ, సంపద అందరిదీ

మార్క్సిజం సమసమాజాన్ని ప్రతిపాదించింది. వర్గరహిత సమాజం, మార్క్సిజం కల. దానికి ప్రజా ఉద్యమాలు సాధనాలుగా చెబుతుంది. వ్యక్తిగత ఆస్తి రద్దును కోరుకుంటుంది. వైసివి రెడ్డిగారు వామపక్షవాదిగా వ్యక్తిగత ఆస్తిని వ్యతిరేకించారు.

**అన్ని యుత్పత్తిశక్తులు అందరికిని**
**అందుబాటైన సకలమ్ము నాస్తకొలది**
**కోరికలు దీర పండించుకొంద్రు – ఆస్తి**

వ్యక్తిచేతికి చిక్కిన కీడు వచ్చు. 'ఆస్తి విలువ", 'పరువు ప్రతిష్ఠల' కథలలోను వ్యక్తిగత ఆస్తి మీద వ్యాఖ్యానించారు వై.సి.వి. రెడ్డి గారు.

## విప్లవ అనివార్యత

మార్క్సిజం విప్లవ సిద్ధాంతం. దోపిడీ వ్యవస్థను నిర్మూలించి దోపిడీ రహిత వ్యవస్థను నిర్మించమంటుంది మార్క్సిజం. విప్లవ అనివార్యతను మార్క్సిజం నొక్కి చెబుతుంది. 1956లో కేరళలో వామపక్ష ప్రభుత్వం ఏర్పడినప్పుడు వైసీవి రెడ్డిగారు దానిని 'దక్షిణానిలము' అని వర్ణిస్తూ విప్లవాన్ని ఆహ్వానించారు.

**తరతరమ్ముల భావదాస్యము దొలగించి**
**పరపీడనా దురాచరణములు మాయించి**
**దళిత జీవులయెదల ధైర్యము వెలయించి**
**అలసముగ దక్షిణానిలము మా గడ్డపై**
**వీచెనమ్మా! యిపుడె**

ఆ విప్లవం పేదల శ్రామికుల బాధలను నిర్మూలించేదిగా ఉంటుందని కూడా కవి ప్రకటించాడు. 'తాడితుల పీడితుల దాపురాదారిగా' దక్షిణానిలము వచ్చిందన్నారు. అది కార్మికుల, కర్షకుల విముక్తి విప్లవమని పేర్కొన్నారు.

**పొద్దస్తమానమ్ము పొలములో పొరలాడి**
**యెండవానలకోర్చి బండకష్టము జేసి**
**పులినొప్పుల నీరసిలు కూలి ప్రజలకై**
**అలసముగ దక్షిణానిలము మా గడ్డపై**
**వీచెనమ్మా! యిపుడె**
**పల్లెపట్టల యందు బనిచేసుకొనుచున్న**
**కార్మికుల కర్షకుల గనుగొంచు, రాబోవు**
**కాలంబు మీదె నిక్కమ్ముగా నని పల్కి**
**అలసముగ దక్షిణానిలము మా గడ్డపై**
**వీచెనమ్మా! యిపుడె**

కేరళలో వచ్చిన వామపక్ష ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు కూడా విస్తరిస్తుందని ఆకాంక్షించాడు.

## శ్రమదోపిడి నిరసన

మార్క్సిజం శ్రామికుల శ్రమదోపిడీని వ్యతిరేకిస్తుంది. అభ్యుదయ రచయితకు అది శిరోధార్యం.

**ఒక జాతిని మరొక జాతీ**
**ఒక వ్యక్తిని మరొక వ్యక్తీ**
**పీడించే సాంఘిక ధర్మం**
**ఇంకానా ఇకపై చెల్లదు**

అన్నారు శ్రీశ్రీ. ఆ బాటలోనే వైసీవిరెడ్డి గారు తన కావ్యాలలో, తన కథలలో శ్రమదోపిడీని తీవ్రంగా వ్యతిరేకించారు.

**కట్టుకూలికి చేతుల కష్టమంత**
**గుంజి, గంజికి సరిపోని కూళ్ళనిచ్చి**
**పేదవారిని దోచుట పెద్దగాదు**
**ఐక్యతాసిద్ధి కూలీలకైనదిపుడు**

## శ్రమైక జీవన సౌందర్య కథనం

అభ్యుదయ రచయితలు శ్రామికవర్గ పక్షపాతులు. పీడితవర్గ పక్షపాతులు. వైసివి రెడ్డిగారి సాహిత్యం నిండా పీడితులు కనిపిస్తారు. రైతులు, వ్యవసాయ కూలీలు, దళితులు, స్త్రీల జీవితాలనే వైసివి రెడ్డిగారు తన కావ్యాలలోనూ, కథలలోనూ శ్రామిక వర్గదృక్పథంతో వర్ణించారు, చిత్రించారు. సిందూరరేఖ కావ్యంలో ఒక ఉగాది నుండి మరో ఉగాది దాకా రైతుజీవితం ఎలా ఉంటుందో సేద్యగాని దృష్టికోణం నుండి

చెప్పించారు. 'రాయబారం' కావ్యంలో రైతు జీతగాడు గాసగాని జీవితం ఎలా ఉంటుందో వర్ణించారు. 'పారిజాతం' కావ్యంలో వ్యవసాయరంగ చిత్రణ చేశారు. ఆయన కథల నిండా శ్రామిక స్త్రీలు, పేదవర్గ ప్రజలు, దళితులు ఆవిష్కరింపబడ్డారు.

'పనికత్తె' కవితలో రైతు కుటుంబంలో పని చేసే స్త్రీ జీవితాన్ని వర్ణించారు. వైసీవి రెడ్డిగారు తనకాలం నాటి బడిపంతులు జీవితాన్ని "పాలలోబడ్డ బల్లి'తో పోల్చారు. 'కడుపు మంట' కవితలో ఒక పసులకాపరి మనకు వాస్తవిక రూపంలో ప్రత్యక్షమౌతాడు. పసులకాపరి దృష్టి నుండే అతని జీవితాన్ని వర్ణిస్తూ కవి 'పెంటకుప్పలతో బాటు పెరుగుచుంటి' అంటాడు. ఈ వర్ణన పాఠకుని జలదరింపజేస్తుంది. పేదలకు కొంత అప్పు ఇచ్చి వాళ్ళతో ఎల్లకాలం పని చేయించుకొనే భూస్వామ్య దుర్మార్గం ఈ కవితలో వస్తువు.

**ఇంత యన్యాయమేటికి పంతమూని**
**బీదసాదల రక్తము బీల్చుచున్న**
**తీర దేమయ్య! మీ యాశ తీఱుదినము**
**లెన్నడొదవును? మామంట లెన్నడడుగు?**

అన్నది ఆ పసులకాపరి ప్రశ్న. 'కృతఘ్నుడు' కవితలో కవి ఒక ఇంటి మాదిగను చిత్రించాడు. పొద్దుగాలం భార్యా భర్తలు పని చేస్తున్నా, సుఖంగా జీవించడం కష్టమై, ఊరిని వదలి వలస వచ్చిన విషాదం ఈ కవితలో వస్తువు.

**నేను నా భార్య పనులెన్ని యేని చేసి**
**గోడుగుడిచితి మట గూడు గుడ్డలేక**
**కడకు శ్రమ జిక్క జీవిత కాంక్షదక్కె**

వైసీవి రెడ్డిగారు 1953లో విద్వాన్ విశ్వం గారు రచించిన 'పెన్నేటి పాట' కావ్యం చదివి, దాని స్ఫూర్తితో తానొక రైతుకావ్యం రాశారు. దాని పేరు 'సిందూర రేఖ', రెండు ఉగాదుల మధ్య రైతు జీవితం ఒక ఏడాదంతా ఎలా కొనసాగుతుందో ఆ కష్టజీవి రైతు కాలం తిరగబడి ఎలా దిగబడి పోయాడో వర్ణిస్తుంది. సేద్యగాన్ని రైతు ఎంత ఆదరంతో చూసుకుంటాడో రామిరెడ్డి, గంగడు పాత్రలలో కవి ప్రదర్శించారు. లక్ష్మమ్మ, రామిరెడ్డి పెండ్లి అయిదు రోజులు జరిగింది. "అతని పెండ్లియు రాజసూయంబె" అంటాడు కవి. ఆ దంపతులు మంచి దాతలు. పని బాపలకు బాగా దానం చేస్తారు. సేద్యగాడు గంగడు. కడు పేదవాడు. రామిరెడ్డి చేరదీసి, గుడిసె వేయించి, పెళ్ళి చేస్తాడు. రామిరెడ్డి మంచి కష్టజీవి. అన్ని రకాల ధాన్యాలూ పండించాడు. వ్యవసాయ వృత్తుల వాళ్ళకు బాగా గింజలు ఇచ్చాడు. రామిరెడ్డి గంగడికి ఇచ్చిన గింజలు ఆయన తినగా మిగిలినవి అమ్ముకున్నాడట. అటువంటి రైతు కాలక్రమంలో కృశించిపోయాడు. అతని కొడుకు పేదవాడైపోయాడు. ఇదంతా చెప్పి గంగడు ఏడుస్తాడు. ఈ పరిణామం ఎందుకొచ్చిందంటే 1952

నాటి కరువువల్ల. బాగా బతికిన కుటుంబాలను సైతం కరువు కాల్చి బూడిద చేసింది. విశ్వంగారు 'పెన్నేటి పాట', వైసీవి రెడ్డిగారు 'సిందూర రేఖ' ఒకే కరువు కాలం గురించే రాశారు. దీనికి విరుగుడు విశ్వం గారు చెప్పలేదు, వైసివి రెడ్డి గారు చెప్పారు.

**'దోపిడిలేని ఎవరినీ దోచుకోని**
**సమసమాజము రావలె" అన్నారు.**

'సిందూర రేఖ'లో రైతు ఇంటి సేద్యగానితో రైతుజీవితంలోని వెలుగు చీకట్లను చెప్పించిన కవి, 'రాయబారము' కావ్యంలో దళితుడైన రైతు జీతగాని జీవిత దైన్యాన్ని చెప్పించాడు. వ్యవసాయంలో మునిగి తేలిన కవి మాత్రమే ఈ రెండు కావ్యాలు రాయగలడు. వై.సి.వి. రెడ్డి అనుభవ సారం ఈ కావ్యాలు.

కోడికూతతో రైతు ఇంటికి వచ్చే మాదిగ ఏయే పనులు చేస్తాడో వర్ణించి, అతడు శ్రమలోనే ఎలా కృశించిపోయాడో చెప్పి కావ్యం ముగించాడు కవి. కవి స్వయంగా వ్యవసాయవర్గం నుంచి వచ్చాడు గనుక వ్యవసాయదారులలో ఉండే రెండు ఉపవర్గాలను – సేద్యగాళ్ళను, కూలీలను బాగా ఆదరించే వర్గం వాళ్ళను, నిరాదరించే వర్గం వాళ్ళను వాస్తవికంగా చిత్రించగలిగాడు.

వైసీవి రెడ్డిగారు 'గట్టిగింజలు' కథలలో పేదల అమాయకత్వం, శ్రమ ఎలా దోపిడీకి గురౌతున్నాయో చెప్పారు. సంపద పెద్దరెడ్ల చేతిలో చిక్కుకుని, వాళ్ళ దుర్మార్గాలకు అదే ఆయుధం కావడాన్ని చెప్పారు. స్త్రీలను గ్రామీణ ఆధిపత్యవాదులు ఎలా వంచిస్తారో చెప్పారు. సొంత ఆస్తుల మీద మక్కువ జీవితాన్ని ఎలా ఛిద్రం చేస్తున్నదో చెప్పారు. 'మంచివాళ్ళు' కథలో 'అందరూ సుఖపడాలి' అన్నారు. 'దిక్కులేని బ్రతుకులు' కథలో 'దిక్కులేని ఆడది అందరికీ అలుసే' అన్నారు. 'ఆస్తివిలువ' కథలో అంకమ్మ 'ఆస్తి లేకుంటే జీవితంలో బాగుపడేదేమో' అన్నారు. 'పరువు – ప్రతిష్ఠలు' కథలో 'ఆస్తి లేకుండా బతకలేమన్న స్థితి ఎప్పుడు పోతుందో' అన్నారు. పేదలను చాకచక్యంగా లొంగదీసుకొని వాళ్ళతో సంపన్నులు ఎలా ఊడిగం చేయించుకుంటారో, గ్రామీణ ఆర్థిక విధానాలు ఎంత దోపిడీ స్వభావం కలిగున్నాయో వైసీవి రెడ్డిగారి కథలు బాగా విప్పి చెబుతాయి. 'గుడిసె దక్కింది' కథే ఇందుకు ఉదాహరణ. గ్రామాలలో పేదలు అనివార్యంగా పెద్దరెడ్ల మీద ఆధారపడవలసిన దుస్థితిని 'దొంగ బఱ్ఱెగొడ్లు' కథ వివరిస్తుంది. సంపన్నులులాగే పేదలకు కూడా సొంత సేద్యం చేసుకోవాలన్న తపన, వాళ్ళను ఎలా నాశనం చేస్తుందో 'కుట్రల్లో కూలోడు' కథలో చిత్రించారు వైసీవి రెడ్డిగారు. వైసీవి రెడ్డి గారి 'గట్టిగింజలు' కథలన్నీ 1980ల నాటి రాయలసీమ గ్రామీణ మానవ సంబంధాలను, వర్గసమాజంలో పేదల, శ్రామికుల జీవన పరాయీకరణను చిత్రించాయి. ప్రతి కథలోనూ రచయిత పీడిత వర్గ పక్షపాతిగా కనిపిస్తారు.

వైసీవి రెడ్డిగారు రాయలసీమ వారు. రాయలసీమ కరువుప్రాంతం. సీమలో కరువు పిలిస్తే పలుకుతుంది. రాయలసీమ కరువు మీద అనేక కావ్యాలు, కథలు, నవలలు, నాటకాలు వచ్చాయి. వైసివి రెడ్డి గారు రాయలసీమ రైతు రచయితగా రాయలసీమ కరువును చిత్రించారు. 'సిందూర రేఖ' పూర్తిగా రాయలసీమ వ్యవసాయ కావ్యం. అందులో 1953 నాటి రాయలసీమ కరువును గురించి వివరిస్తాడు.

**కరువులకు ఆటపట్టుగా పరువు బరువు**
**వచ్చు మూడేండ్ల కొకసారి వరుస వరుస**

ఈ కరువుకు ఆర్థికాంశానికీ గల సంబంధాన్ని కూడా వైసీవి రెడ్డి గారు అభ్యుదయ రచయితగా చెప్పారు. 'రాయబారం' కావ్యంలో

**కరువులో అప్పు పుట్టదు కాస్తా కూస్తా**
**ఆస్తి లేకున్న చిక్కదు, ఆస్తులెపుడు**
**దోపిడీలను చేయించు, దోపిడీలు**
**లేక ఆస్తులు రావు, రాలేదు వెనుక**

రాయలసీమ కరువు విషయంలో పంచాంగాలెప్పుడూ విఫలమౌతూనే ఉన్నాయి. అందువల్ల రాయలసీమ వర్షాల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడకుండా శాశ్వత నీటిప్రాజెక్టుల కోసం అనేక ఉద్యమాలు చేసింది. వాటిలో తుంగభద్ర ఎగువ కాలువ ఉద్యమం ఒకటి. దీనిని వైసీవి రెడ్డి గారు 'రాయబారము' అనే కవిత రెండో భాగంలో ప్రస్తావించారు.

**రావలసిన కావలసిన**
**తుంగభద్ర యెగువకాల్వ**
**తొందరగా కావాలని**
**అందరమూ కలిసి, నాడు**
**అచ్చువెల్లి సభలోనే**
**అడిగితిమా లేదా?**

అని ప్రశ్నించారు. ఈ కవితను ఆయన తుంగభద్ర ఎగువ కాల్వ మహాసభలో చదివారు. అభ్యుదయ రచయితకు సామాజిక సమస్యల పట్ల, వాటి పరిష్కారాల పట్ల ఎంత శ్రద్ధ ఉంటుందో ఈ కవిత రుజువు చేస్తుంది.

## ప్రాచీన సాహిత్యం పునర్వ్యాఖ్యానం

అభ్యుదయ రచయితలు భూస్వామ్య, పెట్టుబడిదారీ వ్యవస్థలను వ్యతిరేకిస్తారు. ప్రాచీన సాహిత్యాన్ని విమర్శనాత్మకంగా వివేచించి అవసరమైన దానిని స్వీకరిస్తారు. అవసరం లేనిదానిని తిరస్కరిస్తారు. అంతే కాదు ప్రాచీన సాహిత్యాన్ని వర్తమాన దృక్పథంతో పునర్వ్యాఖ్యానం కూడా చేస్తారు. వైసీవి రెడ్డి గారు మేనక, రంభ, వైజయంతి, పారిజాతం కావ్యాలను పూర్వ్యాఖ్యాన దృష్టితో రచించారు.

శకుంతల జన్మకు కారకులైన మేనకా విశ్వామిత్రుల కథ మహాభారతం లోనిది. విశ్వామిత్రుని తపస్సు తన పదవికి గండం తెస్తుందని ఇంద్రుడు మేనకను పురమాయించి, విశ్వామిత్రుని తపస్సును భంగం చేస్తాడు. వారి కలయికవల్ల శకుంతల పుట్టింది. ఇది పురాణ కథ. పురాణ రూపంలో కనిపించే

రాజకీయ కథ ఇది. ఈ కథ ఆయా పాత్రల ఔన్నత్యానికి భంగం కలిగిస్తున్నదని భావించి వైసీవి రెడ్డి గారు మార్చి రాశారు. వశిష్ట విశ్వామిత్రుల వాద సందర్భంలో విశ్వామిత్రుని మహత్యాన్ని గుర్తించిన మేనక, ఇంద్రుని అనుమతి తీసుకొని, తపస్సు చేసుకుంటున్న విశ్వామిత్రుని వలచి మెప్పించి అతనిని చేరుకుంటుందని కవి మార్చాడు. వైసీవి రెడ్డి గారు ఈ కావ్యాన్ని తానెందుకు రాశారో చెప్పుకొచ్చారు. 'మానవుడు సాధించలేనిది విశ్వమున లేదని ఋజువు చేసిన స్రష్ట విశ్వామిత్రుడు. ఆ మహాత్ముని పాత్రపైనున్న గౌరవభావమే నాయీ కావ్యము." మేనక విశ్వామిత్రుల మీద గౌరవంతో 'మేనక' అనే పేరుతో కావ్యం రాయడం ఒక చమత్కారం. విశ్వామిత్రుడు ఒక మేధావి, ఆ మేధావిని మేనక ప్రేమించిందని కవి భావించాడు. కవి ఏమి భావించినా పురాణం పురాణమే.

'వైజయంతి' కావ్యం మనుచరిత్రలో వరూధినీ ప్రవరుల కథ. ప్రవరుడు సిద్దుడు పూసిన పసరు ప్రభావంతో హిమాలయాపర్వతాలకు వెళ్ళడం, అక్కడ పసరు కరిగిపోవడం, ఆ సమయంలో వరూధిని కనిపించడం, ఆమె ప్రవరుని ప్రేమించడం, ప్రవరుడు ఆమె ప్రేమను తిరస్కరించి, అగ్ని దేవుని సహాయంతో తిరిగి ఇంటికి చేరుకోవడం – మనుచరిత్రలో కథ. దీనిని వైసీవి రెడ్డి గారు వర్తమాన దృక్పథంతో పునర్వ్యాఖ్యానం చేశారు. హిమాలయా పర్వత అందాలను తనివితీరా చూసి తరించకుండా కోరివచ్చిన స్త్రీని కఠినంగా మాట్లాడి తిరస్కరించి వచ్చిన ప్రవరుని కవి మొదటి భాగంలో అనేక రకాలుగా అధిక్షేపించాడు. ప్రవరాఖ్యా! బాపడా! వంటి మాటలతో ప్రవరుని సంబోధించాడు. ప్రవరుని ప్రవర్తనను గురించి పార్వతీదేవి శివునితో 'మగవాని హీనస్వారస్యమ్ము ప్రకటితంబయ్యె' నన్నదట." మీవూరనేమున్నది "పరుగెత్తి వచ్చితివి, ఉందూరు నినుజూచి సిగ్గయ్యెపో" వంటి వ్యాఖ్యలు చేసిన కవికి, ప్రవరుడు రెండవ భాగంలో సమాధానం చెబుతాడు. తాము ఇన్నాళ్ళు రాజుల పంచన చేరిన ప్రజలకు అనవసరమైన భావాలు బోధించామని ప్రవరుడు పశ్చాత్తాపపడతాడు. "చవిలేని చదువుల చంపితిమి పామరుల, చెప్ప సిగ్గగు యువతతో" అన్నాడు. వరూధినిని గురించి 'ఆమె ఉన్నతోన్నతమైన మానవత్వము ఎంత మానవీయము!' అని మెచ్చుకున్నాడు. హిమాలయ పర్వతం నుండి తిరిగి వచ్చినాక తనలో వచ్చిన మార్పును ప్రవరుడు చెప్పాడు.

**మానవత్వము లేక మమత సమతలు లేక**
**పెట్టుపోతల సాకువెట్టి, వెట్టికి ప్రజల**
**గురి చేసి, దోచుకొనుకోవిదుల గుట్టంత**
**రట్టు చేయుచు బ్రతుకునెట్టులో సాగించి**
**లింతవరకు....**

'పారిజాతం' కావ్యంలో కవి నందితిమ్మనను ఉద్దేశించి అధిక్షేపంగా మాట్లాడతాడు. యుద్ధాలను ప్రాచీన కవులు వర్ణించడం మీద అభ్యంతరం చెప్పాడు.

**“ధర్మబద్ధముగాని విషవులకు మైమరచి**
**ధర్మయుద్ధములంచు తగిలి పోరుల గూలి**
**శాంతి పోగొట్టుకొని శరతల్పములపైన**
**వాలిపోయి దీనులై**

అనేక రకాలుగా ప్రబంధాలు ప్రచారం చేసిన భూస్వామ్య భావజాలాన్ని అధిక్షేపించిన కవి, వర్తమాన సామాజిక వాస్తవికతను తిమ్మన ముందుంచుతాడు.

**పారిజాతపు కతల పలికి మమ్మందరను**
**సుఖసౌఖ్యములలోన సోలిపొమ్మంచు మీ**
**సుఖశయ్యతో మమ్ము జోకొట్టితిరి స్వామి!**

అంటూ ‘మేము ఇంక నీ కథలను వినలేము. ఇంటికి పోయి పంటలను కాపాడుకొనే పనిలో పడతాము’ అంటాడు.

**పరిగ చేలకు నీటిపడియలను పారించు**
**పనిలో నిమగ్నమై పరిపాలకుల కెదిరి**
**నీటి హక్కుల కొరకు పాటి హక్కుల కొరకు**
**కూలి హక్కుల కొరకు, గూటి హక్కుల కొరకు**
**కోర్కెదీరగ ప్రజల కూడదీయగ చాల**
**పనివున్నదీ నేలలో యిక్కడే**
**సరిపోయె, యీ గాలిలో**
**భూస్వాములీ భూమి భూధరమ్ముల నదుల**
**గుత్తగొని సంపదల కుప్ప నూర్పులలోన**
**ఆశకంతములేక అహముతో పేదలను**
**హించించుచున్నారు హీనమౌ కూళ్ళిచ్చి**
**తిరగబడినారన్న తిట్టి కొట్టిరి వారి**
**దోపిడులు తావులేని పాలనము**
**నిల్పుటకు నన్ను పోనీ**

ఇలా కవి పోరాటబాటను స్ఫురింపచేస్తూ ఈ కవితలో చివరికి ప్రజలు విప్లవోన్ముఖంగా పయనిస్తారంటాడు.

**సన్నోని కడుపులో ఉన్న ఆలోచనలు**
**చిటిలి ఆకటిమంట పెటిలి పుటపాకమై**
**విప్లవోన్ముఖముగా విచ్చివిరిసెను సామి**

**నేనుండ లేనింక నేనుగా రాలేను**
**నావెంటనే వచ్చి నన్ను నడిపించవలె**
**పేదలకు సాయపడగా పోవలయు**
**ప్రియము బల్కితి నీకుగా**

వైసీవి రెడ్డి గారి భాషలో పౌరాణిక వాసనలుంటాయి. భావంలో ఆయన అచ్చమైన అభ్యుదయ రచయిత. కోస్తా ప్రాంతంలో 1915–1940 మధ్య లేదా కొంచం అటూ ఇటుగా భావ కవిత్వం కెరటంలా ఎగిసిపడి అణగిపోయింది. ఆ తర్వాత సాహిత్యం భావ కవిత్వం తలెత్తకుండా చేసింది. అయితే రాయలసీమలో ఆ దశలో బెళ్ళూరి శ్రీనివాసమూర్తి, తలకర్ల కళానిధి, వైసీవి రెడ్డి వంటి వాళ్ళ అంశ తొంగి చూస్తోంది. వై.సి.వి. రెడ్డి గారు భావకవిగా మొదలై అభ్యుదయ రచయితగ ఎదిగారు.

❖ ❖ ❖

**జేజేలు**

**నటరాజ వరశిరస్తట పతద్ధుతిని వోలె**
**చటుల కార్ముక ముక్త శరపరంపర వోలె**
**ప్రాభాత జనిత సంపత్సమీరము వోలె**
**కండ చక్కెర పానకము వోలె – మధురసం**
**గతివోలె రుచిరమై కదలినది మీ కవిత**

**చెలువొంది సుధను ముంచితివేమో కలమూ**
**నీరాజనములివ్వ నిల్చెపో జనమూ**

**సెలకన్నె సోగకన్నుల వెన్నెలలు గాయ**
**మేనా వధూటి నెమ్మేన పుల్కలు పూయ**
**దక్షిణానిల వచోద్ధతి పేరణము సేయ**
**రంభాంఘ్రి యుగళ మర్మరపుటందెలు మ్రోయ**
**వైజయంతీ ప్రభాపటలి దిక్కుల దాయ**

**పారిజాత లతాంత పరిమళ శ్రీలూ**
**నింపితివి వై.సి.వి. నీకు జేజేలూ**

**– మలసాని చంద్రశేఖర్ రెడ్డి**



**డా॥ ఎన్. గోపి**
సెల్ : 9391028496

## వైసీవీ రెడ్డి గారూ! / రచనల్లో చిరంజీవి వైసీవి

మీరిక లేరని చదివి
అక్షరాలు అలుక్కుపోయాయి.
హైదరాబాద్ రోడ్లన్నీ
కడప పట్టణ వీధులై
అంతటా మీరే కనపడుతున్నారు.

ఆ మధ్య వచ్చినప్పుడే
కాస్త మెత్తగా కనపడ్డారు.
కళ్ళద్దాల మందాల్లోంచి
చూపులు చెదిరిపోతూ రాలిపడ్డాయి.
అయినా అంతలోనే
మరణం మిమ్మల్ని హరిస్తుందనుకోలేదు.
ఉద్యమ సాహిత్య లోకాల్లో
ఓ సురుచిరతార రాలుతుందనుకోలేదు
(గుర్తుందా దాశరథి రంగాచార్య గారూ!)

కడప అంటే మాకు
పుట్టపర్తీ, మీరే.
కడప అంటే మాకు
పద్యాలూ, ప్రగతి వాద్యాలూను.
ప్రబంధాలను దీపాలను పల్లె యాసతో
మీరు వెలిగిస్తుంటే చూడాలి.

పద్యాలను మీరు అల్లితే వినాలి.
రసమంటే ఏమిటో
మీ సన్నిధిని కూచొని గుటకలు మింగాలి.

రాయలసీమలో నీళ్ళులేక
పక్కవాడు పగవాడవుతున్నాడని
బొటబొటా కన్నీళ్లు కురిసే మానవీయమూర్తి మీరు!
కక్షలకు లక్షలు తగలేస్తున్నారని వాపోయేవారు.

పిల్లకాయల్ని వెంటేసుకొని
కవిత్వం ఓనమాలు దిద్దిస్తూ
ఏడు తోవల వెంట తిరిగే
నిత్య సాహిత్య పథికులు మీరు.
(గుర్తుందా శశిశ్రీ)!

రాయలసీమ యాస
మీ నాల్కపై మట్టివాసన వెదజల్లేది.

కుటుంబ జీవనం
మీ అంగీ కింద బనీను,
కవిత్వోద్యమాలు
మీ భుజం మీది రుమాలు,
కవిత్వమంటే మీకు
"అమృతం కుండకు చిల్లుపడితే జారే ధార."

ప్రజల కష్టాలంటే
గుండెల్లో మొలిచే ఉద్వేగ కులిశ ధార.
(వింటున్నారా కేతూ, రాకృ)

మా పిల్లలు వై సీ వీ తాతను గుర్తు చేస్తున్నారు.
మీ యింట్లో జొన్నరొట్టెలు నాకింకా జ్ఞాపకం!
మక్దూం భవన్‌కు ఫోన్ చేస్తే మీరింక పలకరు.
హిమాయత్ నగర్ రోడ్ల మీద మీరిక కనపడరు.
అయినా మీరిక లేరంటే
అంతటా మీరే కనపడుతున్నారు!

# రచనల్లో చిరంజీవి వైసీవి

సమకాలీన రచయితలతో తూగగల ప్రతిభ ఉన్నా, సాహితీ ప్రపంచంలో తనకో స్థానం కోసం వెంపర్లాడలేదాయన

కొందరు వ్యక్తులు కీర్తికాంతులతో జిగేల్‌మనకుండా ఆర్తి వెలుగులతో జీవిస్తారు. స్వార్థం కన్నా పరమార్థానికి ప్రాధాన్యమిస్తారు. అలాంటి వ్యక్తి స్వర్గీయ వై.సి.వి. రెడ్డి. పూర్తి పేరు ఎమ్మనూరు చిన్న వెంకటరెడ్డి. కడప జిల్లా నివాసి. కవి కథా రచయిత ప్రగతిశీల ఉద్యమకర్త కడప జిల్లాలోని ప్రతి యువ రచయిత వై.సి.వి వేలు పట్టుకొని నడిచినవారే. ఆయన రాయలసీమ యాసలో మాట్లాడుతుంటే అమృతం జుర్రుకుంటున్నట్టుగా ఉండేది.

కడప రాయలసీమకు నడిబొడ్డు, మనకు రాయలసీమ ముఠా తగాదాల గురించే ఊదరగొడ్తారు గానీ, వీళ్ళు లేని ఆ ప్రాంతం నుంచి ఎంత గొప్ప వ్యక్తులు వచ్చారని ఆ రాళ్ళసీమను రతనాల సీమ అనదలిస్తే రత్నాల్లాంటి ఈ వ్యక్తులపరంగానే అనాలి. వేమన్న సరే. కడప జిల్లానే తీసుకోండి. అన్నమయ్య ఇక్కడివారే. తాళ్ళపాక తిమ్మక్కతో సహా యావదాంధ్రదేశాన్ని తన పదాల్లో ఓలలాడించిన పోతులూరి వీరబ్రహ్మం ఇక్కడివాడే. ఇంకెందరో మహానుభావులు అట్లాంటి విలువైన సమకాలీన వ్యక్తుల్లో వై.సి.రెడ్డి ఒకరు.

వై.సి.వి.తో నా అనుబంధం పాతికేళ్ళ నాటిది. 1978లో ఎట్లాగో నా ‘తంగెడుపూలు’ కవితా సంపుటి ఆయన చేతుల్లో పడింది. అంతే నన్ను వెతికి పట్టుకుని కడపకు పిలిపించి సభ పెట్టించి నానా హడావిడి చేశాడు. అప్పటికే ఆయన యాభైల్లో ఉన్న పెద్దమనిషి నేనో పాతికేళ్ళ యువకుడిని ఆ తరువాత మా స్నేహం బలపడింది. వై.సి.వి నా వేమన పరిశోధన ప్రేమికుడు కూడా.

నేనివాళ తలచుకోవడానికి ఇదే కారణం కాదు. వై.సి.వి. చనిపోయిన తరువాత ఆయనను ఏ కొందరో గుర్తు పెట్టుకొని ఉంటారు. ఆయన మరణ వార్త విని నేనూ ఓ ఎలిజీ రాశాను. వైసీవి మీరిక లేరని చదివి/ అక్షరాలు అలుక్కుపోయాయి/ హైదరాబాద్ రోడ్లన్నీ కడప పట్టణ వీధులై అంతటా మీరే కనపడుతున్నారు/ కుటుంబ జీవనం మీ అంగీ కింద బనీను/ కవిత్వోద్యమాలు మీ భుజం మీది రుమాలు నన్ను కదిలించిన అంశమేమిటంటే ఇన్నాళ్ళకు ఆయన ముగ్గురు కుమారులు తండ్రి రచనలన్నింటినీ కూర్చి ఓ గ్రంథంగా ప్రచురించడం ప్రతాపరెడ్డి, ప్రభాకర రెడ్డి, పురుషోత్తమ రెడ్డి అని వారి పేర్లు. వీళ్ళు పెద్ద ఉద్యోగాల్లో కూడా లేరు. తండ్రి సంపాదించిన పెద్ద ఆస్తికి వారసులు కూడ కాదు. అయితే వారికి తండ్రి సారస్వత వారసత్వం మీద గౌరవం ఉంది. అందుకే ఆయన 10 పుస్తకాలను 400 పుటల గ్రంథంగా వైసీవి రచనలు పేర అచ్చు వేశారు. ఏమిటా రచనలు? తొలకరి చినుకులు, మేనక, రంభ, సింధూర రేఖ దక్షిణా నిలము, రాయబారము, సెలకన్నె, వైజయంతి, పారిజాతం ఈ తొమ్మిది కావ్యాలు. గట్టి గింజలు అనేది కదా సంపుటి. ప్రజాహిత కార్యక్రమాలపై వై.సి.వికి ఉన్న మక్కువ కుటుంబం పట్ల ఉండేది కాదు.

దారిలో ఓ కవి యువకుడు కనిపిస్తే 'నీ కవిత్వం వినాలిరా!' అని ఇంటికి తీసుకొచ్చి భోజనం పెట్టించి మరీ వినేవాడు. వై.సి.వి ఇల్లు నిత్యాన్న సత్రం కమ్యూనిజం పైన అపార విశ్వాసమున్న వై.సి.వి పద్య, గేయ కావ్యాలే రాశాడు. ఇది వైరుధ్యం కాదు. రాయలసీమ ప్రత్యేకత. అయితే కావ్యాల్లోని వస్తువు మాత్రం ప్రగతిశీలం.

వై.సి.విలోని విశిష్టత ఏమిటంటే, సమకాలీన రచయితలతో తూగగల పాండిత్యం, కవితాత్మ, ధారణ ఉండి కూడా సాహిత్య ప్రపంచంలో తనకో స్థానం కావాలని వెంపర్లాడలేదు. పువ్వులు పూసినంత సహజంగా ఆయన సాహిత్య వ్యాసంగం చేసేవాడు. జిల్లాను దాటి పేరు తెచ్చుకోవాలని ఉండేది కాదాయనకు కవిత్వం చెప్పాలని ఉత్సాహం ఉన్న ప్రతి వ్యక్తికి ఆయన ప్రథమ శ్రోత. తాను పెద్ద ధనవంతుడైనట్లు వారి ముద్రణ భారాన్ని కూడా నెత్తికెత్తుకునేవారు. 'కడప గడపలలోన కవుల గడపలు మెండు' అంటూ ఆనందించేవారు. వై.సి.వి ఊహ, ఉపజ్ఞ, ఉత్సాహం, ఉద్వేగాలు కదం తొక్కుతాయి. నిజమైన కవి తన కళ్ళతో ప్రకృతిని చూస్తాడు. "వలపు జవ్వనికి ముద్దు చెల్లింప సాంధ్యరాగ/ మవిరళంబుగ బంగారు రవికెయయ్యె" నంటాడు. వై.సి.వి మేనక, మేనకా విశ్వామిత్రుల కథ. కథ పాతదే కానీ చెప్పే పద్ధతి కొత్తది. "రంభ" కవిలో జాలువారిన కొన్ని మధుర భావాల రూపం "సిందూర రేఖ"లో పెట్టుబడిదారీ వ్యవస్థలోని దౌష్ట్యాన్ని వర్ణించాడు. వై.సి.వి పద్య భాషలో వాడుక పదాలు యధేచ్ఛగా దొర్లుతాయి. "దక్షిణానిలము" కొంత రాజకీయ వాసన గలది. దక్షిణం నుండి వీచిన గాలి, కేరళ ప్రజా జీవనంలో కలిగిన ఒక మార్పు ఈ రచనకు ప్రేరణ. ఇది గేయ కావ్యం. రాయబారము రైతు కూలీల దీనమైన దుస్థితిని తొలగించడానికి తపన పడిన ఆధునిక రచన. "సెలకన్నె" గేయ సంపుటి "ఏమమ్మా చలువ తల్లీ! ఎక్కడికి పరుగెత్తుచుంటివి" పంక్తుల్తో సెలకన్నె ముగుస్తుంది. పుట్టపర్తికి అంకితమైన వైజయంతి నిజంగా కవితా వైజయంతి. "పారిజాతం" విచిత్రమైన రచన. పారిజాతాపహరణం కవి ముక్కు తిమ్మనతో కవి నేరుగా సంభాషణ జరుపుతారు. ముక్కు తిమ్మన్నను పాత సమాజానికి ప్రతీకగా వాడుకొని ప్రగతిశీల భావాలకు పదను పెట్టాలనే ఆశయంతో రాసింది. వై.సి.వి కావ్య శీర్షికలలో ప్రాచీన వాదనలు కనిపిస్తాయి. కానీ, లోపలికి వెళ్ళి చూస్తే అత్యంత ఆధునిక భావాలు, దీనజన పక్షపాతం. ఈయనకు పదునైన పోరాట శీలం కంటే కరుణ అధికం.

కథా రచయితగా కూడా వై.సి.వి. విశిష్టమైనవాడే. రాయలసీమ, తెలంగాణల్లో, కోస్తా జిల్లాల్లోలాగా మధ్య తరగతి జీవితం తక్కువ. ఆర్థిక, సామాజిక కారణాల వల్ల ఈ ప్రాంతంల్లో మధ్య తరగతి విలువల కంటే శ్రామిక జన సంస్కృతి ఎక్కువ. ఈ దృష్టితో విమర్శకులు కథానికా సాహిత్యాన్ని విశ్లేషించవలసి ఉంటుంది. మరో విషయమేమిటంటే, ఈ ప్రాంత కథల్లో శిల్పం కంటే వస్తువుకే ప్రాధాన్యం. అయితే, శిల్పరాహిత్యాన్ని నేను గుణంగా చెప్పటం లేదు. అదొక వాస్తవం గట్టి గింజలలో 21 కథలున్నాయి. ఈ కథలు అల్లినట్లు కనిపించవు. కాల్పనికత అంతగా స్ఫురించదు. జరుగుతున్న సంఘటనలనే జరుగుతున్నట్టుగా రచయిత చెప్తుంటాడు. సొమ్ములు లేని సహజ సౌందర్యవతుల్లాగా ఉంటాయి.

ఈ కథల్లో ఆడవాళ్ళు బలహీనులు కారు. వాళ్లు రేప్‌కు గురి కారు. సమాజం చేత ఈసడింపబడరు. పల్లెపడుచులు స్వశక్తి మీద ఆధారపడతారు. ఆత్మహత్యలకు పూనుకోరు. చిన్న చిన్న పనులు చేసుకొని జీవించే గొల్ల చిన్నక్క ఊరికి బావిని తవ్వించేంత గొప్పది. ఇతర స్త్రీ పాత్రల్లో చాలామటుకు పేదవాళ్ళే. ఆయనకు రాయలసీమ పల్లెలతో, పల్లె జీవితాలతో, పల్లెల ఉద్యమాలతో గట్టి సంబంధం ఉంది. ఆ సంబంధం వల్లే ఈ కథలు మామూలు కథల కన్నా భిన్నంగా ఉంటాయి. కళాత్మక విలువలు లేకపోవచ్చు కానీ, జీవితాల్లోని జీవకళ వీటిలో దర్శనమిస్తుంది.

వై.సి.వి రచనలను ఆయన కొడుకులు అమ్మకానికి కాకుండా సాహిత్యకారులకు ఉచితంగా పంచాలనుకుంటున్నారు. అదో విశేషం. వై.సి.విని మరోసారి తలచుకునే అవకాశమిచ్చిన కుమార త్రయానికి నా అభినందన.

❖ ❖ ❖

**అన్నా వై.సీ.వీ!**

**మీ ఎడద**
**ఎన్నడో 'తొలకరి'కి తడిసిన**
**సాహితీ క్షేత్రమై –**
**'రంభా', 'మేనకా' ద్యప్సరసల**
**రంగ భూమిగ మారి –**
**'దక్షిణానిలా'**
**సంశ్లేషణా సౌభాగ్యాల**
**పరిశ్రాంతమై –**
**గాసగాని**
**హృదయా క్రాంతమై –**
**'సెలకన్నె'ల పలుకుల్లో**
**సేదదీరి –**
**మనుచరితకు**
**మానవతా పూరిత**
**నవతా కవితాత్మక**
**వ్యాఖ్యానంగా,**
**భావుక ప్రవరాఖ్యంగా**
**భాసిల్లి,**
**ఈనాటికి**
**'వైజయంతి'గా నిలిచింది**

**– నల్లపాటి రామప్పనాయుడు**



**పెనుగొండ లక్ష్మీనారాయణ**
సెల్ : 9440248778

## ప్రజా సాహితీవేత్త - వై.సి.వి.

వైసివి రెడ్డిగా సాహిత్యలోకానికి సుపరిచితులైన యమ్మనూరుచిన్న వెంకటరెడ్డి 1926 మార్చి 26న కడప జిల్లా పులివెందుల తాలూకా బోనాల గ్రామంలో జన్మించారు. 1989 అక్టోబర్ 8వ తేదీన కడపలో అభ్యుదయ రచయితల సంఘం సభా నిర్వహణలో ఉండగా హఠాత్తుగా గుండెపోటుతో మృతి చెందారు. వీరు అరసం కడప జిల్లా శాఖ అధ్యక్షుడిగా సేవలందించారు. రారా సంపాదకత్వంలో నడిచిన 'సంవేదన' మాస పత్రికకు మేనేజర్‌గా వ్యవహరించారు. వీరు మంచి కార్యకర్త, గొప్ప కావ్యకర్త, కథా రచయిత, కమ్యూనిస్టు పార్టీ సభ్యులు. నిలువెల్లా వామపక్ష భావజాలం నింపుకున్న సాహితీవేత్త. ప్రాచీన సాహిత్యంపై సాధికారత కలిగిన అధ్యయనశీలి. దక్షిణానిలము, మేనక, రంభ, సిందూర రేఖ, రాయబారము, సెలకన్నె, వైజయంతి, పారిజాతం కావ్యాలను, తొలకరి చినుకులు పద్య కావ్యాన్ని రచించారు. 'ఈ కవికి తీవ్రమగు భావనాబలమున్నది. ఆ భావమును వెల్లడింపగల సునిశితమైన వెనుకాడని వాక్కును గలదు' అని మహాకవి, సరస్వతీపుత్ర పుట్టపర్తి నారాయణాచార్యులు ప్రశంసలందుకున్న అభ్యుదయ కవి వైసీవిరెడ్డి.

'కడప సీమలో పుట్టపర్తి వారి తరువాత నేనే' అని ధైర్యంగా చెప్పుకున్న కవి వైసివి. స్థాన నిర్ణయం చేసే పని నాది కాదు కానీ వైసీవి మాత్రం అద్వితీయ కవి అని వారి కావ్యాలు నిరూపిస్తాయి. వైసీవి గురించి, వారి పద్యశైలి గురించి ప్రసిద్ధ అభ్యుదయ కవి గజ్జల మల్లారెడ్డి రాసిన ఈ పద్యం అందుకు ఒక సజీవ ఉదాహరణ.

**"విజ్ఞత యమ్మనూరు చినవెంటరెడ్డి మరొక్క రూపమే**
**ప్రజ్ఞ మనోజ్ఞమై అతని పద్యములందనవద్య శైలిలో**
**ప్రాజ్ఞులు మేలుమేలనగ భాసిలులచుండును ఎప్పుడేనియున్**
**అజ్ఞులవజ్ఞసేయ దరహాస విభూషణ భూషితుండగున్'**

అభ్యుదయ కవులు గేయ సాహిత్య ప్రక్రియను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్ళారు. 'పాతకాలం పద్యమయితే, వర్తమానం వచన గేయం' కుందుర్తి అభిప్రాయం ఇది. అభ్యుదయ కవులు పద్యం పట్ల ఆసక్తి చూపలేరు. మాత్రా ఛందస్సులో గేయ ప్రక్రియను ముందుకు నడిపారు. గేయం ద్వారా ప్రజా ఉద్యమాలకు స్ఫూర్తినందించారు. వైసీవి తన పద్య, గేయ కావ్యాలలో అభ్యుదయ దృక్పథాన్ని ఆవిష్కరించారు. తొలి

పద్యసంపుటి 'తొలకరి చినుకు'లో సాంప్రదాయక రూపాన్ని ప్రతిబింబించినా, సాంప్రదాయక తత్వాన్ని మాత్రం ప్రతిధ్వనించటం లేదు' అన్నారు మందలపర్తి కిషోర్ 'మట్టి పరిమళం తెలిసిన గట్టిగింజ' వ్యాసంలో. (ఇరవైలో అరవై – అభ్యుదయ సాహిత్య చరిత్ర – 2023).

వీరి తొలి గేయకావ్యం 'దక్షిణానిలం'. తన ప్రియమైన తల్లిదండ్రులు కొండారెడ్డి, లక్ష్మమ్మలకు అంకితం చేశారు. రచనా కాలం 1960. దక్షిణానిలం అంటే దక్షిణం నుండి వీచిన గాలి అని అర్థం. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ మున్నగునవి భారతదేశంలోని దక్షిణాది రాష్ట్రాలు. దక్షిణాది రాష్ట్రాలలో కమ్యూనిస్టు ఉద్యమానికి బలమైన కేంద్రం కేరళ రాష్ట్రం. ఎన్నికల ద్వారా, ప్రజాతీర్పు ద్వారా భారతదేశంలో తొట్ట తొలుత కేరళ రాష్ట్రంలో 1957లో ఇఎంఎస్ నంబూద్రిపాద్ ముఖ్యమంత్రిగా కమ్యూనిస్టు పార్టీ ప్రభుత్వం ఏర్పడింది. దీనిని సహించలేకపోయాయి అక్కడి మతవాద, మితవాద సంస్థలు. కాంగ్రెస్ పార్టీ, మరికొన్ని రాజకీయ పక్షాలు ఆనాడు భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, వారి కుమార్తె ఇందిరాగాంధీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఆ ప్రభుత్వాన్ని వివాదాస్పదమైన 356 ఆర్టికల్‌ను ఉపయోగించి 31 జులై 1959న కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది. వామపక్ష భావజాలం కలిగిన వారిని ఈ దుశ్చర్య తీవ్ర ఆందోళనకు గురిచేసింది. అప్పుడు 1959లో రాసిన ఈ కావ్యం 1960లో ముద్రణ పొందింది. ఈ కావ్యానికి రాసిన 'పీఠిక'లో 'ఈ నడుమ కేరళ ప్రజాజీవనమున గలిగిన యొక మార్పు ఈ కవి భావమును కుద్భోదకమైనది' అని కావ్య మూలాన్ని రేఖామాత్రంగా వ్యక్తపరిచారు పుట్టపర్తి.

కేరళలో కమ్యూనిస్టు పార్టీ ప్రభుత్వాన్ని స్వాగతిస్తూ, ఆ ప్రభుత్వం వలన అక్కడి సమాజంలో వచ్చిన మార్పులను విశదపరుస్తూ ఎంతో పరవశంతో రాసినదీ కావ్యం.

**"అమర వీరుల త్యాగ మాశలకు నెగబ్రాక**
**ప్రగతిశీలుర భావ బంభరము నదియింపు**
**నరజాతిలో క్రాంతి నవనవోన్మేషమై**
**ఆలసముగ దక్షిణానిలము మా గడ్డపై వీచెనమ్మా! యిపుడే!"**

'ఇంకా మాట్లాడలేని మానవుల దీవింప' 'బాధితుల పీడితుల దాపు రాదారిగా, జగతియంతయు నొక్క సంసారమని పల్క / కరుణ రసాత్ములౌ కవి పుంగవులు మెచ్చ' అంటూ ఆ ప్రభుత్వం పట్ల తన అభిమానాన్ని అభ్యుదయ కవిగా ఆలపించారు వైసీపి. దక్షిణాదిన కేరళలోనే తొలుత నైరుతి రుతుపవనాలు ఏర్పడి తర్వాత విస్తరించి దక్షిణాది రాష్ట్రాలలో వర్షాలు కురుస్తాయి. దక్షిణాది రాష్ట్రాలలో కూడా కేరళలో ఏర్పడిన కమ్యూనిస్టు ప్రభుత్వం లాగానే కమ్యూనిస్టు ప్రభుత్వాలు రావాలన్న, కావాలన్న ఆకాంక్షను హృదయంలో నిక్షిప్తం చేసుకొని రాసినదీ కావ్యం. కేరళలో ఏర్పడిన ఆ ప్రజాప్రభుత్వాన్ని నాటి కాంగ్రెస్ కేంద్ర ప్రభుత్వం అనైతికంగా కూల్చడం దేశ రాజకీయ చరిత్రలో ఒక నల్లటి అధ్యాయం.

మరో కావ్యం 'రాయబారం'. రచనాకాలం 1960. 'అన్నార్థుడై ఆపదలలోనున్న గాసగాడికి' అంకితం చేసిన ఈ కావ్యం రెండు భాగాలుగా నడిచింది. తొలిభాగం 'గాసగాడు (ఇంటి జీతగాడు) గురించి కాగా రెండవ భాగం 'తుంగభద్ర' యెగువ కాలవ మహాసభలో చదివిన గేయంగా పేర్కొన్నారు. ఈ రెండు భాగాలు దేనికవే ప్రత్యేకమైనవి.

ఈ పుస్తకానికి పీఠికను సమకూర్చిన సొదుం గోవిందరెడ్డి "గంజు కుండా, చెట్లడ్డా / గోసినగా పై పరం బడా / అంపనన్నా కుంటెనా' అన్న శబ్దాలకూ సాహిత్య గౌరవం సంపాదించి పెట్టాడీ కవి" అని అభినందిస్తూ 'ఈ యుగసంధిలో ఇలాటి కవులే అవసరం' అన్నారు.

**"దేహమెల్ల చితికిపోయె / దేహమెల్ల జీరాడెను**
**కలనైనను సుఖము చెంత / కాలము గడపనివాడా కష్టజీవి! నష్టజీవి"**

అని గాసగాని జీవిత చిత్రణ చేశారు. కష్టజీవులు, దళితుల పట్ల తన ప్రేమాభిమానాన్ని వ్యక్తీకరిస్తూ వారి విముక్తిని కాంక్షించిన రచన యిది.

క్షామసీమ రాయలసీమ క్షేమ సీమ కావాలని అభిలషిస్తూ 'రాయబారము' రెండవ భాగాన్ని రాశారు. అందులో 'తుంగభద్ర యెగువ కాల్వ తొందరగా కావాలని అందరమూ కలసి, నాడు అచ్చవెల్లి సభలోనే అడిగితిమా లేదా" అని రాయలసీమ నీటి చరిత్రను వివరించారు. నీటి సాధనకు ఉద్యమిద్దామని ఆ ఉద్యమ నేతలలో ఒకరిగా పిలుపుచ్చారు.

'పల్లెపట్టుల జన జీవితాలకు సంబంధించిన గాథను పద్యకావ్యంగా వ్రాయాలని అనుకొన్నాను' ఆ తీరులో 1953 – 1982 'సిందూర రేఖ' కావ్యాన్ని రాశారు. వీరి 'సందేశము' విశిష్టమైనదే.

వైసీవి రాసిన 'కడప గడపలు'లో రాయలసీమను, కడపనూ చాలా బాగా చిత్రీకరించారు. అక్కడి కరువు కాటకాలతోపాటు, పోరాట పటిమనూ వివరించారు.

రాయలసీమ వాసులు చిరకాలం గుర్తుంచుకోవాల్సిన గీతం. ఇతర ప్రాంతాల వారికి కడపను గురించి తెలియజేసిన ప్రాంతీయ సాహిత్యం.

**'నల్లరేగడి గడ్డ పర్రెలుగా చీలినది**
**వర్షాప్తికై మొగము వాచి కలకాలమ్ము**
**జనపదల గుండెలకు సౌఖ్యమ్ము కరువయ్యె**
**కొండలును కోనలును ఎండినవి మండినవి**
**పసులు మేతలు లేక పాడి పంటలు లేవు**
**కుందనపు నడిగడ్డలూ – పండవిట**
**కుందు పరిసర భూములు'**

అని అక్కడ తాండవిస్తున్న హృదయవిదారక అనావృష్టిని దృశ్యమానం చేశారు.

**"కడప గడపలలోన కవుల గడపలు మెండు**
**కడప సంపదలక్ష్మి గడప దాటిన దేమో**
**గడప దాటనెలేదు కవ్యగ్రలోకముల**
**రసరాజ్యముల నేలు అసలైన కవులతో**
**కళతరుగ లేదుపో కడప వాసులకిపుడు**
**లేమితో పోరాడగా - సిద్ధపడి - లేచి నిలిచిరి తీరుగా"**

అంటూ కడప సాహిత్య చరిత్రనూ వివరించారు. ఆ సీమ పోరాటానికి కవులు సిద్ధంగా వున్నారన్నారు.

వీరి కావ్యాలు కమనీయం, రమణీయం. మళ్ళీ మళ్ళీ చదివించే ప్రౌఢభాష, చిన్నవైనా తెలుగు సాహిత్యంలో చిరకాలం నిలిచే కావ్యాలు.

భావకవిత్వం అంతరించి అభ్యుదయ కవిత్వం విజృంభిస్తున్న కాలంలో అభ్యుదయ భావజాలం కలిగిన వైసివి మేనక, రంభ, సెలకన్నె, పారిజాతం వంటి భావ కవితా కావ్యాలు రాయటం ఏమిటనేది వారు ప్రశ్నించుకోలేదా? అని నాకొచ్చిన సందేహం.

## కథా సాహిత్యం

వైసివి 'గట్టిగింజలు' కథాసంపుటిని మార్చి 1982లో వెలువరించారు. ఇందులోని ఇరవై యొక్క కథలూ గట్టివే. జన జీవితాన్ని చిత్రించిన కథలు. 'వైసీవి రెడ్డి గారికి పల్లెలతో, పల్లె జీవితాలతో పల్లెల ఉద్యమాలతో గట్టి సంబంధాలు ఉండటం వల్లనే రాయలసీమ పల్లె జీవితాలను - అధికారికంగా అనను కానీ - అతి సహజంగా చెప్పగలిగారు'' అని ప్రసిద్ధ అభ్యుదయ సాహితీవేత్త దాశరథి రంగాచార్య 'ముందుబాట'లో అభినందించారు.

"పేదరికం ఘనీభవించినపుడే పల్లెల్లో, ముఖ్యంగా దళితవాడల్లో దాని వికృత స్వరూపం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. ఏ రచయితనయినా అది కదిలించకుండా వుండదు. వైసీవి పద్యాలన్నింటా, కష్టాలు అనుభవించేవాళ్ళ పట్ల కనికరం స్ఫుటంగా కనిపిస్తూ వుంటుంది – అయితే, కష్టజీవుల తరఫున ఖేషరతుగా వకాలతు తీసుకోవడం మాత్రం ఆయన కథల్లోనే కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది" అని "మట్టి పరిమళం తెలిసిన గట్టిగింజ'' వ్యాసంలో విశ్లేషించారు మందలపర్తి కిషోర్.

ఈ కథలన్నీ గట్టి కథలే. కడప ప్రాంత గ్రామాలలోని కక్షలు, కార్పణ్యాలు; దళితులు, పేదలపై దాడులు, దోపిడీలు, గ్రామ పెత్తందార్ల ఆగడాలు, స్త్రీలపై ఆర్ద్రతతో కూడిన స్పందనలు; వామపక్ష ఉద్యమాలపట్ల అభిమానం చోటుచేసుకున్నాయి. ఈ కథలు గురించి కొద్దిగా -

'13 ఏళ్లకే గర్భవతి అయితే బ్రతుకుతారా' అవును అందుకే చచ్చిపోయింది సరస్వతి. 'అందరూ కలిసి సరస్వతిని చంపినారు' అని 'చావకూడని అందం' కథలో బాల్య వివాహాలు అనే అజ్ఞాన కృత్యాన్ని నిరసించారు.

సంసారం ముందుకు సాగుతుందనీ, సుఖాలు పొందాలనుకొని అమాయకుడైన భర్త రామిరెడ్డిని మరిపించి పెద్దరెడ్డితో అక్రమ సంబంధం పెట్టుకొని చివరకు సర్వస్వమూ కోల్పోయిన చిల్లరకొట్టురాజమ్మ కథ; స్త్రీలు పురుషుల చేతిలో ఎలా ఆర్థిక, దేహ దోపిడీలకు గురవుతారో వ్యక్తం చేసిన కథ 'దిక్కులేని బ్రతుకులు'.

దొంగ బర్రెగొడ్లు పైర్లను మాత్రమే పాడు చేస్తాయి. అవి కావిలి వుండి తోలితే పోతాయి. అయితే పేద రైతు రామయ్య బిడ్డ పెళ్లి కోసం అప్పు కొరకు ఆసాములు రంగారెడ్డి, వీరారెడ్డి, గంగిరెడ్డిలను ఆశ్రయిస్తాడు. భూమి తాకట్టు పెట్టుకొని అధిక వడ్డీకి డబ్బులు యిస్తారు. చివరకు అప్పులు తీర్చినా రైతు రామయ్య 'ఒకయ్యకు పనికి పోవాల్సిన దుర్గతి వస్తూవుంది', 'దొంగబర్రె గొడ్లు' కతలో ఆసాములను వాటితో పోల్చి కథను నడపటం బాగుంది, కథకు బలాన్నిచ్చింది. ఇది ప్రతీకాత్మక కథానిక. 'కుట్రల్లో కూలోడు' కథలో కూడా కూలి గంగడు వెంకటరెడ్డి చేతిలో ఆర్థికంగా దోపిడీకి గురవుతాడు.

తొంబైఏళ్ళ మాదిగ రాముడు స్వగతంలో సాగిన కథ 'ఇంటి మాదిగోడు!' పదేళ్ళ వయసు నుండి ఆసాముల యిళ్లల్లో రేయింబవళ్ళు చాకిరీ చేసినా చారెడు నేల లేదు, కొంపా లేదు. అన్నీ కష్టాలే. కాలం గడిచే కొద్దీ రైతు, మాదిగోని సంబంధాలు దెబ్బతిన్నాయి. రెండో తరానికి చెందిన రాముడి కొడుకు బంజరు భూమిని ప్రభుత్వం నుండి పొందుతాడు. అయినా ఆ బంజరును రైతులు వశపరచుకుంటారనే దిగులు రాముడిని ఆవరించింది. గ్రామాలలో భూస్వాముల ఆధిక్యతను చూపారు.

ఐదు రూపాయల బాకీకే బాలిరెడ్డి చేతుల్లో చావు దెబ్బతిన్న కూలీ లచ్చిగాడు దాఖలు చేసిన పోలీసులు కేసు అనంతరం ఆ గ్రామంలో జరిగిన పరిణామాలను చిత్రించిన కథ. గ్రామంలో ముఠాకక్షలు, కాల్పుల్లో సేద్యగాడు గురప్ప చావటం, చివరకు ముఠా నాయకులు బాలిరెడ్డి గంగిరెడ్డి రాజీపడటం, గురప్ప పెళ్ళానికి మూడు వేలు యిచ్చి కోర్టులో తప్పుడు సాక్ష్యం పలికించడం అంతా సాఫీగా జరుగుతుంది. అయితే 'లచ్చిగాని కేసేమయిందో ఎవరికీ తెలీదు' సామాన్యులకు న్యాయం జరగదని తేల్చి చెప్పిన కథ 'ఐదు రూపాయలు'.

పెద్దరెడ్డి చేతిలో దెబ్బలుతిన్న కూలోడు నారిగాడు కూలి సంఘాన్ని ఆశ్రయించటంతో ఆ పెద్ద రెడ్డినే పోలీసులు స్టేషన్‌కు యీడ్చుకొని పోయిన ఇతివృత్తమే 'ఇంకానా...' కథ. పేదవాడైన రామయ్య కట్టుకున్న గుడిసెకు స్థలంతోపాటు ప్రభుత్వం నుండి హక్కు పొందటమే 'గుడిసె దక్కింది' కథ.

ఈ కథాసంపుటి శీర్షికగా ఉన్న కథ 'గట్టి గింజలు'. 'దేశానికి కూలోళ్ళు గట్టిగింజల్తో సమానం. ఉద్యమాల గాలి బాగా పెద్దావుంది. తూర్పెత్తేందుకు జనమూ వున్నారు. ఇది పోరాటాల సమయమని చైతన్యవంతులైన కష్టజీవి దుగ్గన్న ద్వారా తెలిపిన విప్లవాత్మక కథ యిది.

"మనిషిని ప్రేమించేవాడు. మనిషి ప్రేమించదగినవాడు. కాదు ప్రేమించి తీరవలసినవాడు. వైసీవి అంటే మనిషితనం, పల్లెటూరితనం, రాయలసీమ తనం" అన్న పి. రామకృష్ణారెడ్డి మాటలు నిజం.

తమ నాన్న రచనలలో ఒక్క అక్షరం కూడా జారిపోకూడదని భావించి వైసీవి కుమారులు ప్రతాపరెడ్డి, ప్రభాకరరెడ్డి, పురుషోత్తమరెడ్డి 'వైసివి రెడ్డి సమగ్ర సాహిత్యం' శీర్షికన 2004, 2018లలో రెండు ముద్రణలు తెచ్చారు. వైసీవి పేరిట వెబ్‌సైట్‌ను కూడా నిర్మించి అందరికీ అందుబాటులో ఉంచారు. 1926లో జన్మించిన వైసీవి శతజయంతిని 2026లో కడపలో తమ కుటుంబం తరపున జరపటానికి నిర్ణయం తీసుకున్నట్లు ప్రభాకరరెడ్డి తెలిపారు. వీరొక ఆదర్శం. వీరికి అభినందనలు. వీరికి అరసం తోడ్పాటు వుంటుంది. వైసీవికి అరసం పక్షాన జోహార్లు.

**– సాహిత్య సంస్థానం – సెప్టెంబర్ 2024**

**ప్రశంస**

**నవ్య భావనా భరిత సంభావ్య మైన**
**సరస కవితా మృతంబును సాదరమున**
**జనుల కదించు భాగ్యంబు చాలగలిగె**
**ధన్యుఁడవు నీవు మిత్రమా! తథ్యముగను**

**తొలకరి చినుకులు రైతుల**
**కలిమికి మూలం బటండ్రు; కవులకు నీ యీ**
**'తొలకరి చినుకులు' కావ్యము**
**మెలఁకువఁ గల్గించు దానమేలు జగతికిన్**

**నిగ్గు లీనుచు నవ నవోన్మేష మంది**
**క్రొత్త నెత్తాని చల్లు పూఁగుత్తివోలెఁ**
**దెలుఁగు పూఁదోఁట వలపులు కలయఁ బఱపి**
**సుకవితతి కాత్మ కళలెల్లఁ జాఱలిచ్చుఁ**

**– మైనంపాటి సుబ్రహ్మణ్యము**

చిత్రకళోపాధ్యాయుడు, స్థానికోన్నత పాఠశాల, కోడూరు



**డా॥ పి. సంజీవమ్మ**
సెల్ : 7569693239

# మన వైసీవి

ఆయన 1972 నుండి ఆ మరణాంతమూ కడప అరసం అధ్యక్షునిగ సేవలందించారు. ఆయన రచనలు అరసం ఉద్యమానికి దోహదకారులు. ముఖ్యంగ 'రాయబారము', 'సిందూర రేఖ (ఎర్రగీత) గేయ కావ్యాలు, 'గట్టి గింజలు' కథా సంపుటి. ఆయన గేయ కావ్యాలతో ప్రజాకవి అయ్యారు, 'గట్టి గింజలు' తో ప్రజా కథకుడు అయ్యారు.

ఆయన గేయ కావ్యాల వస్తువు, భాష రాయలసీమ (కరువుసీమ) రైతు జీవితం, రైతు కూలీల జీవితం, 'గాసగాని' (జీతగాడు) జీవితం. భూస్వామ్య సమాజంలో గ్రామీణ జీవితాలు ఎలా నలిగిపోతున్నాయో కవి తన రైతు ధోరణిలో తన రైతు భాషలో వాస్తవిక శైలిలో చిత్రించినాడు. కవికి గ్రామీణ జీవితానుభవం దండిగ వుంది కాబట్టి ఆ కావ్యాలు సజీవం.

'గట్టి గింజలు' కథా సంపుటి పేరే ఎంతో వాస్తవికంగ వుంది. రచయిత తనకు తెలిసిన పద్ధతిలో ఈ గట్టి గింజలు పండించినాడు. కథల్లో అన్నీ వాస్తవ పాత్రలు, వాస్తవ ఘటనలు. ఈ కథకునికి ఆధునిక కథానికా శిల్పం తెలియకపోవచ్చు. అందువల్ల వచ్చిన లోటేమి లేదు. ఈ కథలకు పాఠకులు మేధావులూ గొప్ప రచయితలూ కానవసరం లేదు. ఎవరి వెతలు ఎవరికి తెలియాలో వారు సామాన్య పాఠకులు కావచ్చు, చదువు రాని వారూ కావచ్చు. చదువు వచ్చిన వారు చదివితే విని అనుభూతి చెంది పీడితులు చైతన్యవంతులు కావటం లక్ష్యం. కష్ట జీవులకు రైతు కూలీలకు, కూలీ స్త్రీలకూ చైతన్యం ఇచ్చే కథలు ఇవి. ఇది అభ్యుదయ సామాజిక దృక్పథం.

ఆయన రచనల్లోని భాష గురించి ప్రత్యేకంగ చెప్పుకోవాల్సిందే అది రాయలసీమ రైతుల, రైతు కూలీల భాష. సజీవమైన భాష. ఆ పదజాలము ఒక చిన్న నిఘంటువు అవుతుంది. రైతుభాషకు ఆయన సాహిత్య గౌరవం సంపాదించి పెట్టినాడు అని కేతు విశ్వనాథ రెడ్డి గారు అనడం ఎంతో సమంజసంగా వుంది. ఉదాహరణకు కొన్ని పదాలు:

గాసగాడు (జీతగాడు), పొతి యెండ – మితి మెండ

మాపటేల – మునిమాపు; కన్నెరాళ్ళు – మోటరాళ్ళు

కుతిలపడు – ముగించు, చెట్ల అడ్డ – అడ్డదుంప

డొక్కబలము – రెక్కబలము, రాయి మనిషి – పనిమంతుడు వెన్నుదబ్బ, తలమేపు, భూమమ్మ.....

శ్రామికుల జీవితము "పీడకలల ఓటి కుండ" అయింది అంటాడు కవి. ఇంతకంటె గొప్ప వుపమానంతో మరెవరు కవిత్వీకరించగలరు? ఆయన శైలి సాదాసీదాగ వున్నట్లే అనిపిస్తుంది. కాని అందులో లోతు కూడ వుంది.

"ఒకచేలో నట్టుజంప ఒక్క కావ్యం వ్రాసినట్లు". నట్టు జంపడం శారీరకశ్రమ. కావ్యం వ్రాయటం మేధోశ్రమ. అయినా ఎంత సహజంగా ఒక రైతు కవిగా ఈ మాటలు అనగలిగినాడు వైసీవి. ఆయన రైతు కాబట్టి ఒక రైతు శ్రమా, జీతగాని కష్టం తెలిసిన వాడు. ఒక కవి – ప్రజాకవి కాబట్టి కవి మేధాశ్రమా రెండూ మనకు అనుభూతము. కాబట్టే ఆ ఉపమానం వేయగలిగినాడు. సొదుం గోవింద రెడ్డి గారు అన్నట్లు ఇది అందరి అనుభూతులకూ అందదు.

కడప అరసం కు ఆయన సేవలు వెలకట్ట లేనివి. 'సంవేదన' త్రైమాసిక పత్రిక 1968 ఏప్రిల్ నుండి అక్టోబర్ వరకు 7 సంచికలు వెలువడింది. రారా గారు సంపాదకుడు. వైసీవి గారు ప్రచురణకర్త. ఆ పత్రిక రారా గారికి, కడప అరసం కు ఎనలేని కీర్తి తెచ్చి పెట్టింది. ఆ పత్రికకు మన వైసీవి సేవలు ప్రశంసనీయము.

ఆయన విమర్శలోతుల్లోకి ఎన్నడూ వెళ్ళలేదు, కాని ఏ సభలో ఏ విషయం మాట్లాడినా అచ్చమైన రైతు భాషలో రైతుధోరణిలో మాట్లాడి అందర్నీ ఆకట్టుకునే వాడు. ఆయన అందరి మనిషి. అందరూ ఆయనకు కావాలి. అసలైన ఉద్యమ కార్యకర్త. సభలు సమావేశాలు జరపడమంటే అందరి కంటె ఆయనే ముందుంటాడు. కరపత్రాలు వేయటం, దగ్గరి నుండి పంచడం, విరాళాలు సేకరించడం అన్నింటా ఆయన కృషే వుంటుంది. ఆయన సంబరం మనిషి. నాగరాజు పేటలో మా యింటికి ఎన్నిసార్లు వచ్చేవారో యన్నెస్ గారితో కలిసి ఇలా మేడమెట్లు ఎక్కలేనమ్మా అంటూనే ఎక్కేవారు. అరసం సభలన్నా ఇస్కాన్ సభలన్నా, 'శాంతి సంఘీ భావ సంఘం' సభలన్నా ఎంతో సంబరంతో పనిచేసేవారు. రారా గారు చనిపోయిన తర్వాత ఆయన సాహిత్యం మీద రెండు రోజుల సభలు 1989 మార్చి 1లో జరిపినాము. అందులో ప్రధానపాత్ర వైసీవిగారిదే.

కడప జిల్లా రచయితల సంఘం వారితో ఆయనకు మంచి సంబంధాలు వుండేవి. ఎవరి నైనా కలుపుకొని పోయే స్వభావం ఆయనది. ఆయన రైతు కలం (హలం) నుండి మరికొన్ని 'గట్టి గింజలు' పండించి వుంటే ఎంత బాగుండును అనిపిస్తుంది.

1989 అక్టోబర్‌లో కడప అరసం జిల్లా మహాసభలు జరిగాయి. మునిసిపల్ హైస్కూల్ నెహ్రూ అడిటోరియంలో ఆ సభలే వైసీవి గారిని మనకు దూరం చేసినాయి. అక్టోబర్ 8వ తేదీ ఉదయం సభలు ముగిసిన తర్వాత, భోజనం అనంతరం వైసీవి గారికి గుండె పోటు వచ్చింది. ఆయన పక్కన లింగమూర్తి గారు ఉన్నారు. ఆస్పత్రిలో మరణిస్తూ వైసీవి గారు "అరసం ఉద్యమం కొనసాగుతుంది..." అంటూ నినదించారు. సమావేశానికి వచ్చిన సభ్యులు ఆయనకు జోహార్లు అర్పించారు. సమావేశాన్ని రద్దు చేశారు.

ఆయన నిగర్వి. నిరాడంబరుడు. కవులకు రచయితలకు ప్రేరణ. శశిశ్రీ లాంటి వాళ్ళ చేత కవిత్వంలో ఓనమాలు దిద్దించినవాడు. అంతటి ఉత్సాహవంతున్ని మరొకర్ని మనం చూడలేము.

❖ ❖ ❖



**డా॥ పాలెం వేణుగోపాల్**
సెల్ : 9963094897

# వై.సి.వి. బహుముఖీన ప్రాభవం

"సమాజ జీవితంలో ఒరవడులున్నట్లే, సమాజ జీవిత ప్రతిబింబమూ వ్యాఖ్యానమూ అయిన సాహిత్యంలోనూ ఒరవడులుంటాయి. మంచి సమాజం కోసం రచయిత కలలు కంటాడు. మంచి వస్తువును తీసుకోవడమెంత ముఖ్యమో దానిని మంచి అభివ్యక్తితో చెప్పడం కూడా అంతే ముఖ్యం. ప్రతి కవీ తన పూర్వకవుల రచనారీతులను, మెలకువలను గమనిస్తాడు. ఆరోగ్యకరమైన ప్రపంచం కోసం తపిస్తాడు."

తెలుగు సాహిత్యాన్ని విభజించినట్లుగానే కడప జిల్లా కథా సాహిత్యాన్ని కూడా తొలితరం సాహిత్యం, మలితరం సాహిత్యం, వర్తమాన సాహిత్యం అని మూడుగా విభజించవచ్చు. సాహిత్య సృష్టికర్తలు రచయితలు, కవులు. ఈ కవులను కూడా పైవిధంగానే విభజించవచ్చు. అలా కడప జిల్లా సాహిత్యకారులను కూడా ఆ విధంగా విభజిస్తే మొదటితరంలో అయ్యగారి నరసింహమూర్తి, బాలకవి చింతా నరసింహారెడ్డి, బైరెడ్డి రంగారెడ్డి, స్వామినాథన్, సి.వి. సుబ్బారెడ్డి, పి. రామచంద్రరావు, వి. భరద్వాజులు, వంగీపురపు వేంకట శేషాచార్యులు, ఘడియారపు శ్రీరాములు, వెల్లాల మైసూరయ్య, యాలేటి వేంకటరావు బొగ్గరపు నాగవరదయ్య శ్రేష్ఠి, అవధానం సుందరం, నాగపూరి సింహాద్రిరావు, వి. భాస్కరరావు, హెచ్. మహబూబ్ మియా సాహెబ్, డి.సాపమ్మ, పూండి చెల్లమ్మ, భూతపురి నారాయణస్వామి మొదలైన వారు 1926 నుండి 1949 మధ్యకాలం వారు.

మలితరం రచయితలలో అనగా 1949 నుండి 1980 మధ్యకాలంలో రాచమల్లు రామచంద్రారెడ్డి, నాదముననిరాజు, కేతు విశ్వనాథరెడ్డి, సొదుం జయరాం, పి. రామకృష్ణారెడ్డి, యమ్మనూరు చిన్న వెంకటరెడ్డి, మల్లెమాల వేణుగోపాల రెడ్డి, శశిశ్రీ, సత్యాగ్ని, కొమ్మిశెట్టి మోహన్, కుప్పిరెడ్డి పద్మనాభరెడ్డి, ముంగర శంకరరాజు, చక్రవేణు, ఎం.వి. రమణారెడ్డి, ఎన్.సి. రామసుబ్బారెడ్డి, ఆరవేటి శ్రీనివాసులు, మలిశెట్టి జానకీరాంగారు చేరుతారు. వీరిలో మల్లెమాల వారు నెల్లూరు నుండి వచ్చి ఇక్కడ స్థిరపడినవారు.

ఇక 1980 నుండి నేటి వరకు రచనలు చేస్తున్న వారిని నేటితరం రచయితలుగా పరిగణించవచ్చు. వారు వేంపల్లె గంగాధర్, సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి, తవ్వా ఓబుల్ రెడ్డి, పాలగిరి విశ్వప్రసాద రెడ్డి, దాదాహయాత్, సొదుం రమణ, రాధాకృష్ణరాజు, బిజివేముల రమణారెడ్డి, రెడ్డినాగరాజు, నూకా రాంప్రసాద్ రెడ్డి, గుడం రామచంద్రారెడ్డి, ఇబ్రహీం, వేంపల్లె షరీఫ్, వేంపల్లె రెడ్డినాగరాజు, చెరువు అనంతకృష్ణ, ఈనాడు సురేష్, చదువుల బాబు, పుట్ట పెంచలదాసు, బత్తల ప్రసాద్, డా॥ కె.వి. రమణరావు, లక్ష్మీకర రాజు, కైప కుమారస్వామి తదితరులు.

వీరిలో సీమ సాహిత్యపు సంధిదశలో కడప జిల్లాలో ప్రాచీన ఆధునిక భావాలను సమ్మిళితం చేసిన కవిగా ప్రసిద్ధులైన మలితరం రచయితలలో "వై.సి.వి. రెడ్డి"గా పిలువబడే యమ్మనూరు చిన్న వేంకటరెడ్డి గారు ముఖ్యులు. సాంప్రదాయ సాహితీ పునాదులపై నవ్యసాహిత్య నిర్మాణం గావించిన ఆధునికులలో ఆధునికులు శ్రీరెడ్డిగారు. కార్మిక పక్షపాతి. కమ్యూనిష్టు భావజాలాన్ని సంపూర్ణంగా జీర్ణించుకున్నవారు. రైతు బిడ్డ, విలక్షణ భావావేశం, ప్రగతిశీల భావాలు మెండు. నిరాడంబరుడు. హలము కలమును పట్టిన పొలము కాపు. పదలాలిత్యానికి పేరొందినారు. సమకాలీనులతో సరితూగ గలిగి ఏమాత్రమూ మొక్కవోని కవితాకళ కలిగినవారు.

**"విచ్చు విరిమొగ్గలో వెల్లి విరియు వలపు**
**దెసల మసలెడు గాడ్పుల ముసుగు దొలచి**
**చూచి తొలిచూడ్కి నవ్వు దోబూచు లార్చు**
**కైత కమ్ముదువోని మగండుగలదె!"** అని ప్రశంసలందినా. కీర్తికాంక్ష లేనివారు.

కాసింత కవితావేశమున్న వారిని కూడా అక్కున చేర్చుకున్నవారు. రచన హృదయాహ్లాదియైతే చాలు ముద్రణాభారాన్ని కూడా సహించిన సహనశీలి. యువకవుల కాదర్శం. 'కడప గడపలలోన కవుల గడపలు మెండు' అనిన మనస్వి. రైతుగా, ఉద్యోగిగా, కూపర్ ఇంజన్లషాపు యజమానిగా, కమ్యూనిష్టు పార్టీ కార్యకర్తగా, సాహిత్య ఉద్యమకారునిగా, ప్రచురణకర్తగా, కవిగా, కథకునిగా, స్నేహశీలిగా, మాటకారిగా, సమన్వయవాదిగా, మాండలికునిగా, పలువురికి పలు విధాలుగా రూపించిన విశ్వరూపుడు. బాల్యం నుండే సద్గ్రంథ పఠానాభ్యాసం అలవడడంచే అది దినదిన ప్రవర్ధమానమై

**"శ్రీస్రక్ధరుండు సజ్జన**
**విస్రబ్ద దయామయుండు విష్ణువు కృపటీ**
**యస్సారుచంద్ర ఘనుని య**
**జస్రము గావింతు సద్విచారునిగాగన్"...**

అనే కందపద్యంతో ఆరంభమైన కవితాఝరి జిల్లా సాహిత్య చరిత్రలో ఆయనకొక సుస్థిర స్థానాన్నేర్పరచింది. అలా నిరంతరంగా... తన జీవిత పర్యంతమూ సాగిన సాహితీ స్రవంతిని పరిశీలిస్తే కొన్ని విషయాలు మనకు అవగతమవుతాయి.

రెడ్డిగారు మొదలు కవి ఆపై కథకులు. కవికి ఉండవలసిన భావన, రసజ్ఞత, ఉపజ్ఞ, ప్రతిభ, వీటితోటి కళాత్మక సంభాషణ పుష్కలగా ఉన్నవారు. తొలుత సంప్రదాయ వాసనలో తొలకరి చినుకులు, మేనక, రంభ, సిందూరరేఖ వంటి పద్య కావ్యాలను రాశారు. అందులో ఎక్కువగా ఉత్పల, చంపక మాలికలను అలవోకగా, అడపాదడపా మత్తేభ, శార్దూలాలను వాడారు. ప్రబంధకవులైన అల్లసానిపెద్దన, రామరాజభూషణుడు, నంది తిమ్మన లంటే మక్కువ ఎక్కువనిపిస్తుంది. అందుకు రంభ–రావణ సంభాషణ

వరూథిని ప్రవర సంవాదాన్ని పోలి ఉండటమే. ఉదాహరణకు పెద్దన ప్రవరుడు వరూథినిని "ఎవ్వతెవీవు భీతహరిణేక్షణ' అని సంబోధిస్తే, రెడ్డిగారి రావణుడు "ఓ కుటిలాలకా వికసితోత్పల లోచన" అని సంబోధిస్తాడు. మరోచోట రంభ ప్రత్యక్షంగానే "ఓ చతురాస్య వంశకలశోదధిశశాంక" అని సంబోధిస్తుంది. అలాగే రంభను రావణుడు రతికేళికి ఆహ్వానించే సందర్భంలో చెప్పిన "ఈ జాబిల్లి వెలుంగు వెల్లువలలోనీ మంజు కుంజాంతర..." అనే పద్యం వసుచరిత్రకారుని తలపిస్తుంది. మరో సందర్భంలో రంభ సౌందర్యాన్ని వర్ణిస్తూ...

"తన సర్వస్వము రాగరంజిత వినూత్న స్వర్గసౌందర్యమై" అలరారుతున్నదని అంటూ "భువినస్తి నాస్తి విచికిత్సా హేతుశాతోదరిన్" అని ప్రయోగించి కవిసార్వభౌముడగు శ్రీనాథుని పైని తన ప్రేమను వ్యక్తం చేశారు. అలాగే సందర్భానుసారంగా శార్దూల, మత్తేభాలను ప్రయోగించి తన ఛందః ప్రయోగ దక్షతను చాటారు. ఉదాహరణకు సింధూర రేఖలో లక్ష్మమ్మను వర్ణించు శార్దూల వృత్తం.

**ఆ యిల్లాలి వినీతి జీవితము నందానంద మందాకినీ**
**తోయంబుల్ తరళమ్ములై నొలుక వాతూలమ్ములే పొరెన**
**న్నా! యందెన్ని విహరముల్ సలిపెనో నాళీకముల్ చీల్చుచున్**
**రాయంచల్ వికసించు మొగ్గలకు విన్నాణంబు సంధించుచున్**

అట్లే రామిరెడ్డి పెండ్లి ఐదు దినాలు వైభవంతో జరిగిందని చెప్పునపుడు మత్తేభ పద్యం గమనించదగింది.

**ఒకనాడందరి మోదమందుకొని యీ యూరెల్ల నానందల**
**క్ష్మికి సైదోడగు రెడ్డి పెండ్లి నమితోత్సేకమ్ము నిండార పూ**
**ని కలల్లల్లన నిల్లువారి గొని పండింపన్ సదావైభవా**
**త్మకమై యైదు దినాలు సాగె సతతోద్యద్భోగ పర్వమ్ముగా**

పదలాలిత్యానికి కూడా అందెవేసిన చేయి రెడ్డిగారిది. అందుకు సింధూర రేఖలోనిదే సేద్యగాని వర్ణన. – చక్కని ఉత్పలమాలిక

**మూపులు బిగబట్టి, పురమూకటి చంకన బెట్టి, చీలికల్**
**దోపుల కాగగట్టి సరిదోలి పెనేసిన బిల్ల మోకులన్**
**వీపుల వ్రేలగట్టి, వడి వీడని వాన్నెల చేతజుట్టె, యీ**
**కాపుల గొల్చు వానికి నకారణ సంపదలబ్బె నొక్కటన్**

అలాగే దేశీయ ఛందస్సులపై కూడా మమకారం మెండనిపిస్తుంది. అందుకు 72 షట్పది, రగడలు గల "పారిజాత" కావ్యమే సాక్ష్యం.

రెడ్డిగారిలో అలంకార ప్రియత కూడా మెండు. పిన్ననాట సర్వశ్రీ కొడవలూరి రామచంద్రరాజు, చక్రాల నరసింహశాస్త్రి, బ్రహ్మయ్య గార్ల వద్ద నేర్చుకున్న "గురు పద్యవిద్య"చే సందర్భానుసారంగా తన రచనల్లో అలవోకగా శబ్దార్థాలంకారాలను ప్రయోగించారు. రూపక, ఉపమ, ఉత్ప్రేక్ష, అతిశయోక్తి, సహజాలంకారాలతో పాటు స్వభోవోక్తి, అర్థాంతరన్యాస, ప్రతీప, ఉల్లేఖా, వ్యాజస్తుతి, వ్యాజనిందాలంకారాలను దక్షతచే నిర్వహించారు.

**ఉదా॥** వ్యవసాయదారుడు పంటను పండించుటకై నేలను పక్వమైన పొలముగా చేసే విధానాన్ని తెలియచేయు సందర్భాన్ని ఎంతో హృద్యంగా సహజాలంకారాన్ని ప్రయోగించారో చూడండి.

సీ॥ **పదునైన పలుగుతోఁ బాపటం బొనరించి**
**కొయ్య కాడల నెల్ల - కొల్ల నూడ్చి**
**ఇరుసాలు గొఱ్ఱుతోఁ జొకఁదోలి పైపెచ్చు**
**బార గుంటక తోడఁ బాయఁ జేసి**
**దిబ్బలో నెరువునుఁ దిరుగ బైలునఁ దోలి**
**(ఒ) వండు మట్టినిఁ బెక్కు బండ్లఁదోలి**
**యొకటికి మూడింత లొప్పుగా మదిరెలో**
**నెరువుపై మన్ను నెంతేని కలిపి**

**తొలకరించెడు ముంగారు పలుకు చినుకు**
**లందు తొలిరి యెరువు పసందు చిందు**
**లాడ భూమిని సామెన యట్లు చేసి**
**కలకొలంది పొలమ్ము పక్వమ్ముఁ జేసి** - కృతఘ్నుడు.

మరోచోట

అప్సరస్సతుల కైశ్యముల బోలిన చారు, చంద్ర కాంకిత బర్హి సందోహ బర్హభారావసితమై యందమలరారు నడకతో దక్షిణానిలం వీచెనని చెప్పుచూ, బర్హభారములు అప్సరస్సతుల కైశ్యముల పోలినవని చక్కని ప్రతీపాలంకారాన్ని ప్రయోగించారు. అలాగే పనికత్తె రూపాన్ని అనగా ఆమె పనిచేయు వేళ స్వభావోక్తిలో వర్ణించారు.

**ఎలఁబ్రాయమ్మున బయ్యెదన్నడు మునందే చుట్టి గోరంచు చెం**
**గులు మోఁకాళ్ళకు పైన దోఁపుకొని చన్‌గుబ్బల్ జగాపైడి చెం**
**దుల దబ్బిబ్బొ నరించి పాటుపడ నెప్డున్ లోకకల్యాణ మౌ**
**తలపున్ వాలకపున్ సిరుల్వ్రాలు సేఁ తల్ సూడ మోదంబుగన్**

అట్లే మేనక నాట్యం చేయువేళ ఆమె హావభావాలను స్వభావోక్తిలో తెలిపాడు చూడండి.

**స్విన్న వదనము నసియాడుచున్న కౌను**
**గ్రక్కదలుచున్న పిఱుదులు కలికిచూపు**
**వలుద పాలిండ్ల పైటపై మలయు నూర్పు**
**లొలయ మేనక నాట్యము నిలిపి నిలిచె.**

అలాగే మరో సందర్భంలో మేనకను హంసతోను, కోకిలతోను, నెమలితోను విశ్వామిత్రుడు పోల్చి, వర్ణించుచూ ఉల్లేఖాలంకారం ప్రయోగించారు.

**పరువ ముడివోని దివిజ సుందరులఁ గూడి**
**యమర గంగలో నీఁదు రాయంచ వేమొ!**
**వేల్పుటెలదోఁటలో బాడు పికము వేమొ!**
**నెఱుల పురివిప్పి యాడు నా నెమలి వేమొ!**

ఇక రంభా – రావణ సంవాదంలోని వ్యాజస్తుత్యాలంకారం.

**అంబే సమీర పర్ణాహారులై తప**
**స్సుల నిగ్గుదేఱు మౌనుల గణంబు**
**నియమనిష్ఠా సమున్మీలితా ధ్వర మర్మ**
**పార దృశ్యము సోమపవ్రజమ్ము**
**ఇందు భూములు సిరులిల్లాలు మొదలుగా**
**నఖిలంబు విడుచు సన్యాసి గణము**
**వీర విక్రమ కళావిహరణంబులఁ దలల్**
**బలివెట్టి నట్టి వీరులకులంబు**

**మింతలై మీదు భవనోప కంటకములను**
**దిరిగి వేసారి నీపైఁట చెరగు సోకి**
**నంత ధన్యులమని యెంతురంటు, యిట్టి**
**నీవు రంభవు పరులకై పోవుటేమి.**

ఈ విధంగా ప్రాచీన సాంప్రదాయ వాసనలను జీర్ణించుకుంటూనే క్రమంగా సమకాలీన జీవిత పరిస్థితులకు, ఆర్థిక సమస్యలకు, రాజకీయ వాతావరణానికి, సమాజ సంఘర్షణలకు, నైతిక సందర్భాలకు, వైజ్ఞానిక విశేషాలకు అనుగుణంగా అనుకూలంగా తగినట్టి, అవసరమైనట్టి మార్పులను అవగాహన చేసికొంటూ, సాధారణ మానవుని మకుటధారిని కావిస్తూ ఒక ప్రత్యేక (రాజకీయ) వర్గం కోసం పాటుపడకుండా మార్పు భావజాలాన్ని జీర్ణించుకొని, గతంలోని మంచిని స్వీకరించి చెడును నిరసిస్తూ, కళా సౌష్టవంలేక వట్టి నినాదాలవలె కాకుండా చక్కని విషయంతో లోకం పురోగమించేలా అభ్యుదయ సాహిత్యంవైపు అడుగులు వేస్తూ, నిద్రాణమైన సమాజాన్ని మేలుకొల్పడానికై

**నిఖిలమ్ము తమకు బానిసభావములె తోప**
**చటులమౌ కటిక యాకటి చీకట్లు మూల్గు**
**కటు జీవితముల కుత్కంఠ మనసుల బెనచి**
**అలసముగా దక్షిణానిలము మాగడ్డపై యిపుడె వీచినదని**

ఆ కారణంచే

**తరతరమ్ముల భావదాస్యమ్ము దొలగించి**
**పరపీడనా దురాచరణములు మాయించి**
**బడుగు జీవుల యెదల ధైర్యమ్ము లెలయించి**
**నిలువెల్ల సుఖముగా నిలను బ్రతికెడు భాగ్య**

వంతులకు కన్నులు బాగుగా దెఱచి చూచునట్లు దక్షిణానిలం ఆలస్యంగా వీచినదని అందుచే

**నిలువెల్ల చెమటతో సొలసి చిక్కిన దేహ**
**మాత్మలను దహియింప నావురావురు మంచు**
**పొరలాడు భిక్షుకుల వరముగా భరముగా మారినదని సంతోషిస్తూ!**

భూస్వామ్య వ్యవస్థ శ్రామికులపై అంటే తమవద్ద పని చేసే గాసగాళ్ళు లేదా జీతగాళ్ళపై కారుణ్య దృష్టి కనపరచకుంటే తిరుగుబాటు తప్పదని ఆమాటే చెపుదామని అనుకుంటున్నానని అంటూనే వెంటనే నీకెందుకు చెప్పాలని అనిపిస్తున్నా చెప్పలేక చెబుతున్నానని ఆశావాదాన్ని వ్యక్తం చేశాడు. అందుకే పేద ప్రజలు సంతోషించునట్లు పరిపాలన సాగాలని,

**ఈదేశమున మహావాదోపవాదములు**
**చెలరేగి చెలరేగి విలయమ్ము సృష్టించె**
**వాటి జోలికి పోకు, బీటవారినవి పో**
**పాత సిద్ధాంతములు ప్రకృతికే నచ్చవని**

చెప్పినవి, పేదలకు నప్పినట్లుగా మెలగాలని, అప్పుడే ఆర్థిక పరిస్థితి మెరుగై వ్యవసాయాభివృద్ధి, పారిశ్రామికాభివృద్ధి జరుగుతుందనే అభ్యుదయ కాంక్షను వ్యక్తం చేశారు. ఇట్టి దశలో జాత్యాభిమానం, దేశాభిమానం, భాషాభిమానం కలసి ఆంధ్రాభిమానంగా వ్యక్తమై, "అవినీతి, అన్యాయం, అధర్మం – దేశమాత దేహసిరిపై రాచపుండ్లు, నాదేశం నేడొక ఎముకల గూడు – వినిపించుకొనే దెవడు దానిగోడు" అని ఆక్రోశిస్తున్న సమయంలో 'నా అక్షరమే నా సాహసం – మానవత నా సాధ్యం' అంటూ నిజాయితీ ఊపిరిగా, మంచి ఆయుధంగా

**దేశసంపద నెంచి దీక్షతో జన పదుల**
**పేదరికమును నెట్టివేయు సంకల్పమున**
**ధనదాహ శౌండీర్యమున తెల్లదొరతనము**
**కూటనీతిని సిరుల కొల్లగొట్టుట జూచి**

ప్రతి ఒక్కరూ స్వాతంత్ర్య యోధ హేమమకుటమై ప్రకాశిస్తే సామ్రాజ్యవాద హృదయం తప్పక చెదరుతుందని, అందుకై

**వ్యక్తులు స్వతంత్రంగా ఎదుగుతూనే**
**ఒక పాలపుంతలో గ్రహాల మధ్య**
**ఒకదానికొక...**
అవినాభావ సంబంధం కలిగి ఉండే విధంగా సంఘాలుగా మారి

**భాషల జాతుల భావసామ్యమున**
**పవిత్ర సంస్కృతి పల్లవింపగా**
**అఖిలభారతము ఆనందింపగా**
**ఆంధ్రదేశమునుసాధించాలని** చరిత్రలో పరంపరగా వినవచ్చు

ఆంధ్రజాతి బహుముఖ వైభవాన్ని రేఖామాత్రంగా మనలకందించి తన దేశాభిమానాన్ని ప్రకటించుకొన్నారు. పిమ్మట దేశంలో నిరంతరంగా సాగిన పోరాట ఉద్యమాల వల్ల 1956 నవంబరు 1వ తేదీన హైదరాబాద్‌తో కలిసి సంపూర్ణ ఆంధ్రప్రదేశ్, 1947 ఆగస్టు 15న భారత స్వాతంత్రం సిద్ధించింది. నాటి నుండి ఏటేటా స్వాతంత్ర్యోత్సవాలు జరుగుచూ 1982 నాటికి రజతోత్సవం జరుపుకుంది. ఆ సమయంలో మరొక్కసారి దేశం, ప్రజలు అనుభవించిన దుస్థితిని, శౌర్యాన్ని

**సాయుధులుగా భారతీయులాయత్తమై**
**తిరుగుబాటులు లేవదీసిరా వేశముల**
**స్వాతంత్ర్య సమరదీక్షల వీరభారతీ**
**యులు త్యాగములు చేసి పలు పాట్లు పడి కొనకు**
**గాంధీ మహాత్ము చిక్కని నాయకత్వమున**
**భరతవీరులు వారి స్వాతంత్ర్యమును బొంది**
**స్వయముగా దేశమును పాలింప దొరకొనిరి** – అని కొనియాడారు.

అలాగే

**మావి చివురుల విందు మాసరముగ మెసవి**
**కసటుగొంతుకతో – పికమ్ము పంచమమూన**
**షడ్జమము గ్రామమ్ము చంచరీకమ్ములై నవని**

**మం చెలందన్నట్టి మదనాధి దేవతలు**
**పక్షులనుఁ దోలంగ వడిజమ్ము యొడిసెళ్ళ**
**గాంధార మూర్ఛనాక్రమమ్ములో జవరాలు పాడినదని**
తన సంగీతాభిమానాన్ని కూడా ప్రకటించారు.

రెడ్డిగారు ప్రకృతివర్ణనా ప్రియులు. దృశ్యమాన జగత్తులోని చెట్లు, గుట్టలు, నదులు, తీగలు, పూలు, కోయిలలు, తుమ్మెదలు మున్నగు వాటితోడి ప్రకృతిలో మమేకమై నా ప్రబంధకవులవలె గాక బాహ్యస్వరూపానికి ప్రాధాన్యతనీయక, తద్దర్శనంచే వారి అనుభూతులలో కలిగిన పరిస్పందన అనగా ఆత్మానుభూతి సమ్మున్మీలనానికి ఆలంబనంగా ప్రాణప్రతిష్ఠ చేశారు. ఉదాహరణకు విశ్వామిత్రుని కీర్తి (మేనక కావ్యం) స్వర్గానికి వ్యాపించినదనడానికి, "నందనోద్యాన తరులఁ బూవులై విచ్చెఁ దద్గుణామోదమ్యగ" అలాగే మేనకాదేవి వలపు గంగానదివోలె "స్వర్గము నుండి పుడమికి వచ్చినదని" నూత్న భావాలను వెలిబుచ్చారు అట్లే మేనక

**మలయ పవనుడు దనరాకఁ దెలుపుచుండ**
**గలికి తేంట్లు ఝుంఝుమ్మని పిలుచుచుండ**
**మేనితావి గుబుల్కొన....** విశ్వామిత్రుని చేరబోయినదని వర్ణించాడు.

అట్లే రంభా – నలకూబరుల రాసకేళి సందర్భాన్ని కూడా మనోహరంగా వర్ణించాడు.

**"కమ్మగాఁ దేటిగములు ఝుంఝుమ్మటంచు**
**ముసురుకొని పుష్పరజమున మసలి, మధువు**
**ద్రావి తన్మయతను రాని రాగములను**
**మదుల చిలికించె, భోగ సంపదలఁ బంచె"**

**"తారకానాథుఁడుదయించెఁ దరుల చెంత**
**విచ్చెకల్హారముల చాలు – విచ్చె పొన్న**
**పొంచి కాంచనములు పిపాలించె – మించె**
**పిల్లతెమ్మెర తేజి రూపెత్తి మరుడు..."**

అట్లే "తొలకరి చినుకులు" కృతిలో

**"వలపు జవ్వనికి ముద్దు చెల్లింప సాంధ్యరాగ**
**మవిరళంబుగ బంగారు రవిక యయ్యె"**

అని రమ్యమైన అంగిత్వభాగ్యాన్ని కల్పించాడు. ఇలా ప్రకృతితో మమేకమైనా సందర్భానుసారంగా సందేశాన్నిస్తూ రచన చేసి వానికి పటిష్టతను కలిగించారు.

ఈ విధంగా సుకుమార భావ వ్యక్తీకరణతోను, పదలాలిత్యంతోను, సరసమైన కవిత్వం చెప్పిన శ్రీ వై.సి.వి. రెడ్డి గారు అరసంలో చేరాక, ఉద్యమమే ఊపిరిగా సరసమైన కవిత్వం చెప్పిన శ్రీ వైసీవి రెడ్డి గారు అరసంలో చేరాక, ఉద్యమమే ఊపిరిగా నిజమైన కార్యకర్తగా వుంటూ, పల్లెలో జీవితాలతో, పల్లెల ఉద్యమాలతో సంబంధాలేర్పరచుకుంటూ మారుతున్న సమాజానికి మచ్చుతునక లాంటి కథలను అల్లినట్లు కాక, సహజసిద్ధంగా ఎండలో అలసి చెమటలు పట్టిన వానికి చల్లనిగాలి ఎంత హాయినిస్తుందో అలాగే పిల్లతెమ్మెరలా "గట్టిగింజ"ల్లా అందించాడు. వస్తువులో, పాత్రచిత్రీకరణలో నాటకీయతలో, దృక్పథంలో, కథనంలో, శైలిలో, ఎత్తుగడలో, ముగింపులో, మాండలిక ప్రయోగంలో, కథా రచయితగా రాణించాడు. ఒక విధంగా ప్రఖ్యాత కవి, విమర్శకులైన ఆవంత్స సోమసుందర్ గారిలా రాసిన దానికి ప్రతిఫలం ఆశించకుండా, హంగులు, ఆర్భాటాలు, భేషజాలు లేకుండా అన్ని తరాల రచయితలతో కలిసి ప్రయాణించి కలం పట్టిన నాటి నుండి కన్నుమూసే దాకా కలం మూయని కవి, రచయిత ఎమ్మనూరు చిన్న వేంకట రెడ్డిగా పిలువబడే శ్రీ వై.సి.వి. రెడ్డి గారు

**"జన్మనెత్తిన మానవునకు**
**జీవితమే పరమధనం**
**అయితే అది ఒక మారే**
**అతని కొసగబడిన వరం"**

**ఆధారాలు**


1. ఆధునికాంధ్ర కవిత్వం – సంప్రదాయాలు ప్రయోగాలు – డా॥ సి. నారాయణ రెడ్డి
2. అభ్యుదయ (అక్టోబరు 1989) – ఏటుకూరి ప్రసాద్
3. కథావరణం – సింగమనేని నారాయణ
4. కవిత్వా వరణం – ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి
5. చర్చ – ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి
6. విమర్శాపునర్నవం – ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి
7. వై.సి.వి. రెడ్డి రచనలు – ఒక పరిశీలన – డా॥ జి. రామకృష్ణ
8. వై.సి.వి. రెడ్డి సమగ్ర సాహిత్యం – శ్రీ వై. ప్రభాకర రెడ్డి బృందం
9. రాయలసీమ కథానిక – తొలిదశ – ఒక అధ్యయనం – డా॥ తవ్వా వెంకటయ్య



**డా॥ వెల్లాల వేంకటేశ్వరాచారి**
సెల్ : 8919142544

# వై.సి.వి. సాహిత్యం - ఛందశ్శిల్పం

## తొలకరి చినుకులు

ఎమ్మనూరు చిన్నవెంకటరెడ్డినే వై.సి.వి. రెడ్డిగా పిలుచుకోవటం పరిపాటిగా మారింది. పులివెందుల తాలూకా బోనాల గ్రామవాసిగా లక్షుమ్మ – కొండారెడ్డి దంపతులకు చిన్న వెంకటరెడ్డి తృతీయ సంతానంగా జన్మించిన వ్యక్తి. అది బ్రిటిష్ దొరల సామ్రాజ్యం. చాలా గ్రామాల్లో వీధి బడులు కూడా లేని రోజులవి. ప్రొద్దుటూరులోని ముక్తిరామేశ్వరం వాస్తవ్యులైన కొడవలూరి రామచంద్రరాజు గారిని బోనాలకు పిలిపించారు. వారు భట్రాజ శ్రేష్ఠులు. వారి శిష్యరికంలో పురాణ కావ్యేతిహాసాలు, వ్యాకరణం, ఛందస్సు, అలంకారాలు ఇత్యాది చదువులు కొంత అలవడ్డాయి. ఆ తరువాత వివిధ ప్రాంతాల్లో పలువురు గురువుల వద్ద ఆధునిక చదువుల మర్మాల్ని అభ్యసించిన కోవలో అవధాన విద్య కొంత అలవడింది. అందులో ప్రారంభం ముగింపు శీఘ్రంగా జరిగిపోయాయి. చిన్న చిన్న రచనలతో అంచెలంచెలుగా పద్యకవిగా రెడ్డిగారు ఎదిగారు.

వై.సి.వి. రచనలలోని ఛందోఅలంకారములను మచ్చుకు ప్రస్తావించడమే ఈ వ్యాసం ఉద్దేశం.

వీరు జాతులు, ఉపజాతులు, వృత్తములుగాగల పద్యముల నెన్నుకొని వివిధ శీర్షికల క్రింద 'తొలకరి చినుకులు' పద్య రచన చేశారు. ఇందులోని పద్యములు ద్రాక్షాపాకములు కాకపోయినా దీర్ఘసమాస భూయిష్టములు, కఠినతర పదములతో నడచిన నారికేళ పాకముల వంటివి మాత్రము కాదనిపించి, కదలీ ఫల పాకములో నడకను సాగించినవని చెప్పుకోవచ్చు.

'గతము' అనే శీర్షిక క్రింద ఒక పద్యాన్ని గైకొని అందున్న అలంకారాన్ని గమనింపగా

**"కోకి లాలాపముల వినగోరి కొమ్మ**
**కొమ్మకుంబోయి చిగురుటాకుల వినూత్న**
**శయ్యపై మేను జేరిచి శ్రావ్యనాద**
**మాలకించుచు గ్రొత్తస్వప్నాల గంటి"**

ఇందులో రచయిత క్రొత్త స్వప్నాలను కనటం అనేది కార్యమైతే దీనికి కారణం కోకిలాలపములు, ఆ కోకిలాలాపములకు కొమ్మ కొమ్మలో బుట్టి చిగురాకుల సోయగాలకు కోకిల తృప్తి నొందటం, అటువంటి వినూత్న శోభను చెట్టు కొమ్మలు కలిగి ఉండటం, అటువంటి చిగురుటాకుల కొమ్మల్ని శయ్యగా

భావించుకోవటం, వినసొంపైన కోకిల గానాన్ని ఆలకించటం, తద్వారా కవి క్రొత్త స్వప్నాల్ని కనటం అనే కార్యంపైన పై కారణాలు ఆధారపడి ఉన్నాయి. ఇక్కడ జాతిగుణ క్రియాదులు చక్కగా స్వభావసిద్ధముగా వివరించబడినందున స్వభావోక్తి అలంకారమిందు చక్కగా శోభించుచున్నది. ఇలాంటి స్వభావోక్తి అలంకారములు మరెన్నియో తక్కిన పద్యములలో గోచరించును.

## వృత్తి

అదే శీర్షిక క్రింద మరొక పద్యమైన –

**"పూర్ణచంద్రుడు సుఖముగ – బుష్పశయ్య**
**పైని శయనించి కలువజ వ్వనుల యధర**
**మధుర రసమును చవిచూచి మత్తు దగుచు**
**పరవశత నుండ గనుగొంటి – స్వప్న వీధి"**

ఇందులో కైసికి, ఆరభటి, సాత్త్వతి, భారతి అనెడు చతుర్విధ వృత్తులలో – పున్నమ చంద్రుడు తన వెన్నెల కిరణములనెడు చేతులతో పుష్పశయ్యలను స్పృశిస్తూ, యవ్వన నతులైవ కలువకాంతల రేకులనెడు అదరముల యందుండు మధుర రసానుభూతిని చవిచూచి ఆ మత్తులో పరవశత్వాన్ని పొందుతున్నట్లు కవి కోమలమైన అర్థాన్ని ఇందులో పొందుపరచి నందున ఈ పద్యములో కైసికీ వృత్తి ఉన్నట్లు తెలియుచున్నది.

## రీతి

వైదర్భి, గౌడి, పాంచాలి అనే రీతుల నాధారంగా 'కడుపుమంట' అనే శీర్షికలో ఒక పద్యోదాహరణ

**గాలి వానలకు చెడి – చాలి చాల**
**నట్టి కొట్టము పడిపోయి – మట్టిగలసె**
**నిలువ నీడైన లేని యీ నీచ జీవి**
**తమ్ము వమ్మిది నగ్న సత్యమ్ము సుమ్ము!**

ఇందులో పేదరికముతో గడిచే పల్లె జీవనంలో మట్టిగోడలతో నిర్మించిన కొట్టము గాలి వానకు కూలిపోవటం నిలువ నీడ లేక చలిలో రేబవళ్ళు వణకుచూ పస్తులతో గడిపే నిరుపేదల జీవనంలో, ఇందన్నియు మృదుపదములు, సమాసము లేదు. తేలిక పదములతో అర్థమును సులభంగా కొనసాగించు పద్యరచన 'వైదర్భి' రీతిలో సాగినదని చెప్పవచ్చు. ద్రాక్షపాకమునకీ పద్యము దాహృతి.

## మేనక

రెడ్డిగారి రచనల్లో రెండవది 'మేనక' యాబది యొక్క తేటగీతి పద్యములతో ఈ రచన సాగింది. ఇందులో మేనకా విశ్వామిత్రుల సంగమము ప్రధానము. విశ్వామిత్రుని తపోభంగమునకు మేనకను పావుగా

నియోగించి ఇంద్రుడు ఆ తపోధనుని కడకు పంపటం. ఇంద్రుని ఆజ్ఞతో ఆ మేనక స్వామి కార్యమును నెరవేర్చు వరకే పద్యరచన ఖండకావ్యంగా కొనసాగింది. అంతకు ముందు, వెనుకల కథా సారాంశమును కవి చెప్పదలచుకోలేదు. దీన్ని సంపూర్ణ కావ్యంగా మలచదలచుకోలేదు.

ఇందులోని 'మేనక – విశ్వామిత్రుడు' నాయికా నాయకులైననూ మేనక మునీంద్రునిపై అనురాగవర్తిని కాదు. స్వామి కార్యమునకు మాత్రమే నియోగింపబడిన ఒక యాతి.

దక్షిణుడు, అనుకూలుడు, ధృష్టుడు, శరుడు అనుచతుర్విధ శృంగారనాయకులలో మునీంద్రుడు మేనకపై అనురక్తుడై ఆమె కార్యమును నెరవేర్చుటకు తాను అనుకూలుడుగా వర్ణించి తన కార్యమును చక్క చేసుకున్నాడు.

స్వీయ, పరకీయ (అన్యోఢ్య), సామాన్య అనే స్త్రీ త్రివిధ లక్షణాల్లో వ్యభిచరింపదలచి, సిగ్గును వదలి, సంకేత స్థలము నందు పరపురుషున్ని ప్రియునిగా యెంచి, వగలు జూపించి, తన కార్యమును నెరవేర్చుకొని పోదలచిన అంగన పరకీయ (వేశ్య)గా మేనక ఈ లక్షణములతో ఇందుగన్పట్టుచున్నది.

కాంతుని చెంతకు తావెదకుచూ వెడలి కాంతుడనురక్తుడగు వరకు సకల మన్మథ విద్యలు వాని ముందు ప్రదర్శించి కడకు కృతకృత్యురాలై తనయభీష్టము నెరవేర్చుకొన్న అభిసారికగా మేనక అష్టవిధనాయికల్లో యొకతెగా ఇందు మనకు కన్పట్టుచున్నది.

తన అభీష్టముతోపాటుగా ఇంద్ర కార్యమునూ చక్కబెట్టుటలో మేనక నవరసాల్లో నొకటైన 'శృంగార' రసకథానాయికగా మేనక తన పనిని తాను నిర్వర్తించినది. ఈ దశలో తాను సంభోగ శృంగార కాంతగా వ్యవహరించి పరస్పరానుకూలతల్ని సాధించి సరిహద్దులు దాటి తాను గర్భము దాల్చు స్థాయికి విశ్వామిత్రుని గొంపోయినది. అట్టి శృంగార రసములో స్థాయీభావము 'రతి'యే కానీ మేనకకు మరొక్కటేదియు ఆమె మనమున గన్పడదు.

మేనక మన్మథుని వాహనమైన చిలుకతో యిట్లు వేడుకొన్నది.

**మదనవాహన యేల కూసెదవె చిలుక!**
**పలుకు నేర్పెద నీకు నే ఫలము లిడెద**
**నొక్క సాయము జేయు నిన్నెక్కినపుడు**
**మరుని గొనిపొమ్ము కుశిక కుమారు కడకు॥**

అంటూ నీకు పళ్ళిస్తాను, మాటలు నేర్పుతాను మన్మథున్ని నేరుగా ఆ కౌశికుని వద్దకు కొనిపొమ్ము. ఈలోగా నేనూ అచటికి వచ్చి నా పని కానిస్తానని వెళ్ళి "నేను దేవేంద్రకొల్వులో సానినంచు" తన్నుతాను పరిచయము కావించుకొన్నది.

**లలిత కుంతల యగు శకుంతల ప్రశాంత**
**మైన కణ్వుని యాశ్రమమందు తిరుంగు**
**సరస ధర్మావతార దుష్యంత నృపుడు**
**భరతుడొకసారి తలపులో దిరిగిరేమొ**

మేనకను జూచిన ఆ ఋషి పుంగవునికి తన భావికర్తవ్య మంకురించినది కాబోలు మేనకను ఆపై కరుణతో హత్తుకొన్నాడు. ఇందులోని పద్యములు రమణీయం, కమనీయార్థముల స్ఫురింప జేయుచూ నిజముగా ద్రాక్షాపాకములో పాఠకుల హృదయాలను హత్తుకొన్నవి.

## రంభ

'రంభ' రెడ్డిగారి మూడవ కావ్యఖండిక. కవితావ్యాసంగములో తనలో చెలరేగిన కొన్ని మధురభావాల ప్రస్తావనయె 108 పద్యాల ఈ 'రంభ' రచన. ఇందులో తేటగీతులు, కందములు, వృత్తములు, సీసముల ప్రస్తావనయే కాని ఆటవెలదులు కన్పించవు. ఇందులో 'రంభ నలకూబరుల' ప్రణయము, ఇందుకు రమణీయమైన ప్రకృతి యనుకూలము, కోకిల గానము, పూల సోయగాలు, తుమ్మెదల ఝుంకార స్వనములు, పండువెన్నెలలు, వికసించిన పుష్పసౌరభాలు, కవి హృదయాన్ని కదిలించి కవన రంగంలోకి మళ్ళించాయి.

తియ్య తేనియలొలుకు ద్రాక్షాపాకము వలె సరళమైన పదాలతో సాగిన తేటగీతులు, పాఠకులు, శ్రోతల వీనుల కింపు సొంపొనరించు సాహితీ మాధుర్యమ్మును సీసాలకెత్తించి, సురలోకాధిపతి ముంగిట కాలియందెల గలగలలాడించి నాజూకుగా నడచి, రంభ తన ఒయ్యారములను చక్కని వృత్తపద్యాల్లో ఒలికింపజేశాడు కవివర్యులు. వృత్తులు, నాట్యాశ్రమములు, రీతులు రచనాశ్రయములని వ్యవహారం.

భరతుని మతమున కైశికి, ఆరభటి, సాత్వతి వృత్తులు మూడుకాగ, వైదర్భి, గౌడి, పాంచాలి అను రీతులు మూడుగా చెప్పబడుచున్నవి. పదముల పొత్తును లేదా ఇంపగు పదములను సొంపుగా కూర్చుటను 'శయ్య'గా లాక్షణికులు చెప్పిరి. జాత్యుపజాతి వృత్త పద్యములన్నియు చక్కగా కూర్చబడి శయ్యగా పద్యములు సొబగుదీరినవి. ఇందు వృత్తములు మాత్రము పరుషాక్షరములుగల పదబంధములుగా, దీర్ఘ సమాసభూయిష్టములై యున్నందున 'గౌడి' రీతిని కొనసాగించినవి.

**"నన్ను లాలించి నేనున్న చోటికి వచ్చి**
**పరమ వేదార్థ భావముల జెప్ప"**

అని జెప్పుచోట చక్కని పదములను జోడించి రెడ్డిగారు 'శయ్య'గా ద్రాక్షపాకములో కనులకు కన సొంపు, వీనులకు వినసొంపును కూర్చిరని చెప్పవచ్చు.

## సిందూర రేఖ

ఈ శీర్షికలో యమ్మనూరు చిన్న వెంకట రెడ్డి గారు ఒకచోట ఉదాహరించిన 'సీస' పద్యపాదాన్ని గమనిద్దాం.

**సీ. తనయింటి చాకలి కనుగలం బైనట్టి**
**పాడిమే కల రెంటి బట్టి యిచ్చె"**

ఇందులో 6 ఇంద్రగణాలు 2 సూర్యగణాలు కలిపి 'సీస' పద్యపాదంగా యేర్పడింది. (8 గణాలు).

సీసంలో పైనున్న నాల్గవ గణం (బైనట్టి) స్థానంలో క్రింది భాగంలో చివరలో ఉన్న రెండు సూర్యగణాల్లో (బట్టి, యిచ్చె) ఒక సూర్యగణాన్ని (బట్టి) చేర్చినచో, 3 ఇంద్ర గణాలు 1 సూర్యగణం, 3 ఇంద్రగణాలు 1 సూర్యగణంగా యేర్పడి అది 'ద్విపద' పద్యమౌతోంది.

ఉదా: **తన యింటి / చాకలి / కనులం బట్టి (3+1)**
**బైనట్టి / పాడిమే కలరెంటి యిచ్చె (3+1) = 8 గణాలు**

అర్థంతో పనిలేకుండా కేవలం రెడ్డిగారి పదాలనే తీసుకొని ఇక్కడ 'ద్విపద' పద్యపాదాలు యేర్పడిన విషయాన్నే ప్రస్తావించటం జరిగింది. పైరెండు పాదాల్లో 2వ అక్షరం ప్రాసగా ఉన్నందున ఇది 'ద్విపద' ఇదే లక్షణంతో ప్రాసలేకున్న 'మంజరీ ద్విపద' ఔతుంది.

ఈ ద్విపద పద్యపాదాల్ని రెట్టించిన అంటే 3 ఇంద్రగణాలు 1 సూర్యగణం, 3 ఇంద్రగణాలు 1 సూర్య గణం, 3 ఇంద్రగణాలు 1 సూర్యగణం, 3 ఇంద్రగణాలు 1 సూర్యగణం వీటినీరీతి కలిపిన త్రిపద ఔతుంది.

**త్రిపదకు ఉదాహరణ**

**తన యింటి చాకలి కనుగలం బట్టి**
**పాడిమే కల రెంటి బట్టితా నిచ్చె**
**తన యింటి చాకలి కనుగలం బట్టి"**

ఇలా త్రిపద యేర్పడింది.

పైనున్న సీసంలో మొదటి భాగం చివరనున్న 2 ఇంద్రగణాల్ని (కనుగలం బైనట్టి) తొలగించి, వాటి రెండింటి స్థానంలో క్రింద చివరలోనున్న 2 సూర్యగణాల్లో (బట్టి, యిచ్చె) ఒక్క సూర్యగణాన్ని (బట్టి) చేర్చిన 2 ఇంద్రగణాలు 1 సూర్యగణం, 2 ఇంద్రగణాలు 1 సూర్య గణంగా గణాలు యేర్పడి అది 'మధ్యాక్కర' పద్యపాదం ఔతోంది.

**ఉదాహరణకు**

**తన యింటి చాకలి బట్టి (2+1)**
**పాడి మే కల రెంటి యిచ్చె (2+1) = 6 గణాలు**

ఇలా 'మధ్యాక్కర' పద్య పాదం యేర్పడింది.

పై సీస పద్య పాదంలోని చివరి 2 సూర్యగణాల్ని 1 చంద్రగణం (సలల – ııయుıı)గా మార్చిన, అంటే 5 ఇంద్రగణాలు ప్రక్కన 1 చంద్రగణాన్ని చేర్చడం ద్వారా అది 'షట్పది' పద్యపాదం ఔతోంది.

**ఉదాహరణకు**

**తన యింటి చాకలి కనుగలం బైనట్టి**
**పాడి మే కల రెంటి తనయింటి**

ఇచ్చట రెడ్డిగారు సీసంలో వాడిన పదాలు 5 ఇంద్రగణాల ప్రక్కన 1 చంద్రగణం (తనయింటి – ııయుıı) తో 'షట్పది' యేర్పడటాన్ని మనం గమనించవచ్చు.

పైనున్న 'సీసం' పద్యపాదంలో గణాల్ని అటూ ఇటుగా మార్పు చేర్పులతో ద్విపదగానూ, మంజరీ ద్విపదగానూ, తరువోజ, మధ్యాక్కర, షట్పది, త్రిపది మున్నగు ఎన్నో పద్యపాదములుగా మారటం గమనించాం. ఇలా ఒక్క సీసం అనేక 'దేవి' ఛందస్సులకు ప్రాతిపదికయైనట్లు, వివిధ చమత్కారాల్ని కలిగించినట్లు మనం చూశాం. ఇవి 5 మాత్రలు గలిగిన చంద్రగణాలతోనూ పూరింపబడి 'ద్విరతగతి రగడ' ఇత్యాది రగడ పద్యపాదాలుగా కూడా రూపాంతరాలు చెందుచున్నవి.

1953లో విద్వాన్ విశ్వంగారి 'పెన్నేటిపాట' వై.సి.వి. రెడ్డిగారి హృదయాన్ని కదిలించింది. పల్లె జీవనుల జీవన విధానాన్ని పద్యకావ్యంలో మలచదలిచారు రెడ్డిగారు. పెత్తందారీ వ్యవస్థలో మంచోళ్ళు కూడా చెడిపోతారని, దిక్కులేనోళ్ళు దోపిడి దారి వ్యవస్థకు బలయై వివిధ బాధల్లో ఉన్నారని తన పద్యరచన ద్వారా వర్తమానానికి, భవిష్యత్తుకు అందించి మార్పును తీసుకురావాలని కవి భావన.

ఒక సేద్యగాడు ఒక ఉగాది నుండి ఇంకొక ఉగాదికి తాను తన రైతింటిలో చేసే పని విధానాన్ని వసంత వర్ణనతో ఆ సేద్యగాని ద్వారా రెడ్డిగారు ఆరంభింపజేస్తారు. ఆ సేద్యగాని ఊహలే 'సిందూరరేఖ' లోని పద్యాలు. ఇందులో కందాలు, తేటగీతులు, వృత్తాలు, సీసాలున్నాయి కానీ ఆటవెలదులు కనిపించవు. ఇవి 201 పద్యాలుగా కూర్చబడ్డాయి.

నిరంతరము పొలాల పనుల్లో నిమగ్నమై యున్న సేద్యగాడు ఛందోబద్ధమైన పద్యాల్లో తన భావాల్ని పలికించగలడా! అని కవివర్యులకు అనిపించిందేమో పాపం కొన్ని పద్యాలేమో అవి ఛందస్సో పేరు పెట్టి, ఆ తరువాతి విఛందోబద్దంగా రచన సాగినా అవి ఏ పద్యాలో చెప్పక వదిలేశాడు పాపం. ఇవి సేద్యగాని మాటల్లో సాగిన భావాలు కదా!

సీమ ప్రాంతీయ భాష యందు దొరలు యాసలును, కోపుతాళ్ళు, పగ్గాలు, పలువుతాళ్ళు, కాడి, మేడి, ముల్లుగట్టె, పసికోడెల కాడి, అఱ్ఱుసాచు, కోంౘ్ర, పగ్గము, సంబరము, చెలకోల, తొలకరింపు, పులకరింపు, పలకరింపు, పొట్టు జొల్లలు, ముంగారి పదును, వరుపు సేద్యాలు, గడ్డిగాదము, గొఱ్ఱు గుంటక సేద్యం, ఎరువు ఎంపలి, వంటి సీమ వ్యావహారిక మందున్న రైతులకు సంబంధించిన మాండలిక పదాలెన్నియో ఈ పద్యముల యందు గన్పట్టుచున్నవి.

“ఉల్లోలంబున కల్లుద్రావిన బలీ మోదగ్రబుక్షాధ్వభో
గోల్లాసంబగు మేఘ మండలము లైద్యుత్పాత సంకీర్ణ సం
పుల్లాభీల గనాగనంబయి మహాస్ఫోట ప్రభాజాలమై
కల్లోలంబయి వర్ష విభ్రమము పాకింబయ్యె నాటికిన్”

## రసము స్థాయీ భావము

దీర్ఘసమాస భూయిష్టములైన పదాడరంబులు గల్గిన వృత్తశార్దూలముల నడక పాఠకులు గంభీరంబుగ పఠించుచుండ, నిజముగా శార్దూలములు పాఠకుల నుండిశ్రోతల మీదికి ఉరికి భయభ్రాంతులు గల్గించినట్లగును. ఇందు ‘రౌద్ర’ రస భావనకు క్రోధము స్థాయీ భావముగా పద్యములలో కన్పట్టును.

## అలంకారము రీతి పాకము

ఇందు ఉల్లోలంబు, కల్లుద్రావిన, ఉల్లాసంబు, పుల్లాభీల, కల్లోలంబయి – అనే పదాల్లో ఒక హల్లు పలుమార్లు ఆ వృత్తి నొంది వృత్త్యానుప్రాసాలంకారము గల్గియున్నది. చక్కని పదముల పొందికతో ‘శయ్య’ను బాగా కుదుర్చుకొన్నది. వృత్తులు నాట్యాశ్రయములు, రీతులు రచనాశ్రయములుగా చెప్పుదురు. ఇందు పరుషాక్షరములు, దీర్ఘసమాసములతో నిండి యుండి, పదబంధముల పొందిక ‘గౌడి’ రీతిని తలపించుచున్నది. ‘పాకము నారికేళ’మని చెప్పవచ్చును. వామనుడు గుణములు కావ్య శోభను గూర్చునవి (కావ్య శోభ యాః కర్తారో గుణాః) అన్నాడు. శ్లేష, ప్రసాద, మాధుర్య, సౌకుమార్య, సమతా, అర్థదీపన, ఉదారతా, వాంతి, ఓజస్సు, సమాధి అని గుణములు పది విధాలుగా వక్కాణించారు.

## ఓజస్సు

“వామనుడు గాఢ బంధత్వమోజః” అని లక్షణం చెప్పాడు. ద్విత్వ, సంయుక్తాక్షరముల పదబంధములు, రేఫ సంయుక్తములు (సంకీర్ణ, వర్ష), వర్గ ప్రథమాక్షర సంయుక్తములు (గ్ర, క్షా), తుది యందు గురువుండుట (నాటికిన్) ఇత్యాదులచే పదబంధాల్లో గాఢత్వము గన్పట్టి పైపద్యమున ‘ఓజో’ గుణము గల్గియున్నది.

**అన్నపూర్ణలు మాయూరి ఆడవారు**
**ముద్దు కూతుళ్ళు సంగటి ముద్దలెత్తి**
**కడుపు నిండుగ బెట్టిరి గడ్డ పెరుగు**
**గడ్డలను విరిచి చేతులకందినంత**

అందమైన తేటగీతి పద్యములో తన ఊరి ఆడువారు ఆకలిగొన్నవాళ్ళకు అన్నం పెట్టే అన్నపూర్ణమ్మలని, తలిదండ్రులకు వారు ముద్దుల కూతుళ్ళని, సీమసంగటి ముద్దను, పప్పుతో మేళవించి రుచింపజేసి ఆపైన గడ్డ పెరుగుతో కడుపు నింపి ఆకలి తీర్చడం తన ఊరి తల్లులకు చెల్లిందన్నారు రెడ్డిగారు. తేలిక పదములకూర్పు ద్రాక్షాపాకములో సాగింది. జాతి గుణక్రియాదులను ఉన్నదున్నట్లు వివరించి యథార్థమగు విషయములను

సరళమైన పద్యములో కొనసాగించగా స్వభావోక్తి అలంకారం ఇందు గోచరించుచున్నది. పాకము ద్రాక్షాపాకము, చక్కని పదబంధాల్ని సమకూర్చుకొని 'శయ్యా' సౌభాగ్యాన్ని కలిగియున్నది. అన్నియు మృదుపదములే సమాసములు లేవు. ఉన్ననూ అవి అల్ప సమాసములు. కనుక 'వైదర్భి' రీతిలో పద్యం నడక సాగింది. ఇట్టి పద్యములనేకములు.

**"వానలే లేక భూములు పండలేవు**
**భూమి పండక యున్నచో భుక్తి లేదు**
**భుక్తి లేకున్న కళలకు ముక్తి లేదు**
**కళలు లేకున్న దేశమే కదణి నిలుచు"**

ఇందులో కళలపై రచయితకు మక్కువనిపించుచున్నది. ఆ కళల్ని వానలుపడటంతో ముడిపెట్టబడుచున్నది. ఇందు పూర్వాపూర్వములు ఉత్తరోత్తరములకు గాని, ఉత్తరోత్తరము పూర్వాపూర్వమునకు గాని ముడిపెట్టబడినది కనుక ఇందులో కారణమాలా లంకారమున్నది.

వానలతో పంటలు పంటలతో జీవకోటికి భుక్తి, భుక్తితో కళలు, కళలతో దేశము రాణించుట జరుగుచున్నది. ఇందొక దాన్ని నొకటి పరస్పరం ఆధారములై వృద్ధిగాంచుచుండును.

## దక్షిణా నిలము

'దక్షిణానిలము' (దక్షిణ + అనిలము) ఇది ఒక గేయ ఖండిక. దక్షిణము నుండి వీచిన గాలియే దక్షిణానిలము. మనకు దక్షిణముగానున్న కేరళ ప్రాంత జనజీవన విధానము పైనున్న ఉత్తరదేశమునకు ప్రాకినదిగా చెప్పుకోవచ్చు. కన్నడంలో 'రగడ' అని ఒక ఛందస్సు ఉన్నది. తెలుగులో ఈ 'రగడ' దేశి ఛందస్సు. రగడలో మాత్రా సమానమైన మాత్రా సంఖ్య ఉంటుంది. జానపద వాఙ్మయంలో ఈ ఛందస్సున్నది. మాత్రా ఛందస్సులో కూడా యతి, ప్రాసల్ని పోషించాల్సి ఉంటుంది. రగడలు గాన యుక్తముగా సాగే ఒక క్రమాన్ని ఆశ్రయించి ఉంటాయి. రగడలు మాత్రాఛందస్సులో ఒక నియమాన్ని పాటిస్తూ ముందుకు సాగుతాయి.

ముత్యాలసరాల ఛందస్సులో పూర్ణమ్మ కథ, కన్యక, గురజాడకు ఖ్యాతి తెచ్చాయి. శివతాండవం – పుటపర్తి నారాయణాచార్యులకు కీర్తి తెచ్చింది. 'మేఘదూతం' కూడా పుట్టపర్తికి పేరు తెచ్చిన రచన.

ఇవన్నీ మాత్రాఛందస్సులో ఒక క్రమాన్ని అనుసరించి గానానుగుణంగా రచించబడ్డ ఛందోబద్ధ రచనలే.

## మాత్రా ఛందస్సు

ప్రతి పాదములో 20 మాత్రలు గల్గిన 3 పాదములు నాల్గవ పాదములోనూ 20 మాత్రలే ఉండి, 5వ పాదంలో 10 మాత్రలతో ముగింపు ఉంటుంది.

ఇందులో 4, 5 పాదాలు మాత్రము 'మకుట ప్రధానముగా సాగి, అన్ని 4, 5 పాదాల్లోను ఇదే మకుటం పునరావృతమౌతూ ఉండటమే.

**"నిలువెల్ల చెమటతో సొలసి చిక్కిన దేహ**
**మాత్మలను దహియింప నావురావురు మంచు**
**పొరలాడు భిక్షుకుల వరముగా భరముగా**
**అలసముగా దక్షిణానిలము మా గడ్డపై**
**వీచెనమ్మా! యిపుడె!"**

అలతి యలతి పదాలతో ద్రాక్షాపాకములో సాగిందీ గీతం. కమ్మనైన గానలహరిలో సరళమైన ఇంపు సొంపలరు పదాలతో మధురమైన 'మాధురీ' గుణమును పుణికి పుచ్చుకొని అర్థవంతమైన తేలిక పదాలతో వైదర్భిరీతిలో పేరులేని దక్షిణానిలపు పొలము కాపరి, పొలములో మంచెనెక్కి వడిసెలు విసరుతూ – రెడ్డి గారందించిన మాత్రాఛందస్సులో సాగిన రగడ గీతాన్ని – చరణ చరణానికి వివిధ మార్పుల సంతరించుకొంటూ అభినయపూర్వకమైన గీతాలాపనతో గడ్డి కోసం వచ్చే కొందరిల్లాండ్ర, బాటసార్లు శ్రోతలను మైమరపింపజేస్తూ, చలాకిగా పాడసాగిందా యింతి. అంతే కాదు

**సెలకన్నె మేని వంపులలోన నర్తించ**
**తలపు పూతేనియలు దట్టాడ, మిట్టాడి**
**మమరులకు ధరణిపై నాసలను వెలయించి**
**అలసముగా దక్షిణానిలము మాగడ్డపై**
**వీచెనమ్మా! యిపుడె!**

వడిసెలు విసరే ఆ సెలకన్నె తన మేను అంద చందాలతో చూపరుల నాకట్టుకొన గలుగుటయే గాక పాటలోని లయకనుగుణముగా వయ్యారము లొలికిస్తూ నర్తించుచూ శృంగార రసానుకూలమగు కన్యగా కైసికీ వృత్తిని తలపించుచున్నది. ఎందుకంటే వృత్తులు నాట్యాశ్రయములని 'నరసభూపాలీయ' కర్త రామరాజ భూషణుడు లక్షణ కారుల మాటల్ని తన లక్షణ గ్రంథంలో పొందుపరిచి వక్కాణించినందున కోమలమైన అర్థమును స్ఫురింపజేయుటయు, నాట్యాశ్రయమైన వృత్తిలో సెలకన్నె జానపద స్త్రీయైననూ అభినయపూర్వకంగా తన గానామృతమును చూపరులకు పంచి యిచ్చినది. తలంపులో పూతేనియలు అటూ ఇటూ సంచరిస్తూ కదలాడుచుండగా భూతలంబును విడిచి దివికేగిన దేవతలకు సైతం భూతలంపైకేగవలె ననెడి ఆశలు చిగురించునట్లుగా ఆమె నర్తించింది, ఆడింది, పాడింది.

**"రంగారు బంగారు చెంగావిక్రోవిలో**
**వాసనల గరగించి వాలుగన్నుల జల్లి"**

ఇట్లు ఆ జానపద స్త్రీ కన్యయైనందున కుటుంబ బాధలామె అంతరంగము నందు పొటమరించక ఆనందానాభూతిని భూచరులకే గాక గగనచరులకు సైతం తన ఆట పాటల్తో మైమరపింప జేయుచు స్వభావోక్తిని చాటుచున్నది.

**రాయబారము**

'రాయబారము' శీర్షికను రెడ్డిగారు రెండు భాగాలుగా విభజించుకున్నారు. అందులో మొదటిది గేయ రచన. పల్లవితోపాటు ప్రతి పాదములోనూ 12 మాత్రల ఛందస్సు కలది. తెలుగునాడు ముఖ్యంగా వ్యవసాయికరంగ ప్రాంతమైనందున రచయిత దొరల కాలం నాటివాడు గనుక అప్పటి ఉమ్మడి కుటుంబాల్లో రైతు జీవనంలోని లోటుపాట్లు, కుటుంబీకుల కందరికీ చేసినంతా పని ఉంటుంది. తొలకరి చినుకులతో ఆమని వచ్చిందంటే రైతులకే గాదు రైతింటి యిల్లాండ్రకు కూడా చేతినిండా పనే.

తొలకరితో రైతుల సందడి మొదలవుతుంది. దున్నకాలు సాగించడానికి కాడి, మేడి, గొర్రు, కపిల పనిముట్లను సిద్ధం చేసుకుంటారు. గాసగాడు రైతింటి జీతగాడు.

**"ఆమాటే చెబుదామని**
**నీకెందుకు చెప్పాలని**
**చెప్పలేక చెబుతున్నా!"**

అనే పల్లవిని ప్రతి చరణానికి చివర పలికిస్తూ కవిగుండెలోతుల్లోంచి కవితాధారగా తన్నుకు వచ్చే భావజాలాన్ని పొంగి పొరలింపజేశాడు రచయిత. కరువు కాటకాలతో రైతన్న తమ జీవితాల్ని బలిపెడుతూ తిన్నా తినకున్నా పండినా పండకున్నా, పట్టు వీడని విక్రమార్కునిలా రైతు అప్పులతో ఉరికొయ్యలకు వ్రేలుతూనే తన పనిలో తాను నిమగ్నమయ్యాడు. కష్టజీవుల కడగండ్లను ఏకరువు పెడుతూ రైతు తన బాధల్ని కాలంతో మొరపెట్టుకొంటూ రాయబారం నడిపాడు. ఆ కాలానికి కూడా ఎన్ని ఈతి బాధలు. రైతు గోడు వినేదెవరు? తీర్చేదెవరు?

ఇందులో కవి గుండెల హృదయ రాగం 'కరుణ' రసార్ద్రముతో తడిసి 'శోకం' అనే స్థాయీ భావంతో పాఠకుల శ్రోతల హృదయాల్ని పిండి మండింపజేస్తుంది. కవి జీతగానిలో తన భావాల్ని చొప్పించి విప్పి చెప్పమనగా మొదటి రాయబారంతో మనసు విప్పి రెడ్డిని తన గుండెల సవ్వడితో ఆవిష్కరింపజేసుకున్నాడు.

**రాయబారము**

'రాయబారము' అనెడి రెండవ ఘట్టములో మొదటిది రైతు గాసగాని ఘోషకాగా, రెండవది తుంగభద్ర నీటికై ఆరాటపడే ప్రజల తరుపున వకాల్తా తీసుకుంటాడు. ప్రజలందరి వైపు నిలిచి

**"ఐనా మేమూరుకొనుట**
**కానా? అది యేటి మాట"**

అంటూ మొదటి ఘట్టంలో బాధలు మొరపెట్టుకున్నాడు. రెండవ ఘట్టములో తాను మేల్కొని కాలాన్ని ఎదిరిస్తు మార్పును కోరుతున్నారు ప్రజలంటూ 'యిక మేం ఊరుకోం! అంటు జనుల కష్టాల్ని ఏకరువు పెడుతూ ఆర్తులవైపు నిలిచి పోరాట దిశలో కవి తన కలానికి పదును పెట్టాడు.

## రెండవ రాయబారము

పల్లవితో పాటు ప్రతి పాదము 12 మాత్రలతో నడిచింది. యతిప్రాసల వంటివి లేవు. ఛందస్సు లేదు.

దొరల పాలనలో జనుల కష్టనష్టాలు తొలగిపోయి సుఖజీవనం రావాలని తన కవితా ఝరిని రాష్ట్రేతరాల్లోనూ పాలించినాడు. ఈ రెండు రాయబారాల ఘట్టాలు రైతు కడగండ్లను, జనులందరి బాధల్ని గూర్చి కవి రచించిన కవితా ఖండికలే.

నేడు దొరలపాలన పోయి ప్రజల పాలన వచ్చింది. ఎన్నో ప్రభుత్వాలు మారుతున్నాయి. కానీ ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్లు పాలకులు మాత్రం పేరు ప్రఖ్యాతులతో ధనార్జనలో బాగుపడుతున్నారు కానీ ప్రజా సమస్యలు మాత్రం ఎక్కడివక్కడే ఎట్లున్నవి అట్లే ఉన్నాయి.

## సెలకన్నె

'సెలకన్నె' ఒక మధురమైన గేయగీతిక. 'మాధుర్య' గుణాన్ని నింపుకొన్నదై ఇంపు సొంపలరు లలితమైన పదబంధాలను పక్క పక్కన జేర్చుకొనుచూ

**"ఏమమ్మా సెలకన్నే – ఎక్కడ నుండీ రాకడ"**

అనే పల్లవిని ప్రతి చరణానికి చివర జేర్చుకొనుచూ లయబద్ధముగా ముందుకు తరలి పోతూ శ్రోతల గుండెల్ని రవళింప జేస్తుందీ గీతిక; తన నడకను లయబద్ధంగా, కొలబద్ధగా ఒక మాత్ర అటుగానీ, ఇంకో మాత్ర ఇటు గానీ ఎక్కువ తక్కువలు లేకుండా చక్కని నడకతో వీనులకింపగునటుల మద్దెల, ఘటం, మేల, తాళ, దరువులు తనతో కలిసి రావాలే గానీ, గానకోవిదులు పదం పట్టి రాగ, తాళ, మేళవింపు లందింప వలెనే కానీ సెలకన్నె గీతం తన మాధురీ ఝరులతో మునుముందుకు సాగుతూ మధురానుభూతుల నందింపగలదు.

అరుణారుణ సంధ్యారాగములు, పురివిప్పిన నెమళ్ళు, గొంతులు కలుపు కోకిల గానములు, కొండదరులు, కోన మొనలు, పుష్పవితతులు, గండ శిలలు, సానుతటులు, అల్లుకొన్న పూదుగలు, రొద చేయు తుమ్మెద గుంపులు, మలయానిలయము, తెలిమబ్బులు, నెలవంక, కవితా వస్తువులై సెలకన్నె నడకలో ఇవన్నీ భాగం పంచుకున్నాయి. ఇరువదియారు చరణములతో సాగిన ఈ సెలకన్నె ముగ్దమనోహరములైన భావములతో తన నడకను అందముగా కొనసాగించినది.

మాత్రా ఛందస్సులో సాగే యేరచనైనా లయబద్ధంగానే ముందుకు సాగుతుంది. పల్లవితోపాటు ప్రతి చరణంలోని పాదం పధ్నాలుగు మాత్రలతో ఈ సెలకన్నె గీతం నడిచింది. 'సంక్రాంతి' 20 మాత్రలతోను, 'అంజలి' 20 మాత్రలతోనూ, 'విరులతో' చరణాలు 20 మాత్రలతోనూ, పల్లవిలో రెండు పాదాలు 17-12 మాత్రలతో ఇందులోని గీతాలు నడిచాయి.

## వైజయంతి

'వైజయంతి' శీర్షిక 72 చరణాలు 2 పాదాల పల్లవితో ప్రతి 5 పాదాలు కలిపి ఒక చరణంగా సాగింది. ఇందులో ప్రతి పాదంలో 20 మాత్రలుంటాయి. ప్రతి చరణం తరువాత పల్లవి మీరుతూ ఉండటం ఇందులోని ప్రత్యేకత. పల్లవిలోని రెండు పాదాల్లో అందొకటి 17 మాత్రలతోను మరొకటి 12 మాత్రలతోను మొదటి చరణం ముగుస్తుంది. రెండవ చరణం కూడా మార్పు లేకుండా పైని చెప్పిన మాత్రలతో 2వ చరణమూ ముగుస్తుంది... ఇలా ప్రతి చరణం, చరణం తరువాత పల్లవి అన్నే మాత్రలతో 72 చరణాలతో మొదటి భాగం ముగుస్తుంది.

రెండవ భాగంలోనూ 5 పాదాలతో మొదటి చరణం 20 మాత్రలతోనూ, పల్లవిలోని మొదటి 17 మాత్రలు, రెండోది 12 మాత్రలతోనూ మొదటి చరణం, పల్లవి ముగుస్తుంది. ఇలా ప్రతి చరణం పై దానివలెనే 5 పాదాలు, దాని క్రింద 2 పాదాలు పల్లవి కలిపి చరణాలు నడుస్తాయి. ఇలా 2వ భాగంలో 28 చరణాలుంటాయి. 'వైజయంతి' రెండు భాగాలు కలిపి (72+28) 100 చరణాలు పల్లవితో గీతం నడుస్తుంది. రెండు భాగాల్లోనూ ప్రతి చరణానికి పల్లవి మారుతూ ఉండటం ఇందులోని ప్రత్యేకత.

ఇందులోని ప్రతి చరణమూ 'మాధుర్య' గుణము ఇంపును గూర్చు పదములు రయ్యినవచ్చి పక్క పక్కన కూర్చుండి గీతమునకో సొంపును కూర్చినవి. అక్కడక్కడ తప్పితే సమాసములను చేరనీక మృదువైన పదములతో 'వైదర్భి' రీతిని రూపున సంతరించుకొని 'కదలీ పాకము'తో చరణాలు ముందుకు సాగినవి. కనసొంపగు వచనములతో, వినుసొంపగు రచనగా వైజయంతి గీతిక శ్రోతల హృద్వేదికలపై మయూర నాట్యమాడి యలరింప సాగింది.

## పారిజాతం

'పారిజాతం' అనగానే పుష్పం విషయ మేమో గానీ సాహితీ పిపాసులకు నంది తిమ్మన వ్రాసిన 'పారిజాతాపహరణ' ప్రబంధం గుర్తుకు వస్తుంది. నిజమే మన రెడ్డిగారికి కూడా నంది తిమ్మన (ముక్కు తిమ్మన)ను గుర్తుంచుకొని ఈ శీర్షిక రచన కావించాడు.

ఇందులో ఐదేసి పాదములు ఒక చరణం దాని క్రింద 2 పాదములు పల్లవి ఉండును. ప్రతి పాదములో 20 మాత్రలు, అందు మొదటి పాదములో 17 మాత్రలు 2వ పాదములో 12 మాత్రలుగా పల్లవి ముగుస్తుంది. ఇలాగే అన్ని చరణాలు, పల్లవి నిర్ణయించిన మాత్రలను కలిగి ఉండి 'పారిజాతం' తన నడకను కొనసాగించింది. ఈ 'పారిజాతం' శీర్షిక క్రింద 72 చరణాలతో కొనసాగి ముగుస్తుంది.

ఎక్కడైనా పల్లవి ముందుండి చరణాలు వెనుక నడచి వచ్చుట పరిపాటి. కానీ వై.సి.వి. రెడ్డిగారి మాత్రా ఛందస్సుల్లోని కృతుల్లో మొదట చరణాలు ఆ పిదప పల్లవి నడచి వచ్చుట పరిపాటి. చరణాల వెంట నడిచే పల్లవి అంత్యప్రాసలో కనిపించును.

గానయోగ్యమైన చరణాలు తాళ లయానుగుణముగా సాగును. ప్రతి పాదము నందు నిర్ణయించినన్ని మాత్రమే మాత్రల్ని కలిగి యున్నందున పాట లయబద్ధముగా అనుకూల గతిలో నడచును. పదములు పాతవే యైనా వచ్చిన పదాలు మరళా రాకుండా నూత్న పదములతో చరణాల్ని నడిపించటం రెడ్డి గారికి వినూత్న విద్యగా వీరి రచనల ద్వారా మనకు కనిపించును. శబ్దాడంబరములతో శబ్ద ప్రాధాన్యతగా కృతిని సాగించినందున శబ్దాలంకారము లిందు కన్పట్టును.

వామనుడు "వికటత్వము దారతా" కూర్పు నందలి వర్ణములు నర్తించునట్లు విను వారికి గోచరించునో ఆ కూర్పు 'ఔదార్య' గుణముగా చెప్పబడినందున ఇందులో ఔదార్య గుణమున్నదని చెప్పవచ్చును. దీని చివర 'భావోజ్జ్వలా" అనే శీర్షిక కింద నడచి కృతి కూడా చరణాలు, పల్లవి పైదానివలెనే మాత్రలు ఇందున్నవి. ఇందులో తొమ్మిది చరణాలున్నవి.

## ఆంధ్రాభ్యుదయం

ఇందులో 5 పాదములతో ఒక్కో చరణం ప్రతి పాదంలో 20 మాత్రలు, పల్లవి మొదటి పాదంలో 17, రెండో పాదంలో 12 మాత్రల్ని కలిగి 10 చరణాలతో కృతి సాగింది. ప్రతి చరణానికి పల్లవి మారుతూ ఉంటుంది.

## సందేశము

ఇందులో ప్రతి చరణం నాలుగు పాదాలు కలిగి ఉంటుంది. ప్రతి పాదంలో 20 మాత్రలున్నవి. 17-12 మాత్రలతో పల్లవి నడిచింది. ఇందులో 8 చరణాలున్నాయి.

**"గిరిదరీ ముకుర కందర సరోవరములను**
**అరవిచ్చు విరుల సంబరమైన తుమ్మెదలు"**

ఇందులో ఒక అక్షరము (రేఫము) పలుమార్లు ఆవృత్తియైనందున 'వృత్యానుప్రాసాలంకారము'. ఇందు దొర్లినదని చెప్పవచ్చు. ఇట్లాంటివే మరికొన్ని ఈ కృతిలోకనిపించును.

## కడప గడపలు

ఈ శీర్షిక క్రింద 5 పాదములు గల్గిన చరణాలు 10 చరణాలిందున్నవి. ప్రతి పాదములో 20 మాత్రలుననవి. 17-12 మాత్రలతో పల్లవి నడిచింది. ఇందులోనూ ప్రతి చరణానికి పల్లవి మారుతూ ఉంటుంది. కానీ మాత్రలు మాత్రము సూచించినవియే.

కడపలో గడప గడపకూ కవులున్నారని, పౌరుషాలకు పెట్టింది పేరు, మాటల్లో వ్యంగ్యం, భావాల్లో శ్లేష పలికించి పులకించి పోతారు మా మొగవారు' అంటూ ఇల్లాండ్రు గొప్పగా చెప్పుకొంటున్నారు కడప గడపల్లోని గీతంలో.

## ఇన్నాళ్ళవలె కాదురా

ఇది 5 పాదములతో 5 చరణములు గలిగినది. ప్రతి పాదములో ఇందునూ 20 మాత్రలున్నాయి. 17-12 మాత్రలతో పల్లవి నడిచింది. ఇందులోనూ ప్రతి చరణానికి పల్లవి మారుతూ ఉంటుంది. కవి 'రాక్షస నామ సంవత్సరానికి వీడ్కోలు పల్కి 'నల' నామ సంవత్సరాన్ని స్వాగతించుచూ వ్రాసిన కృతిగా ఇది గోచరమౌతున్నది. గతమొక చేదు గురుతుగా భావించి భవిషత్తు మేలు గురుతుగాకాగోరి ఉగాది కోయిల నాహ్వానించుచూ పల్కిన పలుకులివి.

## రాష్ట్ర గానం

ఇది ఒక గేయ ఖండికగా సాగిన రచన. ఇందులోపూర్వరాజుల వైభవం, సుల్తానుల పాలన, స్వాతంత్ర్యోద్యమ పోరాటం, విశాలాంధ్రోద్యమము, సామ్యవాదములను గూర్చిన పోరాట పటిమ ఇందు కనిపిస్తుంది.

## స్వాతంత్ర్య రజతోత్సవం

భారతదేశమునకు స్వాతంత్ర్యం సిద్ధించింది. ఎన్నో త్యాగాలు, పోరాటాలు, బలిదానాల ఫలితంగా సిద్ధించిన ఈ పోరాటంలో ఎందరో దేశభక్తులు అమరులయ్యారు. దొరల పాలన నుండి ప్రజాస్వామ్య యుతముగా స్వాతంత్ర్యము లభించి 25 సంవత్సరములు పూర్తయినందున జరుపుకునే ఉత్సవంగా ఈ కృతిని రెడ్డిగారు కావించారు. ఇందులో కవిగారికి దేశభక్తి, ఉత్సాహం, ఉద్రేకం, హృదయవేదన కనిపిస్తాయి.

## దిగబడిన బండి

ఇది కూడా ఒక చిన్న గేయకవిత. ఇది ఒకే ఒక పుటలో ఇమిడిపోయింది. తన కోసం పరుల కోసం రేబవళ్ళ శ్రమియించే రైతు పడే కష్టాన్ని, ముప్పు దప్పని అప్పుల జీవనం, అంతా పోటీలు పడి పంచుకోగా రైతు ఒంటరిగా మిగిలిపోవటం, బండి ఇరక్క పోయినట్లు తాను సమస్యల వలయంలోకూరుకుపోయి, లోలోతులకు దిగిపోతూ బయట పడలేక పోతున్నాడు. కృషీవలుని రక్షించే వారేరి, భక్షించేవారె కాని, కుళ్ళు కుట్రలు, స్వార్థంతో నిండిన సమాజంలో కష్టజీవి బ్రతకలేకపోతున్నాడని కవి భావన.

## పద్మశ్రీ పుట్టపర్తి భావలోక చక్రవర్తి

పుట్టపర్తి నారాయణాచార్యులకు వై.సి.వి. రెడ్డి గారికి మధ్యనున్న అనుబంధము, ఆత్మీయత గొప్పది. బంధముతో రెడ్డిగారు పుట్టపర్తివారిని గూర్చి పొగడుతూ చేసిన కృతి ఇది.

ఇందు 17 చరణాలున్నాయి. అందొక్కొక్క చరణంలో నాలుగు పాదములన్నాయి. ప్రతి పాదంలో 12 మాత్రలు ఆ తరువాతనున్న పల్లవి ఒక పాదము అందులోనూ 12 మాత్రలతో ఒక చరణం ముగుస్తుంది. ఇట్లాంటి చరణాలు 17 ఈ కృతిలో రెడ్డిగారు పొదివించారు. కృతి రాగ తాళ యుక్తంగా పాడుకోటాని కనువగు మాత్రాఛందస్సులోనే సాగిందీ రచన. చరణ చరణానికి పల్లవి మారినా మాత్రలు నిర్ణయించినన్ని పల్లవి నింపుకొంటూ చరణంతో కలిసి రమ్యంగా ముందుకు సాగింది.

అక్కడక్కడ ఒకటి, రెండు తప్ప సమాసాలు కనిపింపనీక సులభమైన తేలిక పదములు పక్క పక్కన జాలువారినవియై 'వైదర్భి' రీతిని ఇందు చరణాల్లో పొదవుకొన్నదీ రచన... ఆవేశంతో పాడుకున్నా, మృదుమధురంగా పాడుకొన్నా ఇందులో 'మాధుర్య' గుణము గన్పట్టుచున్నది. పదబంధముల పొందికను చక్కగా యిముడ్చుకొని 'శయ్యా' సౌభాగ్యమును ఇనుమడింప జేసుకొన్న రచన యిది.

ఈ రచన కావ్యము గాకున్నను (పద్మశ్రీ పుట్టపర్తి భావలోక చక్రవర్తి) చిన్న ఖండికేయైనను సాహితీ సమరాంగణమున పుట్టపర్తివారు పదునాల్గు భాషలలో ఆరితేరిన వారై అందు రచనలు చేయగల్గిన ధీరోదాత్తుడు. అగ్రగణ్యుడు. "ధీరశ్చ అసౌ ఉదాత్తః ధీరోదాత్తః" అని గదా! విగ్రహవాక్యం. తన రచన యందు ధీరత్వమును అందు ఉదాత్త భావములను చొప్పించి, అచ్చటచ్చట క్లేశముల సహించువాడై, ధీరుడుగా, ఆత్మశ్లాఘలేని వాడైనందున ఉదాత్తుడైనాడు. హర్ష శోకాదులకు లొంగనివాడు. సహనశీలి, గంభీరుడు, గూఢమానము (కోపము) గలవాడు, దృఢవ్రతుడగువాడు ధీరోదాత్తుడు. శృంగార, వీర, శాంత రసములందు నాయకుడే ధీరోదాత్తుడగును. ఇట్టి గుణముల పునికి పుచ్చుకొన్నవాడని బాల్యమందే 'పెనుగొండ లక్ష్మి'ని దీర్చిదిద్దినాడు. ఆ పిదప మరెన్నో 'మేఘదూతము' వంటి మాత్రా ఛందోబద్ధ రచనలు గావించి, 'సరస్వతీ పుత్ర' బిరుదాంకితుడై 'శివ తాండవము'న తన పదాడంబరమును, శబ్ద సౌభాగ్యములో 'శబ్ద బ్రహ్మ'ను తలపింపజేసినాడు పుట్టపర్తి వారు. అట్టి కవివర్యుని కీర్తించి రెడ్డి గారు కృతకృత్యులయ్యారు. కృతి 'ద్రాక్షా'పాకములోనే సాగింది.

## కీర్తిశేషులు మిత్రుడు కమల్ రాజుకు శ్రద్ధాంజలి / సెలకన్య

మిత్రుడైన కమల్‌రాజు కీర్తిశేషుడైనందున శ్రద్ధాంజలిని ఘటిస్తూ వారిపట్ల రెడ్డిగారికున్న స్నేహ సౌభ్రాతృత్వాన్ని ఈ కృతి ద్వారా చాటుకున్నారు. ఈ కృతి ద్వారా కొండకోనల్లో పుట్టిన సెలకన్నెను ఆవయ్యారి నడకలను, ఎత్తు పల్లాలలో ఆమె ఎగసి దుమికినతీరు, తద్వారా పుష్పించి అరవిరిసిన పూదీగల సొగసులు, గుభాళింపులు, సెలకన్నె ఎచటనో పుట్టి పెరిగి ఎన్ని బీడు భూముల తడిపి, పచ్చికలు పెంపొంద, పుష్పించి, పూయించీ ధనధాన్యరాశుల క్రుమ్మరిల్లగజేసి, తనలోన తాను పొంగి తనివి చెందే సెలయేరుగా పారలే సెలకన్నెను గూర్చి కొంత ఈ కవితలో వివరించినారు రెడ్డి గారు.

ఇందులో ప్రతిపాదములో 20 మాత్రలున్నవి. కవిత అంతా ఒకే చరణముగా నడిచింది 2 పుటల్లో. రెడ్డిగారు రైతుబిడ్డ గనుక, రైతులకు ముఖ్యంగా వ్యవసాయం జీవనాధారమైయున్నందున నీళ్ళు లేనిదే వ్యవసాయం ముందుకు సాగదు గనుక కవి గారు సెలకన్నెపై మాటిమాటికీ తన మక్కువను జూపించి ప్రస్తుతించుచునే ఉన్నారు.

జీవకోటికి అన్నింటా నీరే ప్రధాన భూమికను పోషిస్తున్న కారణాన సెలయేటి తీరుతెన్నుల్ని వివరిస్తూ ఆ మనోజ్ఞమూర్తిమత్వానికి ప్రజ్వలించుచూ, మరో ప్రక్క ఈ కృతిని అందుకోమని, పైలోకమందున్న తన మిత్రుడు కమల్‌రాజ్ కునూ అంజలి ఘటించి వేడుకొనినాడు.

**ఆడుబ్రతుకు**

'ఆడుబ్రతుకు'ను గూర్చిన ఈ ఖండిక తేటగీతి పద్యములలో సాగినది. ఇది పద్యాల్లో కొనసాగింది. కవితకు ఒక శీర్షికను నిర్ణయించుకొని ఏ భావనతో కవితలల్లుకు పోతాడో పాఠకుల కందరికీ అర్థంకాదు. లోతు పాతు లెఱిగి కవి భావనలోనికి పాఠకుడు వివేచనతో పరకాయ ప్రవేశం చేస్తే తప్ప ఆ ఊహలు అంత సులువుగా ఆలోచనల కందవు. కవుల ఊహలు పలురీతులుగా ఉంటాయి. గనుక పదబంధాల్లోని సాంద్రత మరీ చిక్కనై "చిటారికొమ్మన మిఠాయి పొట్లం" లాగా అనేక శంకలు వంకరలు తిరుగుతూ పాఠకుల్ని పరిభ్రమింపజేస్తూ ఉంటాయి. పదము లందవగాహన కుదిరినట్లే ఉంటుంది. అవి ఊహలకందక దోబూచులాడుచున్నట్లే ఉంటుంది.

**"బేలనై గోలనైవ్రాలి - వాలకముల**
**మరులు రాబట్ట మగనికై మరగిపోయి" -**

**విరిగి పోయితి ప్రాణమే సురిగిపోయి**
**కరుగడాతడు, వాడొక గండశిలయె**

ఇందులో ఒక హల్లు (ర, ల) పలుమార్లు ఆవృత్తి చెంది వృత్యానుప్రాసాలంకారమును కలిగి ఉన్నది.

**"నన్ను నాత్రోవ బోనిమ్మనాథ నాథ"**

(ఇందులో అనాథ నాథ అర్థభేదములేకున్నా తాత్పర్య భేదంతో పదములు మరలా ఆవృత్తి చెందిన లాటాను ప్రాసాలంకారము ఇందున్నది. అనాథ = దిక్కులేని వాళ్ళకు, నాథ = దిక్కైనవాడా! ఇది తాత్పర్య భేదం.)

ఇందు ఒక యింతి తన మగని విషయంలో మిక్కిలి బాధపడుతున్న విధానాన్ని కవి అలతి పదములతో 'వైదర్భి' రీతిలో సాగించినాడు. ఇందు పదముల పొందికలో చక్కని 'శయ్య'ను కవి కుదిర్చినాడు. అర్థవంతమైన పదములను సులభరీతిలో కవి పొందుపరచి 'ద్రాక్షాపాకము'లో పద్యం నడిచింది.

❖ ❖ ❖



**డా. మూల మల్లికార్జున రెడ్డి**
సెల్ : 7700003399

# వై.సి.వి. రెడ్డి కవిత్వం సామాజిక దృక్పథం

'కడప గడపలో కవుల గడపలు మెండు' అంటూ కడప జిల్లాలో కవులకు కొదవలేదని సగర్వంగా చాటి చెప్పిన కవి వై.సి. వి. రెడ్డి. సంప్రదాయ సాహిత్యపునాదులపై నవసాహిత్య సౌధనిర్మాణం గావించిన ఆధునిక కవి. ఆయన చిన్నతనంలోనే కొడవలూరి రామచంద్రరాజుగారి దగ్గర రామాయణ, భారత, భాగవతాది గ్రంథాలు చదివారు. 'ఆంధ్రనామసగ్రహం, సులక్షణ సారం' వంటి గ్రంథాలను కంఠస్తం చేశారు. కవిత్వం చెప్పాలనే అభిలాషతో కందం, తేటిగీతుల్లో పద్యాలు చెప్పేవారు. తర్వాత చక్రాల – నరసింహశాస్త్రిగారి దగ్గర ఛందస్సు, అలంకారాలు, వ్యాకరణం నేర్చుకొని గుత్తిచరిత్రను పద్యరూపంలో రాశారు. తర్వాత కడప నుండి వెలువడుతున్న 'ఆజాద్ హింద్' వారపత్రికలోనూ, కర్నూలు నుండి వెలువడుతున్న 'జ్వాలా' పత్రికలో ఆయన కవితా ఖండికలు వెలువడ్డాయి.

వై.సి.వి. రెడ్డి గారు కడపలో ఇంటర్ చదివే రోజుల్లో గడియారం వేంకటశేష శాస్త్రి, పుట్టపర్తి నారాయణాచార్యులు పరిచయమయ్యారు. గడియారం శివభారతాన్ని, పుట్టపర్తి శివతాండవాన్ని ఆయన బాగా అధ్యయనం చేశారు. ఈ అధ్యయనమే ఆయన కవిత్వానికి మార్గదర్శకమైంది. అదృష్టవంతున్ని సముద్రంలో విసరివేసినా నోటిలో చాపపిల్లతో బైటపడతాడన్నట్లు ఆయన ఉద్యోగ రీత్యా రైల్వే కోడూరు వెళ్ళారు. అక్కడ వేదం వేంకటకృష్ణశర్మ, నారునాగనార్య, ఉప్పలపాటి వెంకట నరసయ్య గార్లు పరిచయం కావడం వై.సి.వి. రెడ్డి అదృష్టం. వీరందరూ వై.సి.వి. రెడ్డి కవిత్వం రాయడానికి బాగా ప్రోత్సహించారు. వారి నుండి అనేక నూతన విషయాలు నేర్చుకొన్నారు. అప్పుడే వారి 'తొలకరి చినుకులు' అనే ఖండ కావ్యాన్ని రాసి నారునాగనార్యకు అంకితమిచ్చారు. ఈ రచన సంప్రదాయ పద్ధతిలో కొనసాగింది. వేదం వేంకటకృష్ణ శర్మ గారు ఈ ఖండకావ్యానికి పీఠిక రాస్తూ 'ఈ కవికుమారుని భావనా బలమపారము'. ప్రతి పద్యముననేదో యొక నూత్న భావము ప్రస్ఫుటమగుచుండును. ఈ కావ్య సంపుటిలోని ప్రతి ఖండిక పతితల హృదయకుహరాలను దాటి నుత్తమ సాంఘిక పరిస్థితుల నవ్యానుభూతిని ప్రసాదింపజేయు పాటవము గలది. అన్నియు గంభీర భావసముంచితములు. సులభ గ్రాహ్య విషయకములు' అన్నారు. ఈ ఖండికలో ఆవేదనము, సంశయడోల, అప్పగింత, పనిగత్తె, బడిపంతులు, గతము, కడుపుమంట, కృతఘ్నుడు, సందేశం అనే తొమ్మిది ఖండికలున్నాయి.

వై.సి.వి. రెడ్డి పూర్తిగా పల్లె వాతావరణం నుండి వచ్చినవాడు. అక్కడ రైతుల స్థితిగతులు, వారిండ్లలో పనిచేసే దళితుల జీవన విధానం బాగా చూచినవారు. కృతఘ్నుఁడు ఖండికలో

**తే.గీ. పల్లె మరియాద చొప్పున నిల్లు వరుస**
**నూడిఁగంబుల జేయుచు కాడి మేడి**
**నమ్మి యంబలి ద్రావి నిత్యమ్ము రైతు**
**భూమి దున్నుచు నుంటిమి పూజనీయ**

అన్నాడు. ఒక రైతు నింటపని చేసే దళితుని ఆవేదన స్వయముగా చూచాడు గనుకనే ఇలా రాయగలిగాడు. సాటి మనిషిపట్ల దయ, సానుభూతి, కరుణ ఈ పద్యంలో కనబడుతుంది.

**తే.గీ. కోడికూసెనో లేదో? నా గూడెము విడి**
**యంద చందాల భరణి నిల్లాలి వీడి**
**కాడికోడెలె నాకేదు గడ యటంచు**
**జీవికకుఁ జేయు చుంటినే సేద్యమిట్లు**

యని వాపోతాడా దళితుడు. ఇదే ఖండికలో రైతు సేద్యానికుపయోగపడే పరికరాలను గురించి వైసివి రెడ్డి గారు ఏకరువు పెట్టాడు.

**సీ. పదునైన పలుగుతో బాపటం బొనరించి**
**కొయ్యకాడలనెల్ల కొల్ల నూడ్చి**
**ఇరుసాలుగొర్రుతో జోరదోలి పైపెచ్చు**
**బారగుంటకతోడ బాయజేసి**
**దిబ్బలో నెరువును దిరుగబైలునదోలి**
**వందు మట్టిని పెక్కుబండ్లు తోలి**
**యొకటికి మూడింత లొప్పుగా మదిరెలో**
**నెరువుపై మన్ను నెంతేని కలిపి**

**తే.గీ. తొలకరించెదు ముంగారు పలుకు చినుకు**
**లందు తోలిరి యెరువు పసందు చిందు**
**లాడ భూమిని సామెన యట్లు చేసి**
**కల కొలంది పొలమ్ము పక్వమ్ముఁజేసి**

పద్యంలో నేడు పల్లెల్లో వ్యవసాయం చేసే రైతులకు కూడా సరిగా తెలియని పలుగు, పార, గొర్రు, గుంటక, బండి తదితర వ్యవసాయ పనిముట్లు, ఎరువు, దిబ్బ, వందుమట్టి, మదిరె, మన్ను, తొలకరి, సామెన మొదలైన వ్యవసాయ పదాలు వాడడం విశేషం. ఈ ఖండికల్లో మాండలిక పదాలతో ఒక చిన్న వ్యవసాయ పద నిఘంటువును తయారు చేయవచ్చు. అదే వై.సి.వి. రెడ్డి ప్రత్యేకత.

తర్వాత రెడ్డిగారు 'మేనక' అనే చిన్న ఖండకావ్యాన్ని రాశారు. ఇది ప్రాచీన సంప్రదాయ పద్ధతిలో కొనసాగింది. శకుంతల జన్మకు మూలమైన మేనకా విశ్వామిత్రుల సమాగమనమే ఇందలి వృత్తాంతం.

ఈ కావ్యానికి ప్రారంభంలోనే "మహర్షి విశ్వామిత్రుని జీవితం ఉల్లోలకల్లోలమైన మహాసముద్రం వంటిది. ఆ మహనీయుడు తన జీవితమున పట్టుదలతో సాధించిన మహోత్తర కార్యములు పెక్కులు. ఒక సామాన్యమానవుడుగా, మహారాజుగా, మహర్షిగా లోకకల్యాణానికి తోడ్పడిన మహానుభావుడు ఆయన. మానవుడు సాధించలేనిది విశ్వమున లేదని ఋజువు చేసిన ద్రష్ట విశ్వామిత్రుడు. ఆ మహాత్ముని పాత్రపైనున్న గౌరవభావమే నా యీ కావ్యం మేనక" అన్నారు వై.సి.వి.

గడియారం వేంకటశేషశాస్త్రిగారు 'మేనక' కావ్యాన్ని పరిచయం చేస్తూ "తొలకరి చినుకులు" పచ్చని పంట పొలములలో మంచెంపై గంచు గంటలు మ్రోయించు నీ కంఠము కావ్యోద్యానములో గమ్మని భావగీతము లాలపించుట ముచ్చటయే గాదు, మెచ్చుకోదగినది. ఎందుకనగా మానవజాతి కడుపు నిండించుట కంటే హృదయము పండించుట యుత్తమ కృషిగా నీయన తలంచెనేమో యనిపించును' అంటారు. గడియారం వారు కావ్యాన్ని గురించి ఎంత గొప్పగా చెప్పిన 'మానవజాతి కడుపు నిండించుట కంటే హృదయం పండించుటే ఉత్తమ కృషి' అనడం సమంజసం కాదు. ఎందుకంటే ముందుగా మనిషికి కడుపు నిండినపుడే తర్వాత హృదయానందం కల్గుతుంది.

ఈ కావ్యంలో వశిష్ట విశ్వామిత్రులు ఒకరిపై మరొకరు ఆరోపణ చేసుకొనేటప్పుడు వారి మాటలు మేనక విని విశ్వామిత్రునిపై మరులు పెంచుకొంటుంది. దేవేంద్రుని మెప్పించి విశ్వామిత్రుని సేవకు వెళుతుంది. మేనక విశ్వామిత్రుల సంవాద, సమాగమనమే కావ్యానికి కథావస్తువు. దేవేంద్రునితో మేనక ఇలా అంటుంది.

**తే.గీ.** **దేవతాసార్వ భౌమ! మీ సేవ కింత**
**సెలవొసగి పంపవలె మౌని సేవజేయఁ**
**దనుమనో జన్మములు గృతార్థములుగాఁగ**
**మరలివత్తు మీదాసికి వరము నీవే!**

కాగల కార్యం గంధర్వులే తీర్చినట్లు విశ్వామిత్రుని తపస్సు భంగం చేయడానికి సిద్ధంగా ఉన్న దేవేంద్రుడు మేనక కోరిక మన్నించి సంతోషంగా సాగనంపాడు. మేనక విశ్వామిత్రుని దగ్గర కొస్తూ

**తే.గీ.** **ఏ మహాశక్తి నను ముట్టి యిట్టుసేసె**
**నామహాశక్తి రక్షించి యాదరించి**
**నెమ్మిఁ దోడ్పడి కోర్కి పండించుగాక**
**కలుగుఁ గ కొక్కమేలు నావలన భువికి**

అంటుంది. పై పద్యంలో వై.సి.వి. రెడ్డి గారు ముందుగానే భరతాగమనాన్ని సూచించడం వల్ల కథా వస్తువు యొక్క ఉదాత్తత, సుప్రయోజనం నెరవేరింది. కావ్యంలో కవి అన్నీ తేటగీతి పద్యాలే ఎన్నుకొన్నప్పటికీ అద్భుతంగా నడిపించారు.

వై.సి.వి. రెడ్డిగారు రాసిన మరో కావ్య ఖండిక రంభ. కంకంటి పాపరాజుగారి ఉత్తర రామాయణంలో రంభ రావణ సంవాద ఘట్టం. రెడ్డిగారు దీన్ని అపురూప కావ్యంగా మలిచారు. తేటగీతి పద్యాల్ని బాగా ఇష్టపడే ఆయన వృత్తపద్యాల్ని కూడా ఎన్నుకోవడం విశేషం. వీరి పద్య రచనా నైపుణ్యానికి, భావపుష్టికి తార్కాణం ఈ కావ్యం. కంకంటివారి ఉత్తర రామాయణంలో నలకూబరుని వలచిన రంభ రావణునిచే బలాత్కరింపబడుతుంది. ఈ కావ్యంలో రావణుని ఔచిత్యవంతమైన మాటలకు రంభయే ఆయనకు దగ్గరయినట్లు చెప్పడం విశేషం. మచ్చుకొక పద్యం చూడండి.

**చ. అన విని హావభావ పులకాంకురవత్కి లికించి తమ్ములన్**
**మొనసిన మేనితో నిలువుపూచిన తీవియవోలె రంభ సి**
**గ్గున దలవంచి చూపు మెఱుఁగుల్ కడకన్నులఁ బర్వ రాక్ష సేం**
**ద్రునిఁగనుగొంచునిల్చెఁ జివురుం బెదవిన్ మునిపంట నొక్కుచున్**

పల్లెవాతావరణాన్ని రైతు జీవితాన్ని ప్రధాన ఇతివృత్తంగా తీసుకొని వై.సి.వి. రెడ్డి గారు సింధూర రేఖను రూపొందించారు. ఇదొక ఆధునిక ప్రబంధం. అద్భుతమైన వర్ణనలు చోటుచేసుకొన్నాయి. కావ్యంలో ఒకే సేద్యగాడు ఉగాది నుండి మళ్ళీ వచ్చే ఉగాది వరకు రైతు ఇంటిలో జరిగే పని విధానాన్ని చెబుతాడు. ఈ కావ్యం చదువుతుంటే రైతు ఇంట పుట్టిన ప్రతిఒక్కరికి అదో రకమైన ఆనందం, అనుభూతి కల్గుతుంది. రైతు పంటలు బాగా పండితే కూలి వారికి కలిగే సంతోషాన్ని, తల్లులు కూలి వాండ్లకు సంగటి పెట్టే వైనాన్ని వై.సి.వి. రెడ్డి గారు మన కళ్లముందుంచారు.

**తే.గీ. రకరకాలగు పైరుల సకల ధాన్య**
**ములను పండించి పైపాతరలను నింప**
**కోరుకొంటిమి యాయేటి తీరుజూచి**
**కూలి నాలికి లోటులేకుండ దలచి వలచి**

**తే.గీ. పల్లె నేలెదు వనితలు పరుగు లెత్తి**
**యింపు దళుకొత్త సంగటి గంపలెత్తి**
**చేల శ్రమియించు కూలీల చేతులందు**
**ముద్దలుగ పెట్టినారు సమ్మదము మీర**

**తే.గీ. అన్నపూర్ణలు మాయూరి ఆడువారు**
**ముద్దు కూళుల్ల సంగటి ముద్దలెత్తి**
**కడుపు నిండుగ బెట్టిరి గట్టి పెరుగు**
**గడ్డలను విరిచి చేతుల కందినంత**

ప్రస్తుతం ఆ రోజులు లేవు. ఇపుడు సంగటి పట్నంలో ఫ్యాషనైతే పల్లెల్లో మొరటు. ఆ రోజుల్లో బాగా కష్టం చేసే మగవాళ్లు కనీసం నాలుగైదు ముద్దలు చేతుల్లోనే ఉంచుకొని అవలీలగా తినేవారు. ఈనాడు అలా కష్టం చేసేవారు లేరు. తినేవారూ లేరు. రైతు కుటుంబం నుండి వచ్చిన వై.సి.వి. రెడ్డి స్వీయ అనుభవం నుండి తన్మయత్వంతో 'సిందూరరేఖ'ను రాశారు. ఈ కావ్యమంతా ప్రజల వాడుక మాటలు, సేద్యపు పనిముట్లు అలుముకొన్నాయి.

ఇంత వరకు పద్యకావ్యాలు వెలయించిన వై.సి.వి. రెడ్డి గారు దక్షిణానిలాన్ని మాత్రా ఛందస్సులో రాశారు. "నాలో జాలువారిన భావ సంకలనమే దక్షిణానిలం"గా రూపొందిందని ఆయన ముందు మాటలో తెలియజేశారు. 'దక్షిణా నిలము' అనగా దక్షిణం నుండి వీచిన గాలి. యన్.సి. రామసుబ్బారెడ్డి గారు "వై.సి.వి. రచనలు పద్యవైశిష్ట్యం – పలుకుబళ్లు" అనే వ్యాసంలో దక్షిణానిలాన్ని విశ్లేషిస్తూ 'దక్షిణానిలం సాహిత్య సంగీత మధుర సాగరమే! కమ్మచ్చులో సాగే తీగలా గేయాలన్నీ ఒక మూసలో పోసి చేసిన చక్కని ధారలా సాగిన రచన. ఎత్తుబడికి ముగింపుకు తేడాలేని పదగుంఫనం గలిగి మరంద డోలికలూగించి మనసుల లోగొనే రచన. శాస్త్ర రీత్యా దక్షిణపుగాలి ఆరోగ్య దాయకమని చెబుతారు. అందుకే గృహాలకు దక్షిణంవైపు కిటికీలను అమర్చడం. ఇది లయబద్ధమై సంగీతానికి సులువుగా సాగే రచన అన్నారు.

వై.సి.వి. రెడ్డి పేదల పక్షపాతి. జీవన మాధుర్యం కోల్పోయిన దీనులను చూచి కరిగిపోతాడు. జనులకు సానుభూతిని తెలుపుతూ వారి దుఃఖాలలో పాలు పంచుకొంటారు. దక్షిణానిలంలో ఆయన ప్రకృతి రమణీయతకు పరవసిస్తూ అది మానవాళికి అందిస్తున్న మహోపకారాన్ని గుర్తు చేస్తాడు.

**నిలువెల్ల చెమటతో సొలసి చిక్కిన దేహ**
**మాత్మలను దహియింప నావు రావురు మంచు**
**పొరబాడు భిక్షకుల వరముగా భరముగా**
**ఆలసముగ దక్షిణానిలము మా గడ్డపై**
**వీచెనమ్మా! యిపుడె!**

**ఉరిమి తరముచునున్న ఉప్పెనలు కష్టాలు**
**కడుపులో చెయివెట్టి కలచి నట్టులు గాక**
**దగగొన్న వగగొన్న దళిత మానవులకై**
**అలసముగ దక్షిణానిలము మాగడ్డపై**
**వీచెనమ్మా! యిపుడె!**

**ప్రొద్దస్తమానమ్ము పొలములో పొరలాడి**
**యెండ వానల కోర్చి బండకష్టము జేసి**
**పులినొప్పులను నీరసిలు కూలి ప్రజలకై**
**అలసముగ దక్షిణానిలము మాగడ్డపై**
**వీచెనమ్మా! యిపుడె**

యిందులో రాయలసీమ వాతావరణాన్ని, కష్టజీవులు ఎదుర్కొనే ఇబ్బందులను ఏకరువు పెట్టారు. దక్షిణానిలం వారికి కొంతవరకైన సేద తీరుస్తుందనే ఆశాభావాన్ని వ్యక్తపరుస్తారు.

వై.సి.వి. రెడ్డి గారు రచించిన 'రాయబారము' గేయ కావ్యం. తొలిపలుకుల్లో "కొన్ని యేండ్ల నుండి రైతు జీవనాన్ని అందులోని కష్టాలను తెలిసినవాన్ని కాబట్టి ఆ జీవనంలోని బాగోగులను గురించి రాయాలనుకొన్నాను. నా ఆలోచనా పరంపరలో 'గాసగాడు' మాటి మాటికే ఎదురైనాడు. తీవ్ర పరివేదనలో చిక్కి శల్యమైనవాని కష్టాలు నన్ను కదిలించాయి. ఈ రాయబారం వల్ల రైతుకూలీలకు మేలు కలిగినచో ధన్యుడనని" వై.సి.వి. రెడ్డి గారు అన్నారు. అందుకే కావ్యాన్ని కూడా అన్నార్థుడై ఆపదలలోనున్న గాసగానికి అంకితమిచ్చారు. కోడి కూసింది మొదలు రెడ్డి గారింట్లో గాసగాడు చేసే పనులను, వాడు పడే మానసిక క్షోభను కవి ఎంత ఉద్వేగంతో వర్ణించాడో చూడండి.

**కోడికూత వినగానే**
**కోపగాడు రెడ్డేరని**
**కొంపలోని రొంపంతా**
**ఊడ్చి పారవేయాలని**
**వచ్చినాడు మాదిగోడు**
**వంగినాడు పనిపాట్లకు**
**గాడిపాట లూడుస్తూ**
**గంజుకుండ పగిలిందని**

**గంజుతోడుటెట్లాయని**
**అడుగలేక మిడికినాడు**
**పాపం మీ గాసగాడు**
**ఆమాటే చెబుదామని**
**నీకెందుకు చెప్పాలని**
**చెప్పలేకచెబుతున్నా**

ఇక్కడ గాసగాని నిస్సహాయత ఎంత హృదయంలేనివాడికైనా బాధ కల్గిస్తుంది. రైతు పాదాలు కింద గడ్డి పరకల్లా నలిగిపోతున్న వాళ్ల స్థితిగతుల్ని, గుక్కెడు గంజికోసం వారు ఎదుర్కొంటున్న సమస్యలను రాయబారంలో వై.సి.వి. రెడ్డి గారు హృద్యంగా వర్ణించారు.

**కుంటలోని వండు మట్టి**
**గుద్దలితో గదలద్రవ్వి**
**సదరులోన మదిరెవేయ**
**సన్నాహముతో వాడూ**

**పొడియెండల మిడియెండల**
**పూడుగడ్డ లొకటొకటే**
**కుల్లగింప పెల్ల క్రింద**
**కునుకుచున్న తేలుకుట్టి**
**కుయ్యో మొర్రో యంటూ**
**కుమిలినాడు కమిలినాడు**
**కూడుగూడ కుడువ లేక**
**కుతిలపడుచు వెతలపడుచు**
**చెప్పలేని చెమటలతో**
**చెదరినాడు బెదరినాడు**

**ఆమాటే చెబుదామని**
**నీకెందుకు చెప్పాలని**
**చెప్పలేక చెబుతున్నా**

రెక్కలు ముక్కలు చేసి పని చేసేటప్పుడు పురుగు పుట్రా కుడితే కూడా రైతుకు చెప్పుకోలేదు. దిక్కులేని అభాగ్యుని మానసిక క్షోభ ప్రతి ఒక్కరిలో ఆలోచనలను రేకెత్తిస్తుంది. సామాజిక చైతన్యం కోసం పదునెక్కిన ఆలోచనలతో వై.సి.వి. రెడ్డి గారు రాయబారం రాశారు.

వై.సి.వి. రెడ్డి గారు అభ్యుదయ, భావకవిత్వాల్లో దిట్ట. ఆయన రచనల్లో వాస్తవికత, కాల్పనికత రెండు పాయలుగా సంఘమించాయి. ఆయన రాసిన భావకవిత్వానికి చక్కని ఉదాహరణ 'సెలకన్నె. ఇందులో 'సెలకన్నె' చైతన్యవంతమై సజీవంగా మన కళ్లముందు కదలాడుతుంది. సెలకన్నె రాకడను ప్రశ్నిస్తూ మనోహరదృశ్యాలను చిత్రించారు వై.సి.వి.రెడ్డి.

**ముఖమంతయు చిరుచెమటలు**
**ముంగురులును చెదరిపోయె**
**గండమ్ముల కలువపూత**
**కటిచక్రము జువ్వాడెను**
**భంగపటము జారిపోయె**
**ప్రతి యంగము పులకించెను**
**నీ ఎఱ్ఱని కంటిజీర**
**నీ చల్లని చిరునవ్వుల**
**ఏవేవో సుందర పద**
**భావమ్ములు పొంగుచున్న**

**వమ్మా! నీలోని కాంక్ష**
**లన్నియు ఒక ద్రుతగతిలో**
**లాస్యమ్ముల సేముచుండె**
**లలిత స్పర్శమ్ము తోడ**
**పులకల కిలికించి తమ్మి!**
**కలరవ గానమ్ములోన**
**లతలును నినుజూచి సోలె**
**లాలిత్యము జాలువార**
ఏమమ్మా సెలకన్నే
ఎక్కడ నుండీ రాకడ?

ఈ గేయ కావ్యంలో వై.సి.వి.రెడ్డి గారు కొత్తపుంతలు తొక్కారు. ఆయన చూచిన వస్తువులను పొందిన అనుభూతులను కొత్త ఊహలతో పోల్చడం కన్పిస్తుంది.

వైజయంతి, పారిజాతం కావ్యాలను చదివితే వై.సి.వి. రెడ్డి గారు సంప్రదాయ సాహితీ పునాదులపై నవసాహిత్య సౌధాన్ని నిర్మాణం గావించాడనిపిస్తుంది. ఆయనకు ప్రబంధాలపై గట్టి పట్టుంది. ఆయన ఊహాలోకాల్లోంచి విహరించిన కావ్యం 'వైజయంతి'. ఇది దేవ దేవుడైన శ్రీ మహావిష్ణువు కంఠంలో అలంకరింపబడిన సుమమాల. అదే కావ్యానికి ధ్వని.

అల్లసాని పెద్దన మనుచరిత్రలో కథా నాయకుడైన ప్రవరాఖ్యుని కథ ఇది. సిద్ధుని పాద –లేపనంవల్ల హిమాలయ పర్వత సామానువులను దర్శించి, అక్కడ మహాద్భుత సౌందర్య రాశియైన వరూధిని తనను ఇష్టపడి చెంత చేరినా ఏవో నీతి మాటలు చెప్పి ఇంటికి చేరిన ప్రవరుని ప్రవర్తనను ప్రశ్నించడం ఇందులో కథాంశం.

**నీలికన్నులలోని నీలినీడల చూచి**
**గచ్చకాయల వంటి కన్నీటి బిందువులు**
**పడ చూచి దయలేక పడచూచు త్రోపులకు**
**సాహసించితివి, నిస్సారధర్మముల హా!**
**శ్రీహరీ! యని సిగ్గుచేటుగా బిగిసితివి**
**యిదియేమి సద్ధర్మమూ! భూదేవ**
**తుదిలేని ప్రారబ్ధమూ**

వలచి వచ్చిన చిన్నదాన్ని కాదని నిస్సారమైన ధర్మము లుపదేశించావు గాని ఆమె పడిన మనోవేదనను ఒక్క క్షణమైనా ఆలోచించావా అని ప్రశ్నిస్తున్నాడు కవి. సాటి మనిషి మనోవ్యథతో బాధపడుతుంటే ధర్మసూత్రాలను పట్టుకొని ఊగులాడుతావా? ఇది ఏమి నీతి? ఇది ఏమి ధర్మం అంటూ తీవ్రంగా నిందించాడు.

**ఎంత పంగించినా ఏమి పలుకక,**
**ఇంత కాలమూరకయుండి, కర్మకాండల మునిగి**
**విసివి భూసుర వంశవిదుల, ప్రవరాఖ్యుండు**
**పలికె చూచాయగా పరివేదనము తోడ...**

**వేద సారములన్ని విశదముగ తెలుసుకొని**
**విజ్ఞాన ఖనులంచు వినుతికెక్కితిమి మా**
**విద్యలను సభలో వినిపింపుడని చెప్పి**
**మభ్యపెట్టుచు, మాకుమాన్యముల నగ్రహా**
**రములనిచ్చిరి, వారి రాజ్య సంపద బెంచు**
**ములుగట్టెలుగ మారుచూ బీదలకు – ముక్తి మార్గము చెప్పుచూ**

పండితులు స్వార్థచింతనతో సమాజానికి అవసరంలేని మాటలు చెప్పి తమ పబ్బం గడుపుకొనే వైనాన్ని, వేదాలంటూ, ఉపనిషత్తులంటూ లేనిపోనివి సృష్టించి, రాజ్యాధినేతలను సైతం తన గుప్పిట్లో పెట్టుకొనే విధానాన్ని, అనాది నుండి వారి ఆచార వ్యవహారాల్ని ఈ కావ్యంలో వై.సి.వి. రెడ్డి గారు తీవ్రంగా ఖండించారు.

వై.సి.వి. రెడ్డి గారు రచించిన చివరి గేయకావ్యం పారిజాతం. నంది తిమ్మన పారిజాతా పరహణమే ఈ కావ్యానికి మూలం. పారిజాతాపహరణంలోని ముఖ్యమైన ఘట్టాలను గురించి చెబుతూ నంది తిమ్మనతోనే సంభాషిస్తాడు వై.సి.వి. రెడ్డి. 'మీ తోడ నడచి వత్తును స్వామి – చూచి చెప్పిన తీరు చూచి వచ్చిన తీరు మా వారి కెరిగింతునూ' అంటూ పారిజాతా పహరణంలోని కవితా రీతులను చెబుతాడు. కావ్యంలో తిమ్మనను పాత సమాజానికి ప్రతీకగా తీసుకొని, ప్రగతిశీల భావాలను పదునుపెట్టేటందుకు కలసిరావాలని రచయితలకు విజ్ఞప్తి చేశాడు. మచ్చుకొక ఉదాహరణ

**మానసోల్లాసమున మంచిమాటలు కొన్ని**
**పదబంధముల చేర్చి పద్యాలుగా గూర్చి**
**తియ్య తియ్యని తేనె తెట్టెలను భజియించి**
**తేపినట్టుల జేసి ఊపిరాడగ నీక**
**ఊదరలు గొట్టితివి ఉత్తపుణ్యానికే**
**జనత చచ్చిరి తిండికీ పేదలను – వంచించుటలు దేనికి**

ఇలా వై.సి.వి.రెడ్డి గారు పద్యమైన, గద్యమైన, గేయమైనా ఏమి రాసిన పేదల సంక్షేమానికి బద్ధుడయ్యారు. మానవులందరూ సమభావంతో జీవించాలని, మనిషిని మనిషిగా గౌరవించే సభ్య సమాజం రావాలని ఆరాటపడ్డాడు. సంప్రదాయ కవిత్వంలో కూడా ఆధునిక భావాల్ని ప్రవేశపెట్టారు. కడప జిల్లా అభ్యుదయ సాహిత్యానికి అతిరథులుగా నిలిచిన వై.సి.వి. రెడ్డి గారు నిత్య స్మరణీయులు.

❖ ❖ ❖



**వెన్నపూస అరవిందనాథ రెడ్డి**
సెల్ : 9440914908

# వై.సి.వి. రెడ్డి భారత పఠనం

## భారతం చెంబు - నేను

నా పేరు వెన్నపూస అరవిందనాథ రెడ్డి. గతంలో 15 సంవత్సరములు సింహాద్రిపురం సర్పంచ్‌గా విధులు నిర్వహించాను. మా స్వంత వూరు సింహాద్రిపురం. మా అబ్బ వెన్నపూస శివన్నారాయణ రెడ్డి గారికి అన్ని రకాల వ్యాపారాలతో పాటు మండి, కిరాణా కొట్లు కలవు. మా అబ్బ మరియు మా పెదనాయన వెన్నపూస రామకృష్ణారెడ్డి గార్లు సింహాద్రిపురం చుట్టుపక్కల లబ్ధప్రతిష్టులు. వారి మాట బాగా చెల్లుబడి అయ్యేది. ప్రజా ప్రయోజన కార్యక్రమాలు స్వంత ఖర్చులతోనే నిర్వహించేవారు.

1955వ సంవత్సరం నుండి సింహాద్రిపురం ప్రాంతం కరువు వాతన పడింది. 4 సంవత్సరములు వర్షాలు లేవు. మా అంగడి వసారాలో ఒక సాయంత్రం సమావేశంలో అప్పటి జిల్లా పరిషత్ స్కూల్ హెడ్‌మాష్టరు సి. రామారావు గారు, హెచ్. యల్లారెడ్డి గారు మహాభారతం విరాటపర్వం చదివితే వర్షాలు పడతాయని చెప్పినారు. మా అబ్బ శివన్నారాయణ రెడ్డి విరాటపర్వం ఒక్కటే ఎందుకు! మొత్తం 18 పర్వాలు చదివితే బాగుటుంది కదా అన్నారు. అందురు అందుకు సమ్మతించారు.

మహాభారతం 18 పర్వాలు చదివి వ్యాఖ్యానించే వ్యక్తి కొరకు అన్వేషణ మొదలైంది. మా కిరాణా కొట్టుకు జిల్లా పరిషత్ హైస్కూల్ ఉద్యోగులు నెలవాడికగా సరుకులు తీసుకుని పోయెవారు. వారందరిని విచారిస్తే స్కూలు ఆఫీసులో పనిచేస్తున్న వై.సి.వి. రెడ్డిగారు సమర్థులని తెలిసింది. భారత, రామాయణ, పురాణాలపై ఆయనకు మంచి అవగాహన వుందని తెలిసింది.

అప్పుడు మా పెదనాయన వెన్నపూస రామకృష్ణా రెడ్డి గారు వై.సి.వి. రెడ్డిగారిని కలసి కరువు కష్టాలు తీరుటకు మీరు మహాభారతం 18 పర్వాలు చదివి వ్యాక్యానించవలసిందిగా కోరినారు. అందుకు వై.సి.వి. రెడ్డి గారు తన సమ్మతిని తెలిపినారు.

మా అంగడి పెద్ద వసారాలో కార్యక్రమ నిర్వహణకు ఏర్పాటు చేసినారు. ఊరి పెద్దలందరు కూర్చుని మంచి ముహూర్తం నిర్ణయించినారు. కరెంట్ లేని కారణంగా పెట్రోమాక్స్ లైటు వెలుతురులో కార్యక్రమం నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినారు. అందుబాటులో వున్న భారత పర్వాలను సేకరించడం జరిగింది.

ప్రతిరోజు సాయంత్రం 6:30 గంటల నుండి 9 లేదా 9:30 గంటల వరకకు కార్యక్రమం జరిగేలా నిర్ణయించడమైనది. 1958–59 సంవత్సరాల మధ్య 10 నెలల కాలం ఈ కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగింది.

మొదటి రోజు 20 నుండి 30 మంది శ్రోతలతో ప్రారంభమై క్రమంగా సంఖ్య పెరుగుతూ వందలు దాటింది.

పద్యం రాగయుక్తంగా పాడడం, అర్థ వివరాలను సులభంగ అర్థమయ్యేటట్లు చెప్పడంతో శ్రోతలు పరశువులయ్యేవారు.

అప్పుడప్పుడు వై.సి.వి. రెడ్డి గారి గొంతు బొంగరు పొయ్యేది. నీళ్ళు కావాలని అడిగేవారు. ఒక వారంలో మా పెదనాయన ప్రొద్దుటూరుకు పోయి 4 చిన్న చెంబుల నీళ్ళు పట్టె పెద్ద ఇత్తలి చెంబు, దానికి తగ్గ గ్లాసు తెచ్చినారు. ఆ ఇత్తలి చెంబు “బారతం చెంబుగా” ప్రసిద్ధి చెందింది.

‘భారతం చెంబు’ రావడంతో నా విధులు ప్రారంభమైనాయి. మా అబ్బగారి ఆజ్ఞప్రకారం ప్రతిరోజు కార్యక్రమం ప్రారంభం కావడానికి ముందే ‘భారతం చెంబును’ మరియు లోటాను శుభ్రపరచి నీళ్ళతో నింపి వై.సి.వి. రెడ్డి గారి ప్రక్కన పెట్టి అక్కడే కూర్చొని, వై.సి.వి. రెడ్డి గారు అడిగినప్పుడల్లా నీళ్ళు అందిస్తూ వుండాలి. నీళ్ళు అయిపోతే మరలా నింపుకుని రావాలి. దీనికి తోడు వై.సి.వి. రెడ్డి గారు గొంతు బొంగురు పోయినప్పుడు ఇవ్వడానికి మా అమ్మవాళ్ళు మిరియాలు, పప్పులు, తెల్లగడ్డలు నా దగ్గరే వుంచేవారు. అవసరమైనప్పుడు వాటిని వై.సి.వి. రెడ్డి గారికి అందించడం కూడా నాపనే. ఈ పనిని నేను 7 సంవత్సరాల వయసులోనే 10 నెలల పాటు విజయవంతంగా నిర్వహించాను.

క్రమంగ శ్రోతల సంఖ్య పెరిగి వరండా నిండిపోయి బయట రోడ్డు మీద కూర్చునేవారు. వారి కోసం ఈత చాపలు తెప్పించి పరిచేవాళ్ళం. కొందరు ఇంటి వద్ద నుండే దుప్పట్లు, చాపలు తెచ్చుకునేవారు.

ప్రజలు తాము తమతోటివారు తినడానికి పప్పుల పిండి, బెల్లం, శనగగుగ్గిళ్ళు, పెసర గుగ్గిళ్ళు తెచ్చేవారు. మా పెద్దనాయన యల్లనూరు బొరుగులు బుడ్డకారాలు కలిపి ప్రజలకు పంచేవారు.

వర్షము వచ్చినప్పుడు భారత శ్రవణం ఆగిపోయి మరుసటిరోజు ప్రారంభమయ్యేది. ఉద్యోగ పర్వంలో ప్రవేసించేసరికి జనం సాధ్యం కాకుండా వచ్చేవారు. మా నాయన గారు కడపకు వెళ్ళి బ్యాటరీతో నడిచే మైకుసెట్టు తీసుకుని వచ్చారు. తిరుపతి నుండి మహాభారతం 18 పర్వాలు కొత్తవి తెప్పించారు.

వై.సి.వి. రెడ్డి గారు భారతం పద్యాలు చదివి వివరిస్తూ వుంటే ప్రత్యక్షంగా చూసినట్లు శ్రోతలు మైమరిచిపోయేవారు. వై.సి.వి. రెడ్డి గారు వివరణలు ఇచ్చేటప్పుడు సింహాద్రిపురం మాండలికాలను, వ్యవసాయాధారమైన సామెతలను ప్రస్తావించడంతో శ్రోతలను నేరుగా తాకేవి. వై.సి.వి. రెడ్డి గారు బారీ మనిషి, తల పెద్దది. మూతి ముందుకు వచ్చినట్లు వుంటుంది. ఆయన చదివేటప్పుడు, చెప్పేటప్పుడు ముసర్లు పడతాయని తన ముందర ఎవరిని కూర్చోనిచ్చేవారు కాదు. ఎక్కువగా నీళ్ళు తాగేవారు. చాలాసార్లు భారతం చెంబును రెండవసారి నింపుకుని వచ్చే వాన్ని.

10 నెలల పాటు జరిగిన ఈ మహాభారత యజ్ఞంలో భారతంతోపాటు రంగనాథ రామాయణం కూడా శ్రోతలకు వినిపించడం జరిగింది.

వై.సి.వి. రెడ్డిగారి స్వగ్రామం బోనాల సింహాద్రిపురానికి 12 కి.మీ. దూరం. వ్యవసాయం కుటుంబంలో పుట్టి పెరిగినప్పటికి, ఇతిహాస, పురాణాలను అలవోక చదివి, సులభమైన భాషలో అర్థ వివరాలను చెప్పగల విద్య ఆయనకు స్వంతమైంది. బహుశ పూర్వజన్మ సుకృతం కావచ్చు. ఈ విద్యయె అయినను కవిగా, కథకునిగా భవిష్యత్తుతో స్థిరపరచి, పలువురి కవుల, పండితుల ప్రశంశలకు కారణమైంది.

నేడు వై.సి.వి. రెడ్డి గారి పిల్లలు ఆయురారోగ్యాలతో దేశ విదేశాలలో స్థిరపడినారంటే ఆయన సంపాదించిన పుణ్యఫలమే కారణమని నా విశ్వాసం. తండ్రిగారి శతజయంతి జరుపుతున్నామని వారి కుమారుడు ప్రభాకర రెడ్డి తెలుపుతూ నన్నొక వ్యాసం వ్రాయవలసిందిగా కోరాడు. 'భారతం చెంబు' దాన్ని చుట్టుకుని ఉన్న సంఘటనలు, ఈ వయసులో కూడా నాకు కళ్ళకు కట్టినట్లు కనపడ్డాయి అవే వ్రాశాను.

## ముగింపు

10 నెలల భారత పఠన కార్యక్రమం పూర్తి కావడంతో వై.సి.వి. రెడ్డి గారిని, వారి సతీమణిని పట్టువస్త్రాలతో సత్కరించి, తిరుపతి నుండి తెప్పించిన మహాభారతం 18 పర్వాలు బహుమతిగా అందచేయడం జరిగింది.

మహాభారత పఠనాస్థలము నుండి వై.సి.వి. రెడ్డి గారిని వారి సతీమణిని ఎద్దుల బండిలో పురజనులందరు కలిసి ఊరేగింపుగా పోయి వారి ఇంటి వద్ద విడిచి రావడం జరిగింది. వై.సి.వి. రెడ్డి గారు బదిలీ మీద వెళ్ళుచున్నప్పుడు ఘనంగ సన్మానించి వీడ్కోలు చెప్పడం జరిగింది.

❖ ❖ ❖

"ఏమైనా తన రచనలకన్నా తనే అపురూపమైన మనిషి! గొప్ప రచనలు చేసిన వ్యక్తి వెళ్లిపోతే రచనలుంటాయి. కనుక అదంత నష్టమనిపించదు. వ్యక్తికన్నా ఆ వ్యక్తి రచనలు విలువైనవి కావడం సాధారణ విషయం. వై.సి.వి. విషయం అలాంటిది కాదు. మనిషిని ప్రేమించేవాడు. మనిషి ప్రేమించదగినవాడు. కాదు ప్రేమించి తీరవలసినవాడు. వై.సి.వి. అంటే మనిషితనం, పల్లెటూరితనం, రాయలసీమ తనం."

**– పి. రామకృష్ణారెడ్డి (ఆంధ్రజ్యోతి, 27.10.89 వారపత్రికలో)**



**ఆర్. శకుంతల**
9916530024

# జ్ఞాపకాలు

మా నాయన మంచికవి ఎన్నో గేయ కావ్యాలు, పద్యకావ్యాలు వ్రాసినారు. అందులోనిదే 'మేనక'. 'మేనక' వ్రాసేటప్పుడు నేను పుట్టినాను. అందుకే నాకు 'శకుంతల' అని పేరుపెట్టినారు. మా నాయనకు నేనంటే చాల ప్రేమ. నన్ను ముద్దుగా 'పాప' అని పిలిచేవారు.

మా నాయన సింహాద్రిపురం జిల్లా పరిషత్ స్కూలులో జాబ్ చేసేవారు. మా నాయన గారి ఊరు 'బోనాల' అప్పట్లో మాకు సెలవలు ఇచ్చినపుడంతా బోనాలకు పోయే వాళ్ళము.

అక్కడి చుట్టుపక్కల పల్లెల భూములన్నీ మెట్ట పొలాలు చీనా తోటలు వర్షాలు పడితేనే పంటలు లేకపోతే లేదు. వర్షాలు లేక బావులు ఎండిపోతే తోటలకు ఇబ్బంది. అక్కడి వాళ్ళకు 'విరాటపర్వం' చదివితే వర్షాలు పడతాయని నమ్మకము. మా నాయన చేత 'విరాటపర్వం' చదివించేవారు. సింహాద్రి పురంలో 1957–58 సంవత్సరాల మధ్యకాలంలో 10 నెలల పాటు మహాభారతం 18 పద్యాలు చదివి, వ్యాఖ్యానించారు.

మా నాయన కమ్యూనిస్టు పార్టీలో చేరినారు. కమ్యూనిస్టు అని చిన్న చిన్న పల్లెలకు ట్రాన్స్‌ఫర్లు చేస్తూండేవారు. ఆ పల్లెల్లో స్కూల్‌లు ఉండేవి కావు. పిల్లలకు చదువు ముఖ్యం అని ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి కడప చేరుకున్నారు.

మా నాయన నా కోసము ఆంధ్రప్రభ, ఆంధ్ర పత్రిక, యువ, జ్యోతి అన్ని మ్యాగజైనులు తెప్పించే వారు. వాటన్నిటిని చదువుకొనే దానిని. మా అమ్మకు కూడ చదివి వినిపించేదానిని. నేను మా అమ్మ సినిమాలకు పోవాలని అడిగితే పంపించేవారు. మా నాయనకు కూడ సినిమాలంటే ఇష్టము. అప్పుడప్పుడు పాత సినిమాలకు పోయేవారు.

మా నాయన దగ్గరకు ఎంతోమంది కవులు పండితులు వచ్చేవారు. వారు వ్రాసిన కవితలను చదివి వినిపించి తప్పులను దిద్దించుకొని పోయేవారు. నేను 12వ క్లాసు చదివేటప్పుడు స్కూలు మ్యాగజైనుకు "దేశ భాషలందు తెలుగు లెస్స" అని అష్టదిగ్గజ కవులను గూర్చి వ్రాసినాను. దానిని మా నాయన దగ్గరకు వచ్చిన కవి తప్పులను దిద్దినారు. ఆ తరువాత ఆ ఆర్టికల్ స్కూలు మ్యాగజైనులో అచ్చయినది.

నేను 12వ క్లాసు ఫేలయినప్పుడు మా నాయన నన్ను ఏమి అనలేదు. సరికదా ఇంకొకసారి పరీక్షకు కట్టి పరీక్ష రాస్తే అవుతుందిలే అని సమాధాన పరిచినారు. తరువాత నేను ప్యాసు అయి కాలేజిలో చేరినప్పుడు చాల సంతోషపడినారు. బోనాలలోని ఆడపిల్లల అందరి కంటే మొదట కాలేజి మెట్లు ఎక్కిన దానివని నన్ను అభినందించినారు.

ఆడపిల్లకు పెండ్లి చేయకుండా కాలేజిలో ఎందుకు చేర్పించినావని అందరూ అడిగేవాళ్ళు. మా నాయనకు ఒకే ఒక ఆశ ఉండేది. జేబులో అయిదు రూపాయలు ఉంటే 'పాప'ను చూసుకొని వచ్చే అంత దగ్గరలో ఉన్న వారికిచ్చి పెండ్లిచేయాలని దగ్గరగా ఉన్న సంబంధాలు చూచుకొని వచ్చి మాట్లాడుకున్నపుడు దగ్గర బంధువులే దానిని చెడగొట్టేవారు. కట్నాలు, కానుకలు ఇచ్చుకోలేరు అని చెప్పి. అప్పుడే మైసూరు నుండి ఒక సంబంధం వచ్చింది. దూరం అయినా పరవాలేదు. గౌర్నమెంటు ఉద్యోగములో ఉన్న పిల్లవాడు సుఖముగా ఉండగలదని తృప్తిపడి పెండ్లిచేసినారు.

కోర్టు పనుల మీద, ఆసుపత్రుల పని మీద వచ్చిన వాళ్ళందరూ మా ఇంటికీ వచ్చేవారు. మా ఇళ్ళు ఎప్పుడూ బంధువులతో, స్నేహితులతో సందడిగా ఉండేది. మా అమ్మ వంట చేసేది నేర్చుకోమని అప్పుడప్పుడు చెప్పుతూ ఉండేది. అయితే మా నాయన నాకు సపోర్టుగా నిలచేవారు. వంట చెయ్యడం ఏమంత బ్రహ్మ విద్యా అదే వస్తుందిలే అని చెప్పేవారు. నేను ఏ ఒక చిన్న పనిని చేసేదానిని కాదు.

మైసూరుకు అమ్మ నాన్నలు అప్పుడప్పుడు వచ్చే వాళ్ళు. వారం పదిరోజులకంటే ఎక్కువ రోజులు ఉండేవారు కాదు. బయట ఎక్కడికి పోయేవారు కాదు. ఇంట్లోనే ఉండేవారు. ఒకసారి మైసూరుకు వచ్చి కడపకు పోయేటప్పుడు ఇంక నేను మైసూరుకు రాలేను ఇదే కడపటిసారి అని అనుకో అని చెప్పినారు. అదే నిజము అయినది. తరువాత వారు మైసూరు రానే లేదు.

నేను ఒకరోజు మధ్యాహ్నము టీవీలో సినిమా చూస్తున్నాను. అప్పుడు స్క్రీను మీదా మా నాయన కనిపించినారు. ఇదేమిటి సినిమా మధ్యలో మా నాయన కనిపించడము ఏమిటి అని చాలా ఆశ్చర్యపోయినాను. ఆ రాత్రే ఫోను వచ్చింది. హార్ట్ అట్యాక్‌తో చనిపోయినారని. అప్పుడనిపించింది నాకు ఆఖరిసారిగా నన్ను చూడాలని వచ్చినారని. ఇంక నన్ను 'పాప' అని పిలచేవాళ్ళు లేరని చాల దుఃఖపడినాను. మా నాయన జ్ఞాపకాలే నా మనస్సుకు నెమ్మది కలిగించాయి. కలిగిస్తున్నాయి.

❖ ❖ ❖



**యమ్మనూరు ప్రభాకర రెడ్డి**
సెల్ : 8985545605

# తగువారమే

మా స్వంతవూరు బోనాల. ఇది కడప జిల్లా పులివెందుల తాలుకాలో వుంది. ప్రస్తుతం లింగాల మండల పరిధి అనుకుంటా.

మా అబ్బ పేరు కొండారెడ్డి, మా జేజి పేరు లక్ష్మమ్మ. ఇంటి పేరు యమ్మనూరు అయినా రెడ్డెమ్మ గారుగా ఊరిలో ప్రసిద్ధి. వారికి ముగ్గురు సంతానం. పెద్ద వెంకటరెడ్డి, లక్ష్మమ్మ, చిన్న వెంకట రెడ్డి. ఈ చిన్నవెంకటరెడ్డి మా నాయన. వై.సి.వి. రెడ్డిగా (యమ్మనూరు చిన్న వెంకటరెడ్డి) ప్రసిద్ధుడు. మా అమ్మది ఎరమలపల్లె, వీరపునాయనిపల్లె మండలం. మా అమ్మ పేరు బాలచెన్నమ్మ, మా తాత పేరు ఆదినారాయణ రెడ్డి, మా అవ్వ పేరు చెన్నమ్మ.

ఇతర గ్రామాల వారు మా బోనాల నుండి పయనించేటప్పుడు మా యింట్లో అన్నం తిని వెళ్ళేవారు. ఈ ఆనవాయితీ మేము కడప చేరిన తరువాత నాకు 14 సంవత్సరాలు వచ్చే వరకు సాగింది. “మీ ఇల్లు అన్నదాన సత్రమోయి” అని గజ్జల మల్లారెడ్డి మామ మా నాయనతో తరుచు అంటూ వుండడం నేను విన్నాను. అటువంటి స్థితి నుండి నమ్మి మోసపోయి ఏ పూటకాపూట తెచ్చుకుని తిన్న స్థితిని కూడా మా కుటుంబం అనుభవించింది.

ఉన్నతిలో, అధోగతిలో మా నాయన సాహితీ వ్యవసాయాన్ని ఏనాడు వదలలేదు. తన చుట్టూ సాహిత్య వాతావరణాన్ని ఏర్పరచుకుని పేదరికపు బాధల్ని మరచి పొయ్యేవాడేమోనని నా కిప్పుడనిపిస్తుంది.

మా యింటికి దాదాపు ప్రతిరోజు ఎవరో ఒకరు మా నాయన సాహిత్య సాయాన్ని కోరిగాని, తమ సాహిత్యాన్ని వినిపించడం కొరకు గాని వచ్చేవారు. వారి సాహిత్య చర్చలు మాకు ఎంతో సాహిత్య పరిచయాన్ని కలుగజేసినాయి. నేను, మా అక్క శకుంతల, మా అన్న ప్రతాపరెడ్డి, మా తమ్ముడు పురుషోత్తమ రెడ్డి ఈ వినికిడి ప్రభావంతో పుస్తక పఠనముపై ఆసక్తి పెంచుకుని మంచి చదువరులమైనాము.

ఈ నేపథ్యం వలననే నేను డిగ్రీ చదువుకున్నప్పుడే ‘బ్రతగ్గలను’ అని ఒక కథ వ్రాశాను. అది ఆంధ్రజ్యోతి వారపత్రికలో అచ్చయింది. మద్రాసు నుండి వెలువడే ‘అభ్యుదయ’ మాసపత్రికలో ఒక సంచికలో మా నాయన వ్రాసిన కథ, నేను వ్రాసిన కథ, మా తమ్ముడు వ్రాసిన గేయం ప్రచురణ కావడం ఒక అరుదైన విషయం.

మా యింట్లో జరిగే సాహితీ చర్చల్లోని కొన్ని విషయాలు నాలో శాశ్వతంగ నిలిచి తరువాత కాలంలో వాడబడినాయి. మచ్చుకు ఒకటి.

ఒకనాటి ఉదయం కడప ఆర్ట్స్ కాలేజి తెలుగు అధ్యాపకులు కొందరు తెలుగు టెక్స్ట్ బుక్ తీసుకుని ఒక సందేహం తీర్చుకోవడానికి మా నాయన వద్దకు వచ్చారు. చిన్నయసూరి వ్రాసిన మిత్రలాభం అనే అనుకుంటా అందులో "వెంకలు గొంకు మాని" అనే పదం వచ్చింది. వారు మా నాయనతో 'అన్న ఇక్కడ వెంకటేశ్వరస్వామి ఎలా వచ్చాడు. ఇదేదో కొంచెము చూడు అన్నారు. మా నాయన ఐదు నిమిషాలు పరిశీలించి అది అచ్చు తప్పు వెంకలు కాదు లెంకలు అని వుండాలి. లెంకలంటే సేవకులు భయం లేకుండా ప్రవరిస్తారని అర్థమని చెప్పాడు. ఈ 'లెంకలు' అనే పదము నాలో ఇంకి పోయింది. చాలా సంవత్సరముల తరువాత నేను 'ప్రజాస్వామ్యము' అనే గేయం వ్రాశాను. 2005 సెప్టెంబర్ 13న 'ఆంధ్రజ్యోతి' దిన పత్రికలో అచ్చయింది. అందులో లెంకలు పదాన్ని వాడాను.

**"ఓట్ల పండుగ నోట్ల పండుగ**
**కాదురా ఓ సోదర**
**మనము కట్టె పన్నులకు**
**మనము కోరే సేవలకు**
**లంకె కుదరగ సేవచేయు**
**లెంక లెన్నిక తెలుసుకో"**

ఒక సాయంత్రం కేతు విశ్వనాథ రెడ్డితో మాట్లాడుతూ 'మీరు, మా నాయన వ్రాసిన కథల కాలానికి నేటికి మన ప్రాంతంలో చాలా మార్పులు వచ్చినాయి. ఒక రకంగా ఫ్యాక్షన్ తగ్గుముఖం పట్టింది. దేశ విదేశాలలో మన పిల్లల ఉద్యోగాల కారణంగ ఆర్థిక స్థిరత్వం సమకూడింది. చాలా పల్లెలకు సాగునీటి వనరు కలగడం వలన వ్యవసాయం సాఫీగా సాగడం జరుగుతోంది. ఈ మార్పులను సూచిస్తూ కథ వ్రాయచ్చు కదా' అన్నాను. నువ్వే రాయి అన్నాడు.

రెండు రోజుల తర్వాత ఒక కథ రాశాను. దానికి 'నట్టు సచ్చింది" అన్న పేరు పెట్టాను. నట్టు ఒక రకమైన గడ్డి. చేనంత పర్చుకుని రైతుకు ఎనలేని కష్టం కలిగిస్తుంది. మా నాయన రాసిన రాయబారం గేయ కావ్యంలో 'ఒక చేలో నట్టు చంప ఒక కావ్యం వ్రాసినట్లు" అన్నాడు. 'నట్టు"ను ఫ్యాక్షనుకు ప్రతీకగా తీసుకుని మన ప్రాంతంలో ఫ్యాక్షను రూపు లేకుండా పోయిందని కథలో చెప్పాను. అందుకే కథకు మా నాయన రచన ప్రేరణతో 'నట్టు సచ్చింది' అను పేరును పెట్టాను.

మా నాయన చనిపోయి ఇన్ని సంవత్సరాలవుతున్నా మమ్ములను అంటే మా అన్నదమ్ములను వై.సి.వి. రెడ్డి కొడుకులుగా గుర్తించడం మాకు ఆనందదాయకం. మాకు సంస్కారం నేర్పిన మా నాయనకు నివాళిగా ఈ సంచికను తేవడం ఆయన బిడ్డలుగా మాకు గర్వకారణం.

❖ ❖ ❖



**డా॥ యమ్మనూరు పురుషోత్తమ రెడ్డి**
సెల్ : 9441210400

# మా నాయన - కొన్ని జ్ఞాపకాలు

నాకు గుర్తుకొచ్చేసరికి మా పెదనాయన, మా నాయన, మాయమ్మ, మా అక్క, మా అన్నలిద్దరూ, నేనూ కడపలో దాదాపు 10 సెంట్ల స్థలంలో నిర్మించిన ఒక పెద్ద ఇంట్లో ఉండేవాళ్ళం. ఇంటికి వెనుక వైపున కృష్ణ కాలువ, కుడి వైపున ధాన్యం నిలువ చేయడానికి గదులు, పశువుల శాల, ఎడమ వైపున ఒక పెద్ద బాదం చెట్టూ ఉండేవి.

ఆ ఇంట్లో మా పెదనాయన హఠాత్తుగా మరణించిన రోజున మా నాయన బోరున ఏడవడం నాకు బాగా గుర్తుంది. అప్పటికే మా నాయన కమ్యూనిస్టు పార్టీని వదులుకోలేక, రాజకీయ వేదింపులను నిరసిస్తూ జిల్లా పరిషత్తు కార్యాలయంలో తను చేస్తున్న ఉద్యోగానికి రాజీనామా చేసాడని నాకు తెలియదు. కూపర్ ఆయిల్ ఇంజన్ల వ్యాపారంలో వచ్చిన నష్టాలతో అప్పులపాలై ఆ ఇంటిని అమ్మేయడం వల్ల మేమంతా ఒక చిన్న పెంకుటింట్లోకి మారాల్సి వచ్చిందని కూడా నాకు తెలియదు. ఈ సమస్యలేవీ మా నాయనను కలవర పరచినట్లు నేనెప్పుడు గమనించలేదు. ఎలక్షన్లు వస్తే పార్టీ తరపున ప్రచారం చేయడానికి కమలాపురం తాలూకాకో, పులివెందల తాలూకాకో వెడితే రెండు, మూడు నెలలైనా ఇంటి ధ్యాసే ఉండేది కాదు నాయనకు. అయినా ఆ ఇల్లు జరుగుతూ ఉండేది. మాయమ్మ మూడు పూటలా మాకు తిండి పెడుతూనే ఉండేది.

ఇన్ని ఆర్థిక ఇబ్బందుల్లో కూడా కవిత్వాన్ని, కమ్యూనిజాన్ని మా నాయన వదిలి పెట్టనే లేదు. ఈ విషయాన్ని డా॥ఎన్. గోపి గారు, మానాయన చనిపోయినప్పుడు వ్రాసిన గేయంలోని ఈ రెండు వాక్యాల్లో చాలా అందంగా పొందుపరిచారు.

**"కుటుంబ జీవనం మీ అంగీ కింద బనీను**
**కవితోద్యమాలు మీ భుజం మీది రూమాలు"**

మా నాయన సాధారణంగా ప్రతిరోజు ఉదయం టిఫిన్ చేసిన తరువాత బయటకు వెళ్ళి పోయేవాడు. ఆయన ఎప్పుడూ కాలినడకనే వెళ్ళేవాడు. ఎప్పుడైనా సైకిల్ రిక్షా (మనుష్యులు తొక్కేది) ఎక్కేవాడు. దారిలో ఎవరైనా ఒక కవి లేదా రచయిత కన్పిస్తే, వెంట బెట్టుకుని ఇంటికి వచ్చేవాడు. కాస్త కాఫీ సేవించిన తరువాత వారు పుస్తక పఠనం మొదలెట్టేవారు. మా నాయన చాలా శ్రావ్యంగా పఠించే వాడు "రంభ" అనే కావ్యఖండికలో రావణాసురుడు ఇంద్ర లోకంలో అడుగిడిన సందర్భాన్ని తెలిపే పద్యాన్ని నాయన చాలా

ఇష్టపడేవాడు. ఆ పద్యంలోని పదాల పొందికనూ, ఆ పద్యం నడకనూ, రావణాసురుడి రాజసాన్ని తెలిపే ఆ పదాల విశిష్టతను క్షుణ్ణంగా వివరించేవాడు. ఆ పద్యంలోని "ఆలో నచ్చటి కేగుదెంచె సురకన్యామౌళి మందార మాలా లుంటాక మహాప్రభంజనుడు కైలాసాచలోత్క్షేపణో ద్వేలాభీల భుజుండు రావణుడు" అనే పాదాలను చదివి వినిపించేటప్పుడు మా నాయనను చూడాలి. మానాయనతో పాటు వచ్చిన వాళ్ళూ వారు రచించిన కావ్యాల నుండి పద్యాలనూ, కథలనూ చదివి వినిపించేవారు. ఇలాంటి అనేక సమావేశాలలో నేనొక శ్రోతను.

'విద్యోదయ' రామచంద్రారెడ్డి అనే ఆయన నాయన రాసిన కొన్ని పుస్తకాలకు పబ్లిషర్‌గా వ్యవహరించాడు. వాటికి సంబంధించిన ఆర్థిక లావాదేవీలు ఎలా చేసేవాడో నాకు తెలియదు. ఇదికాక ఆర్థిక ఇబ్బందుల రీత్యా తన కవి మిత్రులెవరైనా వారి పుస్తకాలను ప్రచురించుకోలేని పరిస్థితిలో ఉంటే, వాటి ప్రచురణకు కూడా తానే పూనుకునే వాడని విన్నాను. ఉప్పలపాటి వేంకట నరసయ్య అనే కవి మిత్రుడు ఈ విషయాన్ని లోకానికి తెలియజేయాలనే ఉద్దేశ్యంతోనేమో రెండు కంద పద్యాల్లో హృద్యంగా చెప్పారు.

**"ఉప్పమ్మి రత్న వర్గపు**
**గుప్పలు సవరించి దాచుకొనిన కృపణుచే**
**నప్పుకొని కవుల కిచ్చును**
**తప్పక ఋణదాత కిచ్చు దానే మగునో!**
**ఏమగు లోక హితార్థము గామను.....**

చిన్నతనంలోనే కంకంటి పాపరాజు వ్రాసిన ఉత్తర రామాయణాన్ని మా నాయన చేత సంపూర్ణంగా కంఠస్తం చేయించిన వారి గురువు గారైన కొడవలూరు రామచంద్ర రాట్కవి గురించి అప్పుడప్పుడూ మాతో చెప్పేవాడు. ఉత్తర రామాయణం నుండి నోరు తిరగని శబ్ద భూయిష్టమైన కొన్ని పద్యాలను అనర్గళంగా కంఠతా చెప్పి నాకు వినిపించేవాడు. పద్యం చెప్పడంలో మా నాయనది విలక్షణమైన శైలి. నాయనలా పద్యాన్ని పాడేవారిని మరెవ్వరిని నేను చూడలేదు. 'సెలకన్నె' గేయకృతిని తన గురువు గారికి మానాయన అంకితమిచ్చారు.

ఏది రాసినా, ఎలా రాసినా రాసేవాళ్ళని మానాయన ప్రేమించేవాడు. రాయాలని ప్రోత్సహించే వాడు. ఇంకా అప్పుడప్పుడే రాయడానికి ప్రయత్నం చేసే యువకుల్ని కూడా వాత్సల్యంతో ఉత్సాహపరిచేవారు. వారు రాసింది వినేవాడు బాగుందనే అనేవాడు. అందుకే

"పిల్లకాయల్ని వెంటేసుకుని కవిత్వం ఓనమాలు దిద్దిస్తూ ఏడు తోవల వెంట (సెవెన్ రోడ్స్) తిరిగే నిత్య సాహిత్య పథికులు మీరు" అన్నారు డా॥ఎన్.గోపి.

నాయన చదువుకోవాలనే తపనతో స్వగ్రామాన్ని వదలి గుత్తి చేరుకుని అక్కడే ఒక ఉపాధ్యాయుని శిక్షణలో చదువుకొని మద్రాస్ మెట్రిక్యులేషన్ పూర్తి చేసాడు. అక్కడ నాయనకు పరిచయమైన చక్రాల నరసింహ శాస్త్రి అనే ఒక ప్రముఖ కవి సాంగత్యం వల్ల రచనా వ్యాసంగం వైపుకు నాయన దృష్టి మరింత మళ్ళింది. అప్పట్లో మానాయన ప్రారంభించిన "గుత్తి చరిత్ర" అనే గద్య రచన అసంపూర్ణంగా ఉండి పోయింది. తరువాత రోజుల్లో దానిని పూర్తి చేయాలన్న ఆసక్తిని కూడా ఆయన ఎప్పుడూ కనబరచలేదు.

మహాకవి పుట్టపర్తి నారాయణాచార్యుల వారితో మానాయన సాన్నిహిత్యం చాలామందికి విడ్డూరంగా ఉండేది. మార్క్సిస్టు భావజాలంతో తలపండిన వై.సీ.వి. జనప్రియ రామాయణం, శ్రీనివాస ప్రబంధం వంటి కావ్యాలను రచించిన పుట్టపర్తికి అత్యంత సన్నిహితుడుగా ఉండటమే ఇందుకు కారణం. కమ్యూనిస్ట్ అంటే దైవాన్ని ధూషించేవాడూ, హేతువాది కానక్కరలేదనీ; అన్యుల మనస్సును నొప్పించనంతవరకు, మూఢ నమ్మకం కానంతవరకు ఇతరుల భావాలను, నమ్మకాలనూ గౌరవించాలని మా నాయన అనుకునేవాడేమో. పండుగలకు, పబ్బాలకు మా అమ్మ మానాయనతో టెంకాయ కొట్టించేది. సరదాగా ఇంట్లో ని అందరికీ జాతకాలు కూడా రాయించాడు మానాయన.

మానాయన రాసిన ప్రతి పుస్తకానికి ముందుమాట రాయడానికి పుట్టపర్తివారు ఇష్టపడేవారు. పుట్టపర్తి వారు రాయడానికి ప్రారంభించిన చాలా కావ్యాలకు మొదటి శ్రోత మానాయనే. పుట్టపర్తి వారి 'మేఘదూతం' ఆయన ఆధునికుడనడానికి ఓ నిదర్శనం. మేనక ఖండ కావ్యానికి వ్రాసిన అభిప్రాయంలో పుట్టపర్తి వారు "ఈ గ్రంథమున కెవ్వరి పీఠిక యునక్కరలేదు. నా "తొలిపలుకు' ఆవశ్యకముగా నుండవలెనని తోచినది. ఎందుకనగా అది నాకు గౌరవం", అనడంలో మానాయన రాసిన కవిత్వం పై ఆయనకున్న మక్కువ తెలుస్తుంది. అందుకే ఆయన ఒక సందర్భంలో "మాధ్వీక రసానుమేయమతి ఓ వై.సి.వి. రెడ్డి! భవజ్జని నామేలునకయ్యె, నిన్ను మరువన్ జాలన్ దివా రాత్రముల్" అన్నాడు.

పండిత నారునాగనార్య అనే కవి తరచు మాయింటికి వచ్చేవారు. అచ్చతెనుగులో ఆయన అనేక కావ్యాలను అద్భుతంగా రచించారని ఆయననెప్పుడూ మానాయనను ప్రశంసిస్తూ ఉండేవాడు. "హృదయ పద్మాకరంబున బొదలు భావ కమలముల నేటి మీ పద కమలములకు బూజ గావింతు సద్భక్తి" అంటూ మానాయన 'తొలకరి చినుకులు' అనే తన తొలి కృతిని నారునాగనార్య వారికి అంకితమిచ్చాడు. నిండుగా చుట్టుకున్న శాలువా, గుర్తుండిపోయే కళ్ళజోడుతో నారునాగ నార్య వారి రూపం నా కళ్ళముందు ఇప్పటికీ సాక్షాత్కరిస్తూనే ఉంటుంది.

రాచమల్లు భైరవకొండారెడ్డి అనే కవి నాకు బాగా గుర్తు, ఆయన వ్రాసిన 'స్వప్న శీతాచలం' అనే పుస్తకంలోని పద్యాలు ఆయన చదివి వినిపిస్తూ ఉంటే ఆ ప్రౌఢ సాహిత్యానికి నేను విస్తుపోయేవాడిని. 'స్వప్న శీతాచలం' లోని ఒక భాగాన్ని ఆయన మానాయనకు అంకితమిచ్చారు. బహుశా మానాయనకు అంకిత మివ్వబడినదిదొక్కటేనేమో.

"అనిందిత శబ్ద రసౌచితీ కళోపేతుడు ఎమ్మనూరు చిన వెంకట రెడ్డికి మాదు స్నేహము దాత్రి మనో హరత్వ మెగ దట్టగ నంకిత మిచ్చితీ కృతిన్" అన్నారు రాచమల్లు భైరవ కొండారెడ్డిగారు.

1964లో కడప జిల్లాలోని సంగమేశ్వర దేవళాలు అనే ప్రాంతంలో నర్రెడ్డి శంభురెడ్డి గారి ఆధ్వర్యంలో జరిగిన సభలో తనకు సువర్ణ కంకణాన్ని తొడిగి సన్మానించడాన్ని గురించి మానాయన చాలా గర్వంగా నాకు చెప్పడం గుర్తుంది. ఆ స్వర్ణ కంకణాన్ని ఒక బంగారు షాపులో అమ్మవలసి వచ్చిన రోజున మానాయన తోపాటు నేను కూడా ఉన్నాను.

'వైజయంతి', 'పారిజాతం', 'గట్టి గింజలు' లోని కథలు, 'సిందూర రేఖ' లను రాసే సమయంలో నేను దగ్గరుండి మానాయన రాసే తీరును గమనించాను. తెల్లవారు జామున ఏ నాలుగుకో ఐదుకో లేచి కూర్చొని ఆపకుండా రాసుకుంటూ పోయేవాడు. గట్టిగా ఒక రెండు గంటలు కూడా కూర్చొనేవాడు కాదేమో. ఒకసారి రాసిన తరువాత నాయనకు వాటిని సరిచేయవలసిన అవసరం గానీ, మెరుగులు దిద్దవలసిన ఆవశ్యకత గానీ కలిగినట్లు నేను చూడలేదు. ఆయన రాసిన 21 కథలూ, తెల్లవారుజామున లేచి కూర్చొని ఏకధాటిగా ఒక్కొక్కటి ఒక్కొక్క రోజున ముగించినవే. ఆయన జీవితంలో చివరగా చేపట్టిన ప్రక్రియ కథా రచన. అత్యంత తక్కువ సమయంలో 21 కథలను వ్రాసాడు. వాటిని రాసిన వెంటనే 'అభ్యుదయ' లేదా 'ఎర్రబాట' అనే పత్రికలకు ప్రచురణార్థం పంపించేవాడు. చాలా కథలు ప్రచురితమయ్యాయి. ఆ తరువాత అన్ని కథలను 'గట్టి గింజలు' అనే పేర ఒక సంకలనంగా ఆయనే ప్రచురించాడు. చాలా కథలు రాసిన వెంటనే నాకు చదివి వినిపించేవాడు. ఆ విధంగా అందులోని చాలా కథలకు మొదటి శ్రోతను నేనే.

'సంవేదన' లాంటి ప్రసిద్ధ సాహితీ పత్రికకు ప్రచురణ కర్తగా ఉండి, కథా శిల్పం గురించి, కథా కథనం గురించి గొప్ప అవగాహన కలిగి ఉండి కూడా మానాయన వాటి గురించి ఎందుకో ప్రాకులాడ లేదు. ముసురుకున్న ఆలోచనలను యథాతథంగా కాగితం మీద పెట్టడమే తప్ప మళ్ళీ వాటిని తిరిగి వ్రాయడం ఆయన ఎప్పుడూ చేయలేదు. అందుకే ప్రముఖ రచయిత దాశరథి రంగాచార్య గారు వారి 'ముందు'బాట'లో ఈ కథలు సొమ్ములు లేని సహజ సౌందర్యం గల సరోజ లాంటివి" అన్నాడు.

వ్యక్తిగతంగా మానాయన గురించి ఆలోచిస్తే; మానాయన మాయమ్మతో ఏరోజూ ఏ విషయంగానూ కొద్దిపాటి ఘర్షణకైనా దిగడంగానీ, ఆమెపై లేదా పిల్లలపై విసుక్కోవడం గానీ, ఆర్థిక స్థితిగతులకు బెదిరి పోవడంగానీ, భవిష్యత్తు గురించి ఆందోళన చెందడంగానీ నేను చూడలేదు.

భోజనం దగ్గర కూర్చున్నప్పుడు ఏదైనా వంటకం బాగాలేదని మేమెవరమైనా అడిగితే, దానికీ ఒక రుచి ఉంటుంది కదా; కాబట్టీ "అదీ ఒక రుచే అని తినాలి" అనేవాడు. ఆయన మంచి భోజన ప్రియుడు.

ఒక సందర్భంలో 'మనం తిన్నదే మనకు మిగిలేది' అన్నాడు మానాయన నిజంగా అంతే కదా అనిపిస్తుంది, మన వెంట ఏదీ రాదని తెలిసినప్పుడు.

తెలుగు భాషపై అసాధారణమైన పట్టు సాధించి, ప్రాచీన, ప్రబంధ, ఆధునిక సాహిత్యాలను కూలంకషంగా చదువుకొని, అద్భుతమైన ధారణా శక్తినీ, విశేషంగా స్పందించ గల కవి హృదయాన్నీ కలిగి ఉండి కూడా మానాయన సాహితీ క్షేత్రంలో ఒకస్థాయి కోసం ప్రయత్నించినట్లు కనపడదు. అప్పట్లో డా.సి.నారాయణరెడ్డి గారు ఆయన నడిపే ఒక పత్రికలో తన కవితలు ప్రచురించేవాడనీ, ఒక సందర్భంలో మానాయన హైదరాబాద్ వెళ్ళినపుడు సి.నా.రే స్వయంగా రైల్వేస్టేషన్‌కు వచ్చి తనని తీసుకెళ్ళాడని చెప్పిన మానాయన, అలాంటి వారి కోవలో ఉండాలని ఆశించలేదు.

వ్యవసాయం పై మంచి అవగాహన కలిగి ఉండి, మాచుపల్లె ఎల్లమ్మ తిరునాళ్లలో సోగబండల నీడ్చ గలిగే కోడె ఎద్దులను పెట్టి అద్భుతంగా వ్యవసాయాన్ని కొన్ని సంవత్సరాల పాటు సాగించిన మానాయన చివరకు దాన్ని సేద్య గాళ్ళ పాలు చేసాడు. తన కుటుంబానికి తినడానికి కావలసినవి కూడ సమకూర్చు కోవడానికి ఇబ్బందిగా ఉన్నా, 'వాళ్ళూ తినాలి గదరా' అనేవాడు మానాయన. తరువాత రోజుల్లో ఆ భూములు లన్నింటిని అవసరాలకు అమ్ముకోవలసి వచ్చింది.

వ్యాపారంలో లోతుపాతులు తెలుసుకొని ఒక వెలుగు వెలిగి, స్నేహితుని కుమారుని కోసం నష్టాలలో కూరుకుపోయి, ఉన్నతంగా భాసించినవాడు అధో గతికి చేరుకుని కూడా మానాయన నిర్వికారంగా, నిర్భయంగా జీవితాన్ని కొనసాగించాడు.

నిరంతరం నా జ్ఞాపకాలలో నిలిచి ఉండే ఒక 'కర్మ యోగి' మానాయన.

❖ ❖ ❖

**హలము కలమును బట్టిన పొలము కాపు**
**కమ్మదనమందునా నీదు కైతలోని**
**కమ్మదన మింతయొప్పునే క్రమవాణి**
**నలువరాణికి నీమీద ననలు సాగు**
**పుత్ర వాత్సల్య లతకిది పూవు సుమ్ము**
**దొడ్డకవి వౌదు వై.సి.వి. రెడ్డి సుకవి**

**– యు. వేంకట నరసయ్య**



వై.సి.వి. రెడ్డి రెండవ కుమారుడు ప్రభాకర రెడ్డి కుటుంబసభ్యులు దినకర్ రెడ్డి, సుప్రజ, స్వాతి, విభాకర్ రెడ్డి
సాత్విక, ప్రభాకర్ రెడ్డి, ధృవిక, ఉమామహేశ్వరి, విహసిత, చోహార



వై.సి.వి. రెడ్డి చిన్న కుమారుడు పురుషోత్తమ రెడ్డి కుటుంబసభ్యులు
శ్రద్ధ, శ్రేష్ఠ, ప్రదీప్ రెడ్డి, మనోజ్ఞ, పురుషోత్తమ రెడ్డి, పద్మావతి



అభిజ్ఞ, శివజ్యోతిరెడ్డి, ధార్మిక్ రెడ్డి, గగన్ దార్శిక్ రెడ్డి



**డా॥ కైపా కుమారస్వామి**
సెల్ : 9440973602

## తొలకరి చినుకులపై ఒక విశ్లేషణ

**కలము పట్టి నేను కావ్యము రాయలేదు**
**కోర్కెలున్నవెన్నో గొడవ లేదు!**
**వైసివీ రచనలు వైశాల్య భావాలు**
**కదలి వేసె నన్ను కలము పట్ట**

వై.సి.వి. రెడ్డి గారి సమగ్ర సాహిత్యములో 'తొలకరి చినుకులు' అనే అంశము మీద మీకు తోచినంత హృదయ గ్రంథులు తాకినంత మనసు విప్పారినంత ఒక వ్యాసం వ్రాయమని మిత్రుడు పాలెం వేణుగోపాలు నాకు తెలియ చేయడం ఆశ్చర్యమేమి అనిపించలేదు. రెడ్డి గారి సాహిత్యంతో అనుబంధంగా ఏర్పరుచుకునే అవకాశం నాకు కల్గినందుకు సంతోషంగా వుంది.

వై.సి.వి. రెడ్డి గారు సాహితీ వ్యవసాయ క్షేత్రంలో 'తొలకరి చినుకులు' కురిసినంతనే గేయాలు, గేయకావ్యాలు, పద్యాలు, పద్యకావ్యాలు పండించినారు. చివరకు 'గట్టి గింజలు' నూర్చినాడు. ఈ తొలకరి చినుకు కురిసినది 1940 దశాబ్దిలో అనుకుంటాను. కావున ఆ కాలపు సామాజిక ఆర్థిక పరిస్థితుల అవగాహన కలిగి వుండవలెను. కడపజిల్లాలో కవుల గడపలు మెండు అనునట్లుగా ఎక్కువ మంది కవులునున్నారు. అందులో అన్ని రకాల సాహితీ తరంగాలు వెలువరించిన రెడ్డిగారి కలం ధన్యం. రెడ్డిగారి సాహిత్యం సమగ్రంగా కాకపోయినా కథలు గేయాలు అన్ని రకాలు చదివినాను.

వై.సి.వి. రెడ్డి గారి 'తొలకరి చినుకులు' ఖండికలో 1) ఆవేదనము 2) సంశయడోల 3) అప్పగింత 4) పనికత్తె 5) బడిపంతులు 6) గతము 7) కడుపు మంట 8) కృతఘ్నుఁడు 9) సందేశము – మొదలైనవి గలవు. ఏ ఖండిక దానిదే. దేనితోను సంబంధము లేవు. ప్రతి ఖండిక పాఠకునికి ఉత్సాహము కలిగించునవి, మరికొన్ని గిలిగింతలు కల్గించునవి మరికొన్ని ఆధునిక భావాలు ప్రాచీన భావాల పోహలింపుతో కూడినవిగానున్నవి.

కృతిపతి ఆశీర్వాదములో వారు నాగనార్య గారు కవి గారి కార్యమును గూర్చి ఏమి ఆలోచించినాడో కాని శ్రీ కుమారుడు – అని అన్నాడు శ్రీ కుమారుడు, కుమారుడు, మారుడు అన్ని మన్మథార్థములే అన్నీ లక్షణములు పుచ్చుకున్నాడేమో అని వ్యక్తపరచినారు. తొలకరి చినుకులు యీ కావ్యము 'నాగనార్య గారికి అంకిత మిచ్చినారు.

## ఆవేదన

ఒక బిచ్చగాడు తిండి కొరకు పడు పాట్లు వాని మనోవేదన ఈ ఖండిక సారాంశం. ఈ ఆవేదనా ఖండికలో 'ఎకాఎకి' పదప్రయోగము తొట్రుపాటు లేక తొందరను సూచించు సందర్భోచితంగా పదప్రయోగము చేసినాడు.

భిక్షుకాగ్రి – పదప్రయోగ మెటులున్న కొంత ప్రాచీన సాహిత్య అభిరుచి అభిలాష లేనిదే యిటువంటి పద ప్రయోగము చేయుట ఏ కవికి చేతగాదు అనుటలో, యీ కవి ప్రాచీన సాహిత్య పోకడలు పుణికి పుచ్చుకున్న గడుసరి అని అనుటలో నిస్సందేహం.

అదే ఖండికలో – పుడిసిలించి – ఏడుగడ పిడికిలి బిగించి ముందుకు – నడున – మ్య – అనునట యీ పదములు చక్కగా కూచున్నవి.

**పాకము జేసి నా కవిత పాడెద గుండె**
**ద్రవించి పారగ అని**
**వగచినాడు.**

స్వరాజ్య సాధనం కూడా నీ జీవికను మార్చజాలదని ఆవేదనం.

## సంశయడోల - అనే ఖండికలో

ఒక భగ్నజీవి తన ఇడుములకు కారణమెవరను సంశయము దీర్చుకొను ప్రయాస ఈ ఖండిక. తన సంశయ నివృత్తికి దేవుని అడుగుచున్నాడు.

భగ్నజీవిది తప్పయిన దైవము సాక్షిగాక తప్పు దైవముదె, సంఘమే సాక్షియనగా తప్పు సంఘమునది అని – తెల్పుచూ పాత్ర మనస్సుసాక్షిలో సందేహ మసక అమలుకొన్నదని వర్ణించినారు.

నిరంతర ప్రవాహికముగా సాగుచున్న క్రియకు మనసు మసకబారి అలసిపోయినది తెల్పినాడు.

సందేహము సముద్రము లాంటిదని, భగ్నజీవి అనగా వోడిపోయిన ప్రాణి. సత్యము చూడలేక అడిగినాను. అంతేగాని నిరంతరము సందేహము కూడుకున్న సంద్రమందు యీదులాడు గలనా? నాచేత గాదు స్వామీ అని తెల్పుచున్నాడు. జీవఫలం కుళ్లి మన్న యిన వేళ దోషమెవరిదను సంశయం ఈ ఖండిక సారాంశం.

## అప్పగింత

అప్పగింత – అను ఖండిక పేరు – దానికి తన మనస్సును మరొకరి దగ్గర వుంచుట, దాచుటను అప్పగింత అందురు. అంతేగాదు మనకు కావలసినపుడు తిరిగి తెచ్చుకొనునపుడు పూర్వ స్థితిగానే వుండవలెనని భావన.

మన్మథుడు – నీ సౌందర్య శోభా ముఖసరోజమును అనుభవించలేక ఎందుకు అడవి పాలు చేసెను. అదరిపోవుచున్న సౌందర్య బాలయని యనుటలో జూదరైన నలుడు రాజ్యమును పోగొట్టుకొని దమయంతితో అడవికెళ్ళి అచట ఆ సౌందర్యరాశిని కర్కోటకుని పాలు చేసె, ఆ కథను స్పర్శించి స్ఫురింపచేసిన కవి ప్రాచీన సాహిత్య సంకర్షణుడుగాక మరేమున్నది. నవ్వు పువ్వులు నాపైన – ఱువ్వి – అనుటలో బండి 'ఱ' ప్రయోగించుట 'ఱ' ఎంత కసివున్నదో అంత వేగంగా పడునట్లు చేసిన కవి హృదయం పున్నమ నింగితేడు.

ప్రణతు భిక్షకు – భిక్షమిడు మింక నాపయి – కక్ష యేల అనుటలో భావకవితా మధ్యమంలో రాయప్రోలు వారిని, దేవులపల్లిని గుర్తు చేసినారు.

సమాజ పరిస్థితులు నాడు కట్టుబాటులో వున్నరోజులు ప్రేమకు కులమేది అను యీ రోజుల్లో

**"దోసిలొగ్గవె; మన సారఁబోసి పోదుం**
**నిరసనకుఁ జోటు చూపకు, నీరజాక్ష"**

అనుటలో నేను ప్రేమ పిపాసినే అనుటయే గాక యీ ప్రేమైక జీవి వలపు మల్లె మొగ్గలు దెచ్చినాను నిరసనకు తావియ్య దోసిలి పట్టిన పోసి పోదునన్నాడు. అటు పాత్ర ఉన్నత జాతి కన్యయని తెల్పుచున్నాడు. ప్రార్థించుచున్నాడు నీరజాక్షిని.

మరొక పద్యంలో నీ వాదులేల ముద్దు చెల్లింపు మొకసారి – ముద్దరాలి – అని అనుటలో ఆ ప్రేమికుడు తన ప్రేయసిని – యిక వాదన వద్దు యీ ప్రేమికునికి ముద్దు యివ్వు – ముద్దరాల – అనుటలో ముగ్ధమోహన రూపమని అన్యాపదేశంగా ఆపాత్ర ఉన్నత స్థితిని చెప్పకనే చెప్పుచున్నాడు.

మిసిమి – పండు అనగా బాగా మాగి నవనవ లాడుచున్న పండును మిసిమి పండు అనుచు అనుభవించుట కాలస్యమెందుకని పండు స్థితిని తెల్పుచున్నాడు.

యీ ఖండికలో సంఘము మారుచున్నదని కుల మతాంతరములు లేని నూత్న సమాజమును గూర్చి వర్ణించుచు 'నూత్న పాండుర ప్రభ విలసిల్లె' అను మాటలో కవి కలము నూతన తరము కులాంతర వివాహములు కల్గునని, భవిష్యత్తు జీవితము దాపరికము లేక జరుగబోవు నిదియని, 'రాగిణి' పొందుఁగోరి వచ్చితినని అంటున్నాడు.

ఇదే ఖండికలో చివరగా నీకు శుభము కల్గవలెనని – జోస్యము పల్కెను. స్వరాజ్య రథచోదకుడైన భరతమాత ముద్దుబిడ్డ రాబోవు చున్నాడని – త్వరలో స్వరాజ్యము రాగలదని కవి పల్కెను.

## పనికత్తె - ఖండిక

శ్రీ వై.సి.వి. రెడ్డి గారి రచనలు గాని వారి ఖండకృతులు గాని పరిశీలించినచో ఒక ప్రాచీన కవి, ఒక ఆధునిక భావాల మూర్తి, ఒక సందేశాత్మక మార్గదర్శి, ఒక ప్రాడ్వాక వర్ణనా చమత్కృతి, నైపుణ్య ద్రష్టగా కనిపించును.

వారి ఖండకృతులలో 'పనికత్తె' అను ఖండిక చదివినచో ఆపేరులో ఒక చులకనభావము, ఒక వైపు ఆ పనిలో నిమ్నగమైన వ్యక్తి కనిపించిన తీరు, కవి దృష్టికి కనిపించిన చిత్రము ఆశ్చర్యపరచును. దీనిలో మొత్తము 8 పద్యాలు కలవు వానిలో వృత్తములు '7'ను కందము ఒకటి గలదు.

మొదటి ఉత్పలమాలికలో ఆ పనికత్తెను వర్ణించిన తీరు అమోఘము. ఏమాత్రము చిత్త సంస్కృతి లేకుండా యీ ప్రకృతి, పూర్ణసుధాంబు భావవీచి యందెత్తిన ముద్దు బిడ్డవై – అనుటలో సహజ సౌందర్యము అందరి మన్ననలు చూరుగొను చంటిబిడ్డ ముద్దులు మూటల గట్టునది వర్ణించిన తీరు. భావాతీతమై వర్ణనకు వూహకు అందనంతగా చిత్రలేఖకుని కుంచెకు పని పెట్టునట్లుగా వర్ణించబడినది. నీవు ఏమని వూరట నొంది నావో అని ఓదార్పు చూపుచు ఆ సమయమున పని పాట(ల)తో ఎట్లు కాలము, గడపినావో అని మిక్కిలి కారుణ్య భావములతో పూర్తిచేయబడినది.

రెండవ పద్యము ఔర! చిన్ననాటి నుండి నీ మహత్తర భావరాగములతో ప్రేమానుభావములతో ఉదారత దీన భావములు కలబోసిన నేర్పరి ఔర అను పల్కులలో 'పనికత్తె' వన్న నీవే సుమా! నీకు సాటి యితరులు రారను భావములో వర్ణించి పల్కినారు.

మూడవ పద్యమున ముద్దులు మూట గట్టు పదములలో తిరుగాడు వేళలందు నుండి అందరి మన్ననలను పొందిన సూక్ష్మ సుకుమార పనికత్తియ అని పొగడినారు. లక్ష్య సిద్ధికలదు. నీకు అనేక శుభములు పొందగలవని దీవించినారు.

ఎలా ప్రాయమున యౌవన వయస్సులో పల్లెలో తిరుగాడు యువతి వస్త్రధారణ విన్యాసము ఒక నడయాడు సుందర సుకుమారిని మన ఎదుట కవి నిల్పినాడు. అంతేగాదు పైచెంగు కూడా సవరించని నిత్యకృషీ కల్పవల్లియై లోక కళ్యాణము కాంక్షించిన కార్యార్థిగా వర్ణించినాడు.

మరొక కంద పద్యమున 'పురిటిల్లు' విడచిన దాదిగా రైతు, పనులలో నిమగ్నమై అందరికి అన్ని గతులు, సేవచేయు పనికత్తెను మనముందుంచినాడుకవి.

ఓ పనికత్తె! పనిచేయుటగాదు, అందలి నేర్పు సాధించి ముందు వెనుకటల ఆలోచించి జేయు నేర్పరివని, సాటివారిలో అది గమనించుచు వారిని ముందుకు నడిపించు సౌశీల్యభావము కల్గిన దానివని వర్ణించినారు. అంతేగాదు నీకు నీ శ్రమకు ఉజ్జ్వల భవిత కలదు కార్మిక శక్తికి గుర్తింపు రాగలదని ఆశించినాడు. అందుకు నీ జీవిత సంఘటనా చిహ్నములే సాక్ష్యమని 'తోడి రాగం' పల్కినారు.

చివరగా కవిగారు జీవితావసరము అన్యాక్రాంతమై (యితరుల పాలై) పోయెనని శోకించినారు. ఇష్టముగా కష్టములు నెదుర్కొనగా విజయముకై ముందుకు పోవునని స్వేచ్ఛాయుతము యత్నములు లేకుండా ముందుకు సాగుని ఆనందము కల్గునని. నీకు తోడు వచ్చు వాడొక్కడైనా లేడని చింతించినారు.

**బడిపంతులు**

యీ ఖండికలో కవిగారు 'ఒక ఉత్తమ గుణములు కల్గిన ఉపాధ్యాయుడు తన బోధనలచే సమాజమును ఉత్తమ మార్గములో ఎలా నడిపించగలడో కలము పూని పట్టినొక్కి వక్కాణించెను. అంతే గాదు చదువురాని వాని బోధనలు వ్యర్థమనెను.

**గుకారోఽ ంధకారస్య**
**రు కారో మన్నిరోధకం**
**అంధకార నిరోధకస్య**
**గురు రిత్యభిదీయతే –**

అను దానికి లోకమున గురువును మించిన వ్యక్తి మరొకడుండడని 'అజ్ఞాన చీకటులు బాపి జ్ఞాన కాంతులిచ్చువాడు గురువ'ని తెల్పిన శ్లోకము ఆదరణీయమే కదా!

సమాజోద్ధరణకు విజ్ఞానవేత్తలు ఎలా అవసరమో, దీనిలో తెల్పుచున్నాడు. పూర్వకాలమున బడులు కొట్టము (బోదతో కప్పిన గదులు)లలో నడుచు చుండెడివి. అందున నేల కఱకురాళ్ళు పరిచి వుండెడి స్థితిని సమాజ ఆర్థిక ధోరణి తెల్పుచున్నాడు. బ్రతకలేక బడిపంతులను నానుడి ఆకాలముదే.

'కఱకు ఱాయైన తనదు – దుర్గతికి గరగు' అనుటలో ఉపాధ్యాయ జీవితము, జీవితమును నడుపు యింధనమైన జీతము ఎంత కష్టమో స్వల్పమో తెల్పినాడు.

సమాజనౌకకు ఒక చుక్కాని వంటి వాడవని గుర్తించని నిన్ను – బ్రతుకలేని బడిపంతులని ఎగతాళి చేయునన్నారు.

ఉపాధ్యాయ జీవితాన్ని చూచి ఆ యీశ్వరుడైనా, కీర్తి పొందెడు ఉపాధ్యాయ జీవితము కావలెనని కోరునని, తెల్పుటలో ఆ వృత్తిపట్ల ఎంత గొప్ప భావన కల్గినవాడుగా కవి కన్పించును.

**గతము**

యీ ఖండికలో ప్రతి పద్యము రసవద్గుళిక గాక మరేమగును. మంచి సాహిత్య పిపాసకునికి అమృతము నిండిన చషక పాత్ర. దీనిలో ప్రతి పద్యము ఉదహరించవలె – అట్లుగాక గతము మరువలేక ప్రతి అంశము తనకు నచ్చిన, లోకము మెచ్చిన భావాలుగా తీసుకొని పద్యచన చేసిన యీ కవి కృత్యము ధన్యము.

**మరుని క్రొవ్వేడిచూపులో – మందపవన**
**వీచిలో, చంద్రకాంతిలో – వేణుగాన**
**లహరిలో, నాట్యకళలో, వి – లాస లాల**
**సునిముఖాబ్జములో నీదు – సొబగుఁగంటి** **– 1**

**నవవిలాసాప్తి నెసఁగు కన్యాలలామ**
**బాహు వల్లరులం జిక్కి - ప్రణయ సౌఖ్య**
**మవనిఁ జిలికించి జగతికి - శివము గూర్చి**
**కనిన పరితృప్తికిం గీడు - గలుగఁ గంటి** **- 2**

**ప్రణయ కలహమ్ములో, సతీ-పతులముద్దు**
**ముచ్చటలలో, నిసుంగ వా - పోతలో, న**
**నాథ దీనారవమ్ములో - జ్ఞాని యోగ**
**దృష్టిలో 'బర్వులెత్తి చ - రించు చుంటి** **- 3**

పై పద్యములకు వ్యాఖ్యాన భీతిచే వ్రాయలేక ఉదాహరణగా వుటంకించుటయే శ్రేష్ఠము. కావున కవి గార్కి ఖండికలు వేరు చేసి చూచిన ప్రత్యేక పుస్తకమే మేలు బంతి అవుతుంది.

గతించిన కాలము మేలు వచ్చు కాలము కంటే, కవి గతంలోని మానసిక స్థితి చెప్పినాడు వర్తమానము మన ఊహకు వదలినాడు.

## కడుపు మంట

ఈ ఖండికలో 12 గీత పద్యములున్నవి. కవిగారు "నాకు లోకము తెలిసిన నాటి నుండి తల్లిదండ్రులను వదలి పశుల కాపరిగా, నొంటిగా జీవనము సాగించుచుంటి పల్లెలోని పెంటకుప్ప (వలె)లతో పాటు పెరుగుచుంటి అనినాడు.

తన దుర్భర జీవితానికి తానే దర్పణము పట్టి దృశ్యము చూపించినట్లున్నది.

రెండవ పాటుగా పద్యములో కుండ గోకుడు 'కూటిని' అని వ్రాశాడు. అందరూ తినగ కుండలో మిగిలిన సంగటిని గోకి పెట్టిన కూడని అర్థం.

మరొక పద్యమున పల్లె పొలాలలో మంచెపై నిల్చి పిట్టల త్రోలుటకు నుపయోగించు 'వొడిసె'లను ప్రయోగించుటలో పడు శ్రమ, దానిని మరిచిపోవుట న్యాయమా? అని ప్రశ్నించిన తీరు కలికితురాయిగా నిల్చింది.

ఆ కాలములో వ్యవసాయము చేయునపుడు పడెడి కష్టము, కన్నులకు కట్టి చూపించినట్లు వర్ణించుటలో కవి నేర్పరితనము తెలియును.

కాడి కట్టుటకు రాని వయసులో సద్ది తిని పొద్దు ఎరుగక చేసిన కష్టము - యీనాటికి నిలిచినది చెప్పుట అసత్యము గాదు.

తరువాత పద్యములో ఊరి 'గవని' అను పదము గ్రామంలో ప్రవేశించినపుడు పల్కు పదము, రచ్చబండ జేరుకున్న తన సాటి రైతన్నలు 'నన్ను' మొనగాఁడు మొనగాఁడ - టన్నమాట చాలు వేయేల?

యామాట – చాలదయ్య – అని చెప్పుటలో ఔత్సాహికము చేయు వూపు నందిచ్చు పదము. యింక వేయి మాటలేల – చాలదా? అని ప్రశ్నించెను.

అన్న పెండ్లికి తీసుకున్న వంద రూపాయలు అప్పు అసలు తీరక 'వడ్డి చెల్లించె ఎంతో చెల్లించినా' చివరకు ఆ 100 రూపాయలు కొంప ముంచినదని అది ఒక గొప్ప తనమా? అని చెప్పుట సామాజిక ఆర్థిక పరిస్థితిని స్పష్టముగా చూపించినట్లైనది.

ఎప్పుడో తీసుకున్న అప్పు పెండ్లి వయసు వచ్చునప్పటికి తీరలేదు. దానికి పడ్డ కష్టము నను వీడి పోలేదు. జాలి గుండె లేదా స్వామి అని ప్రశ్నించాడు.

ఆనాట పేదరికమునకు వారి నివాస 'కొట్టమే' సాక్ష్యమని. ఆ నీచ జీవితమునకు అదే సాక్షిమని వాపోయె.

ఇంకొక పద్యమున తన కష్టము తనను వదలి పోలేదని అదెట్లనగా "గజ్జికుక్క బలెం" అనుటలో వైద్యము లేని రోజుల్లో కుక్కకు తగిలిన గజ్జి ఎవరికి సోకిన అది సామాన్యముగా వదలి పోదని అదే మన జీవిత దర్పణమని సరిపెట్టుకొనుచున్నాడు.

'అక్కళించిన డొక్కలు – వెక్కిరింత' అను చివరి పద్యమున ప్రయోగించిన 'అక్కళించు' పదము ఆకలి అలమటించిన నిండని కడుపు లోపలికి పోయినదని – దానిని 'అక్కళించు' అనుదానిలో చెప్పుట సహజ వర్ణన సహజముగా నున్నది.

## కృతఘ్నుడు

కృతఘ్నుడు – అను దానికి చేసిన మేలును మరచిన వాడని అర్థము. కవి అనేక ఘట్టముల నాధారముగా వ్రాసిన ఖండిక యని యనిపించును.

దీనిలో దాదాపు 30 పద్యాలున్నాయి. వానిలో గీతపద్యములు, సీసపద్యములు, ఉత్పలమాల పద్యములున్నవి.

(ఒక యజమాని పనిచేయుంచుకొని చివరగా చేసిన పనికి డబ్బు చెల్లించకుండా పని కూడా యిక లేదని రావద్దని చెప్పుటలో ఆ కృతఘ్ను(డు)నిగా కనిపించును.)

ఈ ఖండికలో నొక చోట కవి 'ఒక కూలి కోడి కూయుట మొదలు గూడెము వీడి అందచందాల భరణి యిల్లాలి వీడి కాడి కోడలె నా కేడు – గడ యటంచు జీవికకు చేయు చుంటినని సేద్యమిట్లు –

మరొకచోట కవిలో దాగిన ఋతువర్ణన ధర్మము తొంగి చూచును.

గాలి కాలము నుండియు – ఉగాది వఱకు పనులు చేయుచు కల్లాల – పొల్లకెదురు. మాఘ, పాల్గుణ, మాసములు రెండు తాకీ తాకని నీరెండగా చలి ఎరిగి పోవుచున్న సమయము మధ్యలో గాలి

కాలము నుండి ఉగాది వరకున్న కాలము పైర్లు కోసి 'కళ్లాలలో గాలి వాటం చూచి చాట ఎత్తర అన్న సమయము సార్థక్యమే. ఆ సమయం రైతు ఆశ తీరగ జూచునునుకొంటిని.

మరొక పద్యాన ఎంత కష్టపడ్డ 'రాగి గింజల కుప్పలున్నను' 'మిరాశిలేదు'. యజమాని తన కోరిక తీర్చలేదని చెప్పెను. చివరకు మీ కోర్కె నెరవేరినదని తెల్పుచు కర్షక జీవితము దృశ్యమానమైనది.

యీ ఖండికలో, చివరగా యీ సమాజమున సొమ్మున్న వారికి, పలుకుబడి కలవారికి... ఏ పాడు పనులు చేసినా దప్పు లేదు. శిక్షయు లేదు యీ శాసనములు సంఘమున జనము గుర్తించు వరకే. మంచి వారి శిరస్సులు త్రుంచుటకు సాధనములుగానున్నవని కవి ఘోషించుచుండెను.

ఒక వ్యవసాయ సంవత్సరంలో ఇంటి జీతగాడు చేయు కష్టం దానికి రెడ్డి ఇచ్చే ప్రతిఫలము వీటిని వివరిస్తూ కష్టానికి తగిన ఫలితం లేదని తన దయనీయమైన స్థితిని తెల్పుచున్నాడు ఇంటి జీతగాడు కవికి.

## సందేశము

సందేశము – యీ ఖండికలో 19 పద్యములున్నవి.

ఓ మానవులారా! నిత్య ప్రగతిశీలతకై నియమిత జీవితము లేక వ్యక్తి వాద జీవితము కూడదని – విసుగులేక ఉత్తముడుగ స్థితిని గుర్తించుమని కవి – దానికై పాటుపడుట గమనించు మనెను.

యిదే ఖండికలో 'లోకంలో ఎవడు భౌతిక వాంఛల కోరి ఉత్తమ పనుల యందు చులకనగా చూచునో అట్టి వానికి దుఃఖము ప్రాప్తించునని పండితులు చెప్పుదురు.

మన హైందవ సంస్కృతి కూడా అదే నేర్పినది. చేయు పని ఎప్పుడైనా త్రికరణ శుద్ధిగా చేయవలయునని అట్లుగాని యెడల ఆ పని నిర్వీర్య మగునని తెలియుచున్నది – (మనసా వాచా కర్మణి) యివి త్రికరణములందురు.

కార్యమును దీక్షతో సాగించిన తప్పక ఉత్తమ ఫలితములు రాగలవని పని చేయుట నిస్వార్థముగ చేయవలసినది అదియు ప్రజా వుపయోగముండునట్లు వుండునని పెద్దల మాటగా సందేశమిచ్చుచున్నారు. ఇదే గీతా కారుడైన భగవంతుడైన శ్రీకృష్ణుడు యిట్లు

**అన్యన్యా శ్చింత యంతో మాం**
**ఏజనాః ఏర్పుపాసయే తేషాం**
**నిత్యాభియుక్తానాం**
**యోగ క్షేమం వహామ్య–హం – పల్కెను.**

సందేశం ఖండికలో మరో పద్యంలో రైతులకు, కూలి నాలికి, దేవుడొక్కడే వెన్నంట వుండగలడని సందేశ మిచ్చు చున్నారు. నీ కర్తవ్యం, నీవు పాటించు, తరువాత దైవం చూచునని ఆధ్యాత్మికతలో పల్కుచున్నాడు.

మరొక చోట పక్షపాతబుద్ధి వున్నవానికి పదవి అనవసరము. తన్ను కాపాడలేని ధనము ఎందుకు విషయ వాంఛలు లేనివానికి యీ విశ్వమెందుకు తినటానికి తిండి లేనపుడు – దేవుడేల యని ప్రశ్నించటము సబబే.

ఎన్ని వున్నా మనిషికి తిండి వుండవలెను. దానికే ప్రతి జీవి పాకులాడుచుండు – దీనికి వుదాహరణలే (రంతి...దేవుని దాతృత్వ చరిత) కావున స్థాయిభావనము బట్టి అన్ని కల్గుచుండును. లోకమున ఏ కొందరికో జీవితం బంగారు శయ్యగా నుండుట సత్యం.

మరొక పద్యమున – అడవి దారిన చిక్కుకున్న వానికి ధైర్యము చెప్పి కాపాడవలెను గాని, అట్టి మనిషికి దేవుడున్నాడని చెప్పినంత మాత్రాన సరియగునా?

బీదసాదలకు ఆ కటిక బాధలు ఏల కల్గించవలెను ఉన్నవానికి అజీర్ణ రోగము ఎందుకు. ఈ విపరీతం దైవము ఎందుకు కల్పించవలెను. ఎవరికి అర్థముగాదు– అనుట నిజమే కాని

**పూర్వజన్మ కృతం పాపం, వ్యాధి రూపేన బాధితే ...**

అనునది వున్నది గదా! లోకమును తత్ఫలితమును బట్టి దైవం నడుపుచుండును.

అందరూ మంచివారు గారు. అందరూ చెడ్డవారు కారు, గుణ గణములు వాని స్థాయిని బట్టి గ్రహించవలెను.

**పురాణ మిత్యేవ నసాధుసర్వం**
**నబాపి కావ్యం నవమిథ్య వద్యం –**

ఇది అన్ని విధముల అన్ని రకముల స్థాయి భావములకు వర్తించును.

కవికి, సమాజము మీద భక్తి విరక్తి కల్గుట సహజమే. ఎందుకనగా అతడు ఒక సంసారికుడే. రాజకీయ తత్త్వాలు నిండిన మనిషి, మనసును వారధిగా ఒక మనీషిగా గుర్తించినపుడు యిట్టి సందేశమిచ్చును.

ఇక యీ సమజంలో పురుష అహంకారపు చేష్టలెక్కువని. అదృష్ట, దురదృష్టములను గూర్చి పల్కిన, యీ వర్గభేదము లెందుకు అనుటలో యిది జాతియతా దృక్పథము ప్రబలు కాలమున వచ్చిన భావాలు యివి అంతేగాని అన్నీ, లక్షణాలు విస్తరించిన యీ సమజమును అనుసరించుటయే మిన్న.

వచ్చెడి కాలమున ఆర్ద్రమతులు సానుకూల మనుషులు. మనసులు కల్గినవారు బీద సాదల యందు మిక్కిలి ఆదరము చూపగలరని యిది అత్యంత స్వల్పకాలములో రాగలదని భవిష్యద్వాణి సందేశమిచ్చిన మనసున్న మనీషి నీ కవివర్యుడు.

వై.సి.వి. రెడ్డి గారు వారి రచనలందు సందర్భముననుసరించి వాడిన లేదా ప్రయోగించిన పదములు మంచి చేవ గల్గినవే అంతే గాదు ప్రాచీన సాహిత్యముపై పట్టును చూపును.

❖ ❖ ❖



**డా॥ గంగనపల్లి వెంకటరమణ**
తెలుగు అధ్యాపకులు, రాజంపేట.
9492562744

# వరించిన మేనక

వైయస్సార్ కడప జిల్లాకు చెందిన మహాకవి స్వర్గీయ యమ్మనూరు చిన్న వెంకటరెడ్డి. జిల్లాలోని పులివెందుల తాలూకా బోనాల గ్రామానికి చెందిన యమ్మనూరు లక్ష్మమ్మ, కొండారెడ్డి అనే పుణ్య దంపతులకు వై.సి.వి.రెడ్డి గారు 1926 మార్చి 26న జన్మించారు. రైతుబిడ్డడైన వై.సి.వి.రెడ్డి చదువులమ్మ కరుణా కటాక్ష వీక్షణాలకు పాత్రుడై సాహితీ కృషి సల్పి, తన రచనలతో తెలుగు సాహితీ చరిత్రలో నిలిచిపోయాడు. ఆయన కలంనుంచి జాలువారిన అనేక రచనల్లో "మేనక" ఖండకావ్యం ఒకటి. వై.సి.వి.రెడ్డి గారి శత జయంతి ఉత్సవాలు జరుపుకుంటున్న నేపథ్యంలో ఆయన జీవితం, సమగ్ర సాహిత్యంపై ప్రత్యేక వ్యాస సంకలనాన్ని తీసుకురావాలని వారి కుటుంబ సభ్యులు భావించిన శుభ సందర్భంలో "మేనక" కావ్యానికై వ్రాసినదే "వరించిన మేనక" అనే ఈ సాహితీ వ్యాసం.

వై.సి.వి.రెడ్డి గారి సమగ్ర సాహిత్యంలో రెండోరచన "మేనక" కావ్యం. ఇదొక చిన్న ఖండకావ్యం. విశ్వామిత్రుడు ఒక సామాన్య మానవుడిగా, మహారాజుగా, మహర్షిగా లోక కళ్యాణమునకు పాటుపడిన మహానుభావుడు. ఆయన జీవితం ఉల్లోలకల్లోలమైన మహాసముద్రం వంటిదని, పట్టుదలవుంటే మానవుడు సాధించలేనిది ఏమీలేదని ఋజువుచేసిన స్రష్ట విశ్వామిత్రుడని కవి వై.సి.వి.రెడ్డి పేర్కొన్నారు. ఆ మహాత్మునిపై గల గౌరవభావమే తన "మేనక" కావ్యావతరణకు కారణమని కవి స్వయంగా ప్రకటించాడు. ప్రఖ్యాతవిమర్శకాగ్రేసరులు స్వర్గీయ కట్టమంచి రామలింగారెడ్డిగారికి అంకితమీయబడిన ఈ కావ్యానికి గడియారం వేంకట శేషశాస్త్రిగారు పరిచయవాక్యాలు రాయగా, మహాకవి పుట్టపర్తి నారాయణాచార్యులు, యు.వెంకటనరసయ్య, ఆర్.బి.కొండారెడ్డిలు అభిప్రాయాలు రాశారు.

మేనక ఒక అప్సరసకాంత. దేవేంద్రుని కొలువులో నాట్యకత్తె. అందాల రాశి. తన నటనా కౌశలంతో అందరినీ మంత్రముగ్ధులను చేసేది. అటువంటి మేనక ఒకనాడు ఇంద్రసభలో వసిష్ఠ విశ్వామిత్రులు సత్యనిరతికై పందెములాడువేళ విశ్వామిత్రుని మహత్త్వమునకు మురిసి ఆయనపై మనసుపడుతుంది. మనసు పడిన మహర్షిని చేరుకొనుటకు దేవేంద్రుని అనుమతికొరకు ఊర్వశి సహాయాన్నర్థిస్తుంది. దేవేంద్రుని ఆజ్ఞ మేరకు సభకు వెళ్ళి తన నటనా కౌశలంతో ఆతని మెప్పిస్తుంది. వరం కోరుకోమనగా విశ్వామిత్రునికి సేవచేయాలనుందని, వెళ్ళిరమ్మనమని దేవేంద్రుని వేడుకొంటుంది. తన ఆలోచనకూడా అదేనని మరవకుండా తిరిగి రమ్మని చెబుతూ ఇంద్రుడు అనుమతిస్తాడు. దేవలోకంనుంచి భూలోకానికి చేరిన మేనక పట్టుదలతో తన ప్రయత్నాన్ని కొనసాగించి, చివరకు సఫలీకృతురాలౌతుంది. ఇదే "మేనక" కావ్యంలోని ఇతివృత్తం.

151 తేటగీతి పద్యాలలో కవి వై.సి.వి.రెడ్డి గారు తన ప్రతిభా పాటవాలను ప్రదర్శిస్తూ "మేనక" కావ్యాన్ని రాశారు. తెలుగు పదజాలంపై మంచి అధికారం ఉన్న వై.సి.వి.రెడ్డి కథనాని కనుగుణంగా కొత్త కొత్త మాటలను అర్థాలంకారాలతోకూడి ప్రయోగించినతీరు బాగుంది. నిఘంటువు సహకారం లేనిదే అన్ని పద ప్రయోగాలు, పద్యాలు అత్యంత సులభంగా బోధపడవు. చిన్న పద్యాలలో చక్కటి సృజనతో, ఎంతో నేర్పుగా కావ్యరచన చేశారు వై.సి.వి.రెడ్డి గారు. ఇది ఒక దృశ్యకావ్యం. చక్కటి సన్నివేశాలతో, తగినన్ని పాత్రలతో, సందర్భోచితమైన మాటలతో, పాత్రలు సజీవంగాఉంటూ పాఠకుల కళ్ళకుకట్టినట్లు, ప్రత్యక్షంగాచూస్తున్నామనే అనుభూతి కలిగేటట్లు ఈ రచన సాగుతుంది. కనుకనే ఇది దృశ్యకావ్యమని నా భావన.

రాజర్షి అయిన విశ్వామిత్రుడు బ్రహ్మర్షి కావాలని భూలోకాన నిశ్చలమైన సమాధి స్థితిలో తపస్సు చేసుకుంటూ ఉండిపోతాడు. అతని కీర్తి స్వర్గలోకాన వాడవాడలా విజృంభించింది. ఆ సమయంలో వనిత లందరూ ఆడిపాడగా నందనోద్యానవనం లోని చెట్లపూవులు విచ్చి తమ హర్షాతిరేకాలను ప్రదర్శించాయి. ఇదొక నూత్న భావన. అప్పుడు బంగారు తీగవంటి అప్సరాంగన మేనకను మన్మథుడు ఆవహిస్తాడు. ముల్లోకాలను గెలువగలిగిన సాత్విక సంపన్నుడైన విశ్వామిత్రుని సాంగత్యం కొరకు మేనక పరితపిస్తుంది. విశ్వామిత్రుడి పైనే ఆలోచనలుండడంతో కృశించి, మానసికబాధ అధికమై మేనక ఇంద్రసభకు వెళ్ళుటను కూడా తేలికగా భావించి, రాత్రులు నిద్రపట్టక కలవరింతలతో, పలవరింతలతో కాలంగడుపుతూంటుందని కవి పేర్కొనడం కథాకథనం పట్ల పాఠకులకు ఉత్సుకతను రేకెత్తిస్తుంది. మేనక మనసు పరిపరివిధాల ఆలోచనలతో పరుగెత్తుతుండగా దానిని అదుపుచేసుకోలేక పోతోంది. పూలపానుపును కూడా అంపసెజ్జగా భావిస్తుంది. దారితెలియని వలపు అనే కడలిలో ఆశ అనే పడవనెక్కి మేనక బేలగా తిరుగుతుంది. సర్వజనులకు అమితానందమునిచ్చు చంద్రుడు మేనకను మన్మథబాధకు గురిచేస్తున్నాడనడంలో నిజంగా వలపు వలలో చిక్కుకున్న ప్రేమికుల వాస్తవిక స్థితి గోచరమవుతుంది.

**తే॥గీ॥ "ఆ కటిక బ్రహ్మ నన్నేల యాడుదాని,**
**గాంగ బుట్టించె నేల యీ కాలకూట**
**మందు నెట్టించె నతడు దయార్ద్రహృదయుఁ,**
**దను టబద్ధమె" యనుచు బెల్లదవదించు.**

అని మేనక బ్రహ్మను నిందిస్తూ హృదయ తాపాతిశయంతో పూలపాన్పుపై పొరలాడుతూ పరమ లావణ్యరాశి ఊర్వశిని పిలుచుకురమ్మంటూ చెలికత్తెనొకతెను పంపింది. ఇది కథకు వాస్తవికతను జోడించినట్లుగా అనిపిస్తుంది. పరుగుపరుగున వెళ్ళి ఊర్వశికెదుట నిలిచిన చెలికత్తె మనసులో భావఘర్షణ ఇనుమడిస్తుండగా ఏమీచెప్పలేక చూస్తుండిపోతుంది. ఈ భావఘర్షణ అనే మాటకూడా కవి వై.సి.వి. రెడ్డి గారి నూతన ప్రయోగమే. అపుడు ఊర్వశి మేనక చెలికత్తెతో...

**తే॥గీ॥ ఏమె! యేమైన దిప్పుడే కామితంబు**
**దెలుప నారాటపడెదు నీదేవి సుఖమె!**
**యసురు లేమైన దండెత్తి యమరపురికి**
**వచ్చిరా? చెప్పలేవేమె యచ్చుపడుగ.**

అని పలుకుటలో కూడా ఆందోళన లేకుండా, ఆలోచనలతో కూడిన ప్రశ్నలను సంధించడం అనేది నేటి బాలల వ్యక్తిత్వ వికాసానికి దోహదపడేదేనని మనం అర్థం చేసుకోవాలి. చెలికత్తె జరిగినదంతా పూసగుచ్చినట్లు చెబుతూ "అమ్మా! ఊర్వశీ! మా దేవి అడవులందు నిష్ట తపమాచరించు మునికులభూషణుడైన విశ్వామిత్రునికోరి అతివిశాలము, అగాధము అయిన ప్రేమవార్ధిలో మునిగిందని దానినుండి బయటపడుటకు అనువైన మార్గము తెలుపుటకు మిమ్ములను పిలుచుకొని రమ్మంటూ తననుపంపింది" అని తెలిపింది. అలా పేర్కొనడంలోగల ఆంతర్యం పాఠకులకు అర్థమవుతుంది. ప్రేమఅనేది సముద్రంవంటిదని, అందులో మునిగిన వారు బయటపడుట అసాధ్యమని, సరైన మార్గనిర్దేశనం చేయగలిగేవారైతే తప్ప అందుండి గడ్డన పడరనే భావన ఉంది. నిజమే. ఆనాటికి, ఈనాటికి, ఏనాటికైనా సరైన మార్గదర్శనం లభించకపోతే బాలల భావిజీవితాలు బంగరుబాటలో పయనించవు. ఈ కావ్యం బాలల వ్యక్తిత్వ వికాసానికి ఉపకరిస్తుందనుటలో ఏమాత్రం సందేహం లేదు. ప్రేమకూపమందు మునిగిన మేనకను రక్షించడానికై ఊర్వశిని రమ్మంటూ చెలికత్తె వేడుకొంటుంది. పదపదమంటూ పరుగెత్తుకుంటూ వచ్చిన ఊర్వశి మేనకను తీపి మాటలతో బుజ్జగించి కుశలమడిగింది. చూశారా! ఏదేని బాధలోగానీ, సందిగ్ధావస్థలోగానీ ఉన్న వారితో ఎలా మాట్లాడాలనే విషయం ఇక్కడ పాఠకులకు అవగతమవుతుంది. ఇంకా ఏమంటుందో చూడండి.

**తే॥గీ॥ మేనకా! యెంత బేలవె! పూని యెట్టి, వాని గోరితివే! చేమ బాటినట్టి**
**మౌని కౌశికు డాతని మతమె మతము, భవుని మూడవ కన్నంతవాడతండు.**

అంటూ మేనక బేలతనాన్ని, విశ్వామిత్రుని అంతరంగాన్ని తెలుపుతుంది ఊర్వశి. అప్పుడు మేనక తన మనసులోనిమాటను ఊర్వశికి చెప్పి, దేవేంద్రుననుమతితో విశ్వామిత్రుని చేరుకొనేలాచేసి పుణ్యంకట్టుకోమని ప్రార్థిస్తుంది. ఆ సందర్భంలో ఊర్వశి మేనకతో విశ్వామిత్రుని దుడుకుతనము బ్రహ్మకూ తెలుసని, అతని పేరు వింటేనే దేవతలైనా వణికిపోతారని అటువంటి వాడిని గురించి ఇంద్రుడు "అసాధ్య మీపని వలదు సాహసము, తలంపకు మగ్గితో సరసము" అని పల్కి తప్పించుకొంటాడేమో. నా శక్తి వంచనలేకుండా కార్యసఫలతకు ప్రయత్నిస్తాననిచెప్పి ఊరడిస్తుంది. అసాధ్యమని తెలిసిన పనినికూడా నావంతు ప్రయత్నిస్తానని చెప్పడం, బాధలోఉన్న వారికి కాసింతైనా ఉపశమనం కలిగించేలా మాట్లాడడం మంచివారిలక్షణంగా భావించాలని పాఠకులకు తెలియచెప్పాల్సినపనిలేదు.

ఈ సమయంలో ఒక బంటువచ్చి దేవేంద్రుని ఆజ్ఞమేరకు మిమ్ములను ఇంద్రసభకు ఆహ్వానిస్తున్నామని, వెంటనేరమ్మని మేనకకు చెప్పివెళతాడు. ఊర్వశికూడ వెళ్ళమంటుంది. అపుడు మనసులోనికోరికను అనుసరించి కొత్త సింగారములతో మన్మథుని ఆరవ బాణంవలె చూచెడివారికి మోహము కలిగించేలా

మేనక  సభకుచేరి ఇంద్రునికి నమస్కరిస్తుంది. మన్మధుని బాణాలు ఐదే. కానీ మేనకను ఆరవబాణంగా కవి భావించడంలో కొత్త ఊహ ఉంది. ఆమెలో సమ్మోహన శక్తి ఉంది. అందుకే ఆమెను చూసి ఇంద్రుడు “మధుర సంగీత నాట్య సంపదలు వెలయ, సుదతి! యొకభావ మభినయించుమి” అనగా మేనక సరేనని సభలోని వారందరికీ ప్రణామాలర్పిస్తుంది.

**తే॥గీ॥ కాల గజ్జెలందియలు ఘల్ ఘల్లుమనుచు,**
**గేల జిఋ తాళములును దక్కిట కిటంచు**
**దమి మృదంగముల్ దిద్ధిమి ధిమియటంచు,**
**గెరలి హృదయముల్ జిక్కిలిగింత గొలిపె.**

అలా మేనక తన నటనాకౌశలంతో, హావభావములచే సభాసదులందరినీ ఆనంద పరవశులను చేస్తుంది. దాంతో దేవేంద్రుడు అమితానందభరితుడై మేనక నటనాచాతుర్యమును మెచ్చుకుంటూ “కోరుకొమ్మేమి వలయునో సారసాక్షి” అని పలుకగా “మేనక మోమోటమున మునింగి, తరము మాలిన సిగ్గు దొంతరలుగట్టు, బలుకకుండె”. ఇక్కడ కవి వై.సి.వి.రెడ్డి చక్కని నేర్పు ప్రదర్శించారు. అదేమనగా ఎదుటివారు తమ మనసులోని మాటను చెప్పీ చెప్పగానే వెంటనే ప్రతిస్పందించడం మనకందరికి మామూలు విషయమే. కానీ కాసింత మొహమాటం, సిగ్గు కలగలిసినవేళ మౌనం భలే పసందుగా ఉంటుంది. ఇచ్చేవారు మరింత సంతోషంగా ఇవ్వడానికి, తీసుకొనేవారు అనురాగమును ప్రదర్శించుటకు అవకాశమెక్కువగా ఉంటుంది. కనుకనే మేనక మనసెరిగిన ఇంద్రుడు ఆమె వెంటనడిచి మరీ కోరికను కోరుకోమంటాడు. అపుడు మేనక దేవేంద్రునితో “స్వామీ! యికేమి నాతలుపుపండె, మీయనుగ్రహమయిన నేచేయుబోవు, పనికి ననుమతి గోరుదు” అన్నది. ఏ సంశయము లేక నీకేది కావలయునో కోరుకో. కాదనక యిస్తాను. ఇక నీవుకోరుటే ఆలస్యమని దేవేంద్రుడు పలుకగా మేనక తన మనసులోని విశ్వామిత్రుని వలపుకథను వివరిస్తుంది. విశ్వామిత్రునికి కొన్నాళ్ళు సేవచేయాలనుందంటూ...

**తే॥గీ॥ దేవతా సార్వభౌమ! మీ సేవకింత,**
**సెలవొసఁగి పంపవలె మౌని సేవజేయు**
**దను మనో జన్మములు గృతార్థములు గాఁగ,**
**మరలివత్తు మీదాసికీ వరము నీవె**

అని మేనక విశ్వామిత్రునికి సేవజేస్తే తనువు, మనసు, జన్మ ధన్యమవుతుందని, మీ దాసినైన నాకు ఈ వరమునిమ్మని దీనంగా వేడుకొంది. ఇక్కడ మనసుకు నచ్చినవారికి, మనసు మెచ్చినవారికి సేవచేయడాన్నే ప్రేమికులు కోరుకుంటారు. కానీ ఇక్కడ విశేషమేమంటే ధన్యతనొందడం. ఇది మానసికపరమైన ఒక భావనగా మనం భావించాల్సివుంటుంది. అప్పుడు దేవేంద్రుడు నాకు కూడా సమ్మతమే. విశ్వామిత్రుని తపోభంగమునకు ఇది మంచిదారి అని, కోరవలసినకోర్కెయే కోరుకున్నావు. నీ ఇష్టమే మా ఇష్టముకూడా. నీకు  విశ్వామిత్రుడే కాదు ముక్కంటి కూడా వశుడవుతాడు. ఇలా చెప్పడంలో మేనక అందచందాలు,

హావభావాలు, చక్కని సంభాషణా నైపుణ్యాలతో ఎటువంటివారినైనా తనదారికి తెచ్చుకుంటుందన్న నమ్మకం దేవేంద్రునికి ఉండడమే కారణం. దాంతో పోయి రమ్మంటూ మేనకకు పట్టువిడుపులు, విశ్వామిత్రుని గతచరిత్ర తెలుపుతాడు. మహర్షికి సేవచేయుటలో మునిగి స్వర్గలోకమును, మమ్ము మరచిపోతావేమో అంటూ కను సైగచేసి పంపుతాడు. కనుసైగలోని అంతరార్థం నీవనుకున్న రీతిలో ప్రయత్నించి, పనిని విజయవంతం చేసుకొని రమ్మనడంగా పాఠకులు అర్థం చేసుకోవాలి. అపుడు సురేంద్రునికి వీడ్కోలు పలికి చెలులచే చక్కగా అలంకరించబడినదై మేనక విశ్వామిత్రుని ఆశ్రమానికి చేరింది. బద్ధ పద్మాసనములో నిర్భర సమాధిన తపస్సు చేయుచున్న విశ్వామిత్రుని మేనక చూసి మనసులో ఇలా భావించింది. మునివతంసుడైన విశ్వామిత్రుడు మనసులో ఏమి కోరుకుంటున్నాడోగాని ఎండవానలకోర్చి ఈ కొండచరియల్లో నిరాహారంగా ఉంటూ ఘోరమైన తపస్సు చేస్తున్నాడు. ఇటువంటి స్థితిలో నన్నేల చూస్తాడు? చూశాడే పో. అతని ప్రాభవమును చెరిచి వలపువలలో చిక్కుకునేలా చేయాలనుకొనే ఆలోచన నాకు తగినదేనా? లోకమును బాధించాలనేబుద్ధిగానీ, స్వర్గలోక సుఖాలమీద ఆశగానీ లేక మోక్షమునుగోరు మునులపైకి దండయాత్ర చేయుమనుచు మన్మథుడు అప్సరకాంతలను పంపనేల? క్రూరమృగాలకు సైతం ప్రేమ, శాంతిభావములును మనసులో కలుగుచుండ నేనిట్లుభావించుట అన్యాయముగదా. సహజసిద్ధమైన శత్రుభావనలు, బలపరాక్రమాలు మరచి భటులవోలె తిరుగుచూ ఈ ఆశ్రమ ప్రాంతాలను కాపాడుచున్న జంతుసమూహమును చూసైనా నేను పెద్దలను సేవించుట గూర్చి తెలుసుకోవాలి గదా. అక్కడి పరిస్థితులను, వాతావరణాన్ని కన్నులారా కాంచిన మేనకకు ఇలా అంతర్మథనం కలుగుట నిజంగా హర్షణీయమే. స్వాగతించదగినదే.

**తే॥గీ॥ పావనములైన సెలయేటి జీవనములు,**
**ద్రావి యందందు మెలుగు సారంగ వితతి**
**బెదరు జూపుల ననుజూచి చెదిరిపోయె,**
**నకట వానికి బోయ యిల్లాలనైతి.**

అయ్యో! పవిత్రములైన సెలయేళ్లలో నీళ్ళుతాగి అక్కడక్కడా సంచరించే జింకలు నన్ను చూచి వేటగాని ఇల్లాలుగా భావించి బెదిరిపోయాయి. ఇలా పలురకాలుగా మనసులో మేనక తనను తాను ప్రశ్నించు కుంటోంది. అనుదినమూ ఆకులలములు తిని తృప్తి చెందుతూ నియమబద్ధంగా తపోనిష్ఠలోనున్న ఈ విశ్వామిత్రుని చూచికూడా నాకతని మీద వలపేల కలిగె? దానికి అతని తపస్సుభంగమై నాపైన మోహమెలా కలుగుతుంది? విశ్వామిత్రునికి సేవనుగురించి నేను ఇంద్రుని ప్రార్థించడమెందుకు? నాకోరికను మన్నించి ఆయన పోయిరమ్మని పంపడమెందుకు? నన్ను ప్రాణప్రదంగా చూసుకొనెడి సన్నుతాంగులందరూ నన్ను సాగనంపడమెందుకు? ఇవన్నీ ఇలా జరగడానికి నామనసులో ఇటువంటి భావన కలగడానికి ఏదో ఒక కారణముండాలి. నిజమే. కారణం లేనిదే కార్యం పుట్టదనేది తెలుగులో సామెత. కాబట్టే మేనక మనసులో విశ్వామిత్రునిపై వలపుకలగడం. అది నిజంగా దైవలీల అయివుంటుంది. ఈ లీలకు ఎటువంటి మేలు కీళ్ళుంటాయో. ఏది ఏమైనా నేను కాముణ్ణి జయింపలేను. కావున మనసులోని కోరికను జయించాలనుకుంది.

తే॥గీ॥ ఏ మహాశక్తి ననుముట్టి యిట్టు సేసె
నా మహాశక్తి రక్షించి యాదరించి
నెమ్మి దోడ్పడి కోర్కి పండించుగాక,
కలుగుగా కొక్కమేలు నావలన భువికి.

అని మేనక మనసులో తర్కించుకొని మహాశక్తి వలన తన కోరిక నెరవేరితే అది భూలోకప్రజలకు ఒక మేలు జరుగుతుందని భావించింది. అది దైవకార్యమేనని ముందుకే సాగింది మేనక.

తే॥గీ॥ మించు వలపున ముని సమీపించు కొలది,
మది తలంపులు చిగిరింప మరుడు నొంప
దరులతా పుష్ప పవన బంభర శుకాది,
మదన పరివారమునకు నమస్కరించి.

తనను విశ్వామిత్రుని చెంతకు జేర్చమని తరువులను, లతలు పుష్పాలను, గాలిని, తుమ్మెదలను, చిలుకలు మొదలైన వాటిని మేనక ప్రార్థించింది. మీ మేలెప్పటికినీ మరువనని, తనను దీవించమని వనదేవతలను వేడుకొంది. ఏదేని కార్యం సఫలం కావడానికి తన శక్తియుక్తులు, ధైర్యసాహసాలు, అంగ అర్థబలాలు, బలపరాక్రమాలతో పాటు దైవసహకారమూ కావాలి. ఇదే విషయాన్ని మేనకచేత వనదేవతలకు నమస్కరింప చేయడం ద్వారా కవి వై.సి.వి.రెడ్డిగారు మనకు తెలియజేశారు. మనందేనినైనా పొందాలంటే, సాధించాలంటే అదృష్టముండాలి. ఆ అదృష్టమే దైవసంకల్పం. కనుకనే మేనక ప్రకృతిని ప్రార్థించింది. ఆనక మునిని సమీపించింది. ఆముని దివ్యతేజస్సును చూడగానే మేనక కన్నులు మిరుమిట్లుగొలిపి ఆమె శరీరం కంపించింది. మాటలు తడబడ్డాయి. మనసులోని వలపులు ఒక పాటగా బయలువెడలాయి.

మేనక "ఓ మునీంద్ర కందర్ప! మీ గొప్పనైన తపః ప్రభావంతో ముగ్ధురాలినై నిన్ను సేవించడానికై వచ్చాను. దివ్యదృష్టిగల మీకిది తెలియకుండునా? ఒకసారి కన్నులు విచ్చి చూడవయ్యా. మీ కీర్తియనెడి వృక్షము ఆధారంగా నా అఖండ రాగలత సాగి అన్నిదిక్కుల సువాసనలు వెదజల్లుచూ పూలుపూస్తే చాలు. నా పుణ్యంకొద్దీ ఫలములభిస్తే అది మేలుపైన మేలుగా భావిస్తాను. నాకు రూపము, ప్రాయము, కలికితనముంది. దేవతావాంఛనీయమైన ఈ దీనురాలినైన నాకు ఇవ్వు. ఒకసారి కన్నులు విచ్చిచూడు" అని పాట రూపంలో తన మనసులోని ప్రేమభావాన్ని ధ్వనిగర్భితమైన మాటలతో తెలిపి వేడుకొంటుంది. దాంతో నిశ్చలసమాధినున్న మునిప్రవరుడైన విశ్వామిత్రుడు మేనక ఆలాపమును ఆలకించి కన్నులు తెరచిచూశాడు.

మెరుపుతీగను చూచినట్లుగా విశ్వామిత్రుని కన్నులు మిరుమిట్లు గొలిపాయి. కడకన్నులు చెదరాయి. చిరునవ్వుతో మేనకతో ఇలా అన్నాడు. "నీవెవరివి? ఎటువంటి జ్ఞానమార్జించడానికై సెలయేటి పడచులాగా ఉన్నతోన్నత శిఖరాలనుండి దూకి పరుగులిడి ఇచ్చటకు వచ్చావు? ఆకాశగంగలో దివిజ సుందరులతో కలిసి ఈదే రాజహంసవా. నందనోద్యానములో పాటపాడే కోయిలవా. పింఛములను పురివిప్పియాడే

నెమలివా. మేఘములోని మెరుపువా. నీవెందుకు ఇచటకు వచ్చావో తెలిపితే నాకు చేతనయినంత సాయంచేస్తాను" అని అంటాడు. చూశారా? ముందుగా వచ్చిన వారెవరో నిర్ధారణ చేసుకుంటూ, వారి పనేమిటో తెలుసుకొని చేతనైనంత సాయపడతానంటున్నాడు విశ్వామిత్రుడు. నిజనిర్ధారణ చేసుకొని, తొందరపాటు లేకుండా, ముందుగానే ఎటువంటి హామీ ఇవ్వకుండా మాట్లాడుతున్నాడు. ఈవిషయం మనం గ్రహించాలి.

దానికి మేనక "ఓ మునీంద్ర! అఖండ తేజోమయాత్మ! నన్ను తెలియనిదానిననుచు మీరంటున్నారు. పంతము పట్టి సృష్టికిప్రతిసృష్టి చేయగల స్రష్టవనుచు మీరు లోకులందరికీ తెలుసు. దేవేంద్రుని కొలువులోనటనాకౌశలముతో ఆడిపాడి స్వర్గలోకవాసులను ఆనందపరచెడి మేనకను నేనేనని మిమ్ము నమ్మింపగలనే? నన్నెరుగరే మీరు? నా మనః కమలమునుండి ప్రసరించే గాలిని మీరు ఆఘ్రాణించలేరా? ముక్కు మూసుకొని సైతము మనోగంధములను పీల్చు ఘనులు మీరు. మీవద్ద దాపరికము తగదునాకు. మీ ఎదుట బట్టబయలుగా నిలిచి నాగుట్టును అప్పనము చేసికొంటాను. కొండంతపెరిగి హృదయము నిండిన అజ్ఞానమిది. దీనికి మీ చేతి స్పర్శతగిలిన చాలు. స్వర్గలోకవాసులెల్ల నా పైట చెరగు సోకి ధన్యులైనారట. కానీ నాకు మాత్రం మనసులో తృప్తి కలగలేదు. దాంతో చివరకు మిమ్ము ఆశ్రయించమని మన్మథుడు నన్ను మీ చెంతకు పంపాడు. మీ నీడలో నిలుస్తాను. మీ మనసుకు నచ్చినట్లు నడచుకొంటాను. ప్రేమతో మీ యశోవల్లిని పెంచుకుంటాను. దాని నుంచి ఒక పుష్పము పుడుతుంది. అది మనకు, లోకాలకు అభ్యుదయమవుతుంది" అని పలుకుటలోను, మీ చేతిస్పర్శ తగిలితే చాలని అనడంలోను ధ్వని ఉందని మనం గ్రహించాలి.

అలా పలికిన మేనకను చూసి విశ్వామిత్రుడు ఆమె ఒయ్యారములకు, నేర్పుతో కూడిన పలుకులకు మనసు చిగురించినప్పటికీ దానినికప్పిపుచ్చి ఇలా అంటాడు. నన్ను మునుపటి విశ్వామిత్రునిగ దలచి వచ్చావేమో? ఇది పొరపాటు. నామనసు చలించుటచే తపోభంగమైన ఘట్టాలూ ఉన్నాయి. ఇపుడు ఆ మాటలెందుకు? మనసులో బ్రహ్మత్వమునాశించి నేను తపస్సు చేయుచున్నాను.

**తే॥గీ॥ ఓ యమాయకురాల! నీ వూరకున్న,**
**నుండనీయరు సురలు నిన్నుబ్బ జేసి**
**పంపగా వచ్చితివి నా తపంబ జెఱుప,**
**బడతి! యా నీటికీ బేడలుడక వింక**

నా తపస్సు భగ్నముచేయడానికై దేవతలు పంపగా వచ్చావు. ఆ నీళ్ళకు ఈ బేడలుడకవని ముని పలకడంలోగలఆంతర్యం గమనిస్తే విశ్వామిత్రుని దృఢచిత్తమేమిటో తెలుస్తోంది. మేనక భయపడుతూ తాపసవరేణ్యా! ఇందులో సురల దోషమేమీ లేదు. మీ పాదాలమీద ఒట్టు. అది మంచికో చెడుకో తెలియదుకానీ ఒకనాడు నా మనసులో మీ మహితమూర్తి లగ్నమైంది. అది విత్తనమైంది. మొలకెత్తి వృద్ధిజెంది మనసంతా నిండిపోయింది. నీవేమొ తపస్సు చేస్తావు. నీ తపస్సు చేత నేను బక్కచిక్కిపోయాను. నీమీదే నా మనసు

నిలిపాను. కావాలంటే నా యెదనుచీల్చి మీ రూపాన్ని చూపిస్తాను. అంటే నేను మిమ్ములను ఎంతగా కోరుకుంటున్నానో చూడమని తెలుపుతోంది. ఓ మహాత్మా! దేహము ఒకచోట, ఆత్మ వేరొకచోట నిలుస్తాయా? ఒకవేళ నిలిచినంత మాత్రాన ఫలముంటుందా? ఇవన్నీ తెలిసి తపస్సులోనున్న మీవంటి ధీరవరులకేమి చెప్పగలము? విరహ వేదననుభరించు ఉపాయముతెలియక ఇంద్రియ పంచకముతోడ పరుగుబెట్టించినవాడు, నన్ను తొందరించి రచ్చకీడ్చిన మన్మథుడు దీనికి అపరాధులు, కారకులని పలుకుటద్వారా ఇది నా తప్పు కాదని అంతా దైవేచ్ఛయేనని ఆమె భావన. నన్ను శిక్షించినా, రక్షించినా మీరే. నామేనితో మేను, ఆత్మతో ఆత్మను చేర్చిరో అది మీఇష్టం. నాకు మీ దర్శనం వ్యర్థముగాదు. మీ తపఃప్రభావ ఫలితంగా నా నోముల పంటగా ఒక చక్కనిచుక్క కలుగుతుంది. నన్ను మీకు సర్వార్పణముగా ధారవోసాననుటకు మన్మథుడే సాక్షి. ధ్యానావసానవేళ నన్ను బలిగొనిన చాలని పేర్కొనడం ఆమెలోని వాంఛను తెలియజేస్తోంది. మీరుకోరితే సేవలుచేస్తాను. పాదాలొత్తుతాను. సపర్యలకు కటాక్షించి నన్నేలుకోమనుచు మేనక మునిపదాబ్జములపై వాలింది. అలా వ్రాలేటపుడు సిగలోని పూలపరిమళాలుకూడా రాలాయి. వేడినిట్టూర్పులతో మునిశరీరము చెమర్చింది. మనసు గుబాళించింది. పాదాలు తగలకుండా చేతులడ్డుపెట్టాడు. చేతులు తగలడంతో విశ్వామిత్రునిమేను కంపించింది. విశ్వామిత్రుని జాలి, మేనక గడుసుదనము, విధి విలాసము, మన్మథుని విక్రమము కారణమేదైనా గానీ చివరకు ముష్కర తపస్వి ఒక వెన్నముద్దయ్యాడు. వేడికి వెన్నముద్ద కరిగినట్లుగా మేనక వలపుకు మహర్షి మనుసుకూడా కరిగింది.

**తే॥గీ॥ ఱెప్ప వాల్పని చూపులోనుప్పతిల్లి,**
**మేను బారాడి తలపులో మెఱపు వోలె**
**భావమొకు టేదియో స్వయం ప్రభవమగుచు,**
**నిగిడి మనసెల్ల మౌనికి నిండికొనియె.**

మదిలోనిభావము సడలకపోవడంతో విశ్వామిత్రుని కరాబ్జములు, కన్నులు మేనకను వదలకుండెను. భావి కాలమందు కణ్వుని ఆశ్రమమంలోతిరిగే శకుంతల, ధర్మావతారుడైన దుష్యంతమహారాజు, వారి కుమారుడు భరతుడు ఇలా అందరూ ఒకసారిగా ఆసమయంలో ముని మనసులో మెదిలారేమో మరి. ఒక్కసారిగా విశ్వామిత్రునిలో వలపు చిగురించింది. మేనకను మెల్లమెల్లగా విశ్వామిత్రుడు తన కౌగిలికి చేర్చుకున్నాడు. నిజమే మరి ప్రేమపుట్టడానికి క్షణకాలంమాత్రమేనని ఎవరికి తెలియదు. ఇదే ఇక్కడా తేటతెల్లమయింది. మనసులోని కోరిక నెరవేరడంతో మేనక కన్నులు విచ్చి చిరునవ్వులు చిందించగా మౌని విశ్వామిత్రుడు కసిగా ముద్దాడాడు. ఆ సమయంలో కొంటె కోయిల ఒకటి కొకోయని కూసింది. ఇది కొత్త ఊహ. కోడి కొకోయని కూస్తుంది. కానీ మేనక కావ్యంలో కోయిల అందునా కొంటెకోయిల ఇలా కూసిందని కవి చెప్పడంలోని ఆంతర్యం మేనకావిశ్వామిత్రుల కలయిక శకుంతల ఉదయించనుందనుటకు, చీకట్లు తొలగి లోకకల్యాణానికి దారితీయనుందనుటకు కారణాలుగా ఉండవచ్చు. దేవతలు విశ్వామిత్రుని తపస్సు భగ్నం చేయాలని పూని మేనకను పంపారో, తనకు తానుగా ఆమే వచ్చిందో, కారణం ఏమైతేనేమి "ముని రక్తి మధ్యమ లోకసిద్ధి" అంటూ కవి వై.సి.వి.రెడ్డి గారు ప్రవచించి కావ్యానికి ఉపసంహారం పలికారు.

విశ్వామిత్రునిపై వలపు కలగడానికి దైవలీలే కారణమని, అది లోకాభ్యుదయ మవుతుందని మేనక పలకడం, రాబోవుకాలాన జన్మించే శకుంతల, ఆమెను కన్నబిడ్డగా పెంచే కణ్వమహర్షి, వేటనెపమున వచ్చిదుష్యంతమహారాజు శకుంతలను గాంధర్వ వివాహం చేసుకోవడం, వారికి భరతుడుదయించడం వంటి భావాలన్నీ ముని మనసులో తళుక్కున మెరిశాయని చెప్పడం కవి వై.సి.వి.రెడ్డి గారి సృజనకు తార్కాణం. తెలుగు సాహితీ కళామతల్లికి “మేనక” కావ్యం కంఠాభరణమై వెలుగులీనుతోందనుటలో సందేహం లేదు.

❖ ❖ ❖




ఈ నవవసంతములో కంఠము లెత్తిన యువకవులలో నీయన యొక్కడు. పచ్చని పంట పొలములో మంచెలపై కంచు గంటలు మ్రోయించు నీ కంఠము కావ్యోద్యానములో కమ్మని భావగీతము లాలపించుట ముచ్చటయె కాదు, మెచ్చుకోదగినది.

– గడియారం వేంకటేశషశాస్త్రి



**డా॥ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి**
సహాయ పరిశోధకులు,
సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం, కడప
సెల్ : 9966624276

# వై.సి.వి.రెడ్డి 'రంభ' ఖండకావ్య వైశిష్ట్యం

వై.సి.వి.రెడ్డి అనే యమ్మనూరు చిన్న వెంకటరెడ్డి గారు పేరు ప్రఖ్యాతులకు ప్రాకులాడని అచ్చమైన గ్రామీణకవి, రచయిత. సంప్రదాయం నుండి అభ్యుదయం వైపు ప్రయాణించిన కవి. ఆయన లింగాల మండలంలోని బోనాల గ్రామంలో 1926 మార్చి 26న వ్యవసాయ కుటుంబంలో పుట్టారు. ఆయన 'కడప గడపలలోన కవుల గడపలు మెండు' అని కడప జిల్లా సాహిత్య వైభవాన్ని కీర్తించారు. ఆయన కొన్ని పౌరాణిక పాత్రలను తీసుకొని వాటిని తమదైన నవ్య దృక్పథంతో, భావనా బలంతో చిత్రించాలనుకున్నారు. అలా నిర్ణయించుకొని మొదట మహాభారతాన్ని, అభిజ్ఞాన శాకుంతలాన్ని ఆధారం చేసుకొని 'మేనక' అనే ఖండకావ్యాన్ని రచించారు. ఆయన రచనా విశేషం ఏమిటంటే ఆయా పాత్రలు మూలగ్రంథాల్లో ఎలా ఉన్నప్పటికీ వాటిని చాలా ఉదాత్తంగా చిత్రించడం, జరిగిన సంఘటనలకు పరిస్థితులే తప్ప వ్యక్తులు కారణం కాదని చెప్పడం, అందుకు అవసరమైన భావనా పటిమను ఆవిష్కరించడం, అర్థవంతమైన, ఔచితీమంతమైన భాషను ఉపయోగించడం.

వై.సి.వి.రెడ్డి గారు అలాంటి నవ్య దృక్పథంతోనే శృంగారరస ప్రధానంగా 'రంభ' ఖండకావ్యాన్ని రాశారు. వైసివి గారి రచనల్లో మూడోదైన ఈ రచన 1956లో వెలువడింది. ఉత్తర రామాయణం ఆధారంగా రంభారావణ వృత్తాంతాన్ని స్వీకరించినప్పటికీ కవి అందులోని రావణుని దుందుడుకుతనం ప్రసక్తి లేకుండా సంభాషణ చాతుర్యంతో రంభను ఒప్పించినట్లుగా, పరస్పర అవగాహనతో రంభారావణులిద్దరూ సంగమించినట్లుగా మలచారు. రంభ పతివ్రతా శిరోమణి కాదనీ, దేవవేశ్య అని, స్వర్గంలో దేవేంద్రునితోనూ, స్వర్గానికి వచ్చిన వాళ్ళందరితోనూ భోగించే ఆమెతో రావణుడు సంగమించడం తప్పు కాదనేది కవి భావమైనట్లు అర్థమవుతుంది. అందువల్లనే కవి అందుకు అనుగుణంగానే ఆ పాత్రలను మలుచుకున్నారు. పల్లెపట్టుల్లోని ప్రకృతి సౌందర్యాన్ని స్వానుభవంతో గ్రహించినవారు కావడం వల్ల, ప్రాచీన కావ్యాలపై బాగా పట్టు ఉన్నవారు కావడం వల్ల ప్రకృతిలోని అందచందాలను, అనుభూతులను వర్ణనా ప్రతిభను ఆవిష్కరిస్తూ అంతే అందంగా రూపుకట్టించారు. కళాజీవులైన ఆంధ్రులకు తీయని కల అయిన కళాతపస్వి, కళాప్రపూర్ణ, స్వర్గీయ బళ్ళారి రాఘవాచార్యులకు ఆయన ఈ కావ్యాన్ని  అంకితమిచ్చారు.

డా॥ పుట్టపర్తి నారాయణాచార్యులు వైసీవి గారి 'మేనక' కావ్యానికి 'అభిప్రాయం' రాస్తూ 'ఇంత చిన్ని కావ్యంలో ఇంత సౌందర్యాన్ని ఇముడ్చడం సామాన్యమైన శిల్పం కాదు. వ్యుత్పత్తి ప్రయత్న సాధ్యం. సంస్కారం దైవదత్తం. ఈ కావ్యంలో సంస్కారం ప్రతిపదానికి ఉంది. వ్యుత్పత్తి సంస్కారాన్ని కూడా

తిరస్కరించలేకపోవడం ఈ కావ్యంలోని మహాగుణం. సంస్కారి అదవ బతుకు బతకడని, పదవిన్యాసాలు పాతవే అయినప్పటికీ, కూర్పు నేర్పు పాతదే అయినప్పటికీ తనదైన ప్రత్యేకముద్రను కనబరుస్తాడు.... కొంతమంది అశక్తులై తేటగీతిని వాడతారు. ఈ కవి శక్తుడై వాడాడు. ఈ ఛందస్సులో కవి చూపిన మెరుపులు ఎంతోమంది కవులు ఒరవడిగా ఉంచుకోదగ్గవి' అని అభిప్రాయపడ్డారు. ఆ మాటలు దానికి కొనసాగింపుగా సాగిన ఈ 'రంభ' కావ్యానికి కూడా వర్తిస్తాయనే చెప్పవచ్చు.

వైసివి గారు కావ్య ప్రారంభం చేస్తూ ప్రేమకు, ప్రకృతికి ఉన్న అవినాభావ సంబంధాన్ని తెలియజేశారు. ప్రేమ నిండిన (కోరికతో ఉన్న) గుండెలో ఊహలు, ఆలోచనలు సెలయేటి ప్రవాహంలా గలగలమని సందడి చేస్తుంటాయి. వలపు తలపుల సెలయేరు ఆనందమనే సముద్రంలో ఊగులాడాలనే కుతూహలంతో మలయపుగాలిని వెంట పెట్టుకొని కుబేరుని కుమారుడైన నలకూబరుని వద్దకు వచ్చి, ఆయన పాదాలనే కమలాలను తాకుతూ నెమ్మదిగా సంతోషంతో ప్రకాశించిందంటూ తమదైన రచనా విన్యాసాన్ని ప్రదర్శిస్తూ చెప్పిన తేటగీతి పద్యాన్ని చూడండి. 'వలపు తలపుల సెలయేఱు మలయ పవను/ దోడుకొని మందయానయై వేడు కలర/ సాగె, నలకూబరుని పదసరసిజముల/ నొరసి యానంద జలధి నుఱ్ఱూతలాడ'

కథానాయిక రంభను, ఆమె భర్త నలకూబరుణ్ణి కవిగారు రెండో పద్యంలో పాఠకులకు పరిచయం చేసిన విధానం చూడండి. రంభ కొత్తదనంతో కూడిన అందాన్ని కలిగి స్వర్గంలో నివసించే సౌందర్యరాశి అని, ఆమె తన భర్త అయిన నలకూబరునితో శృంగారంలో మునక వేయాలని కోరుకుందని, దేవతాస్త్రీ కనుక నిత్యం యవ్వనంతో (జవరాలు) అలరారుతూ ఉంటుందని, అలాంటి ఆమె ప్రేమను ఆస్వాదించగల సమర్థుడు యక్షులకు రాజైన కుబేరుని కుమారుడైన నలకూబరుడని అంటున్నారు. అప్సరస అయిన రంభ గొప్ప అందగత్తె అని మనందరికీ తెలుసు. అయితే నలకూబరుడు కూడా సామాన్యుడేమీ కాదు. అల్లసాని పెద్దన రచించిన మనుచరిత్ర ప్రబంధంలో వరూధిని ప్రవరుణ్ణి మొట్టమొదట చూసిన సందర్భంలో 'ఎక్కడివాడొ యక్షతనయేందు జయంత వసంత కంతులన్ జక్కదనంబునన్ గెలువ జాలెడువాడు' అని అనుకుంటుంది. ప్రపంచంలో కొంతమంది గొప్ప అందగాళ్ళు ఉన్నారు. వాళ్ళు ఎవరయ్యా అంటే యక్షులకు రాజైన కుబేరుని కుమారుడైన నలకూబరుడు, దేవేంద్రుని కుమారుడైన జయంతుడు, వసంత ఋతువుకు అధిదేవత అయిన వసంతుడు, విష్ణువు కుమారుడైన మన్మథుడు. రంభా నలకూబరుల విశిష్టతను ఆవిష్కరిస్తున్న ఆ పద్యాన్ని చూడండి. 'నవ్య కమనీయ దివ్య సౌందర్యరాశి/ రంభ, నలకూబరుని తోడ రాసకేళి/ దేల సంబరపడె, జవరాలి వలపు/ జూఱగొన జాలువాడు కుబేర సుతుడు'

వసంతవేళలో ప్రేమ (కోరిక) అనే సువాసనతో కూడిన గుత్తులు విరివిగా పండిన వనంలో కోయిల ఊహలు, ఆలోచనలనే చిగురాకులను తిని మనుషుల బాధలన్నింటినీ పోగొట్టేలా ముగ్ధ మోహన మాధుర్యంతో గానం చేసిన వైనాన్ని కవి చిత్రించిన తీరు చూడండి. 'వలపు నెత్తావి గుత్తుల వనములోన/ దలపు జిగురాకులను మెక్కి కలత లడపు/ ముగ్ధమోహన మాధుర్యమున నదించి/ యాలపించెను గోయిల హాయి గూర్చి'

అలాంటి మధురమైన మనోహరమైన సమయంలో నలకూబరుడు అలకా నగరంలో ఉన్నాడు. రంభ హిమవత్పర్వత ప్రాంతంలో విహరిస్తోంది. కోయిల గానం విని రంభ అతిశయించిన మధురమైన వలపు తలపులు ఆవరింపగా కూనిరాగాలు తీసింది. ఆనందంతో గగుర్పాటును పొందినదై తన గొప్పతనాన్ని తలచుకుంది. గోరింకను నలకూబరుని వద్దకు పంపి రప్పించుకొని సుఖపడాలని భావించింది. అందువల్ల గోరింకను పిలిచి ఈ సమాచారం విన్న నలకూబరునిలో కోరికలు పుట్టేలా చెప్పిందంటూ ఆవిష్కరించిన పద్యం చూడండి. 'బలసికొనివచ్చు తీయని వలపు తలపు/ లలముకొన కూనిరాగము లాలపించి/ హర్షపులకితగాత్ర సోత్కర్ష మెంచి/ శారికను జీరి కోరికలూర జెప్పె'

మధుమాసపు వేళలో వాతావరణమంతా ఆహ్లాదకరమై ప్రేమమయమై పోయి ఉండడంతో మనుషుల్లో సహజంగానే కోరికలు పుట్టడం వల్ల శృంగారానికి సిద్ధమైపోతుంటారు. రంభలో కూడా శృంగార భావనలు తలెత్తాయి. అందువల్ల రంభ గోరింకతో సమాచారం పంపుతూ మలయ పర్వతంలో (తావిగట్టున) మన్మథుడు అరవిందం, అశోకం మొదలైన తన పూలబాణాలు మరింత పదునెక్కేలా సాన పడుతున్నాడు. అలా సాన పెట్టినవాడు ఊరకుండడు కదా! ప్రజల్లో మన్మథ తాపాన్ని రేకెత్తించి బాధిస్తాడు. అందువల్ల నువ్వు అలకా నగరానికి వెళ్ళి ప్రాణవిభుడైన నలకూబరునికి తాను హిమవత్పర్వత ప్రాంతంలో విహరిస్తున్న విషయాన్ని ప్రేమతో చెప్పి, ఆయనను వచ్చి తనను ఆశ్రయించుకొని కౌగిలిలో గుట్టుగా బతకడం క్షేమకరమని చెప్పమంది. ఆ భావాన్ని ఆవిష్కరించిన పద్యాన్ని చూడండి. 'తావిగట్టున మదనుడు పూవుటమ్ము/ లన్నిటికి సానబెట్టుచు నున్నవాడు/ అలక కటువోయి నారాక లెలమి జెప్పి/ నా మఱుంగున బ్రదుకుట సేమమనుము'

ఆ తర్వాత రంభతో కవి 15 తేటగీతి పద్యాల్లో వసంత ఋతువర్ణన చేయించారు. తుమ్మెదల ఝుంకార నాదాలను, చంద్రోదయాన్ని, పండు వెన్నెల కాంతులను, కలువల వికాసాన్ని, చకోర పక్షుల సంతోషాన్ని, మలయ పర్వతంలోని సుగంధపు చెట్ల సుగంధాన్ని, పూల సువాసనను అంతటా విరజిమ్ముతూ సాగుతున్న పిల్లగాలుల ప్రణయ విహారాన్ని, కాంతులతో వెలుగొందుతున్న ఆకాశాన్ని వీనుల విందైన పదాల పోహళింపుతో అందంగా కళ్ళకు కట్టినట్లుగా వర్ణించారు.

తుమ్మెదలు ఝుం ఝుమ్మని కమ్మగా శబ్దం చేస్తూ పూలపై వాలి దట్టంగా కప్పివేసి వాటిలోని పుప్పొడిలో విహరిస్తూ తన్మయత్వంతో తేనెను తాగాయి. రాని రాగాలను ప్రజల గుండెలపై చిలకరించాయి. సుఖాలనే సంపదలను పంపించాయంటూ కవి తుమ్మెదల ఝుంకార నాదాలను ఇలా కవిత్వీకరించారు . 'కమ్మగా దేటిగములు ఝుంఝుమ్మటంచు/ ముసురుకొని పుష్పరజమున మసలి, మధువు/ ద్రావి తన్మయతను, రాని రాగములను/ మదుల చిలికించె, భోగసంపదల బంచె'

ఇంతలో చెట్లు పులకించేలా దగ్గరగా చంద్రుడు ఉదయించాడు. చంద్రుడు ఉదయిస్తే కలువలు వికసిస్తాయనేది కవి సమయం. అందువల్ల కలువలు వికసించాయి. పొన్నపూలు విచ్చుకున్నాయి. దాక్కొని కనిపెట్టుకొని ఉన్నటువంటి సంపెంగలు కూడా సువాసనలను వెదజల్లాయి. మన్మథుడు పిల్లగాలి అనే

మేలుజాతి గుఱ్రమైపోయి వేగంగా అంతటా సంచరిస్తూ విజృంభిస్తున్న తీరును ఇలా చిత్రించారు. 'తారకానాథు డుదయించె దరుల చెంత,/ విచ్చె కల్హారముల చాలు – విచ్చె పొన్న/ పొంచి కాంచనములు పిసాలించె – మించె/ పిల్లతెమ్మెర తేజి రూపెత్తి మరుడు'

చక్కదనాల చుక్క అయిన చంద్రుడు రసిక వరులను అనురాగమనే అలల్లో తేలియాడేలా చేశాడు. గుండెలనే వీణల తీగలు చలించేలా మీటాడు. అమృతాన్ని చిలకరించి కోరికలు రేకెత్తేలా చేసి ఆకాశంలో ఆటలాడుకున్న వైనం చూడండి. 'రాగరస వీచికల దేలు రసిక వరుల/ హృదయవీణెల తంత్రుల కదల మీటి/ యమృత మొలికించి వ్యోమాన నాటలాడె/ లోలతలు నిక్క జక్కందనాల చుక్క'

ఆకాశమనే కాంత తలపై ధరించిన కిరీటాన్ని తీసి, పొడవైన కొప్పును విప్పి, పవిత్రమైన గంగానది తరంగాల్లో తడిసిపోయి, ప్రకాశవంతమైన వెన్నెల అనే తెల్లటి పట్టుచీరను కట్టి, తన కళలను విరజిమ్ముతూ అలంకరించిందంటూ చెప్పిన పద్యాన్ని చూడండి. 'శేఖరము దీసి, దీర్ఘ కైశికము విప్పి/ అమల మందాకినీ తరంగముల దోగి/ యారు వెన్నెల వెలి పట్టుచీర గట్టి/ కళల విరజిమ్మి గైసేసె గగనకాంత'

రంభ పంపగా నలకూబరునికి సమాచారం చేర వేసి పిలుచుకొని రావడానికి గోరింక బయలుదేరిన తీరును కూడా కవిగారు ఒక సీసపద్యంలో అద్భుతంగా చిత్రించారు. గోరింక మొదట ఎత్తైనటువంటి పర్వత శిఖరాలపై వాలిన మేఘాలలో తిరుగాడింది. అక్కడ నుండి అవ్యక్త మధురంగా శబ్దం చేసే సెలయేళ్ళను దాటుకుంది. వలపు మోహాన్ని పెంచే కొండమల్లె పూల నుండి కానుక స్వీకరించింది. మృదువైన, అందమైన రత్నాలకు నెలవైన మేరుపర్వతంలో నడయాడింది. తలను కింద పెట్టి భయంకరంగా తపస్సు చేస్తున్న మునుల ఆశ్రమాలను దర్శించింది. ప్రియుణ్ణి సంకేత స్థలానికి రప్పించుకోవడమో లేక తానే స్వయంగా సంకేత స్థలానికి వెళ్ళడమో చేసే స్త్రీని అభిసారిక అంటారు. ఎనిమిది విధాలైన నాయికల్లో ఈమె ఒకరు. జాగ్రత్తగా తామనుకున్న సంకేత స్థలాలకు (పల్లవాంకం) చేరుకొని రంజిల్లుతూ ప్రియుల కోసం ఎదురుచూస్తూ ఆ ప్రదేశం చుట్టూ తిరుగుతున్న ప్రియురాళ్ళను (అభిసారికలను) చూసింది. కదులుతూ సంతోషాన్ని చిందిస్తున్న లేతవైన, సొగసైన, ఉత్సాహంతో కూడుకున్న తీగల చాటున దాగి ఉన్న దేవకాంతలను తిరిగి చూసింది. ఆ తర్వాత పర్వత శిఖరపు అంచులపై నుండి ప్రయాణించి అలకా నగరానికి అతిశయించిన కోరికతో, ఆనందంతో పరుగెత్తుకొని వెళ్ళిందట. 'ఉత్తుంగ గిరిశిఖరోపలంబుల జుట్టి, కలనాదముల బాఱు సెలల గడచి,/ తమితేపు కుటజ సంతతి యుపాయనమంది, నునుపారు రత్నసానువుల మెట్టి,/ తలక్రిందులై ఘోరతప మాచరించెడు సంయములున్న యాశ్రమము లరసి,/ కనుగల్గి పల్లవాంకము జేరి జొత్తిల్లి వలగొను నభిసారికలను జూచి,/ యింపు లొలికించు లేత మవ్వంపు లతల/ మాటువడు దివ్యకాంతల మలగి చూచి/ యచల శృంగాగ్రముల బాటి యలక వైపు/ మించు వేడ్క శారిక పరతెంచె నపుడు'

అంతలోనే దేవతాస్త్రీల కొప్పులలోని మందార మాలలను దోచుకొని చక్కగా విరిచేవాడు, కైలాస పర్వతాన్నే పైకెత్త గలిగిన అతిశయమైన, భయంకరమైన భుజాలు కలిగినవాడు అయిన రావణాసురుడు గొప్ప ఉత్సాహం కలిగినవాడై విలాసంగా గర్వంతో దేవేంద్రుని సంపదలను నాశనం చేయడానికి భయంకరమైన

రాక్షస సైన్యంతో స్వర్గంపై దండెత్తే ఉద్దేశంతో రావణాసురుడు కూడా హిమాలయ పర్వతాలకు చేరుకున్నాడు. రావణాసురుని శౌర్యసాహసాలను ప్రకటిస్తూ కవి గారు తన పాండితీ పటిమను తెలియజేస్తూ చెప్పిన పద్యం చూడండి. 'ఆలో నచ్చటి కేగుదెంచె సురకన్యామౌళి మందార మా/ లా లుంటాక మహాప్రభంజనుడు, కైలాసాచలోత్క్షేపణో/ ద్వేలాభీల భుజుండు రావణుడు దైతేయోగ్ర సైన్యంబుతో/ హేలోద్వృత్తి సురేంద్ర సంపదల మాయింపన్ సముత్సాహియై'

అదేవిధంగా కుంభకర్ణుని, మేఘనాదుని, అతికాయుని, ప్రహస్తుని శౌర్యపరాక్రమాలను వర్ణిస్తూ కవి గారు తమకు సంస్కృతాంధ్రాల్లో ఉన్న పాండిత్యాన్ని వెల్లడించారు. ఆకాశగంగ ధారలతో వృద్ధిచెందిన పూలతీగల పొదల చుట్టూ రావణుని సైన్యం నిద్రపోయింది. చల్లని పండువెన్నెల జాడతో, పిల్లగాలుల విన్యాసాలతో పలు భావాలు సంచలిస్తుండగా వరుసగా తలలు కలిగిన రావణాసురుని మనస్సు హద్దులు తెలియకుండా చెలరేగి ఉప్పొంగిన సముద్రమైపోయిందట. 'చల్లవెన్నెల పొలపుల బిల్లగాడ్పు/ చౌకలింతల భావముల్ సంచలింప/ బరిధు లెఱుగక చెలరేగి పంక్తికంఠు/ నంతరంగము పొంగిన యబ్ధియయ్యె'

మాటలతో చెప్పలేని, మధుమాసంలో ప్రేమను వ్యక్తపరచడానికి అనుకూలమైన రసానుభూతులను తెల్పే ఆటలన్నీ ఆడి, చూసినంతనే కలిగే వలపుతో తృప్తిపరచే చల్లగాలుల ప్రభావంతో రావణునిలో శృంగారపు కోరిక అధికం కాగా, కోయకుండా చెట్టుపైననే ప్రకాశించే కొత్తవైన ఒయ్యారాలతో కూడిన చిగురాకులకు సాటివచ్చే ఒక పూబోణితో (పువ్వు లాంటి అందమైన అమ్మాయితో) జతకడితే బాగుంటుందని రావణుడు మనసులో భావించాడట. 'పలుకుల కందరాని మధువాసర రాగ రసోచిత క్రియా/ విలసనముల్ వెలార్చి కనువేదురునన్ దనియించు చల్లగా/ లుల దమి హెచ్చ రావణు డలూన నవీన విలాస పల్లవం/ బుల కెనవచ్చు నొక్క ననబోణికినై తలపోసె నెమ్మదిన్'

చంద్రుని కాంతి, వెన్నెల వెలుగుల ప్రభావంతో రావణునిలో మన్మథతాపం పెరిగి పోవడంతో మన్మథుణ్ణి నిందించసాగాడు. మన్మథా! బలం ఉందని (ఇంటికి దూరమై పోయి ప్రయాణిస్తున్న) బాటసారులను బాధించడం కాదు. పరిమళించే ప్రేమభావాలను వెదజల్లే ప్రౌఢకాంత గనుక కనిపిస్తే, ఆమె కలయికలో నిన్ను చంపేస్తాను. తత్ఫలితంగా ఈ బాధలు తీరిపోతాయంటున్నాడు. 'బలము గలదంచు బాంథులపైన విరుగ/ బడుచు నొదుగుట కాదురా, పరిమళించు/ ప్రణయినీ భావముల జిల్కు ప్రౌఢ నిందు/ గంటినా, నిన్ను బొరిగొందు, గలత లడగు'

ప్రళయ కాలంలోని పరమేశ్వరుణ్ణి కూడా ఒక్కడే తొడగొట్టి సవాల్ చేసి యుద్ధానికి రమ్మని పిలిచి మరీ యుద్ధం చేయగలిగేటటువంటి సమర్థుడు ప్రపంచాన్నంతా జయించినటువంటి పరాక్రమవంతుడైన రావణాసురుడు. అలాంటి వాడిని ప్రేమపాశాలకు వశం చేసి కలకాలం ముంచెత్తుతున్న లక్ష్మీపుత్రుడైన మన్మథుని గొప్పతనాన్ని లెక్కించడం పరమాత్మకు కూడా సాధ్యం కాదంటున్నారు కవి గారు. 'ఆ లయకాల రుద్రు నొకడై తొడదట్టి సవాలు చేసి క/ య్యాలకు జేరి పోరగల యట్టి జగజ్జిత విక్రమాఢ్యు రా/ గాలకు బాలుజేసి కలకాలము ముంపులు వెట్టజాలు ప/ ద్మాలయ పుత్రు నెన్నదరమా పరమాత్మునికైన నెప్పుడున్'

రావణుడు విరహంతో బాధపడుతున్న సమయంలోనే రంభ సముచితారంభయై అంటే అందుకు తగినటువంటి సంకల్పం కలిగినదై, వలపు తలపులు అవ్యక్త మధురంగా ధ్వనిస్తుండగా, కదులుతున్న చిరునవ్వుల కాంతులు ఆమె మనసులోని శృంగార భావనలను తెలుపుతుండగా మన్మథుని విల్లో అన్నట్లుగా రావణుడు ఉన్న ప్రాంతానికి వచ్చిందంటూ కవి తమ ఆలంకారిక ప్రతిభను చాటుతూ చెప్పిన పద్యం చూడండి. 'రంభ యాలోన సముచితారంభయగుచు/ వలపు తలపులు కలనాదముల రచింప/ దరళ దరహాసరేఖ లంతరము దెలుప/ బుష్పధన్వుని కోదండమో యనంగ!'

ఇంకా రంభ అతిశయించిన సౌందర్యంతో, వైభవంతో పోల్చడానికి సాధ్యపడనటువంటి అలంకారాలు ప్రకాశిస్తుండగా, హంస నడక ఎలా ఉంటుందో వయ్యారంగా తెలుపుతూ, ఝణఝణ అని శబ్దం చేస్తున్నటువంటి బంగారు కంకణాలతో కమలాలను పోలిన చేతులు ప్రకాశిస్తుండగా ఆ హిమవత్పర్వత ప్రాంతంలో ఉండి పైన పేర్కొన్న విధంగా అంత రసవంతంగా ఉన్న లోకాన్నంతా అవమానిస్తూ స్త్రీయే అంటే తానే ప్రధానమైన ప్రపంచమైపోయి ఊరిస్తోందంటూ కవి భావాంబరవీధిలో విహరిస్తూ చెప్పిన పద్యం చూడండి. 'మించిన ఠీవి తోడ నుపమింపగరాని యలంకృతుల్ పిసా/ ళించ మరాళయానము సలీలత దెల్ప ఝణంఝణ క్వణ/ త్కాంచన కంకణాఢ్య కరకంజము లొప్పగ నిల్చి రంభ యూ/ రించె రసప్రపంచ మధరీకృత మానవతీ ప్రపంచమై'

ఆ సమయంలో రంభ సౌందర్యాతిశయాన్ని కవి పలు పద్యాల్లో వర్ణించి తమ భావనా పటిమను చాటుకున్నారు. తన కాంతినే తిరస్కరిస్తున్న అంటే తనను మించిన కాంతితో ప్రకాశిస్తున్న రంభను చూసి చంద్రుడు దుఃఖంలో మునిగిపోయాడట. చంద్రుణ్ణి సేవించే కలువపూలు తమ కన్నా మిన్నగా వెలుగొందుతున్న ఆమె కళ్ళ అందాన్ని చూసి సిగ్గుపడి తమను పరిపాలించే మహారాజును గౌరవిస్తున్నాయో అన్నట్లుగా వంగిపోయాయట. ఆ విషయాన్ని సమర్థిస్తూ తమ కన్నా గొప్పవాళ్ళ దగ్గర వినయాన్ని ప్రదర్శించడం సబబే కదా అంటూ కవి అర్థాంతరన్యాసాలంకారంతో చెప్పిన పద్యం చూడండి. 'తన కాంతిన్ బురడించు మోము గని చింతామగ్నుడై చంద్రు, డా/ తని సేవించెడు కల్వలున్ గనుల యందంబెంచి లజ్జించి యే/ లినవారిన్ బలె గొల్చిరో యనగ బొల్చెన్ రంభ, లోకంబునన్/ దనకంటెన్ ఘనులైన వారి కడ యుక్తంబే కదా నమ్రతల్'

రంభ శరీరమంతా అనురాగంతో ప్రకాశిస్తూ కొత్తదైన స్వర్గంలోని సౌందర్యమైపోయిందని, ఆమె గొప్పలు తొణికిసలాడుతుండగా క్రమబద్ధమైన నడకలతో స్వరబద్ధంగా విలసిలుతున్న అందెల శబ్దాలతో నేలపై శృంగారంతో నడుస్తూ ప్రపంచాన్ని తనవైపుకు తిప్పుకుందని, నడుము ఉందా లేదా అనే సందేహాన్ని కలిగిస్తూ చాలా సన్నగా ఉందని, అలాంటి రంభను తన శక్తితో గెల్చలేనని ఆకాశం మనసులో భావించిందట. 'తన సర్వస్వము రాగరంజిత వినూత్నస్వర్గ సౌందర్యమై/ చనవుల్ గుల్కు పదక్రమ స్వరలసచ్ఛబ్ద ప్రపంచంబునై/ చను రంభన్ భువి నస్తి నాస్తి విచికిత్సా హేతు శాతోదరిన్/ దన శక్తిం గెలువంగలేనని మదిన్ దర్కించె నాకాశమున్'

మనసులో శృంగార భావనలు అధికం కాగా నలకూబరుణ్ణి త్వరగా కలుసుకోవాలనే తపనతో వెళుతున్న రంభ కాలిగజ్జెల మంజుల నాదాన్ని విన్నాడు రావణుడు. అరణ్య మధ్యంలో ఈ మధురమైన అందెల శబ్దాలు ఎలా వినపడుతున్నాయి? మన్మథుడు ఎవరైనా యువతిని తనకు కానుకగా అందిస్తున్నాడేమో అని అనుకున్నాడట. 'అంత పౌలస్త్యుడీ కాననాంతరమున/ గాలియందెల కమ్మని కంఠరవము/ లెట్లు వినబడు? జవ్వని నెవతెనేని/ కాన్క వెట్టడుగా పుష్పకార్ముకుండు'

అలా ఒంటరిగా కనిపించిన రంభను రావణుడు అడ్డగించాడు. ఆశ్చర్యకరంగా మెరిసిపోతున్న ఆమె అందాన్ని చూశాడు. బిగువైనటువంటి, ఎత్తైనటువంటి స్తనాల అందాన్ని చూశాడు. మనసులోని బరువులన్నింటినీ తీసివేసే నడుమును చూశాడు. మనసులో కోరిక పుట్టగా రంభను ఇలా ప్రశ్నిస్తున్నాడు. 'అబ్బురపు కాంతులీను సోయగము జూచి/ నిబ్బరపు గబ్బి గుబ్బల నీటు జూచి/ యెడద బరువుల దించెడు నడుము జూచి/ కోరి తలయూచి మది వలపూర ననియె'

రావణుడు తన వాక్చాతుర్యాన్ని ప్రదర్శిస్తూ దేవవనితా! నీ ఓరచూపుల్లో (మోహంతో కూడిన చూపుల్లో) నీలోని కోరికలు స్పష్టంగా ఆరతి పట్టినట్లుగా కనబడుతున్నాయి. ఉందా లేదా అనిపించే నీ సన్నని నడుమును పట్టి ఆదరించే వాడెవడు? ఎవడు నీ కోసం భయంకరమైన తపస్సు చేశాడో కదా! చేస్తే మాత్రం నీ అందాలు అంతో ఇంతో మాకు కూడా లభించకుండా ఉండవు కదా! అని అంటున్న తీరు చూడండి. 'నీ వాల్జూపులలోని కాంక్ష లవిగో నీరాజనంబిచ్చె, నీ/ భావాభావ విలగ్నమున్ బుడికి సంభావించు వాడెవ్వడే/ దేవీ? నీ కొఱకెవ్వ డుగ్రతప మర్థిన్ జేసెనో? చేయుగా/ కో వేల్పుం జవరాల! నీ సొగసు లంతో యింతో మా కందవో!'

ఇలా మాట్లాడుతూ రావణుడు ఆశ్చర్యంతో రంభనే చూస్తూ నిలబడ్డాడు. వెంటనే ఆమె భయంతో తడబాటును పొందింది. చుట్టూ తిరుగుతుండే వ్యభిచారుల హృదయాలకు ఉచ్చులు బిగించే (వలలు వేసే) కాంతివంతమైన ఆమె ఓరచూపులు తడబడుతున్నాయి. సిగ్గులతో వెలుగొందే బుగ్గలు చెమటలు పట్టడంతో మిలమిల మెరుస్తున్నాయి. భయంతో తలను పైకెత్తలేక మెడ వంగిపోగా పావురం అరుపును స్ఫురింపజేస్తూ ఆమె గొంతు బొంగురుపోయింది. ఊపిరి విడిచినప్పుడు వంగుతూ, పీల్చుతున్నప్పుడు పెరుగుతూ వయ్యారంగా కదిలే స్తనాలు తడబాటుతో నాట్యం చేస్తున్నాయి. పిడికిలిలో ఇమిడిపోయే సన్నని నడుము క్రమక్రమంగా వణక సాగింది. చంద్రబింబంతో సమానమైన ముఖం వంగిపోయింది. అలాంటి స్థితిలోని రంభ వయ్యారపు చూపులు దశకంఠుడైన రావణుని మనసును కదిలించాయంటూ సీసపద్యంలో రంభలో కలిగిన మార్పులను అందంగా అక్షరబద్ధం చేసిన తీరు చూడండి. 'వలగొని విటచిత్తముల కురుల్ దగిలించు మెఱుగు వాల్జూపు తత్తరము లీన/ సిగ్గుదొంతరలలో నిగ్గులుదేరు బుగ్గలు చెమ్మటల మిలమిలలు దేర/ మొగమెత్తలేని వంపున గ్రుంగు గళములో కలరవమ్మొలయు గద్గదిక లురల/ నిశ్వాసముల కొగ్గి నిమ్నోన్నతంబులై కులుకు గుబ్బలు హళాహళుల గునియ/ అసలు పిడికిటిలోనిదే యగు వలగ్న/ మంత కంతకు జవజవలాడి పోవ/ నవనత ముఖేందుబింబయై యవ్వధూటి/ యోరచూపుల దశకంఠు నుల్లమూచి'

అప్పుడు రంభ రావణుని చూసి మహాత్మా! వంచన లేని నిండైన ప్రేమతో నా ఆనందాన్ని చూసి తృప్తి పరచగల యోగ్యమైన నలకూబరుని కలుసుకోవాలనే తలపులు తోస్తూ ఉండగా అలకా నగరం వైపు వెళుతున్నానని అంటున్న తీరు చూడండి. 'అరలేని కూర్మి నా సం/ బరమెంతయు జూచి దన్ను భవ్యుడు నలకూ/ బరు జేరు తలపు త్రోపుల/ బరువెత్తుచు నుంటి 'నలక' వైపు మహాత్మా'

ఆ మాటలు వినగానే రావణుడు తన కోరిక ఫలించినట్లుగా భావించి రంభను సమీపించాడు. తీగలను పోలిన ఆమె భుజాలను కోరికతో తట్టి నువ్వు ఇలాంటి కానిపని ఎందుకు చేస్తున్నావు? నీలాంటి గొప్పది మనసులో ఒకరిని కోరుకొని వాడి కోసం ఇలా పరుగెత్తుతుందా? అంటూ ఆక్షేపిస్తూ ఆమె గొప్పతనాన్ని వ్యంగ్యంగా తెలియజేశాడు. నీటిని, గాలిని, ఆకులను ఆహారంగా తీసుకుంటూ తపశ్శక్తితో ప్రకాశించే మునులు, నియమనిష్ఠలతో వికసించి యజ్ఞరహస్యాలలోఆరితేరినవారై సోమరసాన్ని తాగేవాళ్ళు, ఇల్లు, భూములు, ధనం, ఇల్లాలు లాంటి అన్ని బంధాలను వదిలిపెట్టే సన్యాసులు, వీరత్వాన్ని కళాత్మకంగా ప్రదర్శిస్తూ చివరకు తమ తలలను కూడా బలిపెట్టే వీరులు వ్యభిచారులై నీ ఇంటి దగ్గర్లో తిరుగుతూ బాధపడుతుంటారట. నీ పైట చెంగు తగిలినంత ధన్యులైనట్లుగా భావిస్తారట. అలాంటి రంభవైన నువ్వు ఇతరుల కోసం పోవడమా అని అధిక్షేపిస్తున్న తీరును సీసపద్యంలో ఇలా చిత్రించారు. 'అంబు సమీర పర్ణాహారులై తపస్సుల నిగ్గుదేఱు మౌనుల గణంబు/ నియమ నిష్ఠా సమున్మీలితాధ్వర మర్మ పారదృశ్వుల్ సోమపవ్రజమ్ము/ ఇండ్లు భూములు సిరు లిల్లాలు మొదలుగా నఖిలంబు విడుచు సన్యాసి గణము/ వీర విక్రమ కళా విహరణంబుల దలల్ బలివెట్టినట్టి వీరుల కులంబు/ మింతలై మీదు భవనోపకంఠములను/ దిరిగి వేసారి నీ పైట చెరగు సోకి/ నంత ధన్యులమని యెంతురంట, యిట్టి/ నీవు రంభవు పరులకై పోవుటేమి!'

రంభ రావణుడు తనను కామిస్తున్న విషయాన్ని గ్రహించి దానవేశ్వరా! పరిమితులు లేని ప్రేమను మనసులో నీ పట్ల కలిగినవారై, నిన్ను పొంది కామభోగాల్లో పరవశించాలనే బుద్ధితో తమ జీవితంలోని సంతోషాలన్నింటినీ ధాన్యపుగాదెలా ఒకచోట పేర్చి శరీరపు బిగువులతో, కాంతితో తొణికిసలాడుతున్న యవ్వనాన్ని ధన్యం చేసుకోవాలని పూల లాంటి సుకుమారమైన, అందమైన యువతులు ఎంతోమంది నీ దయ కోసం ఎదురుచూస్తున్నారు. అలాంటిది నన్ను కోరడం మీకు తగునా? అంటూ ఇలా ప్రశ్నించింది. 'అపరిమితానురాగ నిబిడాంతరులై నిను బొంది కామ భో/ గ పరవశాత్మ జీవిత వికాసము లెల్లను గాదెబోసి గు/ త్తపు జిగిజవ్వనంబు జరితార్థము జేసెడు పూవుబోండ్లు నీ/ కృపకయి వేచియుండ దగునే నను గోరగ దానవేశ్వరా!'

రంభ ఇచ్చకపు మాటలు విని రావణుడు మనసులో ఉన్న మోహం వల్ల, మన్మథ బాణాల తీవ్రత వల్ల కోపం రాగా చిగురాకులా ఎర్రగా ఉన్న ఆమె చేతిని పట్టుకొని ఆమెతో ఓ తరుణీ! నీ అభిప్రాయాన్ని ఇంతసేపు వినిపించావు. ఇలా చాకచక్యంగా మాట్లాడే నేర్పులు నీకు కొత్తేమీ కాదు. అవి మాకు రుచించవు. అహంకారంతో తుళ్ళిపడుతూ మన్మథుడు విల్లును ఎక్కుపెట్టాడు. అతని మోసాలు అణచడానికి అనుగ్రహించి

నాకు తోడ్పాటునందించమని ఇలా కోరాడు. 'నీ మత మింతవట్టు తరుణీ! వినిపించితి విట్టి నేర్పు లో/ కామిని! నీకు గ్రొత్తలును గావు, వినన్ జవి గావు మాకు బే/ రామున ద్రుళ్లి మారు డబలా! యదిగో ధనువెత్తె, వాని మా/ రాము లడంప దోడువడ రా జవరాల! యనుగ్రహింపవే!'

చంద్రుడు, మన్మథుడు, గాలి ఇంకా తక్కినవాళ్ళు తనకు ఎదురు తిరిగారని, ఈ అరణ్య ప్రాంతంలో విరహావస్థలో ఉన్న తనకింక తోడు ఎవరని, అందమైన, బలమైన, గుండ్రనైన నీ ఎత్తైన స్తనాల్లో ఒదిగి ఉంటానని, ఆ రహస్యపు స్థలాన్ని తనకు ఇవ్వమని రావణుడు రంభను కోరాడు. ఈ రాత్రి సౌఖ్యసంపదలకు హద్దెందని, తనతో పాటు ఆమె కూడా అక్కడకు రావడం వల్ల అదృష్టం ఎక్కువైందని, వేదభాగాలను చెప్పి సంపాదించే పుణ్యాలను కుప్పలుగా పోసి అడుగుతున్నట్లు తెలిపి తన సౌందర్యపు నేర్పును ప్రదర్శించి తనతో సుఖించమని రావణుడు రంభను కోరాడు.

రావణుడు ఇలా మాట్లాడుతూ కోరికతో రంభను ముద్దుపెట్టుకోబోయాడు. అది గ్రహించి రంభ కొద్దిగా దూరం జరిగింది. పెడచేతితో ఆపింది. వినయం, భయం, నిశ్చయం లేక ఆలోచన అతిశయించగా రాజు నిరుపేదల సంపదలను పూర్తిగా దోచుకోడానికే ప్రయత్నిస్తాడని, మీలాంటి వాళ్ళు ఇంత అవివేకంతో వ్యవహరిస్తారా అంటూ నిలదీసిన తీరు చూడండి. 'అని కసి ముద్దులాడ జనునాతని కించుక దూరమౌచు జ/ య్యన పెడచేత నాపి, వినయంబు భయంబు వివేచనంబునున్/ బెనగొన రాచవారు నిరుపేదల భాగ్యము లూచముట్టుగా/ గొన దమకింతు, ఇంత వెడగుందనమా! మిము వంటి వారికిన్'

వసంతకాలపు రోజులు రెచ్చగొట్టాయని తట్టుకోలేక తనను అడ్డగించి బలవంతంగా మీదకు రావడం సరి కాదని, తానేమీ సంతలో కోరికలను అమ్ముకొనేటటువంటి ఫలసాయం కాదని, తమలాంటి వాళ్ళు అహంకారంతో ఇలా తప్పుదారి తొక్కడం తగదని, సాటివారిలో అవమానకరమని రంభ రావణునితో అంటుంది. వేగంగా రేకెత్తుతున్న భావాలతో ఎక్కువగా పరవశాన్ని పొంది తడబడుతూ పిచ్చిపిచ్చిగా ప్రేమలు ఫలించాయనుకుంటూ ఊరకే బాధపడడం లేక సంఘర్షణకు లోనుకావడం దేనికి? మనసును అదుపులో పెట్టుకోలేవా? బలంతో, నిగ్రహంతో హిమాలయ పర్వతాన్నే ఎత్తగలిగినవాడివి ఒక మహిళ దగ్గర నీరుగారిపోతున్నావా? అంటూ రంభ రావణున్ని ఇలా వారించబోయింది. 'వడి వడి లేచు భావముల వఱ్ఱున సోలుచు లేని పోని సం/ దడి బడి వెఱ్ఱి మొఱ్ఱి మమతల్ ఫలియింపగ జూచి, వట్టి రా/ యిడి పడనేల? గుండె బిగియింపగ జాలవె? వెండికొండ నె/ త్తెడు బలనిగ్రహంబు లిటు తీరినవే యొక లేమ చెంగటన్'

రంభ తాను ప్రస్తుతం మన్మథుని మిత్రుడైన నలకూబరుని కోసం వెళుతున్నట్లు తెలిపి అందువల్ల తనను అడ్డగించవద్దని రావణుణ్ణి కోరింది. మీలాంటివాళ్ళను సంతోషపెట్టి అతిశయమైన వేడుకల్లో కామింప గలిగే లేక ప్రీతి పొందించ గలిగే అదృష్టం తమలాంటి వాళ్ళకు ప్రాప్తించలేదని తెలుపుతున్న తీరు ఇలా వర్ణింపబడింది. 'వలరాచవాని నెచ్చెలి/ నలకూబరు గోరి నడుచు నన్నాపకు, మి/ మ్మలరించి యించు వేడ్కల/ వలపించెడు భాగ్య మబ్బవలదా మాకున్'

రంభ ఇలా చెప్పగా, రావణుడు 'ఓ రంభా! నీకు వివేకం మందగించింది. నీ చిత్తవృత్తికి ఇది అనుకూలించదు. మేలుకొని నీ కులాన్ని అంటే దేవవేశ్యవనే విషయాన్ని గుర్తు తెచ్చుకో. నిన్ను నేను కోరడం కాని పని అని, నువ్వొక పరస్త్రీవి అన్నట్లుగా మాట్లాడుతున్నావు. నేను నీతో సుఖించడానికి అర్హత లేనివాడినా? నా విజయగాథలతో కూడిన కావ్యాలను నువ్వు వినలేదా? ఎందుకిలా నాతో అనవసరంగా మాట్లాడిస్తున్నావంటూ తన గొప్పతనాన్ని తెలియజేశాడు. నా ముత్తాత అయిన బ్రహ్మదేవుడు నేనుండే చోటికే వచ్చి నన్ను బుజ్జగించి వేదాల అర్థాన్ని వివరించాడు. నా తపస్సులను మెచ్చి నా దగ్గరకు వచ్చి నేను కోరిన వరాలిచ్చి సంతోషపెట్టాడు. ఎంతో ఆసక్తితో తానే ముందుండి లంకలో నా కాపురాన్ని చక్కబెట్టాడు. నాతో తలపడే శత్రువీరుల గుట్టుమట్టులన్నీ చెపుతాడు. కంటికి రెప్పలా నన్ను కాపాడుతూ నాకు సకల శుభాలు కలిగిస్తుంటాడు. అంతటివాడి దయకు నోచుకున్న నేను పుణ్యం లేనివాడి ననుకుంటున్నావా? అంటూ రంభను ఒప్పించే ప్రయత్నాన్ని సీసపద్యంలో చెప్పిన తీరు చూడండి. 'నన్ను లాలించి నేనున్న చోటికి వచ్చి పరమ వేదార్థ భావముల జెప్పు/ నా తపస్సుల మెచ్చి నను జేరి యర్థించి వరముల నిచ్చి సంబరము నించు/ తానుగా ముందుండి తత్పరత్వము తోడ లంకలో నా కాపురంబు దిద్దు/ పనివడి నను దాకు వడిగల వీరయోధుల నెల్ల జెండాడు మెలపు జెప్పు/ కంటికిని ఱెప్పగా మము గాచి శుభము/ లన్నిటి నొసంగు ముత్తాత యబ్జభవుడు/ అతని కృపకు బాత్రుండ నాయంతవాడు/ పుణ్య మబ్బని వాడొకో పువ్వుబోడి!'

రంభా! ఎందుకు ఊరకే వ్యర్థమైన వాదనలు చేస్తావు. సకల వైభవాలతో అలరారే నాతో సంగమించు. అధికారాలు పొందుతావు. శుభాలు పొందుతావంటూ రావణుడు రంభను ఒప్పించే ప్రయత్నం చేశాడు. ఆమెతో సంగమించడానికి వీలుగా కౌగిలించుకోబోయాడు. రంభ భయంతో చేతులు అడ్డుపెట్టి ఆపింది. కొంత ధైర్యం తెచ్చుకొని ఆలోచించింది. రావణుని అడ్డగించడం ఎవరి వల్లా సాధ్యపడదని గ్రహించింది. కుబేరుడు, రావణుడు ఇద్దరూ అన్నదమ్ములు. అందువల్ల రంభ తాను కుబేరుని కొడుకైన నలకూబరుని భార్యనని, కోడలినని మరోసారి గుర్తుచేస్తూ మామా! నా దారిన నన్ను పోనివ్వు. నా పనిని నిందిస్తూ పౌరుషానికి పోవద్దు. సకల భోగభాగ్యాలు మిమ్మల్ని వరించగానే వచ్చి సేవిస్తాను. నువ్విప్పుడు దయ చూపకపోతే కోరిక, లోభం లేక పగ నన్ను ముంచాయని బాధల్లో ఉండిపోవాల్సి వస్తుందని రంభ రావణుణ్ణి బతిమాలుతున్న విధానాన్ని చూడండి. 'మము మా పోకల బోవనిమ్ము, చనుమీ మా జోలి పోనాడి పం/ తము మాపై దలపెట్టబోకు, సతతోద్యద్భోగ భాగ్యంబులున్/ మిము బొందన్ భజియింతు, నీవిటుల నెమ్మిన్ జూపలేకున్న గా/ మము, కార్పణ్యము మమ్ము ముంచెనని చింతలం బ్రుంగెదన్'

ఇలా బతిమాలే రంభను చూసి రావణుడు ఇదేమి ఆడతనమన్నాడు. రంభా! రావణుడు కాముకుడై రంభను చెరపట్టాడనే అపవాదు నాకు వస్తుందని నువ్వు గ్రహించడం లేదు. నేనొక లక్ష్యసిద్ధి కోసం లోకమంతా తిరుగుతున్నాను. నాకు ఎన్నో శాపాలున్నాయి. ఎంతోమంది నన్ను నిందిస్తున్నారు. వాటికి బెదరిపోయి పుట్టుకకో విందు లాంటి, లోకంలోనే గొప్ప నేర్పరివైన నీలాంటి దాని పొందును మానలేను. అయినా పలు యజ్ఞాలను చేసి పొందే ఫలితం ఇదే కదా! అంటున్న తీరు చూడండి. 'నేనొక లక్ష్యసిద్ధికి

పనిన్గొని లోకము చుట్టుచుంటి, నా/ పై నిలువెల్ల నిందలు నెపంబులు శాపము లున్నవైన, న/ వ్వానికి బమ్మరించి నినువంటి జగా నెఱజాణ పొందు జ/ న్మానికి విందు, మానగలనా! బహుయజ్ఞ ఫలంబిదే కదా!'

ఇలాంటి విపరీతమైన బుద్ధి పుట్టడానికి కారణం గతజన్మల్లో చేసిన పనుల వల్ల లభించిన పాపమో, దేవతలు, మునులు పెట్టిన శాపమో, పరమేశ్వరుని ఆజ్ఞయో నాకు తెలీదు. ఏది ఏమైనప్పటికీ నా మనసులో ఈశ్వర పాదభక్తి, మన్మథ సంబంధమైన భోగాల పట్ల ఇష్టం స్థిరంగా ఉంటాయంటూ రావణుడు రంభకు ఇలా వ్యక్తీకరించాడు. 'ఈ విపరీత బుద్ధి జనియింపగ హేతువు జన్మకర్మ సం/ భావిత పాపమో, సురలు మౌనులు పెట్టిన శాపమో, భవా/ నీవిభు నాజ్ఞయో తెలియనేర జుమీ! యెదియెట్టులైన నా/ భావము బాయ వీశ పదభక్తియు, భావజ భోగరక్తియున్'

రావణుడు రంభతో ఇంకా మాట్లాడుతూ తపస్సులు చేసి సిద్ధిని పొంది, నిరంతరం వేదాల్లో, స్మృతుల్లో చెప్పిన నడవడిక కలిగినవాళ్ళలో నేర్పరులైనవాళ్ళకు ఇలాంటి కోరికలు కలుగుతాయా అని అనవద్దు. శ్రేష్ఠులైన ఋషులు కూడా దేవతాస్త్రీల విలాసవంతమైన కడగంటి చూపులనే ఉచ్చులో పడిపోయి తిరుగుతూ ఉండడాన్ని చూడవా లేక లెక్కపెట్టవా? ఆ సుఖాన్ని నీచమని అనగలవా? ఈ లోకమంతా కారణ కార్యాలతో ముడిపడి ఉంది. అంటే ప్రతి పని వెనుక ఏదో ఒక కారణం ఉంటుంది. అందులోనూ జన్మసంస్కారాన్ని బాగా పరిశీలిస్తే ఆలోచనలు ఎందుకు పుడతాయి. నిరంతరం ఆచారాల పట్ల శ్రద్ధను కలిగి ఉండడం కీర్తి కారకమే కావచ్చు. అట్లని సుఖాలు కోరరానివి అవుతాయా? నాకు సుఖాలు, సంపదలు రెండూ లభించాయి కదా! అంటూ రంభను రావణుడు తన సంభాషణ చాతుర్యాన్ని ప్రదర్శిస్తూ ఒప్పించే ప్రయత్నం చేస్తున్న తీరు చూడండి. 'కారణ కార్య మిశ్రితమెకా జగమంతయు, నందు జన్మ సం/ స్కారము బాఱజూచిన విచారము లెందుకు బుట్టు, సంతతా/ చార పరాయణత్వము యశస్కరమే యగుగాక, భోగముల్/ కోరగ రానివౌనె? సమకూడవె నాకును భోగభాగ్యముల్'

రంభా! కోరికను తెలుపలేని ప్రేమనా నీది. మన్మథుని హింసకు లేక నిర్భంధానికి స్వాధీనమై కూడా ఎందుకు నటిస్తున్నావు. అందరికీ తెలిసేలా దేవేంద్రుని సభలో నేత్రోత్సవంగా వయ్యారంగా నాట్యాలను చేస్తూ పారవశ్యాన్ని కలిగించే నేర్పరివి నువ్వు. ఇప్పుడు ప్రియుని కోసం సంకేతస్థలానికి పోతూ కూడా మనసులో ఇంకా ఎందుకు దాగుడుమూతలు ఆడుకుంటూ నిన్ను నువ్వే మోసం చేసుకుంటున్నావంటూ రావణుడు సంభాషణ చాతుర్యాన్ని చూపుతూ ఒప్పిస్తున్న తీరును చూడండి. 'అభిరుచి తెల్పలేని వలపా! వలరాయని బారి కగ్గమై/ యభినయ మేల సేసె దబలా! బయలెక్కి బలారి కొల్వులో/ సుభగ విలాస లాస్యముల జొక్కాన గూర్చెడు జాణ విప్పు డీ/ యభిసరణంబు గూర్చి హృదయంబున దాగుడుమూత లాడెదో!'

రావణుడు అలా అనగానే రంభలో కొన్ని మార్పులు కలిగాయి. ఆమె శరీరంలో విలాసచేష్టలతో కూడిన గగుర్పాటులాంటి శృంగారచేష్టా విశేషాలు పుట్టాయి. పూచిన తీగలాంటి ఆకారాన్ని పొంది సిగ్గుపడింది. తలను వంచి చూపుల మెరుపులు కడగంటి చూపుల్లో వ్యాపింపజేసింది. అలాంటి చూపులతో రాక్షసరాజైన రావణుని చూస్తూ తనలోని కామవాంఛను వ్యక్తం చేస్తూ చిగురులాంటి పెదవిని ముందువైపున్న పంటితో కొరుకుతూ నిలబడిందంటూ కవి రంభలో ఆ క్షణంలో కలిగిన మార్పులను ఇలా వర్ణించారు. 'అన విని హావభావ పులకాంకురవత్ కిలికించితమ్ములన్/ మొనసిన మేనితో నిలువు పూచిన తీవియ వోలె రంభ సి/ గ్గున దలవంచి చూపు మెఱుగుల్ కడకన్నుల బర్వ రాక్షసేం/ ద్రుని గనుగొంచు నిల్చె జివురుం బెదవిన్ మునిపంట నొక్కుచున్'

రావణుని మనసులో ఒక్కసారిగా కోరికలు విజృంభించాయి. మన్మథుని పూలబాణాలు ఆయనలోని ఓర్పును ముక్కలు చేశాయి. తొందర ముందుకు నెట్టింది. స్వేచ్ఛగా పశువులాగా సంభోగించాలనే భావనతో కూడిన గర్వం కళ్ళు మూసుకుపోయేలా చేసింది. అధికమైన మోహంతో బలమైన చేతులతో రంభను కౌగిలించుకొని స్వాధీనం చేసుకున్నాడు. ఇంతలో కోయిల వాళ్ళ సంగమాన్ని స్వాగతిస్తూ మధురంగా కుహూ కుహూ అని ఆలపించింది అంటూ కవి విరహంతో బాధపడుతున్న వాళ్ళిద్దరూ ఏకమైన తీరును ఇలా అందంగా చెప్పి కావ్యాన్ని ముగించారు. 'మనసున గోరికల్ నిగుడ బాణము లేచి తాలిమిన్/ దునియలు సేయ దత్తరము ద్రోయ బశూద్ధతి గన్నుమూయ హె/ చ్చిన తమకంబుతో బిగియు చేతుల సందిటబట్టి రంభ లో/ గొనె దశకంఠు, డింతటను గోయిల బాడె కుహూ కుహూ ధ్వనిన్'.

❖ ❖ ❖

ఈనాటి కథా సాహిత్యంలో అలసిన మనసుకు 'గట్టిగింజలు' పిల్లతెమ్మెర లాంటివి. ఇవి ఎండలా, వెన్నెల్లా, వసంతంలా, గ్రీష్మంలా సహజంగా ప్రకృతి సిద్ధంగా ఉన్నాయి. ఇందులో పల్లెజీవనం పరువులు పెడుతున్న పరువంతో ప్రత్యక్షమవుతుంది. ఇవి జనజీవితాన్ని ప్రతిబింబించిన కథలు. కాల్పనికత అంతగా స్ఫురించదు. ఒక జరుగుతున్న సంఘటనను రచయిత చెప్తున్నట్లుంటుంది. అన్నింటిలోనూ సామాన్యుని జీవితాన్ని చిత్రించడానికి ప్రయత్నించిన రెడ్డిగారిని అభినందిస్తున్నాను.

**– దాశరథి రంగాచార్య**



**మరకా సూర్య నారాయణ రెడ్డి**
సెల్ 9440018958

## వ్యవసాయ నిఘంటువు లాంటి సాహిత్యం అందించిన 'వై.సి.వి రెడ్డి'

వ్యవసాయం (పంట, ధాన్యం, ఆహారం, ఇత్యాది), వైద్యం (రోగాలు, మందులు, వైద్య విధానాలు మొ॥) అనాదికాలము నుండి ఈనాటి దాకా అభివృద్ధి చెందుతూ వచ్చిన శాస్త్రాలకు సంబంధించిన పదాలు నిఘంటువుల్లో అతి తక్కువ నమోదుగా వున్నాయి. తెలుగునాట వున్న ప్రముఖ నిఘంటువులు 1) సూర్యరాయాంధ్ర, 2) శబ్దరత్నాకరం. మానవుడి ప్రాణాల్ని నిలబెట్టే వ్యవసాయం, వైద్యం, రెండు రంగాలకు సంబంధించిన తెలుగు పదాలు, వీటిలో లేకపోవడం విచారకరం. అక్కడక్కడ వున్న సంస్కృత సమం ఇచ్చారు తప్ప, ఆ పదానికి / ఆ రూపానికి అర్థం కూడా తెలుగులో ఇవ్వలేదని ఒక వ్యాసములో తెలిపారు.

**– జయధీర్ తిరుమల రావు,** ప్రముఖ భాషా పరిశోధకులు

తెలుగు భాషలో తెలియనివి, తెలుసుకోవలసిన పదాలకోసం ప్రముఖ నిఘంటువుల నందు వెతికినా మనకు దొరకవు. మనదేశములో ఎక్కువ మంది వ్యవసాయము మీద అధారపడి జీవిస్తున్నారు. రైతులు, కూలీల వద్ద పుష్కలంగా పదాలు దొరుకుతున్నవాటిని రికార్డు చేయడం, నిఘంటువులు తయారు చేసుకోవడం లేదు. అయితే రెడ్డి గారు తన సాహిత్యముద్వారా కొంత వరకు న్యాయం చేసారు.

శ్రమైక జీవన సౌందర్యాన్ని తన సాహిత్యం ద్వారా అందించిన మహానుభావుడు యమ్మనూరు చిన్న వెంకట రెడ్డి (వై.సి.వి.రెడ్డి). పులివెందుల తాలుకా బోనాల గ్రామానికి చెందినవారు. వ్యవసాయమే జీవనాధారంగా చేసుకొని, జీవించే పల్లె ప్రజలు చేతల్లోను, మాటల్లోనూ, నిత్యం ప్రకృతి వడిలో జీవితం గడిపే కష్టజీవులు. కష్టాలు, బాధలు మరిచిపోవడానికి పల్లెపదుచులు యాలపాటలతో ఆనందిస్తూ గడుపుతారు.

పల్లె జీవితములో వారు చేసే పనిలో, రైతులు వాడే పనిముట్లు వారి జీవితములో భాగమే. పనిముట్లు, పైర్లు, వారి చుట్టూ వున్న సాధనాలు వాటి పేర్లను తన సాహిత్యములో ఇనుమడించుకున్న కవి వాటిని అక్షర రూపములో పెట్టి ముందుతరాల వారికి అందించిన కృషీవలుడు.

స్వయంగా రైతు బిడ్డ అనుభవించిన పల్లె సీమలో పచ్చని పంట పొలాలు. మంచెలపై కోకిల గానముతో పరవశించాడు. అందుకే తన రచన 'తొలకరి చినుకులు' తోనే ప్రారంభించారు.

## రెడ్డి సాహిత్యంలో కొన్ని గేయాలు

'సిందూర రేఖ' పద్యకావ్యంను 1953లో రాశారు. 'రాయభారం' కావ్యాన్ని 'గాసగానికి 'అంకితం చేశారు. వారి కథల్లో కూడా వృత్తి పదాలు, మాండలికాలు ఎక్కువగా చోటు చేసుకున్నాయి.

**ఒకనాటి యీ యూరి సుకములకై పూని**
**కళల గేయుచు 'ముల్లుగట్టె' బట్టె**

1) ముల్లుకట్టె = ఎద్దులను అదిలించడానికి 4, 5 అడుగులు పొడవైన వెదురు కర్రకు ముందు భాగములో ఒక ఇనప ముల్లు అమర్చి వుంటుంది. ముల్లు కర్రతో పొడవడమువల్ల ఎద్దులు ముందు కెళ్ళుతాయి.

**ఒకనాటి యీ యూరి యన్నతికైరేగి**
**పోటోడ్డితా 'చిల్ల పోటు' బట్టే**

2) చిల్లపోటు = కవిల (బావిలోని నీరుతోడటానికి కవిల ద్వారా నీటిని పంట పొలాలకు అందించడం, ప్రస్తుతం మోటర్ ద్వారా నీటిని తోడుచున్నాము.) తోలేటప్పుడు మోకుకు వార్నేను అనుసందానముగా వాడేది 'చిల్ల పోటు' ఒక మూర పొడవు కలిగిన కొయ్యను వాడుతారు.

**ఒకనాటి యీ యూరి సకల విద్యలకునై**
**తడివెట్టి పులినీటి మడవలేసే**

3) పులినీటి మడవ = పులదడి అనికూడా అంటారు. విత్తనం తరువాత మళ్ళీ భూమి పైన తక్కువ నీటితో తడపడం, దీనివల్ల విత్తనం నకు నీరుఅందని వాటికి పులితడివల్ల నీరంది విత్తనాలు అన్ని మొలకెత్తడం జరుగుతుంది.

**ఒకనాటి యీ యూరి తకరార్ల కై తూగి**
**మిన్నుల కెగ జూచి మన్ను ముంచె**
**కోడి కూతలతో చెలకోల ముల్లు**

4) కోడి కూత = తెల్లవారు జామున సుమారు నాలుగు గంటల సమయములో పుంజు కోళ్ళు 'కొక్కొరొకో' అంటూ అరుస్తాయి. కోడి కూత విని, తెల్లారవచ్చిందని రైతులు లేసి వ్యవసాయము, ఇంటి పనులకు సిద్ధమౌతారు.

5) చేల కోలముల్లు = ఎద్దులను తోలడానికి చేలకోల తో వాటిని కొట్టడానికి వాడుతారు. చేలకోల మూరెడుపైన వున్న కర్రకు చర్మము (తోలు) తో తయారు చేస్తారు. కర్రకు చివర ముల్లు వుంటుంది. ముల్లుతో పశువులను పొడుస్తారు.

**గట్టె పట్టిన చేతుల కాటవిడువు**
**మిట్ట మధ్యాహ్నమే నడివెట్ట వెరచు**
**గాలిలో మూగుటూర్పులు కలిసిపోయే**
**ఎరవు వెంపలి – మట్టితో నేవు మీద**

6) ఎరువు వెంపలి = పశువుల పెంటను ఎరువు అంటారు. వెంపలి ఇదొక చిన్న మొక్క బంజరు పొలాల్లో పెరుగుతుంది. అడుగు ఎత్తు కలిగిన చెట్టు. ఈ చెట్టును పరకలుగా తయారుచేసి పశువు శాలల్లో కసువు ఊడవడానికి వాడుతారు. కసువు పంటలకు మంచి సత్తువ కలిగిన ఎరువు. 'వెంపలి చెట్లకు దోట్లు వేసేరకం' అంటూ వుంటారు. అతి తెలివైనవాడని, ఇక వెంపలి మొక్కలను పొలములో పచ్చిరొట్ట ఎరువుగా వాడుతారు.

**కలిపి – చేలకు తోలితి మలివి గాని**
**సంబరమ్ములు కనులలో జూలువార**
**గెట్టు వారల వరకును – చెట్టుపుట్ట.**

7) గెట్టు వారల = పొలములో తమహద్దులు చివరి వరకు కలిగిన పొలం గెట్టు అంటారు. గట్టు చివరను వారల అంటారు. వారల అనగా చివరివరకు సేద్యము చేయడమువల్ల భూమి కలిసి వస్తుంది.

8) చెట్టు పుట్ట = గెట్టులో చెట్లు ఎపుగాపెరిగి వుంటాయి. ఉదా: వేప, చింత మొదలైన చెట్లు. పుట్ట గెట్టుల్లో మట్టి ద్వారా ఎత్తుగా భూమిలోని మట్టితో పుట్టలు గా వుంటాయి వీటిని పాములకు నిలయముగా భావిస్తారు. ఈ పుట్ట మన్ను సతవ (సారవంతమైనది) ఎక్కువ అందువల్ల పొలానికి పుట్ట మన్ను చల్లుతారు. చెట్టు ఆకులూ పుట్టమన్ను పైర్లకు సత్తువ.

**కమ్మరికి కుమ్మరికి గూడు కలములబ్బే**

9) కమ్మరి = ఇనుము కరిగించి కొలిమి ద్వారా కావలసిన ఆకృతిలో వ్యవసాయ పనిముట్లు తయారు చేసే వారిని కమ్మరి వారు అంటారు. కత్తులు, కొడవళ్ళు, గునపాలు, పలుగులు, ఇలా వివిధ ఇనప వస్తువులు తయారు చేస్తారు. గతములో ప్రతి పల్లెలో ఈ వృత్తి చేసేవారు వుండేవారు. విశ్వబ్రాహ్మణులు, ముస్లిములు ఈపనులు చేసేవారు.

10) కుమ్మరి = మట్టితో కుండలు చేసేవారు. బానలు, కడవలు, మూకట్లు వంట పాత్రలు తయారు చేసేవారిని కుమ్మరివారు అంటారు. ఇప్పటికీ వీరు మట్టితో చేసే కుండల నీరు చల్లగా ఉంటాయని, ఆరోగ్యానికి మంచిదిగా భావిస్తారు.

**వెట్టి యానాది కూడా నవ్వించే సతిని**

11) వెట్టి = నీరు కట్టేవారు. యానాది = పొలము కాపలా వుంటూ పంటలను రక్షించువారు. వీరు గిరిజన తెగకు చెందినవారు.

**ఎలుక బొరకల ధాన్యముల్ గలుగు నంచు**
**వాన గురిసినదంచు భావముల పొంగి**
**కొండలకు పోయి కన్నెల కొత్త గడ్డి**
**కోసి మోపులుగా తెచ్చి కోడేలకును**
**అడ్డమాగెల లేక గోర్లాకు పెరిగే**
**గోర్ల ఆకు ఇది ఒక రకమైన గడ్డి**
**పశువుకు మేత కు వినియోగిస్తారు.**
**చేని సతవంత పెరుకు నంచేను – గడ్డి**

**అన్నపూర్ణలు మయూరి ఆడువారు**
**ముద్దు కూళుళ్ళు సంగటి ముద్దలెత్తి**
**కంకి పై సుంకు మోసెన్ – కలుచపెడిసే**

12) కంకి పై సుంకు = జొన్న, సజ్జ, లాంటి పైర్లకు కంకులు గింజలు తయారు కావడానికి ముందుగా కంకి చుట్టూ పుప్పొడి లాంటిది కప్పుకొని వుండేది సుంకు.

**పిసుకుల్లు ముక్కల నటమటించి**

13) పిసుకుల్లు = కంకి కావడానికి మొదట లేత విత్తనాలు ఏర్పడుతాయి, వీటిలో పాలు వుంటాయి తినడానికి తీయగా వుండి రుచిగా వుంటాయి. తరువాత ముదిరి విత్తనాలు అవుతాయి.

**మంచెల మిరించి వోడిసెల్ల చంచులవియ**

14) మంచె = పంట పొలాల్లో పక్షులు, అడవి జంతువులూ, పశువులు, నుండి రక్షించు కోవడానికి నాలుగు వైపుల కట్టెలు (గుంజలు) నాటి పైన పొలం కనిపించేటుగా గుడిసె లాగ ఏర్పాటు చేసుకొనేదే 'మంచే' అంటారు.

15) ఒడిసెల = పశువుల చర్మమును ఒక జానెడు పొడవు బెత్తెడు వెడల్పు ఆకారము నకు రెండు వైపులా చివర్లలో మీటర్ పొడవు కలిగిన తాడు ఏర్పాటు చేసుకొని తోలులో ఒక రాయిని విసరడం. దూరముగా వున్న పశువులు, పక్షులు తోలడానికి వాడుతారు.

**కొట్టి తోలితి మాయేడు – కొంచమైన**
**కందికాయలు అలసంద కాయలనప**
**కాయలుడికించి తిన్నాము కడుపులుబ్బ**
**కొర్ర కోతలు కొసి కోకొల్లలుగను**
**గాదెలను కందనమ్ముల గంప మోత**

16) గాదెలు = వెదురు కర్రలను చీల్చి గుండ్రముగా, లేదా చతురస్రా కారముతో 4, 5 అడుగులు ఎత్తు తో తయారు చేస్తారు. ఇందులోధాన్యం నిల్వ చేస్తారు.

17) కందనాలు = ఇవి ధాన్యము నిల్వ చేయడానికి నిర్మించినవి. రాతి బండలు నలు వైపులా వుండి పైన కప్పు ఏర్పాటు చేస్తారు. మధ్యలో మనిషి లోపలి వెళ్ళడానికి మార్గము వుంటుంది, ఆ ద్వారానికి మూత బండ ఏర్పాటు చేస్తారు.

**నింపి రైతింట సంబరాల్ నింపి నాము**
**గుంత మూకట్లు నిండుగా కోరినంత**

18) గుంత మూకట్లు = మూత వేయడం 'కుండలను మూకటి' ద్వారా కప్పడానికి వినియోగిస్తారు. కుండల్లో కి ఈగలు,పురుగులు పోకుండా ఉండటానికి మూత ను వాడుతారు. గుంత మూకటి = అన్నము తినడానికి తట్టకు బదులుగా వాడుతారు. వీటిని మట్టితో తయారు చేస్తారు.

**గట్టి పెల్లల అన్నము - కందిపప్పు**
**కొండరాళ్ళను పీకించి మండుటెండ**
**సమ్మెటల పగుల గొట్టించిసాపుబండ**

19) సమ్మెట = ఇనుముతో తయారు చేస్తారు. ఇనుముకు మధ్యలో గుండ్రని బొరకలో కొయ్యను దించి, కొయ్యను చేతితో పట్టుకొని రాళ్ళు పగల కొట్టడానికి వినియోగిస్తారు.

**లన్ని బండ్లకు నెత్తించి అడుగు నుండి**
**కట్టకము గట్టి గింజల రాశితోసి**
**మడకదుంప కావాలని - మాపటేల తుమ్మకొమ్మ**
**కొట్టేందుకు పోవాలని - కొట్టి మోసి తేవాలని**
**మునిమాపుల బయలుదేరే - మాపున గొడ్డలి బూనుసు,**

20) ముని మాపుల = ప్రొద్దు కునికే వేళ.

**దూరినాడు తారినాడు - తుమ్మల కంపల్లో**
**కన్నుగుట్ట చీకట్లో - కంప మండ తగలకుండ**
**మబ్బుననే మడక దుంప - మొద్దొక్కటికొట్టినాడు**
**చొప్ప వామి వెయ్యాలని చొప్పదోల పోవాలని**

21) చొప్ప వామి = జొన్న, సొద్ద గడ్డిని కలములో భద్రపరిచి ఏడాది పొడుగునా పసువులమేత కోసం నిర్మించే దానిని 'వామి' అంటారు.

**పెద్ద గుజ్జు చిన్నగుజ్జు పెద్ద నాట్లు గుజ్జులబడే**

22) పెద్ద గుజ్జు = ఎద్దుల బండిలో పంటలు పొలము నుండి తెచ్చు కొంటారు. బండిలో పంటను భద్రముగా తేవడానికి బండి మధ్య భాగములో దోని పీటకు ఎత్తుగా వుండే కొయ్య 'వై' ఆకారములో వుంటుంది, రెండు పెద్ద బడేలను కలుపుతూ ఒక బారెడు కొయ్యను ఏర్పాటుచేస్తారు. దీనిని 'నడంబడే' అంటారు.

23) చిన్న గుజ్జు = బండి చివర నగకు ఒక రంధ్రం వుంటుంది, ఇందులో చిన్నగుజ్జు ఉంచుతారు, నాట్లు రెండు మొరుమానుకు రెండు వైపులా 4, 5 అడుగుల ఎత్తు వుంటాయి.మొరుమాను నుండి వంపుగా పెద్ద గుజ్జు మీదనుండి చిన్న గుజ్జు వరకు వుండి తాడుతో బిగించి వుంటుంది. మొరుమాను దగ్గరకూడా తాడుతో గట్టిగా బిగిస్తారు. ఇవి రెండు వైపులా వుంటాయి, ఇలా ఏర్పాటు చేయడంవల్ల బండిలోని తోపుకు బద్రం గావుంటుంది.

24) నాట్లు = మొరుమానుకు రెండు వైపులా ఎత్తుగా నాలుగు కఱ్ఱలు ఏర్పాటు చేస్తారు.

25) మొరుమాను = బండిలో రైతు కూర్చొని వెనుక వుండే కొయ్యనే మొరుమాను, దీనికి ఇరువైపులా నాట్లు వుంటాయి. నాట్లు సుమారు 4, 5 అడుగులు పొడవుతో ఇరువైపులా 4 నాట్లు వుంటాయి.

**మొరమాను గోసినగా మొత్తము పైపరము బడేలు**
**సమకూర్చగా పరముబండి సగవేసెనుసరిదోలిన**
**కుంటేనతో మొదటిమోకు కుదర బెరికి పన్నకంబు**

26) పన్నకము = సేద్యంకు సిద్ధము కావడానికి గుంటకు కాడి మానుకు అను సంధానముగా వార్నేతో బిగించడం.

**కుదిరించుక తొందరగా కాడికట్టిదేసపెడ్ల**
**కదముపైన నడిపించీ చేనులోని చొప్పగూళ్ళ**

27) చొప్ప గూళ్ళు = పొలములో జొన్న,సజ్జ పంటను కోసి అక్కడే గూళ్లుగా నిలువు తో నిర్మిస్తారు. వర్షము పడినా కంకులు నాని పోకుండా ఉండటానికి.

**చెదర బెరికి తోపువేసి బిల్లు చెరుగు నడికట్టూ**

28) బిళ్ళ చెరుగు = బండి తోపును కదలకుండా తోపు పైన ఇరువైపులా 'మారు మాను' కు తాడును ఇరువైపులా కట్టి వెనుక వైపుకు తాడును పంపిస్తారు, వెనుక వైపునుండి ఇరువైపులా రెండు తాడులు కట్టి వాటికి చెక్కతో చేసిన బిళ్ళకు ఒక రంధ్రం ఏర్పాటు చేస్తారు. ఇందులో ఒక చిన్నతిరిగే బిళ్ళ (కపిల) వుంటుంది అందులో తాడులోనికి పంపితాడును 'బిగదీసి' లాగడంవల్ల తోపు బాగా అణిగిపోయి కదల కుండ వుంటుంది.

**పత్తిని బేళ్ళు ఒత్తిడితో బంధించి నట్లు**
**బిగియ బిగియ బిగదీసి త్వరగా పగ్గం బిగ్రున**
**తోలు కొనుచు వస్తూవుంటే అంపసన్న కట్టేవిరిగే**

29) అంపసన్న కట్టే = బండి ఇరుసు క్రింద భాగములో ఇరువైపులా రెండు కర్రలతో నగలకు తాడుతో గట్టిగా కట్టుతారు బండి వాటు పడకుండా ఉండటానికి.

30) దోసిళ్ళు = రెండు అర చేతులు జోడించడం.దోసిడి నుండి నీల్లు తాగడం. దోసిళ్ళతో ధాన్యం దానం చేయడం

31) నిలువు దొంక = దొంకి పీట అని కూడా పీలుస్తారు, పెద్ద గుజ్జులకు అనుసంధానముగా వుండే ఒక కర్ర (రోకలి లాంటిది).

31) గోచినగ = మొరమాను దోను మొద్దుకు వుండే ఒక కర్ర.

32) మొదటి మోకు = కొన నగలుకు కాడి మానుకు దోనూ మొద్దు ఒక మోకుతో వాటిని కట్టి వేసేతాడు.

33) పన్నకము = కాడిమాను, కొన నగలకు సంధానం చేస్తూ చర్మంతో చేయబడిన 'వార్నే'ను మొదటి మోకుకు బిగించి దోనూ మొద్దుకు కట్టి వుంటుంది.

34) కాడి = ఒక జత (రెండు, జంట, జోడు) ఎద్దులను కాడి అంటారు. కుడివైపు వుండే ఎద్దును దాపట, అని ఎడమవైపు వుండే ఎద్దును వలపట అంటారు, రెండు మూడు జతల ఎద్దులను కాండ్లు, అంటారు.

35) చిక్కెము = పొలములో సేద్యము చేస్తున్నప్పుడు. ఎద్దులు పైరును తినకుండా ఉండటానికి వెదురు దబ్బలతో అల్లిన దానికి రెండువైపులా తాడుతో మోర (మూతి కి తగిలించి )కు తాడుతో కొమ్ముల సందు నుండి కట్టి వేయడం. దీంతో ఎద్దులు పైరును తినడానికి వీలులేకుండా వుంటుంది..

36) చిగురాకు = కొమ్మ చివరలో కొత్తగా తొడిగిన లేత ఆకులను చిగురాకు అంటారు.

37) వార్నే = పశువుల చర్మమునుండి చిన్న తాడులాగా కోసి వాటిని కలిపి గుండ్రని ఆకారంతో మోకులా వుంటుంది. ఇది రబ్బరు లాగ వంగుతుంది. కాడిమాను గుంటక లేదా బండి నగలు మధ్యలో నుండే వార్నేకు తాడును అను సంధానముగా చేసి కట్టుతారు.

38) గిట్టలు = ఎద్దులకు కాళ్ళ క్రింది పాదాలు చీలి రెండుగా వుంటాయి, నాలుగు కాళ్ళకు 8 గిట్టలు వుంటాయి. ఎద్దులు రాళ్ల పొలములో తిరిగి వాటికి గిట్టల కింది భాగము (పాదము) అరిగి పోయి నొప్పులు వస్తాయి. వీటికి ఇనుముతో చేసిన 'నాడ'లు గిట్టలకు బిగిస్తారు. కమ్మరి వారు తయారు చేస్తారు.

39) మేడి = 'మేడి తోక' పాలె, మేడి, అనికూడా పిలుస్తారు. గుంటక లేదా గొర్రుకు మధ్యలో ఒక తోలి వేసి రంధ్రం వేస్తారు. అందులో రెండు అడుగుల కొయ్య నిలుపుతారు. దీనికి పై భాగములో అడ్డంగా ఒక కొయ్యను తొలిచి అందులో జానడు కొయ్యను ఏర్పాటు చేస్తారు. ఈ కర్రసహాయముతో రైతు చేతి బర్రు ద్వారా గట్టిగా అదుముతాడు దీంతో గుంటక కదలకుండా వుండి సాల్లు చక్కగా వుంటుంది. కాడిమాను నుండి వార్నేకు అనుసంధానముగా మోకును మేడికి బిగించడానికి కూడా మేడి పనిచేస్తుంది.

40) రాశి గింజలు = పండిన పంట గింజలు భాగస్తులు గాని, కూలీలకు లేదా ఆయగాల్లకు ఇవ్వవలసిన ధాన్యం కుప్ప నుండి రాశి నుండి పంపకాలుచేస్తారు.

41) కల్లం = పొలములోని పంటలను వడిపినతరువాత వాటిని ఎద్దుల బండ్లలో తీసుకొని ఒక్కొక్క పంటను ఒక చోట వేసి వామిని నిర్మిస్తారు. జొన్న, సజ్జ, వేరుశనగ ఇలా అన్ని పైర్లు ఇందులో ఉంచి తరువాత కల్లములో పంటను గింజలుగా వేరుచేస్తారు. అన్ని రకాల పంటలు ఒక చోట ఏర్పాటు చేసుకొనే స్థలం 'కల్లం" అంటారు. 10, 15 సెంట్ల భూమిని గట్టి చేసి పేడతో అలికి గింజపంటలు గుండు తిప్పి తయారు చేస్తారు.

42) పలుగు = గుంటకకు రెండు వైపులా చివర్లల్లో రెండు కొయ్యలు వుండి వాటికి ఇనుముతో చేసిన 'పలుగు 'ఏర్పాటు చేస్తారు. ఈ గుంటక ద్వారా పొలములోని గడ్డి తొలగించడానికి, గొర్రు తోలిన వాటిని చదును చేస్తారు. దీనిని 'బాపటం' అంటారు. ఈ పలుగు (బెత్తెడు) అరుగదల అయినప్పుడు కొలిమిలో తిరిగి పదునుపెట్టిస్తారు.

43) బారాగుంటక = గుంటకలో 'కుర్స గుంటక'. ఇది పొడవు తక్కువగా వుంటుంది. పొడవుగా వుండేది 'బారాగుంటక'. ఈ గుంటకను గడ్డిని తొలగించడానికి వాడుతారు.

44) ఇరుసాలు = పొలమును రెండుసార్లు సేద్యం చేయడంను ఇరుసాల్లు అంటారు. దీనివల్ల భూమిలో గడ్డట లేకుండా చేయడానికి 'ఇరుసాలు సేద్యము' చేస్తారు.

45) వండు మట్టి = పొలములో వర్షాలు పడినప్పుడు. నీరు గుంతగా వుండే ప్రాంతానికి నీల్లు చేరడమువల్ల అక్కడ కొంత కాలము నీరు నిల్వ వుంటుంది. నీరు ఆవిరితో అక్కడ వండు మట్టితో బిళ్ళలుగా ఏర్పడుతాయి, ఈ వండు మట్టి సత్తువ. ఈ గుంతలో వున్న వండు మట్టిని పొలములో వేస్తారు.

46) ముంగారు = వర్షాకాలము కంటే ముందుగా కురిచే వానలు. వేసవికాలం నుండి వర్షాకాలం ప్రారంభం కాలము, మే నెలతో ప్రారంభం. ఈ సమయములో ఎండలు ఎక్కువ వర్షాలు కూడా ప్రారంభం అవుతాయి. ఈ కాలాన్నే 'ముంగారు' అంటారు.

47) కోపుతాల్లు = బండి వెళ్ళు చున్నప్పుడు ఎద్దులు లోపలకు రాకుండా కాడిమానుకు చివర మెడతాడు కట్టడం.

48) అదును = తొలకరి వానలు ప్రారంభం కావడంతో పంటలు విత్తనాలు వేసేసమయం, అదును (విత్తనానికి సరైన సమయము) దాటితే పంట దిగుబడి తగ్గుతుంది.

49) మిడి ఎండ = మధ్యానపు ఎండ

50) కోటేరు = పొలం పనులకు వెళ్ళేటప్పుడు తిరిగి వచ్చేటపుడు గుంటకలను తిప్పి కాడిమాను మీద ఉంచి తీసుకెళ్లడం.

51) కోత = పంటలను కోసే పని, కొఱ్ఱ, వరి, జొన్న పండిన పంటలను కోత కోయడం.

52) పొట్టు జొల్ల = గడ్డిని పశువులకు తీసుకురావడానికి వెదురు దబ్బలతో అల్లిన పెద్ద గంపను జొల్ల అంటారు.

"అన్నిరకాల కలిపిన ఎండు గడ్డిని'పొట్టు" అంటారు పొట్టును తీసుకురావడానికి జొల్లవాడుతారు. పశువులకు కావలసిన మేతను ఏడాది పొడుగున వుండటానికి కల్లములో వామిని నిర్మిస్తారు. అన్ని రకాల పంటల ఎండు గడ్డిని వరుసలుగా వేసి వామి  నిర్మిస్తారు.

53) రాశి = పండిన పంటల ధాన్యాన్ని కల్లములో కుప్పగా పోస్తారు. దీన్నే 'రాశి అంటారు.

54) పడుగు గగ్గులు = జొన్న, సజ్జ లాంటి పంటలు కంకులు కలములో వేసి పడుగు గాచేసి గుండుతో తిప్పుతారు. మరోసారి కంకులను గుండుతో తిప్పడం పడుగు గగ్గులు అంటారు.

55) బొందు = వర్షాలు పడక పోవడంతో పంటలు పండవు పైరు వుండి పంట కాదు. ఈ పంటను బొందు అంటారు బొందు పశువుల మేతగా ఉపయో గపడుతుంది. 'పంట పండక చేను బొందు పోయింది' అనే సామెత.

56) ఊరిమంద =  బఱ్ఱెలు, ఆవులు ఊరు వారి అందరి పశువులను కాయడం వీటిని ఒకచోట మందగా ఉంచుచోటు. 'ఊరి మంద'

57) కట్టకం = బావులు త్రవ్విన తరువాత మట్టి పొల్లకుండా రాతితో కట్టకం నిర్మిస్తారు. కందనాలకు, బావిలోని నీళ్ళు పైర్లకు పంపడానికి గోడను నిర్మించి అందులో కాలవ లాగ ఏర్పాటు చేస్తారు. రాతి కట్టకం అంటారు.

58) రచ్చబండ = గ్రామములో వుండేవారు విరామసమయములో చెట్టు వుండి అక్కడ బండలు కూర్చోవడానికి ఏర్పాటు చేస్తారు. ఇందులో గ్రామసమస్యలు చర్చిస్తారు, నాటకాలు. హరికథలు, ప్రజా ప్రతినిదులు, అధికారులు ప్రజలకు కావలసిన సరకులు, వస్తువులు అమ్మకాలు చేస్తారు. వై.యస్. రాజశేఖర్ రెడ్డి ముఖ్య మంత్రిగా వున్నప్పుడు 'రచ్చబండ 'కార్యక్రమం చేపట్టారు.

59) గంజు గుంత = పశువులను పాక లేక కొట్టములో కట్టివేస్తారు. గాటి పాటలో మేత వేసి తినడానికి వీలుగా ఏర్పాటు వుంటుంది. పశువుల మూత్రం (గంజు అంటారు. ఆవుగంజును పంచితముగా భావించి కొన్ని పూజలకు వాడుతారు.) సులభంగా వెళ్లడానికి దిగుమారుగా వుంటుంది. మూత్రం అంతా ఒక చోటికి వెళ్ళడానికి 'గుంత నిర్మిస్తారు. గుంతలో వున్న గంజును కడవ లేదా కుండలో పోసుకొని దిబ్బలో పోస్తారు. గంజుకూడా పైర్లకు మంచి సతవ. (సారం)

60) యాలపాటలు = పొలము దగ్గర పశువులు మేపడానికి వెళ్లి నప్పుడు వరసైన అమ్మాయిల, అబ్బాయిల మధ్య సరసముగా పాడుకొనే జానపదగీతాలు.

61) అంబలి = ప్రస్తుతం రాగి మాల్టుగా పిలవబడుతుంది, గతములో ప్రొద్దున్నే రాగి, జొన్న పిండితో కాంచిన జావను త్రాగేవారు,కాఫీలు రావడంతో అంబలి కనుమరుగైంది. ఎండాకాలంలో వడదెబ్బ నుండి రక్షణ, ORS లాంటిది.

తెలుగు సాహిత్యములో మన కవులు అంబలి గురించే చాలా మంది చెప్పారు. బసవపురాణంలో పాల్కురికి 'నగరమున కాంచు అంబళ కంబు' శ్రీనాథుడు మీగడ తోడ మజ్జిగలతోడ 'అంబళ కంబులతోడ' అంటూ కాశీఖండం" జొన్నకలి, జొన్నయంబలి' అంటూ శ్రీకృష్ణ దేవరాయలు 'ఆముక్త మాల్యదలో" పలుచని అంబళుల్ చెరుకు'ను మరోచోట అంబలిగంజి ఇండ్ల నడుగువారు. అని అంబలి పేదవాడి దా? ధనికులదా? ఎందుకంటే షుగరు, బిపిలతో అందరికి అంబలి అవసరము. పిల్లలు పెద్దలకు బలమైనది. రాగులు సజ్జలు, జొన్నల లాంటి తృణ ధాన్యాలతో తయారు చేస్తారు. కన్నడలో అంబలి, అంబ కళ, అంబిల, తమిళములో అంపలి, ప్రాకృత భాషలో అంబలైనే, అమాగొ అంటారు,

62) బల్లెము = ఒక కర్రకు పొడువైన ఇనుముతో చేయబడిన కత్తి, రక్షణ కొరకు అయుధముగా ఉపయోగిస్తారు.

63) కొసరు = కొసరు కూరగాయలు లేదా ఇతర వస్తువులు కొనేటప్పుడు ఇంకా కొంచం ఇవ్వమని అడిగేది 'కొసరు' (బేరము)

64) కొసరి = ఒకే సారి ఇవ్వకుండా కొద్ది కొద్దిగా ఇచ్చేది 'కొసరి'. ఇవ్వడం.

65) మొలకలపున్నము = రైతులు పంటలు వేయడానికి విత్తనాలకు మొలక కట్టడం. పల్లె పడుచులు మొలకల పున్నమిని నిర్వహిస్తారు, ఈ వేడుక ముఖ్యంగా విత్తనానికి కావలసిన గింజలను సేకరించి ఒక్కొక్కరు వారి ఇంటిలోని దాసిన విత్తనం గింజలను మట్టి కుండల్లో వేసి మొలకలను పెంచుతారు. బాగా పండిన పంట విత్తనాలకు బాగుంటుంది అని భావిస్తారు. అమ్మాయిలు రోజు వాటిని చూసుకొంటూ పాటలు పాడుతూ వేడుకలు 15 రోజులపాటు చేసి గ్రామములో ఉరేగింపుగా గుడులకు వెళ్లి మొక్కులు చెల్లిస్తారు.

66) సద్ది = రాత్రిపూట మిగిలిన అన్నమును మరుసటి రోజు ఉదయము తింటే 'సద్ది' అంటారు. సద్దన్నము, ఇందులో రాత్రి మిగిలిన అన్నాన్ని నీటిలో వుంచి ప్రొద్దునపూట మజ్జిగ కలుపుకొని అందులో యర్రగడ్డను కొరుక్కుంటూ తింటారు. ఊరగాయలు కూడా వాడుతారు. సద్ది తిని పొలం పనికి వెళ్లుతారు. ఈ సద్దిని పొలమునకు తీసుకెళ్ళి అక్కడ తినడం చేస్తారు. సద్ది ఆరోగ్యానికి మంచిదిగా భావిస్తారు. సద్ది స్థానములో టిఫెన్లు వచ్చాయి. అయితే ఇటీవల సద్ది అన్నంకు గిరాకి, ధర బాగా పెరిగింది.

67) కవిల = బావిలోని నీటిని తోడేది. ఈ నీటిని పంట పొలాలకు పారించడానికి, గాను 'కవిల' లేక 'మోటు అని కూడా అంటారు. కవిలను మూడుగాండ్ల ఎద్దులు కట్టి బావి నుండి బొక్కెన (పశువుల చర్మంతో తయారు చేసిన) ద్వారా నీటిని తీయడం.

68) పెంటకుప్ప = పశువుల పేడను ఇతర కసువును ఒక చోట కుప్పగా వేసేది. పెంట కుప్ప (దిబ్బ).

69) కుండగోకుడు = వంటలు అన్ని మట్టికుండల్లో చేసేవారు. రాగి, జొన్న సంగటి కుండలో వండించి ముద్దలుగా చేసి తిరిగి కుండలో వేస్తారు. అడుగుభాగములో కొంత అన్నము అడుగంటి మాడి లేదా మాడ ఉంటుంది. ఆ అన్నము రాదు కుండ అడుగు భాగములో గట్టిగా కుండకు అతుక్కొన్ని వుంటుంది. దీన్ని గోకి తీసి తింటారు. చాలా రుచిగా వుంటుంది.

70) బండి జొల్ల = పరంబండిలో వెదురుతో అల్లినటు వంటి, పొడవుగా వుండి ఒక వైపు అల్లకం లేకుండా వుంటుంది. వెనుక వైపు వుండే మార్గము ద్వారా మట్టి గాని, జొన్న కంకులను కలములోను, పొలములో వదలడానికి వాడుతారు. అదే జొల్ల ముందు వైపుకు మార్చుకొంటె ఇందులో మనుషులు ప్రయాణము చేయడానికి వినియోగిస్తారు. జొల్ల రెండు, మూడు అడుగులు ఎత్తు వుంటుంది.

71) మడక = నాగేలి, నాగలి. భూమిని లోతుగా దున్నడానికి 'మడక 'వాడుతారు, ఒక నగ వుంటుంది, మిగిలిన గుంటకలకు రెండు నగలు వుంటాయి. కొయ్యతో చేయబడి, చివర ఇనుముతో చేయబడి అడుగుకంటే పొడవైనది మడక కారు సూదిగా వుంటుంది. భూమిలోతుకు వెళ్లడమువల్ల పైమట్టి కిందికి లోపల మట్టిపైకి వస్తుంది. వర్షం నీరు భూమిలో పలికి వెళ్ళుతుంది. మడక వల్ల చాలా ప్రయోజనాలు వున్నాయి.

72) చిరుగంటలు = ఎద్దులను బాగా సింగారిస్తారు. ముఖ్యంగా వేడుకలు, ఉత్సవాలు, పెండ్లి ఊరేగింపులు సమయములో రకారకాల అలంకరణ చేస్తారు. మెడకు చర్మము (ఎలుగుబంటి చర్మం కూడా వాడుతారు)తో చేసిన వాటిని మెడ చుట్టూ వేలాడ తీసి వాటికి గంటలు కట్టుతారు, మెడ గంటలు అనికూడా అంటారు.

73) వరపగ్గం = కాడి మానుకు ఇరువైపులా రెండు బొరకలు వుంటాయి. ఎద్దులు లోపలివైపు లేదా బయటికి పోతువుంటాయి. అలా వెళ్ళకుండా కాడి చివర పగ్గం కట్టి ఎద్దులు బయటికి పోకుండా నిరోధిస్తుంది.

74) కొంగ్రవేచి = పొలములో సేద్యము చేసేటప్పుడు తొలి సాలు మధ్యలో చక్కగా వంపులేకుండా మారు వేస్తారు, తరువాత సేద్యం చేసేటప్పుడు అదే సాలు దృష్టిలో ఉంచుకొని వంపులు లేకుండా చేస్తారు. స్కేలు తో పుస్తకములో గీసినట్లుగా వుంటుంది. ఇది ప్రతిభా వంతులు అయిన రైతులు చేస్తారు.

75) ఆగే గుట్ట = గ్రామాల్లో పశువులు మేయడానికి వ్యవసాయానికి పనికిరాని, గుట్టల ప్రాంతము గ్రామస్తులు అందరూ కలిసి ఏర్పాటు చేసుకుంటారు. అయితే అక్కడ కొంత కాలము బాగా గడ్డి పెరిగే వరకు పశువులు పోకుండా ఆపేస్తారు. దీన్నే 'ఆగేగుట్ట 'అంటారు గుట్ట చుట్టూ అక్కడక్కడ రాళ్ళపై సున్నము వేస్తారు. అవసరమైతే కాపలాదారులను కూడా నియమిస్తారు.

76) వెన్నుడిన = జొన్న, సజ్జ పైర్లు వెన్ను బట్టిన తరువాత పంట కోయడానికి సిద్ధమవుతుంది. దీన్నే 'వెన్నుడిన'.

77) జొన్న వగుడు = జొన్న పైరును కోసిన తరువాత జొన్న ఆకులూ రాలిపోతాయి. వాటిని 'జొన్న వగుడు' అంటారు పశువుల మేతకు వాడుతారు.

78) లాకలు = పొలము విత్తినాక కొంత కాలానికి పైరు కోశాక తిరిగి మొలకెత్తే పైరు. దీన్నే 'లాకలు' అంటారు.

79) గాటిపాట = పశువులు ఉండటానికి పాకను ఏర్పాటు చేస్తారు. అందులో పశువులకు మేత వేయడానికి ఒక గాడిని ఏర్పాటుచేస్తారు. మూరెడు ఎత్తుతో రాతిని నిలిపి పొడవుగా వుంటుంది. వెడల్పు మూరెడతో వుండి పశువులను కట్టేయడానికి నిలువు బండలకు ఒక రంధ్రము వుంటుంది. ఈ రంధ్రము నుండి తాడు (తలుగు) లేదా గొలుసులు ఉంచి పశువులను కట్టి వేస్తారు. రాయలసీమలో పశువులశాలను ఇంటిలో నిర్మించుకుంటారు. పశువులు తమ పిల్లలతో సమానంగా భావించి తాము నిద్రించే స్థలానికి ఎదురుగా ఎద్దులు వుండేట్టుగా ఏర్పాటు చేసుకొంటారు. వాటి బాగోగులు గమనిస్తారు. అదే కోస్తా ప్రాంతములో పాకలు ఇంటికి దూరంగా వుంటాయి.

80) చంక చిక్కము = పొలముకు లేదా పశువులు మేపడానికి వెళ్ళేవారు, వారికి కావలసిన సద్ది అన్నం కట్టుకొని సిక్కెములో తీసుకేళ్ళుతారు. అందుకోసము తాడుతో అల్లిన ఒక సంచిలాగా వుండేది. ఆ సంచిని చంకకు తగిలించుకొంటారు. దీన్నే చంక 'చిక్కెము' అంటారు. సొర్రబూర నీళ్ళు నింపు కోనేవారు. 'సొర్ర బూర' స్థానములో ప్లాస్టిక్ బాటిల్లు వచ్చాయి. ఇటీవల స్త్రీలు అలంకార వస్తువులు తీసుకెళ్ళేటప్పుడు. లెదర్ బ్యాగ్‌లో ఉంచుకొని బాగ్‌ను చంకకు తగిలించుకొంటారు. ఇలాంటిదే చిక్కెము.

81) మట్టికోడె = ఒకే రంగు లేకుండా ఇతర రంగులుకలిగి వుంటుంది దీన్నే మట్టి కోడె అంటారు.

82) గవిని = గవిని అనేపదం, పదవాడకములో 'గౌని' మారింది. గవిని అంటే కోట ప్రధానద్వారం. ఈ ప్రధాన ద్వారాన్ని కాపలాగాచేవాడు 'గౌని' అయ్యడు.

83) మారుచేను = పొడవుగా వుండే చేను, కొన్ని ప్రాంతాలల్లో భూమి చాలా పొడవుగా వుంటుంది. మలుపు – పోయి తిరిగా రావడాన్ని 'మలుపు' అంటారు. జమ్మలమడుగు, కోవెలగుంట్ల ప్రాంతాల్లో ఇలాంటి పొలాలు ఎక్కువ.

84) సాలు పట్టి = పొలములో గొర్రు ఒక సాలి చక్కగా వంపు లేకుండా సేద్యము చేస్తారు, తరువాత అదేసాలును ఆసరాగా చక్కగా దారం తో పట్టినట్లు వుంటుంది.

85) పరం బండి = బండికి జొల్ల లేనిది. జొన్న చొప్ప ఇతర వాటిని తీసుకు రావడానికి 'పరం బండి' ని వినియోగిస్తారు.

86) గాసగాడు = జీతగాడు అని అంటారు. ఏడాది పొడుగునా రైతు ఇంటిలో వుండి పనిచేయడం.

అయగాండ్రు = గ్రామీణ వ్యవస్థలో ఆయగాండ్రు విధానం ముఖ్యమైనది. గ్రామములో సుమారు 12 మందిని ప్రభుత్వం ఏర్పాటు చేసేది. వీరంతా గ్రామ పరిపాలన నిర్వహిస్తారు. ముఖ్యంగా పురోహితుడు, కరణం, రెడ్డి, చాకలి, మంగలి, తలారి, మాదిగలు మొదలగు కులవృత్తి వారు. వీరు గ్రామ నిర్వహణ చూస్తారు, అలాగే తగువులు కూడా వీరే పరిష్కరిస్తారు.

87) రుమాలు = తల పాగా, చేతి తుండు, ఉత్తరీయం, తుండు గుడ్డ. ఇలా చాలా పేర్లు వున్నాయి. నూలు బట్టతో తయారు చేస్తారు. 2 మీటర్ల పొడుగు కలిగినది. దేహం తుడవడానికి, తల పైన చుట్టుకోవడం, తలపైన బరువు మోసేటప్పుడు తలకు నొప్పి లేకుండా వాడుతారు. పెండ్లి కొడుకు తలపైన చుట్టుతారు. వాస్తవానికి ప్రతి రైతు ఈ వస్త్రం వాడుతాడు. చాలా విధాల ఉపయోగమైంది.

88) కాపు = పండ్ల తోటల్లో కాచిన కాయకు కాపు బాగా పట్టింది అంటారు. పొలానికి కాపలాను 'కాపు కాయడం'.

89) మెట్ల గుంటక = గొర్రుకు నాలుగుచెక్కలు వుండి చివర ఇనుముతో చేసిన సూదిగా వుండేది. నాలుగు చెక్కల గుంటకతో విత్తనాలు వేస్తారు. పంట పూత దశకు వచ్చె సమయములో సాల్ల మధ్య గడ్డిని తొలగించడానికి గాను, పైరును తప్పిచ్చి సేద్యం చేస్తారు. ఈ సేద్యము కొంత నైపుణ్యత వుండాలి. దీన్నే 'మెట్ల గుంటక అంటారు.

వ్యవసాయ పనిముట్లు గ్రామీణ ప్రజలు కూడా వాడడం తగ్గింది. అందుకు కారణము, ఆధునికత వల్ల యంత్రాలు రావడమే. అందుకు పెట్టుబడిదారి వ్యవస్థతోడై ప్రపంచం అంతా యాంత్రికమైంది. ఒకప్పుడు వ్యవసాయరంగములో ఎడ్లు, బండ్లు, ప్రతి ఇండ్లలో తప్పనిసరి. ప్రస్తుతం ఎద్దులు బండ్లు కనిపించడం లేదు. ట్రాక్టర్లు, జేసిబీలు, ఆటోలు, బోరుబండ్లు, రాకతో వ్యవసాయం జోరు అందుకొంది. పొలం కాపలా కూడా లేకుండా సి.సి. కెమరాలు వచ్చాయి. అడవి జంతువులకు సోలారు కంచెలు, రావడంతో వ్యవసాయంలో వచ్చిన మార్పువల్ల నేటితరం వారికి వైసీవి రెడ్డి సాహిత్యం అర్థం కాకపోవచ్చు, కాని ముందుతరాలకు ఆయన సాహిత్యం ఒక గొప్ప కానుక కాగలదు. ఒక ఎద్దులబండికి వాడే వస్తువులు సుమారు వంద

వుంటాయి. వీటిపై పరిశోధనలు చేయవలసి వున్నది. అదే ఇంగ్లీష్ పాతాల్లో విమానం గురించి అందులోని భాగాలు గురించి మనం తెలుసుకొంటున్నాము. ఇంగ్లీష్ పదకోశాల్లో పాత పదాలతోపాటు, కొత్త పదాలు చోటు చేసుకొంటున్నాయి. మన నిఘంటువుల్లో ఆ సాంప్రదాయము లేదు. భాష తెరమరుగు కావడానికి ఇదో నిదర్శనం.

రెడ్డి గారి సాహిత్యములో ఈ ప్రాంతములో విరివిగా వాడే పదాలను ఎన్నుకొని రాశారు. ఎక్కువగా స్థానిక మాండలికాల విషయంలో రాయలసీమలో ఒకే విధమైన మాండలికాలు లేవు, చిత్తూరు వారిలో ఎక్కువ తమిళ ప్రభావం వుంటుంది. అనంతపురం ప్రాంతములో కన్నడ ప్రభావం. కర్నూలు ఏరియాలో ఉర్దూ తెలంగాణా యాస, కడప ప్రాంతములో ఉర్దూ, ఇంగ్లీష్ ప్రభావం వుంటుంది. పులివెందులలో మాత్రం ఒకరకమైన యాస వుంటుంది. కడప జిల్లాలో పులివెందులవారు మాట్లాడే తీరు చూచి మీది 'పులివెందులా! అని అంటారు. అందుకు కారణం యాసే.

వై.సి.వి. రెడ్డి రచనలు 'తొలకరి చినుకులు', 'మేనక', 'రంభ', 'సిందూర రేఖ,' దక్షిణానిలయం,' రాయభారం, సెలకన్నె. 'వైజయంతి, 'పారిజాతం,' గట్టి గింజలు కథలు వీరి సాహిత్యంలో ఎక్కువగా పల్లెజీవితాలు రైతుకూలీల కష్టాలు చూడవచ్చు. ఒకవైపు ఉద్యోగం చేస్తూ మరో వైపు రచనా వ్యాసంగం, ప్రచురణ కర్తగా, అభ్యుదయ రచయితల సంఘం నిర్వాహకుడుగా పనిచేశారు.

❖ ❖ ❖

> ఎమ్మనూరు చిన్న వేంకటరెడ్డి అడిగినదే తడవు వ్రాసి యిత్తునని సంతోషముతో అన్నాను. ఈ 'మేనక' గ్రంథమునకు ఎవరి పీఠిక అక్కరలేదు. వ్యుత్పత్తి ప్రయత్నసాధ్యము. సంస్కారము దైవదత్తము. ఈ కావ్యమున సంస్కారము పదపదమున వున్నది. నా 'తొలిపలుకు' ఆవశ్యకముగా నుండవలెనని తోచినది. ఎందుకనగా అది నాకు గౌరవము. ఈ కావ్యము నా దృష్టిలో తెనుగు నవలంకారము.
>
> **– పద్మశ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులు**



**డా. గూగంశెట్టి శ్రీరామకృష్ణ**
సెల్ : 9490686225

# సిందూర రేఖ

"సిందూర రేఖ" అచ్చమైన రాయలసీమ వ్యవసాయ జీవన విధానానికి ప్రతిబింబం. పుడమితల్లి ఒడిలో పులకించిన రైతుబిడ్డ వై.సి.వి. రెడ్డి రచించిన స్వతంత్ర పద్యకావ్యం. అభ్యుదయ భావాలుకల ఆదర్శరైతు రామిరెడ్డి జీవిత గాథ. రైతుల, రైతుకూలీల వ్యధార్థ యధార్థ జీవితాలను పాఠకునికి దృశ్యకావ్యంలా దృగ్గోచరం చేసే కావ్యం. వ్యవసాయం చేసే విధానం, రైతాంగం చుట్టూ అల్లుకున్న వాతావరణం, వ్యవసాయ జీవనంలోని ఆటుపోట్లు, పల్లె జీవనవిధానం, ప్రజల ఆహారపు అలవాట్లు, ప్రకృతి వర్ణనలు, రాయలసీమ కరవుతీవ్రత మొదలైన అంశాల ఇతివృత్తంతో ఈ కావ్యం మన కళ్లముందు జరుగుతున్నట్లుగా సాగిపోతుంది. ఈ కావ్యంలోని పాత్రల సాధక బాధకాలు పాఠకుల హృదయాలను కదిలిస్తాయి. కలచివేస్తాయి. కమ్మచ్చులోనుండి తీసిన బంగారు తీగల్లా ఈ కావ్యంలోని పద్యనిర్మాణం ఉంటుంది. ఇదొక విషాదాంత కావ్యం.

వై.సి.వి. రెడ్డి మట్టివాసనలో తాదాత్మ్యం పొందినవాడు. రైతుకుటుంబ నేపథ్యంనుండి వచ్చినవాడు. స్వయంగా రైతు. రైతాంగం యొక్క సమస్త సాధక బాధకాలను చూసిన వాడు. వాటిని అనుభవించినవాడు. కాబట్టే రైతు జీవన విధానంపై అద్భుతమైన "సిందూర రేఖ " కావ్యాన్ని వ్రాయగలిగాడు. కవి ఈ కావ్యంలో రైతాంగంలోని కష్టనష్టాలతోపాటు శ్రమపట్ల గౌరవాన్ని ప్రకటించాడు. శ్రమజీవన సౌందర్యాన్ని ఆవశ్యకతను తెలియజేశాడు. రైతుకు వ్యవసాయంలో విశేషంగా తోడ్పడే మూగజీవుల ప్రాధాన్యత ఆవిష్కరించాడు. పెట్టుబడిదారుల స్వార్థాన్ని గర్హించాడు. రైతుల, రైతు కూలీల అభ్యుదయాన్ని ఆకాంక్షించాడు. వ్యవసాయానికి సంబంధించిన వృత్తిపదాలు, మాండలికాలు ఈ కావ్యంలో ఎక్కువగా కనిపిస్తాయి. కొత్తగా వ్యవసాయం చేయాలని అనుకొనేవారికి వ్యవసాయపద్ధతులను, వ్యవసాయం గురించి మరియు రైతు జీవనవిధానం గురించి తెలుసుకోవాలి అని అనుకొనేవారికి, రైతుజీవనం పై పరిశోధన చేయాలి అనుకొనే వారికి "సిందూరరేఖ "ఒక గొప్ప నిఘంటువువంటిది అనడంలో ఎటువంటి సందేహంలేదు.

పల్లెలు దేశ సౌభాగ్యానికి మూలస్తంభాలు. దేశ సంపదలకు ఆటపట్టు వ్యవసాయం. వ్యవసాయానికి రైతు వెన్నెముక. మనదేశంలో ఇప్పటికీ 80 శాతం ప్రజలు వ్యవసాయ జీవనం సాగిస్తున్నారు. సిరులకాటపట్టైన వ్యవసాయం చేయడం చాలా కష్టంతో కూడుకొని ఉన్నది. అతివృష్టి, కరువులు తట్టుకొని రైతు పంట పండించడం ఒక కష్టం అయితే పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక రైతాంగం తీవ్ర సంక్షోభంలో

కూరుకొనిపోవడం మరొక కష్టం. రైతుల కడగండ్లను సమాజానికి తెలియజేస్తే రైతుకు కొంత న్యాయం జరుగుతుంది. ఇతరులకు రైతుల దీనావస్థ తెలుస్తుంది. శ్రమవిలువ అవగతం అవుతుంది. రైతుపై గౌరవం పెరుగుతుంది. రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు రావచ్చు.

"సిందూర రేఖ"అంటే ఎర్రగీత. సోషలిజం ఆకాంక్షించి వైసీవి ఈ కావ్యం వ్రాశాడు. పెట్టుబడిదారి వ్యవస్థలోని లోపాలను స్వార్థపూరిత కుట్రలను బహిర్గతం చేస్తూ, ధర్మవర్తనులైన శ్రమజీవులుకూడా ఈ వ్యవస్థలో యేవిధంగా విధ్వంసం అవుతున్నారో విశ్లేషిస్తూ, పెట్టుబడిదారి వ్యవస్థలో సమూల మార్పులను ఈ కావ్యంలో ఆశించాడు వై.సి.వి.

## సిందూర రేఖ కావ్య నేపథ్యం

రామిరెడ్డి గ్రామంలోని మోతుబరి రైతు. ధర్మపరుడు. ఆదర్శరైతు. బీదసాదలపై దయగల విశాలహృదయం కలవాడు. రైతు, రైతుకూలీలు అనే తారతమ్యం లేకుండా పల్లెలో అందరినీ సమానంగా ఆదరించే సహృదయ మనస్తత్వంకల దొడ్డరెడ్డి. అనాథలకు సైతం దారిబత్తెం యిచ్చి ఆదుకోనే మానవతామూర్తి. పరుల కష్టం ఆకలి తనవిగా భావించి వారికి హితం కూర్చేవాడు.

గంగడు దళిత రైతు కూలీ. సొంత గ్రామంలో పనులు లేక, పూటగడవక రామిరెడ్డి గ్రామం చేరుతాడు. గ్రామంలో కనబడిన వారినందరికీ తన కష్ట గాథను దీనావస్థను చెప్పుకుంటూ పనులను అడుగుతూ ఉంటాడు. కూడుగుడ్డలేక దయనీయ స్థితిలో ఉన్న గంగడిని రామిరెడ్డి ఆదరించి పని కల్పించి గంగనికి ఉండటానికి కొట్టం వేయించి అతనికి వివాహం కూడా చేస్తాడు రామిరెడ్డి

రామిరెడ్డి తొలకరి సేద్యాలు చక్కగా చేసి, శక్తి వసతి లేని బడుగు రైతుల పొలాలను కూడా సేద్యం చేసేవాడు. పొలాలకు ఎరువు ఎంపలి తోలి, అదనులో విత్తనాలు విత్తి చక్కగా పంటలు పండించి గ్రామస్తులందరికీ ఆదర్శప్రాయంగా ఉంటాడు. మాసూలులో ఇంటి మాదిగలకు, కుమ్మరి, కమ్మరి, వెట్టి యానాది మొదలైన ఆయగాళ్ళందరికీ తృప్తిగా గింజలు ఇచ్చి వారందరినీ ఆనందింపచేసేవాడు. ఊళ్ళో బడి ఏర్పాటు చేయించి పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పింపచేశాడు. గుళ్లో నిత్యదూపదీపనైవేద్యాలకు అనువైన ద్రవ్యం సమకూర్చి, అర్చకుల జీవనాధారానికి భృతి కల్పించి ఆదరణతో చూసేవాడు. ఇలా తనకంటూ ఏమీ మిగుల్చుకోకుండా ధర్మనిరతితో పలువురికి ఉన్నదాంట్లో కాకుండా ఉన్నదానికంటే ఎక్కువగా సాయం చేస్తూ ఉంటాడు.

రాయలసీమలో కరువులు అధికం. ఒకసారి వచ్చిన డొక్కల కరువులో పిడికెడు అన్నానికి అలమటిస్తూ తన గ్రామ ప్రజలు ఊళ్ళో పనులు చిక్కక పొరుగూళ్లకు పనులకొరకు వలసపోతున్న విధాన్ని చూసి రామిరెడ్డి హృదయం ద్రవించి విపత్తులో ప్రజలను ఆదుకోవాలనే సదుద్దేశంతో అవసరంలేకున్నా బావిని త్రవ్వించి, రాతికట్టడం కట్టించి బీదసాదలకు పనులు కల్పించి వారి ఆకలిని తీరుస్తాడు. ఇప్పటి ప్రభుత్వ పనికి ఆహార పథకం వంటిది. ఆరోజుల్లోనే రామిరెడ్డి ద్వారా రూపం దాల్చింది.

బావి క్రింద ఎర్రజొన్నలు పండించి తనకంటూ చిట్టెడు గింజలు కూడా మిగుల్చుకోకుండా గ్రామప్రజలందరికీ పంచుతాడు. కరువు బరువునంతా తానే మోసి బీదసాదల కడుపు నింపుతాడు. కరువు పరిస్థితులలో కూడా గ్రామంలో గొప్పగా పండుగలు జరిపించి అన్నసంతర్పణలు చేయించి ధారాళమైన బుద్ధితో బడుగుబలహీన వర్గాలకు బాసటగా నిలుస్తాడు. రామిరెడ్డి చేసిన దానధర్మాలతో, వరుస కరవులతో రామిరెడ్డి ఆస్తి హారతి కర్పూరంలా కరిగిపోతుంది. అప్పులు అధికమై ఉన్న ఆస్తులను వేలానికి పెడతాడు. పెట్టుబడిదారులు రామిరెడ్డి మానవత్వం గుర్తించక, సానుభూతి చూపక వేలంపాటలో ఆయన ఆస్తులను కొనడానికి ఎగబడతారు. జీవితంలో ఎంతో గొప్పగా బ్రతికి విధి వక్రించి గడ్డుస్థితిలో ఉన్న రామిరెడ్డిని చూసి గంగని, బడిపంతుళ్ల హృదయాలు చలించి ఉదాత్త గుణ శీలత కలిగిన రామిరెడ్డి కథను చెబుతారు. ఒక ఉగాది నుండి మరొక ఉగాది వరకు రైతు వ్యవసాయం మరియు జీవన విధానాన్ని ఇంటి పనివాడైన గంగనిచే చక్కగా చెప్పించాడు సిందూర రేఖ కావ్యంలో కవి వై.సి.వి. రెడ్డి.

## సిందూర రేఖ - వ్యవసాయ జీవనం

జనపదాల వ్యవసాయ జీవనం మన జాతి సంస్కృతికి ప్రతిబింబం. "గ్రామాలు దేశానికి పట్టుగొమ్మలు" అన్నాడు మహాత్మా గాంధీ.దేశ సంపదకు రైతు వెన్నెముక. ఆరుగాలం కష్టించి పంటలు పండించి ప్రజలకు అన్నం పెట్టి సుఖపెడతాడు రైతు. వ్యవసాయం సకల పరిశ్రమలకు మూలాధారం. పరిశ్రమలు వాణిజ్యానికి సాధనాలు. సమస్త వాణిజ్యాలు సంపదకు నిలయాలు. సంపదలు సుఖాలకు నెలవులు.రైతు గాలి కాలం నుండి ఉగాది వరకు రాత్రింబవళ్ళు కష్టించి పనిచేసినా అతనికి తిండికీ బట్టకూ ఎప్పుడూ కొదవే.

రైతు పండించిన పంటను పరులు అనుభవిస్తూ సుఖంగా జీవిస్తున్నారు. రైతుమాత్రం కష్టాల ఊబిలో చిక్కి క్రుంగి కృశించిపోతున్నాడు. దుర్భర జీవితాన్ని గడుపుతున్నా స్వార్జితమైన పట్టెడన్నం తింటాడే గాని పరులను యాచించడు. రైతుకు ధారాళమైన బుద్ధి, ఆత్మాభిమానం, త్యాగశీలత సహజసిద్ధ గుణాలు. వైసీవి రెడ్డి కర్షక జీవితాన్ని వాస్తవిక కోణంతో చిత్రించడమే కాకుండా రైతుల మరియు రైతుల వ్యవసాయ జీవనానికి ఇతోధిక సాయం చేసే వ్యవసాయ కూలీల జీవితాలను, ఎద్దుల భూమికను మరియు వాటి శ్రమను సిందూర రేఖలో చాలా చక్కగా ఆవిష్కరించాడు. రైతు జీవనం పై కావ్యస్థాయి రచన చేయడం వై.సి.వి. ప్రత్యేకత.

## వ్యవసాయంలో ఎద్దుల ప్రాధాన్యత - తొలి సేద్యం

రైతు వ్యవసాయంలో ప్రధాన భూమిక పోషించేవి ఎద్దులు. రైతుకు మించి శ్రమించి రైతు కలిమిని పెంచుతాయి.వాటి శ్రమ విలువను లెక్కకట్టలేము.ఎద్దులు రైతుకు ఆత్మబంధువులు. రైతు చైతన్యరథాలు. వ్యవసాయంలో ఎద్దులు రైతుకు అందించే తోడ్పాటు గురించి సిందూర రేఖలో చక్కగా వివరించాడు వై.సి.వి. రెడ్డి.

కర్షకునికి గాలికాలం రాకతో వ్యవసాయపు పనులు మొదలవుతాయి. జ్యేష్ఠ, ఆషాఢ, శ్రావణ, భాద్రపద మాసాలను గాలికాలం అని పిలుస్తారు. జ్యేష్ఠమాసంలో తొలి సేద్యాన్ని ప్రారంభిస్తాడు రైతు. మనస్సులో సంవత్సరమంతా సకాలంలో వర్షాలుపడి, పంటలు బాగా పండి తనకు మంచి జరగాలనె తలంపుతో మేడి, కాడి సిద్ధం చేసుకొని తొలినాటి సేద్యానికి పూనుకొంటాడు. ఆ విధానాన్ని కవి

**చేనిమునుకున పన్నకంబూని కాడి**
**మేడి సవరించి పగ్గాలతోడ ముల్లు**
**గట్టె వలచేత కైసేసి మట్టెకోడె**
**ములుగుపై సైగ చేసితి మడక బట్టి**

రైతు పొలానికి బయలుదేరేముందు ఇంటివద్ద ఎద్దులకు కూర్చిన కాడిపై మడకపెట్టి దానిపై మేడికట్టి తాడుతో బిగిస్తాడు. అప్పుడు మడక నగ భూమిపై ఉంటుంది. పొలానికి చేరగానే నగను కాడిపై బిగించి మడక కర్రు భూమిపై ఆనేటట్లు మార్చుకుంటాడు. తనకు అనువుగా మేడితోక ఉంటుంది. మేడిపై రైతు చేతి బరువును మోపగానే మడక కర్రు భూమిలోనికి దిగుతుంది. ఈ తతంగాన్ని అంతా "పన్నకం బూనుట" అని అంటారు. కుడిచేతితో ముల్లుగట్టె, ఎడమ చేతితో ఎద్దుల పగ్గాలు పట్టుకొని ఎద్దుల తోకభాగం (ములుగు) పై తాకగానే అవి నడవడం మొదలుపెడతాయి. ఇలా ప్రారంభం అయ్యే సేద్యాన్ని పై పద్యంలో చక్కగా వివరించాడు

**అడుగు మడుగున పొలివోని ఆత్మశక్తి**
**పొడవులైసాగ అర్రుసాపుచు విశాల**
**తలము పొలమును దున్న నాగలిని పూనె**
**నొక్క యూపున కోడెలభ్యుదయమునకు** **2**

**ఉదయరాగమ్ము యెడ్ల కన్నుదల మెరసి**
**సాలుదప్పని యోర్పుల సంతరించి**
**లాంగలపుటారు నులివోక లాగు బాగు**
**తూగె తూగెడి మూపుర తోరణములు**

ఎద్దులు చలించని ఆత్మవిశ్వాసంతో అర్రులు సాగదీస్తూ ముందుకు పోతుండగా రైతు నాగలి పడతాడు. ఎద్దుల మెడమీది భాగాన్ని అర్రు అంటారు. మేడిని గట్టిగాపట్టి మడకను భూమిలోకి దిగేటట్లు అదుముతున్నప్పుడు కాడిక్రింద ఉన్న ఎద్దులపై బరువు పడగానే అవి ముందుకు పోవడానికి అర్రులు సాగదీస్తాయి. వాటిమీద అధిక బరువు పడకుండా రైతు వాటిని చక్కగా పంట ప్రగతిని దృష్టిలో పెట్టుకొని నడిపిస్తాడు. సూర్యోదయంకాకముందే రైతు మడక సేద్యానికి పూనుకుంటాడు. ప్రొద్దుపొడిచే సమయంలో

సూర్యభగవానుని ఎర్రని లేత కిరణాలు ఎద్దుల కనుల తుదల్లో పడి వాటి కనుకొలకులు మెరుస్తూ ఉంటాయి. ఆ కాంతిలో ఎద్దులు దారంపట్టినట్లు సాలు తప్పకుండా ఓర్పుగా సేద్యం చేస్తుంటాయి. మడక కర్ర భూమిలోకి దిగుతున్నకొద్దీ ఎద్దుల మూపుల తోరణాలు అందంగా కదులుతూ ఉంటాయి.

ఎద్దులు కల్మషంలేని శ్రమజీవులే కాదు చాలా తెలివైనవి కూడా. ఏక సంతాగ్రాహుల వలె రైతు సైగలను అర్థం చేసుకుంటూ చక్కగా పనులు చేస్తాయి. వాటికీ పనిచేసే పరిజ్ఞానం కలిగించే రైతు కూడా గొప్ప పండితుడని కవి వర్ణించాడు.

**తొలుకు బలుపునచూడ సొంపుల వెలార్చు**
**కోడె జంటకు నాదు వ్యాకోచ నిర్వృ**
**తీ రుతీ గర్భమౌ మాటతీరు తెలిసె**
**సౌర! సైరికుడెంత వింతైన కవియొ**

**కోరికల తూగు భావ దుకూలములను**
**మలుపు ద్రిప్పుచు విదలించి మరలి మరల**
**నరక పట్టితి కొండ్రకై నర్రు సాచి**
**పూనునెద్దుల పట్టుపగ్గాన పూని**

**ముక్కుచెలిపెలనూర్పులు ముసురుకొనగ**
**తోక రిక్కించి దూకు నెద్దులకు పిల్లి**
**గిట్టలకు మన్ను తగల లేదట్టె ! నాటి**
**మాధురీభర భావ సంపదల దలతు**

సేద్యం మొదలైన కొద్దిసేపటికే ఎద్దులు తాము చేయవలసిన పనిని చక్కగా ఆకలింపు చేసుకొంటాయి. ఆ తర్వాత రైతు చెప్పినట్లు అవి నడచుకుంటాయి.ఎద్దులు చక్కగా ముందుకు సాగిపోతూ ఉంటే రైతుకు చాలా సుఖంగా ఉంటుంది. రైతు సైగలను మాట తీరును గ్రహించి తమ వల్ల రైతుకు ఏమాత్రం శ్రమకలుగనీయకుండా సాగిపోతూ ఉంటాయి. ఎద్దులకు ఇంగిత జ్ఞానాన్ని కలిగించిన రైతు ఆశ్చర్యాన్నిగొలిపే పండితుడని కవి వర్ణించాడు. ఎండు దుక్కుల్లో సేద్యం చేస్తున్నప్పుడు బరువైన కష్టంతో ఎద్దుల ముక్కుల ద్వారాలనుండి సెగలతో కూడిన ఊర్పులు ముసురుకొన్నా అవి తోక పైకెత్తి వడిగా ముందుకు సాగుతునే ఉంటాయి. ఎద్దుల ముందరి కాళ్ళ గిట్టలను పిల్లిగిట్టలు అంటారు. వాటికి మన్ను తగిలితే సరిగా సేద్యం చేయలేవు. అందువలన ఎద్దులు తెలివిగా అడుగులు వేస్తూ పిల్లిగిట్టలకు మన్ను తగలకుండా సేద్యం చేస్తూ ఉంటాయి. తనకు మేలు కలిగించాలనే ఉద్దేశంతో సాగుతూ విపరీతంగా కష్టపడుతున్న ఎద్దులను చూసి చాలా సంతోషిస్తాడు రైతు. తన కలిమి పండినట్లుగా తలుస్తాడు.రైతుకు కలిమి బలిమి ఎద్దులే. ఎద్దుల అభ్యుదయమే రైతుల అభ్యుదయం. రైతు ఎద్దులను తన కుటుంబ సభ్యుల వలె చూసుకుంటాడు. రైతులు

తాము నివసించే ఇంటిలోనే ఎద్దులను మిగతా పశువులను ఒకవైపు కట్టేసేవారు. వాటికి దోమలు కుట్టకుండా పొగ వేసేవారు. వేడి కుంపట్లు పెట్టేవారు. రాత్రి మధ్యలో కూడా రైతులు నిద్ర లేచి వాటికి మేపు పెట్టేవారు. ఆ రోజుల్లో రైతులు పాలు అమ్మేవారు కాదు. పాలమ్మడం పాపంగా భావించేవారు. పెరుగు నుండి తీసిన వెన్నను మాత్రమే అమ్మేవారు. వెన్న తీసిన తర్వాత మజ్జిగను బానలలో ఉంచి ఇంటి ఆవరణలో ఉంచేవారు. అవసరమైన వారికి ఉచితంగా పోసేవారు. మిగిలినవి మళ్ళీ మూగ జీవాలకే దొన్నెలో పోసి తాపేవారు. నేతితో గంపల కొలది అత్తిరసాలు చేసుకొని తాము తినడమే కాకుండా పదిమందికి పెట్టి, ఎద్దులకు కూడా పెట్టేవారు. మూగజీవులపై అంతటి ప్రేమను చూపేవారు . మూగ జీవులైన ఎద్దులకు రైతుకు ఉన్న అవినాభావ సంబంధాన్ని హృద్యంగా కవి వర్ణించడం కడు రమ్యం.

**కోడి కూతలతో చెలకోల ముల్లు**
**గట్టె బట్టిన చేతులకాటవిడుపు**
**మిట్ట మధ్యాహ్నమే నడివెట్ట వెరచు**
**గాలిలో మూగుటూర్పులు కలసిపోయె**

**మట్టిలో పుట్టి మెట్టి నమ్మకములుంచి**
**పూజలొనరించి పంటసొంపుల వెలార్చి**
**విశ్వమున కీర్తికెక్కిన విమల మతుల**
**రైతుబిడ్డల భావ సంపదల భవము**

**లెట్టివోకాని సిరుల రాబట్టు బుద్ధి**
**వట్టి సేద్యాల పొలములబట్టి కష్ట**
**పడగ గడగిరి మట్టికై బండ్లు గట్టి**
**పల్లెనే యేలె నుత్సాహభరము కరము**

కోడికూతతో లేచి చేలకోల మరియు ముల్లుగట్టె పట్టి సేద్యం చేసే ఎద్దులకు రైతులకు విశ్రాంతి మిట్ట మధ్యాహ్నమే. పొద్దుపొడిచేటప్పటికే కొందరు రైతులు అర్ధ ఎకరం సేద్యం చేస్తారు. ఎండ పడే కొద్దీ గాలి వీచదు. అందుచేత రైతునుండి, ఎద్దులనుండి మూగ ఊర్పులు అంటే ముక్కుల నుండి వెలువడే వేడిగాలులు మధ్యాహ్నం గాలులతో కలిసిపోతూ ఉంటాయి. ఎద్దులు రైతులు పడే కష్టపుశ్రమ ముందు మధ్యాహ్నం ఎండ గొప్పది కాదన్నది కవి అభిప్రాయం. ఇది యధార్థంకదా.

మట్టిలోనే పుట్టి, మట్టిలోనే కాపురం చేసి, మట్టిలోనే మెట్టి పొలాన్ని నమ్ముకొని భక్తిభావంతో పూజ చేసినట్లు, పంటలను పండించి ప్రపంచ కీర్తినిపొందిన మంచి గుణాలు కలిగిన రైతుబిడ్డలు సంపదలను రాబట్టుకోవాలనే కోరికలతో ప్రయత్నంతో చక్కగా సేద్యాలు చేస్తారు. భూమి బలపడుటకై ఒండు మట్టికోసం బండ్లు కట్టి పొలానికి తోలుతారు. విత్తనానికి సిద్ధం చేస్తాడు. భూమిని నమ్ముకున్ననేల తల్లితో సమానం కదా రైతుకు.

## వ్యవసాయం - రైతు కూలీల మిక్కిలి శ్రమ అవస్థలు

రైతు కూలీలది వ్యవసాయంలో మరొక ప్రధాన పాత్ర. కూలికి పని చేసినా పనిభారాన్నంతామోసి రైతు సుఖమయ జీవనానికి మిక్కిలి ఉపకారులు.రైతు విత్తనం వేసి పంటను ఇంటికి చేర్చేంతవరకు వారి కృషి ఎనలేనిది. సిందూరరేఖలో రామిరెడ్డి ఇంటి గాసగాడైన గంగని శ్రమ కథలో చాలా చక్కగా వర్ణించాడు కవి. రైతు కూలీలకు పంటలలో కొంత భాగం దక్కేది. రాత్రింబవళ్ళు శ్రమించి పనిచేసి రైతులు ఇచ్చినంతలో తృప్తిపడే అల్పసంతోషులు. వారులేకపోతే రైతుకు అసలు పనులే జరుగవు.

**పనికి దొంగలు లేరు మా పల్లెలోన**
**పనికి పనికొద్ది కూలి మా పల్లెలోన**
**ముల్లెగా మాకు నిత్తురు పల్లె రైతు**
**లందరిని తీర్చిదిద్దె మా అయ్య నాడు**

పల్లె ప్రాంతాల్లో రైతుపనులు చేసే శ్రమ జీవులు నిస్వార్థపరులు. ఒళ్ళుదాచుకోకుండా తమ శక్తికొలది కష్టపడతారు.వారి కష్టాన్ని కవి చక్కగా వర్ణించాడు.

**కోత మొనగాండ్రు మధ్యలో కొడవలిని యె**
**గేసి కట్టలు గట్టిరి మీసములను**
**తిప్పి రొప్పుచు పైననే తివిరి పట్టి**
**అందమొలికించు చూపులనాండ్రగనుచు**

**తొలి కూతతో సుత**
**చెలి సందిటిని వీడి చేల జేరుచు గూళ్ళన్**
**వలి మంచులోన వేసితి**
**మలవడవగుడాకురాలునని యా నాల్లన్**

జొన్నకోతలు ఆనాటి రోజుల్లో తిరుణాల శోభను తలపించేవి. జొన్నకోతలో కోసిన చొప్పలను కట్టగా కట్టేందుకు కొడవలిని పైకి ఎగురవేసి కట్టకట్టి ఎగురవేసినని కొడవలిని క్రింద పడకుండా మళ్ళీ పట్టుకొని కోతకోస్తూ ఉంటారు కొందరు కూలీలు. వారే కోత మొనగాండ్రు. వారి నైపుణ్యం మెచ్చుకోతగినది. తెల్లవారకముందే భార్యాబిడ్డలనువీడి పొలంలోని పనులకు వెళ్తారు రైతుకూలీలు. పనులు పూర్తి అయ్యేంతవరకు పదిరోజులైనా రేయింబవళ్లు పొలాలలోనే ఉంటారు. జొన్నకోతలు పూర్తి అయిన తర్వాత వాటిని పెద్ద కట్టలుగాకట్టి కొంత వలయాకారంలో చుట్టి పైకి పేర్చుతారు. వర్షాలకు వాటి అంచులలో నీరు నిలువకుండా, పై కప్పులకు దంట్లు చుట్టి చెరుపు కలగని విధంగా చేస్తారు. ఇవి రాత్రి సమయాల్లో మాత్రమే చేస్తారు. ఇది చాలా కష్టంతో కూడుకొన్నపని.మబ్బులో ఏమాత్రం జాగ్రత్తగా లేకున్నా కొయ్యకాళ్ళు కాళ్లలో దిగబడతాయి. దంట్లు కోసుకుంటాయి.పురుగుబుట్టాకుడతాయి మిక్కిలి శ్రమజీవులైన వారు నేర్పుఓర్పుతో చేస్తారు యీ పనులను.కూలీలు తర్వాత వాములను విచ్చపీకి, గట్టికల్లాలకు తోలి గింజలను సిద్ధం చేస్తారు.

## సిందూర రేఖ - ప్రజల ఆహారపు అలవాట్లు

నీటి వనరులు తక్కువ అయిన రాయలసీమ ప్రాంతంలో వర్షాధార పంటలనే ఎక్కువగా పండించే వారు. ఎనభై తొంబై సంవత్సరాక్రితం వరిసాగు మరీ తక్కువగా ఉండేది. రైతులు వర్షాధార పంటలైన కొర్రలు, అరికెలు, జొన్నలు, రాగులు, కందులు, పెసలు, సెనగలు, నరిగలు, ఉలవలు, వేరుసశనక్కాయలు, నల్లారికలు, ఎర్ర కందులు, కుసుమలు, సొద్దలు పండించేవారు. కడప జిల్లా ప్రాంత ప్రజల ఆహారపు అలవాట్లను సంఘ జీవనాన్ని కవి చక్కగా వర్ణించాడు.

గాసగాడైన గంగడు తమభాగం గా వచ్చిన వివిధ గింజలను వివరిస్తూ

**కొర్రలు జొన్నలు రాగులు**
**ఎర్రని కందులును పెసలు ఎన్నిక సెనగల్**
**నర్రిగెలులవలు గోగులు**
**కర్రిగలారికెలు మాకు కలిగెన్ చాలన్ అంటాడు**

రామిరెడ్డి ఇల్లాలు లక్ష్మమ్మ కూలివాళ్ళకు అన్నం పెట్టే తీరును కవి ఇలా వర్ణిస్తాడు.

**గుంత మూకట్ల నిండుగా కోరినంత**
**గట్టిపెల్లల అన్నము కందిపప్పు**
**పెట్టి మాయమ్మ లక్ష్మమ్మ గట్టి పెరుగు**
**తోటి కొర్రన్నమే స్వర్గ తుల్యమన్న**

రైతు రామిరెడ్డి భార్య తమకు పనికి వచ్చిన కూలివాళ్లకు, తమ ఇంటి గాసగాళ్ళకు కందిపప్పుతోకూడిన "గట్టి పెల్లల అన్నం", గట్టి పెరుగుతో కూడిన కొర్ర అన్నం పెట్టింది. కడపజిల్లాలో కందులు చాలా రుచికరంగా ఉంటాయి. గట్టి పెల్లల అన్నానికి ఒక ప్రత్యేకత ఉంది. జొన్నలను రోట్లోవేసి కాస్త కాస్త నీళ్లు పోస్తూ దంచుతారు. ఇప్పటిలా మర మిషన్లు అప్పుడు లేవు. జొన్నలను దంచేటప్పుడు వాటిపైన ఉండే పచ్చని పొట్టులాంటి పొర ఊడిపోతుంది. రోజూ జొన్నల్ని దంచగా వచ్చిన ఆ పొట్టును ఒక బానలో వేసి నీటిలో నానబెడతారు. నాలుగైదు రోజులు నానిన ఆ పొట్టు పుల్లగా తయారవుతుంది. జొన్నసంగటి చేసే రోజు జొన్నలను బాగా యిసిరి పెద్ద కుండలో వేసి ఎసురు పెట్టి మరిగిస్తూ నాలాగైదు రోజులనుండి నానబెట్టిన పొట్టును ఆ ఎసటి కుండలో పోస్తారు. అప్పుడు జొన్న పక్వంగా ఉడికి పెద్ద పెద్ద పెల్లలుగా ఏర్పడుతుంది. వాటిని విరిచి కందిపప్పులో అద్దుకొని తింటారు. ఆ విధంగా తయారు అయిన జొన్నన్నం/ జొన్న సంగటి వారం రోజుల వరకు ఏమాత్రం చెడిపోకుండా నిల్వ ఉంటుంది. దీనినే గట్టిపెల్లలు అన్నం అని పిలుస్తారు. వండిన ఆహారాన్ని నిల్వ చేయడంలో నాటి తరం వారి మేధో సంపత్తికి నిదర్శనం గట్టిపెల్లల అన్నం. నిలువ ఉంచిన అన్నం చాలా శక్తినిస్తుంది. పోషకాలనిస్తుంది. అందుకే జొన్నన్నం నిలువ చేస్తారు.కొర్రన్నం సహజంగా వేడి చేస్తుంది. పెరుగులో కలుపుకొనితింటే చలువ చేస్తుంది. రైతులు వైద్య విద్యనభ్యసించని గొప్ప సహజ వైద్యులు కూడా.

## సిందూర రేఖ - సంఘ జీవనం

**పల్లెనేలెడు వనితలు పరుగులెత్తి**
**యింపు దళుకొత్త సంగటి గంపలెత్తి**
**చేల శ్రమియించుచు కూలీల చేతులందు**
**ముద్దలుగ పెట్టినారు సమ్మోదము మీర**

**అన్నపూర్ణలు మా యూరి ఆడవారు**
**ముద్దు కూళుళ్ళు సంగటి ముద్దలెత్తి**
**కడుపునిండగ బెట్టిరి గట్టిపెరుగు**
**గడ్డలను విరిచి చేతులకందినంత**

రైతుకూలీలు పొలంలో పనిచేసే సమయంలో ఇంటి వద్ద ఉండే రైతుల ఆడవాళ్లు సంగటి చేసి కొత్త గంపలలో వేసుకొని పొలం వద్దకు వస్తారు. సంగటి ముద్దలను కూలీలు చేతులందే పెట్టుకొని అమృతప్రాయంగా తింటారు. కూలీలు అడిగినన్నీముద్దలు అన్నపూర్ణలవలె ఆడువారు లేదనకుండా వారికి ఆప్యాయతతో పెడతారు. గట్టిపెరుగు విరిచి చేతులకందించి పెట్టడం ఆడువారి ఉదాత్తగుణానికి నిదర్శనం. రైతు రైతుకూలీలు అనే భేదం లేకపోవడం సామ్యవాదం. రైతులతో పాటు వారింటి ఆడవాళ్లు వ్యవసాయపు పనులలో కలిసి పనిచేయడం పల్లె సాంఘిక జీవనాన్ని తెలియజేస్తున్నది.

**కంచెలను దొండ దోసలు మించికాసె**
**బీదబిక్కికి కూరల బెడద లేదు**
**జొన్నపిసుకుల్ల దోసెలు నున్నపప్పు**
**చాల తింటిమి మొలత్రాళ్ళు సళ్ళు విడిచి**

**కందికాయలు అలసందకాయలనప**
**కాయలుడికించి తిన్నాము కడుపులుబ్బ**
**కొత్తపంటల వంటలు కోడెలకును**
**గంపలకొలది తినిపించగలిగినాము**

రైతుల పొలాలలోమరియు గెట్లవారల వెంబడి ఎగబ్రాకిన అనేక రకాల తీగలకు రకరకాల కూరగాయలు కాస్తాయి.రైతులు, రైతుకూలీలు మరియు ఇతరులు కూరగాయలు కొనే బెడద లేకుండా వాటిని ఉపయోగించుకొని సుఖజీవనం సాగించేవారు. సాధారణంగా రైతులకు కూరగాయలు కొనవలసిన అవసరం రాదు. విత్తనాలు విత్తే సమయంలోనే పొలంలో అక్కడక్కడా, గెట్ల వెంబడి వివిధ కూరగాయలు విత్తనాలను కూడా విత్తుతారు. పండించిన వాటిని ఇతరులకు కూడా ఉచితంగా ఇస్తారు. ఇతరులు ఎవ్వరైనా కోసుకొన్నా ఏమీ అనరు. పల్లె వాతావరణం అటువంటిది. పక్వానికి వచ్చిన జొన్న కంకులనుండి పచ్చి

జొన్నలు తీసి రోటిలో వేసి బాగా రుబ్బి దోసెలుగా పోసుకొని తింటారు. వడలు చేసుకొని తింటారు. ఆ పిండిలో పెసరపప్పును కొద్దిగా బెల్లాన్ని కలిపి నున్నగా ఎనుపుతారు. వాటినే జొన్న పిసుకుళ్లు అంటారు. అవి చాలా రుచి, బలం కూడా. కందికాయలను, వేరుశెనక్కాయలను, అలసంద, ఆనపకాయలను ఉడకపెట్టుకుని తింటారు. వాటిని దండిగా తిన్నప్పుడు కడుపు కాస్త ఉబ్బడం చేత మొలతాళ్ళను కాస్త సళ్ళు చేసుకొని తింటారు. గిత్తలకు, పశువులకు కూడా వాటిని గంపల కొలది పెడతారు.రైతు జీవకారుణ్యానికి ఇది నిదర్శనం. గ్రామ ప్రజల ఆహారపు అలవాట్లను, జీవన విధానాన్ని చక్కగా వివరించాడు వై.సి.వి. రెడ్డి.

## వ్యవసాయంలో అటుపోట్లు - రైతుల, రైతు కూలీల కడగండ్లు

దేశ సౌభాగ్యానికి మూలకారకులైన రైతులు వరుసగా వచ్చే కరువుల చేత, పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవడం చేత, స్వార్థపరులైన పెట్టుబడి దారుల వంచన వలన దుర్భర పరిస్థితులలో జీవిస్తున్నారు. పెద్దరైతులు పేదరైతులైతే, సన్నకారు, చిన్నకారు రైతులు కూలీలుగా మారుతున్నారు. వీరిని నమ్ముకున్న రైతుకూలీలు పూటగడవని దుర్భర స్థితిలో ఉన్నారు

వరుస కరువులు, చేసిన దానధర్మములు రామిరెడ్డి ఆస్తులను వేలానికి తెచ్చాయి. గంగడు కావ్య ప్రారంభంలో

**దడబిడనోబిగాడు తన తప్పెటపై చిరు మోదుమోది యె**
**ద్దడిబడి పాలిపోయి కలతన్ దిగజారెడు రామిరెడ్డి ద**
**న్పెడు పిడవద్ద నందరి వివేచనల గురి చూచి గ్రామ చా**
**విడి కడ నమ్మజూపె తన వేలము పాటల వేటలాడుచున్**

గ్రామస్తులందరినీ కష్టకాలంలో ఆదుకొన్న రామిరెడ్డి దుస్థితిని చూచి తన తప్పెటను గట్టిగా మోదలేక పోయాడు. దారిద్ర్యంతో రామిరెడ్డి తన ఆస్తులు వేలానికి రావడంతో క్రుంగిపోయాడు. రామిరెడ్డిచేత సహాయం పొందినవారెవరూ కష్టకాలంలో ఆయనకు సహాయం చేయలేదు. స్వార్థంతో నిండిన సమాజాన్ని గుర్తించక సమాజం కోసం తన యావజ్జీవితాన్ని గ్రామ ప్రజలకు అంకితం చేసి అప్పులపాలై కుమిలినాడు. రైతు కూలీలైన గంగడు, ఓబిగాడు, బడిపంతులులు మాత్రమే రామిరెడ్డి పరిస్థితికి వగచారు. ఆ గ్రామంలోని పెట్టుబడిదారులైన రైతులెవ్వరూ రామిరెడ్డికి సహాయం చేయకపోగా, ఆయన ఆస్తులను కొనడానికి ఎగబడ్డారు. కనీసం సానుభూతి కూడా చూపలేదు వారు. సాటి రైతుకు ఆపద సమయంలో సాయపడని పెట్టుబడిదారి రైతులు కడు పేదవారైన రైతు కూలీలకు యే మాత్రం సహాయం చేయరనే వాస్తవాన్ని సమాజం ముందుంచాడు వైసీవి. రామిరెడ్డిని ఆశ్రయించుకొని ఉన్న రైతు కూలీలు పూటగడిచే స్థితి లేక దయనీయస్థితికి వచ్చారు.

**వామికొండలవంటి ఆసాములిట్లు**
**వాటుపడిపోయి కూటికై వాసిపోయి**
**దిక్కుతోచక చలియించి తెలివి మాలి**
**అయినకాడికి బతుకుట కయ్యెనిపుడు**

**ఇట్టి కట్టడి రట్టడి కేది కార**
**ణంబు యెవ్వరు చెప్పరు నాకు చూడ**
**దోపిడీలకు తావుగా తోచె నీ వ్య**
**వస్థ దీనిని మార్చుటవస్థయయ్యె**

పాతనీతులను నమ్మి ముందుచూపు లేకుండా రామిరెడ్డివంటి పెద్దమోతుబరి రైతులెందరో పెట్టుబడిదారి వ్యవస్థలో నాశనం అవుతున్నారు. దోపిడీదారులు శ్రామికుల శ్రమను దోచుకొంటారే తప్ప న్యాయాన్యాయాలను ఆలోచించారు. వాస్తవాన్ని గ్రహించి ప్రజలుమారి పాతనీతులకు స్వస్తి చెప్పాలనే సూచన చేశాడు కవి.

**కుండగోకుడుకూడ లేకుండ వట్టి**
**కడుపుతో కూలి పోవుటకౌనె చెపుమ**
**కరువులకు నాటపట్టుగా పరువు బరువు వచ్చు**
**వచ్చు మూడేండ్లకొకసారి వరుస వరుస**

**కరువులో నప్పు పుట్టదు కాస్తో కూస్తో**
**ఆస్తిలేకున్న చిక్కదు ఆస్తులెప్పుడు**
**దోపిడీలను చేయించు దోపిడీలు**
**లేక ఆస్తులురావు రాలేదు వెనుక**

కుండగోకుడు అయినా లేకుండా ఖాళీగా ఉండే కాలే కడుపుతో కూలిపనికి పోవడం కుదరదు. పోకుంటే పూట గడవదు. వరుస కరువులతో జీవనం సాగదు. ఆకలికి కడుపు నింపుకోవడానికి అప్పులు చేయవలసి వస్తుంది. ఆస్తి లేకపోతే అప్పులు పుట్టవు. కరువులో పెట్టుబడిదారులు శ్రామికులను దోచుకోవడానికి సిద్ధంగా ఉండి, అవసరానికి డబ్బులు ఇచ్చినట్లు ఇచ్చి అదను చూసి పేదల ఆస్తులను కాజేస్తారు. బడుగులను దోపిడీలు చేసి తమ ఆస్తులను పెంచుకుంటూ ఉంటారు. పెట్టుబడిదారి వ్యవస్థను గర్తించాడు వై.సి.వి.

**ఒకని దయొకనికెందుకు సకల ప్రజలు**
**శాంతి సౌఖ్యాలతోయున్న చందమున**
**పాతనీతులకాయువు పట్టు సడలే**
**అదిగో! ఉదయమ్ము అందులో అదనుముట్టి**

**ఎంతలోతైన విషయమీ చెంత కంత**
**పేదసాదల గురికాగ పెద్దవారు**
**తరచి చర్చోపచర్చల**
**తర్కహితము గతికి గతితార్కమై తీవ్రగతికి చేరె**

**అక్కలించిన డొక్కల వెక్కసమ్ము**
**ధనమదాంధుల తలదన్ని ధర్మ సమ్మ**
**తమ్ముగా సౌఖ్యముల నిల్పుతారు వారు**
**దూరభారమ్ము లేదు సిందూర రేఖ**

ఆకలితో నకనకలాడిన డొక్కలలోనుండి పుట్టిన పేదవారి హృదయవేదన క్రోధాగ్నిగా మారి బూర్జువా వ్యవస్థలోని ధనమదాంధులను బూడిదచేస్తుంది. అభ్యుదయవాదం అంతటా వ్యాపించి సామ్యవాద వ్యవస్థను తెస్తుంది. సిందూరరేఖ దగ్గర పడుతున్నది. ఆది కర్షకుల జీవితాలలో కొత్తవెలుగులు తెస్తుందనే ఆశాభావం ప్రకటించాడు కవి.

సోషలిజం వచ్చేందుకు ఎంతో దూరం లేదని, అది సమాన న్యాయాన్ని సర్వజనావళికందించి, శ్రమను గౌరవించి, కర్షకజీవుల దుఃఖాన్ని పోగొట్టి సుఖాన్ని కలుగజేసి వారి జీవితాలలో వెలుగులు నింపుతుందని చాటుతూ కర్షకులపట్ల తన అభిమానాన్ని చాటుకొన్నాడు "సిందూర రేఖ" కావ్యంలో వై.సి.వి. రెడ్డి.

సిందూర రేఖలో రైతు వ్యవసాయ జీవనం సంపూర్ణంగా చిత్రీకరించబడింది. అంతే కాకుండా ఈ కావ్యం జనపదాల జన జీవన స్రవంతికి అద్దంపడుతుంది.ఎనభై తొంబై సంవత్సరాల నాటి పల్లెపట్టుల ఉనికిని మనకు తెలియజేస్తుంది. ఉదయం నుండి రాత్రి వరకు పల్లె ప్రజల దైనందిన జీవనం, గ్రామ కట్టుబాట్లు, ఆచార వ్యవహారాలు, పల్లె చుట్టూ అల్లుకున్న వాతావరణం ప్రతిబింబిస్తుంది.

జీవద్భాషకు మూలమైనవి మాండలికాలు. భాష ప్రజల జీవనానికి ప్రతిరూపం. సిందూర రేఖ కావ్యంలో అగ్రు, ఆవరపుదుక్కి, ఉద్ది, ఎన్ను, కుండగోకుడు, కల్లు వాదెర, కారుపొట్టేలు, కాసికాలు బారు, కోంద్ర, కోటేరు, కోలె, గట్టిపెల్లలన్నం, గాజ, గాదెలు, గుంతమూకటి, గుద్దేలి, గొర్రుకర్ర, గొర్రుదిండు, చొప్ప గుండు, జడిగం, జొల్ల, జొన్న వగడు, తలమేపు, తళిగె, దంట్లు, దబ్బర, దుక్కి, నర్రిగెలువలు, పన్నకంబు, పడుగు గగ్గులు,మట్టెకోడెలు, ముంగారి పదును, మెట్లగుంటక, వడిసెల, శాద మొదలైన స్థానిక మాండలిక భాషా ప్రయోగాలు అనేకం చోటుచేసుకొన్నాయి.గ్రామ జీవనం అంటే వ్యవసాయ జీవనం. వ్యవసాయ జీవనం అంటే గ్రామ జీవనం. ఈ రెండింటిని వేరు చేసి చెప్పలేం. నాటి పల్లెల ఉనికిపట్టులను తెలుసుకోవాలంటే సిందూర రేఖవంటి కావ్యం మీద సిద్ధాంత పరిశోధనలు తప్పక జరగాలి. సిందూర రేఖ కావ్యం పిహెచ్.డి. (డాక్టరేట్) స్థాయిలో పరిశోధన చేయదగిన ఉత్తమ కావ్యం.

❖ ❖ ❖



**డా॥ జి.వి. సాయిప్రసాద్**
సెల్ : 8333010428

# దక్షిణానిలము

"దక్షిణానిలము" కావ్యం సంక్రాంతి పత్రికలో ప్రచురించారు. ఈ గేయకావ్యం ఎమ్మనూరు చినవెంకటరెడ్డి తల్లిదండ్రులు యమ్మనూరు లక్ష్మమ్మ, యమ్మనూరు కొండారెడ్డిలకు అంకితమిచ్చారు. ఈ కావ్యానికి పీఠిక పేరుతో పుట్టపర్తి నారాయణాచార్యులు ముందుమాట రాశారు. 1960 సంవత్సరంలో ప్రచురించారు. యమ్మనూరు చినవెంకటరెడ్డి గారి ప్రతిభను గూర్చి పుట్టపర్తి వారు–

"రెడ్డి వ్రాసిన దక్షిణానిలములో పొలములకు కాపుండి వడిసెళ్ళను జిమ్ముచున్న జవరాలు "గాంధార మూర్ఛనా క్రమములో పాడినదట. ఆమెకంత సంగీతము వచ్చియుండుట ఆశ్చర్యమేమైనను కవికి సంగీతము నందుగల యభిమానము మాత్రము వ్యక్తమగుచున్నది. రాయలసీమ సాహిత్యము నీతడెంతగానో చదివినట్లున్నది. కొన్ని కొన్ని చోటులలో వారి పలుకుబడి కొట్టొచ్చినట్లుగా కనబడును."

అని చెప్పటం యమ్మనూరి వారికి గేయంపట్ల, రాయలసీమ ప్రాంతం పట్ల ఎంత ప్రేమ ఉందో వ్యక్తమవుతుంది. ఈ కావ్యంలో ప్రబంధ భాషాశైలి ఎక్కువగా ఉన్నట్టు మనకర్థమవుతుంది. యమ్మనూరు వారు చెప్పిన "గాంధారమూర్ఛనాక్రమము" –అన్న పదానికి గంధర్వులు పాడే ఒక ప్రత్యేకమైన స్వరపద్ధతి" అని అర్థం చేసుకోవాలి. అంటే ఓ పల్లె పడుచు అంత పద్ధతిగా మంచె మీద కూర్చుని, వడిసె విసురుతూ ఆలపించిందట. ఇలా సన్నివేశాన్ని ప్రత్యక్షంగా చూస్తే గాని రాయలేం. గ్రామ జీవితంలో పల్లె పడుచుగాన ప్రావీణ్యాన్ని గుర్తించి కావ్యంలో అక్షరీకరించటం, సంగీతమందున్న పిచ్చే. ఆ పద్యం రాయటానికి కారణమై ఉంటుంది.

యమ్మనూరు చినవెంకటరెడ్డి గారు ఈ కావ్య లక్ష్యాన్ని ఉద్దేశ్యాన్ని చివరి రగడ (పద్యం) లో, రెండు కోణాల్లో స్పష్టం చేశారు. ఈ విషయం మనకు ఆ రగడలోని మూడవ పాదంలో కనిపిస్తుంది. అందులో

**రావలచి, పోవలచి – రాగులకు, భోగులకు**
**నుత్సుకత్వమున లీలోద్యానముల దర్శ**
**నములిచ్చి – లోక చింత భాగ ధేయముగా**
**అలసముగ దక్షిణానిలము మాగడ్డపై వీచెనమ్మా! యిపుడె!**

దక్షిణానిలము రాగులలో, భోగులలో ఉత్సాహము నింపుతుందట. అలాగే లోకంలో ఉన్న చింతలను పోగొట్టుటకు, అలా ప్రయాణం చేసి వారిలో ధైర్యాన్ని ఓదార్పును నింపిందట. లోకంలో సామాన్యుల పడుతున్న కష్టాలను, పరిష్కరించి, తన చల్లని ఒడిలో కూర్చోపెట్టుకొని, అనేక సూచనలు చేసింది అని కవి అంటున్నాడు. మొదటి కోణం ప్రకృతిని లాలించటం, ప్రేమించటం రెండవ కోణం దీనుల, దళితుల, దరిద్రుల, పేదల, కార్మికుల, కర్షకుల, మహిళల – తనదైన పద్ధతిలో మార్గాలను సూచించిందట.

"దక్షిణానిలము" అంటే దక్షిణము నుండి వచ్చే చల్లని గాలి. దక్షిణమువైపున ఉన్నది కేరళ రాష్ట్రం. ఆ కేరళ రాష్ట్రంలో మలయ పర్వత ప్రాంతం ఉందట. ఆ మలయపర్వతం నుండి వీచే గాలి ఓషధీగుణాలతో కూడినదని, ఆ గాలి అలా అలా పయనించి మనవైపుకు రావడం ఋతుగమన ప్రవేశమని, ఆ గాలి అలా వీయటం వల్ల వాతావరనంలో చాలా మార్పులు కలుగుతాయని అంటారు. ఆ మార్పులు చైతన్యవీచికలని, మనసులలో ఆనందం నింపుతాయని ఒక అర్థం. ఆంధ్రదేశంలో సామాజిక ఉద్యమాలు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. అవి కేరళ, తమిళనాడులో ముందుగా ప్రారంభమయ్యాయి. తర్వాత ఆంధ్రదేశంలో చైతన్యాన్ని రగిలించాయి అన్నది మరో అర్థం. శ్రీనారాయణ గురు ధర్మపరిపాలన ఉద్యమం (1888), కేరళలో ప్రారంభమై దక్షిణభారత దేశవ్యాప్తమైంది. ఈ ఉద్యమంలో ప్రధానంగా కుల వివక్ష, ఆలయ ప్రవేశం, మతసంస్కరణ, ఆత్మగౌరవ ఉద్యమం, మహిళలకు సమాన హోదా కల్పించటం – ఇలాంటి సంస్కరణలు జరిగి, ఆ తర్వాత మెలమెల్లగా, ఆలస్యంగా ఆంధ్రలో ప్రవేశించాయి. అంటే ఈ కావ్యంలో కవి రెండు కోణాల్లో, ప్రకృతి పరంగా, సామాజికపరంగా వచ్చిన చైతన్య వీచికలను చర్చించారన్నమాట – ఈ రెండు అంశాలను దృష్టిలో పెట్టుకొని ఈ కావ్యాన్ని చర్చించటమే ఈ వ్యాస ప్రధానోద్దేశ్యం. ఈ కావ్యం గేయ పద్ధతిలో ఉంది. ఆధునిక ఛందస్సులో చెప్పాలంటే ఖండగతిలో ఉంది. ఖండగతిలో 5+5, 5+5 – మాత్రలు ఉంటాయి. ప్రతి పాదంలోనూ 5+5, 5+5 మాత్రలు ఉంటూ చివరి పాదంలో మాత్రలకు పరిమితి లేదు. అదే రగడలో చెప్పాలంటే ద్విరదగతి రగడలో ఉంది.

## ద్విరదగ గతి రగడ - లక్షణాలు

ఈ రగడలో నగ, నలల, భల, సల, త, ర గణాలలో ఏవైన నాలుగు గణాలు ఉండవచ్చు. తృతీయ గణాద్యక్షరం యతిస్థానం. ఉదాహరణకు.

**రోలంబ ఝుంకార రుతి షడ్జ మన సోలి**

గమనించవచ్చు. ఈ కావ్యంలో 100 రగడలున్నాయి. కొన్ని చోట్ల మాత్రలు అటు, ఇటుగా ఉండవచ్చు. యతిస్థానాలు కూడా కచ్చితంగా పాటించినట్టు మనకు కనపడదు. ద్విరదగతి రగడ లక్షణాలు లేదా ఖండగతి ప్రధానంగా కనిపిస్తుంది.

## ప్రధాన ఇతివృత్తము

"దక్షిణానిలము" అలా అలా ప్రయాణిస్తూ, తన చల్లని చేతులతో ప్రకృతిని అన్యాయమై, దోపిడికి గురై, అణిగిపోయిన ప్రజలను పలకరిస్తూ ధైర్యం చెప్పిందంటున్నాడు. ప్రకృతిలోని వివిధ అంశాలను వర్ణిస్తూ, ఆ చల్లని పవనం గిలిగింతలు పెట్టిందట. సామాన్యులకు ధైర్యం చెప్పిందట. పీడితులను ఓదార్చిందట. దళితులలో చైతన్యం కలిగించిందట. ఇలా సాగుతూ పోయి ఎన్నో కబుర్లు చెప్పింది. కాకపోతే ఆలస్యంగా వచ్చిందంటున్నాడు. మనం ఇంతకు ముందు చెప్పుకున్నట్టుగానే ఉద్యమాలు ఆలస్యంగా ఆంధ్రదేశంలో అడుగుపెట్టాయి అని పరోక్షంగా భావించాలి. అందుకే ప్రతి రగడ చివర "అలసముగ దక్షిణానిలము మా గడ్డపై వీచెనమ్మా! యిపుడె" అని ముక్తాయింపు నిస్తున్నారు వైసివిగారు.

## సామాజిక చైతన్య వీచిక

ఈ కావ్యాన్ని రెండు కోణాల్లో ఆవిష్కరించవచ్చు. మొదటిది దక్షిణము నుండి వీచిన గాలి, సామాన్యులను ఎలా ఓదార్చి చైతన్యం నింపిందీ, రెండవది ప్రకృతిపట్ల ఎలాంటి వైఖరి ప్రదర్శించిందీ – అనే విషయాలపై చర్చ చేయవచ్చు. భాషా విషయంగా మూడవ చర్చ చేయడానికి అవకాశం ఉంది. పరపీడనకు, భావదాస్యానికి దళిత జీవులలో నింపిన ధైర్యాన్ని గూర్చి

**తరతరమ్ముల భావదాస్యమ్ము దొలగించి**
**పరపీడనా దురాచరణములు మాయించి**
**దళిత జీవుల యెదల ధైర్యమ్ము లెలయించి**
**అలసముగ దక్షిణానిలము మాగడ్డపై వీచెనమ్మా! యిపుడె!**

అని అంటున్నాడు. పరపీడన, భావదాస్యమ్ము – ఇప్పటికీ కొనసాగుతున్నాయి. దళిత జీవులలో ధైర్యము కొంత పెరిగిందనే చెప్పాలి. ప్రజలలో అభ్యుదయం గురించి

**అమరవీరుల త్యాగమాశలకు నెగప్రాక**
**ప్రగతిశీలుర భావ బంబరము నది యింపు**
**నరజాతిలో క్రాంతి నవనవోన్మెషమై**
**అలసముగ దక్షిణానిలము మా గడ్డపై వీచెనమ్మా! యిపుడె!**

అని అంటున్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ఎందరో వీరులు తమ ప్రాణాలు త్యాగాలు చేశారు. దానితో ప్రగతి అంచెలంచెలుగా, తుమ్మెద తిరిగినట్టుగా, ఎగిరినట్లుగా, కొత్తపుంతలు తొక్కింది. ప్రజలు చైతన్యవంతులయ్యారు.

దళిత జీవులలో వెన్నెల వెలుగులు నింపిందట. ఆ విషయాన్ని చెబుతూ

**దళిత మానవ తాప తప్త జీవన తటా**
**కములలో, భంగలోకములలో, సముదీర్ణ**

**తమములో, చంద్రికా సముదీర్ణతలు బెంచి**
**అలసముగ దక్షిణానిలము మాగడ్డపై వీచెనమ్మా! యిపుడె!**

చంద్రికా సముదీర్ణతలు అని చెప్పటం – చంద్రిక – అంటే వెలుగులు బాగా పెంచింది, సంతోషం పెంచింది అనే అర్థంలో వాడుతున్నారు కవి.

భాగ్యవంతులకు సూచన చేస్తూ మరో సందర్భంలో...

**నిలువెల్ల సుఖముగా నిలను బ్రతికెడు భాగ్య**
**వంతులకు కన్నులను బాగుగా దెఱచి, చూ**
**డుడు – బీద జనుల యగ్గడువైన గోడనుచు**
**నలసముగ దక్షిణానిలము మా గడ్డపై వీచెనమ్మా! యిపుడె!**

అంటున్నాడు. ఉగ్గడువు అంటే మిక్కిలి, అధికము అనే అర్థాలున్నాయి. ఈ గేయంలో గుండె అంతా "ఉగ్గడువు" అనే పదంలో దాగుంది. మిక్కిలి బాధపడుతున్నారట. అధికంగా అల్లాడిపోతున్నారట బీదలు. కావున భాగ్యవంతులు, కన్నులు బాగా తెరిచి వారిని ఒకసారి చూసి, వారి గోడులో భాగం పంచుకోమని సూచన చేస్తున్నారు కవి. మీరు సుఖముగా అనటం లేదు. నిలువెల్ల సుఖము అని సుఖానికి ముందు ఒక విశేషణాన్ని వాడారు. తల నుండి పాద చిటికెనవేలుదాక, సుఖాన్ని పొందారు. కనీసం ఇప్పుడైనా కనులు తెరవండి అని చురకలంటిస్తున్నారు వైసీవి గారు.

కటిక ఆకటి చీకట్లలో మూలిగే కటుజీవితములను ఓదారుస్తూ, మనసులను పెనువేసు కొని, హాయినిచ్చిందట దక్షిణపుగాలి. కోపంతో, అసహ్యించుకుంటూ, సామాన్యులపై చిందులు వేస్తూ, ఎప్పుడూ హీనంగా చూస్తూ – రుసురుసలాడే మనుషులుంటారు, వారు నరరూప శార్దూలాలు. వారికి దూరంగా ఉండండి. మీకు నేను తోడుంటాను అని అభయమిచ్చిందట దక్షిణానిలం.

మహిళలకు బాసటగా, దీనమైన వారికి ధైర్యాన్ని కల్పించి – బ్రతుకు బండిని ముందుకు నడిపిందట దక్షిణానిలం. తల్లి తన బిడ్డను పాలపొత్తిళ్ళ నుండి ప్రక్కన పెట్టి జీవన పోరాటంలో పొలము పనికి వెళ్ళిన మహిళను

**"తొలికోడి కూత బొత్తుల పాప నెడబాసి**
**మలికోడి కూతతో పొలము జేరెడి బ్రతుకు**
**చిఱునగవు విడని వడిసెల కన్నె దిలకించి**
**అలసముగ దక్షిణానిలము మా గడ్డపై వీచెనమ్మా! యిపుడె!**

ఇలా చిత్రించారు వైసివి గారు. చెమటతో, అలసిన దేహంతో, ఆకలి దహించి వేయగా అల్లాడిపోయే బిక్షకులను ఓదార్చిందట దక్షిణానిలం. జీవితమంతా చెట్ల నీడలె ఇల్లుగా, కన్నీళ్ళే దాహంగా తాగి, దుఃఖములను ఆహారంగా తిని కుతిలపడే కోమలులకు దన్నుగా నిలిచింది దక్షిణానిలం. ఈ సందర్భంలో చెప్పిన రగడ చదివితే హృదయం ద్రవిస్తుంది.

**“చెట్లనీడలె తమకు జీవితాశ్వాసమై**
**తమ బాష్పములె ద్రావి, తమ దుఃఖములె మెసవి**
**కుతిల పడి వెతల బడు కోమలుల నోదార్ప**
**అలసముగ దక్షిణానిలము మాగడ్డపై వీచెనమ్మా! యిపుదె!**

దళిత మానవులు చేసుకున్న కష్టాలు తొలగుతాయని, అన్నార్థులు చేసుకొన్న ఘోర రుణాలు తీరుతాయని, దక్షిణానిలం చెబుతుంది. మరో సందర్భంలో

**ప్రొద్దస్తమానం పొలములో పొరలాడి**
**యెండవానల కోర్చి బండకష్టముచేసి**
**పులినొప్పులను నిరసిలు కూలి ప్రజలక**
**అలసముగ దక్షిణానిలము మాగడ్డపై వీచెనమ్మా! యిపుదే!**

అంటాడు. ప్రొద్దస్తమానం పొలములో ఉండేది రైతు. బండ కష్టము చేసేది రైతు. ఇక్కడ పులినొప్పులు – అనే పదబంధాన్ని ప్రయోగిస్తున్నారు కవి. పులి నొప్పులు అన్నది అచ్చమైన గ్రామీణ వ్యవహారం పులినొప్పులు – తీవ్రంగా బాధపడెతాయి. బయటికి కనిపించక, శరీరాన్ని నొప్పులకు గురిచేసేవి. శరీరం పులిసి పోయింది అని అంటుంటారు. కష్టానికి బలైపోయింది అనే అర్థంలో వాడుతుంటారు. రైతులకు వెన్నుదన్నుగా నిలిచి ఆహ్లాదపరిచింది దక్షిణానిలము అంటున్నారు కవి. కార్మికులకు భవిష్యత్తు మీదే అని అంటూ అభయమిచ్చిందట ఈ విషయాన్ని

**పల్లెపట్టుల యందు బని చేసుకొనుచున్న**
**కార్మికుల, కర్షకుల గనుగొంచు, రాబోవు**
**కాలంబు మీదె నిక్కమ్ముగా నని పల్కి**
**అలసముగ దక్షిణా నిలము మా గడ్డపై వీచెనమ్మా! యిపుదె!**

నిక్కమ్ముగా కష్టాలు పోతాయంటున్నాడు. కుటిల మానవులు ఎలా కూలిపోతారో చెబుతూ

**పరుల రక్తము తమ బ్రదుకుగా, ప్రజల వం**
**చిచుటయె విద్యలై శీర్షమెత్తుచు దిరుగు**
**కుటిల మానవులింక గూలెదరు నిజమంచు**
**అలసముగ దక్షిణా నిలము మా గడ్డపై వీచెనమ్మా! యిపుదె!**

పెట్టుబడిదారుల గురించి, భూస్వాముల గురించి చెబుతున్నాడు. బాధితులు పడే దీనభావమును వ్యాఖ్యానించడానికి దక్షిణానిలము బయలుదేరిందట. ఈ విషయాన్ని గూర్చి

**తము గొల్చు పూల చిత్తరుల యెదదల సుడియు**
**భావముల విరియించు పనిలో నిమగ్నమై**
**బాధితుల దీన భావముల వ్యాఖ్యానింప**
**అలసముగ దక్షిణానిలము మా గడ్డపై వీచెనమ్మా! యిపుదె!**

దక్షిణానిలం బాధలను వ్యాఖ్యానిస్తుంది.

కష్టనష్టాలను గురించి విచారిస్తుంది.

దరిద్రము ముఖమునందు కనిపించే తరుణుల పరిస్థితి గురించి, వారి రక్షణ గురించి

**ఆలోచనా దైన్యమాస్యముల గనుపింప**
**సుతులకై పతులకై మతులు పోగొట్టుకొని**
**తలగొట్టు కొనుచున్న తరుణులను రక్షింప**
**అలసముగ దక్షిణానిలము మాగడ్డపై వీచెనమ్మా! యిపుడె!**

దీనస్థితిని పోగొట్టడానికి, కరువుతో ఆత్మహత్యలు చేసుకోవటమో లేదా ఫ్యాక్షన్ రాజకీయాలతో భర్తలు, కొడుకులను కోల్పోయిన మహిళలకు రక్షగా నిలబడుతుంది దక్షిణానిలం. అప్పులు కట్టడానికి పొలమమ్మి, కష్టాలను వరించే రైతుల గూర్చి చెబుతూ

**కష్టపడి, నష్టపడి కలపొలములో సుడిసి**
**యప్పులకు పొలమమ్మి, ముప్పులను వరియించు**
**అసహాయకృషిక భావావేశముల జూడ**
**అలసముగ దక్షిణానిలము మా గడ్డపై వీచెనమ్మా! యిపుడె!**

"అసహాయకృషిక" అన్నారు. 'అసహాయుడు' ఎవరూ సహాయం చేయని రైతు. అప్పటికి, ఇప్పటికి, ఎప్పటికీ రైతును అర్థం చేసుకోని పరిస్థితిలో ఉంది సామాన్య ప్రజానీకం, ప్రభుత్వం, వారి సమస్యలను వినే స్థితిలో లేదు. అందుకే రైతు అసహాయుడు. దీంతో తను చేసుకున్న అప్పులకు బాధ్యత వహిస్తాడు. అన్నం పెట్టే పొలాన్ని అమ్ముతాడు.

ఆకలితో అల్లాడిపోయే మానవుల ఆకలి తీర్చటానికి పయనమై వస్తున్నాను అని చెప్పిందట దక్షిణానిలము. ఈ సందర్భంలో

**రెక్కాడితే గాని డొక్కాడదనుకున్న**
**భావమున దీక్షమై పని చేసి కడవడిన**
**యాకొన్న మానవుల కాకలి కుదింపగా**
**అలసముగ దక్షిణానిలము మా గడ్డపై వీచెనమ్మా! యిపుడె!**

కష్టజీవుల గురించి ఆలోచించింది దక్షిణానిలము.

మరి రెండవ కోణంగా కేరళలోని మలయపర్వత ప్రాంతం నుండి బయలుదేరిన దక్షిణానిలము ప్రకృతిని ఎలా పరామర్శించింది, పరవశింప చేసింది, తన చల్లని కరములతో ఎలా ఉత్సాహాన్ని నింపింది – చెబుతున్నారు కవి.

**ఏ నాటి చుట్టరిక మేనాటి స్నేహమో!**
**గాని – తుమ్మెద పిండు, గానముల కోయిలలు**
**యెడబాయ లేక వెంబడి రాగ ఠీవిగ**
**అలసముగ దక్షిణానిలము మా గడ్డపై వీచెనమ్మా! యిప్పుడె!**

కోయిలలకు, తుమ్మెదలకు, దక్షిణానిలముతో ఏనాటి సంబంధమో – ఠీవిగా వాటితో పాటు కదిలి, స్నేహం చేసిందట. అది ఎవరెవరిని పరామర్శించిందో చెబుతూ

**ఒకచోట వృక్షాగ్ర మొకచోట గిర్యగ్ర**
**మొకచోట కేతుపటమొకచోట, పూల పం**
**దిరి సొంత యిల్లుగా, తేనె సోనల బంచి**
**అలసముగ దక్షిణానిలము మా గడ్డపై వీచెనమ్మా! యిపుడె!**

**ఒక సారి మేఘమాలికయంచు ముడివెట్టి**
**ఒకసారి మెరుపుకత్తెకు ముంగురుల నొత్తి**
**ఒకసారి దిక్కాంతలకు పైట సవరించి**
**అసలముగా దక్షిణానిలము మాగడ్డపై వీచెనమ్మా! యిపుడె!**

**కడలన్ని వాసనల కమ్మగా విరియగా**
**ఉడుకారి మ్రోడులకు నెడద చివురింపగా**
**లతలు హర్షోత్కర్షలై సౌరు పండింప**
**అలసముగ దక్షిణానిలము మా గడ్డపై వీచెనమ్మా! యిపుడె!**

కొండలపై, వృక్షాలపై, పూల పందిళ్ళపై మేఘాల వరుసపై, మెరుపులపై, దిక్కులన్నిటిలోను, తన కరములతో తాకి సేద తీర్చిందట దక్షిణానిలము. దక్షిణానిలము ప్రయాణం చేసే ప్రదేశాలలో మోడులు చివురించాయట. లతలు జేజేలు పలికాయట. మోదుగ పువ్వులపై, మొగ్గలపై, తిరుగుచూ, ఆనందాన్ని నింపిందట దక్షిణానిలము. పగుళ్ళు విచ్చిన కోట గోడలలో దూరి, ఆ కోటల నేలిన, వారి జీవితాన్ని మార్చిన యుద్ధాల తలచి, అలసిపోయి, వారి దగ్గర కాసేపు ఉండి, తిరిగి పయనమైందట దక్షిణానిలం.

మలయపర్వత సానువుల నుండి మొదలుకొని తుంగభద్రనది, చేరమండలము, శ్రీరంగం, చోళ మండలము, సింహళము, కావేరీనది, మొదలైన ప్రదేశాలను తన ఒడిలో లాలిస్తూ పయనం సాగించింది. కోకిల పలికే అవ్యక్తమైన మధురధ్వని కంటే, గొప్పగా తన పాటను వినిపించింది. కవులకు దక్షిణానిలం, మంచి భావనలు అందించింది. చిత్రకారుల మదిలో గొప్ప చిత్రాలు గీయుటకు ప్రేరణ కలిగించింది. ప్రపంచమంతా ఒకే కుటుంబమని ఏక సూత్రతను చాటింది. ఇంకా అందంగా నాట్యం చేసి ఎలా అలరించిందో – చెబుతూ

**రణితనూపుర ఝణం ఝణత లావర్తింప**
**చెలువాచి జఘవ కాంచీ కింకిణులు మ్రోయ**
**లలిత వలయిత పాద లాక్షారసము చింద**
**అలసముగ దక్షిణానిలము మా గడ్డపై వీచెనమ్మా! యిపుడె!**

**అలస సమబృంద లాస్యముల సొక్కుల నించి**
**ముని వ్రేళ్ళ ధరణి కపోలముల్ స్పృశియించి**
**యతుల శైవలవలే శతవేణే కలబుడికి**
**యలసముగ దక్షిణానిలము మాగడ్డపై వీచెనమ్మా! యిపుడె!**

**తరుణార్క బంగారు పురుల కాంతుల నెక్కి**
**శిఖరముల చుంబించి, క్షితిజముల దీవించి**
**దుముకు సెలకన్నెలకు దోదుగా నీడగా**
**అలసముగ దక్షిణానిలము మా గడ్డపై వీచెనమ్మా! యిపుడె!**

పై రగడల్లో కొన్ని పాదాలు గమనిస్తే, పదాలు నాట్యంలోని అడుగులకు ప్రతీకలుగా కనిపిస్తాయి. “రణిత నూపుర ఝణం ఝణత” అంటే అందియలు ఎలా మ్రోగుతున్న విషయాల ఆ పదాల ద్వారా ప్రకటిస్తున్నాడు కవి. అలాగే జఘవ కాంచీ కింకిణుల అంటే చిరుగజ్జెలు అన్నది కవి భావన. అలాగే “సమబృంద లాస్యముల సొక్కుల” అని అనటంతో అడుగులు పైకి, కిందికి కదిపినట్టుగా పదాల ఒరవడి కనిపిస్తుంది. దక్షిణానిలం ఉదయాన్నే వికసించే బంగారు కిరణాలను తాకి, కొండలతో మాట్లాడి, సెలకన్నెలతో కదిలి, అలా అలా వయ్యారంగా తన ప్రయాణాన్ని కొనసాగించిందట.

ప్రృతిని పలకరిస్తూ, అలసిపోయిన, దరిద్ర్యంతో, కష్టాల్లో, బాధల్లో మునిగిపోయిన సామాన్య ప్రజానీకానికి ధైర్యం చెబుతూ, దక్షిణానిలము ప్రయాణం కొనసాగించిందని కవి వివరిస్తున్నాడు. వైసీవి గారు ప్రకృతిపై ప్రేమతో, సామాజిక దృష్టితో రెండింటిని సమన్వయపరుస్తూ, అలంకార రూపంగా, సంస్కృత భాషా పదాలతో గేయాన్ని హృదయావిష్కరణ చేశారు.

❖ ❖ ❖

ఈ కవికి తీవ్రమగు భావనాబలమున్నది. ఆ భావమును వెల్లడించగల సునిశితమై వెనుకాడని వాక్కును గలదు. ముమ్ముందు పేరు పెంపుల కథ యట్లుండనీ – సమజామును పురుషార్థమునకై నడపించు మహాయోధులలో నీతడొకడని యాశింతును.

**– సరస్వతీపుత్ర పుట్టపర్తి నారాయణాచార్యులు**



**డా॥ గూగంశెట్టి రామకృష్ణ**
సెల్ : 9490686225

## వై.సి.వి. చిత్రించిన గాసగాని దుర్భర జీవితం

గాసగాడు రైతు వ్యవసాయ జీవనంలో ప్రధాన పాత్ర. పనిమనిషి అయినా సొంత ఇంటి మనిషివలె రైతు పనిభారాన్నంతా తానేమోస్తూ, రైతు సుఖమయ జీవనానికి మిక్కిలి సహాయకారిగా ఉంటాడు. నిరంతర శ్రమజీవియైన గాసగాని జీవితం కన్నీటిమయం. గంజుకుండ పగిలితే భయం. గడ్డివల్లె కొర్రుపడితే భయం. తిండితినేకాడ భయం. నిద్రపోయే కాడ భయం. గాసగాని బ్రతుకే భయం. వాని జీవితమంతా భయం, బాధలతో నిండి కృశించిపోయింది. రైతుల సుఖం కోసం తమ యావజ్జీవితాలను అర్పణ చేసిన గాసగాళ్ళపై రైతుకు కరుణలేదంటూ వారిపై జరిగే అన్యాయాలను, అత్యాచారాలను ఆవేదనతో వాస్తవిక కోనంతో వర్ణించాడు వై.సి.విరెడ్డి.

**"కోడికూత వినగానే**
**కోపగాడు రెడ్డేరని**
**కొంపలోని రొంపంతా**
**ఊడ్చిపారవేయాలని**
**గాడిపాటలూడుస్తూ**
**గంజుకుండ పగిలిందని**
**గంజుతోడుటెట్లాయని**
**అడుగలేక మిడికినాడు**
**పాపం మీ గాసగాడు**
**ఆమాటే చెపుదామని**
**నీకెందుకు చెప్పాలని**
**చెప్పలేక చెబుతున్నా"**

గాసగాడు రైతింటిలో మొదట ప్రారంభించాల్సినపని పశువుల కొట్టాన్ని శుభ్రం చేయడం. తొలుత గాడిని శుభ్రంచేసిన తర్వాత పేడకాళ్లు తీసి పశువుల మూత్రమైన గంజరాన్ని కుండలో తోడి దిబ్బలో వేసిరావాలి. ఈ పనులు చేయడానికి గాసగానికి సంవత్సరానికి కొన్ని మొద్దుపొరకలు, ఇంట్లో వాడగా

పాతబడిన కుండలు, తట్టలను రైతు వానికిచ్చేవాడు. గాసగాడు సంవత్సరకాలమంతా వాటితోనే పనిచేస్తూ సర్దుకుపోవాలి. చేతులతో పేడకాళ్ళు తీసి గంపలో వేయాలి. దోసిళ్లతో గుంతలోని గంజరాన్ని తోడి కుండలోపోయాలి. పొరపాటున రైతు ఇచ్చిన వస్తువులు పోతే గాసగాన్ని దుర్భాషలాడుతూ సోలకాలతో కొట్టేవాడు. రైతు ఇచ్చినవే పనికిరాని శిథిలమైన వస్తువులు. అటువంటివి నశించిపోవడం సహజం. దుర్మార్గుడైన భూస్వామికి భయపడి గాసగాడు మరొక గంజుకుండ అడిగేందుకు భయపడ్డాడు.

**"ప్రొద్దున్నే గాసగాడు**
**పొరగడుపున పొలముగట్టు**
**చెట్లన్నీ కొట్టాలని**
**పట్టినాడు చెట్లడ్డను**
**ప్రాణాలను బిగబట్టి**
**కొట్టినాడు చెట్లన్నీ**
**కోలెదగిలి అడ్డదుంప**
**చీలిపోయి కుసులు విరిగె**
**యింకెట్లా! యింటిరైతు**
**యింటికిరానిస్తాడాయని**
**చావుబ్రదుకు ఊహలతో**
**నిలిచి నిలిచి యింటివైపు**
**రాగోరే రాయిమనిషి**
**గుండెదడలు నీతోనా"**

**"సాయంత్రము తలమేపుకు**
**మిడియెండల తడబడుచూ**
**డొక్కబలము లేకున్నా**
**రెక్కబలముతో చాలా**
**వంచెలుగా గడ్డికోసి**
**వడివడిగా వస్తుంటే**
**కొమ్మదగిలి గడ్డివల్లె**
**కొట్రుపోయె పట్రుమనుచు**
**అగు గుండె తోడవాడు**
**ఆగినాడు తూగినాడు"**

గాసగాడు పరగడుపుతోనే పొలంగట్టుమీద ఉన్న తుమ్మచెట్లను కొట్టడం ప్రారంభించాడు. ఊపిరి బిగబట్టి చెట్లను కొడుతూండగా ఒక కోలె తగిలి అడ్డదుంప చీలిపోయి కుసులు విరిగిపోయింది. దాంతో పని నిలిచిపోయింది. ఈ విషయం తెలిస్తే రైతు తనను ఏంచేస్తాడోనన్న భయంతో గుండె రాయిచేసుకొని ఇంటిముఖం పట్టాడు. పాడెనుముల కోసం గడ్డి తెచ్చేందుకు పొలందగ్గరకు వెళ్ళి, కోసి తీసుకొనివస్తుండగా కొమ్మ తగిలి గడ్డివల్లె పఠ్రుమని చినిగిపోయింది. దాంతో గాసగాని గుండె ఆగినంత పని అయింది.

**"కుంటలోని వందుమట్టి**
**గుద్దలితో గదలద్రవ్వి**
**సదరులోన మదిరెవేయ**
**సన్నాహముతో వాడూ**
**పొడియెండలమిడియెండల**
**పూడుగడ్డ లొకటొకటే**
**కుల్లగింప పెల్లక్రింద**
**కునుకుచున్న తేలుకుట్టి**
**కుయ్యో మొర్రో యంటూ**
**కుమిలినాడు కమిలినాడు**
**కూడుగూడ కుడువలేక**
**కుతిలపడుచు వెతలపడుచు**
**చెప్పలేని చెమటలతో**
**చెదరినాడు బెదరినాడు"**

**"ప్రక్కలెగుర వేయరాని**
**చలిలోనె ఉత్తపైన**
**కొయ్యకాడ కత్తులతో**
**కొయ్యదుంప చెప్పులతో**
**చొప్పవట్టె వేయబోయి**
**ముప్పుల చీకటిలోనే**
**మునిగినాడు పెనగినాడు**
**వట్టెబెట్టు అందాజుల**
**వట్టికాల కొయ్యకాడ**
**వారంపుగ దూసికోసె**
**వాడేనా! సాయంత్రము**
**వామివేయు మొనగాడూ**
**అయినా వామేసినాడు**
**అదురుగుండె కుదుపులతో**
**అయ్యో! మీ గాసగాడు"**

మదిరె వేయడానికి ఒండుమట్టి కోసం గాసగాడు కుంటలోకిపోయి పూడు గడ్డలను కుల్లగిస్తుండగా పెల్లక్రింద ఉన్న తేలు కుడుతుంది. బాధతో వాడు కుమిలిపోయాడు. ఒళ్ళంతా చెమటలు పట్టి కూడుకూడా తినలేక ప్రాణంపోతుందేమోనని భయపడ్డాడు. అటువంటి పరిస్థితులల్లో ఉండి కూడా కనపడని చీకట్లో, తీవ్రమైన చలిలో, కోసిన జొన్నచొప్పను కుప్పలుగా పెడుతుండగా జొన్నకొయ్యకాడ తగిలి వాని కాలు తెగుతుంది. కాని ఆ బాధను కూడా ఓర్చుకొని సాయంత్రం వామేశాడు గాసగాడు. రైతుకోసం అంతగా కష్టపడుతూ ఉన్నా అతని బాధలను గుర్తించలేదు.

కళ్లములో ముందు ఒక వరుస చెరువు లేదాకుంటల్లోని మట్టి వేస్తాడు. తరువాత ఏటి ఇసుక దానిపై పరుస్తాడు. దానిపై దిబ్బలోని ఎరువును పరుస్తాడు. దీన్నె మదిర అంటారు. దీన్ని చేలల్లో ఎరువులాగ చల్లుతారు వానలు రాకముందే.

“మడకదుంప కావాలని
మాపటేల తుమ్మకొమ్మ
కొట్టేందుకు పోవాలని
కొట్టి మోసి తేవాలని
మునిమాపుల బయలుదేరె
మూపున గొడ్డలి బూనుచు
దూరినాడు తారినాడు
తుమ్మల్లో కంపల్లో
కన్నుగుట్టు చీకట్లో
కంపమండ తగులకుండ
మొబ్బుననే మడకదుంప
మొద్దొక్కటి కొట్టినాడు
సాగిసాగి మొద్దునెత్తి
మూగటూర్పు చెరలాటల
భూమమ్మకు భారంగా
పూనిపూని అడుగులేసి
యిల్లుజేరె ఆనాడే
వెన్నుదబ్బ విరిగిందో!
విరిగి నడుము వంగిందో
ఎవరికేమి తెలుసు పాప
మబ్బా మీ గాసగాడు
వంగిపోయి వాలినాడు”

“చేను దోపు పోకుండా
ఆనకట్ట కట్టాలని
చెప్పావోలేదో వా
డప్పాటనే రాళ్ళబండి
కట్టినాడు చిన్నగుట్ట
కన్నెరాళ్ళ తోలినాడు
యెత్తలేని మోటరాళ్ళ
నెన్ని యెత్తినాడో వాడు
బట్టక్రింద పోటులేసి
బాధలతో చెమ్మగిల్లె
నింతదనుక, వంతలపని
మంతుడుగా మంతుకెక్కె
వాడెంతటి నిర్మలుడో
వాడెంతటి కర్మఠుడో
అయ్యో మీ గాసగాడు”

“పొయ్యిలోకి కట్టెలకై
పోకూడని అడవులలో
దూరితారి పట్టికోలె
తుండుమొద్దులూడగొట్టి
పొట్టుజల్ల పట్టినన్ని
పోటుగ నిలబెట్టి పేర్చి
రాయినెత్తిపైనెత్తీ
రాలేదా? వానిమెడలు
పోలేదా? నాటినుండి
మోటబరువు మోయలేడని
నీవే నాతోడచెప్పి
నావే యానాటిమాట
అయ్యా మీ గాసగాడు”

మడకదుంప కావాలని సాయంత్రం నల్లతుమ్మ మొద్దు కొట్టి తేవడానికి గొడ్డలిచేబట్టి ప్రొద్దు గూకుతుండగా బయలుదేరాడు గాసగాడు. చీకట్లోనే కంపమండలు తగులుకోకుండా అందాజుగా మొద్దుకొట్టి, బరువైన దానిని మోసుకొని ఇంటికివచ్చాడు. కంపమొద్దు బరువుకు అతని వెన్ను విరిగినట్లైంది. చేను కోతకు గురికాకుండా ఆనకట్ట కట్టాలని రైతు చెప్పిన వెంటనే ఆలస్యం చేయక బండికట్టుకొని గుట్టకుపోయి

రాళ్ళను పొలానికి తోలినాడు. బరువైన రాళ్ళెత్తడంతో అతని బ్రొక్రింద పోటులేచింది. రైతింట్లో పొయ్యిలోకి కట్టెలు కొట్టి పొట్టు జల్లాకువేసి, మోసుకొనిరాగా వాని మెడలు వంగిపోయాయి. రైతుకోసం మోటకష్టం చేసి బాధపడినా, రైతు వాని కష్టాలను గూర్చి ఆలోచించకపోవడం విచారకరం.

"ఊపిరాడనట్టి గాలి
యూరుచుట్టి హోరుపెట్ట
యర్రజొన్న తోటలోని
ఆకు అలుము జొన్నవగుడు
లాకల గుదిమోపు జొన్న
లాకలతో లాగిలాగి
బిగియగట్టి గిత్తలకై
వగిరిస్తూ తెస్తూంటే
మొరవకాడ బరువు దగిలి
మోపుక్రింద బడలేదా?
రాయిబెచ్చు మోకాలున
దూయబారిపోలేదా?
గాయపడిన దేహానికి
కనమలు సాక్షులు గావా?
యేమయ్యా కష్టజీవి
కామన లేమని చెప్పుదు
అయినా వూకొడుతావని"

"అగె బెట్టినట్టి గుట్ట
లందు గడ్డి గోయబోయి
కన్నెలలో వన్నెలతో
వెన్నూడిన పచ్చిగడ్డి
కోయ యూరితలవరి మీ
కోడవలినీ గడ్డాల్లెను
గుంజుకొనుచు అపరాధము
కోరి వేయలేదా - వా
డంతటి అవమానాలను
అవనతుడై స్వీకరించె
నీ కొరకేగాదా అది?
నీ కొరకే ననుచు చెప్పి
లాభమేమి? లోభి యెదుటి
లాభము గమనించునా
వాడెంతటి గంభీరుడో
వాడెంతటి పొడవువాడొ
అలుగ డెపుడు పలుక డెపుడు
అబ్బో మీ గాసగాడు"

"రామచిలుక వంటి యింటి
రామితోడి కూడా మాడ
రాలేదని పని కుంటని
రాపాడగ లేదా - యా
పాపాలకు వాడెంతగ
వరిటినాడొ! వనటినాడొ
అయ్యయ్యో లోకమెల్ల
అన్యాయంబని చెపితే
విన్నావా? కనకూడని
కన్నె మనసు గాయపరచి
విరచినావు కరచినావు
పురమూకటి బోర్లద్రిప్పి
పురపురనై పస్తులుండి
రంతా నీదయగాదా
ఆమాత్రపు మానవుడని
అనలేదా గాసగాడు

గాసగాడు ఊపిరాడనట్టి హెూరుగాలిలో జొన్నచేలో లాకనుకోసి, మోపుకట్టి తీసుకొనివస్తుండగా, మొరవకాడ రాయిబెచ్చు మోకాలికి తగిలి తీవ్రగాయమైంది. అలాంటి ఎన్నో దెబ్బలు అతని శరీరంపై గుర్తులుగా మిగిలిపోయాయి. అగె (మంట) పెట్టిన గుట్టలో గడ్డికోయడానికి వెళ్ళగా, ఊరి తలారి చూచి వానిని నానావిధాలుగా అవమానించి కొడవలిని, గడ్డివల్లె లాక్కొని జరిమానా విధిస్తాడు. తనరైతుకోసం జరిగిన అవమానాన్ని గాసగాడు దిగమ్రింగాడు. భార్యను పనికి తీసుకరాలేదని గాసగాన్ని రైతు అనేక విధాలుగా బాధించగా వాడు తీవ్రంగా దుఃఖించాడు. ఎంత పనిచేసినా గాసగాని కష్టాలు తీరలేదు. బాధలన్నీ దిగమ్రింగి పస్తులతో జీవితం కొనసాగించాడు వాడు.

**"దేహమెల్ల చితికిపోయె**
**దేహమెల్ల జీరాడెను**
**కలనైనను సుఖముచెంత**
**కాలము గడపనివాడా**
**కష్టజీవి! నష్టజీవి**
**ఈనడుమన క్రూరబుద్ధి**
**కాలము జరతో వానిని**
**గైసేసెను జీవితంబు**
**పీడకలల ఓటికుండ**
**గూడలు పోయిన చేటగ**
**ఓడుపాడు మద్దెలగా**
**ఓటారగా తూటారగ**
**అయ్యో వాడెట్లు బ్రదుకు**
**ఏకాంతము చీల్చుచున్న**
**ఏనుగు కష్టాలకునై**
**అదరలేదు బెదరలేదు**
**అయ్యా! మీ గాసగాడు"**

**"అర్ధాకలి డొక్కలలో**
**నలముకొనగ కలవరమున**
**నట్టు బలిసి గట్టు బలిసి**
**నట్టి బీళ్ళ పట్టి సేద్య**
**మునకై యారరుగునట్టి**
**మోట మడక కొటేరున**
**చీకటితో చేనుజేరి**
**చిరుగంటల మెడవారుల**
**కలనాదము తోడుగాగ**
**గడిదేరిన కర్షకుడై**
**కాడిత్రిప్పి మేడిబట్టి**
**వరపగ్గము వలచేతికి**
**బిరుదై చెలువార - కాడి**
**కోడెలతో మారు జేన**
**కొంద్రవేసి సాలుబట్టి**
**ఉన్నదుక్కి పెల్లలలో**
**ఉగ్గపట్టి మేడిపట్టి**
**కాలూనుచు దుంపద్రొక్కి**
**దున్ని దున్ని చేనబలిసి**
**యున్ననట్టు చంపినాడు**
**ఒకచేలో నట్టుజంప**
**ఒక కావ్యము వ్రాసినట్టు**
**వాడిప్పుడు దసిలినాడు**
**వాడెక్కడ తిరగలేదు**
**వాని బ్రదుకు వ్రాలిపోయె**
**వానికోర్కె లారిపోయె**
**అయ్యో మీ గాసగాడు"**

**"చొప్పవామి వెయ్యాలని**
**చొప్పదోల పోవాలని**

పెద్దగుజ్జు చిన్నగుజ్జు
పెద్దనాట్లు గుజ్జులబడె
మోరమాను గోసినగా
మొత్తము పైపరముబడెలు
సమకూర్చుక పరముబండి
సగవేసెను సరిదోలిన
కుంటెనతో మొదటిమోకు
కుదరబెరికి పన్నకంబు
కుదిరించుక తొందరగా
కాడిగట్టి దేశపెద్ల
కదముపైన నడిపించీ
చేనిలోని చొప్పగూళ్ళ
చెదరిబెరికి తోపువేసి
బిళ్ళ చెరుగు నడికట్టూ
బిగియ బిగియ బిగదీసి
త్వరగా పగ్గం బిఱ్ఱున
తోలుకొనుచు వస్తూంటే
ఆంపసన్న కట్టెవిరిగి
అడ్డత్రోవలో వాటూ
పడలేదా పిడివాటున
పడిపోయిన బండినెత్త
పోరాడిన వాడునేడు
పడిపోయినవాడు కూడు
పడవేసే దిక్కులేక
యెన్నాళ్ళని బ్రదుకగలదు
ఉన్నప్రాణ ముగ్గపట్టి
వాడు మీ దయకు తగిన
వాడేనని చెప్పవలనో
నీవంట్లో ప్రాణముగా
నీయింట్లో దీపెముగా
నిన్నే మదినమ్మి ముదిమి
నీడ్చుచు నున్నాడు చూడు
మయ్యా మీ గాసగాడు”

గాసగాడు అర్ధాకలితో అలమటిస్తున్నా, వ్యవసాయపనులన్నీచేసి రైతు సౌభాగ్యాన్ని పెంచాడు. ‘ఒకచేలో నట్టుజంప ఒక కావ్యము వ్రాసినట్టు’ అని గాసగాని కష్టాన్ని వర్ణించి రైతుకూలిపని ఎంత కష్టమైనదో చెప్పాడు. ఇక్కడ కవి ప్రయోగించిన ఉపమానం చక్కగా ఉంది. అంపసన్న కట్టెవిరిగి వాటుపడిన బండిని ఒంటిచేత్తో ఎత్తిన గాసగాడు ముసలితనంచేత గూడలుపోయిన చేటలాగా కృంగిపోయాడు. కలలోకూడా ఒక్కరోజుకూడా సుఖించని వాని జీవితంలో చీకటి ఆవరించింది. ముసలితనంతో పోరాడుతూ వాడు జీవితాన్ని నెట్టుకువస్తూ ఉన్నాడు. ఇక్కడ గాసగాని జీవిత చివరిదశను కవి వివరించాడు.

“తెల్లవారు జాముననే
పల్లెప్రజలు పారాడిరి
కొట్టికోత కోయాలని
కోసిగూండ్లు వేయాలని
చీకటిలో చేనిమునుకు
చేరాలని కూలివాండ్ల
నదలింపగ లేచినావ
ముదలింపగ పోయినావ
పులినొప్పుల దేహాలను
పురివెట్టగ దొరలువారు
పులియరపుల తట్టాడుచు
పొరలి పొరలి లేచినారు

గాసగాని కొంపముందు
కాలుదట్టి గర్జించితి
వా లేదా పాపమనక
పోలేదా పల్లె ప్రజలు
పొగల సెగల పోటు జ్వరము
పొరటింపగ పొగులువాడు
గాసగాడు కనుగోనల
కనులు తమపుట్టుప్పెనలో
రాలేనని చెప్పుకొన్న
రావాలని పట్టుబట్ట
రాలేదా? కొట్టిగోసి
పోలేదా మిన్ను విరిగి
మీదపడిన మిట్టాడక
మితిమీరిన బడలికలో
మిముగొల్చెను మీకొరకై
తమముమ్రింగి తరపివెన్నె
లంతా తానై యుమిసెను
వాడే యినాడు చివికి
పాసాలకు దాసుడుగా
వాలినాడు వణకినాడు
వాని శీర్ణ దేహాంతర
వాటిలోన కాటిలోన
అంతా బూడిదగాదా?
ఐనా మీబోటివారి
కన్నార్తులపైన కరుణ
అంతయు లేకపోగ
అభిమానము కూడలేదు
వాని కోసమేమైనా
పాటుపడెద వేమోనని"
"గెట్టులోని పుట్టదిన్నె
గొట్టిమట్టి చేనిపైన
పారతోడ వేయుటకై
పయనమయ్యె నాడు వాడు
ఆకు వక్క సున్నము పొగ
ఆకువున్న మూట విప్పి
ఆనందపు టంచులలో
ఆలాపించుచు తాంబూ
లము నమలుచు రాగ భావ
లలితమైన వాని యెడద
లోతులలో రేకెత్తిన
జీవన భావపు ముద్రలు
జీఅవాటె పాడువాటె
చింతాభర జీవనాధ్వ
శీల వాతమ్ము బడుగు
దేహమావరించె నేడు
తినుచున్నది కండలనే
తినుచున్నది యెముకలనే
బొమముడతలు కనుచూపుల
తమము వాని జీవనమ్ము
పొడిపొడిగా పోవనున్న
పోగాలము నెరుకపరచె
వాడేమో తరుమగాడు
వానేమో చేరదీయ
వెరపులేదు అరుపులేదు
అయ్యో మీ గాసగాడు"

పెద్దరెడ్డి తనపొలంలోని కొర్రకోతకై కూలివాళ్ళకోసం దళితవాడకు వెళ్ళగా, అక్కడ బాధతో పొర్లుతున్న, మూలుగుతున్న కూలీలెందరో ఆయనకు కనిపించారు. నిద్రలేవని గాసగాని ఇంటివాకిలిని కాలితోతట్టి వానిని నిద్రలేపాడు. విపరీతమైనజ్వరంతో వాడు పనికిరాలేనని మొరపెట్టుకున్నా రావాలని రైతుపట్టాడు. రైతుమాటను అతిక్రమించలేక పోటు జ్వరంలోకూడా గాసగాడు రైతువెంట పనికివెళ్ళాడు. అటువంటి మోటకష్టాలను ఎన్నింటినోచేసి వాని శరీరం కృశించిపోయింది. గాసగాని జీవితమంతా రైతుసేవలో తెల్లారిపోయింది. తన సుఖంకోసం జీవితసుఖాలన్నింటిని ధారపోసిన గాసగాన్ని గూర్చి రైతు కరుణచూపించలేదు. ముసలితనంలో కనీస సాయం వానికి చేయలేదు.

శరీరంలో శక్తి ఉన్నంతవరకు గాసగాడు తన యజమానికోసం ప్రాణాలకు తెగించి, ఎన్నో కష్టాలను ఎదుర్కొని పనులుచేశాడు. ముసలితనంచేత పనులకు వెళ్ళలేని స్థితికి వచ్చాడు వాడు. గాసగాని శరీరంలోని ప్రతిరక్తపు బొట్టును తన స్వార్థానికి ఉపయోగించుకొన్న రైతు చివరిరోజులలో వాన్ని ఆదుకోలేదు. వాని దయనీయ జీవితానికి మూలకారకుడయ్యాడు. భూమిని పండించి రైతింటి సంపదలను పెంచిన గాసగాళ్ళపై కరుణచూపని రైతుల స్వార్థాన్ని ఖండిస్తూ, వారి దుర్మార్గానికి బలైన గాసగాళ్ళను జాగృతం చేశాడు. గాసగాళ్ళు చైతన్యవంతులై తమ జీవితాలను బాగుచేసుకోవాలని ఆకాంక్షించాడు. అణచివేసేవారిపై కక్ష ప్రదర్శించడంకంటే, అణచివేయబడినవారిపై సానుభూతిని వ్యక్తం చేశాడు. అభ్యుదయ భావంతో పీడితవర్గాన్ని చైతన్యవంతం చేశాడు. దళిత పరివేదనను తాను స్వయంగా అనుభవించినట్లు వ్యక్తీకరించి, వారిపట్ల తన సానుభూతిని తెలిపి, మానవతాదృక్పథాన్ని చాటుకొన్నాడు వై.సి.వి. రెడ్డి. ఈ గేయ కావ్యానికి అనుబంధంగా తుంగభద్ర జలాలు పులివెందుల ప్రాంతానికి మళ్ళించాలనే ఆకాంక్షతో ప్రభుత్వానికి 'రాయబారం' అనే పేరుతో మరొక సందేశాన్ని పంపాడు.

❖ ❖ ❖

**అనఘా! చల్లనికైతవాడ! నొకనాడైనన్ మదీయోప కా**
**ర నిరక్షామతినుంటివో! సతము నా వ్రాతల్ ప్రశంసించుటే**
**పని మాధ్వీకరాసాను మేయమతి ఓ వైసీవి రెడ్డీ! భ**
**జ్ఞని నామేలునకయ్యె, నిన్ను మరువన్ జాలన్ దివారాత్రముల్**

**– డా॥ పుట్టపర్తి నారాయణాచార్యులు (3.5.77)**



**డా॥ గూగంశెట్టి రామకృష్ణ**

సెల్ : 9490686225

## సెలకన్నె

సాహిత్యంలో వై.సి.వి. రెడ్డికి గల ప్రతిభావ్యుత్పత్తులకు దర్పణం "సెలకన్నె" గేయకావ్యం. ఇది భావగీతం. ఈ కావ్యానికి పేరుపెట్టడంలోనే కవి తన ప్రౌఢిమను చాటుకున్నాడు. ఆయన భావ ప్రకటనా సామర్థ్యానికి ఈ కావ్యం గీటురాయి. ప్రపంచంలోని సర్వచేతనాచేతన ప్రకృతికి ఉత్సాహ ఉల్లాసాలను కలిగించే మనోజ్ఞమూర్తిగా, మానవులకు లక్ష్య ప్రబోధినిగా "సెలకన్నె" తన సహజ సౌందర్యమంతా కూడగట్టుకున్నట్లుగా పాఠకులకు దర్శింపజేశాడు.

ప్రతినిత్యం మన కంటికి కనబడే స్థావర జంగమాత్మకమైన ప్రపంచమే ప్రకృతి. మనకు నిత్యం కనిపించే చెట్లు, చేమలు, ఆకాశం, నదులు, పర్వతాలు, పక్షులు, జంతుజాలం మొదలైన చరాచర జగత్తు అంతా ప్రకృతి మయమే. ప్రపంచానికి మూలకారణం ప్రకృతే.

ప్రకృతిని చూసి పరవశించిపోయి ప్రకృతికవిత్వాన్ని రాసిన కవులెందరో ఉన్నారు. వేదాలలో ప్రకృతివర్ణనలు అనేకం కలవు. రామాయణంలో వాల్మీకిమహర్షి వృక్షపక్షిమృగ వర్ణనలెన్నో చేశాడు. కవిత్రయ భారతంలో పెక్కు ప్రకృతి వర్ణనలు కలవు.

ఆధునిక కవులు కొంతవరకు పూర్వకవులను అనుకరించినా ఎక్కువ మంది ప్రకృతిని స్వీయ దుఃఖప్రకటనకు, ఆత్మానుభూతిని వ్యక్తం చేయడానికి ఆధారంగా చేసుకొన్నారు. నవ్యకవులలో ప్రకృతి హృదయంనుండి వెలువడింది. వీరు ప్రకృతి యొక్క బాహ్యవర్ణనకంటే ప్రకృతిని చూసినపుడు కలిగిన అనుభూతి స్పందనకు అధిక ప్రాధాన్యతనిచ్చారు.

సమకాలీన సమాజంలోని పరిస్థితులను చూసి విసిగిపోయిన కవులు సొంత అభిరుచులనుబట్టి ప్రకృతిలోని వస్తువులను ఆశ్రయించి సమాజ చైతన్యం కొరకు రచనలు చేశారు. భావకవులకు ప్రకృతే తమ కవితారచనలకు ప్రేరకం అయింది. ప్రకృతిలోని ఆకాశం, వెన్నెల, మేఘాలు, నదులు, సెలయేర్లు, మంచు మొదలైనవి భావ కవుల కవితావిస్తృతికి హేతువులయ్యాయి. పూలలోని మెత్తదనాన్ని, తుమ్మెదల కలనాదాన్ని, వెన్నెల చల్లదనాన్ని, చుక్కల చక్కదనాన్ని, నదుల గమనాన్ని ప్రకాశింపజేసి ప్రకృతి హృదయాన్ని పులకింపజేశారు. కృష్ణశాస్త్రి, విశ్వనాథ, పింగళి, కాటూరి, వేంకటపార్వతీశం కవులు, దువ్వూరి రామిరెడ్డి, వేదుల సత్యనారాయణ శాస్త్రి మొదలైన భావకవుల మార్గంలో నడిచి ప్రకృతి కవిత్వంలో ప్రజలకు సందేశాన్నిస్తూ కవిత్వం చెప్పాడు వై.సి.వి. రెడ్డి.

వై.సి.వి. చేతిలో సెలకన్నె మనోజ్ఞ భావ భాండాగారంలా బయలుదేరి శృంగారనాయకి వలె వయ్యారాలను ఒలకబోస్తూ ప్రయాణం సాగించింది. నెలబాలుని చల్లదనంతో, నక్షత్రాల ప్రకాశంతో, కళల తీయదనంతో సవ్వడి చేస్తూ, కొండకొమ్ములనుండి మురిపాలను చిలుకరిస్తూ, గండశిలలకు గిరిమల్లెలకు ఆనందాన్ని కలిగిస్తూ పురి విప్పిన నెమళ్ళ నాట్యాల పూజలతో, కోకిలల కలగానాలతో ప్రకృతిని అభరణాలుగా ధరించి నడక సాగించింది. మానవులకు చైతన్యాన్ని కలిగించింది. కొండకోనలు, గండశిలలు, ఆకాశం, నక్షత్రాలు, తుమ్మెదలు, లేళ్లు, మేఘాలు, వృక్షాలు, లతలు మొదలైన వాటికి ఆనందాన్ని తన్మయత్వాన్ని కలిగిస్తూ ముగ్ధ మనోహర ప్రణయినిగా, హృదయోద్విజ్ఞత కలిగించే లలిత సుందరిగా వై సి వి సెలకన్నె నడక సాగించింది. ఈ గేయంలో చాలా భాగం స్రవంతి, సవ్యసాచి పత్రికలలో ప్రకటించబడింది. అభ్యుదయ కవులలో సౌందర్య రసాస్వాదన చేసే లక్షణం చాలా అరుదు. కవి వైసీవి అభ్యుదయ కవి అయినా భావకవిత్వ రచన చేయడం విశేషం.

ప్రకృతీ మానవులయొక్క బింబ ప్రతిబింబ భావమే కవిత్వం. ప్రకృతిలో మమేకమై తాదాత్మ్యాన్ని పొందినప్పుడు భావోద్రేకంతో కవిహృదయంనుండి పొంగిపొర్లే కవిత్వం మనోజ్ఞ రూపందాల్చి ప్రకాశిస్తుంది. "భూమి,నీరు,అగ్ని, ఆకాశం, గాలి "అనే పంచభూతాలనుండి లోకంలోని సమస్తప్రాణులు జన్మించి, వాటి సాయంతో జీవించి తిరిగి వాటిలోనే లీనం అవుతున్నవి. చేతనామూర్తి అయిన మానవుడు తన సుఖ దుఃఖాలను ప్రకృతిలోనే ప్రతిబింబించుకుంటున్నాడు. మానవుడు యే దృష్టితో చూస్తే ఆ విధంగా ప్రకృతి కనబడుతుంది. సృష్టికి ప్రకృతి ఆనంద దాయినే కాదు నీతి ప్రబోధకం కూడా.

వై.సి.వి. "సెలకన్నె" ప్రకృతి భావశకలం. నదులు ప్రకృతిలో ఒక భాగం. నదులు సముద్రునికి భార్యలుగా వేదాలలో చెప్పబడింది. శిఖరాగ్రాల నుండి లోయలకు ప్రవహించేదే సెలయేరు. చల్లదనంతో, అలల సుడులతో ప్రవహిస్తున్న సెలకన్నె రాకడను ప్రశ్నిస్తూ సుదూర సుందర ప్రకృతి మనోహర దృశ్యాలను మన ముందుంచాడు కవి. ఇందులో సెలకన్నె కొత్త అందాలతో తెలియని ఊహల దారుల్లో తలపుల వాకిల్లు తెరచిన జవరాలి వయ్యారాల సొగసులతో సాక్షాత్కరిస్తుంది.పరుగులు తీయకుండా పరువాలు సంతరించుకుంటూ పద్ధతిగా నడుస్తుంది. "ఏమమ్మా సెలకన్నే ఎక్కడ నుండి రాకడ" అనే రెండు పాదాల మకుట నియమంతో గేయం సాగుతుంది. మొదటి గేయంలో

**నెలబాలుని చలువలతో**
**కళలాచెడి రిక్కలతో**
**కళలతీపి పొరలెత్తగ**
**అలల సుడుల గళమెత్తుచు**
**ఆకాశమునందు తిరుగు**
**అంబుదములు తాళమేయ**
**ఆలాపించెదవేమో!**

**కలగానము నెలబాలుని కరిగించెను**

**కలువకన్నె కనుకొలకుల**

**కావిగ్రమ్మ కంపించెను**

**ఏమమ్మా సెలకన్నే**

**ఎక్కడనుండీ రాకడ?**

నెలబాలుని చలువదనంతో, నక్షత్రాల ప్రకాశంతో, కళల తియ్యదనంతో కలగానంతో సాగుతూ నెలబాలునికి ఆనందం కలిగించినట్లు మానవుల హృదయాలలో సెలకన్నె చల్లదనాన్ని కలిగించాలని ఆకాంక్షించాడు.

జగతిలోని మానవులంతా పరోపకారగుణంతో జీవించాలని కోరుతూ

**"ఉన్నతులౌ గిరిరాజుల**

**మన్ననలను మురిసి తరిసి**

**వెన్నెలలో నృత్యమ్ముల**

**వెలయించుచు సొలయించుచు**

**పరువులతో పలువురలో**

**మురిపెమ్ముల జిలుకరించి**

**పయనమ్ములు పాలకడలి**

**పజ్జలకౌనేమో? చెపుమ"**

నేనూ నిను వెంబడింతు అని అన్నాడు.

సెలకన్నె ఎత్తైన కొండకొమ్ముల నుండి ప్రవహిస్తూ అందాలను ఒలకబోస్తూ లోయలకు చేరుకొంటుంది. ఆ తర్వాత సముద్రంలో కలిసిపోతుంది. తన ప్రయాణంలో ప్రకృతిలోని చెట్లకు, తీగలకు, తుమ్మెదలకు, నెమళ్లకు, హంసలకు, కలువలకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తుంది. మానవుడు కూడా తన జీవిత ప్రయాణంలో సెలకన్నెవలె పరులకు మేలు చేస్తూ ముందుకు సాగాలన్నాడు.

జీవితంలోని మంచిచెడులను సమానంగా తీసుకొని స్థితప్రజ్ఞతతో ఎల్లరు జీవించాలని ఈ సెలకన్నె గేయంలో పిలుపునిచ్చాడు.

**అడ్డపడిన గండశిలల**

**కరగొరలేనట్టి మధుర**

**హాస శీతలములు పంచి**

**హావ భావ విలసనముల**

**అంతులేని ఆనందపు**
**బాటలతో పాటలతో**
**గిరి మల్లిక ఉల్లాసము**
**సరిగా చుంబించుకొనుచు**
**నలవోకగ సాగుచుంటివి**

సెలకన్నెకు తన ప్రవాహంలో గండశిలలవంటి ఎన్నో అడ్డంకులు కలుగుతుంటాయి. వాటిని ఆనందంతో స్వీకరించి, అడ్డుపడిన వాటికీ కూడా హాయిని కలుగజేస్తూ ప్రవాహాన్ని సాగిస్తూ ఉంటుంది సెలకన్నె. అట్లే ఒడ్డున ఉన్న గిరి మల్లెలకుకూడా ఆనందాన్ని కలిగిస్తూ ముందుకు సాగుతూ ఉంటుంది. మానవుని జీవిత ప్రయాణంలో గండశిలలవంటి మనస్తత్వంగల దుర్మార్గులు, గిరిమల్లెవంటి మృదుత్వంగల మంచివారూ ఎదురవుతుంటారు. మానవుడు జీవితంలో మంచినీ చెడునూ సమానంగా భావించినపుడే ఆనందమయ జీవితాన్ని గడపగలడనే సందేశం ఇచ్చాడు.

**పురివిప్పిన నెమ్మిపిందు**
**పూజలలో ఉదయరాగ**
**పుష్పాంజలి వన్నెలిడగ**
**పోలికలేనట్టి దివ్య**
**భావ వేగ పరిధులలో**
**ప్రణయముంచి ప్రణవముంచి**
**అంతా నీవై పొంగుచు**
**అంతా నీవై పొరలుచు**

– అనే గేయంలో పవిత్ర ప్రేమ తత్త్వాన్ని వివరించాడు.

చరాచర జీవరాసులకు తన ప్రవాహ మాధురిమతో ఆనందాన్ని కలిగిస్తుంది సెలకన్నె. తన మనోహర గానానికి నాట్యం చేస్తున్న నెమళ్ళు, నిండు వెన్నెలలో వికసించిన కలువపూలు సెలకన్నెకు ఆనందాన్ని కలిగిస్తాయి. వేగంగా ప్రవహించే సెలయేటి రవం ఓంకార నాదంలా ఉంటుంది. ఓంకారం పవిత్రతకు ప్రతీక. ఓంకారంలాంటి నాదంతో తన్నాశ్రయించిన వాటికి పవిత్రప్రేమను పంచుతుంది సెలకన్నె. ఆ విధంగా మానవుడు కూడా మలినంలేని పవిత్రహృదయంతో తన చుట్టూ ఉన్నవారికి ప్రేమను వాత్సల్యాన్ని పంచాలనే అంతర్యాన్ని ఈ గేయంలో ఉగ్గడించాడు.

రసజ్ఞతలేని జీవితం వాసనలేని పువ్వు వంటిది. ఈ విషయాన్ని తెలియజేస్తూ

**సంధ్యారుణ కాంతులతో**
**సారపూర వాఃకణముల**
**బింబితమై పుష్పవితతి**

**చుంబించె మనోహరముగ**
**సూనాస్తుని ఎదకోవల**
**శోభన భావాలు వ్రాల**
**కలకాలం కోనలలో**
**నిలిచి వలెచె గండశిలలు**
**కౌటిల్యములేని నిండు**
**కౌగిలికై మొగము వాచి**
**కఠినులతో సౌఖ్య కేళి**
**శఠియించు నటంచు భోగ**
**ముల రోయించు పరువులెత్తెదవు**

సంధ్యాసమయంలోని ఎర్రని కాంతులలో సెలఏటి నీటి తుంపరలు గాలిచే వెదజల్లబడి పుష్పసమూహాలపైబడి అవి మనోహరంగా కనిపిస్తాయి. ఆ సుందర దృశ్యం మన్మధుని హృదయంలో కూడా అందమైన భావాలను రేకెత్తిస్తుందన్న కవి భావం మనోహరం. ఎల్లప్పుడూ కొండలలోనే పాతుకు పోయిన గండశిలలు ఆ సౌఖ్యాన్ని ఆస్వాదించలేవు. సౌఖ్యకేళి తెలియని గండశిలలను చూసి ఏవగించుకుంటూ ముందుకు సాగిందట సెలకన్నె. రసాస్వాదన మానవునిలో నూతన చైతన్యాన్ని నింపుతుందని, జీవితం వ్యర్థం అనే భావన కవి సౌందర్యదృష్టికి అద్దంపడుతుంది.

నిద్రాణమైయున్న లోకానికి మేలుకొలుపు పలికాడు కవి ఈ గేయంలో

**ఒకచో నొక మెలపు తలపు**
**ఒకచో నొక భావ రూప**
**మొకచో నొక లయ విభూతి**
**ఉన్నతికై ప్రాకువారి**
**కున్నత లక్ష్యాల జూపె**
**యజ్ఞానికి నీ పలుకుల**
**కర్థము సాధితమౌనా**
**ఐనా నినదించుచుంటివి**

సెలకన్నె ఒక్కొక్కచోట చాలా జాగరూకతతో ప్రవహిస్తుంది. మరొకచోట మెలకువగా ప్రవహిస్తుంది. ఇంకొక చోట లయ విభాతి వలె ప్రవహిస్తుంది. ఉన్నతిని కాంక్షించేవారికి ఉన్నత లక్ష్యాలను చూపుతుంది. ఆదమరచి నిద్రించే వారికి సెలకన్నె గమనం అర్థం కాదు. తన ప్రవాహంలో ఎన్ని అడ్డంకులు వచ్చినా ఓర్పుతో నేర్పుతో ముందుకు సాగుతుందే తప్ప ఒకచోట నిలిచిపోదు సెలకన్నె. ఉన్నత శిఖరాలకు ఎదగాలనే

ఆకాంక్ష ఉన్న మానవులు సెలకన్నె గమనాన్ని ఆదర్శంగా తీసుకొని ఉన్నత లక్ష్యాలకు చేరుకోవాలనే ప్రబోధం ఇందులో ఉంది. దిశానిర్దేశాలులేని వ్యక్తుల జీవితాలు అపహాస్యం పాలవుతాయి. ఉన్నతికొరకు సాగే కార్యసాధకులకు మార్గనిర్దేశం చేస్తూ, ఆదమరచి నిద్రించే సోమరులకు అజ్ఞానులకు చురకనంటించి సమాజాన్ని మెల్లగా నిద్రలేపే ప్రయత్నం చేశాడు వై.సి.వి.

సెలకన్నె దక్షిణానిల అభ్యుదయ భావాలను మోసుకుంటూ వచ్చి కార్మికకర్షకులకు శ్రామికులకు శుభాలను కలిగించాలన్నాడు. ఇలా సెలకన్నెనుండే కాకుండా ప్రకృతిలోని ప్రతి వస్తువును మానవుడు ఆదర్శంగా తీసుకొని జీవితాన్ని ధన్యం చేసుకోవాలని ఉద్బోధ చేశాడు కవి వై.సి.వి. రెడ్డి.

❖ ❖ ❖



**పుట్టపర్తి నారాయణాచార్యులు, వై.సి.వి. రెడ్డి, నారు నాగనార్య, రాచమల్లు భైరవకొండారెడ్డి**



**డా॥ పెద్దిరెడ్డి నీలవేణి**
తెలుగు లెక్చరర్,
సెల్:85558 99249

# వర్ణనా వైజయంతి

వైజయంతి అంటే ఇంటిని ప్రేమించే వ్యక్తి అనే అర్థాన్ని తీసుకోవడం ఇక్కడ సందర్భోచితంగా వుంటుంది. వైజయంతి భావ కవితకు ఆ పేరు పెట్టడం ద్వారా వై.సి.వి రెడ్డి గారు నామౌచిత్యం సాధించారని చెప్పవచ్చు. ప్రవరుడు అనే వ్యక్తి తెలుగు సాహిత్యంలో అల్లసాని పెద్దన రచించిన మనుచరిత్రలోని ఒక పాత్ర. ప్రవరుడు గొప్ప భక్తుడు, వైరాగ్యవంతుడు మరియు వినయశీలురుగా వర్ణింపబడ్డాడు. ప్రవరుడు కాశీ నగరానికి సమిపంలో ఉన్న అరుణాస్పద పురంలో నివసించే బ్రాహ్మణుడు. ఈయన ఇతర మతాల గురించి తెలుసుకోవడం ద్వారా తన భక్తిని ప్రదర్శించాడు. విరాగి, తపోధనుడు, వినయశీలుడు ఇతరులకు సహాయం చేయడంలో సిద్ధంగా ఉంటాడు. ఈ కావ్యం రచనాకాలం 1519–20 ప్రాంతం కావచ్చునని, పెద్దనకు అప్పటికి 45 ఏండ్ల వయస్సు వుండవచ్చునని పరిశీలకులు భావిస్తున్నారు. పింగళి లక్ష్మీకాంతం అభిప్రాయంలో..... "మనుచరిత్రము శాంత, శృంగార రసములు సమ ప్రాధాన్యములో సంగమించిన యొక తీర్థము". తత్కర్త సహజముగా శృంగార ప్రియుడు. ఆ చిత్తవృత్తి శాంతాభిముఖమయినప్పటి రచన యిది. శృంగారానుభవ రుచి దొంత నిష్ఠము రెండును మరోగళమున ఆవరించి యున్నప్పటికిని శాంతి వైపు చిత్తము మరలుచున్న దనవచ్చును. ఈ వరూధునీ ప్రవరుల ఘట్టాన్ని ఆ సన్నివేశాలను వై.సి.వి.రెడ్డిగారు ఆకళింపు చేసుకొని ప్రవరుని మనోగతిని ప్రశ్నిస్తూ అధిక్షేపిస్తూ, పరకాయ ప్రవేశం చేసినట్లు ఆ పాత్ర గుణగణాలను ఆత్మాశ్రయ పద్ధతిలో వైజయంతి భావకవితగా రూపొందించారు. ప్రకృతి వర్ణనలతో అద్భుత గేయంగా కావ్యంగా తీర్చారు.

ప్రవరుడు పరమ నిష్ఠాగరిష్ఠుడై అనుకూలవతి అయిన భార్య సోమిదమ్మతోనూ, తల్లిదండ్రులతోనూ, శిష్యులతోనూ, అతిథులను ఆదరిస్తూ ఆనందంగా గడిపేవాడు.

ఒకనాడు వారి ఇంటికి వచ్చిన ఒక సిద్ధుడు ప్రవరునికి ఒక మహిమాన్వితమైన పసరును ఇచ్చాడు. ఆ పసరు కాళ్ళకు పూసుకొని ఆ దివ్య ప్రభావం వలన ప్రవరుడు హిమాలయ పర్వతాలకు పోయి అక్కడి దృశ్యాలను చూచి ఆనందిస్తాడు. అయితే ఆ పసరు మంచులో కరిగిపోయింది.

తిరుగు ప్రయాణమునకు మార్గం కానరాక తరుణోపాయం కోసం ఎదురు చూస్తున్న సమయంలో ప్రవరుడిని చూచి వరూధుని అనే గంధర్వ కన్నె మనసు పడింది. ప్రవరుని గుణగణాలను రచయిత ఇలా చెప్తాడు.

**నిన్ను చూచి, తొలుత నీ తను కాంతులను చూచి**
**అపర భాషా శేషుడైన వాడని పోల్చి**
**శాస్త్ర విజ్ఞానము సాగదీయగ దెంచి**
**........కోవిదుల - కోకిలల**
**విడిచి పెట్టక నేలలో - యింటికని**
**పరుగులెత్తక పోలునో.....**
**అందగాడని వింటి, ఆది శేషుని తొడ**
**ప్రత్యర్థిగా నిలుచు ప్రతిభగలదని వింటి**
**వివిధా ద్వరముల గావించు దీక్షల ధర్మ**
**మర్మమ్ములరచేతి కర్మములుగ జీవితము**

సాగించు వాడంచు - సవ- సవగ విన్నాను అని అంటాడు. అందగాడు, యవ్వనంలో ఉన్నవాడు సర్వజ్ఞుడు అయిన ప్రవరుని చూచి వరూథిని ప్రేమలో పడడం పెద్ద విశేషమేమికాదు. అయితే ప్రవరుడు ఆ అందాల రాశిని, తిరస్కరించి కఠినముగా వ్యవహరించి ధర్మం కాదు అంటూ విడనాడి వెళ్ళిపోవడమే ఇక్కడ విశేషం.

కామ విరహంతో ఉన్న వరూధునిని అంతకు ముందే మోహించి ఆమె చేత నిరాకరించబడిన ఒక గంధర్వుడు అదే అదనుగా భావించి ప్రవరుని వేషంలో సమిపించి తన కోరిక తీర్చుకొన్నాడు. వారికి స్వరోచి జన్మిస్తాడు. ఆ స్వరోచి ఒకసారి వేటకు వెళ్ళి మనోరమ అనే యువతిని పెండ్లాడాడు. వారి కొడుకే స్వారోచిష మనువు. మను చరిత్రకు “స్వారోచిషమనుసంభవము” అని పేరు. వరూథిని ఇలా మాయా ప్రవరుడి వలలో పడడాన్ని “విధి లేక చెడిపోతివి” అంటూ ఆ పాత్ర పట్ల అపారమైన వాత్సల్యాన్ని రచయిత చూపెట్టాడు.

మను చరిత్రలో పెద్దన కథన కౌశలం వర్ణనా చాతుర్యం. పండితుల ప్రశంసలందుకొన్నాయి. మన రచయిత వై.సి.వి.రెడ్డిగారు ఈ వరూధుని, ప్రవరాఖ్యుల ఘట్టాన్ని తీసుకొని ప్రవరుడు వరూథినిని నెట్టివేసి ఊరంటూ వచ్చేయడం ఏమంత మంచిపని కానేకాదు అంటూ... వైజయంతిని నామౌచిత్యంతో రచించారు.

**సళిన సంభవు సభల - నాట్యమాడిన చిన్న**
**పిల్ల, చక్కనిరూప మల్లనో! ఆ పాడ!**
**అక్కటా పదదోసి - అనలుతో కలుసుకుని**
**ఉందూరు చేరెనట - ఉచితమా యని ఋషులు**
**కోపపడినారట; - గొప్పలకు గొప్పగా**
**చెప్పుకొనుటకు సిగ్గుగా - వున్నదిక**
**చేయలేమెట ఎగ్గుగా - అంటాడు రచయిత**

ఆకాశమార్గాన హిమాలయలను చేరి కాలిబాటలలోని గంధపు పొడి కుప్పలకు అందాలను అద్దుతూ గండ శిలపై దుకుతూ జడిసిపోయి, అరటి వనాలలోకి ప్రవహిస్తున్న సెలయేళ్ళకి మంచు గంధంతో స్వాగతం పలుకుతూ, ఆ సూర్యోదయాన ప్రకృతిలో మమేకమైన ఓ కోవిదుడా! ప్రవరుడా! మంచుకొండపై నీకెంత మోహమో! కదా అంటూ రచయిత ప్రవరుని శ్లాఘించాడు.

రాజ్య సంపదలు చేపట్టి సర్వం వ్యక్తిగత ప్రయోజనాల కొరకు వెచ్చించిన భోగలాలసులను చూచి ఈసడించుకొన్నావు. మంచుకొండలో ఆ పరమేశ్వరుని చూడాలనే కోరిక లేకుండా జప తపాల కొరకు, విద్యార్థుల కొరకు ఎవరో నిన్ను తరిమినట్లు హిమాలయాలనుండి వచ్చేశావు. పరువు పోయిందిపో.

**గిరిశిఖర శేఖరము కింతుక వనాంతముల**
**మెల్ల మెల్లన వీచు చల్లగాలుల సొక్కి**
**పచ్చి పట్టుల వొరిగి ప్రహ్లాద మేమరము**
**లైన కలనాదముల హాయిగా మైమరచి**
**ఉండిపోకూడదా? - ఉత్త ఛాందుసునివై ....**

తిరిగి వచ్చాడు అంటున్నాడు రచయిత. పొదరిళ్ళలోన, పుప్పొడి కుప్పలలోన పొర్లి ఆకుసందుల నుండి శూన్యాకాశమును చూచి అలసిపోకూడదా? వలపు తలపుల తోడ ఈ అరుణాస్పద లంపటం నీకెందుకు? అని నిలదీస్తున్నాడు వై.సి.వి.రెడ్డి.

సౌందర్య సహిత ప్రఖ్యాత చోటులకు పసరు మహిమలో చేరుకొన్నావు. ఆకాశగంగలో విహరించు రాజహంసల చూచి, తుంగ శృంగములను చేతులతో పిలిచి అనురాగ దివ్యానుభూతులను పొంది అచటనే వుండిపోక ఇంటికెందుకొచ్చావు? ప్రకృతితో మమేకావశ్యకతను వివరించారు.

ఆ కొండ గుహల సాక్షిగా గంధసువాసనలతో పర్వశించి ఎర్రని చిగురుకేలుతో వీణలు మీటు అందమైన స్త్రీలను నిబిడాశ్చర్యంతో చూచు చిలుకల గుంపులను చూచి, కావ్యగానాలతో కదులు రసరాజ్యములు వదలి, వేదాలను బాగా తెలిసిన వాడవై, వైదిక సాంప్రదాయాలను పాటించాలనీ, ఊరు... ఊరంటూ ఈ కర్మ భూమికి రావచ్చునా? అని ప్రశ్నిస్తాడు. చదలేటిదరులలో అరవిచ్చిన మెట్ట తామర రేకులు బంగారు ఇసుక తిప్పలనొప్పలు, రాయంచల విహారవిన్యాసాలు గమనించి వివశుడవై పోరాదా? ఉందూరికి ఊడి పడాల్సిన అవసరమేముంది? అంటూ ప్రశ్నాపరంపరలో ముంచెత్తాడు రచయిత వై.సి.వి.రెడ్డి.

తుమ్మెద ఝుంకారాలతో ఆనందపడి, వనదేవతలతో వరాలిప్పించుకొని ఉన్నతమైన ఆ మంచు కొండలలోనే వుండక ఊరికి వచ్చి చెడిపోతివి పో! అంటాడు. హిమగిరి సొగసులలో, ఆ ప్రాంత వనాలలో చీకట్లు చెదిరిపోవడానికి చంద్రకాంత మణులే పగలుగా ప్రకాశిస్తున్నాయి. ఆ కానలో, కోనలో పూలబాటలలో పొదరిండ్లలో దివ్య భోగాలు చూచి అక్కడే ఉండి అనుభవించడాని నీ కెందుకు మనసు రాలేదు అంటాడు.

కొండచరియలు, మణులకాంతులు, క్రొంగొత్త యూటలు కేరింతలు గొట్టు నీటి పక్షులు, నీలి నీడలు, వర్ణిస్తూ.... మోక్ష సంపదకంటే ఇదే మేలని అచటనే కూర్చో కూడదా? అని వర్ణనా నైపుణ్యాల ఒలకబోస్తాడు.

**కొండకాదది కోరుకున్న బంగరు కుప్ప**
**అడవికాదది చేరువైన స్వర్గము - మునుల**
**దరిచేరి యిష్టపడి తపము చేయగవచ్చు.**
**ప్రాజ్ఞ లోకములున్న పట్టులవి;- జ్ఞానమ్ము**
**బొందువచ్చును అతికిపోక - మతిచెడినట్లు**
**అగ్గితో మొరపెట్టుచూ - రాగోరి**
**తింటి దారుల బట్టుచూ...** అంటూ నిందిస్తాడు.

నీ శరీర కాంతులు, అపర భాషా విశేషాలు, శాస్త్ర విజ్ఞానాలు, ప్రజ్ఞకు సాన పెట్టే కోవిదులున్న భూమి అది. త్యాగధనుల తావు అది. పరమేశ్వరునితో వరాలిప్పించగల ఋషులున్న చోటు అది. మూర్ఖత్వంలో ఇల్లే లోకమని తలచి యిహ సుఖములకై వస్తివి? పరలోక సౌఖ్యములు సాధించాలని తపస్సు చేసే మునులను చలింపజేసే అప్సరసల సంగీత - నృత్య లయ విన్యాసాల నిగ- నిగల కాలాన్ని చూసే ఓపిక లేక శుద్ధ శోత్రియుడవై జంజాటముల తగులుకొన్నావు.

పక్షుల కిల - కిలరావములతో సర్వ చేతనంబు నెలకొను రసవార్ధులను దాటుకొని రసహీనవంతిగా సంసార బంధనములకై వెర్రిగా రానేల? మేనకాదేవితో మేలమాడువేళ నగరాజు నీ కతలు వినలేక తప్పించుకొన్నాడు. తానంత తాను వలచి వచ్చిన తరుణి వరూధునిని తులనాడి, తప్పులెంచి కరుణ చూపక ధూర్తులకు పట్టియిచ్చితివి. పరమేశ్వరుడు మా వాడు చూడమని మనసు విప్పెనో లేదో..... పార్వతీదేవి మగవాని హీనత్వము ప్రకటితమైనదని బాధపడినదట. దేవతలందరూ మూర్ఖులై మేనకను విశ్వామిత్రుని తపస్సు భంగపర్చుటకు వినియోగించగా గాధేయుడు తపోధనము నాశనము ఐనా పర్వాలేదు, అనుకొని మేనకను ఆలింగనం చేసుకొని ఆదరించాడు కదా! అతని దూరదృష్టి నీకేల కలుగలేదు? మనము కోరిన వరాలెన్నో ఈ కొండ మీద దేవతలు ఇచ్చిపోయారు. బదులుకోరలేదు. ప్రణయ రాగిణి వరూధుని ఆ చిన్న పాపమనసును ఎవరి మెప్పుకోసం చిన్నబుచ్చావు?

ఎన్నో పురాణ పురోగతి కతలు నీకు తెలుసు. వాటన్నిటికీ అగ్ని దేవుడే సాక్షి కదా! నీ తిరస్కారమునకు అందాలు చిలికించు అతి మనోహరి వరూధిని ఎంత వ్యధను అనుభవించిందో. ఆమె బాధను చూడలేక సూర్యదేవుడు ఖిన్నుడై అస్తమించాడు. సర్వదేవతలు ఈశ్వరునితో మొరపెట్టుకొన్నారు. కాలగతిచే వంచింపబడ్డ ఆ ముగ్ధను చూచి తోటి అచ్చరలు నూత్న కవితా ప్రసంగాలచే పురుషుల ద్వేషిస్తూ ప్రొద్దు పోగొట్టుకొన్నారు. మన్మథ బాణాలు ప్రవరుని ఏమి చేయలేక పోతున్నాయని రతీదేవి ముఖం తిప్పుకొందట. ఊర్వశి అర్జునిచే భంగపడిన విధానం రచయిత తెలుపుతూ ఆడువారికి అవమానం జరిగెనుపో అంటాడు. వరూధిని కోరిక మన్నించనందుకు ఋషులు కోపపడినారట.

చందమామను తిట్టి, చల్లగాలిని తిట్టి, పూల మంచాన్ని తిట్టి, జింక పిల్లతో తన విరహావస్థను చెప్పుకొని ఏడ్చిందట వరూధుని. ఈ హిమాచలంలో ఆడువారుని పోటుమాటలతో అకారణంగా తోసేసే పరిస్థితి లేదని నందీశ్వరుడు పలుకగా, వరూధిని మాటమాత్రం తనతో చెప్పలేదని గంగాదేవి వ్యథ చెందిందట.

ఇంతకీ నీవు ఊరెందుకు వచ్చావు? వరూధుని నీ కోసం చింత నిప్పులలాంటి కనులతో విరహాగ్నితో కాలిపోయి, వీణ వాయిస్తూ నీరాక కోసం వేచి చూస్తూ ఉన్మత్తగా మారిపోయింది. నీవు కన్పిస్తే తన సర్వస్వం ధారపోయడానికి సిద్ధపడగా దేవతలకు ఏమి కొరత అంటూ అడ్డుకొన్నావటగా.

"క్రొవ్వెక్కి ఈ కొండకోనలకు వచ్చితి త్రోవచూపుమంటూ వేడుకొన్నావటగా! అంటూ రచయిత ప్రవరుని ప్రశ్నించాడు. కామ శాస్త్ర ఉపాధ్యాయునిగా ఆ లేమ ప్రవర్తిస్తుంటే తప్పుపట్టావట గదా! మునులంతా స్వర్గంలో మా పొందు కొరకే ఇక్కడ తపస్సు చేస్తున్నారు. నీకు ఆ శ్రమలేకుండా స్వర్గ సుఖాలు ఇస్తాను అన్న వరూధునిని తృణీకరించి వచ్చావటగా! అంటూ ప్రవరుని రచయిత వై.సి.వి.రెడ్డి నిలదీస్తాడు. భూస్వాముల సేవ, గోస్వాముల సేవ, అయ్య, అమ్మల సేవ అంటూ కర్మ నిష్ఠల గూర్చి ఆలోచించి కలకండ వంటినీ ప్రాయాన్ని రూపలావణ్యాన్ని నష్టపర్చుకొన్నావు. జప, తపములు చేసి భూతదయ లేనట్టి పుణ్యాత్మా! భూసురా! చదువేలరా నీకు ఛాందసా! అని ఆ కొండ కోనలు నిన్ను అపహసించిగా, ఆమె నిన్ను తాకిందని ఆఘమర్షణ స్నానం చేశావు. అగ్నిదేవుని ప్రార్థించి ఊరు చేరుకొన్నావు. నిన్నే మది నిండా నింపుకొని భగ్న హృదయంతో ఆత్మ శాంతి కోసం అడవుల పట్టి పోయింది ఆ పిల్ల. ఇది అతి దారుణము భూవరా! ఆ అచ్చరపిల్ల గతిలేక చెడిపోయింది. "నేను కొర నోములు నోచితిని అంటూ వాపోయింది. విధి రాతను ధూషించి... నీ రూపలావణ్యాన్ని తలుచుకొని తలుచుకొని పొగిలి పొగిలి ఏడ్చింది వరూధుని.

వై.సి.వి. రెడ్డిగారు హేతుబద్ధత, తార్కికత, నైతికత, శాస్త్రీయాల మానవీయతను అభ్యుదయ భావాలతో రంగరించి సామాజిక శ్రేయస్సు కొరకు పాటుపడాలని హితవు చెప్పారు. ప్రకృతి వర్ణనల కంటె వాస్తవిక పరిజ్ఞానం సగటు మానవుని సంక్షేమం, గొప్పవని తేల్చి చెప్పారు. అంతవరకూ ప్రవరుని తీరుని అధిక్షేపిస్తూ నిరసించిన ఆ గళము కొత్త త్రోవను వెతుక్కొని ప్రగతి పథాలవైపు పరుగులు పెట్టి అభ్యుదయం తీరం చేరింది. మానవీయ విలువలు, ప్రేమ పవిత్రతలు పరాకాష్టకు చేరుతాయి. ఆ మంచు కొండలో వరూధునిని తన ప్రాణ ప్రదాతగా అభివర్ణిస్తారు ప్రవరుని పాత్రలో వై.సి.వి.రెడ్డి.

**కనులలో పెట్టుకొని కాపాడి పరిచర్య**
**చేసి; నా అర్థాంగి జేరనిచ్చెనుకొన్ని**
**ఉడంగరలతో – నామె –**

ఉన్నతోన్నతమైన మానవత్వము ఎంత మాననీయము అంటూ ముగిస్తారు.

**మంచు బిందువుల కలలు పండగ ఒక్క**
**కలలోని కాంతిరేఖగ నన్ను బ్రతికించు...**
**కొన్న పున్నెపుకన్నె – మరువగా**

తరమౌనె సంస్కారముల్.... అంటూ విలువలకు పట్టం గట్టిన మహనీయుడు వై.సి.వి.రెడ్డి. వైజయంతి వారి మానస పుత్రిగా గోచరిస్తుంది.

❖ ❖ ❖



**డా॥ గూగంశెట్టి రామకృష్ణ**
సెల్ : 9490686225

## పారిజాతం

“విశ్వశ్రేయః కావ్యం” లోకానికి మేలుచేసేది కావ్యం. భారతీయ సాహిత్యంలో పురాణేతిహాసాలు ప్రజలలో ధర్మాన్ని ప్రభోధించేవిధంగా, నీతిని సుస్థిరం చేసేవిధంగా, ఆధ్యాత్మికభావన పెంపొందించే విధంగా రచించబడ్డాయి. దేశకాలప్రదేశమార్పులకు అనుగుణంగా సాహిత్యంలో అనేక క్రొత్తప్రక్రియలు పుట్టుకొచ్చాయి. వాటిలో కొన్ని సామజికదృష్టితో, మరికొన్ని ఇహలోక సౌఖ్యాలకు నెలవై, ఇంకొన్ని శృంగార రసానందమే పరమార్థంగా వచ్చాయి. అంటువంటి ప్రక్రియే ప్రబంధం.

ప్రబంధాలు వర్ణణాత్మక కావ్యాలు. పురాణేతిహాసాలనుండి ఏదో ఒక చిన్నకథను తీసుకొని అష్టాదశ వర్ణనలతో పెంచి వాటిని మహాకావ్యాలుగా మలిచారు ప్రబంధకవులు. మార్కండేయపురాణం ఆధారంగా మనుచరిత్ర, భాగవతం, హరివంశం, విష్ణుపురాణం ఆధారంగా నందితిమ్మన “పారిజాతాపహరణం”అనే ప్రబంధకావ్యాలను రచించారు.

సాహిత్యపరంగా ప్రబంధాలు వస్తురూపవర్ణానావైవిధ్యంతో, ఇంపుసొంపైన శబ్దాల కలయికతో పండితపాఠకుల హృదయాలను రంజింపచేశాయి. సామాజిక దృష్టితో చూసినపుడు ఫ్యూడల్ వ్యవస్థకు ప్రతీకలుగా ప్రబంధాలు కనిపిస్తాయి. “న విష్ణుః పృథివీ పతిః” అని మానవమాత్రులైన రాజులను దైవాంశ సంభూతులుగా చిత్రించి, వారి అనుగ్రహంకోసం ఆనందంకోసం, మితిమీరిన శృంగారాన్ని, అతిశయమైన వీరత్వాన్ని ప్రబంధకావ్యాలలో చొప్పించి రచనలు చేశారు. ప్రబంధకవులు తమ సుఖమయ భోగలాలసత్వ జీవనంకోసం, రాజుల మెప్పుకోసం రచనలు చేసి వ్యష్టిసేవలో తరించిపోయారు. స్వీయ పాండిత్య ప్రకర్షను నిరూపించుకునేందుకు ప్రౌఢ పద ప్రయోగాలు, దీర్ఘసమాసాలు ప్రబంధాలలో ప్రయోగించి కవిత్వాన్ని పండితులకు మాత్రమే పరిమితం చేశారు. తమ ఊహానాయకుల లక్షణాలను మూలకథలోలేని పాత్రలకు అంటగట్టి చరిత్రను వక్రీకరించారు. రాజులు ఇచ్చిన కాంతా కనకాలతో సుఖభోగాలలో నిండా మునిగి రాజులు ప్రజలను దోచుకోవడానికి కారకులయ్యారు. పొద్దు పోగొట్టే మాటలుతప్ప సమాజానికి పనికివచ్చే సందేశాలు వాటిలో శూన్యం. సామాన్యుని, సామాజిక బాధ్యతను సంపూర్ణంగా విస్మరించారు ప్రబంధకవులు.

పూర్వంనుండి ఇప్పటివరకు ఎందరో పండితులు ప్రబంధకావ్యాలను విమర్శిస్తూ వస్తున్నారు. 20వ శతాబ్దంలో మార్క్సిస్ట్ దృక్పథంతో వచ్చిన అభ్యుదయకవిత్వం ప్రబంధ కవిత్వంపై తిరుగుబాటు చేసి వాటిలోని

ఫ్యూడల్ భావజాలాన్ని బట్టబయలుచేసింది. “సామాన్యులకు అందుబాటులో లేకుండా ఆకాశమార్గంలో పయనించే కవిత్వాన్ని భూమార్గం పట్టిస్తానన్నాడు “శ్రీ శ్రీ.

అభ్యుదయకవియైన వై.సి.వి. రెడ్డి సామాజికదృష్టితో “వైజయంతి” అనే పేరుతో మనుచరిత్రకు, “పారిజాతం” అనే పేరుతో పారిజాతాపహరణం కావ్యానికి విమర్శనాత్మక గేయకావ్యాలు వ్రాశాడు. నందితిమ్మన పాండిత్యాన్ని మెచ్చుకుంటూనే పారిజాతాపహరణం కావ్యంలోని అనేక కల్పనలను సన్నివేశాలను అసంబద్ధ అంశాలను అభ్యుదయ ప్రతిబంధకాలుగా నిరసిస్తూ మానవతాపూరిత నవగేయ విమర్శనాత్మక వ్యాఖ్యానం చేశాడు తన “పారిజాతం “కావ్యంలో.

వై.సి.వి. రెడ్డి తన పారిజాతం కావ్యంలో పారిజాతాపహరణంలో శ్రీకృష్ణుని సౌందర్యాన్ని, సత్యభామ అలుకను ముద్దుపలుకులతో మనోహరంగా వర్ణించిన నంది తిమ్మన కవితాప్రౌఢిమను ఒకవైపున ప్రశంసించాడు.

**నల్లగొల్లని కాంతి అల్లవో దోసిల్ల**
**బట్టి అలిగిన గొల్లపడచు గుండెలజల్లి**
**జలదాంత చంద్రరేఖల సౌరభములకు**
**అందించి అందాల గంధములు వర్షించి**
**నమ్మబలికిన నంది తిమ్మనా జోహారు**
**నీ వెంట రాకుందునా నందనము**
**జూపింప కాదందునా**

కవి వై.సి.వి. తానుకూడా పారిజాతవృక్షాన్ని తేవడానికి స్వర్గలోకానికి వెళ్లిన సత్యభామాకృష్ణులవెంట నడిచి ఆ మార్గంలో ఉన్న సుందరదృశ్యాలను చూస్తానంటాడు.

తిమ్మన పారిజాతాపహరణంలో నాయకుడైన శ్రీకృష్ణుడు నాయకియైన సత్యభామకు స్వర్గలోకమార్గంలో మేరునగ సౌందర్యాన్ని, తన్మయత్వంతో గానంచేస్తున్న కిన్నెరకోటిని, కామధేనువు పాలు పెరుగుతో తృప్తిగా భుజించి కైలాసపర్వతానికివెళ్తున్న సాధువులను, ఆకాశగంగను, అనసూయాది సాధ్వీమణులు నివసించే ప్రదేశాలను, అమరలోకంలో అమరావతీనగర సౌందర్యం మొదలైన వాటిని వివరిస్తాడు.

**మానసోల్లాసమునకు మంచి మాటలు కొన్ని**
**పదబంధములు చేర్చి పద్యాలుగా గూర్చి**
**తియ్య తియ్యని తేనె తేట్టెలను భుజియించి**
**తేపినట్టుల జేసి,ఊపిరాడనీక**
**ఉదరలుగొట్టితిరి ఉత్త పుణ్యానికే**
**జనత చచ్చిరి తిండికీ పేదలను**
**వంచించుట దేనికీ**

**ఏ కొండచూచెనో? ఏ అడవి చూచెనో?**
**ఏ పల్లె చూచెనో? ఎవరు ఎవరను విధము**
**అడుగనేలేదు ఏర్పడగ నాధునితోడ**
**పని చూడమని ఒక్క పలుకు మాత్రము తప్ప**
**జీవితేశ్వరుదేమి చెప్పినా నిజమన్న**
**భావమున ఊకొట్టెనో చూపినది కల్పకంబని ఎంచనో**

**హృదయేశ్వరికి జడిసి ఊపిరాడక పారి**
**జాతమ్ముదెత్తునని చదురు మాటలాడెనో**
**నారదుడు ఆడించు నాటకమ్ముల శ్రేష్ఠ**
**నాయకుడుగా కృష్ణు నమ్మించి ఆటలో**
**రక్తిగట్టింప పోరాడినావనుకొందు**
**మీరు నారదులేమొపొ కాకున్న**
**నాకు చూపక పోవుపో**

పారిజాతాపహరణంలో వర్ణించిన ఈ విషయాలు తిమ్మన కావ్యంలో తప్ప ఆ దారిలో వెళ్లిన తనకు కనిపించలేదని కవి వైసీవి పారిజాతంలో వాపోతాడు. పారిజాతాపహరణంలో నారదుడు కథనంతా నడిపిస్తే తన కావ్యనాయకుడైన శ్రీకృష్ణదేవరాయలు రాణి చిన్నాదేవి కోసం పారిజాతాపహరణం కావ్యాన్ని నంది తిమ్మన సృష్టించాడని కవి అభిప్రాయపడ్డారు.

పారిజాత కుసుమం రుక్మిణీ దేవికి ఇచ్చినందుకు కోపసదనంలో సత్యభామ అలుక, శ్రీ కృష్ణుడు సత్యభామను బుజ్జగించిన ఘట్టాన్ని అద్భుతంగా చిత్రించిన తిమ్మన పారిజాతవృక్షం పోయినందుకు మిక్కిలి చింతించిన దేవేంద్రుని సతీమణి శచీదేవి దుఃఖాన్ని చిత్రించకపోవడం విడ్డూరమన్నాడు. ఇంద్రుడు నాయకుడు కాదా? ఇంద్రాణి నాయకి కాదా? శచీదేవి బాధను విస్మరించడం సబబు కాదని ప్రశ్నించాడు. న్యాయం అనేది ఇరువైపులా ఉండాలికదా?. వారు తన ఉహా నాయకీ నాయకులు కాదు కాబట్టే వారి బాధను తిమ్మన చిత్రించలేదని గర్జించాడు. ఈ విషయాన్ని తన పారిజాతంలో

**ఎంత దుఃఖించినా ఏమి లాభము పారి**
**జాతమ్ము పోయెనని చపలాక్షి ఇంద్రాణి**
**గూటి దీపమునార్పి కుతిలపడి వెతలపడి**
**కోపసదనము జేరి కుములుకొని కుములుకొని**
**వ్రాయలేదెందుకని ఆమెతో పనియేమిటనుకొంటివా?**
**దేవతలకు పరువేమిటనుకొంటివా? అని విమర్శించాడు**

**సన్నోని కడుపులో ఉన్న ఆలోచనలు**
**చిటిలి ఆకటి మంట పెటిలి పుటపాకమై**
**విప్లవోన్ముఖముగా విచ్చి విరిసెను సామి**
**నేనుండలేనింక నేనుగా రాలేను**
**నా వెంటనే వచ్చి నన్ను నడిపించవలె**
**పేదలకు సాయపడగా – పోవలయు**
**ప్రియము బల్కితి నీకుగా**

ఈ లోకంలో పేదలు కూడుకోసం, గూడుకోసం, గుడ్డకోసం అలమటిస్తూ పోరాటం సాగిస్తూ ఉన్నారు. తిమ్మన కల్పిత స్వర్గలోక మార్గం కోసం వెతికి,కొందరికి మాత్రమే లాభం కలిగించే పుణ్యవ్రతాలు చేసి సమయాన్ని వృథాచేయడంకంటే ఈ లోకంలోనే ఉండి పేదలను దోచుకొంటున్న భూస్వాములతో, పెట్టుబడిదారులతో పోరాడి ప్రజలను చైతన్యం చేసేపనులు ఉన్నందున పీడిత ప్రజల అభ్యుదయంకోసం తిమ్మనకవినే తన వెంట వచ్చి ముందుకు నడిపించాలనే ఆకాంక్షను వ్యక్తం చేశాడు. నందితిమ్మన వంటి పాండిత్యప్రకర్షకుల కవులు ప్రబంధకవుల బాటనడిచి అట్టి రచనలు చేసి సామాజిక బాధ్యతను విస్మరించడం సహేతుకం కాదనే అభిప్రాయం వ్యక్తం చేశాడు. ప్రబంధకవుల బాటపట్టిన కవులకు చురకనంటించాడు. ఆధునికకవులు ప్రజలకు మేలుకలిగించే రచనలు చేసి సమసమాజ చోదకులు కావాలని అభిలషించాడు. నంది తిమ్మన ను పాత సమాజానికి ప్రతీకగా వై.సి.వి వాడుకొన్నాడు. ప్రబంధకవుల బాటలో నేటితరం కవులు పయనించడం ప్రయోజన శూన్యం అనే భావన పారిజాతంలో వ్యక్తం చేశాడు వై.సి.వి.

❖ ❖ ❖

**నీతియుతుండునున్ కవియు నిర్మల చిత్తుడుదాత్తుదాత్త వా**
**ణీతరుణీ కటాక్షుడవి నిందిత శబ్ద రసౌచిత కళో**
**పేతుడు ఎమ్మనూరు చిన వెంకటరెడ్డి మాదు స్నేహము**
**ధ్రాతి మనోహరత్వమెగదట్టగ నంకితమిచ్చితీకృతిన్**

**– రాచమల్లు భైరవ కొండారెడ్డి**



కడప ఆకాశవాణిలో ప్రసంగిస్తున్న వైసీవి రెడ్డి



నిలుచున్నవారు : శ్రబ్ధా, దినకర్, సాత్విక, సుప్రజ, దృవిక, మనోజ్ఞ, స్వాతి, విహసిత, విభాకర్, శ్రేష్ఠ, చోహార

కూర్చున్నవారు : ఉమామహేశ్వరి, ప్రభాకర రెడ్డి, ప్రతాప రెడ్డి, తులసి



ప్రొ॥ కేతు విశ్వనాథరెడ్డి

# అచ్చమైన తెలుగు జానపదుని కథలు
# గట్టిగింజలు

వచన సాహిత్య ప్రక్రియల్లో యీ నాడు తెలుగు కథానికకు ఒక విశిష్ట స్థానముంది. యేడాదికి మూడువేల కథలకు పైగా వివిధ పత్రికలు కథానికలను ప్రచురిస్తున్నాయి. వీటిలో "పురుషులందు పుణ్య పురుషులు వేరయా" అన్నట్లు కొన్ని మంచి కథలూ వస్తున్నాయి. స్పష్టమైన జీవితావగాహన నిర్దిష్టమైన జీవిత వాస్తవికతా లక్ష్యంగా కల తెలుగు కథలు నిజానికి అల్పసంఖ్యాక వర్గానికి సంబంధించినవే. రాయలసీమలో కథకులు అరుదు. ఒక విధంగా రాయలసీమ జీవితం ఇంకా పూర్తిగా ఆధునికం కాకపోవడం వల్ల ఆధునిక సాహిత్య వాతావరణం లేకపోవడం వల్ల కథలజోలికి వెళ్ళిన రచయితలు చాలా కొద్దిమందే. ఇటీవలి కాలంలో తమ పరిధుల్లోని జీవిత అవగాహననూ, తమ జీవితానుభవాల ద్వారా సమకూర్చుకున్న వాస్తవికతనూ, కథల ద్వారా అందించడానికి ప్రయత్నం చేసిన రచయితల కోవలోకి వైసీవి చేరుతారు.

వై.సి.వి. యింతకు ముందే యెక్కువ కాల్పనికావేశమూ, పరిమితమై అభ్యుదయంగా కలిసిన 'దక్షిణా నిలం' మొదలైన కావ్యాలు రచించిన కవిగా నలుగురికి తెలిసిన వాడు. గాసగాడి యిక్కట్లను తన రాయబారం ద్వారా విన్పించిన తర్వాత ఆయన కవిత్వం జోలికి పెద్దగా పోలేదు. యీ మధ్యలో అభ్యుదయ సాహిత్యోద్యమంతో, వామపక్ష రాజకీయాలతో ఆయనకున్న ప్రత్యక్ష సంబంధాల నుంచీ సరళమైన ఆయన గ్రామీణ జీవితానుభవాల నుంచీ పుట్టినవే 'గట్టిగింజలు' లోని కథలు.

యివి యిరవయ్యొకటి వున్నాయి. యీ కథల్లో బ్రతికి చెడ్డవాళ్ళు, పీడితులైన బడుగు జీవులూ కనిపిస్తారు. బ్రతికి చెడ్డవాళ్ళు సాధారణంగా కాస్తా పెద్ద రైతులు. సన్న రైతులూ వాళ్ళే కాక బావుల్లో నీళ్లు లేక, యింకేవో గొడవలలో బుగ్గి అయినవాళ్లు. పీడితులైన బడుగు జీవులు వొక్క కులానికే పరిమితమైనవారు కారు. అన్ని కులాల వారు. వారు సేద్యగాళ్ళు కావచ్చు. వృత్తులు చేసుకునే వాళ్ళు కావచ్చు.

వస్తువులో, పాత్ర చిత్రీకరణలో, నాటకీయతలో, దృక్పథంలో, కథనంలో, శైలిలో, ఎత్తుగడలో ముగింపులో వైసీవి కథానిక రచయితగా కన్నా జానపద కథకుడి లాగా స్కెచ్ రచయిత లాగా కనిపిస్తున్నారు. దీన్ని వై.సి.వి. ప్రత్యేకత అనవచ్చు. లేదా కథానికా శిల్పం వై.సి.వి పట్టబడలేదు అని అయినా చెప్పవచ్చు.

అయితే రాయలసీమ గ్రామ ప్రాంతాల్లోని అచ్చమైన జన జీవితంలో ఇటీవల కాలంలో జరుగుతున్న మార్పులకు స్పందించిన రచయితగా వై.సి.వి అభినందనీయుడు. రాయలసీమ జీవితమే విచిత్రమైంది. యీ ప్రజలకు ప్రకృతీ శత్రువే. తీవ్రమైన అసమానతలున్న సామాజిక వ్యవస్థా శత్రువు. ఒక శత్రువును శాస్త్ర విజ్ఞానంతో లొంగదీసుకోవడం అసలే లేదు. మరొక శత్రువుతో పోరాటం సకృత్తుగా కూలి సంఘాల రూపంలో మాత్రమే కనిపిస్తుంది. యీ స్పృహ వై.సి.వి.కి ఉంది. అంతే కాదు రాయలసీమ కథకుడు తప్ప వేరే రచయిత యెవరూ రాయలేని కథలు యివి. ఈ కథలో అవలీలగా దొర్లిన ఆయా మాండలికాలే యిందుకు ప్రథమ సాక్ష్యం.

యీ సంపుటిలోని 'దొంగబర్రెగొడ్లు', 'కుత్రల్లో కూలోడు', 'ఎంత మంచిదైతే ఏం', 'దీని కంతెక్కడా?' 'యింటి మాదిగోడు', 'ఆస్తి విలువ కథల్లో గ్రామీణ భూస్వామ్య వ్యవసాయక జీవితంలో వచ్చిన మార్పులవల్ల శ్రామిక వర్గం చివరి అంచులకు చేరుకుంటున్న బాధితులు కన్పిస్తారు.

యీ కథల్లో శిల్ప సంబంధమైన లోపాలు రెండు మూడు కన్పిస్తాయి. ముఖ్యమైన లోపం కథల్లో యెక్కడా నాటకీయత కన్పించదు. కథకుడే ఆయా సన్నివేశాల్లో, సంఘటనల్లో పాల్గొని పాత్రల కథ చెబుతాడు. ఆ పాత్రల చరిత్ర చెబుతాడు. ఆయా పాత్రల రాగద్వేషాలను వాటి ఘర్షణను తానే వివరిస్తాడు. కథకుడే సర్వసాక్షి. అందుకే యీ సమీక్షకుడు ముందుగా అన్నట్లు యిది జానపద కథకుడి ధోరణి అని. యీ ధోరణి వల్ల వొక లాభముంది. అది పాఠకులు హాయిగా చదవొచ్చు. యెవరైనా చదివితే నిరక్షరాస్యులు కూడా హాయిగా వినవచ్చు. యీ ధోరణి వల్ల కలిగే నష్టం జీవిత నాటకాన్ని గురించి పాఠకున్ని గట్టిగా విస్తారంగా ఆలోచింప చేయలేకపోవడం. నాటకంలో పాల్గొనే వివిధ పాత్రలు నమూనాలుగా తమ తమ ప్రత్యేకలతో మనముందు కన్పించే అవకాశాలు లేకపోవడం.

దీనికితోడు "గట్టిగింజలు" రచయితలోని మరొక ముఖ్యమైన లోపం తాను కవిని అని మరచి పోలేక పోవడం. విషయమంతా వూదరగొట్టాలనే లౌక్యం కలిగి ఉండడం. నిజానికి కథలన్నీ రాయలసీమ మాండలికానికి యెంతో దగ్గరలో వున్నాయి. చిన్న చిన్న వాక్యాలతో కథనశైలి చాలా బిగువుగా ఉంది. 'నా కళ్ళముందు యెవరో భాసించారు.' 'నా జీవితం ఆమె సాన్నిధ్యాన్నుంచి దూరమై ముప్పైయేళ్ళు కావస్తూ వుంది.' 'మీనాక్షి వుజ్జ్వలంగా భాసించింది' వంటి వాక్యాలు చదివినప్పుడు యీ రచయిత యింకా కాల్పనిక కవిత్వపు రోజులనాటి శబ్దలోలత నుంచి బయట పడలేదనిపిస్తుంది. అయితే యిటువంటివి అరుదే ననుకోండి.

కథ ద్వారా చెప్పదలుచుకున్న పాయింట్ కథలోని సంఘటనల ద్వారా స్పష్టమైన కూడా రచయిత జోక్యం కల్పించుకొని పరిష్కారాలూను సూచించడం కొన్ని కథల్లో కనిపిస్తుంది. ఉదాహరణకు 'దిక్కులేని బ్రతుకులు' కథలో చివరి వాక్యం, ఆస్తి విలువలోని చివరి పేరా చదవండి. కథలో వ్యాస రచయిత కనిపిస్తాడు.

యీ లోపాలున్నంత మాత్రాన వై.సి.వి. కథల ప్రయోజనాన్ని తక్కువగా అంచనా వెయ్యలేము. జానపద కథలకున్న యీ కథల దగ్గరి తనమే వీటి ప్రత్యేకతకు వొక తార్కాణం. యే సామాజిక దృష్టిలేని వందలాది కథలు పడుతున్న రోజుల్లో ఈ కథకుల కున్న అభ్యుదయ సామాజిక దృష్టే యీ కథల్లోని విశిష్టతకు దృష్టాంతం.

యీనాటి కథారంగం నుంచీ తప్పుకుంటున్నా వాస్తవిక గ్రామీణ జీవితాన్ని కథల్లో మలిచే ప్రయత్నం చేయడమే యీ కథల చారిత్రక ప్రాధాన్యతకు కారణం.

గట్టిగింజలు అచ్చమైన తెలుగు జానపదుని కథలు.

**(గ్రంథ సమీక్ష: ఆకాశవాణి ప్రసారం: 30 సెప్టెంబరు 1982, రాత్రి 8:15)**



**ప్రభాకర రెడ్డి, ఓబులరెడ్డి, అర్జుల రామచంద్రారెడ్డి, కేతు విశ్వనాథ రెడ్డి, వెంకటేశ్వర్లు, బ్రహ్మానంద రెడ్డి, మల్లికార్జున రెడ్డి**



**డా॥ కె.యన్. సుందరేశ్వరరావు**
తెలుగు శాఖాధ్యక్షులు
ప్రభుత్వ పురుషుల కళాశాల, కడప.
9491641228

# వై.సి.వి. రెడ్డి కథలు - శిల్ప వైవిధ్యం

కాలాన్ని బట్టి ఆధునికుడైనా, రాసిన రచనలను బట్టి గురజాడ ఆశించిన కొత్త పాతల మేలు కలయికగా చెప్పదగిన యమ్మనూరు చిన్నవెంకటరెడ్డి (వై.సి.వి.రెడ్డి) తొలిదశలో కవితలు, గేయాలు, పద్యాలు రాశారు. కాలక్రమంలో మార్క్సిస్టు మిత్రుల సాంగత్యంతో కథలవైపు ప్రయాణం చేసి 'గట్టి గింజలు' పేరుతో ఒకే సంపుటిగా ఇరవైఒక్క కథలు రాసి, అచ్చువేశారు. తానెరిగిన పల్లెల రైతుల జీవితాన్ని వాస్తవికదృష్టిలో నిజాయితీగా చిత్రించారు. రైతులు, రైతుకూలీలు సంఘటిత శక్తిగా రూపొందడమే వారి సమస్యలకు అసలైన పరిష్కారంగా భావించినట్లు, ఆయన కథలు చదివితే తెలుస్తుంది.

సంప్రదాయకవిగా తన ప్రస్థానాన్ని మొదలు పెట్టి క్రమంగా భావకవిగా, అభ్యుదయకవిగా, రచయితగా ఎదిగారు. ఆమరణాంతం కడప జిల్లా అరసం అధ్యక్షుడిగా సేవలందించారు. మనిషితనం, పల్లెటూరితనం, రాయలసీమతనం మూర్తీభవించిన వ్యక్తిగా పేరు పొందారు. వైసీవీ కథా సంపుటి 'గట్టిగింజలు' లో మొత్తం 21 కథలున్నాయి.

ఈ కథల్లో రాయలసీమలోని పల్లెప్రజల జీవితం, సామాన్యుని కడగండ్లు, మధ్యతరగతి మనస్తత్వాలు, కుటుంబసంబంధాలు, అప్పుడప్పుడే మారుతున్న పల్లెలు – పట్టణజీవనం, ముఖ్యంగా స్త్రీల అణచివేత చిత్రించబడినాయి. ముఖ్యంగా ఆనాటి పల్లెల్లోని క్రౌర్యం, బలహీనుల అణచివేత, కత్తిమీద సాములాగా నడిచే జీవితాలు కనిపిస్తాయి. ఈ కథల్లో ప్రధానంగా స్త్రీ పాత్రల పట్ల రచయితకు ఉండే గౌరవం ప్రతి కథలో మనకు తెలుస్తుంది. తానెటిగిన పల్లెల్లోని జనజీవితం, వారి బలాలూ బలహీనతలు, దుర్మార్గాలు, క్రౌర్యాలు, మధ్యతరగతి మనుషుల మనస్తత్వాలు రచయిత ఈ కథల్లో అత్యంత సహజమైన రీతిలో చిత్రించారు.

రాయలసీమ పల్లె జీవితాన్ని వై.సి.వి. రెడ్డి అతి సహజంగా, తన కథల్లో చిత్రించారు. "గట్టిగింజలు" సంపుటిలో మొత్తం కథలు ఇరవైఒక్కటి. ఇందులోని ప్రతికథలోను రైతుల, రైతు కూలీల కష్టాలు, వాటి పరిణామాలు యథాతథంగా చిత్రించబడినాయి. చిన్నరైతుల అరకొర భూములను పెద్దరైతులు అప్పులు, వడ్డీల పేరుతో ఆక్రమించడం, నాటి పల్లెల్లోని కరణం – రెడ్ల ఆధిపత్యం, కరువు కారణంగా పేదల చేలు పండక అప్పులు చేయడం, యాభై ఎకరాల రైతు కూడ చివరికి భూమి అమ్మి పట్నం చేరాల్సిన పరిస్థితులు ఏర్పడడం, దశాబ్దాలు కష్టం చేసినా, రైతులకు అప్పులే మిగిలిపోవడం, ప్రధాన రైతు కుటుంబాలతోపాటు ఇతర వృత్తుల కష్టాలు – ఈ కథల్లో పాఠకులకు విస్మయం కలిగిస్తాయి.

ఈ కథల్లో స్త్రీ కేంద్రంగా రాసిన కథలు కొన్ని ఉండడం విశేషం. మంచివాళ్ళు, నగుమోముగనలేని, చావకూడని అందం, లోకం ఓడిపోయింది, మంచితనం, దిక్కులేని బ్రతుకులు, ఆస్తి విలువ, పరువూ ప్రతిష్టలూ – అనే ఎనిమిది కథల్లో స్త్రీ ఏవిధంగా సమాజంలోని 'కుటుంబ వ్యవస్థ'లో నలిగిపోయేదీ మన కళ్ళకు కట్టినట్లు వివరిస్తాడు రచయిత.

'మంచివాళ్ళు' కథలో గంగమ్మ ప్రధాన పాత్ర, నిరుపేదది, భర్త వదిలేసినాడు. కూలీ చేస్తూ పన్నెండేళ్ళ బిడ్డను పోషించుకొంటోంది. ఆమెను చూసిన కథకుడు ఆమెలోని ఆకర్షణను, ఆమె బీదరికాన్ని గమనిస్తూ, మాట్లాడాలని, పని నెపంతో కలవాలని ప్రయత్నిస్తాడు. ఎలాగో తెంపుతో 'పనికొస్తావా' అని అడుగుతాడు. నిజానికి ఇతనిలో సానుభూతి ఉంది. (కానీ అది సౌజన్యారావు పంతులు స్థాయి అనిపిస్తుంది). మరుసటిరోజు ఆమె పనికి వచ్చింది. పనిపూర్తయ్యాక, గంగమ్మతో బిడ్డ పెళ్ళిని గూర్చి, ఆమె పేదరికాన్ని గూర్చి వాకబు చేస్తాడు. తాను సాయపడతానంటాడు. కానీ, అప్పటికే ఇలాంటి హామీలతో మోసపోయి విసిగిపోయినానని, మమ్మల్ని ఇలా బతకనివ్వమని చెప్పి వెళ్ళిపోయింది. కథకుని జాలి అపహాస్యం పాలైంది.

'నగుమోము గనలేని' కథలో మీనాక్షి జీవితం ఒంటరిదాన్ని చేసి బాధించింది. చిన్నప్పట్నుంచీ దాదాపు నాలుగైదేళ్ళు ఆమె సంగీతం విన్న కథకుడు, ముప్పైఏళ్ళ తర్వాత ఆమెను పట్నంలో చూడడం తటస్థించింది. ఓ చిన్న ఇంట్లో సంగీతం పాఠాలు చెబుతూ, ఒంటరిగా జీవిస్తోంది. ఇంట్లో ఎవరూ లేరా? అని కథకుడడిగిన మాటకు వెక్కి వెక్కి ఏడ్చి కూలబడి పోతుంది. ఒంటరితనం ఆమెను ఎంత బాధించిందో మనకు ఈ కథ చెబుతుంది.

'చావకూడని అందం' కథలో సరస్వతి పరిస్థితి కూడ ఇంతే. ఆమె చేత 'చిన్నన్నా' అని పిలిపించుకునే కథకుడు ఆమె చనిపోయిన విషయం విని, చిన్ననాటి జ్ఞాపకాలు చెబుతాడు. బాల్యవివాహాలు, అమరకోశం శ్లోకాలు కంఠతా చెప్పడం, ఆట పాటలు – ఇలా హాయిగా సాగిన వారి బాల్యానికి గొడ్డలి పెట్టుగా సరస్వతి పెళ్ళి జరిగి, అత్తవారింటికి వెళ్ళి, నెల తిరగకముందే జబ్బుతో పుట్టిల్లు చేరింది. పదమూడేళ్ళకే గర్భవతి అయి, జాడ్యంతో మరణించింది. చిన్నన్నా! అని చనిపోయే ముందు కలవరించిందని చెబుతూ కథకుడు సరస్వతిని గుర్తు చేసుకుంటాడు.

'లోకం ఓడిపోయింది' కథ పై మూడు కథలకన్నా భిన్నమైన ముగింపు గలిగిన స్త్రీ చైతన్యం మూర్తీభవించిన కథ. వై.సి.వి. స్త్రీ కేంద్రబిందువుగా రాసిన కథల్లో ఈ కథ చాలా మంచి కథ అని చెప్పవచ్చు. ఇందులో ప్రధాన పాత్ర 'పార్వతమ్మక్క'. ఈమె గొప్పింటి ఆడబిడ్డ, మంచితనం, దారాళమైనగుణం కలిగిన స్త్రీ. కథకుడు ఆమె పొరుగింటి పిల్లవాడు, తమ్ముడు. పెళ్ళైన కొంత కాలానికే అత్తింట్లో ఆమె నరకం చూసింది. బాధలను భరించలేక పోయింది. అత్తవారింటిని, భర్తను వదిలి పారిపోయింది. గర్భాన్ని రక్షించుకునేందుకు ఆ పని ఈ పని చేసింది. తర్వాత చాలా కాలానికి కథకుడికి ఆమె తిరుపతిలో కనబడింది. ఇంటికి తీసుకెళ్ళింది. చిన్న పెంకుటింట్లో కొడుకుని పెంచి, పెద్ద చేసి, పెళ్ళికూడా చేసినానని, తమకిప్పుడు

తిండికేమీ లోటు లేదని చెప్పింది. గతాన్ని గూర్చి ప్రశ్నిస్తే – ఏ తప్పూ చేయని నేను ఎందుకు చావాలని? సంపన్నులెవరూ లేని పల్లెటూళ్ళో తలదాచుకొని, ఒక బీదరాలి చెంత ఆశ్రయాన్ని పొంది, బిడ్డను కన్నాను. చిన్నా చితక పనులు చేసుకుంటూ, బిడ్డను చూసుకొని బ్రతికినానని అన్నది. పార్వతమ్మక్క దృష్టిలో జీవితంలో ఎవరి మీదా ఆధారపడకుండా స్వతంత్రంగా బ్రతకడం స్త్రీకి చాలా అవసరం. ధైర్యం, ఆత్మవిశ్వాసం మూర్తీభవించిన పార్వతమ్మ అందరు స్త్రీలకూ ఆదర్శం.

'మంచితనం' కథలో అంకాలమ్మ సర్దుకుబోయే ధోరణితో, మంచితనంతో చితికిపోయింది. ఎవరినీ నొప్పించకూడదనే ఆలోచనల్లో బ్రతికి, చివరికి ఆత్మహత్య చేసుకుంది. ఆ పల్లెలోని కొందరు దుర్మార్గుల క్రౌర్యానికి ఆమె బలికావలసి వచ్చింది. రాయలసీమ పల్లెల్లోని అన్యాయాలను ఈ కథ కళ్ళకు కడుతుంది. నమ్మించి, అంకాలమ్మను కొందరు లోబరచుకోవడం భార్యాభర్తల మధ్య గొడవలు, నిత్యం ఇంట్లో అశాంతి – ఇలా ఈ కథ ముగుస్తుంది.

'దిక్కులేని బ్రతుకులు' లో రాజమ్మదీ ఇదే స్థితి. పెద్దిరెడ్డి అండకోసం, అతనికి లోబడింది. భర్త రామిరెడ్డిని సర్దుకుపొమ్మంది. ఊళ్ళో రాజమ్మ పెట్టిన కిరాణా అంగడి నడవాలంటే ఆ మాత్రం తప్పదని భావించింది. ఆస్తిని పెంచుకోవడం, ఇళ్ళు బాగుచేయడం లాంటి చిన్న చిన్న కోరికల కోసం తన గౌరవాన్ని వదులుకుంది. రామిరెడ్డి ఆత్మహత్యతో అంతా తలక్రిందులైంది. ఆమె కుటుంబం ఆస్తి మొత్తం పెద్దిరెడ్డికి దాఖలు పడిపోయింది. 'ఆస్తి విలువ' కథలో అంకమ్మ తల్లిదండ్రులు ఆమెను నారాయణకిచ్చి చేస్తారు. అతడు జూదం, సారాయికి అలవాటుపడి ఆస్తిని కరిగించేస్తాడు. చివరికి ఆత్మహత్య చేసుకుంటాడు. పల్లెల్లో ఇలాంటి అలవాట్లకు లోనైన భర్త వల్ల ఆ ఇంటి ఆడబిడ్డలు ఎలా నరకయాతన పడతారో ఈ కథ వివరిస్తుంది. చివరిగా స్త్రీ కేంద్రంగా నడిచిన 'పరువూ ప్రతిష్టలు' కథలో పెద్దిరెడ్డి తన కూతుర్ని ఆస్తిపరుల ఇంటికిచ్చి పెళ్ళి చేస్తే, అత్తింటిలో అత్త పన్నిన కుట్రలో కొత్త కోడలు హత్య చేయబడుతుంది.

వై.సి.వి. రాసిన మిగిలిన పదమూడు కథలు రైతుల, రైతుకూలీల కష్టాలను ఏకరువు పెట్టే 'పల్లె' కథలు. తన ప్రాంతమైన రాయలసీమ పల్లెల్లోని భూస్వాముల ఆధిపత్యం, కరణము–రెడ్ల పెత్తనం, వారు పేదలతో చేయించుకునే వెట్టిచాకిరీ, వారి వల్ల నలిగిపోయే కుటుంబాలు, స్త్రీలు ఈ కథల్లోని ప్రధాన ఇతివృత్తాలు. పేదలు తమకుండే ఎకరా, రెండెకరాల భూమిలో చేల కోసం చేసే వడ్డీలు, ఆ అప్పులు తీర్చలేక తమ భూములు వారికే అమ్మడమూ అక్కడి పల్లెలో నిత్యకృత్యాలు. తమ భూములు పోగొట్టుకొని, ఆ భూముల్లోనే కూలీ పనులకు పోవాల్సిన దృశ్యాలు మనకు నేటికీ కనబడుతుంటాయి. 'ఇష్టం వచ్చినప్పుడు', ఇష్టం వచ్చినట్లు వర్షాలు పడే సీమలో రైతులు ఎన్ని అగచాట్లు పడుతున్నారో మనకు తెలియనిది కాదు. ఈ సమస్యలకు తోడు 'కరువు'. యాభై ఎకరాల రైతు కొండారెడ్డి పైరుకోసం, బిడ్డల పెండ్లిండ్ల కోసం అప్పులు చేసి, తీర్చలేక, ఇంకా ఆ భూముల్లో వ్యవసాయం చేయలేమని తీర్మానించుకొని, ఉన్న భూమినంతా అమ్ముకొని పల్లెను వదిలి టౌను చేరడం 'దీనికంతెక్కడ' అనే కథలోని విషాదం. 'ఎంత మంచిదైతే ఏం?' అనే కథలో

ఈశ్వరమ్మ, రంగారెడ్డి దంపతులు పిల్లపెళ్ళి కోసం భూమి, కల్లం పోగొట్టుకొని కొడుక్కి ఏమీ మిగల్చలేదనే బాధతోనే చనిపోవడం మనం చూస్తాం. ఈ రెండు కథలు సీమలోని రైతుల, అట్టడుగు వర్గాల దయనీయ స్థితిని చిత్రిస్తాయి.

ఒక పక్క పంటలు పండక అలమటిస్తుంటే, మరో పక్క ఆధిపత్యపోరులో ఊళ్ళో పార్టీలు ఏర్పడడం, ఈ పార్టీలకు భూస్వాములు ప్రాతినిధ్యం వహించడం – వారి మధ్య గొడవల్లో దిగువజనం అల్లాడి పోవడం విషాదకరం. గట్టిగింజలు, ఐదురూపాయలు, రెడ్డొచ్చె మొదలెత్తుకో, కాటిగాడు, ఇంటి మాదిగోడు, ఇంకానా?, దొంగ బర్రెగొడ్లు, కుట్రల్లో కూలోడు – అనే ఎనిమిది కథలు అట్టడుగు జనం పేదరికాన్ని వర్ణిస్తాయి. వైసివి 21 కథల్లో ఈ ఎనిమిది కథలు మంచికథలని చెప్పవచ్చు.

మిగిలిన మూడు కథల్లో వెట్టిచాకిరీకి గురయ్యే కూలీల జీవితాలను ఎలా బాగుచేయాలో, ఎందుకు బాగుచేయాలో, ఎవరు పనికొచ్చేవాళ్ళో, ఎవరు పనికిమాలిన వాళ్ళో మనకు చూపించే ప్రయత్నం జరిగింది. 'గుడిసెదక్కింది' కథలో పేద రైతుకూలీ 'రామయ్య' పేరుతో ప్రభుత్వం పట్టా భూమి ఇవ్వడం శుభపరిణామం. కథాకాలం నాటికి పేదరైతులకు భూములు పంచే కార్యక్రమాన్ని ప్రభుత్వాలు చేపట్టడాన్ని రచయిత చిత్రించాడు. 'పనికిరానోళ్ళు' కథలో గొల్ల చిన్నక్క తనను బ్రతికించిన ఊరికి ఏదైనా చెయ్యాలని భావించి, బావి త్రవ్వించాలని నిర్ణయించుకుంటుంది. డబ్బున్న గొప్పోళ్ళు ఒక్కరూపాయి సాయం చెయ్యలేదు. ఏమీలేని సన్నోళ్ళే తలో రూపాయిచ్చి బావిని త్రవ్వడంలో వెంట నిలబడి, ఆమె నమ్మకాన్ని నిలబెట్టినారు. బావి పూర్తికావడానికి ఆ 'పనికిరానోళ్ళే' పనికొచ్చారు. చివరి కథ 'బంగారు సొమ్ములు' లో 'సరోజ' తన గుణాలనే బంగారంగా మార్చి బ్రతకడం, చదువుకు మించిన సొమ్ములు లేవని తన పిల్లలందరినీ చదివించే ప్రయత్నం చేయడం జరుగుతుంది. వైసివి రాసిన మంచికథల్లో ఇది ఖచ్చితంగా ఉండగలిగిన కథ. తల్లీకూతుళ్ళ ప్రేమ, నాగమ్మ తన కూతురు సరోజను పెంచిన విధానం, గుణాలనే సొమ్ములుగా బ్రతికిన 'సరోజ' ఉత్తమ ఇల్లాలుగా అందరికీ ఆదర్శప్రాయురాలవుతుంది.

శిల్పరీత్యా గమనించినపుడు వైసివి రాసిన కథలు రెండు విధాలు. అవి – అతి క్లుప్తంగా రాసినవి కొన్ని, కొంత వివరంగా రాసినవి కొన్ని. ఈ అతిక్లుప్తంగా రాసిన కథల్లో 'స్త్రీ' కేంద్రంగా రాసిన కథలున్నాయి. మిగిలినవి రైతుల 'పల్లె' కథలు. ఈ కథల్లో రచయిత చాలా చోట్ల పాత్రలతో పాటు తానూ ప్రయాణిస్తాడు. కొన్ని చోట్ల పాత్రలకంటే తానే ఎక్కువ కనిపిస్తాడు. అయితే దీన్ని పాఠకులు కథాంశంలోని తాదాత్మ్యంగా గుర్తించాల్సి ఉంటుంది. కడప జిల్లాలో రచయిత తాను తిరిగిన, ఎరిగిన పల్లె పట్నాల జీవితాల్ని వాస్తవికంగా ఉన్నది ఉన్నట్లు చిత్రించడం ఈ కథల్లోని బలం. కథా శిల్పానికి తగిన కాన్వాసు కొన్ని కథల్లో లేకపోవడంతో అవి 'స్కెచ్' లుగా కూడ కనిపిస్తాయి.

కథాశిల్పంలోని తొలి అంశమైన 'క్లుప్తత' వైసీవి కథల్లో స్పష్టంగా గమనించవచ్చు. అనవసర వర్ణనలు లేకపోవడం, ఎక్కడ ఎంత వరకు చెప్పాలో అంతే చెప్పడం ఈ కథల్లో విశేషం. చాలా కథల్లో 'అనుభూతి ఐక్యత' అనబడే రెండో శిల్పాంశాన్ని మనం గమనిస్తాం. కథ మొదటి వాక్యం నుంచి చివరి వాక్యం వరకు

'కథాంశం' ఎక్కడా చెదరకుండా నడపగలగడమే రచయిత 'అనుభూతి ఐక్యత'ను సాధించడం. 'గట్టిగింజలు', 'లోకం ఓడిపోయింది' కథల్లో అనుభూతి ఐక్యత సమగ్రంగా సాధించబడిందని చెప్పవచ్చు. 'గట్టిగింజలు' కథలో మధ్యతరగతి వర్గాన్ని కూలీల, శ్రామికుల వైపు నిలబడాలని సూచిస్తూ, అంతా దేశవ్యాప్తంగా జరుగుతున్న ఉద్యమాలను సమర్థించాలని కోరతాడు. శ్రామికులకు ప్రతీకంగా 'గట్టిగింజలను' రచయిత ఉదహరించడం ఈ కథలో గొప్ప ప్రయోగం. 'లోకం ఓడిపోయింది' కథలోని ప్రధాన పాత్రధారి 'పార్వతమ్మక్క'. తన పరిస్థితులకు తట్టుకొని, కుటుంబాన్ని ఎదిరించి, బిడ్డను కాపాడుకోవాలనే కోరికతో ఇల్లు వదిలి పారిపోయి ఎన్నో కష్టాల కోర్చి నిలువెత్తు ఆత్మాభిమానంగా మనకు కనిపిస్తుంది. వైసీవి అన్ని కథల్లోకెల్లా చైతన్యవంతమైన, శక్తివంతమైన పాత్రగా 'పార్వతమ్మక్క' సాక్షాత్కరిస్తుంది. తర్వాతి శిల్పాంశం 'సంఘర్షణ'. 'సంఘర్షణ' అనే అంశం లేకుండా వైసీవి ఒక్క కథకూడా రాయలేదు. ప్రతి కథా ఒక్కొక్క సామాజికాంశాన్ని ప్రశ్నిస్తూ, వివిధ పాత్రల, వాటి మనస్తత్వాల మధ్య సంఘర్షణను శక్తిమంతంగా చిత్రించింది.

అయితే కొన్ని కథల్లో 'నిర్మాణసౌష్ఠవం' అనే శిల్పాంశం కొంత సడలినట్లు అనిపించినా ఆది మధ్యాంతాల సూత్రాన్ని రచయిత జాగ్రత్తగా నడపడం విశేషం. 'కథా సంవిధానం' కూడ వైసివి కథల్లో చక్కగా సాధించబడింది. ఏ సంఘటనకు కారణం ఏ సంఘటనో తెలియజేయడమే కథా సంవిధానం యొక్క ప్రయోజనం. ఏ పరిస్థితుల్లో రైతులు నష్టపోతున్నారో, ఏ ఉద్దేశాలతో ఆ కుటుంబాలు ధ్వంసమవుతున్నాయో స్పష్టంగా తెలియజేసే సంఘటనలు ఈ కథల్లో చూడవచ్చు. ఇరవై ఏళ్ళు ఒళ్ళు వంచి రైతు కష్టం చేసినా, అప్పే మిగిలి ఇరవై ఎకరాలు అమ్ముకోవాల్సిన దుస్థితిని 'దీనికంతెక్కడా' కథలో మనకు స్పష్టంగా తెలుస్తుంది.

పాత్రచిత్రణ విషయంలో కూడ వైసీవి వైవిధ్యాన్ని ప్రదర్శించారు. ఎక్కువ శాతం కథలు (దాదాపు పదకొండు) కూలీలను, వారి జీవితాలను చిత్రించారు. కొన్ని కథల్లోని రైతుకూలీలు చైతన్యంలేని వారుగా మిగిలిపోతే, కొన్ని కథల్లోని పాత్రలు క్రమంగా 'వాస్తవాన్ని' తెలుసుకొని చైతన్యంవైపు ప్రయాణించడాన్ని చూపించాడు రచయిత. 'రెడ్డొచ్చె మొదలెత్తుకో' కథలోని 'గంగడు' అనే రైతుకూలీ గోవిందరెడ్డి బారి నుండి కథకుని ద్వారా రక్షించబడి, 'రామిరెడ్డి' అనే మరో భూస్వామికి 'బలి'లో బదిలీ అవుతాడు. 'రామిరెడ్డి మంచోడనుకుంటినే!' అని వాపోతాడు. 'గుడిసె దక్కింది' కథలో రామయ్య చైతన్యవంతమైన పాత్ర. పల్లెల్లో 'సంఘాలు' పెట్టడం ద్వారా ప్రభుత్వాలను ప్రభావితం చేసి, భూమిలేని పేదోడికి భూములు, ఇళ్ళు పంచే పద్ధతిని పరిచయం చేయిస్తాడు.

వైసీవి కథలు రాయలసీమలోని కడప జిల్లా నేపథ్యంలో, కడప మాండలికంలో నడుస్తాయి. తన సమకాలీన మార్క్సిస్టు రాజకీయనాయకులైన ఎద్దుల ఈశ్వర రెడ్డి, రారా, గజ్జల మల్లారెడ్డి గార్ల ప్రభావంతో జీవించిన ఈ రచయిత సీమరైతుల, రైతుకూలీల కష్టాలను తన కథల్లో చిత్రించాడు. రైతుకూలీలు చైతన్యవంతులై సమిష్టిగా కలిసి బ్రతికితేనే, వారి సమస్యలు తొలగుతాయని ఈ రచయిత భావించారు. 1980కి ముందు కాలం నాటి ప్రజాజీవితాన్ని, పల్లెల్లోని సన్నకారురైతుల, రైతుకూలీల దైన్యాన్ని చిత్రించారు. కథకుడుగా తాను ప్రామాణిక భాషను వాడినా, అక్కడక్కడా కడప మాండలికాన్ని పొందుపరచారు.

కథా శిల్పంలో చెప్పబడిన మూడు దృష్టికోణాల్లోనూ వైసీవి కథలు రాయబడ్డాయి. 'స్త్రీ' కేంద్రంగా రాసిన కథల్లో ఉత్తమపురుష దృష్టికోణం, మిగిలిన దాదాపు అన్ని కథల్లో ప్రథమపురుష దృష్టికోణం కనిపిస్తాయి. ఎక్కువ కథల్లో రచయితగా వైసీవి స్వీయ వ్యాఖ్యానం, జోక్యం ఉండడం ఇందులో విశేషం. ఒకటి, రెండు కథల్లో నాటకీయ దృష్టికోణం కూడ ఉంది. 'కాటిగాడు', 'ఇంటి మాదిగోడు' కథల్లో ఆయా పాత్రల సంభాషణలు వారిచేతనే పలికించడం విశేషం.

వైసీవి కథలన్నీ సామాజికవాస్తవికత పునాదిగా రాయబడిన కథలు. అందుకే ఈ కథల్లో ప్రత్యక్షంగానే రచయిత తన అభిప్రాయాలను ముగింపులో ఉటంకించడం చూడవచ్చు. ఈ కథల్లోని ఇతివృత్తాన్ని బట్టి, వైసీవి ఖచ్చితంగా శ్రమజీవి పక్షాన్ని వహించి, పాఠకులకు ఎంతో చైతన్యాన్ని, మానవీయతను పంచాడు. 'కంఠస్వరం' విషయంలోనూ వైసివి తన కథల్లో వైవిధ్యాన్ని ప్రదర్శించాడు. తాను చెప్పదలచిన విషయాన్ని గంభీరంగా చెప్పాడు.

వైసీవి, తాను చెప్పదలచిన అంశాన్ని ఫోకస్ చేస్తూ, దాన్ని వీలైనంత స్పష్టంగా, సూటిగా, నేర్పుగా, నిరాడంబరంగా అందించాడు. వైసీవి కథల్లో ఎక్కడా పాండిత్య ప్రదర్శనగాని, పాఠకుని స్థాయిని తగ్గించడం గానీ కనబడదు. 'కథాకథనం'లో 'వాస్తవికత'కు పెద్ద పీటవేసి ఆలంకారికతకు, కాకతాళీయతకు స్థానంలేని సహజమైన రీతిని ప్రదర్శించాడు. వైసీవి రాసిన ప్రతికథలోను 'కథాకథనం'లో లోటుపాట్లు కనిపించవు. తొలిదశ కథల్లోని 'స్కెచ్' ల్లాంటి కథలు తప్పిస్తే, మలికథలైన 'పల్లె రైతుల' కథల్లో 'నిసర్గసౌందర్యం' ఆవిష్కరించబడడం విశేషం.

తనను ప్రభావితం చేసిన మార్క్సిస్టు చైతన్యాన్ని, తానెరిగిన పల్లె బ్రతుకుల్లో చూసి, వాస్తవపరిస్థితులను సహజమైన పాత్రలతో నింపి, తన అభిప్రాయాన్ని 'కంఠస్వరం'లో బంధించి, పాఠకులకు కళ్ళు తెరిపించగలిగిన మణిహారాలు వైసీవి రెడ్డి రాసిన 'గట్టిగింజలు' కథలు. నిస్సందేహంగా ఇవి సీమప్రజల యాభైఏళ్ళ క్రితంనాటి జీవితాన్ని చిత్రించినాయి. నేటికీ, ఇక్కడి పరిస్థితుల్లో తీవ్రమైన మార్పేమీ లేకపోగా రైతుల ఆత్మహత్యలు, ప్రపంచీకరణ ప్రభావం, రియల్ ఎస్టేట్ ప్రకంపనలు, ఆధిపత్యాలూ, కరువూ, ఫ్యాక్షనిజం, రాజకీయ ఎత్తుగడలూ, హత్యలూ – కాలానుగుణంగా మార్పు చెంది వికృత రూపాన్ని అందిపుచ్చుకున్నాయి.

దాశరథి రంగాచార్య గారన్నట్లు – వైసీవి కతల్లో పల్లె జీవితం పరుగులు పెడుతున్న పరువంతో ప్రత్యక్షమౌతుంది. కాల్పనికత తక్కువ, కథ అల్లినట్లుండదు, సహజంగా నడుస్తుంది.

❖ ❖ ❖



**డా॥ పొదిలి నాగరాజు**
సెల్ : 7989320752

# వై.సి.వి.కథల్లో సీమ అస్తిత్వం

"సమకాలీన సమస్యలకు చలించి సామాజిక స్పృహతో సామాన్యుల ఇతివృత్తాలను గ్రహించి వైసీవి రెడ్డి చేసిన రచనలు సమాజాభివృద్ధికి ఎంతో తోడ్పడ్డాయనుటలో ఏమాత్రం సందేహం లేదు". 'తొలకరి చినుకులు' అనే కావ్య ఖండికకు ముందుమాట రాస్తూ పుట్టపర్తి నారాయణ చార్యులు వైసీవి రెడ్డి గురించి చెప్పిన మాటలివి. రెడ్డిగారు రచించిన రచనలన్నింటినీ జాగ్రత్తగా చదువుకుంటే పుట్టపర్తి నారాయణచార్యులు చెప్పిన మాటల్లోని సారాంశం పాఠకులకి అవగతమౌతుంది. రాయలసీమలో కవులకి కళాకారులకి కొరతుండదు. అందులోనూ కడప జిల్లాకు ఒక ప్రత్యేక గుర్తింపు ఉంది. ఇక్కడ ప్రసిద్ధిగాంచిన ప్రాచీన కవులతో పాటు ఆధునిక కవులు, రచయితలూ, విమర్శకులూ వున్నారు. ప్రాచీన ప్రక్రియలతో ఆధునిక భావజాలాలను, ఆధునిక ప్రక్రియలతో పల్లెల్లోని సామాన్య రైతుకూలీల జీవితాలను గొప్పగా చిత్రించిన సీమ రచయితలలో వైసీవి రెడ్డి గారు ఒకరు. రాయలసీమ కథా రచయితల్లో మూడవ తరానికి చెందిన కథా రచయిత వైసీవి రెడ్డి గారు. "ఈనాటి కథా సాహిత్యంలో అలసిన మనసుకు గట్టిగింజలు పిల్ల తెమ్మెర లాంటివి. ఇవి ఎండలా, వెన్నెల్లా, వసంతంలా, గ్రీష్మంలా సహజంగా ప్రకృతి సిద్ధంగా ఉన్నాయి" అన్న దాశరథి రంగాచార్య అభిప్రాయాన్ని బట్టి చూస్తే వై.సి.వి రెడ్డి ఎంత గొప్ప జీవమున్న రచనల్ని రచించారో అర్థమౌతుంది. ఈయన కడప జిల్లా కథకే గాక రాయలసీమ కథకే వన్నె తెచ్చిన మంచి కథా రచయిత.

వై.సి.వి రెడ్డి కడప జిల్లా పులివెందుల తాలూకా లోని బోనాల గ్రామంలో 1926 మార్చి 26వ తేదీన కొండారెడ్డి, లక్ష్మమ్మ అనే దంపతులకు జన్మించాడు. వీరిది మధ్యతరగతి రైతు కుటుంబం. రెడ్డి గారి మొదటి గురువు ఆయన తండ్రి కొండారెడ్డి. తర్వాత ఆంధ్ర మహాభారతం, జైమిని భారతం, కంకంటి పాపరాజు ఉత్తర రామాయణం లాంటి గ్రంథాలు రామచంద్ర రాజు గారి వద్ద శిష్యరికం చేసి చదువుకున్నాడు. సొంతంగా అమరం, ఆంధ్ర నామసంగ్రహం, సులక్షణసారం వంటి గ్రంథాలను కంఠతా పట్టి నేర్చుకున్నారు. ఎన్నో ఇబ్బందులను ఎదిరించి రెడ్డి గారు మద్రాసులో సుబ్రహ్మణ్యం ఎడ్యుకేషనల్ ట్యుటోరియల్ కాలేజీలో చేరి శ్రద్ధగా చదివి మెట్రిక్యులేషన్ ఉత్తీర్ణత సాధించాడు. ఈయనకు 1947లో బాల చెన్నమ్మ గారితో వివాహం అయిన తర్వాత చదువు సరిగా సాగలేదు. మామగారి ప్రోద్బలంతో 1949లో కడప జిల్లా బోర్డులో గుమస్తాగా చేరారు. గుత్తిలో వున్నప్పుడు చక్రాల నరసింహశాస్త్రి గారి పరిచయం రెడ్డి గారిలోని

కవిని వెలికి తీసింది. చిన్నప్పుడు నుంచే పద్యాలు రాసే అలవాటున్న రెడ్డిగారు శాస్త్రిగారి ప్రేరణతో మొట్టమొదటిసారి కందంలో పద్యరచన చేశాడు. దీని ప్రభావంతో 'గుత్తిచరిత్ర' అనే కావ్యరచన చేశారు. ఆ తర్వాత రెడ్డిగారి రచనలు ఒక్కొక్కటిగా ముద్రణకు నోచుకొని తెలుగు సాహితీ వనంలో చందన చెట్లయ్యాయి.

1960లో ఈయన రచించిన దక్షిణానిలము, రాయబారం కావ్య ఖండికలు మంచి ప్రశంసలందుకొన్నాయి. వీటితోపాటు ఆధునిక సాహిత్య ప్రక్రియైన కథను ఎంచుకొని 'గట్టి గింజలు' అనే కథా సంపుటిని వెలువరించారు. గట్టిగింజలు రెడ్డి గారిని మంచి కథా రచయితగా నిలబెట్టాయి. ఈ 'గట్టి గింజలు' కథా సంపుటిలో 21 కథలున్నాయి. ఇవన్నీ స్త్రీ, దళిత, పేద రైతు,రైతు కూలీల, కరువు, కక్షలు లాంటి కోవకు చెందిన కథలు. అయితే ఆనాడు అన్నిచోట్లా వున్న స్త్రీ, దళిత, రైతు కూలీల బతుకుల్లో కనిపించే సమస్యలు, బాధలు, కష్టాలు, కన్నీళ్లే ఈ కథల్లోనూ కనిపిస్తాయి. కొన్ని కథల్లో మాత్రమే కడప జిల్లా పల్లె జీవన వాతావరణం కనిపిస్తుంది. ముఖ్యంగా ఈ కథలకు వాడిన మాండలిక భాష కడప జిల్లా ప్రత్యేకతను నిరూపిస్తుంది.

భాషలోనూ, సంస్కృతి సాంప్రదాయాలలోనూ, సాహిత్య వస్తువు ఎంపికనూ రాయలసీమ నుంచి వచ్చిన కథా సాహిత్యానికి తెలుగు కథా సాహిత్యంలో ఒక ప్రత్యేక స్థానం వుంది. ఇక్కడ నీటి వసతి తక్కువ. అందువల్ల వ్యవసాయం ఆశించిన రీతిలో వుండదు. నీళ్లు సక్రమంగా లభించని రాయలసీమ ప్రజలకు బాధలు, కష్టాలు ఎక్కువే. ఇక్కడి ప్రజలు, ఇక్కడి రైతులు ఇప్పటికీ నీటి కోసం ఆరాటపడుతూనే వున్నారు. నీటి సమస్య ఆధారంగానే ఇక్కడ కరువులు, ముఠా కక్షలు పెరుగుతూ వచ్చాయి. రాయలసీమ అస్తిత్వాన్ని తూకమేయాలంటే కరువు, కక్షలు అనే తూనిక రాళ్లు ఖచ్చితంగా వాడాల్సిందే. రాయలసీమలో ఉన్న చాలామంది రచయితలు కరువును, కక్షలను చిత్రించే ఎన్నో కథల్ని రచించారు. గట్టి గింజలు కథా సంపుటిలో వైసీవి రెడ్డి గారు కూడా ఈ అంశాన్ని మర్చిపోలేదు. అందుకే రాయలసీమ అస్తిత్వాన్ని ప్రతిపాదించే కరువును చిత్రిస్తూ 'దొంగబర్రెగొడ్లు', 'దీనికంతెక్కడా', 'కుట్రల్లో కూలోడు' , ముఠా కక్షలు గురించి తెలిసేలా 'ఐదురూపాయిలు' అనే కథలు రాశారు.

"స్థానిక జీవితం పట్ల ప్రేమ, స్పష్టమైన అభ్యుదయ సామాజిక దృక్పథం ,మాండలికం మీద అధికారం పుష్కలంగా కనిపించే మరో స్కెచ్‌ల సంపుటం 'గట్టి గింజలు'" అని వైసీవి రెడ్డి' గట్టి గింజలు' కథా సంపుటి గురించి వల్లంపాటి వెంకటసుబ్బయ్య రాయలసీమలో ఆధునిక సాహిత్యం సామాజిక సాంస్కృతిక విశ్లేషణ అనే పుస్తకంలో చెప్పిన మాటలివి. వైసీవి రెడ్డి 1975-82 మధ్య రచించిన 21 కథలను 1982లో 'గట్టి గింజలు' అనే పేరుతో కథా సంపుటిగా వెలుగులోకి తీసుకొని వచ్చారు. కడప కథా సాహిత్యంలో రా.రా, కేతు విశ్వనాథరెడ్డి, పులికంటి కృష్ణారెడ్డి, కుప్పిరెడ్డి పద్మనాభరెడ్డి లాంటివారు వై.సి.వి రెడ్డికి సమకాలీకులు.

రాయలసీమలో కరువు ఒక నాటిది కాదు, ఒక రకానికి చెందిందీ కాదు. ప్రతిసారీ ధాతు, డొక్కల, గంజి మొదలైన కరువులు రకరకాల పేర్లతో వచ్చి రాయలసీమ ప్రజలను కోలుకోలేని కష్టాలుపాలు చేశాయి. ఈ కరువుల్లో బ్రతకలేక సామాన్యులు చాలామంది చనిపోయారు. వ్యవసాయం చేసి అప్పులపాలై

మరికొంతమంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. విధిలేక ఎంతోమంది పట్టణాలకు వలసపోయి కూలీలుగా, బిక్షగాళ్లుగా మారిపోయారు. రాయలసీమను కుదిపేసిన ఎన్నో కరువులను అనుభవించి చూసి చలించిపోయి రెడ్డి గారు దొంగ బర్రెగొడ్లు, దీనికంతెక్కడా,కుక్రల్లోకూలోడు అనే కరువు కథల్ని రచించారు.

దొంగ బర్రెగొడ్లు కథలో రామయ్య ఒక సామాన్య రైతు. అతని భార్య సీతమ్మ. వారికొక కూతురు ఒక కొడుకు. వీరితోపాటు భర్తను పోగొట్టుకున్న రామయ్య తోబుట్టువు రాములమ్మ కూడా ఆ కుటుంబంలో భాగమైకూర్చుంది. రామయ్యకు పది ఎకరాల పొలముంది. అందులో కొంత భూమి బావి కింద వుంది. రామయ్య వానాకాలంలో గింజ పైర్లు, ఎండాకాలంలో డబ్బు పైర్లు పెట్టుకొని వ్యవసాయం చేసి జీవిస్తూ వుంటాడు. పోయిన కరువులో రామయ్య రెండు మూడు ఎకరాలు భూములు కోల్పోయాడు. రామయ్య కుటుంబం ఎప్పుడు సమస్యల మయమే. దీనితోపాటు రామయ్యకు కూతురు పెళ్లి ఒక సమస్య కొత్తగా తయారయింది. రామయ్య కూతురికి పెళ్లి చేయడానికి నిశ్చయించుకుని ఆ ఊర్లోనే తెలిసిన సంబంధాన్ని ఖాయం చేసుకుంటాడు. పెళ్లికి ఐదు వేలు ఖర్చుగా అనుకొని ఆ ఊరి పెద్ద రెడ్డైన రంగారెడ్డి వద్ద రెండు రూపాయిలు వడ్డీతో 2000 రూపాయలు తీసుకొని ఎకరాతోట ఆయకం పెడతాడు. వీరారెడ్డి దగ్గర రెండున్నర రూపాయిలు వడ్డీతో 2000 తీసుకొని నాలుగు ఎకరాల ఆయకం పెడతాడు. గంగిరెడ్డి వద్ద వెయ్యి రూపాయలు తీసుకొని ఎకరాన్నిఆయకం పెడతాడు. కూతురు పెళ్లి అయిపోతుంది. రామయ్యకున్న పది ఎకరాల్లో మూడున్నర ఎకరా చేను అమ్మి రంగారెడ్డి, వీరారెడ్డిల అప్పును వడ్డీతో సహా తీర్చేస్తాడు.గంగిరెడ్డికి మాత్రం వడ్డీ ఇస్తాడు అసలు అలాగే ఉంటుంది. అప్పటికే రామయ్య వ్యవసాయం కుంటుబడి అప్పులతో కొట్టుమిట్టాడుతూ వుంటుంది. చివరికి రామయ్య అప్పులతో విసిగిపోయింటాడు. రామయ్య గ్రామంలో దొంగ బర్రెగొడ్లు ఎక్కువ. అవి ఏపుగా పెరిగిన పైర్లను కాళ్లతో తొక్కి నాశనం చేస్తుంటాయి. జొన్నచేలో పడితే ఎంతటి పెద్ద కంకులనైనా సరే తినేస్తాయి. దెబ్బలకు తట్టుకుంటాయి కాబట్టి కొట్టినా తరిమినా పట్టించుకోవు.ఎంత దొంగ బరుగొడ్డైనా మొండికిబడి తోలితే పోతాయి. కానీ అప్పుల్లోల్లు పోరు అని అనుకుంటాడు రామయ్య. కథా ముగుస్తుంది. ఒకవైపు కరువు ,మరో వైపు అప్పులు ఇచ్చిన వాళ్లు,వాళ్ల వడ్డీల గుర్రాలు రైతు జీవితాన్ని సమస్యల కుంపటిగా మార్చిన తీరే 'దొంగ బర్రెగొడ్లు' కథా ఇతివృత్తం.

"వానలు రాని సంవత్సరాల్లో బాగా ఇబ్బంది పడిపోతారు. ఒక్కొక్కసారి బొందు కరువులూ వస్తాయి. అప్పుడు సన్నోల్లు విలవిలలాడిపోతారు. కరువుల్లో బతకడం సాధ్యమే కాదు. కరువు అంటే బరువు బండ నెత్తికెత్తుకున్నట్లే. పనులు ఉండవు." 'దొంగ బర్రెగొడ్లు' కథలో రెడ్డి కరువు గురించి చెప్పిన మాటలివి. వ్యవసాయాన్ని నమ్ముకుని జీవించే రైతు బతుకు రాయలసీమలో ఎంత కష్టమో అనుభవానికి వస్తే గాని తెలియదు. అది ఈ కథలో స్పష్టంగా తెలుస్తుంది. రామయ్య వ్యవసాయం ద్వారా వచ్చే అనేక సమస్యలతో పోరాడుతూనే, మరోవైపు ఐదువేల రూపాయలు అప్పు తీసుకొని కూతురు పెళ్లి చేస్తాడు. దీనితో అప్పులోల్ల పోరొకటి తన జీవితానికి అదనంగా తగులుకుంటుంది. దీనంతటికీ కారణం కరువు. సకాలంలో వర్షాలు పడితే వ్యవసాయంలో దిగుబడి బాగుంటే తెచ్చిన అప్పులు,కుటుంబ అవసరాలు తీరుతాయి. కరువు వల్ల

అప్పులు, అవసరాలు తీరకపోగా ఉన్న మూడున్నర ఎకరా తోటను రామయ్య అమ్ముకోవాల్సి వస్తుంది. దీనితో రామయ్య రైతుగా చితికి పోతాడు. కుటుంబ యజమానిగా విఫలమవుతాడు. రాయలసీమలో ఇలాంటి రైతు రామయ్యలు ఎంతమంది ఈ కరువు బారినపడి జీవితాలు నాశనం చేసుకొన్నారో చరిత్రకే తెలుసు. ఇలాంటి చరిత్ర తర్వాత తరాల వాళ్లకు తెలియటం కోసం రెడ్డి గారు దొంగ బర్రెగొడ్లు కథలో కరువును, కరువు ద్వారా రైతుకొచ్చే కష్టాలను చక్కగా చిత్రించారు.

వై.సి.వి రెడ్డి మరొక కథ 'దీనికంతెక్కడా'.

కొండారెడ్డి యాభై ఎకరాల మోతుబరి రైతు. కొండారెడ్డి తండ్రి పెట్టిపోతల్లో పేరు పోయిన భూస్వామి, ధారాళమైన వాడు, దర్జాగా ఖర్చు పెడుతూ బ్రతికినవాడు. కరువు కాటకాల్లో ఊరి తకరాలో ఐదువేలు అప్పు చేసి చనిపోయాడు. ఈ ఐదువేలు బాకీ నా కొడుకు తీర్చుకోలేడా? సుఖంగా బ్రతుకుతాడులే అని తృప్తిగా చచ్చిపోయాడు. కొండారెడ్డి తండ్రి ఇచ్చిన వారసత్వం సంపదతోపాటు ఆయన చేసిన ఐదువేల రూపాయలు అప్పు మిగిలింది. కొండారెడ్డి అమ్మ బ్రతికే వుంది. కొండారెడ్డికి ముగ్గురు పిల్లలు. ఇద్దరు మగ పిల్లలు, ఒక ఆడపిల్ల. కొండారెడ్డి వ్యవసాయంలో మంచి నేర్పరి. ఏడెనిమిది సంవత్సరాలు కష్టపడి వ్యవసాయం చేస్తూ వచ్చాడు. కొండారెడ్డి సేద్యానికి ఒక జీతగాన్ని, చిల్లర పనులకు మరొక జీతగాన్ని పెట్టుకొని ముప్పై ఎకరాల్లో గింజ పైర్లు, ఇరవై ఎకరాలు డబ్బు పైర్లు పెడతూ వచ్చాడు. దురదృష్టవశాత్తు మూడు కరువులు వరుసగా రావడంతో పంట దిగుబడి లేక అప్పటికే దాదాపు ఏడువేలు అప్పు చేశాడు. అప్పు పెరిగిపోయింది. దీనికి తోడు కూతురు పెళ్లీడుకొచ్చింది. తన కన్నా మంచి ఆస్తి కలిగిన సంబంధం వెతికి కట్నం కింద పది ఎకరాలు భూమి, నాలుగు వేల రూపాయలు ఖర్చుపెట్టి కూతురు పెళ్లి ఘనంగా చేశాడు. కూతురు పెళ్లితో పది ఎకరాలు భూమిపోయి 40 ఎకరాల భూమి పన్నెండువేలు అప్పు నిలిచింది. కొండారెడ్డి అప్పు తీర్చడం కోసం పది ఎకరాలు భూమిలో చీనీ చెట్లు పెంచాలనుకున్నాడు. కానీ ఖర్చులకు తట్టుకోలేక ఐదు ఎకరాలలో మాత్రమే చీనీ చెట్లు నాటించాడు. మిగిలిన భూమిలో సాధారణ పైరులు పెట్టాడు. చీనీ చెట్లు కాపు కొచ్చేసరికి కొండారెడ్డి అప్పు ముప్పై వేలు దాటింది. ఇద్దరు కొడుకుల పెళ్లితో అప్పు నలభై వేలకు దాటిపోయింది. దీనితో ఐదు ఎకరాలు చీనీ తోటను బాకీ లోకి ఇచ్చేశాడు. బాకీలన్నీ పోగా మొదటి ఐదు వేలు అలాగే వుండిపోయింది. దాదాపు ఇరవై సంవత్సరాలు కష్టపడి వ్యవసాయం చేసి ఇరవై ఎకరాల భూమిని పోగొట్టుకున్నాడు. ఐదువేలు బాకీ నలభై వేలు దాటి కొండారెడ్డిని తనకు తెలియకుండానే ముసలివాడిని చేసింది. ఇది చూడలేక కొండారెడ్డి తల్లి మంచం ఎక్కి మరణించింది. కొండారెడ్డి ఇద్దరు తోడికోడల్లకు సరిపడక వేరే కాపురం పెట్టాలని నిశ్చయించుకుని ఆస్తి పంపకాలు జరిపారు. తనకొచ్చిన భాగాన్ని తీసుకొని పెద్దకొడుకు టౌన్ చేరి వడ్డీ వ్యాపారం చేశాడు. చిన్న కొడుకు వ్యవసాయం సాగిస్తూనే వున్నాడు. చిన్న కొడుకు కష్టాన్ని చూసిన కొండారెడ్డి వడ్డీ వ్యాపారం చేయమని చెబితే నేను చేయనని చిన్న కొడుకు ఖరాఖండిగా చెప్తాడు. కానీ కొండారెడ్డి తనకిచ్చిన ఐదు ఎకరాలమ్ముకుని టౌను చేరిపోతాడు చిన్న కొడుకు మాత్రం పల్లెలో వ్యవసాయ జీవితాన్ని గడుపుతుంటాడ.కరువు కోరల్లో

చిక్కుకొని నలిగిపోయి యేళ్లు తరబడి వ్యవసాయం చేసి నష్టపోయి, కన్నతల్లి లాంటి వున్న ఊరును వదిలిపెట్టి టౌనుకు చేరినటువంటి కొండారెడ్డి బాధ వర్ణనాతీతం. ఆ బాధను కథలో కళాత్మకంగా చిత్రించాడు వై.సివి రెడ్డి.

ఎంత పెద్ద మోతుబరి రైతైనా రాయలసీమలో వరుసగా వచ్చే కరువుల బారినపడి ఎలా చితికి పోతాడో ఈ కథ చెబుతుంది బండ్లు ఓడలు ఓడలు బండ్లు అవుతాయి అన్న సామెత కరువుమేసే రాయలసీమ గడ్డపై నిక్షేపంగా కనిపిస్తుంది. కొండారెడ్డి లాంటి రైతులు భూమిని అమ్ముకొని ఉన్న ఊరు వదిలిపెట్టి టౌన్ చేరి పనిచేయడానికి మొహమాటపడుతూ జీవించే పరిస్థితుల్నిఈ కథ నెమరేస్తూనే వుంటుంది. అంతేకాదు వ్యవసాయం చేసే రైతులు, రైతు కూలీలు పల్లెలను వదిలి పట్టణాలో చేరి మామూలు జనం జీవనంలో కలిసిపోతే రాబోయే తరానికి రైతు లేని సమాజమే ఎదురౌతుందని ఈ కథ చెబుతోంది. ఇది కరువు కథ. రైతు కనిపించకుండాపోయే కరువు కథ. రైతు లేని సమాజాన్ని తర్వాత తరాల వాళ్లకు చూపించే కరువు కథ. ఇలాంటి కథలు రాయలసీమ నుంచి కోకొల్లలు వచ్చాయి, వస్తున్నాయి. అయినా ప్రభుత్వాలు నీటి సమస్యను గట్టిగా పట్టించుకోవు. రాయలసీమకు నీళ్లు ఇస్తే తప్ప రైతులు బాగుపడరు. సీమ అభివృద్ధి చెందదు. వై.సి.వి రెడ్డి ఈ కథను కళాత్మకంగా చిత్రించడంలో తన సొంత అనుభవాన్ని చేర్చి కూర్చిన విధానం కథలో స్పష్టంగా తెలుస్తుంది. అందుకే ఇది మంచి కథ.

వైసివి రెడ్డి కథల్లో ఫ్యాక్షన్ కథ 'ఐదు రూపాయలు'. ఈ కథ కక్షలతో పాటు కరువును, వర్ణ సంబంధాలను, వర్గ సంబంధాలనూ బాగానే చిత్రించింది. బాలిరెడ్డి అనే భూస్వామికి లచ్చిగాడు అనే వ్యవసాయ కూలి ఐదు రూపాయలు బాకీ వుంటాడు. లచ్చిగాడు బాలిరెడ్డి వద్దకు పనికి పోకుండా మరొకరి పనికి వెళ్ళినందుకు బాలిరెడ్డి లచ్చిగాడిని చావగొడతాడు. ఇది అనువుగా తీసుకొని బాలిరెడ్డికి వ్యతిరేకవర్గమైన గంగిరెడ్డి లచ్చిగాని చేత బాలిరెడ్డి మీద కేసు పెట్టిస్తాడు. ఈ రెండు పార్టీలగొడవలతో గ్రామం ఉడికిపోతుంది. ఇరు పార్టీలవాళ్లు పిడిబాకులను, తుపాకులను మొలల్లో పెట్టుకుని తిరుగుతారు. ఈ గొడవల్లో గుర్రప్ప అనే పేదవాడు ఖూనీ చేయబడతాడు. రాజీ చేసుకోమని ఊరి పెద్దలంతా చెప్పినా ఇరు కుటుంబాల వాళ్ళు ఒప్పుకోరు. కేసుల్లో లాయర్లను, పోలీసుల్ని పోషిస్తారు, చివరికి రెండు కుటుంబాలలోని స్త్రీలు చొరవ తీసుకొని బాలిరెడ్డి కూతురుని గంగిరెడ్డి మేనల్లుడికిచ్చి పెళ్లి చేసేలా మంతనాలు జరిపి రెండు కుటుంబాల వాళ్ళని రాజీకి ఒప్పిస్తారు. దీనికి పోలీసులు, లాయర్లు దొంగ సాక్ష్యాలతో కేసుల్లేకుండా చేస్తారు. రెండు కుటుంబాల మధ్య ఉన్న కేసులన్నీ పోతాయి. కానీ లచ్చి గాని కేసు ఏమైందో ఎవరికీ తెలియదు. పాపం అమాయకుడు గుర్రప్ప చావు ఎవరికోసమో తెలియదు. కథ ముగుస్తుంది. ఇది రాయలసీమ అస్తిత్వాన్ని చిత్రించే ప్యాక్షను కథ. ముఠా కక్షలు రాయలసీమలో పుష్కలంగా కనిపిస్తాయనటానికి సాక్షీభూతం 'ఐదురూపాయలు' కథ. ఇందులో రెండు నాయక వర్గాల మధ్యలో నష్టపోయిన పేదవాళ్లు, వాళ్ళ కుటుంబాలు కనిపిస్తాయి. ఈ కథ ముఖ్యంగా కడప జిల్లా ఫ్యాక్షను జీవితాన్ని బట్టబయలు చేసింది. ఇక్కడి ఆధిపత్యపు

వర్గం గొడవలు పడుతుంది, ప్రతీకారాలతో పేట్రేగిపోతుంది, శవాలను లేపుతుంది. అవసరమనుకుంటే గుట్టుగా రాజీపడుతుంది. వీరి హత్యాకాండల్లో బలైన బలహీన వర్గం గురించి ఎవరూ పట్టించుకోరు. ఇదే ఈ కథలో వున్న సారాంశం.

"వై.సి.వి రెడ్డి కథలు శిల్పం విషయంలో కాస్త ముతకగా ఉంటాయనటానికి సందేహం లేదు. దాదాపు అన్ని కథల్లోనూ నాటకీకరణ ఉండదు. రచయితే మొత్తం కథ చెబుతాడు" వల్లంపాటి వెంకటసుబ్బయ్య రచయితను గూర్చి చెప్పిన మాటలివి. వైసివి రెడ్డి కథలు పాఠకులను తక్కువ అంచనా వేసినట్లే కనిపిస్తుంది. ఎందుకంటే పాఠకుల్ని ఆలోచింపజేసే అవకాశం వై.సి.వి రెడ్డి కథల్లో కనిపించదు గనుక. రచయిత తన కథను పాఠకులకు వలిచిన అరటిపండులా అందిస్తాడు. అయితే ఈయన కథల్లో సహజమైన పల్లె జీవితం పుష్కలంగా వుంటుంది. నిజానికి జీవితాన్ని ప్రేమించే వాళ్ళు ఎవరైనా సరే వైసీవి రెడ్డి కథల్ని ప్రేమించి తీరాల్సిందే. నేటి ప్రపంచీకరణ నేపథ్యంలో కనుమరుగైపోతున్న పల్లె జీవితాలను కళ్ళ ముందు చూపించగలిగే కథలు గట్టి గింజలు. ఇందులో ప్రతి కథ పల్లె జనాల్ని పలకరించే కథే. అన్ని కథల్లోనూ కడప జీవిత నేపథ్యం వుంది. రాయలసీమ నేలపైన నడిచినందుకుగాను వై.సి.వి రెడ్డి రాయలసీమ అస్తిత్వాన్ని తాకే ఈ మూడు కథలు సీమ కథా సాహిత్యంలో గొప్పగా నిలువ గలిగిన కథలని హృదయపూర్వకంగా చెప్పుకోవచ్చు.

❖ ❖ ❖

**ఉప్పుమ్మి రత్న వర్గపు**
**గుప్పలు సవరించి దాచుకొనిన కృపణుచే**
**నప్పుగొని కవులకిచ్చును**
**తప్పక ఋణదాత కిచ్చు ఁదానేమగునో!**
**ఏమగు లోక హితార్థము**
**గా మను శశిఁ బోలె నితడు గ్రమ్మఋ ద్విగుణ**
**శ్రీ మహిమన్ ధన సస్య**
**శ్యామల గావించు వృష్టి సంతర్పణలన్**

**– ఉప్పలపాటి వేకంటనరసయ్య (1962)**



**డా॥ చింతకుంట శివారెడ్డి**
సహాయ పరిశోధకులు
సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం, కడప
సెల్: 9440859872

# వై.సి.వి.రెడ్డి 'గట్టిగింజలు' - మాండలిక విశేషాలు

**అవును**
**వై.సి.వి.రెడ్డి కథలు 'గట్టిగింజలే'**
**ఎందుకంటే కలం అనే హలాన్ని చేతపట్టి**
**పుస్తకం అనే జడిగంలో అక్షరాలనే విత్తనాలు పోసి**
**కథలు అనే పంటను పండించగా**
**చివర్లో వడిపితే వచ్చినవి 'గట్టిగింజలే'**
**అవును అవి ముమ్మాటికి...**
**కందిగింజల్లాంటి 'గట్టి గింజలే'.**

ఆధునిక రచయితల్లో అస్తిత్వ చైతన్య స్పృహ బాగా పెరిగింది. చాలామంది ఆయా ప్రాంతాల యాసలోనే రచనలు చేయడం ప్రారంభించారు. రాయలసీమలో అన్నమయ్యను తొలి జానపద భాషా ప్రయోక్తగా చూడవచ్చు. పదకవితకు ప్రాణంపోసి జానపదాలకు స్థానం కల్పించిన తొలి భాషావేత్తగా అన్నమయ్య కనబడతాడు. ఆ తర్వాత రాయలసీమ నుండి మధురాంతకం రాజారాం, పులికంటి కృష్ణారెడ్డి, విద్వాన్ విశ్వం, గజ్జల మల్లారెడ్డి, ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి, సింగమనేని నారాయణ, బండి నారాయణస్వామి, నామిని సుబ్రహ్మణ్యం నాయుడు, కేశవరెడ్డి, సడ్లపల్లి చిదంబరరెడ్డి లాంటి ఆధునిక రచయితలు అస్తిత్వం దిశగా మాండలికాలకు ప్రాధాన్యతను ఇస్తూ రచనలు చేశారు. ఈ తానులోని పోగే వై.సి.వి.రెడ్డి.

## వై.సి.వి.రెడ్డి 'గట్టిగింజలు'

వై.సి.వి. అంటే మనిషితనం, పల్లెటూరితనం, రాయలసీమతనం.

**– తులసీకృష్ణ (పి.రామకృష్ణారెడ్డి)**

వై.సి.వి.రెడ్డి గారి పూర్తిపేరు యమ్మనూరు చిన్న వెంకటరెడ్డి. కానీ సాహితీలోకానికి వై.సి.వి.రెడ్డిగా సుపరిచితులయ్యారు. వీరు సంప్రదాయ సాహిత్యాన్ని అధ్యయనం చేసి పద్యరచనలతోపాటు అష్టావధానం చేసే స్థాయికి ఎదిగినప్పటికీ, సమాజంలోని రుగ్మతులను, రైతులు పడే కష్టాలను, తన పల్లెప్రజల జీవన దుస్థితిని చూసి తన పంథాను మార్చుకొని భావకవిగా, అభ్యుదయ కవిగా తన కవిత్వంతో సమాజాన్ని

దిశానిర్దేశం చేసిన మహోన్నత వ్యక్తి. సంప్రదాయకవిగా, కథకుడుగా, విమర్శకుడుగా, అభ్యుదయ కవిగా ఇలా పలురకాల సాహితీప్రక్రియల్లో ఆయన కలాన్ని జొప్పించారు. వై.సి.వి.రెడ్డి కడపజిల్లాలోని పులివెందుల తాలూకా బోనాల గ్రామంలో లక్ష్మమ్మ, కొండారెడ్డి అనే దంపతులకు 1926 మార్చి 26న జన్మించారు. ఆరోజుల్లో వీరి గ్రామంలో వీధి బడికూడా ఉండేది కాదు. ప్రొద్దుటూరుకు చెందిన కొదవలూరి రామచంద్రరాజు దగ్గర సంప్రదాయ సాహిత్యాన్ని అభ్యసించారు. వీరి దగ్గర అమరం, ఆంధ్రనామ సంగ్రహం, సులక్షణసారం వంటి గ్రంథాలను కంఠస్థంచేశారు. గుత్తిలోని చక్రాల నరసింహశాస్త్రి గారి సాహచర్యంతో ఛందస్సు, అలంకారాలు, వ్యాకరణం నేర్చుకున్నారు. మిత్రుల ప్రోద్బలంతో వై.సి.వి.రెడ్డి గారు రెండు మూడు పర్యాయాలు అవధానం చేశారు. కానీ ఆ ప్రక్రియపై ఆయనకు ఆసక్తి లేకపోవడంతో మానివేశారు.

ఇంటర్మీడియట్ చదువుకునే రోజుల్లోనే కడపలో గడియారం వేంకటశేషశాస్త్రి, పుట్టపర్తి నారాయణచార్యులు, దుర్భాక రాజశేఖర శతావధాని లాంటి సాహితీ ప్రముఖులతో వీరికి పరిచయం ఏర్పడింది. వీరితోపాటు కడపజిల్లాలో ఆనాటి సి.పి.ఐ నాయకులైన ఈశ్వరరెడ్డి, శివరామిరెడ్డి, గజ్జల మల్లారెడ్డి, సొదుం జయరాం, రాచమల్లు రామచంద్రారెడ్డి, కేతు విశ్వనాథరెడ్డి వంటి సాహితీ మిత్రులతో పరిచయాలుండడం వల్ల మార్క్సిస్టు సాహిత్యాన్ని అధ్యయనం చేయడంతోపాటు, వచన రచనలపై మక్కువ పెంచుకున్నారు. తన హృదయాన్ని కదిలించివేసిన అనేకమంది పేదరైతుల ఆర్తనాదాలను కథారూపంలో చిత్రిస్తూవచ్చారు.

ఆనాటి ప్రముఖ సాహితీపత్రికల్లో వివిధ సందర్భాల్లో ప్రచురించబడిన ఆ కథలన్నింటినీ కలిపి 'గట్టిగింజలు' పేరుతో 1982లో ఒక సంపుటిని ముద్రించారు. ఇందులో 21 కథలున్నాయి. దాశరథి రంగాచార్య ఈ కథా సంపుటికి ముందుమాటలో..... "గట్టిగింజలు" లో ఉన్న ఇరవైయొక్క కథల్లోనూ పల్లెజీవనం పరుగులు పెడుతున్న పరువంతో ప్రత్యక్షం అవుతుంది. కథలు అల్లినట్లు కనిపించవు. కాల్పనికత అంతగా స్ఫురించదు. జరుగుతున్న సంఘటలను రచయిత చెపుతున్నట్లుంటుంది. వై.సి.వి. రెడ్డి గారికి పల్లెలతో, పల్లెజీవితాలతో, పల్లెల ఉద్యమాలతో గట్టిసంబంధాలు ఉండడంవల్లనే – రాయలసీమ పల్లెజీవితాలను అధికారికంగా అనను కానీ అతి సహజంగా చెప్పగలిగారు". అని అంటారు.

ఇక 'గట్టి గింజలు' మాండలిక భాషా విశేషాలను ఒకసారి పరిశీలిస్తే.......

ఆమెకు పెళ్లి అయిందట. మాకు తెలియదు. ఒకటి రెండు సంవత్సరాలు మొగునితో కలిసి పనిపాటలు చేసిందట. వాళ్ళకు భూమి, పుట్ర ఏమీలేవు. ఒక బోదకొట్టం వుంది. – మంచివాళ్ళు (కథ)

'బోదకొట్టం' అనే ప్రయోగం ఈ కథలో మనకు కనిపిస్తుంది. నేడు పెద్ద పెద్ద భవంతులు ఉన్న స్థానంలో ఒకప్పుడు బోదకొట్టాలు ఉండేవి. పూర్వపు రోజుల్లో కొండకు వెళ్ళి అక్కడుండే బోదను కోసుకొచ్చి, ఆ బోదను ఎండబెట్టి ఇంటి పైకప్పుగా ఉపయోగించేవారు. ఈ కప్పును ఒక క్రమపద్ధతిలో కప్పడం కూడా ఒక కళ. ఒక అమరికలో కప్పడంవల్ల ఎంత పెద్ద వర్షం వచ్చినప్పటికీ ఒక చుక్క నీరు కూడా ఆ ఇంట్లో

పడుకుండా పద్ధతిగా బోదను కప్పుతారు. ఇలా కప్పిన బోద సుమారు 10 నుండి 15 సంవత్సరాల వరకు చెక్కు చెదరకుండా ఉంటుంది. తరువాత అవసరాన్ని బట్టి మళ్ళీ కప్పించుకోవడం చేసేవారు. వైసివి రెడ్డి గారు రాయలసీమ వాసి కాబట్టి ఆయన పుట్టిన పులివెందుల ప్రాంతంలో ఇటువంటి ఇండ్ల నిర్మాణం ఎక్కువ కాబట్టి ఈ పదప్రయోగం చేసి ఉండవచ్చు.

అందరిమీద తిరుగబడి రంపులు చేసుకోవడం అంటే వాళ్ళకు భయం. ఇదీ ఆమె కుంటుంబ సామాన్య చరిత్ర – మంచితనం (కథ)

ఈ ప్రయోగంలో 'రంపులు' అంటే గొడవలు అని అర్థం. ఇతరులపైకి అనవసరంగా గొడవలకు పోవడమంటే వాళ్ళకు భయం అనే అర్థంలో 'రంపులు' అనే మాండలికాన్ని ప్రయోగించారు రచయిత. 'ఈయప్పతో పొద్దాంకులు బో రంపులుగా ఉంటాందబ్బీ' వంటి ప్రయోగాలు రాయలసీమలో ఈనాటికీ మనం వింటూనే ఉంటాం.

ఎవ్వరినీ ఎదిరించలేని ఆ నిర్భాగ్యురాలు, పల్లాపగలూ కుములుతూ వుంది – మంచితనం (కథ) ఈ వాక్యంలోని 'పల్లాపగలూ' అంటే రేయింబవళ్ళు అనే అర్థంలో ప్రయోగించారు వైసీవి రెడ్డి గారు. పల్లాపగలూ అనే పదం రాయలసీమలో ఎక్కువగా అనంతపురం ప్రాంతంలో వినబడుతూ ఉంటుంది. 'ఆయప్ప పల్లాపగలూ మడికాడ్నే ఉంటాడు' అనే ప్రయోగం మనకు అనంతపురం మాండలికంలో కనబడుతుంది.

'అందరికీ తంపులు పెట్టి పెద్దమనిషిగా తిరుగుతున్నాడు' అని వూగూతూ చెప్పినాడు బాలిరెడ్డి – ఐదురూపాయలు (కథ)

ఇక్కడ 'తంపులు' అనే పదం గొడవలు/కొట్లాటలు అనే అర్థంలో ప్రయోగించారు రచయిత. ఇదే వాక్యాన్ని రాయలసీమలో మరికొన్ని చోట్ల 'వాళ్ళ మధ్య పుల్లలు పెట్టి పెద్దమనిషిగా తిరుగుతాండాడు' అనే ప్రయోగం కూడా ఉంది.

పోదామనుకుంటే ఇంట్లో అందరూ ఆవేళకే లేచారు. మజ్జిగ చిలుకుతున్నారు. గాడిపాటలూడుస్తున్నారు

**– చావకూడని అందం (కథ)**

ఈ ప్రయోగంలో **'గాడిపాట'** అనే పదాన్ని ప్రయోగించారు రచయిత. ఇక్కడ గాడిపాట అంటే పశువులను కట్టేసే చోటు అని అర్థం. రాయలసీమలోని రైతులు ఎక్కువగా ఎద్దులను, ఎనుములను(గేదెలను) వారు నివసించేచోటే ఒకవైపు కొంత స్థలాన్ని కేటాయించి కట్టివేస్తారు. వాటికోసం ప్రత్యేకంగా బండలు పరిపించి, గడ్డిని వేయడానికి వీలుగా గాడిని ఏర్పాటుచేయడంతోపాటు వర్షాకాలంలో వాటికి ఈగలు కరవకుండా ఫ్యానులు కూడా బిగిస్తారు. రాయలసీమలో ఈ గాడిపాటలు ఇంట్లోనే ఒక భాగంగా ఉండడం

విశేషం. ఎందుకంటే అక్కడి రైతులు పశువులను కూడా మనుషులతో సమానంతో చూసుకోవడం అనాదిగా ఒక సంప్రదాయంగా వస్తోంది. ముఖ్యంగా రైతులకు ఎద్దులపై మమకారం ఎక్కువగా ఉంటుంది. వైసీవి రెడ్డి గారు రైతు కుటుంబంలో పుట్టారు కాబట్టి వారికి ఇలాంటి పదాల ప్రయోగం అంత కష్టమేమీ కాదు.

సరస్వతి పెళ్ళికి పోలేకపోయాను. సరస్వతిని మెరమని బండిమీద చూచాను – చావకూడని అందం (కథ). ఊరేగింపు అనే అర్థంలో 'మెరవని' అని ప్రయోగించారు వైసివి రెడ్డి గారు. 'రాములవారిని రథం మీద మెరమని తీచ్చాండారు' వంటి ప్రయోగాలు రాయలసీమలో ఉన్నాయి.

'మంచివాళ్ళు' కథలో 'ఏమొస్తుంది అన్ని కర్చులు పోనూ సంగటికి వస్తే గొప్ప' అనే ప్రయోగం చేశారు రచయిత. సంగటి అనంగానే ఆ ఆహారపదార్థం రాయలసీమకు చెందింది అనే విషయం అందరికీ తెలిసిందే. సంగటి విషయానికి వస్తే ఈ పదార్థం గురించి ఎంతోమంది ఇతర ప్రాంతంవాళ్ళు ఎన్నో సందర్భాల్లో చులకనగా మాట్లాడారు కూడా. ఒకసారి ప్రముఖ విమర్శకుడు వల్లంపాటి వెంకటసుబ్బయ్య గారు చెప్పిన మాటలివి.... '1963లో కోడూరి కౌసల్యాదేవి నాన్నగారు పేరు సుబ్బారావనుకుంటాను. రాయలసీమ తిండిని గురించి నాతో చాలా అవమానకరంగా మాట్లాడారు. రాయలసీమ హోటళ్ళలో వరిఅన్నం పెడతారా? మీ ఇంట్లో అన్నం తింటారా లేక అదేదో రాగి గంజట – దాన్ని తాగుతారా? అని అడిగారు. ఇలాంటి అనుభవాలు రుచిచూడనివారు లేరు. రాళ్ళపల్లి, పుట్టపర్తి, గడియారంలాంటి ఎంతోమంది మహాపండితులకు కూడా ఇలాంటి అవమానాలు తప్పలేదు' అని అంటారు. వారి మాటలు అక్షరసత్యాలు. ఎందుకంటే రాయలసీమ కరువుప్రాంతం, వరిని పండించే అవకాశాలు చాలా తక్కువ. కాబట్టి వాళ్లు అన్నం తినకుండా, ఇతరపదార్థాలపై ఆధారపడతారు అని చిన్నచూపు చూస్తుంటారు ఇతరప్రాంతీయులు.

'మంచివాళ్ళు' అనే కథలో 'వొత్తిగిలి' అనే ప్రయోగం కనబడుతుంది. ఇక్కడ వొత్తిగిలి అంటే 'రెండుచేతులతో కలిపి గట్టిగా పట్టుకోవడం' అనే అర్థంలో వాడారు. 'ఒబ్బీ పిల్లగాన్ని రోంత వొత్తిగిలి పట్టుకో సూది బేయాల' వంటి ప్రయోగాలు రాయలసీమలో ఉన్నాయి.

'చావకూడని అందం' కథలో 'యిపిరి' అనే మాండలికాన్ని ప్రయోగించారు వైసివి రెడ్డిగారు. ఇక్కడ 'యిపిరి' అంటే 'అతిచేయడం', 'అల్లరి చేయడం' అనే అర్థాల్లో ప్రయోగించారు. 'ఈయబ్బి బో యిపిరి నాయాళు రా' అనే ప్రయోగం రాయలసీమలో వినబడుతూంది. అంటే ఆ అబ్బాయి బాగా అల్లరిచేసేవాడు అని అర్థం.

'దొంగ బర్రెగొడ్లు' అనే కథలో 'గుదెకట్టె' అనే మాండలికాన్ని ప్రయోగించారు రచయిత. పశువులు దొంగకుపోతూ ఉంటే, అంటే పొలాల్లో పడి మేస్తూ ఉంటే అటువంటి వాటి మెడకు, కాలికి కలిపి ఒక పొడవాటి లావు కర్రను కడతారు. ఈ కట్టె ఉండడంవల్ల ఆ పశువు వేగంగా పరిగెత్తలేదు. ఎక్కువదూరం వెళ్ళాలన్నా ఈ గుదెకట్టె వల్ల నడవడానికి ఇబ్బందిపడుతుంది. 'దొంగకుపోయే బరిగొడ్లకు గుదెకట్టె కట్టాలా అబ్బీ' వంటి ప్రయోగాలు వింటూంటాం.

ఇదే కథ (దొంగ బ్రగొడ్లు)లోనే 'బొందు' అనే మరొక ప్రయోగం కనబడుతుంది. బొందు అంటే విత్తనాలు లేకుండా పెరిగిన కట్టె. అంటే పడాల్సిన సమయంలో వర్షం పడకుండా ఉండడం వల్ల మొదట పైరు మొత్తం ఎండిపోయే పరిస్థితి వస్తుంది. ఇక లాభం లేదు అనుకునే సమయంలో పెద్ద వర్షం పడుతుంది. సమయం దాటిపోవడం వల్ల పైరులో కాయలు కాయకుండా, కట్టె మాత్రం పెరుగుతుంది. దానివల్ల రైతుకు నష్టం తప్ప లాభం ఉండదు. 'బొందుబోయిన సేనుకు బోలెడంత పని' అనే సామెత కూడా రాయలసీమలో ఉంది. పని ఎక్కువ, దిగుబడి తక్కువగా వచ్చిన పైరునే 'బొందు' అని అంటారు.

ఇదే కథలోనే 'నసుకుడు' అనే మాండలికాన్ని ప్రయోగించారు వైసివి రెడ్డి గారు. ఎదురుగా నిలబడి ఎదిరించే ధైర్యం లేనప్పుడు చాటుగా ఉంటూ నోట్లోనే మాట్లాడుకుంటుంటారు. అలా మాట్లాడే మాటలను 'నసగడం' అని అంటారు. 'ఆయప్ప పక్కనుంటే ఎప్పుడు సూసినా నసుగుతానే ఉంటాడు' వంటి ప్రయోగాలు ఉన్నాయి.

ఈ కథ ముగింపులో.... 'రామయ్య ఇంతకుముందు దొంగ బ్రగొడ్లను గురించి ఆలోచించేవాడు. ఇప్పుడు అప్పులిచ్చిన వాళ్ళను గురించి ఆలోచిస్తున్నాడు. అవి కావలివుండి తోలితే పోతాయి. మరి అప్పులోళ్లో! అని విసుక్కుంటూ, గొనుక్కుంటూ ఉంటాడు' అని ఉంది. ఇందులో 'దొంగ బ్రగొడ్లు', 'తోలడం', 'గొనుక్కోవడం' అనే మాండలిక ప్రయోగాలు చేశారు రచయిత. ఈ వాక్యంలో రైతు పంటపెట్టి సరైన దిగుబడిరాక నష్టపోయి, చివరికి అప్పులు పాలయి దిక్కుతోచక ఏమి చేయాలో ఆలోచిస్తూ.. బ్రగొడ్లను పొలం దగ్గర తోలితే పక్కకు వెళ్ళిపోతాయి, కానీ అప్పు ఇచ్చినవాడు ఒకపట్టాన వదిలిపెట్టడు కదా! అంటూ రైతు కష్టాల్ని తెలియజేశాడు రచయిత.

'ఎంతమంచిదైతేనేం' కథలో... రంగారెడ్డి ఎద్దులకు పొట్టుబోసి, కాళ్ళూ మొగం కడుక్కొని, మల్లా సంగటి తిని, తొక్కుడంకణంలో మంచం వేసుకొని పడుకొంటాడు. ఈశ్వరమ్మకు మాత్రం యింకా తీరిక దొరకదు. పిల్లోనికి బువ్వపెట్టి బడికి పంపుతుంది. ఎనుములకు మేతాగ్రా విచారించుకొంటుంది. ఎగాసగాపడేతలికి మళ్ళీ వంటపని, సాయంత్రం గడ్డికిపోతుంది. సాధారణంగా పిల్లకు అంతగా పనిచెప్పదు. రంగారెడ్డి సాయంత్రం పొట్టూ సొప్పా తెచ్చి, వామిదొడ్లో శుభ్రం చేసి నీల్లెత్తుకొచ్చి, యింకా పొద్దుంటే పాతవి తాళ్ళూ తలుగులూ అతుక్కుంటూ సరిచేసుకుంటూ ఉంటాడు. మరుసటిరోజుకు కావలసిన యారముట్లను తయారుగా పెట్టుకొంటాడు."

పై పేరాలో రాయలసీమ యాస ఇట్టే కనబడుతుంది... 'పొట్టుబోసి, మొగం, సంగటి, తొక్కుడంకణం, బువ్వ, ఎనుములు, మేతాగ్రా, ఎగాసగాపడేతలికి, పొట్టూ సొప్పా, వామిదొడ్డి, తాళ్ళూ తలుగులూ, యారముట్లు' వంటి మాండలిక భాషా విశేషాలకు తావిచ్చారు రెడ్డిగారు. ఒక్క పేరాలోనే ఇన్ని మాండలిక పదాలు మనకు దొరికితే ఇక పుస్తకంలో మనకు తవ్వేకొద్దీ మాండలిక పదాల సాగరం మనకు కనబడుతుంది.

'కుట్రల్లో కూలోడు' కథలో.... 'లచ్చి కూడా సోమిరెడ్డి యింటికి చీకట్లోనే పోతుంది. గింజలు దంచి పాచి కసువులూడ్చి పేడకాళ్ళు తీసి మామూలు పనిలోకిపోతుంది. సాయంత్రం పడేవరకూ ఏదో ఒక పనిని పురమాయిస్తూనే వుంటారు". ఇందులో పాచి కసువు అనే ప్రయోగం చేశారు రచయిత. పాచి కసువు అంటే రాత్రి పడిన చెత్తను ఉదయాన్నే శుభ్రం చేయకుండా అలాగే ఉంచితే, అటువంటి చెత్తను పాచి కసువు అని అంటారు.

'ఇంటి మాదిగోడు' కథలో.... "ఏం కపిలె తోలేదంత కష్టమా? అన్నాను. చెప్తుతావాబ్బా. రెండుకాండ్లకు పొద్దుగూకులు కొనబారికీ మొదటి బారికి చిల్లపోటు పట్టుకొని పరిగెత్తినట్లుండాలి. లేకుంటే ఎద్దులు నెమరు వేసుకుంటా వూరుకుంటాయి. నీళ్ళు తక్కువగా పోతాయి. తోట పారదు. అదీగాక మాకు బొక్కెనకుట్టేపని వుంటాది. బొక్కెనబాన చిల్లిపడినా – వలిగెంకాడ కుట్లూడినా – మాదిగోని తిట్టిన తిట్టు తిట్టకుండా తిడ్తారు. ఏమంటే వంతులబావి కవిలె. యుద్ధంలో పనిచేసినట్లు వుంటాది. మోకు తెగచ్చు – గుదిమోకు తెగచ్చు – దాపుతాడు తెగచ్చు – తొండానికి దాపుతాడుకూ లంకెగావున్న ముక్కరసిల్ల పోయినా పని యిబ్బందే. అంతా కట్టుదిట్టంగా వుండాల రెండు కాండ్లు ఎద్దులూ నలుగురు మాంచి మోటకష్టం చేసే వాళ్ళు యారముట్లూ – మోకూ బొక్కెనా – వగైరాలు – పద్ధతిగా వుంటే – మాపుటేలకు ఎకరన్నర తోట పారుతుంది."

పై పేరాలో కపిలె తోలేటందుకు కావలసిన యారముట్లను గురించి చక్కగా వివరించాడు రచయిత. చిల్లపోటు, బొక్కెన, వలిగెం, ముక్కర, తొండం, మోకు, గుదిమోకు, దాపుతాడు, ముక్కరసిల్ల లాంటి యారముట్లను తెలియజేశారు వైసీవి రెడ్డి గారు. ఆరోజుల్లో ఒక రోజంతా ఎంతో కష్టపడితేగానీ ఒక ఎకరం పొలాన్ని పారగట్టడం కష్టంగా ఉండేది. అలా కపిలె తోలుతున్న సమయంలో ఒక్కో సందర్భంలో ఆ బావిలో ఎద్దులు, రైతులు పడి మరణించిన సందర్భాలు కూడా రాయలసీమ చరిత్రలో ఉన్నాయి. కరెంటు మోటార్లు వచ్చిన తరువాత చాలా వరకు మడవ కట్టడంలో రైతుకు కష్టం తప్పింది.

'గట్టిగింజలు' కథలో.... 'ఎర్రిమొగమా ఏంపరవాలేదులే. ఇంకా బువ్వ తినకుండా ఉండావా. నాకోసం చూపెట్టుకోవద్దని ఎన్నిసార్లు చెప్పినాను. నీమతం ఇడిచిపెట్టవు. నేవచ్చినాక తింటాలే అంటే ఇనవే. ఎంకీ. పిల్లోల్లతో ఏగేపని – యాలకు బువ్వతిని – వల్లు కాపాడుకోకపోతే ఎట్లా? నువ్వు సరిగా లేకపోతే నేనేంపని చేయలేను. బువ్వపెట్టు ఇద్దరం తిందాం పొద్దుపోయింది అని అన్నాడు దుగ్గన్న".

పై పేరాలో అచ్చమైన రాయలసీమ యాస కనబడుతుంది. ఒక భర్త తన భార్యతో మాట్లాడేవిధానం, ఇద్దరి మధ్య ఉండే అన్యోన్యత రెండు వాక్యాల్లో మనకండ్లముందు ఉంచారు వైసివి రెడ్డి గారు. మరీముఖ్యంగా భర్త తినందే భార్య తినకపోవడం అనే సంప్రదాయం రాయలసీమలో ఉందన్న విషయాన్ని కూడా మనకు తెలియజేశారు రెడ్డిగారు. ఇందులో ఎర్రిమొగమా, బువ్వ, ఏగడం, యాలకు, పొద్దుపోయింది లాంటి మాండలిక పదాలను ప్రయోగించారు రచయిత.

ఈ పుస్తకంలో వై.సి.వి.రెడ్డి గారు ప్రయోగించిన మరికొన్ని మాండలికాలను చూద్దాం......

'గడిదేరినోడు' = నైపుణ్యం కలిగినవాడు, 'విత్తనం గొర్రు' = విత్తనాలు విత్తడానికి ఉపయోగించే పనిముట్టు, 'కర్రపోకుండా' = గడ్డపోకుండా, 'తిరగడ' = నేర్పరితనం, 'అదేమోపున' = ఉన్నట్లుండి ఒక్కసారిగా, 'తారిపోవు' = గట్టితనం లేకపోవు (లొట్టలుపడు), 'గుంటక' = గడ్డిని పాయడానికి ఉపయోగించే పనిముట్టు, 'వదుపుకోవడం' = పండిన పంటను తయారుచేసి ఇంటికి చేర్చుకోవడం, 'కలబలుకున్నారు' = ఒక్కటైనారు, 'ఆడికాడికి' = అంతంతమాత్రం, 'తలుగు' = పశువులను కట్టేయడానికి ఉపయోగించే తాడు, 'దిందుకొయ్య' = గొర్రు, గుంటకకు తలగా ఉండే కొయ్య, 'కాపోడు' = రెడ్డి, వ్యవసాయదారుడు, 'జడిగెం' = విత్తనం విత్తే సమయంలో విత్తనాలు వదిలే రంధ్రాలుండే చెక్కపనిముట్టు, 'పుటిక' = చిన్నగంప, 'ముల్లుగట్టె' = ఎద్దులను అదిలించడానికి ఉపయోగించే ముళ్ళు ఉండే కర్ర, 'మేడితోక' = దున్నేటప్పుడు రైతు చేతికి ఆధారంగా పట్టుకునే కొయ్య, 'పట్టెండ్లు' = ఎద్దులకు, కాడిమానుకు కలిపికట్టే చర్మపుతాళ్ళు, 'దోటీ' = పొట్టును దుస్సటానికి ఉపయోగించే లిక్కి ఉండే పొడవాటి కర్ర, 'ముచ్చెనగుంత' = మెడకు వెనుకవైపు, 'మూగదెబ్బలు' = చిన్నదెబ్బలు, 'పాముకొను' = బాగా తిను, 'తిల్లాడతాండాడు' = తిరుగుతాండాడు, 'నాకట్టె పోతాది' = నేను చనిపోతాను, 'మునుము పట్టు' = ఒక వరుసలో పనిచేయడం, 'పంతకాగు' = పొయ్యికి ఆనుకొని ఉండే కుండ, 'మట్టసంగా' = పద్ధతిగా, 'గరికనట్టు' = వేర్లు గట్టిగా ఉండే గడ్డి, 'కాడిమాను' = ఎద్దుల మూపురాలపై పెట్టే పొడవాటి కర్ర, 'చూరుకింద' = కొట్టంపై కప్పిన బోదకు అంచు కింద, 'దాపుడుకోక' = దాచిపెట్టుకున్న కోక లాంటి పదాలు అనేకం ఉన్నాయి.

అచ్చమైన తెలుగు జానపదుని కథలు "గట్టిగింజలు" అని ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి గారి అభిప్రాయం. ఎందుకంటే వై.సి.వి.రెడ్డి గారు పుట్టింది మధ్యతరగతి రైతుకుటుంబంలో, పెరిగింది పల్లె వాతావరణంలో కాబట్టి "గట్టిగింజలు" కథల్లో గ్రామీణ జీవితాలు, రైతులు పడే వ్యధలు, రైతాంగానికి ఉపయోగించే పనిముట్లు వంటి గ్రామీణ మట్టివాసన తెలియజేసే మాండలికాలు అనేకం ఇందులో ఉన్నాయి.

ఈ పదాలన్నీ కూడా రేపటి తరానికి వింతగా అనిపించొచ్చు. ఎందుకంటే ఈనాడు వ్యవసాయం అనేది మనుషులతో, ఎద్దులతో కాకుండా పనిముట్లతో చేయడం అలవాటు పడుతున్నారు. చాలావరకు పనిముట్లు కనుమరుగైపోతున్నాయి. పనిముట్లేకాదు చివరకు ఎద్దులు కూడా ఇలా ఉండేవని చెప్పేరోజులు కూడా రావచ్చు. కావున ఇలాంటి మాండలిక సంపదను కాపాడుకోవాల్సిన అవసరం, బాధ్యత అందరిపైనా ఉంది. నిజానికి రేపటితరానికి ఈ పదాల సమాహారమంతా వారసత్వ సంపదకు నిదర్శనంగా నిలచిపోగలదు.

❖ ❖ ❖



**డా॥ టి. హజరతయ్య**

తెలుగు ఉపన్యాసకులు

ప్రభుత్వ పురుషుల కళాశాల (స్వయం ప్రతిపత్తి)

కడప. 9502547993

# గట్టి గింజలు కథలు - పాత్ర చిత్రణ

వైసీవి రెడ్డిగా పిలువబడే ఎమ్మనూరు చిన వెంకటరెడ్డి కడప జిల్లా వాస్తవ్యులు. వైసీవి మొదట సాంప్రదాయ, పద్యకవిగా, భావకవిగా ఆ తర్వాత అభ్యుదయ కవిగా పరివర్తన చెందినాడు. వైసివిలోని అభ్యుదయ దృక్పథం ఒకటిన్నర దశాబ్దానికి పైగా కడప అరసం (అభ్యుదయ రచయితల సంఘం) శాఖకు అధ్యక్షత వహించడమే గాక, అభ్యుదయ సాహిత్యంలో గట్టి కృషి చేసినారు. వీరు రాసిన ఒకే ఒక కథా సంపుటి 'గట్టి గింజలు'. ఇందులో మొత్తం 21 కథలు ఉన్నాయి. రాయలసీమ పల్లెల్లోని బక్క రైతులు, రైతు కూలీలు, మహిళలు, జీతగాళ్లు, సీమ ప్రాంతపు భూస్వాములు, పేదవాళ్లు, దళారులు ప్రతీ కథలో తారసపడతారు. 'గట్టి గింజలు' కథల్లోని పాత్రలు రాయలసీమ ప్రాంతంలోని అన్నీ వర్గాలకు ప్రతినిధి పాత్రలుగా కనిపిస్తాయి. ఒక రకంగా చెప్పాలంటే రాయలసీమ ప్రాంతం లేకుండా ఈ కథల్ని, ఇందులోని పాత్రల్ని ఊహించలేము.

సాధారణంగా కథానికకు ప్రాతచిత్రణ వెన్నెముకగా నిలుస్తుంది. కథలోని పాత్రల ప్రవర్తన, సంభాషణలు, ఆలోచనా విధానాన్ని బట్టి ఆయా పాత్రల స్వభావాన్ని పాఠకుడు అర్థం చేసుకునేలా రచయిత రాయగలగాలి. కథానికలోని పాత్రల్ని అసమగ్రంగా పరిచయం చేస్తాడు రచయిత. పాఠకుడు కథానికలోని పాత్రలు తన ఊహాశక్తితో అర్థం చేసుకుంటాడు. వైసీవి కథల్లో ఎక్కువగా పాత్రలు స్పష్టమైన ప్రవర్తనతో మెలుగుతాయి. కొన్ని కథల ముగింపు పాఠకుల ఊహాశక్తికి వదిలేసినా, మరికొన్ని కథల్లో రచయితే వివరణకు పూనుకుంటాడు.

కథల్లోని పాత్రల స్వభావాల్లో నిలకడ అనేది పాత్రకు ఉండాల్సిన మొదటి లక్షణం. కథలో, పాత్ర తన సామాజిక పరిస్థితుల కారణంగా పరిణామం చెందితే, అది పాఠకులకు సమంజసంగా అనిపిస్తుంది. అంతే తప్ప రచయిత పాఠకుల మెప్పుకోసమో, శిల్ప ప్రాధాన్యత కోసమో కృత్రిమ మెలికలు పెట్టి, మార్పు చెందేలా మార్చి రాసినట్లైతే ఆ కథ ద్వితీయశ్రేణికి చెందిన కథగా మిగిలిపోతుంది.

వైసీవి రెడ్డి రాసిన 'గట్టి గింజలు' కథా సంపుటిలో మొత్తం 21 కథలున్నాయి. ప్రతీ కథలో రాయలసీమ మహిళా రైతు కూలీలు, రైతులు, భూస్వాములు, దళితులు, బహుజనులు కనబడతారు. రైతు కూలీలు, మహిళలు లేని కథ 'గట్టి గింజలు' కథా సంపుటిలో వెతికినా దొరకదు. వైసీవి స్త్రీ పక్షపాతి. జీవితంలో

పోరాటం చేసే మహిళలన్నా, కటిక దారిద్ర్యం అనుభవిస్తూ జీవితాన్ని నెట్టుకొస్తున్న మహిళలన్నా, రేయిపగలూ పొలాన్ని నమ్ముకుని కూలీనాలీ చేసి బ్రతికే మహిళలన్నా వైసీవికి ఎనలేని అభిమానం. అందుకే అలాంటి మహిళలంతా 'గట్టి గింజలు' కథల్లో పాత్రలుగా కనిపిస్తారు. వీరిలో కొందరు ఆధునిక సమాజానికి ఆదర్శంగా నిలవదగ్గ మహిళలు. 'మంచివాళ్లు' కథలో గంగమ్మ, 'లోకం ఓడిపోయింది' కథలో పార్వతి, 'పనికి రానోళ్ళు' కథలో గొల్లచిన్నక్క, మొదలైన మహిళల చైతన్యవంతమైన పాత్రలు. అలాగే 'నగుమోము గనలేని...' కథలోని కథకుడు, 'లోకం ఓడిపోయింది' కథలోని కథకుడు, 'ఇంకానా...' కథలో నాగన్న, 'గట్టి గింజలు' కథలో దుగ్గన్న, 'రెడ్డొచ్చె మొదలెత్తుకో' కథలో కథకుడు – వీరంతా చైతన్యవంతమైన పురుష పాత్రలు. వీరి కథలన్నింటా శ్రామిక వర్గానికి, భూస్వామ్య వర్గానికి మధ్య సంఘర్షణ నడుస్తుంది. రాయలసీమ ప్రాంతానికి చెందిన భూస్వాముల కుట్రలకు, మోసాలకు, ధన దాహానికి బహుజనులు, మహిళలు ఎలా బలవుతున్నారో ఈ కథలలో పాత్రల ప్రవర్తన ద్వారా తెలుసుకోవచ్చు.

వైసీవి రెడ్డి రాసిన 'గట్టి గింజలు' కథా సంపుటిలో కొన్ని పాత్రలను పరిశీలిద్దాం. 'ఇంకానా....' కథలో నాగన్న, నారిగాడు ప్రధాన పాత్రలు. ఇద్దరూ బలహీన ఆర్థిక నేపథ్యం గల వెనుకబడిన కులాలకు చెందినవాళ్ళు. భూస్వామి నాగిరెడ్డి తన దగ్గర అప్పు తీసుకొన్న నారిగాడ్ని పనిలోకి రమ్మంటే రాడు. తన చేత రోజంతా పని చేయించుకుని, తక్కువ కూలీ యిస్తూ ఆ తక్కువ కూలీ కూడా తనకివ్వాల్సిన వడ్డీలోకి జమ కట్టు కునేవాడని, నాగిరెడ్డి బాకీ తీర్చలేనేమోనని బాధపడుతూ ఉంటాడు నారిగాడు. నాగిరెడ్డి బాకీ ఎలాగైనా తీర్చాలని ఎక్కువ కూలీ ఇచ్చే కంకర పనికి పోతాడు. దీంతో తన దగ్గర కూలీకి రాకుండా ఎక్కువ కూలీ వచ్చే కంకర పనికి పోతాడా? అని నారిగాడి మీద చేయిచేసుకుంటాడు నాగిరెడ్డి. అన్యాయంగా నారిగాడి మీద చేయి చేసుకున్న నాగిరెడ్డి చేసిన దౌర్జన్యం పై స్టేషనులో కేసు పెట్టి, శిక్షపడేటట్లు చేయాలని నాగన్న తీవ్ర ప్రయత్నం చేస్తాడు. చివరకు పట్టణంలో ఉన్న కూలీ సంఘం నాయకుని సహాయాన్ని కోరతాడు. దళితులు నిస్సహాయతను సొమ్ము చేసుకుని, వారిపై పెత్తనం చేసే భూస్వాములైన అప్పటి పల్లెల్లోని రెడ్ల దుర్మార్గ ప్రవర్తనను వైసీవిరెడ్డి ఈ కథలో ప్రస్తావించాడు. సాధారణంగా రాయలసీమ పల్లెల్లో కనిపించే రెడ్ల ఆధిపత్య ధోరణి ఈ కథలో కనిపిస్తుంది. భూస్వాములు దళిత, బహుజనులకు అధిక వడ్డీకి అప్పులిచ్చిన వారిచేత ఖరీదు కట్టని వెట్టిచాకిరి చేయించుకుంటూ, తక్కువ కూలీ యిస్తూ – వారి శ్రమను దోపిడీ చేయడం, కూలీ పనులకు రాని వారిపై దాడులు చేయడం, బెదిరించడం సీమ ప్రాంతంలో రివాజుగా మారింది.

పెద్దోళ్ల కక్ష్యల మధ్య సన్నోళ్లు ఎలా నలిగిపోతారో చెప్పిన కథ 'ఐదు రూపాయలు'. ఇందులో గంగిరెడ్డి, బాలిరెడ్డి పాత్రలు అచ్చమైన రాయలసీమ ఫాక్షన్ రాజకీయాలకి ప్రతినిధులు. తక్కువ కూలీకి పనిలోకి రాలేనన్న లచ్చిగాడిపై భూస్వామి బాలిరెడ్డి భౌతిక దాడికి పాల్పడతాడు. బాలిరెడ్డిపై పాత పగలున్న కారణంగా లచ్చిగాడ్ని గంగిరెడ్డి దగ్గరకు తీస్తాడు. దీంతో బాలిరెడ్డి మరియు గంగిరెడ్డిల మధ్య ఘర్షణగా మారుతుంది. ఈ రెండు వర్గాల పోరాటాల్లో బాలిరెడ్డి తరుపున గల గుర్రప్ప అనే రైతుని కాల్చి చంపుతారు

అవతలి వర్గం వాళ్ళు. పరిస్థితి చేయి దాటిపోతుందని గ్రహించిన మిగతా రెడ్లు, బంధువులు కలగజేసుకుని వారిద్దరి మధ్య రాజీ కుదుర్చుతారు. కానీ దళితులైన లచ్చిగాని కేసు, గుర్రప్ప హత్యకేసు ఏమయ్యాయో ఎవరికీ తెలియదు.

వైసీవి రెడ్డి రాసిన 'గట్టి గింజలు' కథా సంపుటిలో సగానికి పైగా కథల్లో ఫ్యూడల్ తాలూకు ఛాయలు స్పష్టంగా కనబడతాయి. ఈ కథల్లో రెడ్లు, దళితులు రెండు స్పష్టమైన వర్గాలుగా విభజించబడ్డారు. అంతేగాక మాలలు, మాదిగలు, బలహీన వర్గాల ప్రజలు రెడ్ల దగ్గర చేసిన అప్పులను జీవితాంతం కష్టపడి భూస్వాముల పొలాల్లో పనిచేసినా వడ్డీలోకి జమకట్టుకోవడం గమనించవచ్చు. 'ఐదు రూపాయలు' కథలో లచ్చిగాడు, 'రెడ్డొచ్చె మొదలెత్తుకొ' కథలో గంగడు, 'కాటిగాడు' కథలో కాటయ్య, ఇంటి మాదిగోడు' కథలో రాముడు, 'ఇంకానా….' కథలో నారిగాడు, 'కుర్రల్లో కూలోడు' కథలో గంగడు – భూస్వాముల దోపిడీకి గురైన కొన్ని దళితపాత్రలు.

'కాటిగాడు' కథలో కాటయ్య శ్రమజీవి. వాడు ఊహ తెలిసినప్పటి నుండి రైతు పనులు, కూలీ పనులు చేయడంలో ఆరితేరినోడు. వాడు చేసే చాకిరీకి తగిన కూలీ ఇవ్వక ఈ ఫ్యూడల్ సమాజం వాడ్ని దొంగగా మారుస్తుంది. కాటిగానికి కష్టపడి పని చేసి బ్రతకాలని ఉన్నా, వాడు చేసే శ్రమకు ఏ రెడ్డీ తగిన కూలీ ఇవ్వడు. రోజంతా బండెడు చాకిరీ చేయించుకుని ముంతెడు గింజలు గానీ, లేదా రెండణాల లెక్కగానీ ఇస్తారు. భూస్వాముల శ్రమదోపిడీ ఫలితమే కాటిగాడ్ని దొంగగా మార్చేసింది. బలహీన వర్గాల శ్రమను, వారి ఆస్తుల్ని దోచే భూస్వాములను ఏమనాలో తెలియక కాటిగాడు లాంటి వ్యక్తులు మూగ వేదన అనుభవించారు. నారిగాడు, కాటిగాడు లాంటి పాత్రలు తమ శ్రమను పెద్దరెడ్లు దోచేస్తున్నారని గుర్తించినా, ఎదిరించే శక్తిలేక మిన్నకుండి పోయారు.

వైసీవి రెడ్డి ప్రధానంగా స్త్రీ పక్షపాతి. వీరి కథల్లో స్త్రీల పాత్రలు ప్రధానంగా ఉంటాయి. ఒకవేళ వీరి కథలో స్త్రీ పాత్ర తొలగిస్తే కథే ఉండదు. వీరి కథలకు స్త్రీలే ప్రధాన కేంద్రం. అలాంటి కథల్లో 'మంచివాళ్లు', 'నగుమోము గనలేని', 'చావకూడని అందం', 'లోకం ఓడిపోయింది', 'మంచితనం', 'దిక్కులేని బ్రతుకులు', 'ఆస్తి విలువ' మొదలైన కథలు ప్రధానమైనవి. 'లోకం ఓడిపోయింది' కథలో ప్రధాన పాత్ర పార్వతి. వైసీవి రెడ్డి కథలన్నింటిలోనూ సాహసవంతమైన మహిళా పాత్రగా పార్వతిని చెప్పొచ్చు.

'దిక్కులేని బ్రతుకులు' కథలో రాజమ్మ ప్రధాన పాత్ర. ఎక్కడ పుట్టిందో తెలియదు గానీ, యవ్వనంలో రాజంపేట ప్రాంతంలో చిన్న వ్యాపారం చేసుకుంటూ పొట్టపోసుకునేది. రాజమ్మ చేసే పిల్ల వ్యాపారాలు చుట్టపు చూపుగా రాజంపేట వచ్చిన రామిరెడ్డిని ఆకట్టుకుంది. ఆపై యిద్దరూ కూడబలుక్కుని పెళ్లి చేసుకుని, రామిరెడ్డి ఊర్లో అంగడి పెట్టుకున్నారు. ఆ ఊరి పెద్దిరెడ్డి అండ చూసుకుని రాజమ్మ తన అంగడి వ్యాపారాన్ని నేర్పుగా చేయసాగింది. రాజమ్మ తన పట్ల చూపుతున్న చనువుని చూసిన పెద్దిరెడ్డికి పుర్రెలో ఆమె శరీరం పట్ల ఆకర్షణ, వారి ఆస్తి పట్ల ఆశ కలిగినాయి. రామిరెడ్డి అశక్తతను గమనించిన పెద్దిరెడ్డి అదనుచూసి రాజమ్మతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడు. దాన్ని చూసి కొంతకాలానికి రామిరెడ్డి ఆత్మహత్య చేసుకున్నాడు.

డబ్బుకోసమో, ఆస్తి కోసమో, పలుకుబడి కోసమో అంతరాత్మను చంపుకుని అక్రమ సంబంధం పెట్టుకునే ఆడవాళ్ళు ఉన్న ఈ సమాజంలో అర్ధాంతరంగా తనువులు చాలిస్తున్న రామిరెడ్డి లాంటి అశక్త పాత్రలు కథలతో పాటు మన సమాజంలో కూడా అక్కడక్కడా తారసపడుతుంటాయి. పేదలు, దిగువ మధ్యతరగతి ప్రజలు పేదరికం కారణంగా పొట్టకూటికై, ఆర్థిక స్థిరత్వానికై ఆత్మాభిమానాన్ని చంపుకుని ఎలా ప్రక్క దోవలు త్రొక్కుతారో రాజమ్మ పాత్ర ద్వారా తెలియజేసినాడు రచయిత.

రాజమ్మ లాంటి మరొక పాత్ర అంకాలమ్మ. 'మంచితనం' కథలో ప్రధాన పాత్ర అంకాలమ్మ. ఆమె అతి మంచితనము, భర్త మెతకతనమూ – అంకాలమ్మను ఆ గ్రామ యువకులు తమ స్వంత ఆస్తిగా భావిస్తారు. అది గ్రహించలేని అంకాలమ్మ తనను తాను ఆ ఊరి మగాళ్లకు అర్పించుకుంటుంది. ఆమెను మంచితనంతోనే ఆ గ్రామ యువకులు శారీరకంగా లోబరుచుకుంటే, అశక్తి దుర్జనుడైన ఆమె భర్త ఎవ్వరినీ ఎదిరించలేక తనువు చాలిస్తాడు.

నిత్యం కూలీ చేస్తూ పొట్ట పోసుకునే బహుజన వృద్ధ మహిళ గొల్ల చిన్నక్క. తాను కూలీ పనులకి పోయి సంపాదించిన పైసా పైసా కూడబెట్టి గ్రామంలోని పదిమందికీ ఉపయోగపడాలని బావిని త్రవ్విస్తుంది. తన శ్రమతో త్రవ్వించిన బావి ఊరి గొంతు తడిపితే చాలనుకున్న గొప్ప ఉదార జీవి గొల్ల చిన్నక్క. వైసీవి కథల్లో ఇదొక చైతన్యవంతమైన పాత్రగా చెప్పొచ్చు. 'పనికి రానోళ్లు' కథలో పనికొచ్చే గొప్ప పాత్ర గొల్ల చిన్నక్క.

'రెడ్డొచ్చె మొదలెత్తుకో' కథలో గంగనిది ఒక విచిత్రమైన పరిస్థితి. అంగ వైకల్యం గల పిల్లలతో, అనారోగి భార్యతో నిరంతరం కూలీనాలీ చేసినా పూట గడవడమే కష్టంగా మారుతుంది. గోవిందరెడ్డింట్లో, పొలంలో గంగడి కుటుంబం మొత్తం చాకిరీ చేసినా బ్రతకలేని పరిస్థితి ఏర్పడి, ఆ భూస్వామి కబంధ హస్తాల నుండి తప్పించుకొని, కథకుడి పంచన చేరతాడు. కథకుడి పొలంలో ఏర్పడిన పరిచయంతో మరొక భూస్వామి రామిరెడ్డి దగ్గర అప్పు చేసి గుడిసె వేసుకుంటాడు. పెనం మీద నుండి పొయ్యిలో పడిన గంగని స్థితిని చూసి కథకుడు జాలిపడతాడు. గంగడి లాంటి పాత్రలు నిత్యం మన చుట్టూ ఉన్నా అలాంటి వారి కోసం ఆలోచించి, చేయూత నిచ్చే కథకుడి లాంటి పాత్రలు మన సమాజంలో చాలా అరుదని చెప్పవచ్చు.

అభ్యుదయ రచయితల సంఘం, అధ్యక్షుడిగా ఉండడం, అభ్యుదయ సాహిత్యం ప్రభావంతో (వైసీవి) రాసిన కథ 'గట్టి గింజలు'. ఈ శీర్షిక తోనే వారి కథలు ఒక సంపుటిగా వెలువడ్డాయి. ఈ కథలో వెంకటమ్మ, దుగ్గన్నలు భార్యాభర్తలు – దుగ్గన్నకు ఈ అసమ సమాజంలోని పునాది ఉపరితల సిద్ధాంతం పట్ల స్పష్టమైన అవగాహన ఉంది. అందుకే దుగ్గన్న నిరంతరం కూలోళ్ల పోరాటలకి అలుపూ సొలుపూ లేకుండా హాజరయి, తను కూడా పోరాటాలు చేస్తూ ఉంటాడు. వైసివి రెడ్డి భావజాలానికి ప్రాతినిధ్య పాత్రగా దుగ్గన్నను చెప్పవచ్చు. కార్మికులు, శ్రామికులు, కర్షకులు ఈ దేశానికి గట్టి గింజల్తో సమానమని,

తూర్పెత్తే జనం, సళ్ళు కొట్టే జనం తాలు గింజలు వైపే నిలబడుతున్నారని, ఈ పోరాటంలో తుది విజయం కార్మిక వర్గానిదేనని దుగ్గన్న అభిప్రాయపడతాడు. కానీ, ఇప్పటికీ దేశంలోని కార్మికుల, శ్రామికుల, కర్షకుల జీవితాల్లో ఎలాంటి మార్పూ లేదు.

భూస్వాముల చేతుల్లో మోసపోయిన దళిత బహుజనులు, కార్మికులు, కర్షకులు, మరీ ముఖ్యంగా స్త్రీలు వైసీవి కథల్లో పాత్రలుగా కనబడతారు. 'గుడిసె దక్కింది' కథలో రామయ్య సుబ్బమ్మలు, 'దొంగ బర్రెగొడ్లు' కథలో రామయ్య, సీతమ్మలు, 'కుట్రల్లో కూలోడు' కథలో గంగడు, లచ్చి 'ఇంటి మాదిగోడు' కథలో రాముడు, 'ఇంకానా….' కథలో నాగన్న, – 'పరువూ ప్రతిష్టలు' కథలో పెద్దరెడ్డి కూతురూ, 'దిక్కులేని బ్రతుకులు' కథలో రాజమ్మ, 'మంచితనం' కథలో అంకాలమ్మ 'లోకం ఓడిపోయింది' కథలో పార్వతమ్మ, 'మంచివాళ్ళు' కథలో గంగమ్మ, 'రెడ్డొచ్చె మొదలెత్తుకో….' కథలో గంగడు, 'ఐదు రూపాయలు' కథలో లచ్చిగాడు – మొదలైన పాత్రలన్నీ రాయలసీమ భూస్వాములైన రెడ్ల చేతిలో మోసపోయిన పాత్రలే. వీళ్లంతా రాయలసీమలోని వెనుకబడిన, దళిత లోకానికి, మహిళా సమాజానికి ప్రతినిధులుగా చెప్పవచ్చు. వైసీవి రెడ్డి అరసం అధ్యక్షునిగా ఉండడమే గాక, రైతు కుటుంబంలో పుట్టడం వలన 'గట్టి గింజలు' లాంటి ప్రాంతీయ నేపథ్యం గల మంచి కథలు రాయగలిగినాడు. వైసీవి రెడ్డికి దళితుల పట్లా, రైతుల పట్లా, పేదల పట్లా, మరీ ముఖ్యంగా స్త్రీల పట్ల పక్షపాత ధోరణి ఎక్కువగా ఉంది. సమాజంలో వీరి పట్ల గల అణచివేతనూ, దోపిడిని, వివక్షనూ చూసిన రచయిత దానికి గల మూలాలను గుర్తించే క్రమంలో రాసిన కథలే 'గట్టి గింజలు'గా చెప్పొచ్చు. 'గట్టి గింజలు' కథలు చదివితే పాఠకులలో గట్టిగానే అంతఃసంఘర్షణ కలుగుతుంది. అంతటితో ఆగలేక పాఠకుల మెదళ్ళలో ఆ పాత్రలు కలిగించే ప్రభావం చాలా కాలం పాటు వెంటాడుతుంది.

❖ ❖ ❖



వై.సి.వి. రెడ్డి, పుట్టపర్తి నారాయణాచార్యులు



**డా॥ అనుగూరు చంద్రశేఖరరెడ్డి**
సెల్ : 9949299458

# వై.సి.వి. రెడ్డి గేయాలు - ఒక అవలోకన
## నిరంతరం పారే పాయలు - వై.సి.వి. రెడ్డి గేయాలు

**కుటుంబ జీవనం మీ అంగీ కింద బనీను**
**కవిత్యోద్యమాలు మీ భుజం మీద రుమాలు**
**కవిత్వ మంటే మీకు**
**అమృతం కుండకు చిల్లు పడితే జారేధార!" -**

అన్న డా॥ ఎన్. గోపీ గారి మాటలు అక్షర సత్యాలు. పువ్వు పుట్టగానే పరిమళిస్తుందనే ఆర్యోక్తి వీరికి కచ్చితంగా సరిపోతుంది. ఎందుకంటే వీరు బాల్యంలోనే కందం, తేటగీతిలో పద్యాలు చెప్పేవారు. ఇంటర్మీడియట్ విద్యార్థిగా ఉన్నపుడే సాహితీ దిగ్గజాలైన గడియారం వేంకట శేష శాస్త్రి, పుట్టపర్తి నారాయణాచార్యులు దుర్భాక రాజశేఖర శతావధాని లాంటి చాలా మంది పెద్దలతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉండేవారు. ఆ సమయంలోనే వారి మొదటి కృతి 'తొలకరి చినుకులు' వెలువడింది. తర్వాత దక్షిణానిలము, మేనక, రంభ, సిందూర రేఖ, రాయబారము, సెలకన్నె, వైజయంతి, పారిజాతం అనే కావ్యాలను, 'గట్టి గింజలు' అనే కథా సంపుటిని వెలువరించారు. వీటితో పాటుగా వీరు కొన్ని గేయాలను కూడా రచించారు.

వై.సి.వి. రెడ్డి గారు రచించిన 14 గేయాల పరామర్శే ఈ వ్యాసం. శ్రీ రెడ్డి గారు రచించిన గేయాలు వివిధ సందర్భాలు, సన్నివేశాలు పరిస్థితులకు తగ్గట్లుగా వెలువడ్డాయేగానీ, అదే పనిగా రాయాలని రాసినవి కావు. 'రెడ్డి గారి గేయాలను క్రింద చూపిన విధంగా వర్గీకరించవచ్చు.

1. ఆంధ్రాభిమానం
2. కడప ప్రశస్తి
3. ఉత్సవ సంరభం
4. అభినందన చందనాలు
5. ప్రకృతి సందేశం

6. వెన్నముక విరిగింది

7. దీనాంగన

అనే ఏడు విభాగాలుగా విభజించుకోవచ్చు. ఈ కోవలో ముందుగా వచ్చేది.

## 1. ఆంధ్రాభిమానం

ఆంధ్రులుగా జన్మించిన ఎవరికైనా ఆంధ్రాభిమానం ఉండడం అనేది సహజం కదా!"ఆంధ్రత్వమాంధ్ర భాషాచ నాన్యత్య తపసః ఫలమ్" అన్న అప్పయ దీక్షితుని సూక్తి ఉండనే ఉంది. అయితే వై.సి.వి.రెడ్డి గారికి మిగతా వారి కన్న కాస్త ఎక్కువనే చెప్పాలి. అది వారు రచించిన గేయాలను చూస్తే మనకర్థమేతుంది. "ఆంధ్రాభ్యుదయం, రాష్ట్రగానం" అన్న రెండు గేయాలను పరిశీలిస్తే రెడ్డి గారికి గల ఆంధ్రాభిమానం మనకర్థమౌతుంది.

ఆంధ్రాభ్యుదయంలో శాతవాహనుల శౌర్య పరాక్రమాల గురించి మొదలు బెట్టి నన్నయ భారతాంధ్రీకరణతోపాటు రాజుల శౌర్య పాటవాలు, తెలియ జెప్పి శ్రీకృష్ణదేవరాయల వైభవం వివరించి, ఆంధ్రనాయక రాజుల తెలుగు సేవను తెలిపి, స్వాతంత్ర పోరాటం, సామ్యవాదం గురించి కార్మిక ఉద్యమాల గురించి వివరించారు. రాయల సాహితీ సేవ గురించి

**"ఆంధ్ర భోజునికి భావావేశ మెక్కుదై**
**ఆముక్త మాల్యదము నందుకొని సాహితీ**
**సమరాంగణాన తా చక్రవర్తిగ అల్ల**
**సాని వారికి చేయి సాచి మదగజము పై**
**ఎక్కించు కొని కీర్తి నెక్కించి దశ దిశల**
**పద బంధములు గుంఫనములై – సాహితీ**
**పదములయ్యెను బంధనములై"**

ఈ గేయ భాగం చూస్తే చాలు వై.సి.వి రెడ్డి గారి కవితా శక్తి ఎంతటిదో తెలుసుకోవడానికి, మరో గేయం "రాష్ట్రగానం' లో రెడ్డి గారు కాకతీయుల, విజయనగర, గోల్కొండ రాజ్యాల గొప్పదనం చెబుతూ ఆంధ్రుల ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్ష ఎంత బలమైనదో, చెబుతూనే ఆంధ్ర రాష్ట్రం సాధించినందుకు పొంగి పోతారు.

**"భాషల జాతుల భావ సామ్యమున**
**పవిత్ర సంస్కృతి పల్లవింపగా**
**అఖిల భారతము ఆనందింపగా**
**ఆంధ్ర దేశమును సాధించాం"**

అని అంటూ సామ్యవాదాన్ని స్థాపించి, సమ సమాజాన్ని నిర్మిస్తామని ఆశా భావాన్ని వ్యక్తం చేశారు.

## 2. కడప ప్రశస్తి

వై.సి.వి రెడ్డి గారు తమ స్వంత జిల్లా అయిన కడప గురించి కూడా చాలా గొప్పగా చెప్పారు. “కడప గడపలలోన కవుల గడపలు మెండు” అనే పాదం ఈ గేయంలోదే. ఈ ప్రాంతంలోని చివురు కొమ్మయినా చేవ కలిగి ఉంటుందని చెబుతూనే పద్య కవుల్ని స్తుతిస్తూ పంచ నదుల పుణ్య క్షేత్రమే కడప అయినా కరువుకు కరువు లేదంటారు.

అలాగే కృష్ణానదీ జలాలకై అప్పట్లో జరిగిన పోరాటం గురించి కూడా తెలియజేస్తారు. అన్నమయ్య గురించి, వేమన గురించి, బ్రౌన్ గురించి కూడా చక్కగా వర్ణించారు.

**“ఏమన్న వేమన్న కెదురు లేదన్నట్లు**
**పాత మూఢాచార పద్ధతుల చెడదిట్టి**
**గుద్ది చెప్పెను బుద్ధి కోటి గొంతుకలతో**
**ఆట వెలదుల తోడ ఆడుకొని పాడుకొని**
**పదిమందిలో తాను పదిలమ్ముగా నిలిచె**
**వేమనకు దీటెవరురా! ఈ నేల**
**వెర్రి తీవల కోసెరా!!**

అని వేమన గురించి ఆయన సంఘసంస్కరణ గురించి మన కళ్ళకు కట్టే ప్రయత్నం చేశారు. వై.సి.వి రెడ్డి

## 3. ఉత్సవ సంరంభం

వై.సి.వి రెడ్డిగారు “స్వాతంత్ర్య రజతోత్సవం’ అనే పేరుతో పాతిక సంవత్సరాల స్వాతంత్ర్య దినోత్సవ సంరంభాల గురించి తెలుపుతూ స్వాతంత్ర్యం కోసం పాటుపడిన నాయకులకు స్మరించుకొంటూ

**“ప్రథమ స్వాతంత్ర్య పోరాట శక్తికి నాదు**
**యమదంష్ట్రి కాగ్ర చండిమయైన ఝాన్సి**

ఇలా వడి వడిగా సాగుతుందీ గేయం. అలాగే మరో గేయం ‘ఇన్నాళ్ళ వలె కాదురా” ఈ గేయం ఉగాది సందర్భంగా 31.3.1976 న రచించారు. నలనామ సంవత్సర ఉగాదికి స్వాగతం చెబుతూ ఇలా ఉంటున్నారు.

**“వగరు గొంతుకలతో, పొగరుట్టి పదనిపుడె**
**కోకిలలు, భృంగములు, కోన కోనల నుండి**
**ఆనంద గీతములు అందముగా పాడినవి**
**ప్రజల యెదదల నుండి ప్రవహించె, నూతనో**

**త్రేజమ్ము, దేశమే దేవళమ్ముగ మారె**

**నలనామ సంవత్సరా స్వాగతము**

**పలికితిమి రావచ్చు రా!** ఇలా ఎంతో హృద్యంగా సాగుతుందీ గేయం.

## సంక్రాంతి

ఉగాది పర్వదినాన్ని గురించి కవిత వ్రాసినట్లు సంక్రాంతి గురించి కూడా వై.సి.వి. గారు కవిత వ్రాశారు. సంక్రాంతి క్రాంతి కారకమని పలువిధాలుగా భాసించే విక్రాంతి యని భావోన్మత్తతో వ్రాసిన గేయంగా కనపడుతుంది.

**"సురనదీ మందిత బాసుర భంగ పటము పై**

**మకరాంకుదాకేలి శుకి ముక్కు కాంతి పై**

**పరమేశు భుజగేంద్రు పణిమణీ రోచి పై**

**రతి మహదేవి ఎఱ్ఱని కంటి జీఱపై**

**ఒక మహా సంక్రాంతి ఒక మహా విక్రాంతి**

**భాసించి వాసించి భరతఖండముపైన**

## 4. ప్రకృతి సందేశం

ఈ గేయం "సందేశం" పేరుతో ఉన్నప్పటికి గత ఏడాది (2024–25) విద్యా సంవత్సరం 10వ తరగతి పాఠ్యాంశంగా ప్రవేశపెట్టబడింది. ఇది మంచి పరిణామం. మన కడప జిల్లా ప్రముఖ కవి గురించి రాష్ట్రమంతా ప్రచారం లభించినట్లైంది. మరుగున పడుతున్న మన వై.సి.వి. రెడ్డి లాంటి కవుల గురించి నేటితరం విద్యార్థులకు తెలియజేయవలసిన అవసరం ఎంతైనా వుంది.

ఈ గేయంలో ప్రతి పద్యం ఓ రసగుళిక అని చెప్పాలి. ప్రకృతి మానవునికి ఎన్నో విషయాలను తెలియజేస్తూ ఉంటుంది. తొలినుండీ కూడా మానవుడు ప్రకృతినుంచి ఎంతో నేర్చుకున్నాడు. నేర్చుకుంటున్నాడు కూడా! ప్రకృతిలోని చెట్టూ, పుట్ట, కొండ, కోన ఇలా ప్రతిదీ మనిషికి ఎన్నో సందేశాలనిస్తుంది. అవన్నీ వివరంగా తెలిపే ప్రయత్నం చేస్తున్నాడు వై.సి.వి రెడ్డి అనిపిస్తుంది.

**"గిరిదరీ ముకుర కందర సరోవరములను**

**అరవిచ్చు విరుల సంబరమైన తుమ్మెదలు**

**వాసంత వేళ విభ్రమ కంచుకితమైన**

**సహకార మంజరీ సహకారములు పికము**

**లందించె సందేశముల్ – సంస్కృతీ**

**సదన మంజుల గానముల్**

ఇలా ఆద్యంతమూ అత్యంత హృద్యంగా, అమోఘంగా, అద్భుతంగా సాగుతుందీ గేయం. ఇందులో అంతర్లీనంగా మానవులందరూ ఐకమత్యంగా, ప్రేమానురాగాలతో, స్వేచ్ఛ, సమత, మమతలతో కలిసి చక్కటిదారులను సూచిస్తూ కుహనా కుల, మత వాదుల ఆటలు ఇక చెల్లవని అటువంటి వారిని నమ్మవద్దని చెబుతూనే సమస్త మానవాళి ఈ ప్రపంచంలో సమానత్వం సాధించాలని, శాంతి సౌఖ్యాలను నెలకొల్పాలని కోరుకుంటున్నారు.

**అంజలి**

ఈ గేయంలో గిరిమల్లికి అంజలి ఘటిస్తున్నాడు కవి. ఈ గేయం చలం వ్రాసిన "ఒక పువ్వు పూసింది' ని గుర్తుకు తెస్తుంది. చలంది కవిత్వధోరణిలో సాగిన వచనం. వై.సి.వి. రెడ్డిది భావుకతతో కూడిన ఛందో బద్ధ కవిత్వం.

గిరిమల్లి పుట్టినప్పుడు ప్రకృతి పరవశత్వాన్ని గిట్టినప్పుడు ప్రకృతి బాధను తెలుపుతూనే ముగింపుగా గిరిమల్లికను శివుని శిరస్సు పై నుంచి అంజలిఘటిస్తాడు.

**"మము మరువకో గిరిమల్లికా కైలాస**
**శిఖరాన కొలువున్న శివుని జటాగ్రమున**
**వాసించితివి భవుని భవ్య కైంకర్యముగ**
**అది మాకు తృప్తి మా అంజలి ఘటించిమి"**

## 5. వెన్నముక విరిగింది

ఈ శీర్షికకు అర్థం ఏమిటంటే రైతుదేశానికి వెన్నముక అని అంటారు. అటువంటి రైతు నాటి నుండి నేటి వరకు కూడా ఎలా దగాకు, మోసానికి గురవుతున్నాడో ఈ చిన్న గేయంలో మన కళ్ళకు కట్టే ప్రయత్నం చేస్తున్నారు. వై.సి.వి రెడ్డిగారు రైతు యొక్క జీవన బండి కూడా నిజంగా ఊబిలోన దిగబడింది. అదే విషయాన్ని ఎంతో గొప్పగా చెప్తున్నారు గమనించండి.

**"వారు వీరు వీరు వారు వాటాలకు పోటీపడి**
**అంతా కా జేసినారు అంతా దిగమ్రింగినారు**
**వారెక్కిన బండి త్రోలు వారేర? నిన్న మొన్న**
**ఊరిబయట వంకలోని ఊబిలోన తోపుబండి**
**దిగబడింది! దిగబడింది!!**
**ఇలా సాగిపోతుందే గేయము**

**విరులతో**

గిరి మల్లికకు 'అంజలి' ఘటించి తృప్తి పడిన వై.సి.వి విరులతో సంభాషిస్తూ మా యదలను విచ్చుతారా లేక యదలో గుచ్చుతారా అని అడుగుచున్నాడు.

**వేడి వెట్టుల సోకి**
**మాలోని కామనలు మలకలై కలకలై**
**మోహ సాగరముల మునిగినవి పెనగినవి**
**అరవిచ్చు విరులార దొరలు వాసనల - మా**
**యెద విచ్చుకొన జెతురా - లేక మ**
**మ్మెద గ్రుచ్చి నొప్పింతురా**

## 6. దీనాంగన

వై.సి.వి రెడ్డి గారు రచించిన గేయం 'ఆడుబ్రతుకు'. ఈ గేయంలో ఒక స్త్రీ తన భర్త తాగుడుకు బానిసై, తనను ప్రతి నిత్యం తిడుతూ, కొడుతూ, చిత్రహింసలు పెడుతుంటే ఆ బాధలు భరించి భరించి చివరకు జీవితం మీద విరక్తి చెంది ఆత్మహత్యకు బయలుదేరుతుంది. దారిలో ఒక అనామకుడు (బహుశా కవియే అయి వుంటాడు) ఎదురై ఆమె బాధను విచారించి, ఆమెకు ధైర్యం చెప్పి ఆమె ప్రయత్నాన్ని విరమింపజేసే ప్రయత్నం చేస్తాడు. కాని ఆమె బావిలో దూకి ప్రాణత్యాగం చేస్తుంది. ఈ చిన్ని గేయ కథలో కవి యొక్క వర్ణనా కౌశలం, పదలాలిత్యం చదువరులను కట్టి పడేస్తాయి.

**"చిదికి విరవిరలై పడు బ్రదుకులుండు**
**పల్లె, యాపల్లెలో నొక పాడుబావి**
**బావి పరితప్త హృదయుల దీవి; యందు**
**నెందు దుస్సహరితాప మెదురులేచు"**

ఇది ఒక ఉదాహరణ మాత్రమే!

## 7. అభినందన చందనాలు

ఈ శీర్షిక క్రింద మనకు మూడు గేయాలు కనిపిస్తాయి. "భావోజ్జ్వలా!", "పద్మశ్రీ పుట్టపర్తి భావలోక చక్రవర్తి", కీ.శే. మిత్రుడు కమల్ రాజుకు శ్రద్ధాంజలి" ఇందులో మొదటిది 'భావోజ్జ్వలా!' ఈ గేయంలో కవిగారు భారత ప్రథమ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ గురించి, ఆయన దేశ స్వాతంత్ర్యం కోసం చేసిన కృషి గురించి, పంచశీల గురించి, ఆనకట్టల గురించి ప్రస్తావిస్తాడు.

**"విశ్వ శాంతిని గోరి వినువీధి స్వేచ్ఛగా**
**పల్లటీలను గొట్టు పావురాలను జూచి**
**అరుణ కాంతుల విచ్చి అందాల చిందించు**
**పూలతోటల వంటి బాలబాలకలతో**

**ఆడుకొని పాడుకొని ఆనంద జలధిలో**
**మునిగి తేలిని వాడుగా – యీ నేల**
**మెలగి పోయెను తీవిగా**

అంటూ నెహ్రూను ఎంతగానో ప్రశంసిస్తాడు. కానీ విచిత్రం ఏమిటంటే ఈ రెండు పేజీల కవితలో ఎక్కడా ఆయన పేరు నేరుగా మనకు కనిపించదు.

ఇక రెండవ గేయం "పద్మశ్రీ పుట్టపర్తి భావలోక చక్రవర్తి" ఈ గేయంలో పుట్టపర్తి నారాయణాచార్యులు గారు రచించిన అన్ని కావ్యాల గురించి వాటి గొప్పధనాన్ని గురించి చిన్న చిన్న పద్యాలలో చెప్తూ పొంగిపోతాడు వై.సి.వి. పుట్టపర్తి వారంటే రెడ్డి గారికి ప్రత్యేకమైన అభిమానం ఉన్నట్లు తెలుస్తోంది.

**"భక్తి భాష బంధములో / రక్తి నింపి జ్ఞానదృష్టి**
**రంగరించి సాక్షాత్కా / రమ్ముగొన్న రసికుడు కవి / రాజై సాక్షాత్కరించె**

**శివతాండవ కావ్యాత్మగ / భవబంధములూడ్చు కొన్న**
**పరమశైవ భావముగా / బ్రహ్మాండము నిండినట్టి / భవ్యుడు మన పుట్టపర్తి"**

గేయమంతా ఇదే సరళిలో సాగుతుంది.

ఇక మూడవ గేయం "కీ.శే. మిత్రుడు కమల్ రాజ్‌కు శ్రద్ధాంజలి" వై.సి.వి. రెడ్డి గారి ప్రియమిత్రుడు కమల్‌రాజు గారి మరణం ఆయనను బాగా కుంగదీసింది. మిత్రుని ఎడబాటు సహించలేక దుఃఖిత మనస్కుడై స్నేహితుని గుర్తు చేసుకుంటారు. ఎంతో సౌమ్యంగా తేలికగా సాగుతుందీ గేయం.

**"సౌఖ్యముల జుట్టుకొను సేమనస్యము లేని**
**జాతిలో నీతిలో జన జీవితము స్రుక్కె**
**తన జీవితము రాలె తన రాగములు కూలె**
**ఒక మారుతా హతికి, ఒక దారుణ క్షతికి**
**ఒక మహాగ్నిచ్ఛటకు ఉడికి పోయిన తీవ**

చివురించునా యేమి? చెదిరి పోయెను కలలు... అంటూ ఎంతో ఆర్ధ్రత నిండిన మనసుతో ఈ కవిత రాశారనిపిస్తుంది. ఈ మూడు గేయాలు చదువుతూ ఉంటే స్మృతి గీతాల (ఎలీజీ) లాగా అనిపిస్తోంది.

**"అనఘా! చల్లని కైతవాడ! నొకనాడైనన్ మదీయోపకా**
**ఈ నిరీక్షా మతినుంటివో! సతము నాన్రాతల్‌ప్రశంసించుటే**
**పని మాధ్వీకరసాను యేయమతి ఓ వై.సి.వి రెడ్డి! భవ**
**జ్జని నామేలునకయ్యే నిన్ను మరువన్ జాలన్ దివారాత్రమల్"**

అని స్వయంగా పుట్టపర్తి నారాయణాచార్యులే ప్రశంసించారంటే శ్రీ వై.సి.వి. రెడ్డి గారి ప్రతిభా సామర్థ్యాలేపాటివో మనకు అర్థం చేసుకోవచ్చు.

ఈ విధంగా వై.సి.రెడ్డి గారు తమ అద్భుతమైన కవితా శక్తితో, అజరామరమైన కీర్తిని సముపార్జించే అసాధారణమైన రీతిలో కావ్యాలను సృష్టించి "సుకవి జీవించు ప్రజల నాలుకల యందు" అన్న నానుడిని నిజం చేస్తూ, వారు రచించిన కావ్యాల రూపంలో మనతో పాటు మన మధ్యలోనే జీవిస్తున్నారు. వారికిదే సాహితీ ప్రణామాంజలి.

❖ ❖ ❖





**కూర్చున్నవారు:** సుప్రజ, సాత్విక, చోహార, విహసిత, లేక్షణ, సుస్మిత మినాక్షి, వినీల, ఆరాధ్య, గౌరి, దీప్తి
**నిల్చున్నవారు:** ప్రతీష్, దేవాంష్, లక్ష్మీనారాయణ రెడ్డి, శివప్రసాద్ రెడ్డి, దినకర్ రెడ్డి, పూజిత్ రెడ్డి, శబరీష్, రవిశంకర్, కార్తిక్ రెడ్డి
**మధ్యవరుస:** రమణమ్మ, వీరకుమారి, స్వాతి, విభాకర్ రెడ్డి, ఉమామహేశ్వరి, శివభారతి, కరుణాకర్ రెడ్డి, ఉర్వి

వంద వసంతాల వై.సి.వి
వందన శతములు నీకు సుకవి

తొలకరి చినుకులలో
మేనక, రంభలను స్నానమాడించి
సిందూరరేఖ దిద్దినావు

దక్షిణా నిలునివై
గాసగాని వెతల తెలుపు
రాయబారము నడిపినావు

సెలకన్నెకు
వైజయంతికి
పారిజాత పరిమళాలు అద్దినావు

గ్రామీణుల కథలను
తూరుపార బెట్టి
గట్టిగింజల కుప్ప నూర్చినావు

– యమ్మనూరు ప్రభాకర రెడ్డి